# వరంగల్ జిల్లా ఒగ్గు కథలు – పరిశీలన

(పి.హెచ్.డి.పట్టాకోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం)


పరిశోధన

ధరంసోత్ సరిత

( Reg.No: 15HTPH15)

పర్యవేక్షణ

డా. డి.విజయ కుమారి

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాద్ విశ్వవిద్యాలయం

గచ్చిబౌలి, హైదరాబాద్–500046

తెలంగాణ


జూన్ – 2023.

# Warangal Zilla Oggu Kathalu - Pariseelana

(A Thesis submitted to the University of Hyderabad in partial fulfillment of the Degree of Doctor of Philosophy in Telugu)


**Researcher**

**DHARAMSOTH SARITHA**

**15HTPH15**

**Supervisor**

**Dr. D.VIJAYA KUMARI**

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad - 500046.
Telangana, India.



June - 2023

# DECLARATION

1.Dharamsoth Saritha, hereby declare that this Thesis entitled "**WARANGAL ZILLA OGGU KATHALU PARISEELANA"** submitted by me under the guidance and supervision of Dr.D.Vijaya Kumari is a bonafied research work.I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Instituio for the award of any degree or diploma. I hereby agree that my thesis can be deposited in Shodganga/ INFLIBENT

Date: **Dharamsoth Saritha**

Place : Hyderabad Regd.No. 15HTPH15

# CERTIFICATE

This is to certify the Thesis entitled **"Warangal Zillä Oggu kathalu - Pariseelana"** submitted by Mrs. **Dharamsoth Saritha**, bearing **Regd. No. 15HTPH15** in partial fulfilment of the requirements for the award of Doctor of Philosophy in the School of Humanities, Department of Telugu is a Bonafide work carried out by her under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

**A. Published in the following publications:**

1. **"Oggu" jaanapada kalaarupam-vishistatha"** (ISSN NO: 2457-0796), Page.No:39, March 2023. **"MUSI** Telugu Monthly magazine". edited by S.Kamalakara Sharma. printed and Published by B.Anantha Laxmi. Hyderabad.

2. **"Telangana: Jaanapada kalaanilayam"** (ISSN NO: 2454-4329), Page.No:55, May,2023. **MISIMI** Monthly Magazine. Edited by Vallabhaneni.Ashwinee Kumar. Printed & Published by Bapanna Alapati at Kala Jyothi Process Pvt.Ltd,Hyderabad.

**B. Presented in the following conferences:**

1. **"Keelu Gurram Oggu katha- pariseelana"** (National Seminar on Jaanapada vignaanam-Prapancheekarana Prabhavam), by The Department of Telugu Aadikavi Nannaya University, Rajamahendravaram, Andhra Pradesh. On 2 & 3 March of 2020.

2. **"Warangal Jilla Jaanapada kalalu- Pariseelana"** (National Seminar on Janapada Sahitya Sdhyayanam-Nadu Nedu), by Department of Telugu, University of Hyderabad on 24th & 25th February 2022.

Further, the Student has passed the following courses towards fulfilment of coursework requirement for Ph.D was exempted from doing coursework (Recommended by Doctoral Committee) on the basis of the following courses passed during his M. Phil, program and the M.Phil, degree was awarded.

| Course Code | Name | Credits | Pass/Fail |
|---|---|---|---|
| 1.TL700 | Research Methodology | 4.00 | PASS(B+) |
| 2.TL701 | History of Telugu Research | 4.00 | PASS(A) |
| 3.TL702 | Studies in Specialized Area | 4.00 | PASS(A) |
| 4.TL703 | Broad field | 4.00 | PASS(A) |
| 5.TL780 | Dissertation | 16.00 | PASS(A) |

Dr.D.VIJAYA KUMARI　　Prof.DARLA VENKATESWARA RAO　　Prof.V.KRISHNA

Research supervisor　　Head Dept. of Telugu　　Dean,Humanities

# కృతజ్ఞతలు

పేదరికంలో పుట్టిన నేను ఎప్పుడు సమస్యలే ఆ సమస్యల నుండి దాటుతూ ఎంతో కష్టపడి నా అభివృద్ధిని కాంక్షించి ఉన్నత చదువులు చదివిస్తూ నన్ను కంటికిరెప్పలా చూసుకుంటూ నిరంతరం నా వెంటా ఉంటూ అభివృద్ధివైపు ప్రోత్సహించిన నా తల్లిదండ్రులు ధరంసోత్ లోలి – నాగ్య గార్లకు, అలాగే చదువుకోక పోయినా నన్ను ముందుకు నడిపించి ఎక్కడికి వెళ్ళినా సరే నా వెంటే ఉంటూ నన్ను ప్రోత్సహించిన మా తమ్ముడు శ్రీశైలం– శిరీషలకు నేను ఎంతో రుణపడి ఉంటాను.

అలాగే నేను ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో నువ్వు చదువుకోవాలి అని చెప్పి నన్ను ముందుకు నడిపించి నేను ఈ రోజు ఈ స్థాయికి రావడానికి కారణమైన మా అన్నయ్య ధరంసోత్ రమేష్ – జ్యోతిలకు నేను జీవితాంతం రుణపడి ఉంటాను.

ఇంటిగ్రేటెడ్ నుంచి నేటి పరిశోధన వరకు చదువుకునే అవకాశం కల్పించిన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి అదే విధంగా నేను పరిశోధనరంగంలో అడుగు పెట్టడానికి అవకాశం కలిగించినటువంటి పూర్వ తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి, ప్రస్తుత తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారికి ప్రత్యేకంగా ఎంఫిల్ నుండి నేటి వరకు ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు ఇస్తూ పరిశోధనలలో లోపాలను సరిదిద్దుతూ నాకు కొండంత అండగా ఉంటూ ఎప్పుడు ధైర్యం చెబుతూ నా పరిశోధనాంశానికి మార్గదర్శకం వహించి ప్రోత్సహిస్తున్న నా సిద్ధాంత గ్రంథ పర్యవేక్షకులు మాతృమూర్తి డా.డి. విజయకుమారి గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

విశ్రాంత ఆచార్యులు బేతవోలు రామబ్రహ్మం గారికి, నడుపల్లి శ్రీరామరాజు గారికి, ఆచార్య రెమిళ్ళ వెంకటరామకృష్ణశాస్త్రి గారికి, ఆచార్య శరత్ జ్యోత్స్నరాణి గారికి, ఆచార్య గడ్డ అరుణకుమారి గారికి, తెలుగుశాఖకు సేవలందిస్తున్న ఆచార్య పిల్లలమర్రి రాములు గారికి, ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మి గారికి, ఆచార్య పమ్మిపవన్ కుమార్ గారికి, ఆచార్య గోనా నాయక్ గారికి, డా.బాణాల భుజంగరెడ్డి గారికి, డా.భూక్యా తిరుపతి గారికి, అలాగే నా పరిశోదనకు గాను ఆర్థిక సహాయం అందించినా RGNF ఫెలోషిప్ వారికీ ప్రత్యేకంగా,

ఎన్ని పనుల్లో ఉన్నా అన్నయ్య అనగానే సదా నా వెన్నంటి ఉండి నన్ను ముందుకు

నడిపించి అడిగిన ప్రతిసారి విసుగు అనేది చూపించకుండా చిరునవ్వుతో అన్ని విధాల సహాయసహకారాలు అందించిన నా ప్రియ సహోదరులు డాక్టర్ భగ్గు నాయక్, డాక్టర్ సంతోష్ కుమార్ అన్నలకు అలాగే భూక్య కాశీరాంకు ప్రత్యేకంగా,

ఒకానొక సమయంలో తట్టుకోలేనంత బాధ వచ్చింది జీవితం ఎటుపోతుందో తెలియని పరిస్థితి జీవితాన్ని ముగించేయాలనే ఆలోచనతో ప్రతిరోజు ఏడుస్తూనే గడుపుతున్నప్పుడు నాకు కొండంత అండగా ఉండి జీవితం అంటే ఏడుస్తూ కూర్చోవడం కాదు చదువు మీద శ్రద్ధపెట్టి ముందుకు నడవాలి నీ బాధలకు ఏదో ఒకరోజు కాలమే సమాధానం ఇస్తుంది కొంచెం ఓపికగా ఉండు అని చెప్పి నాకు తోడుగా నిలబడి నాకు జీవితం మీద ఆశలు చూపించి నేను ఈ రోజు ముందుకు సాగడానికి కారణమైన అక్కా బావలైన లావుడి సూరా –జ్యోతిలకు నా మనస్ఫూర్తిగా పాదాభివందనాలు....

ఎంత కష్టం వచ్చినా బాధ వచ్చినా మేము ఉన్నాం అంటూ నిత్యం నా వెంటే ఉండి ఏం జరిగినా సరే అంతా మన మంచికే అని చెప్పే నా ప్రియమైన మిత్రులు విజేత, కవితలకు మరియు మా బ్యాచ్ పరిశోధకులకూ ప్రత్యేకంగా,

పరిశోధనకు సహకరించిన హైదరాబాద్ విశ్వవిద్యాలయం లైబ్రరీ సిబ్బందికి అలాగే తెలుగు విశ్వవిద్యాలయం లైబ్రరీ సిబ్బందికి అదే విధంగా తెలుగుశాఖ బోధనేతరా సిబ్బంది బాలాజీ గారికి, మధుగారికి, శంకర్ గారికి అలాగే నా పరిశోధనాంశానికి డిటిపికి సహాయం చేసిన ఆనంద్ గారికి, చంద్రశేఖర్ గారికి,

నా పరిశోధనకు మూలక్షేత్ర పర్యటన విశేష సేకరణకు మొట్టమొదటి సారి వెళ్ళినప్పుడు చుక్క సత్తయ్య తాత లేవలేని పరిస్థితిలో ఉండి కూడా గంటల తరబడి కూర్చొని ఓపికగా నాకు ఒగ్గు కథల గురించి వివరించిన సత్తయ్య తాతకు అలాగే తాత కాలం చేసిన తర్వాత కూడా వాళ్ల కుమారుడు చుక్క అంజయ్య గారు నాకు ఒగ్గు కథలు చెప్పడం జరిగింది వాళ్ళ ఇంటికి వెళ్లిన ప్రతిసారి ఎంతో గౌరవంగా అభిమానించి భోజనానికి కూడా ఎటువంటి లోటు లేకుండా మేము వస్తున్నాం అని చెప్పగానే చుక్క అంజయ్య గారి సతీమణి మా కోసం వంటచేసి వడ్డించడం జీవితంలో మరిచిపోలేను మరియు వాళ్ళ కుటుంబసభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు.

అలాగే ఒగ్గు కథకులు ఎంతో ఓపికగా రోజంతా కూర్చొని ఒగ్గు కథలను చెప్పిన వారందరికీ ప్రత్యక్షంగా పరోక్షంగా సహాయపడిన వారందరికీ అలాగే కళాకారులకు

ఎంతగానో ప్రోత్సహిస్తున్న మామిడి హరికృష్ణ గారికి అలాగే చివరిది కాని చివరగా పరిగణించలేనిది ఒగ్గు కథల సేకరణలో అనునిత్యం నా వెంట ఉండి ఉదయం వెళితే రాత్రి తిరిగి వచ్చే దాకా నాకు మానసిక శారీరక ధైర్యాన్నిచ్చి నా పరిశోధనలో నిరంతరం నన్ను ప్రోత్సహించుకుంటూ క్షేత్రపర్యటనకు వెళ్లి సేకరించిన రికార్డుని ఒకటికి రెండు సార్లు విని నాతో పాటు కూర్చొని రాయడంలోనూ ఎంతగానో సహాయం చేసిన నా జీవిత భాగస్వామి అయినా లావుడి వీరేందర్ గారికి అలాగే నా కుటుంబసభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు....

**ధరంసోత్ సరిత**

# విషయ సూచిక

కృతజ్ఞతలు

ముందుమాట 1-17

**1వ అధ్యాయం: వరంగల్ జిల్లా పరిచయం**

1.1. పరిచయం 18-60

1.2. చారిత్రికత

1.3. భౌగోళిక స్థితి

1.4. జనాభా

1.5. నదులు-నేల కూర్పు

1.6. వర్షపాతం

1.7. పశుసంపద

1.8. ఆర్థికం

1.9. విద్యుత్

1.10. పర్యాటకం

1.11. వెయ్యి స్తంభాల ఆలయం

1.12. భద్రకాళి ఆలయం

1.13. వరంగల్ కోట

1.14. రామప్ప ఆలయం

1.15. పాకాల సరస్సు

1.16. మేడారం

1.17. వ్యాపారం - పరిశ్రమలు

1.17.1. IT / ITES హార్డ్‌వేర్

1.17.2. వస్త్రపరిశ్రమ

1.17.3. ఆహార ప్రాసెసింగ్

1.18. రవాణా

1.18.1. రోడ్

1.18.2. రైల్వే

1.18.3. విమానాశ్రయం
1.19. ఉత్సవాలు - కళలు
1.19.1. విద్య
1.20. వరంగల్ జిల్లా జానపద కథలు - కళాకారులు
1.21. పునర్వ్యవస్థీకరణ తరువాత వరంగల్ జిల్లా
1.22. వరంగల్ జిల్లా గ్రామదేవతలు - పూజా విధానము
**2వ అధ్యాయం: వరంగల్ జిల్లా ఒగ్గు కథలు స్వరూప స్వభావాలు**
2.1. పరిచయం 61-232
2.2. ఒగ్గు పదము అర్థము - కులోత్పత్తి వాదాలు
2.3. ఒగ్గు కథ స్వరూప స్వభావాలు
2.4. జానపద కళా రూపాలు - ఒగ్గు వృత్తి కళాకారులు
2.5. వరంగల్ జిల్లా ఒగ్గు కథలు విశ్లేషణ
2.5.1. గొల్ల కేతమ్మ కథ
2.5.2. కీలు గుర్రం కథ
2.5.3. నల్ల పోచమ్మ కథ
2.5.4. బీరప్ప ఒగ్గుకథ
2.5.5. మహిషాసురుని కథ
2.5.6. మాంధాత కథ
2.6. ఒగ్గు కథల్లో స్త్రీ పాత్ర చిత్రణ
2.7. మల్లన్న కథ - బీరన్న కథ - సామ్య భేదాలు
2.8. ఒగ్గుకథ ప్రారంభం, ప్రార్థన సంప్రదాయం
2.8.1. గంగ ప్రార్థన
2.8.2. గణపతిప్రార్థన
2.8.3. సకలదేవత ప్రార్థన
2.8.4. రామశబ్దం
2.9. ఒగ్గు కథల్లో వర్ణనా చాతుర్యం

2.9.1.ఎల్లమ్మ బీరప్పకు చెప్పిన స్త్రీ లక్షణాల వర్ణన
2.9.2. వృత్తి జీవన వర్ణన
2.9.3. కరణాల వర్ణన
2.9.4. కోమటి వర్ణన
2.9.5. కుమ్మరి వర్ణన
2.9.6. యుద్ధ సన్నద్ధ వర్ణన
2.9.7. అడవి వర్ణన
2.9.8. గోవు వర్ణన
2.9.9. కుష్ట వ్యాధి గ్రస్తుని వర్ణన
2.9.10. వివాహ వర్ణన
2.9.11. జూదం వర్ణన
2.9.12. నాగన్న వర్ణన
2.9.13. రామచిలక వర్ణన
2.9.14. ఎరుకలసాని వేషం, జంగమ వేషం వర్ణన
2.9.15. సత్యాన్న బోనం వర్ణన
2.9.16. వేట వర్ణన
2.9.17. స్త్రీల సౌందర్య వర్ణన
**3వ అధ్యాయం: ఒగ్గు కథ – ప్రదర్శనా రీతులు**
3.1. పరిచయం 233–299
3.2. ఒగ్గు కథల లక్షణాలు – ప్రార్థనా గీతాలు
3.3. ఒగ్గు కథా బృందం నృత్యం
3.4. వాయిద్యాలు – పరికరాలు – వేషధారణలు
3.5. ప్రదర్శనా స్థలం – ప్రదర్శనా రీతులు
3.6. మల్లన్న, బీరన్న కథల్లో అద్భుతాంశాలు
3.7. ఒగ్గు కథలు – నవరసాలు
3.8. సమకాలీన కళారూపాల ప్రభావం

3.8.1 యక్షగాన ధోరణి

3.8.2. తందనానరామాయణం ప్రభావం

3.8.3. మేలుకొలుపులు – స్తుతిగానాలు

3.8.4. మల్లన్న మేలుకొలుపులు – పవళింపులు

3.8.5. ఎల్లమ్మ కొలుపులు

3.8.6. మంగళ హారతులు

4వ అధ్యాయం: ఒగ్గు కథ – సాహిత్య భాషాంశాలు

4.1. పరిచయం 300–405

4.2. సంధి – సమాస రూపాలు

4.3. క్రియరూపాలు – ధ్వని పరిణామాలు

4.4. మాండలిక పదాలు

4.5. ఒగ్గు కథల్లో భాషా సౌందర్యం

4.5.1. పలుకుబడులు – సామెతలు

4.5.2. పొడుపు కథ

4.6. అలంకార వైవిధ్యం

4.6.1. శబ్ధాలంకారాలు

4.6.2. ఒగ్గు కథ అర్థాలంకారాలు

4.7. అన్యదేశ్యాలు

4.7.1. ఉర్దూ పదాలు

4.7.2. ఆంగ్ల పదాలు

4.8. వారాను వర్తనాలు

4.9. యతి ప్రాసల లయాత్మకత

4.9.1. పదవిరుపులో యతిమైత్రి

4.9.2. ప్రాసయతి

4.9.3. అంత్యానుప్రాస

4.9.4. పదాత్మక ప్రాస

4.9.5. సుదీర్ఘ వచనాలు

## 5వ అధ్యాయం: ఒగ్గు కథ - సామాజిక సాంస్కృతిక అంశాలు నేడు తగ్గుతున్న ఆదరణ - పరిరక్షణ మార్గాలు


| | |
|---|---|
| 5.1. పరిచయం | 406-438 |
| 5.2. సామాజింకాంశాలు | |
| 5.2.1. అవినీతి నిర్మూలన | |
| 5.2.2. ఓటర్లకు జాగరణ | |
| 5.2.3. ప్రకృతిమాత | |
| 5.2.4. స్వతంత్ర ఉద్యమం | |
| 5.2.5. పరిసరాలు, పరిశుభ్రత | |
| 5.2.6. కుటుంబ నియంత్రణ | |
| 5.3. ప్రజా ఉద్యమాలు- ఒగ్గు కథాంశం | |
| 5.4. తగ్గుతున్న ఆదరణ- కారణాలు | |
| 5.4.1. ప్రపంచీకరణ వల్ల నష్టాలు | |
| 5.5. పరిరక్షణ మార్గాలు- తీసుకోవాల్సిన చర్యలు | |
| ఉపసంహారం | 439-442 |
| ఉపయుక్త గ్రంథసూచి | 443-445 |
| అనుబంధం-1 | 446-449 |
| (చుక్కా సత్తయ్యగారితో ముఖా ముఖీ) | |
| అనుబంధం-2 | 450-454 |
| చిత్ర మాలిక(ఒగ్గు కథలకు సంబంధించిన చిత్రాలు) | |
| సాహితీ వ్యాసాలు | 455-463 |
| జాతీయ సదస్సులో సమర్పించిన పత్రాలు | 464-465 |

# వరంగల్ జిల్లా చిత్ర పటం



# ముందుమాట

## ప్రస్తావన (Preface)

1. పరిచయం (Introduction)
2. పరిశోధన పరిధి /పద్ధతి(Scope of the Research / Methodology)
3. పూర్వ పరిశోధనల పరామర్శ (Review of Literatura)
4. పరిశోధన లక్ష్యం (Abjectives of the study)
5. క్షేత్ర పర్యటన (Field visit)
6. పరిశోధన ప్రణాళిక /సిద్ధాంత గ్రంథ స్వరూపం(Research Planning)

# పరిశోధన ప్రణాళిక పరిచయము

# ప్రస్తావన (Preface)

## 1. పరిచయం (Introduction)

ఒక్కొక్క ప్రాంతం యొక్క భౌగోళిక పరిస్థితుల ప్రభావం దాని చుట్టు పక్కల నివసించే మానవాళిపై పడటం సహజం. సృష్టిలోని మానవ జీవనం భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా రూపుదిద్దుకుంది. ఒక ప్రాంతంలో నివసించే జన జీవితాన్ని ఆ ప్రాంత చరిత్రను, సంస్కృతిని, ఆచార వ్యవహారాలను వెలికితీయడానికంటే ముందే ఆ మండలం భౌగోళికాంశాల స్వరూప స్వభావాలను కూడా పరిశీలించాలి. వరంగల్ జిల్లాను ఎన్నో రాజవంశాల సంస్థానాధీశులు పరిపాలించి, దాని చుట్టు పక్కల ప్రాంతాలలో మహమ్మదీయ మరియు ఆంగ్లేయుల పరిపాలనా ప్రభావాలు చాలా ఉన్నప్పటికి తనకు ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. మధ్యలో పాశ్చాత్య నాగరికతా ప్రభావం ఈ జిల్లా పై ఉన్నప్పటికి ఎన్నో మార్పులు చేర్పులు కలిగినా తమ ప్రతిపత్తికి మూలభూతాలైన ప్రాచీన ఔన్నత్యం, పురాతన వైభవం, సనాతన ధర్మం, ఆహారపద్ధతులు, ఆచార వ్యవహారాలు, ఆలోచనా సరళి, నాటికి నేటికి కూడా వరంగల్ జిల్లా మండల గ్రామీణ ప్రజల నిత్య జీవితంలో సజీవంగా మనముందు తొణికిసలాడుతున్నాయి.

వరంగల్ జిల్లాలో ఎంతోమంది కళాకారులు సమాజంలో ఆయా జానపద కళారూపాల ద్వారా సామాజిక చైతన్యాన్ని భక్తితత్వాన్ని, వినోదాన్ని, విజ్ఞానాన్ని అందించారు. కాని వారి బతుకుల్లో చీకటి రాజ్యమేలుతుంది.వరంగల్ జిల్లాలో మండలలో కొన్ని కళారూపాలతో పాటు ఒగ్గు కథ కూడా కాలగర్భంలో కలిసిపోయింది.మరికొంతమంది మిణుకు మిణుకు మంటూ చమురులేని దీపంలా ఆకలి బాధతో అలమటిస్తున్నారు. వారు నేర్చుకున్న ఒగ్గుకళ ఈరోజు ఎక్కువగా కనిపించడం లేదు. వారు పడ్డ శ్రమను గుర్తుంచేవారు లేరు. అందుకే వారి సాంఘిక జీవన విధానంపై జీవనశైలిపై విస్తృతమైన సేకరణ పరిశోధనలు జరగాలి. జానపద కళాకారుల కుటుంబాల నేపథ్యాన్ని వారి వారసత్వ నేపథ్యాన్ని సేకరించగలగాలి. సాంఘిక స్థితిగతులను, సామాజిక హెూదాను, కుల సంప్రదాయాన్ని, మత సంప్రదాయాన్ని సాంస్కృతిక వారసత్వాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. మానవీయ కోణంలో అందరూ ఒక అడుగుముందుకు వేయాలి. వరంగల్ జిల్లా జానపద కళారూపాల్లో 'వరంగల్ జిల్లా ఒగ్గు కథలు– పరిశీలన' అనే అంశాన్ని నా పరిశోధన శీర్షికగా తీసుకొని దానిని సమగ్రంగా పరిశీలించాను.

## 2. పరిశోధన పరిధి /పద్ధతి(Scope of the Research / Methodology)

మానవ సమాజంలోనైనా మొదట గేయసాహిత్యం, ఆ తర్వాత కథాసాహిత్యం అభివృద్ధి చెందింది. వారికి తెలిసిన విషయాలు, పరిసర ప్రాంతాల్లో చూసినవి ఈ కథలకు ఇతివృత్తాలుగా ఉంటున్నాయి. బాహ్య ప్రపంచంతో సంబంధ బాంధవ్యాలు లేని వరంగల్ జిల్లా ప్రాంతాల్లో నివసించే జనులకు తెలిసినవే కథా వస్తువులుగా ఉంటాయే తప్ప, నాగరిక ప్రపంచంలోనివి కావు. అందుకే వారి కథల్లో జంతువులు, పక్షులతోపాటు, జీవనాధారమైన వ్యవసాయం కూడా ప్రాముఖ్యత సంతరించుకుంది. గృహజీవనం, వ్యవసాయం, వేట అనేవి జానపదుల జీవనంలో ప్రధాన కథాంశాలుగా కనిపిస్తున్నాయి. వ్యవసాయమే వారి జీవనాధారం. అందుకే వ్యవసాయానికి సంబంధించిన కష్ట-నష్టాలు, వారి అనుభవాలు, వచ్చే సమస్యల్ని ఏ విధంగా ఎదుర్కోవాలో దానికి తగిన ఆలోచనలు చెప్పబడతాయి వారి కథల్లో. వ్యవసాయంలో కూడా పోడు వ్యవసాయమే వారు ఎక్కువగా చేస్తుంటారు.

వరంగల్ జిల్లా జానపదుల జీవనంలో జంతువులతో అనుబంధం, పరిచయం, వాటి సమస్యలు వారికి బాగా తెలుసు. వీటిలో కొన్ని అనుకూలమైనవి, మరికొన్ని ప్రతికూలమైనవి ఉంటాయి. ప్రతికూలమైన జంతువుల వలన వచ్చే సమస్యల్ని ఎదుర్కోటానికి వారికి తెలిసిన ఆలోచనతో ప్రయత్నిస్తుంటారు. అందుకే వారి కథల్లో జంతువులతో అనుబంధమున్న కథలున్నాయి. వైరుధ్యమున్న కథలున్నాయి. అంతేకాక జంతువులకు పక్షులకు మధ్య సాహచర్యాన్ని చెప్పే కథలు, వాటికి వైరుధ్యమున్న కథలు ఉన్నాయి. వారికిష్టదైవాలుగా ఆయా ప్రాంతాలను బట్టిదేవతలుంటారు. ఆ దేవతలకు సంబంధించినవి, కొన్ని నమ్మకాలకు సంబంధించినవి కూడా వారి కథల్లో చోటు చేసుకున్నాయి. మనిషి జీవితంలో వినోదం, హాస్యం చమత్కారం, ధర్మాధర్మాలు పెనవేసుకొని ఉంటాయి. ఏదైతే వారికి మంచిదనిపిస్తుందో అది తప్పక వారి ఒగ్గు కథల్లో వస్తువుగా ఏర్పడుతుంది. ఇన్ని విషయాలలో కూడా దేవత సంబంధమైన కథలే ఎక్కువగా ఉన్నాయి. కారణం వారికి తెలిసిన, పరిచయమున్న ప్రాంతాల్లో వాటితో వారికున్న అనుబంధమేనని చెప్పవచ్చు.

సాహిత్యం మౌఖిక సాహిత్యం, లిఖిత సాహిత్యమని రెండు రకాలుగా ఉంటుంది. కొండకోనల్లో నివసించే జానపదుల ఎక్కువ శాతం అవిద్యా వంతులుగా ఉంటున్నారు. ఆ కారణంగా వారు సృష్టించే లిఖిత సాహిత్యం వెలువడటం లేదు. వారు విద్యావంతులు కాకున్నా కథాసాహిత్యం, గేయ సాహిత్యం మౌఖికంగా చెప్పగలుగుతున్నారు. సహజంగా పాటరాని జానపదుల స్త్రీ, పురుషులుండరంటే అతిశయోక్తికాదు.ఒగ్గు కథలను అధ్యాయనం చేసే ముందు జానపద విజ్ఞానం, జానపద సాహిత్య శాఖలను పరిశీలిద్దాం.

వరంగల జిల్లా ప్రాంతాల్లోని జానపదులు నుండి సేకరించబడ్డ ఒగ్గు కథలకు సంబంధించిన అధ్యయనమిది. వాళ్ళకు తెలిసిన ఒగ్గు కథల్లో కొన్ని, మైదాన ప్రాంతాలనుండి వ్యాపారం నిమిత్తం కొంత మార్పు వెళ్ళేవారి నుండి నేర్చుకొన్నారు. ఆ విధంగా నేర్చుకొన్న వాటిని చేర్పులతో తమకు తోచినరీతులతో కథల్ని తయారు చేసుకున్నారు. మరికొన్ని తామే సొంతంగా తమ పరిసర ప్రాంతాల కనుగుణంగా అక్కడి ప్రజల మనోభావాలు ప్రతిబింబించేట్లుగా తయారు చేసినవి. మౌఖిక సాహిత్యం లేకుండా ఏ మానవజాతి ఉండదు.కాని జానపదుల ప్రాంతాల్లోని వారిచే రచింపబడ్డ లిఖిత సాహిత్యం మాత్రం వెలువడలేదు. వారికి సంబంధించిన పరిసరప్రాంతాలను ప్రతిబించే కథలు, పురాణ సంబంధగాథలు, పశుపక్ష్యాదులకు సంబంధించిన కథలు, దైవ సంబంధ కథలు మొదలైనవి ఉన్నాయి. మరొక ముఖ్య విషయమేమంటే, ఈ కథలకు పేర్లుండవు. అందులోని. విషయాన్నిబట్టి మనమే పేరు నిర్ణయించుకోవాలి. జానపదులు ఒకరినుండి మరొకరు విని తెలుసుకున్నవి కాబట్టి వాళ్ళకు గుర్తున్నంతలో, తెలిసిన విధంగా కథ చెబుతున్నారు. ఈ కథలను కొంత పరిచయం చేస్తేనేగాని వారి కథలు ఏ రీతిలో చెప్పబడ్డవో తెలుస్తుంది. ఈ నా పరిశోధనలో వరంగల్ జిల్లా వివిధ మండలాల్లో ఒగ్గు కథలను తీసుకొని పరిశీలించాను. ఇదే నా పరిశోధనా పరిధి. ఈ పరిశోధన ప్రధానంగా విశ్లేషణాత్మక, వివరణాత్మకంగా వాఙ్మయ సేకరణ విశ్లేషణ పద్ధతిలో కొనసాగించడం జరిగినది.

### 3. పూర్వ పరిశోధనల పరామర్శ (Review of Literatura)

**జానపద కథలు**

1. తెలుగు జానపద గేయ గాథలు, నాయని కృష్ణకుమారి, ఖండవల్లి లక్ష్మీరంజనం, 1970 ఉస్మానియా విశ్వవిద్యాలయం.
2. తెలుగు జానపద గేయ కథలు, కె.సుమతి, బి.రామరాజు, 1979,ఉస్మానియా విశ్వవిద్యాలయం.
3. తెలుగు జానపద సాహిత్యం – పురాగాథలు, రావి ప్రేమలత, నాయని కృష్ణకుమారి, 1980 ఉస్మానియా విశ్వవిద్యాలయం.
4. తెలుగు జానపద కథలు మూలాంశములు, జి.ఎన్.మాలతి, పి.యల్. శ్రీనివాసరెడ్డి, 1994 శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం.
5. కోలారుజిల్లా జానపద కథలు, టి. రాజశేఖరరెడ్డి, సి.పెద్దిరెడ్డి, 2007, బెంగుళూరు విశ్వవిద్యాలయం.

6. తెలుగు వీరగాథా కవిత్వం, టి.వి.సుబ్బారావు, పింగళి లక్ష్మీకాంతం, 1969, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం.

7. (కర్నూలుజిల్లా) వీరగాథా కవిత్వం, టి.గురురాం ప్రసాద్, పి.నరసింహారెడ్డి, 1983, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం.

8. చిత్తూరు జిల్లా ఐతిహాసాలు ఒక అధ్యయనం, ఎం. రామనాథం నాయుడు, టి.వి. సుబ్బారావు, 1999, బెంగుళూరు విశ్వవిద్యాలయం.

9. చిత్తూరుజిల్లా తెలుగు జానపద వీరగాథాగేయాలు, కె.రామచంద్రుడు, ఎం.సుబ్బారెడ్డి, 1981, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం.

10. తెలుగు గేయగాథల్లో స్త్రీ, మూలె విజయలక్ష్మి, పి.నరసింహారెడ్డి, 1981, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం.

11. తెలుగు కన్నడ సాహిత్యాల్లో కుమార రామునికథ, ఎం.వేదవతి, కె.సర్వోత్తమరావు, 1979, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం.

12. తెలుగు వీరగాథలు – కుమారరాముని కథావైశిష్ట్యం, టి. లక్ష్మీనరసయ్య, పి. జగన్నాథం, 1987 కాకతీయ విశ్వవిద్యాలయం.

13. చరిత్రలో బొబ్బిలియుద్ధం వీరగాథ ఇతర సాహిత్యరూపాలు, వై.జగన్నాథనాయుడు, ఎస్.వి.జోగారావు, 1988, ఆంధ్ర విశ్వవిద్యాలయం.

14. కాటమరాజు కథ –సాంస్కృతిక అధ్యయనం, జి.భానుమూర్తి, ఆర్.వి.ఎస్.సుందరం, 1988, మైసూరు విశ్వవిద్యాలయం.

15. కాటమరాజు కథల భాష –వర్ణనాత్మక విశ్లేషణ, కె.రామాంజనేయులు, సి.జయలక్ష్మి, 1996, బెంగుళూరు విశ్వవిద్యాలయం.

16. కాటమరాజు కథలు ప్రధాన స్త్రీ పాత్రలు, డి.విజయకుమారి, ఎన్.ఎస్.రాజు, 1994, హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

17. తెలుగు వీరగాథల ద్వారా భావ ప్రసరణ సమాలోచన, పి.కోటేశ్వరమ్మ, జి.వై.ప్రభావతిదేవి, 2008,నాగార్జున విశ్వవిద్యాలయం.

18. లఘు చారిత్రక గాథలలో స్త్రీల స్థితిగతులు, పి.కోటేశ్వరమ్మ, ఆర్.తిరుమలరావు,1989,తెలుగు విశ్వవిద్యాలయం.

19. తెలంగాణా జానపదకథలు సామాజిక ప్రతిఫలనం, టి.శ్రీనివాసులు, సి.ఆనందరామం,

1998, హైదరాబాద్ విశ్వవిద్యాలయం.
20. మహబూబ్ నగర్ జిల్లా జానపద కథలు, బి.బాలస్వామి, వై.రఘుమన్న, 1986, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
21. నల్లగొండ జిల్లా జానపద గేయగాథలు, ఎం.శత్రుఘ్నరెడ్డి, నాయని కృష్ణకుమారి, 1988, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
22. నల్లగొండ జిల్లా ఎల్లమ్మ కథలు–ఒక పరిశీలన, కె.పద్మాచారి, సి.రమణయ్య, 1994, తెలుగు విశ్వవిద్యాలయం.
23. కరీంనగర్ జిల్లా కథాగేయాలు, ఐ.స్వామిరెడ్డి, బి.రామరాజు, 1993, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
24. పట్టణ జానపద కథల అధ్యయనం (హైదరాబాదు రంగారెడ్డిజిల్లాలు), టి.పద్మారావు, నాయని కృష్ణకుమారి, 1992, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
25. వరంగల్లు జిల్లా జానపదకథలు–సాంఘికజీవనం, వి.శ్రీదేవి, పి.జగన్నాథం, 1991, కాకతీయ విశ్వవిద్యాలయం.
26. కడపజిల్లా జానపద గేయగాథలు, ఎ.సుబ్బరామిరెడ్డి, పి.నరసింహారెడ్డి, 1990, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం.
27. అనంతపురం జానపద కథలు, పెద్దిరెడ్డి, ఆర్.వి.ఎస్.సుందరం, 1988, మైసూరు విశ్వవిద్యాలయం.
28. ధర్మవరం తాలూకా జానపద కథలు. సి.బాలకృష్ణారెడ్డి, పి.ఎల్.శ్రీనివాసరెడ్డి, 1993, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం.
29. చిత్తూరుజిల్లా జానపద కథలు– ఒక పరిశీలన, ఎ.నర్సింహస్వామి, కె.మునిరత్నం, 1996, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం.
30. కోలూరుజిల్లా జానపదకథలు, రాజశేఖరరెడ్డి, సి.పెద్దిరెడ్డి, 2007, బెంగుళూరు విశ్వవిద్యాలయం.
31. చిత్తూరు జిల్లా జానపద గేయగాథలు – సమగ్రపరిశీలన, జి.రవీంద్ర, కె.మునిరత్నం, 2006, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం.
32. నెల్లూరుజిల్లా జానపద గేయగాథలు–ఒక పరిశీలన, ఎం.వెంకటరావు, పి.శ్రీనివాసరెడ్డి, 2004, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం.

33. జానపద సాహిత్యం – కావమ్మ కథ, ఎ.గిరిబాబు, డి.విజయలక్ష్మి, 2010,హైదరాబాద్ విశ్వవిద్యాలయం.
34. పుంగనూరు తాలూకా ఐతిహ్యాలు–ఒక అధ్యయనం, ఎం.రామనాథం నాయుడు, టి.వి.సుబ్బారావు, 1991, బెంగుళూరు విశ్వవిద్యాలయం.
35. గుమ్మడిపూడి తెలుగు జానపదకథలు పరిశీలన, బి.మోహన్, వి.శంకరరావు, 2006, మద్రాసు విశ్వవిద్యాలయం.
36. శ్రీకాకుళం జానపద కథాగేయాలు – ఒకపరిశీలన, పి.శ్రీరాములు, పి.సుబ్బారావు, 1998,ఆంధ్ర విశ్వవిద్యాలయం.
37. బొబ్బిలి మండలం జానపద కథానుశీలన, ఎమ్.బాలరానాయుడు, జి.యోహాన్‌బాబు, 2002, ఆంధ్ర విశ్వవిద్యాలయం.
38. జానపద గేయగాథలు శ్రీశైల మల్లన కథ–ఒక పరిశీలన, బి. భోగలక్ష్మి, కె.మలయవాసని, 2002, ఆంధ్ర విశ్వవిద్యాలయం.
39. తూర్పుగోదావరి జిల్లా జానపదకథలు, కె.వి.ఎస్.ఎల్.నరసమాంబ, ఆర్.తిరుమలరావు, 1989, తెలుగు విశ్వవిద్యాలయం.
40. తూర్పుగోదావరి జిల్లా ముస్లిం స్త్రీల కొన్ని మౌఖిక ఆఖ్యానాలు, కె.వి.ఎస్.ఎల్.నరసమాంబ, కె.వీరభద్రరావు, 1992, తెలుగు విశ్వవిద్యాలయం.
41. కోనసీమ తాంబూర కథలు – ఒక పరిశీలన, టి.సత్యనారాయణ, ఆర్.వి.ఎస్.సుందరం, 1993, తెలుగు విశ్వవిద్యాలయం.
42. జానపద నీతికథలు, జి.వి.బి. నరసింహారావు, ఆర్.తిరుమలరావు, 1992, తెలుగు విశ్వవిద్యాలయం.
43. జానపద గద్య వాఙ్మయం, కె.టి.ఎస్.భారతి, కె.శ్రీరామ్మూర్తి, 1990, తెలుగు విశ్వవిద్యాలయం.
44. మౌఖిక సాహిత్యం– ధోరణులు, జి.వి.బి.నరసింహారావు, ఆర్.తిరుమలరావు, 1989, తెలుగు విశ్వవిద్యాలయం.

### 4. పరిశోధన లక్ష్యం **(Abjectives of the study)**

జానపద సాహిత్యంలో ఒక ప్రధాన అంశం జానపద కథా గేయాలు. జానపదుల అనుభవం, హృదయ స్పందనలకు ప్రతిబింబం, సరళత, సహజత్వాలకు నిలయం, సంగీత, సాహిత్యాలతో

కూడిన సామాన్యుని భావగీతం గేయం. ఆర్వీయస్ సుందరం గారి మాటల్లో రూపంలో భావ ప్రధానంగా వెలవడే ఆశు రచన జానపద గేయం. జానపద గేయాలు అజ్ఞాత కర్తృకాలు, మౌఖికాలు. ఇవి రెండు రకాలుగా కనిపిస్తాయి. ఒకటి కథ లేకుండా ఎక్కువగా ఆత్మపరత్వంతో కూడుకున్న గేయాలు. రెండు – కథ ప్రధానంగా భావగీతాత్మక లక్షణంతో అలరారే కథాగేయాలు. గేయ రూపంలో వుండే కథ కథాగేయమవుతుంది. అనేక తరాలనుండి పలు ప్రాంతాలలో మౌఖికంగా ప్రచారంలో వుండే కథ జానపద కథాగేయమవుతుంది.

తెలుగులో బాగా ప్రాచుర్యంలో వున్న కథాగేయాలలో – సీతా కల్యాణం, సీతమ్మవారి అలక, లక్ష్మణదేవర నవ్వు, ఊర్మిళాదేవి నిద్ర, గంగా గౌరీ సంవాదం, పల్నాటి వీర కథ, బొబ్బిలి యుద్ధం, కావమ్మ కథ, ముగ్గురు మరాఠీల కథ, సర్వాయి పాపడు కథ ముఖ్యమైనవి. ఒక కథాగేయంలో కుంభకర్ణుని నిద్రలేపడానికి రాక్షసులు – ఏనుగులతో తొక్కించడం, గుణపాలతో కాల్చడం, చెవులలో సీసం పోయడం. కుంభకర్ణుని భీకరాకారం, మొద్దు నిద్ర వర్ణించే ఈ సందర్భంలో హాస్యం పోషించబడింది. భారత కథతో కూడిన గేయగాథల్లో శశిరేఖ అభిమన్యుల వివాహకథ అద్భుతాంశాలతో, హాస్య సన్ని వేశాలతో ఆసక్తిదాయకంగా సాగుతుంది. బలరాముడు తన కుమార్తె శశిరేఖకు దుర్యోధనుని కొడుకు లక్ష్మణునితో శశిరేఖకు ఇష్టంలేని పెళ్ళి చేయ సంకల్పించినపుడు ఘటోత్కచుడు తన మాయతో శశిరేఖను తీసుకెళ్ళడం, ద్వారకకు వచ్చి ఘటోత్కచుడు శశిరేఖ రూపంలో పెళ్ళి పీటల మీద కూర్చుని పక్కనే వున్న లక్ష్మణుడికి ఒకసారి భూతంగా, ఇంకొకసారి పాముగా, మరోసారి సింహంగా కనపడి బెదిరించడం, లక్ష్మణుడు భయపడి పీటల మీద నుంచి పారిపోవటం వంటి చర్యలు మనకు నవ్వు పుట్టిస్తాయి.

అయితే నాగరికులుగా అనబడే మనకు ఇవాళ మౌఖిక సాహిత్యం పరిశోధనాత్మక దృష్టితో రికార్డు చేయాల్సి ఉంటుంది. తద్వారా మనం భాషా దాస్యం నుంచి భావ జాల దాస్యం నుంచి సాంస్కృతిక దాస్యం నుంచి తప్పించుకునే వీలు ఉంది. మన వెనుక వెన్నుముకగా నిలబడ్డ మన జాతి మూలాలు మనం నిటారుగా నిలబడేలాగా ఆత్మగౌరవంతో తలఎత్తుకునేలా చేయగలవు. మారుతున్న విలువల నేపద్యంలో మంచివైనా మరి ఎలాంటివైనా అసభ్యమైన అభ్యంతర కరమైన ఆనాటి సమాజ స్వభావాన్ని అంచనా వేయడానికి ఎంత ప్రగతిపథంలోకి మనం ఏమో అన్న దాన్ని బేరీజు వేసుకోవడానికి ఈ పరిశోధన ఉపకరిస్తుంది.

సాంస్కృతిక పరిణామం ఎంతగా జరిగింది. అంటే మౌఖికంగా జానపద ఒగ్గు కథలు చలామణిలో ఉన్న వాఙ్మయం అది పొడుపు కథలులో గాని, సామెతల రూపంలో గాని, ఉన్నప్పటికి

వాటిని గ్రంథస్థం చేయలేకపోవడమే నిదర్శనం. భాష శృంగార పరంగా పరిణమించింది. అసభ్యకరం అభ్యంతరకరంగా మారిపోయింది అని చెప్పి భాషా సంపదను రికార్డు చేయడం మానేస్తే ముందు తరాలలాగే అది కూడా కాలంలోకి చేజారిపోతుంది. కాబట్టి పరిశోధనా దృష్టితో జానపద భాషను ముఖ్యంగా ఒగ్గు కథల్ని గ్రంథస్తం చేయాల్సి ఉంది.

ఉదాహరణకు ఒగ్గు కథల్లో రెండు మూడు సామెతలు ఉదాహరణలుగా ప్రస్తావిద్దాం వాటిని విశ్లేషించి చూద్దాం. చదువుకున్న వాడికంటే చాకలోడు మెరుగు అన్న సామెత ఈనాడు అభ్యంతరకరం. ఎందుకంటే సమాజంలో కులం భావన అభ్యంతరకరం. అది సమానత్వానికి నిరోధకంగా ఉంటుంది. అయితే దీని నేపథ్యాన్ని మనం అర్థం చేసుకుంటే ఆనాటి సమాజ స్వభావమే కాక జాతిసారం కూడా ముందు తరాలకు అందుతుంది. అది ఎలాగంటే చాకలోడు అన్నమాట ఆ వృత్తిని తద్వారా ఆ కులాన్ని తక్కువచేసి మాట్లాడడం సాక్ష్యం ఇస్తుంది. చాకలోడు అనే కాదు చాకలి అనటం కూడా ఇవాళ అభ్యంతరకరమే. అందుకని చాకలి, రజకగా సంస్కృతీకరింపబడినది. ఇది సాంస్కృతిక ఆర్థిక భూమికగాగల నిందావాచకంగా ఉన్నది కాబట్టి నిషేధించబడింది. దీని ద్వారా ఆనాటి సమాజంలో కులాల మధ్య నిమ్నోన్నతాల సమ్మతిని ధృవీకరిస్తుంది. నిమ్నోన్నతాలు ప్రస్తావన వెల్లడిచేయడానికి మాత్రం ఈ సామెతను సృష్టించడం కాదు. ఆ రోజుల్లో ఏ వృత్తికీ లేని గణిత శాస్త్ర పరిజ్ఞానంతో అనుబంధం చాకలి వృత్తికి ఉన్నది. వస్త్ర విశేషాల జాబితాను వర్గీకరించి మనో గణితంతో నోటి లెక్కలు కట్టి సునాయాసంగా వ్యవహారం చక్కపెట్టగలిగే వ్యక్తిగా చాకలి కనిపిస్తాడు. కానీ చదువరి కాగితం కలాలు ఉంటే కానీ లెక్కలు వేయలేడు. కాబట్టి ఈ నేపథ్యంలో గణిత పరిజ్ఞానం దృష్ట్యా వేగవంతమైన చాకలి ప్రజ్ఞను గొప్పచేయడం కంటే చదువరి నిస్సహాయతను గేలి చేయడం మనకు కనిపిస్తుంది. అదేవిధంగా పనిలేని మంగలోడు పిల్లి తల గొరిగాడంట. అన్న సామెత కార్యదీక్ష పరుడైన పనికి నిబద్ధుడైన వృత్తి పనివాడిని, పనితనాన్ని వ్యాజస్తుతి చేయడం ఇక్కడ కనిపిస్తుంది. పని చేయకుండా ఉండలేకపోవడం అనేది ప్రగతి సూచకమే కానీ సోమరితనం కాదు. కానీ పిల్లికి జూలు లేదు దానికి ఉన్న పొట్టి జుట్టును కూడా అంట కత్తెర వేయగల నైపుణ్యం మంగలికి ఉన్నది. పనితనాన్ని, పని చేయకుండా ఉండలేకపోవటాన్ని, పట్టి చూపించే సామెత ఇది. దీన్ని కూడా వ్యాజస్తుతిగా మనం తీసుకోవచ్చు.

జానపద కళగా ఒగ్గు కథల్ని కొత్త తరాలకు అందాల్సిన వాఙ్మయం చరిత్రగా నిర్మితం కావాల్సిన సాంస్కృతిక వారసత్వ సంపద మన పూర్వీకులు నాలుక మీద ఉన్నది. వారితోపాటు జానపద కథలు, కళలు  పోయే ప్రమాదం ఉంది కాబట్టి ముందే మేలుకొని వాఙ్మయాన్ని రికార్డు

చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. వాఙ్మయ సేకరణ మన సాంస్కృతిక వైభవం ఎంత ఉన్నదో తెలుసు కోగలిగే వారికేగాక గుణాత్మక పరిశోధన పరిణామంలో మనం ఎంత దూరం ప్రయాణించాం అన్న దాన్నీ బేరీజు వేసుకోవాలనుకునే వారికి కూడా ఉపకరిస్తుంది.

ప్రపంచీకరణ ప్రభావం వల్ల అనేక జానపద కళారూపాలు ధ్వంసం అయ్యాయి, అవుతున్నాయి. అవుతాయి. ఇలాంటి తరుణంలో మనం మనదైన సంస్కృతిని, మనదైన ఆచార సాంప్రదాయాలు, జానపద ఒగ్గు కథలను రక్షించుకోవలసిన అవసరం ఉంది. ఒకప్పుడు ఆవు, ఎద్దులను తమ ఇంటి సంతానంగా భావించేవారు. కానీ నేడు ఆవుల్ని పాల వ్యాపారంలో భాగంగానే చూస్తున్నారు. ఒట్టిపోయిన ఆవులను కబేళాలకు తరలిస్తున్నారు. ఇక వ్యవసాయంలో యంత్రాల రాకతో ఎద్దులకు పూర్తిగా పని లేకపోవడంతో దూడలుగా ఉన్నప్పుడే కబేళాలకు తరలిస్తున్నారు. విచిత్రం ఏమిటంటే ప్రపంచీకరణకు లోనైన మానవుడు ప్రతిదాన్ని లాభాపేక్షతోనే ముడిపెడుతున్నాడు. అందుకే మనుషుల్లో ఆడశిశువులను చంపేసినట్టే ఎద్దులని (కోడే దూడ) చంపేస్తున్నారు. నేడు కొన్ని ప్రాంతాల్లో పెయ్యదూడే కలగాలని ప్రార్ధనలు చేస్తున్నారు. ప్రపంచీకరణ వల్ల వ్యాపార దృక్పథం మనిషి మెదళ్ళలో ప్రవేశించింది. బహుళజాతి సంస్థలు వారి మార్కెటింగ్ కోసం మన సంస్కృతిని పూర్తిగా వారి సంస్కృతిగా మార్చేస్తున్నారు. పిల్లల ఆట వస్తువులు దగ్గర నుండి శవపేటిక వరకు అన్ని విషయాలలోనూ, మత పరమైన విషయాలలోను ప్రపంచీకరణ విరివిగా చోటుచేసుకుంది.

ఇప్పటికైనా ప్రజలు, మన ప్రభుత్వాలు మేల్కొని ప్రపంచీకరణ ఇనుపచక్రాల క్రింద మన సంస్కృతి, మన కళలు, మన పాడిపంటలు ముఖ్యంగా మానవత్వం నలిగిపోకుండా కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి మనిషికి ఉంది. ఈ జానపద కళలను ముఖ్యంగా ఒగ్గు కథల్ని డాక్యుమెంటరీ రూపంలో మనం భద్రపరచుకుని భావితరాలకు అందించాలి. ఈ కళా రూపాలను రక్షించి మన సంస్కృతిని మనమే కాపాడు కుందాం. తెలంగాణను సంస్కృతి రాష్ట్రంగా తీర్చిదిద్దుదాం. తెలంగాణా సంస్కృతికే మకుటంగా నిలిచే జానపద –కళారూపాల సాహిత్యం ముఖ్యంగా ఒగ్గు కథలు ఎంతో ప్రాచీన మైనదిగా తెలుస్తున్నది. అంతేగాక విభిన్నమైన ప్రక్రియలతో, భిన్నమైన కథావస్తువుతో పోషక కులాలను ఆశ్రయిస్తూ మనుగడ సాగిస్తున్న కళారూపాలు తెలంగాణాలోనే ఎక్కువగా ఉండటం తెలంగాణా సంస్కృతీ ప్రాచీనత గొప్పతనమే. వీటి సాహిత్యంలో ఒక సమాజం లేదా ఒక కులం మనుగడకు కావల్సిన, ఆత్మస్థైర్యాన్ని, ఆత్మనూన్యతా భావాన్ని తొలగించేందుకు కావల్సిన పలు అంశాలు ఉన్నవి. అంతేగాక కులాల ఐక్యతకు దోహదం చేసేదిగా ఉంది. అలాగే వృత్తులకు కులాలకు గౌరవాన్ని కలిగించే విధంగా వీరి సాహిత్యం నిర్మింపబడింది. ఇటు వంటి సాహిత్య విలువలు కలిగిన వీరి

జానపద సాహిత్యాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత ఎంతైన ఉన్నది. భవిష్యత్తు తరాలకు వీరి గొప్పదనాన్ని, వీరి సాహిత్యాన్ని భద్ర పరచాల్సిన అవసరం ఉన్నది. ఇప్పటికే కొన్ని కళా రూపాలు కనుమరుగయ్యాయి. కొన్ని కనుమరుగయ్యే స్థితిలో ఉన్నవి. కావునా పరిశోధనాత్మకంగా వరంగల్ జిల్లా జానపద ఒగ్గు కథలను, శోధించి, పరిరక్షించి తెలంగాణ సంస్కృతీ శోభను నిలపాల్సి ఉంది.

తెలంగాణలో అన్ని జిల్లాలో వలెనే వరంగల్ జిల్లా జానపద కళలకు కాణాచి మండలాలో అనేక గ్రామాలలో యింకా అనువంశికంగా కొన్ని జానపద కళలు సజీవంగా ప్రదర్శింపబడుతూనే ఉన్నాయి. ఎన్నో కళలు, ఒగ్గు కళాకారులు అనేక కారణాల వలన అంతరించి పోయినప్పటికీ వారి వారసత్వం ఇంకా కొనసాగుతూనే ఉంది.వరంగల్ జిల్లాతో పాటు తెలంగాణలో అనేక జిల్లాలలో ఈ జానపద కళలు సజీవంగా వుండుటకు కారకులైన ముఖ్యంగా ఒగ్గు కళాకారులకు మనమెంతో ఋణపడి యున్నాము.

వరంగల్ జిల్లాలో ముఖ్యంగా కనిపించే జానపద కళలు– ఒగ్గుకథ, శారదకథ, కిన్నెరకథ, జముకుల కథ, జంగమకథ, బుర్రకథ, చెక్కభజన, కోలాటనృత్యాలు, లంబాడి నృత్యాలు, గండి రెడ్ల నృత్యాలు స్త్రీల ఆటలు, పాటలు (బతుకమ్మ, బొడ్డెమ్మ), వీధినాటకాలు, కొమ్ము‌వాద్యం, పులివేషం, పగటివేషాలు మొదలైనవి పైన వివరించిన జానపద కళలను ప్రదర్శించు కళాకారులు– మాలదాసరులు, డక్కలివారు, బైండ్లవారు, కరుములు, లంబాడీలు, డప్పులు వాయించెడి దళితులు, గంగిరెద్దులవారు , ఎరుకలివారు, పిచ్చుకుంట్లువారు, పంబలవారు, గొల్లదాసరులు మొదలైనవారు జానపద కళలను ప్రదర్శిస్తూ, ప్రచారం చేస్తూ అవి నశించి పోకుండా ఈ జిల్లాలో వాటిని సంరక్షించుకుంటూ వస్తున్నారు. అనేక జానపదకళలు, కళాకారుల ప్రస్తావన వివిధ జానపద కథల్లో కనిపిస్తున్నది. పైన వివరించిన వరంగల్ జిల్లా ఒగ్గు కథలన్నింటిని శాస్త్రీయంగా పరిశీలించడమే నా పరిశోధన ప్రధాన లక్ష్యంగా జరిగింది.

### 5. క్షేత్ర పర్యటన (Field visit)

ఈ నా పరిశోధనా క్షేత్ర స్థాయిలో వరంగల్ జిల్లా వివిధ మండలాలలో (వరంగల్ – హన్మకొండ, వర్ధన్న పేట, పర్వతగిరి ,హసన్ పర్తి, సంగెం, గీసు కొండ, పరకాల, దుగ్గొండి, నర్సన్నపేట ,చెన్నారావు పేట,నెక్కొండ,ఖానాపురం, నల్లబెల్లి, శాయం పేట, ధర్మ సాగర్ ,స్టేషన్ ఘన్ పూర్,జఫర్ గడ్, పాలకుర్తి, రాయపర్తి, రఘునాథపల్లి, నర్మెట్, ఖాజీపేట, దామెర, భీమదేవర పల్లీ, ఎల్కతుర్తి, కమలాపురం, జమ్మికుంట.) ఉన్న జానపద కళాకారులను, ముఖ్యంగా ఒగ్గు కళాకారులను, కలిసి వారి నుండి ఒగ్గు కథలను ప్రత్యక్షంగా తెలుసుకోన్నాను. సరళమైన

ఛందస్సు, గానయోగ్యత మొదలైన లక్షణాలు ఈ గేయాలలో కనబడుతున్నాయి. తెలుగు రామాయణ, భారత, భగవతాలకు సంబంధించిన కథలనేకం ప్రచారంలో ఉన్నాయి. వీటిలో రామాయణమునకు సంబంధించిన జానపద ఒగ్గుకథ కొంత మార్పులకు లోనయింది. ఆవాల్మీకాంశాలు జానపదులు తమ స్వకల్పనలతో పాడటం గమనించాను. ఒగ్గుకథలను క్షుణ్ణంగా పరిశీలిస్తే జానపదుల జీవన విధానం తెలుస్తుంది. అలాగే ఆయా ప్రాంతాలకనుగుణంగా, సమాజంలో జరిగిన సంఘటనల ఆధారంగా జానపదులు తమ భావాలను ఒగ్గుకథల రూపంలో వ్యక్త పర్చారు.

క్షేత్ర పర్యటనలో సేకరించిన జానపద మౌఖిక ఒగ్గుకథలను పేపర్ మీద రాయడానికి ఎంతో కష్టపడాల్సి వచ్చింది. కాని కొన్ని ఒగ్గుకథలు మాత్రం అయిదు, ఆరుసార్లు విన్న తరువాత ఒగ్గుకథలో ఇతివృత్తం అర్థమయ్యేది. కథకులు పాడినవి పాడినట్లుగా ఎలాంటి మార్పులు చేయకుండా, మాండలిక యాసలో రాసుకున్నాను. దీని ద్వారా వరంగల్ జిల్లా జానపదుల భాషను, మాండలికాలను, ఆచారవ్యవహారాలను పరిశీలించవచ్చునని నా అభిప్రాయం.

నాకు లభించిన జానపద ఒగ్గుకథల ఆధారంగా, జానపదుల యొక్క మనస్తత్వమును సమగ్రంగా, శాస్త్రీయంగా పరిశీలించిన పిమ్మట ఈ కింది అధ్యాయ విభజనను (ప్రణాళికను) ఈ పరిశోధన గ్రంథంలో అనుసరించాను.

## 6. పరిశోధన ప్రణాళిక / సిద్ధాంత గ్రంథ స్వరూపం (Research Planning)

జానపద కథల పుట్టుక ఎక్కడ అనేది స్పష్టంగా తెలియదు. ఇవి విశ్వజనీనమైనవి. ఈ కథలకు ముగింపు "కథ కంచికి మనం ఇంటికి" అనే నానుడి ఉంది. ఈ కథల సన్నివేశాలు స్వర్గ, మర్త్య, పతాళాల్లో జరుగుతుంటాయి. ఇందులో మంత్రదండం, మాయ ఉంగరం, ఆకాశంలో ఎగిరే చేప మొదలైన చిత్ర విచిత్రమైన వస్తువులకు ప్రాధాన్యం ఉంటుంది. కథ కంచికి వెళ్ళడానికి ఒక కథ ప్రచారంలో ఉంది. పూర్వం కాంచీనగరాన్ని (నేటి కంచీపురం) పల్లవ రాజులు పరిపాలిస్తున్న సమయంలో ఆ రాజ్యంలో 'భారవి' అనే పేరుగల సంస్కృత పండితుడు ఉండేవాడు. ఆయన మనమడు 'దండి' వీరు కూడా సంస్కృతంలో చక్కని కవి. కథా రచయిత. వీరు రాసిన కథా కావ్యమే "దశకుమార చరిత్ర" దండికి బాల్యంలోనే తల్లిదండ్రులు చనిపోయారు. ఆనాటి కాంచీనగర రాజ్యంలో రాజకీయాలు మారిపోయాయి. వచ్చిన కొత్త రాజు పెట్టే బాధలు భరించలేక రాజ్యంలోని ప్రజలంతా అడవుల్లోకి వెళ్ళిపోయారు. దండి కూడా చేసేది లేక ప్రజలతోపాటు అడవులకు వెళ్ళిపోయారు. ఆవిధంగా కొన్ని రోజులు గడిచాక రాజ్యంలో గొడవలు సర్దుమణిగి సురక్షితం అయ్యింది. అప్పుడు ప్రజలందరు తిరిగి రాజ్యం చేరుకున్నారు. చిన్ననాటి నుండి ప్రతిభావంతంగా

వున్న దండి తన తెలివితేటల్ని ప్రదర్శించి కాంచీనగర రాజ్యంలో, ఆస్థాన విద్వాంస పదవిని పొందాడు. అక్కడ ఉన్నప్పుడే ఆయన 'దశకుమార చరిత్ర' అనే గ్రంథాన్ని రచించాడు.

అందులో ఎక్కువగా కాంచీనగరంలోని అందమైన పూదోటలు, చూడచక్కని మేడలు, మైమరపించే ప్రకృతి సహజ సుందర దృశ్యాలు శోభాయమానంగా ఉండేవని దండి తన 'దశకుమార చరిత్ర' లో వివరించాడు. ఈ గ్రంథంలో మగధరాజైన 'రాజహంసుడు' మాళవదేశపు రాజు 'మానసారున్ని' ఓడించాడు. ఓడిపోయిన మానసారుడు అడవుల పాలైనాడు. ఆయనకు రాజవాహనుడనే పుత్రుడు జన్మించాడు. ఆ విధంగా అడవుల పాలైన మానసారుని వెంట అతని ఏడుగురు మంత్రులుకూడా వెళ్ళారు. వారికి హరిహరవర్మ మొదలైన పదిమంది పుత్రులు జన్మించారు. వారందరూ పెరిగి పెద్దవారైనారు. అనేక ప్రాంతాలు పర్యటించి అనేక విద్యలు నేర్చుకుని, వివిధ రకాల అనుభవాలు సాధించారు. తిరిగి రాజవాహనుణ్ని చేరుకున్నారు. వారు పదిమంది ఐక్యంగా ఉండి యుద్ధతంత్రాలతో మగధరాజైన రాజహంసుడ్ని ఓడించి తిరిగి మగధ రాజ్యాధికారాన్ని రాజహంసుడి పరం చేశారు. ఇలా పదిమంది వీరులకు సంబంధించిన కథ ప్రధానం కనుక దీన్ని " దశకుమార చరిత్ర" అంటారు. ఇందులో ప్రధాన కథతోపాటు, ఎన్నో ఉపకథలు తోడైనాయి. ఆ కథలే పెద్దవారు, పిల్లలకు చెప్పడం మొదలైంది. ఇవే కాక కాంచీనగరంతో ముడిపడిన అనేక కథలు, తర్వాత రోజుల్లో చాలా వచ్చాయి.

ఆ విధంగా కథలకు పుట్టినిల్లుగా మారిన ఈ కాంచీనగరాన్ని గుర్తు చేయడానికే 'కథకంచికి –మనం ఇంటికి' అనే నానుడి అలవాటుగా చెప్పడం జరుగుతుంది. ఇటువంటి కథలు ఇతిహాసపు చీకటికోణం. అట్టడుగునపడి కనిపించని కథలన్ని ఇప్పుడు కావాలి. వాటిని దాచేస్తే దాగని సత్యంలాంటిదని చెప్పవచ్చు. మానవ కథ వికాసమెట్టిదని తెలుసుకోవాలంటే జానపద కథలు చాలా ఉపయోగపడతాయి. ఒక్కొక్క కథ మానవుని మనస్సులోని ఆలోచనా తరంగాలను ప్రతిబింబింప చేస్తుంది. మానవుని అంతరంగంలో జరిగే సంఘర్షణలను, సుళ్ళు తిరిగే ఆలోచనల్ని ఆశల్ని, ఆకాంక్షల్ని ఈ కథలు ప్రతిబింబిస్తాయి.

కొత్త తరాలకు అందాల్సిన వాఙ్మయం చరిత్రగా నిర్మితం కావాల్సిన సాంస్కృతిక వారసత్వ సంపద మన పూర్వీకులు నాలుక మీద ఉన్నది. జనుల సమూహమే జానపదం. జనపదమనగా గ్రామం లేదా పల్లె అని అర్థం. తెలుగు సాహితివేత్తలు అనేక కావ్యాలలో జానపదులను 'పల్లీయులు' అని ప్రయోగించారు. ఒక ప్రత్యేకమైన సంప్రదాయం గల ఏ సమూహాన్నైనా జానపదులు అని ఆంగ్ల సాహితివేత్త అయిన 'అలెన్ డాండస్' నిర్వచిస్తే, "అక్షర జ్ఞానం లేని పల్లె ప్రజల సాంప్రదాయక విజ్ఞానము అదియే జానపద విజ్ఞానం" అని తంగిరాల సుబ్బారావు పేర్కొన్నారు. అయితే తంగిరాల

అభిప్రాయం ప్రకారం వారికి అక్షరజ్ఞానం లేకపోవచ్చు కాని వారి అనుభవ ప్రపంచం చాలా పెద్దదని చెప్పవచ్చు. జానపదులు ఆనందంగా పని సమయాలలో ఉత్సాహోకంగా ఉండటానికి కొన్ని గేయాలను పాడేవారు. ఈ గేయాలకు అనుగుణంగా అడుగులు వేస్తూ, కొన్ని కళారూపాలను సృష్టించి, వాటిని గ్రామాలలో ప్రదర్శించేవారు.

ఈ జానపద కళాకారులు సంచార జీవులు. వీరి వల్లనే జానపద కళా రూపాలెన్నో ఇప్పటికి నిలిచిఉన్నాయి. వీరు జానపద సాహిత్యానికి మూల స్థంబాలాంటి వారు. పూర్వం ఈ జానపద కళాకారులు ఒక నియమిత కులాలకు కథలు చెబుతూ వారిచ్చే భృతితో గౌరవంగా బతికేవారు. కాని తరువాతి కాలంలో సమాజంలో వచ్చిన మార్పుల వల్ల జానపద వృత్తి గాయకులలో కూడా మార్పు వచ్చింది. వారు పొట్టకూటికోసం అన్ని కులాల వారిని యాచించడం ప్రారంభించారు. అయినా నేటికి కొందరు వృత్తి కళాకారులు తమ కులాల తెగల వారిని యాచించి జీవనం సాగిస్తున్నారు. జానపద కళారూపాలలో తన్మయత్వంతో నృత్య గానాలు చేసే సమయాన రాగతాళ లక్షణాలు కొన్ని సార్లు ఏమి తెలియకున్నా ఒక లయతో తదాత్మనం చెందుతూ, పాడుతూ, నర్తిస్తారని 'శ్రీమతి వేదాంతం శ్రీదేవి' అన్నారు. జానపద కళాకారులలో "గాయత్వం అనేది ఒక పద్ధతిగా ఉండక బహుముఖంగా కనిపిస్తుంది. ఒకడు పాడితే వయక్తికమవుతుంది. దీనికే వ్యష్టి అని పేరు. హరిదాసు, బాలసంతు దీనికి ఉదాహరణ. ఇద్దరు లేక ముగ్గురు కలిసి వాద్యంపై పాడితే లేక కథలు చెప్పితే అది యుగళమవుతుంది. శారద గాళ్లు, ఒగ్గులు, బుడిగె జంగాలు దీనికి ఉదాహరణ. ముగ్గురికంటే ఎక్కువగా ఎంత మంది గానం చేసిన దానిని బృందగానం లేక సమిష్టిగానం అని అంటారు. దీనికి ఉదాహరణగా గౌరవయ్యలు, ఉరుములవాళ్లు, వీరముష్టులు, భాగవతుల వాళ్లను పేర్కొనవచ్చు". జాన పద కళాకారులలో ఉన్న ప్రతి వ్యక్తికి గానంతో పాటు వాద్య వాదనంలోనూ నైపుణ్యం ఉంటుంది.

మానవతా విలువలు కలిగిన మన ప్రాచీన జానపద కథా వాఙ్మయం ఇప్పటికీ సమాజంలో మెరుగైన జీవనం కోసం అవసరం. నేటి తరం పిల్లలకు మన భాష, సంస్కృతిని గురించి అర్థమయ్యేలా వివరించి వారితో ఆచరింప జేయాలి. వివిధ రకాల పండుగలు నిర్వహింపజేయాలి. ముఖ్యంగా మన తెలంగాణ రాష్ట్రీయ పండుగలైన బోనాలు, బతుకమ్మ పండుగల సాంస్కృతిక నేపథ్యం, శాస్త్రీయత, సాంస్కృతికతలను నేటితరం పూర్తిగా తెలుసుకోగలిగేలా చూడాలి.

అత్యంత వైభవమైన జానపద ఒగ్గు కళారంగానికి పెట్టని కోట గోడలు ఇప్పుడు శిథిలమవుతున్నాయి. వాటి పునర్నిర్మాణం చేయుట కష్టమైనా, కనీసం ఉన్న వాటికి కొంత రంగులద్దితే... అది మరి కొన్ని తరాలు మనగలుగు తాయి. అందుకు ప్రధాన పాత్ర నేటిదే.

నా పరిశోధనను ఐదు అధ్యాయాలుగా విభజించాను.

మొదటి అధ్యాయంలో '**వరంగల్ జిల్లా పరిచయం**'లో చారిత్రికత, భౌగోళిక స్థితి, జనాభా, నదులు–నేల కూర్పు, వర్షపాతం, పశుసంపద, ఆర్థికం, విద్యుత్, పర్యాటకం, వెయ్యి స్తంభాల ఆలయం, భద్రకాళి ఆలయం, వరంగల్ కోట, రామప్ప ఆలయం, పాకాల సరస్సు, మేడారం, వ్యాపారం – పరిశ్రమలు, IT/ ITES హార్డ్వేర్, వస్త్రపరిశ్రమ, ఆహార ప్రాసెసింగ్, రవాణా, రోడ్, రైల్వే, విమానాశ్రయం, ఉత్సవాలు–కళలు, విద్య, వరంగల్ జిల్లా జానపద కథలు–కళాకారులు, పునర్వ్యస్థీకరణ తరువాత వరంగల్ జిల్లా, వరంగల్ జిల్లా గ్రామదేవతలు–పూజా విధానము మొదలగు అంశాలను వివరించడం జరిగింది.

రెండవ అధ్యాయంలో '**వరంగల్ జిల్లా ఒగ్గు కథలు స్వరూప స్వభావాలు**'లో ఒగ్గు పదము అర్థము – కులోత్పత్తి వాదాలు, ఒగ్గు కథ స్వరూప స్వభావాలు, జానపద కళా రూపాలు – ఒగ్గు వృత్తి కళాకారులు, వరంగల్ జిల్లా ఒగ్గు కథలు విశ్లేషణ, గొల్ల కేతమ్మ కథ, కీళ్లు గుర్రం కథ, నల్ల పోచమ్మ కథ, బీరప్ప ఒగ్గుకథ, మహిషాసురుని కథ, మాంధాత కథ, ఒగ్గు కథల్లో స్త్రీ పాత్ర చిత్రణ, మల్లన్న కథ–బీరన్న కథ–సామ్య భేదాలు, ఒగ్గుకథ ప్రారంభం, ప్రార్థన సంప్రదాయం, గంగ ప్రార్థన, గణపతిప్రార్థన, సకలదేవత ప్రార్థన, రామశబ్దం, ఒగ్గు కథల్లో వర్ణనా చాతుర్యం, ఎల్లమ్మ బీరప్పకు చెప్పిన స్త్రీ లక్షణాల వర్ణన, వృత్తి జీవన వర్ణన, కరణాల వర్ణన, కోమటి వర్ణన, కుమ్మరి వర్ణన, యుద్ధ సన్నద్ధ వర్ణన, అడవి వర్ణన, గోవు వర్ణన, కుష్టు వ్యాధి గ్రస్తుని వర్ణన, వివాహ వర్ణన, జూదం వర్ణన, నాగన్న వర్ణన, రామచిలక వర్ణన, ఎరుకలసాని వేషం, జంగమ వేషం వర్ణన, సత్యాన్న బోనం వర్ణన, వేట వర్ణన, స్త్రీల సౌందర్య వర్ణన మొదలైన విషయాలను వివరించడం జరిగింది.

మూడవ అధ్యాయంలో '**ఒగ్గు కథ – ప్రదర్శనా రీతులు**' లో ఒగ్గు కథల లక్షణాలు – ప్రార్థనా గీతాలు, ఒగ్గు కథా బృందం నృత్యం, వాద్యాలు – పరికరాలు – వేషధారణలు, ప్రదర్శనా స్థలం – ప్రదర్శనా రీతులు, మల్లన్న, బీరన్న కథల్లో అద్భుతాంశాలు, ఒగ్గు కథలు – నవరసాలు, సమకాలీన కళారూపాల ప్రభావం, యక్షగాన ధోరణి, తందనానరామాయణం ప్రభావం, మేలుకొలుపులు – స్తుతిగానాలు, మల్లన్న మేలుకొలుపులు–పవళింపులు, ఎల్లమ్మ కొలుపులు, మంగళ హరతులు విశ్లేషించాను.

నాల్గవ అధ్యాయంలో '**ఒగ్గు కథ – సాహిత్య భాషాంశాలు**'లో సంధి – సమాస రూపాలు క్రియరూపాలు – ధ్వని పరిణామాలు, మాండలిక పదాలు, ఒగ్గు కథల్లో భాషా సౌందర్యం, పలుకుబడులు – సామెతలు, పొడుపు కథ, అలంకార వైవిధ్యం, శబ్ధాలంకారాలు, ఒగ్గు కథ

అర్థాలంకారాలు, అన్యదేశ్యాలు, ఉర్దూ పదాలు, ఆంగ్ల పదాలు, వారాను వర్తనాలు, యతి ప్రాసల లయాత్మకత, పదవిరుపులో యతిమైత్రి, ప్రాసయతి, అంత్యానుప్రాస, పదాత్మక ప్రాస, సుదీర్ఘ వచనాలు అంశాలను విశ్లేషించాను.

ఐదవ అధ్యాయంలో **'ఒగ్గు కథ – సామాజిక సాంస్కృతిక అంశాలు నేడు తగ్గుతున్న ఆదరణ–పరిరక్షణ మార్గాలు'** అనే అంశంలో సామాజింకాంశాలు, అవినీతి నిర్మూలన, ఓటర్లకు జాగరణ, ప్రకృతిమాత, స్వతంత్ర ఉద్యమం, పరిసరాలు, పరిశుభ్రత, కుటుంబ నియంత్రణ, ప్రజా ఉద్యమాలు– ఒగ్గు కథాంశం, తగ్గుతున్న ఆదరణ– కారణాలు, ప్రపంచీకరణ వల్ల నష్టాలు, పరిరక్షణ మార్గాలు– తీసుకోవాల్సిన చర్యలు మొదలైన అంశాలను విశ్లేషించాను.

# 1

# ఒకటవ అధ్యాయం

## వరంగల్ జిల్లా పరిచయం

# అధ్యాయం-1

# వరంగల్ జిల్లా పరిచయం

## 1.1. పరిచయం

వరంగల్ తెలంగాణా రాష్ట్రంలో చాలా చారిత్రికత ఉన్న ప్రాంతం.ప్రాచీన సాహిత్యంలో ఓరుగల్లుకు పిలవబడిన ఈ ప్రాంతం తెలంగాణా చరిత్రకు నిదర్శనంగా చెప్పవచ్చు. రాష్ట్ర రాజధానియైన హైదరాబాదుకు 158 కిలోమీటర్ల దూరంలో వరంగల్, హనమకొండ, ఖాజీపేట అన్న మూడు నగరాల సంయుక్త స్వరూపమైన వరంగల్ తెలంగాణా రాష్ట్రంలో రెండవ పెద్ద నగరమే కాదు అత్యధిక జనాభా ఉన్న రెండవ నగరం కూడా.

12వ శతాబ్దం నుంచి 14 వ శతాబ్దం వరకు తెలంగాణా ప్రాంతాన్ని పాలించిన కాకతీయులకు వరంగల్ రాజధాని. ఆకట్టుకునే కోట, నాలుగు భారీ రాతి ద్వారాలు, శివుడికి అంకితం చేసిన స్వయంభు ఆలయం, రామప్ప సరస్సు సమీపంలో ఉన్న రామప్ప ఆలయం వంటి అనేక చారిత్రిక స్థలాలు కాకతీయుల పాలనకాలంలోవే. కాకతీయుల సాంస్కృతిక, పరిపాలనా గొప్పదనాన్ని ప్రసిద్ధ యాత్రికుడు మార్కోపోలో తన రచనల్లో పేర్కొన్నాడు. తుగ్లక్ తో జరిగిన పోరాటంలో కాకతీయ వంశానికి చెందిన ప్రతాపరుద్రుని ఓటమి తరువాత, ముసునూరి నాయకులు డెబ్బై రెండు ప్రాంతీయ నాయకులను ఏకం చేసి యుద్ధం చేసి ఢిల్లీ ఏలుబడినుండి వరంగల్‌ను విముక్తం చేయడమే కాక, యాభై సంవత్సరాలు పాలించారు.

మొఘల్ సామ్రాజ్యాధినేతయైన ఔరంగజేబ్ 1687 లో గోల్కొండను జయించాడు. దీనితో ఈ ప్రాంతమంతా మొఘలుల పాలనలోకి వచ్చింది. 1724లో ఆసఫ్ జాహీల పాలనతో హైదరాబాదు రాజ్యం ఉనికిలోకి వచ్చింది. ఇందులో తెలంగాణా ప్రాంతమే కాక ప్రస్తుత మహారాష్ట్ర, కర్ణాటకలోని కొన్ని భాగాలు భాగంగా ఉండేవి. దేశానికి స్వంతంత్ర్యం వచ్చిన తరువాత హైదరాబాద్ రాజ్యం 1948 లో భారతదేశంలో విలీనమై, ఒక రాష్ట్రంగా మారింది. 1956లో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టంలో భాగంగా హైదరాబాద్ విభజించబడింది. కన్నడ భాష వ్యవహారంలో ఉన్న ప్రాంతాలు కర్ణాటకలో, మరాఠీ భాష వ్యవహారంలో ఉన్న ప్రాంతాలు మహారాష్ట్రలో భాగం కాగా తెలుగు మాట్లాడే ప్రజలున్న తెలంగాణా ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లో భాగమైంది. 2014 నుండి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించింది.

## 1.2. చారిత్రికత

ప్రాచీన సాహిత్యం, చరిత్రలను అనుసరించి వరంగల్, హనమకొండ ప్రాంతం విష్ణుకుండినుల పాలనలో భాగంగా ఉండేది. భారతదేశ చరిత్రలో బౌద్ధ, బౌద్ధ–పూర్వ కాలాలకు చెందిన అనేక రాజవంశాలతో ఈ ప్రాంతానికి అనుబంధముంది. క్రీ.శ.8వ శతాబ్దంలో ఈ ప్రాంతానికి ఓరుకుల్ అనే పేరు వ్యవహారంలో కనిపిస్తున్నది.క్రీ.శ.12వ శతాబ్దం మధ్యకాలం నుండి రెండు వందల సంవత్సరాల వరకు ఈ ప్రాంతం యాదవ రాజుల పాలనకు రాజధానిగా ఉండేది. ఆపైన కాకతీయలు ఈ ప్రాంతాన్ని పాలించారు. వారి కాలంలోనే ఓరుకల్ అనే పేరు ఓరుగల్లుగా వ్యవహారంలోకి తీసుకువచ్చారు. ఒకటవ ప్రోలరాజు రుద్రదేవుడు, గణపతి దేవుడు, రాణి రుద్రమదేవి, ప్రతాపరుద్రులు ఈ వంశంలోని ప్రముఖ రాజులు.తరువాతి కాలంలో బహమనీ సామ్రాజ్యం విచ్ఛిన్నపోగా, వరంగల్ గోల్కొండ కుతుబ్‌షాహీలపాలనలోకి వచ్చింది.వీరిలో మాలిక్ ఇబ్రహీం, కులీ కుతుబ్‌షాలు పేరు పొందిన రాజులు. వారి తరువాత ఈ ప్రాంతం అసఫ్జాహీ వంశీకులైన నిజాముల పాలనలోకి వచ్చింది. వీరిలో ఆరవ నిజామైన మెహబుబ్ అలీ ఖాన్, ఏడవ నిజామైన ఉస్మాన్ అలీ ఖాన్‌లు ప్రసిద్ధులు.

భారతదేశానికి 1957లో స్వతంత్రం రాగా, హైదరాబాదును పాలించే నిజాం ఈ ప్రాంతాన్ని భారతదేశంలో కలపడానికి ఇష్టపడలేదు. దానితో ఈ ప్రాంత ప్రజలు ఉద్యమించారు. సాయుధ పోరాటాలూ చేశారు. ఫలితంగా భారత సైన్యం హైదరాబాదులోకి ప్రవేశించింది. దీనితో నిజాం ప్రభువు ఈ ప్రాంతాన్ని భారతదేశంలో విలీనం చేశాడు. దీనితో నిజాం రాజ్యం హైదరాబాదు రాష్ట్రంగా అవతరించింది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడిన సమయంలో హైదరాబాదు రాష్ట్రంలోని మరాఠీ ప్రాంతాలు మహారాష్ట్రలను, కన్నడ ప్రాంతాలు కర్ణాటకలోను భాగం కాగా, తెలుగు ప్రాంతమైన తెలంగాణ ఆంధ్రరాష్ట్రంతో కలిసి ఆంధ్రప్రదేశ్ గా అవతరించింది. తెలంగాణా ప్రాంతంలో ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమ ఫలితంగా 2014లో తెలంగాణా ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించింది. దీనితో వరంగల్ ప్రాంతం తెలంగాణా రాష్ట్రంలో భాగమైంది.

పరిపాలన సౌలభ్యం కోసం వరంగల్ జిల్లాను ఐదు రెవెన్యూ విభాగాలుగా విభజించారు, అవి మహబూబాబాద్, వరంగల్, నర్సంపేట, జనగాం, ములుగు. ఈ జిల్లాలో 51 రెవెన్యూ మండలాలు ఉన్నాయి. అక్టోబరు 2016లో తెలంగాణా రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన జరగగా, వరంగల్ జిల్లా ఐదు చిన్న జిల్లాలుగా విడిపోయింది. అవి

వరంగల్ అర్బన్, వరంగల్ గ్రామీణ, జనగాం, జయశంకర్ మరియు మహబూబాబాద్ జిల్లాలు. ప్రస్తుత పరిశోధనకు గాను ఈ ఐదు జిల్లాల స్థానే, పాత వరంగల్ జిల్లాను ప్రాతిపదికగా తీసుకోవడం జరుగుతున్నది.

**1.3. భౌగోళిక స్థితి**

వరంగల్ జిల్లా 17.19 డిగ్రీల నుండి 18.36 డిగ్రీ ఉత్తరం అక్షాంశాలు, 78.49 డిగ్రీ నుంచి 80.43 డిగ్రీల తూర్పున రేఖాంశాల మధ్యన ఉన్నది. దీనికి ఉత్తర, ఈశాన్య దిశలో కరీంనగర్ జిల్లా, పశ్చిమాన మెదక్ జిల్లా, దక్షిణాన నల్గొండ జిల్లా మరియు తూర్పు, ఆగ్నేయంలో ఖమ్మం జిల్లా సరిహద్దులుగా ఉన్నాయి. వరంగల్ జిల్లా సముద్రం నుండి సగటున 870-1700 అడుగుల జిల్లా ఎత్తున ఉన్నది. ఇక్కడి గరిష్ట ఉష్ణోగ్రత 43.6 సి మరియు కనిష్ట ఉష్ణోగ్రత 28.5 సి.

**1.4. జనాభా**

వరంగల్ జిల్లా తెలంగాణా ప్రాంతంలో వెనుకబడ్డ జిల్లాల్లో ఒకటి. ఇది 12,846 చదరపు కిలోమీటర్ల విస్తరించి ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఈ జిల్లా జనాభా 35,22,644. ఈ జనాభా వల్ల వరంగల్ జిల్లా భారతదేశంలో 640 జిల్లాలలో 82 వ స్థానంలో నిలిచింది. ఈ జనాభాలో 17,66,257 మంది పురుషులు కాగా 17.56,387 మంది స్త్రీలు. ఈ జిల్లాలోని 1098 రెవెన్యూ గ్రామాలలో 1003 గ్రామాలలో ప్రజానివాసాలున్నాయి. మొత్తం జనాభాలో 26.23 లక్షల మంది వరంగల్, జనగాం, కడిపికొండ, మహబూబాబాద్, డోర్నకల్ అన్న ఐదు నగరాలలో నివాసం ఉంటున్నారు. జిల్లాలో జనాభా సాంద్రత చదరపు కిలోమీటరుకు 274 మంది (లేదా చదరపు మైలుకు 710మంది). 2001-2011 దశాబ్దంలో ఈ జిల్లా జనాభా వృద్ధి రేటు 8.52%. ఇక్కడ ప్రతి 1000 మంది పురుషులకు 994 మంది స్త్రీలు ఉన్నారు. ఈ జిల్లా అక్షరాస్యత 66.16%. వరంగల్ జిల్లా జనాభాలో 93% మంది హిందువులు, 5% ముస్లింలు, క్రైస్తవులు 2% కంటే తక్కువ. జైనులు, సిక్కులు చాలా తక్కువ శాతం ఉన్నారు.

**1.5. నదులు-నేల కూర్పు**

వరంగల్ జిల్లాలోని నేలల కూర్పు ఈ క్రింది విధంగా ఉంది. ఎర్ర నేలలోమ్స్ 36.25 శాతం, ఇసుక నేల 33.42 శాతం, నల్లరేగడి నేలల 18.32 శాతం, ఆల్కలీన్ నేల 6.42 శాతం, రాతి మరియు లాట్ రైట్ నేల 5.40 శాతం. ఈ జిల్లాలో ఒక నది, రెండు ఉపనదులు ప్రవహిస్తున్నాయి. గోదావరి నది, దాని ఉపనదులైన మన్నేరు, పాఖల్,

లక్నవరం వాగులు, కృష్ణానది ఉపనదులైన ఆకేరు, పాలేరు ఈ ప్రాంతంలో వ్యవసాయానికి నీటి సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. తెలంగాణా ప్రాంతానికి ప్రధాన నీటిపారుదల వనరు అయిన శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్ ఈ జిల్లా ఉత్తర భాగాల గుండా ప్రవహిస్తుంది. జిల్లాలోని ఇతర నీటిపారుదల వనరులుగా రామప్ప, లక్నవరం వంటి చెరువులు, కృత్రిమ సరస్సులు, బావులు నిలుస్తున్నాయి.

## 1.6. వర్షపాతం

వరంగల్ జిల్లాలో 991 మిల్లీమీటర్ల వర్షపాతం సగటున నమోదవుతుంది. జిల్లాలో 2,85,000 హెక్టార్ల నికర సాగునీరు ఉంది, ఇది మొత్తం సాగు విస్తీర్ణంలో 64%.

## వ్యవసాయం

వరంగల్ జిల్లాలో పండే ప్రధాన పంటలు వరి, జొన్న మరియు మొక్కజొన్న. ఇక్కడి ప్రజల ప్రధాన ఆహారమైన బియ్యం ఇక్కడ రబీ మరియు ఖరీఫ్ సీజన్లలో జిల్లా అంతటా పండిస్తారు. ఇవికాక శనగ, కంది, వేరుశనగ, మిరపకాయలు, పత్తి, పసుపు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పండించే ప్రధాన పంటలు. 15 లక్షల మంది వ్యవసాయదారులు కాగా, 2.27 లక్షల మంది వ్యవసాయ అనుబంధ పనులలో ఉపాధి పొందుతున్నారు.

జిల్లాలో వరి సాగు మొత్తం వ్యవసాయ విస్తీర్ణంలో 29% వాటాను కలిగి ఉంది. ఆ తరువాత పత్తి గణనీయమైన విస్తీర్ణాన్ని పొందింది, అయితే వేరుశనగ 1995లో రెండవస్థానాన్ని ఆక్రమించడంతో పత్తి విస్తీర్ణం తగ్గింది. జొన్న, పొద్దుతిరుగుడు మరియు మిరపకాయలు, మొక్కజొన్న, బఠానీలు గణనీయమైన విస్తీర్ణాన్ని పొందాయి. 2000–01 నుండి 2000–10 మధ్యకాలంలో జిల్లాలో ఉద్యాన పంటల విస్తీర్ణం దాదాపు మూడు రెట్లు పెరిగింది. ఈ కాలంలో కూరగాయల విస్తీర్ణం స్వల్పంగా క్షీణించింది, ఈ కాలంలో సుగంధ ద్రవ్యాలు 42,000 హెక్టార్ల నుండి 27,600 హెక్టార్లు వరకు క్షీణించాయి.

## 1.7. పశుసంపద

వరంగల్ జిల్లాలో 2011 జనగణన నాటికి 13,79,897 పశువులు ఉన్నాయి. ఇది ఆనాటికి దేశంలోని ఐదు పశుసంపద ఉన్న జిల్లాల్లో మూడవ స్థానాన్ని పొందింది. వీటిలో 5,61,887 ఆవులు కాగా 4,86,779 బర్రెలు. 3,31,231 మేకలు. పశు సంపద మేయడానికి ప్రతి 8.5 పశువులకు ఒక హెక్టారు భూమి అందుబాటులో ఉండేది.

## 1.8. ఆర్థికం

2006 లో భారత ప్రభుత్వం వరంగల్‌ను దేశంలోని 640 జిల్లాల్లో 250 స్థానంలో నిలిపి, అత్యంత వెనుకబడిన జిల్లాలలో ఒకటిగా పేర్కొంది. ప్రస్తుతం వెనుకబడిన ప్రాంతాల గ్రాంట్ ఫండ్ ప్రోగ్రాం (బిఆర్‌జిఎఫ్) నుండి నిధులు పొందుతున్న అవిక్త ఆంధ్రప్రదేశ్‌లోని పదమూడు జిల్లాల్లో ఇది ఒకటి. జిల్లా తలసరి ఆదాయం (2003-04 ప్రామాణికాలను అనుసరించి) రూ. 17253. వ్యవసాయానికి షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు ఇచ్చే రుణాలు రూ. 2, 950 నుండి 2005 లో రూ. 12, 269 కు పెరిగాయి. ఫలితంగా వార్షిక వృద్ధి రేటు 32%గా నిలిచింది. నికర విత్తనాల వినియోగ విస్తీర్ణంలో లక్ష హెక్టారుకు 34 ఎపిఎంసిలు జిల్లాలో ఉన్నాయి.

## 1.9. విద్యుత్

టిఎస్.జెన్కో విద్యుత్ ఉత్పత్తికోసం అనేక 500 మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుత మొత్తం విద్యుదుత్పత్తి సామర్థ్యం 1100 మెగావాట్లు. చెల్పూర్, భూపాల్ పల్లి ప్రాంతాలలో 630 ఎం.వి.ఎ. సామర్థ్యమున్న సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్, ఆత్మకూర్ మండలంలోని ఓగ్లాపూర్ గ్రామంలో 400/2200 సామర్థ్యమున్న స్టేషన్ ఉన్నాయి.

## 1.10. పర్యాటకం

28 ఫిబ్రవరి 2013 న యునెస్కోవరంగల్‌కు ప్రపంచ వారసత్వ పట్టణ హోదాను ఇచ్చింది. వరంగల్ జిల్లాలో అనేక చరిత్రపూర్వ ప్రదేశాలు ఉన్నాయి. వీటిని భారత పురావస్తు అధికారులు అన్వేషించారు. జిల్లాలోని పాండవ గుట్ట (రేగొండ), నర్సాపూర్ (తాడ్వాయ్)ల వద్ద పాతరాతియుగపు రాక్ ఆర్ట్ పెయింటింగ్స్ కనిపిస్తాయి. గోదావరి నది వెంట ఉన్న లోయ ప్రాంతం అనేక కొత్తరాతియుగపు ఆనవాళ్లకు నిలయం.

హనమకొండ పట్టణం నడిబొడ్డున ఉన్న పద్మాక్షి గుట్ట పై ఉన్న పద్మావతి (పద్మాక్షి) దేవికి అంకితం చేయబడిన జైన దేవాలయం ఉంది. దీనికి కదలాలయ బసది లేదా పద్మాక్షి ఆలయం అనే పేర్లున్నాయి. కాకతీయ రాజులు పద్మాక్షి దేవిని పునరుద్ధరించి, స్థాపించడానికి పూర్వం ఇది ఒక జైన 'బసది' (జైన దేవాలయం). ఈ ఆలయంలో జైన తీర్థంకరుల, ఇతర జైన దేవీదేవతలు అద్భుత శిల్పాలున్నాయి. జిల్లాలోని మద్దూరు మండలంలోని బీరాన్ పల్లిలో అంగడి వీరంగుడి అనే జైన దేవాలయం ఉన్నది.

క్రీ.శ.12 వ నుండి 14 వ శతాబ్దం ఈ ప్రాంతం కాకతీయుల ఏలుబడిలో ఉండేది. వారి కాలంలో నిర్మించిన కోట, నాలుగు భారీ రాతి ద్వారాలు, శివుడికి అంకితం చేసిన స్వయంభు ఆలయం, రామప్ప సరస్సు సమీపంలో ఉన్న రామప్ప ఆలయం నేటికీ పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి.

### 1.11. వెయ్యి స్తంభాల ఆలయం

వెయ్యి స్తంభాల ఆలయం హనమకొండ పట్టణంలో ఉన్న ఒక చారిత్రాత్మక హిందూ దేవాలయం. ఇది శివుడు, విష్ణువు, సూర్యులకు అంకితం చేయబడింది. ఈ ఆలయం దక్షిణ భారతదేశంలోని పురాతన దేవాలయాలలో ఒకటి. దీనిని కాకతీయులు నిర్మించారు. ఇది పురాతన కాకతీయ విశ్వకర్మ స్థాపతుల నిర్మాణ నైపుణ్యాలకు అద్భుత తార్కాణంగా నిలుస్తున్నది. క్రీ.శ 1163 లో వెయ్యి స్తంభాల ఆలయాన్ని రాజు రుద్ర దేవుడు నిర్మించాడని చరిత్ర చెబుతున్నది. వెయ్యి స్తంభాల ఆలయం నేల నుంచి ఒక అడుగు ఎత్తైన విశాలమైన ప్లాట్‌ఫాంపై నిర్మించబడింది. ఈ ఆలయంలో అపూర్వమైన శిల్పాలకు ఆలవాలమైన అనేక స్తంభాలు ఉన్నాయి. ఆలయంలోని రాతిలో చెక్కిన ఏనుగులు, జాలీల మాదిరి చెక్కబడిన అలంకరణలు ఈ ఆలయ ప్రత్యేకతలు.

### 1.12. భద్రకాళి ఆలయం

వరంగల్ లోని భద్రాకళి ఆలయం భారతదేశంలోని భద్రకాళి పురాతన ఆలయాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయం హనమకొండ–వరంగల్ మధ్య సుందరమైన భద్రకాళి సరస్సు ఒడ్డున ఉంది. ఆలయ గోడపై ఉన్న శాసనాల ప్రకారం ఈ ఆలయాన్ని ఆంధ్ర దేశంలోని వెంగీ ప్రాంతంపై సాధించిన విజయాన్ని జ్ఞాపకార్థం క్రీ.శ. 625 ప్రాంతంలో చాళుక్య రాజవంశానికి చెందిన రెండవ పులకేశి నిర్మించినట్లు తెలుస్తున్నది. కాకతీయులు నిర్మించిన దేవాలయాలలో సర్వసాధారణంగా కనిపించే వృత్తాకార స్తంభాలకు భిన్నంగా ఈ ఆలయ నిర్మాణంలో చదరపు స్తంభాల వినియోగించడాన్ని మనం చూడవచ్చు.

### 1.13. వరంగల్ కోట

వరంగల్ కోటకు కనీసం క్రీ.శ.13 వ శతాబ్దం నుంచి చరిత్ర ఉన్నట్లు తెలుస్తున్నది. అయితే ఇందుకు కచ్చితమైన సాక్ష్యాలు లభించడం లేదు. తొలత ఉన్న ఇటుక గోడల నిర్మాణాన్ని గణపతి దేవుని కాలంలో క్రీ.శ.1262 లో రాతి నిర్మాణంతో మార్పు చేశాయని చరిత్రకారులు, పురావస్తు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. గణపతిదేవుని వారసులైన రుద్రమదేవి, ప్రతాపరుద్రులు కోట ఎత్తును పెంచి, క్రీ.శ.1323 లో ఎత్తైన ప్రవేశతోరణాలు, చదరపు

బురుజులు, అదనపు వృత్తాకార మట్టి గోడలను జోడించారు. క్రీ.శ. 15 – 17 వ శతాబ్దాల మధ్య మార్పులు జరిగాయి. వరంగల్ పట్టణానికి సమీపంలో ఈ నిర్మాణాల అవశేషాలను నేటికీ చూడవచ్చు. భారత పురావస్తు సర్వే శాఖ ఈ కోటను జాతీయ ప్రాముఖ్యత కలిగిన స్మారక చిహ్నంగా గుర్తించింది.

**1.14. రామప్ప ఆలయం**

రామలింగేశ్వర ఆలయం అని పిలువబడే రామప్ప ఆలయం వరంగల్ నుండి 77 కిలోమీటర్ల దూరంలో ఉంది. దక్షిణ హైదరాబాద్ నుండి 157 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది వెంకటపూర్ మండలంలోని పాలంపెట్ అనే గ్రామంలోని ఒక లోయలో ఉంది. ఈ గ్రామం క్రీ.శ.13– 14 వ శతాబ్దాలలో కీర్తి గడించింది. ఈ రామప్ప ఆలయంలో అనేక నిర్మాణాలు నిర్లక్ష్యం చేయబడి, శిథిలావస్థలో ఉన్నాయి. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎస్ఐ) దీని నిర్వహణ బాధ్యతలు స్వీకరించింది.

**1.15. పాకాల సరస్సు**

అటవీ భూములు, కొండల మధ్య ఉన్న పాకాల చెరువు పర్యాటకులకు చాలా ఇష్టమైన ప్రదేశం. క్రీ.శ 1213 లో కాకతీయ పాలకుడైన గణపతిదేవుని చేత నిర్మించబడిన ఈ సరస్సు 30 చదరపు కిమీ విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఈ సరస్సు ఒడ్డున 839 చదరపు కిమీ విస్తీర్ణంలో ఉన్న పాకాల వన్యమృగ అభయారణ్యం ఉంది. ఇది వివిధ రకాల జంతువులకు ఆశ్రయం కల్పిస్తున్న దట్టమైన అడవి. పులి, చిరుతపులి, ఎలుగుబంటి అరుదుగా కనిపించినా, ఈ అడవిలో స్వేచ్ఛగా తిరుగుతున్న జింకల మందను చూడవచ్చు. పాంథర్స్, హైనాలు, తోడేళ్ళు, అడవి కుక్కలు, నక్కలు, నిల్ గాయ్, ముళ్లపంది, కోతులు, కొండచిలువలు వంటి జంతువులు, మానిటర్  బల్లి, మొసళ్ళు వంటి సరీసృపాలు కూడా ఈ అభయారణ్యం కనిపిస్తాయి. పాకాల వరంగల్‌కు తూర్పున 50 కిలోమీటర్ల దూరంలో ఉంది.

**1.16. మేడారం**

మేడారం వరంగల్ నగరానికి 104 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంది. తాడ్వాయి మండలంలోని మేడారం గ్రామంలో రెండు సంవత్సరాలకు ఒకసారి శ్రీ సమ్మక్క –సారలమ్మ జాతర జరుగుతుంది. అద్భుత శక్తులున్న ఈ దేవతలు సంతానం లేనివారికి సంతానం కలిగిస్తారని భక్తులు విశ్వసిస్తారు.

## 1.17. వ్యాపారం - పరిశ్రమలు

### 1.17.1. IT / ITES హార్డ్వేర్

2001 లో సాఫ్ట్వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా తన శాఖను ఎన్ఐటి వరంగల్ ప్రాంగణంలో సింగిల్ విండో సౌకర్యాలు, ఐటి, ఐటిఇఎస్ కంపెనీలు మరియు హార్డ్వేర్ పార్కులకు ఫాస్ట్ ట్రాక్ అనుమతులు జారీ చేయడానికి ప్రారంభించింది, తద్వారా ఐటి / ఐటి ఆధారిత సేవల పార్కులను సులభంగా ఏర్పాటు చేసుకోవచ్చు. వరంగల్ మెట్రోపాలిటన్ ప్రాంత శివార్లలోని మడికొండ / రాంపూర్ ప్రాంతంలో ఎపిఐఐసి మరియు కె రహేజా గ్రూప్ కూడా ఐటి సెజ్ ఏర్పాటు చేశాయి. సింగరేని కాలరీలు జిల్లాలోని ఉత్తర భాగంలో విస్తారమైన బొగ్గు క్షేత్రాలను కలిగి ఉన్నాయి.

### 1.17.2. వస్త్రపరిశ్రమ

వరంగల్ జిల్లా పత్తి ఉత్పత్తికి ప్రసిద్ధి చెందింది. ఇక్కడ కాటన్ జిన్నింగ్ చేసి, ముంబై, కోయంబత్తూర్ వంటి ప్రదేశాలకు సరఫరా చేస్తారు. ఈ ప్రదేశం పురాతన కాలం నుంచి వస్త్ర ఉత్పత్తికి ప్రసిద్ధి చెందింది, నిజాం పాలకులు ఆరంభించిన అజామ్ జాహి స్పిన్నింగ్ మిల్లులు నిర్వహణలోపం కారణంగా మూసివేయబడ్డాయి. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఇటీవల వరంగల్లో జనపనార వస్త్ర పార్కును స్థాపించింది

### 1.17.3. ఆహార ప్రాసెసింగ్

వరంగల్ జిల్లా ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయపు ప్రాంతీయ పరిశోధనా కేంద్రానికి నిలయం. ఈ జిల్లా ఎర్ర కారం ఎగుమతులకు ప్రసిద్ధి చెందింది. మిరప ఎగుమతుల్లో ఎక్కువ భాగం నాగ్పూర్, ముంబై, పూణేలకు వెళుతుంది. జిల్లాలో పుచ్చకాయ, మస్క్ పుచ్చకాయలను బాగా పండిస్తారు. నెక్కొండ, డోర్నకల్, తొర్రూర్, మహబూబాబాద్ మామిడి తోటలకు ప్రసిద్ధి. ఇక్కడి నుంచి విశాఖపట్నం, చెన్నై, విజయవాడ, బెంగళూరు, నాగ్పూర్, హైదరాబాద్లకు కూరగాయలను సరఫరా చేస్తారు..

## 1.18. రవాణా

### 1.18.1. రోడ్

హైదరాబాద్–భోపాల్పట్నం (ఛత్తీస్గఢ్) మధ్య ఉన్న జాతీయ రహదారి 202 మహబూబాబాద్, జనగాం, ఖాజీపేట్, హనమకొండ, ములుగు, ఏటూరునాగారంలకు రావాణా సౌకర్యాన్ని కలగజేస్తున్నది. వరంగల్ కు 30 కిమీ దూరంలోపే భూపాలపల్లి, పరకాల, నర్సంపేట్, తొర్రూరు, జనగాం వంటి పట్టణాలున్నాయి. తెలంగాణ రాష్ట్ర

రాజధాని హైదరాబాద్ నుండి వరంగల్ రహదారి ద్వారా 140 కి.మీ. దూరంలోనే ఉన్నది.

### 1.18.2. రైల్వే

వరంగల్‌లో వరంగల్, ఖాజీపేట అనే రెండు రైల్వే స్టేషన్లు ఉన్నాయి. ఇవి దక్షిణ మరియు ఉత్తర భారతదేశాలను కలుపుతాయి. ఖాజీపేట్ జంక్షన్ సికింద్రాబాద్- బల్హార్షా లైన్ మరియు సికింద్రాబాద్-విజయవాడ లైన్ రెండింటిలో ఉంది.

### 1.18.3. విమానాశ్రయం

హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరంగల్ పట్టణం నుండి రహదారి ద్వారా 3 1/2 గంటలు దూరంలో ఉంది. వరంగల్ జిల్లాలోని మమ్నూరులో ఒక చిన్న విమానాశ్రయం ఉంది. ఇది చిన్న విమానాలకు మాత్రమే ఉపయోగపడుతుంది. ఈ విమానాశ్రయాన్ని ప్రస్తుతం పోలీసులు ఉపయోగిస్తున్నారు.

### 1.19. ఉత్సవాలు - కళలు

వరంగల్ జిల్లా సమక్క సారలమ్మ జాతరకు ఆతిథ్యం ఇస్తుంది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ జాతరకు వరంగల్ బస్ స్టాండ్ నుండి 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న గ్రామమైన తాడ్వాయి చుట్టూ మూడు రోజులలో సుమారు కోటిమంది భక్తులు వస్తారు. ఈ జాతర ఒక అన్యాయమైన చట్టంపై పాలకులతో జానపదులైన తల్లికుమార్తె చేసిన సాహసోపేతమైన పోరాటాన్ని గుర్తుచేస్తుంది. అలాగే వరంగల్ లలిత కళలు, సాహిత్యానికి కాణాచి. జానపద కథల నుండి పాడటం, నృత్యం, పెయింటింగ్, కవిత్వం మరియు చలనచిత్రాల ఆధునిక కళల వరకు అనేక కళారూపాలు ఈ ప్రాంతంలో వృద్ధి చెందాయి.

### 1.19.1. విద్య

వరంగల్ ఉత్తర తెలంగాణలో విద్యా కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. వరంగల్ లోని విద్యాసంస్థలకు జాతీయ ప్రాముఖ్యత ఉంది. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వరంగల్ గతంలో రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ. ఈ వరంగల్ ఎన్ఐటి లేదా ఎన్ఐటివిడబ్ల్యు ఒక ప్రభుత్వరంగ ఇంజనీరింగ్ విద్యాసంస్థ. ఇది భారతదేశంలో స్థాపించబడిన 17 ప్రాంతీయ ఇంజనీరింగ్ కళాశాలలలో మొదటిది. ఇది 1959 లో అప్పటి ప్రధాని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ చేత స్థాపించబడింది. ఈ సంస్థను సెప్టెంబర్, 2002లో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీగా మార్చారు. ఒకరిద్దరు

వరంగల్ విద్యార్థులు తప్ప మిగతా విద్యార్థులంతా భారతదేశంలోని ఇతర రాష్ట్రాల నుండి, ముఖ్యంగా ఉత్తర భారత రాష్ట్రాల నుండి, పాలస్తీనా, జోర్డాన్, సుడాన్, ఎరిత్రియా వంటి దేశాల నుండి వచ్చిన విదేశీ విద్యార్థులే. వరంగల్‌లోని ఎన్ఐటి భారతదేశంలో 3వ ఉత్తమ ఎన్ఐటి. ఈ రోజు ఇది జాతీయ ప్రాముఖ్యత ఉన్న విద్యాలయంగా నిలిచి ఇంజనీరింగ్, టెక్నాలజీ, బేసిక్ సైన్సెస్, మేనేజ్‌మెంట్‌లో బాచిలర్స్, మాస్టర్స్ మరియు డాక్టరల్ డిగ్రీలను ప్రదానం చేస్తున్నది.

ఇవికాక కాకతీయ వైద్య కళాశాల, కాకతీయ విశ్వవిద్యాలయం, పారిశ్రామిక శిక్షణ సంస్థ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఆయుర్వేద వైద్య కళాశాల, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, ఇన్స్టిట్యూట్ ఫర్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ వంటి ఉన్నత విద్యాసంస్థలు, వందలాది ఉన్నత పాఠశాలలు, కళాశాలలు వివిధ స్థాయిల్లో విద్యను అందిస్తున్నాయి.

## 1.20. వరంగల్ జిల్లా జానపద కథలు – కళాకారులు

వరంగల్ జిల్లా ప్రజల వికాసంలో ఒగ్గు కథలు భాగమయ్యాయి. ఇవి జనజీవన సంస్కృతికి ప్రతిబింబాలు. జీవన సమరంలో సుఖదు:ఖాలను బాణీలుగా చేసుకుని వెలిసిన జానపదాలు విజ్ఞాన, వినోదాలను పంచేవిగా ఉన్నాయి. జానపదం అంటే పల్లె, పల్లె జనాలు పాడుకునే పాటలు, ఆటలు, నృత్యాలు, సామెతలు ఈ కోవకిందకు వస్తాయి.

జానపద వాఙ్మయం అంటేనే మౌఖికంగా వచ్చేది.. కవి, రచయిత, సంగీతకారుడు అంటూ వుండరు. అక్కడికక్కడే ఒక సన్నివేశాన్ని, సంఘటనను ప్రతిఫలింపచేసే విధంగా రాగాన్ని కూర్చుకుంటూ పాడేయగల జానపద కళాకారుడు ధన్యజీవి. అవసరాన్ని, సందర్భాన్ని బట్టి ఆశువుగా వచ్చే భావప్రకటనే జానపద గేయం. జానపదుల అనుభూతి వారి హృదయాల నుంచి అప్రయత్నంగా అతి సహజంగా పుట్టిన ఈ పాటల్లో సహజత్వం ఉంటుంది. వీటిని పెంచి పోషించవలసిన బాధ్యత అందరిపైన ఉన్నది. ఎటువంటి భాషా భేషజాలకు పోకుండా జానపదుల సాహిత్యాన్ని మన నిత్య జీవనంలో భాగం చేసుకుంటే అది మన భాషా సంస్కృతులకు ఎంతో మేలు. జానపద సాహిత్యం జీవితమంత విశాలమైనది. జానపద విజ్ఞానంలో చేరని విషయమంటూ ఏదీ లేదు. లోక వ్యవహారంలోని ప్రతి అంశాన్ని జానపద సాహిత్యం స్పృశిస్తుంది. మానవ సంస్కృతిలో శిష్ట సంస్కృతిని వేరు చేస్తే మిగిలినదంతా జానపద సంస్కృతిలో భాగమే.జానపద సాహిత్యంలో తరచుగా ద్విపద ఛందస్సు, మరికొద్ది తాళగతుల్లో సాగుతూ వుంటాయి. వీటిలో సంగీతపు పాండిత్యం

కంటే, తాళగతులకే ప్రాముఖ్యం. తాళం కోసం హ్రస్వాక్షరాలు పొడుగు చేయటం, దీర్ఘాక్షరాలను పొట్టి చేయటం ఉంటుంది. మరొక విశేషం ఏమంటే.. ఈ పాటలు పుట్టిన సామాజిక వర్గాన్ని బట్టి భాషలో, భావంలో తేడాలుంటాయి. పంట పొలాలు, పండుగలు, పూజలు, పేరంటాలు, పెళ్ళిళ్ళు, చావులు, పుట్టుకలు వంటి అనేక నిత్య కృత్యాలన్నీ జానపద గేయాలకు మూలాలు.

జానపద వాఙ్మయం జానపద విజ్ఞానంలో ఒక భాగం. 'ఫోక్‌లోర్' అనే పదానికి 'జానపద విజ్ఞానం' సమానార్థక పదం. 'ఫోక్ లిటరేచర్' అనే పదానికి తెలుగులో 'జానపద సాహిత్యం', 'జానపద వాఙ్మయం' అనే పదాలను సమానార్థాలుగా వాడుతున్నారు. జానపద కథా గేయాల విషయంలో పాల్కుర్కి సోమనాథుడు రచించిన 'బసవ పురాణం' మనం ప్రామాణికంగా భావిస్తాం. 12,13 శతాబ్దులకు సంబంధించిన ఇతర కవులు, అలంకారికులు, లలితకళా విద్వాంసులు కూడా జానపద గేయాల అస్తిత్వాన్ని ప్రస్తావించటం గమనార్హం. జానపద కథా గేయాలు జనజీవన స్రవంతిలో లీనమై జాతి జీవికకు జీవనాడి వంటివి. జానపద గేయం వివిధ శాఖోపశాఖలుగా వ్యాపించింది. వీటిని పండితులు వివిధ దృక్కోణాల్లో వర్గీకరణ చేశారు.

వీరిలో ఆచార్య బి.రామరాజు, హరి ఆదిశేషువు, ఆచార్య నాయని కృష్ణకుమారి, నేదునూరి గంగాధరం ముఖ్యులు. జానపద గేయ వర్గీకరణ వస్తు, రస, సన్నివేశం మొదలగు అంశాలను దృష్టిలో పెట్టుకుని వర్గీకరించటం జరుగుతున్నది. ఈ వర్గీకరణ ప్రకారం మొత్తం జానపద గేయాలను 1. కథాసహితములు, కథా రహితములు. 2. స్త్రీల పాటలు, పురుషుల పాటలు, స్త్రీ, పురుషులు కలసి పాడుకునేవి, పిల్లల పాటలు. 3. రసప్రధాన వర్గీకరణ. 4. శ్రామిక గేయాలుగా విభజించారు. కథాసహితములు: ప్రపంచ కథావాఙ్మయంలో తెలుగు గేయగాథ శాఖకు పటిష్టమైన స్థానమున్నది. జీవితంలోని వివిధ దశలకు సంబంధించిన పనులకు లేక కార్యక్రమాలకు సంబంధించి వుంటాయి. బాలనాగమ్మ కథ, సన్యాసమ్మ కథ, పల్నాటి వీర చరిత్ర, కాటమరాజుకథ మున్నగునవి ఉదాహరణలుగా చెప్పవచ్చు. ఈ వర్గీకరణలో సంఘజీవనం ప్రస్ఫుటంగా కానవస్తుంది.

**కథారహితములు:** వీటిలో ఏదో ఒక సన్నివేశమో, కల్పనో, చిన్న ఘట్టమో తీసుకున్న చిన్న గేయాలుగా పేర్కొనవచ్చు. ఉదాహరణకు– గుమ్మడిపాట, శ్రీకృష్ణజననము, గంగా గౌరి సంవాదము, గోంగూర పాట, కోలాటం పాట మున్నగునవి. వీటిలో పాట

పూర్తయ్యే వరకు తీసుకొన్న ఊత పదాలు కానవస్తాయి. ఉదాహరణకు– ఎల్లోయల్ల, హైలెస్సా వంటి పదాలు గేయం పూర్తయ్యేవరకు కనిపిస్తాయి.

**స్త్రీల పాటలు:** స్త్రీ తన జీవితానికి సంబంధించిన వివిధ దశల్లోని అవస్థలను పాటలుగా పాడుకొంటారు. అత్తా కోడళ్ళ వెక్కిరింతలు ఈ విధంగా ఉంటాయి.

**ఉదా:–** 'కోడలా కోడలా కొడుకు పెళ్ళామా.. ఓయమ్మా/ కొడుకూళ్ళోలేదు మల్లెలెక్కడివే ఆ..వూ'బీ 'సూదులంటి సన్నాబియ్యం సిమడ బెడితివె కోడలా/ నువ్వు సిమడాబెడితివే కోడలా! వారుపుకొస్తే వంచవద్దని నీకెవ్వరు చెప్పారత్తమ్మో/ నీకెవ్వరు చెప్పారత్తమ్మో!'అంటూ ఈ పాటలు సాగుతాయి.

**పురుషుల పాటలు:** పురుషులకు సంబంధించిన వివిధ వృత్తులను అంశాలుగా తీసుకుని రచిస్తారు. శ్రామిక గేయాలు, కార్మిక గేయాలు, క్రీడా గేయాలు, వ్యవసాయ గేయాలు, వివిధ చేతి వృత్తుల పాటలు ఈ కోవలోకి వస్తాయి. అలాగే మోటపాటలు, ఏతాం పాటలు, బండిపాటలు, మంచె పాటలు, కోలాటం పాటలు, భజన పాటలు మొదలైనవి ఈ రంగానికి చెందుతాయి. లాలిపాటలు కూడా ఈ కోవలోకే వస్తాయి.

'గొల్లవారి వాడలకు కిష్ణమూర్తి
నీవు ఏపని కొచ్చావు కిష్ణమూర్తి
పాలకోసమొచ్చినానె గొల్లభామ
మంచి పాలుపోసి నన్నుబంపు గొల్లభామ
కొత్త కోడలినోయి కిష్ణమూర్తి

నీవు అత్తగారి నడగవోయి కిష్ణమూర్తి అంటూ చమత్కారంగా పాడుకొంటారు. 'అదిగో భద్రాద్రి గౌతమి అదిగో చూడండి', అంటూ చిడతలతో వేసే కోలాటం వేసేవాళ్ళకే కాకుండా చూసేవాళ్ళకు కూడా మంచి ఊపును కలిగిస్తాయి.

**స్త్రీ, పురుషులు కలసి పాడుకునేవి:** పంట కోతల సమయంలోను, వయసుకు వచ్చిన బావా మరదళ్ళు, కుర్రాళ్ళ కొంటె పాటలు మున్నగునవి ఈ సామూహిక గేయాల కోవలోకి వస్తాయి. మంచి డప్పు వాద్యంతో రక్తి కట్టిస్తారు. 'నాయుడోళ్ళింటికాడ నల్ల తుమ్మ చెట్టుకాడ నాయుడేమన్నాడే పిల్లా', 'వత్తావటే పిల్లా వత్తావటే కొత్త కోరంగిదాక వత్తావటే' మొదలైన శృంగార పాటలు ఎక్కువగా ఉంటాయి.

**పిల్లల పాటలు:** పిల్లల పాటలను పిల్లలే స్వయంగా పాడుకునేవి లేదా తల్లులు పిల్లలకోసం పాడేవి. పిల్లలు మారాం చేసేటప్పుడు సముదాయించే పాటలు, లాలిపాటలు, జోలపాటలు

మొదలైనవి తల్లులు పిల్లలకోసం పాడేవి.

**రసప్రధాన గేయాలు:** జానపద గేయాల్లో నవరసాలకు సంబంధించినవి కనిపిస్తాయి. వీరం, రౌద్రం, శృంగారం, హాస్యం ఇలా అన్ని రకాల గేయాలు గోచరిస్తాయి. శ్రీకృష్ణుని శృంగార చేష్టలను వివరించే గేయాలు ప్రధానంగా కనిపిస్తాయి. అంతే కాకుండా ప్రేయసీ ప్రియులు, భార్యా భర్తలు, వదినా మరుదులు వంటి వాటికి కూడా ప్రముఖ స్థానం వుంది. హాస్యగేయాలలో అత్తా అల్లుళ్ళ మధ్య, భార్యా భర్తల మధ్య హాస్య గేయాలు అనేకం లభిస్తాయి. రాజుల వీరత్వాన్ని వివరించే గేయాలు వీర, రౌద్ర రసానికి సంబంధించినవి. మహాకవి భవభూతి 'కరుణ రసమొక్కటే ప్రధాన రస'మని వ్యాఖ్యానించాడు.

**శ్రామిక గేయాలు:** వ్యవసాయానికి, కర్మాగారానికి, ఇతర సేవకా వృత్తికి సంబంధించిన గేయాలు శ్రామిక గేయాల కోవలోకి వస్తాయి.

**జానపద కళలు:** భారత గ్రామీణ ప్రాంతంలో ఇవి ఎక్కువ ప్రాచుర్యం కలిగిఉన్నాయి. ఉరుము నృత్యము, ఒగ్గు కథ, కోలాటం, గౌరవయ్యలు, జ్యోతినృత్యం, తెలుగునాట సోది చెప్పడం, తెలుగునాట జానపద ఉడుపు పాటలు, తోలుబొమ్మలాట, పగటి వేషాలు, బుట్టబొమ్మలు, బుర్రకథ, యక్షగానం, రికార్డింగ్ డాన్స్, హరికథ–హరిదాసు, డప్పు, తప్పెట గుళ్ళు, జముక గిరిజ నృత్యము, లంబాడీ, బోనాలు, ధింసా, కత్తిసాము, కర్రసాము, కొమ్ము కథ, కొమ్ముల నృత్యం లేదా రేలా నృత్యం, గరగలు, గరిడి, గాన కళారూపం ఒగ్గు కథ, గొండ్లి నాట్యం, గొల్ల సుద్దులు, చెక్కభజన, చిందు యక్షగానం, చెంచు భాగవతం, చెక్కబొమ్మలాట, జడకోలాటం (కులుకుభజన), జిక్కికి, తంబుర (కడ్డీ తంత్రి), పగటి వేషాలు, పల్లెసుద్దులు, పులివేషాలు, పొంబల వాయిద్యం, మరగాళ్ళు, రాయలసీమ కొరవయ్యల నృత్యం, లవకుశల, వగ్గుడోళ్ల విన్యాసం, వీధి బాగోతం, వీరనాట్యం, వీరభద్ర విన్యాసం, శ్రీ కాళీమాత నృత్యం, కోయ నృత్యము, బుడబుక్కల పాట, గంగిరెద్దులు వారు, బుట్ట పాములు ఆటవారు, చెంచు వారి పాటలు, జంగాల వారి పిట్టకథలు, మానవుడి మనోవికాసానికి, వినోదానికి, మంచి నడవడికి జానపద కళారూపాలు ఆలంబనగా నిలిచాయి. సినిమాలు, టివిలు లేని ఆ రోజుల్లో ఈ వృత్తి కళాకారుల ప్రదర్శనలకు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. అలిసిపోయిన పల్లె ప్రజలకు వీరి ప్రదర్శనలు సేదతీర్చేవి.

కళలను నమ్ముకుని జీవనం సాగించిన కళాకారులకు నేడు ఆదరణ కరవవ్వడంతో

కళలను నమ్ముకోలేక, నమ్ముకున్న కళలు కూడు పెట్టక దుర్భర జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం నాటి కళలను, కళాకారులను రక్షించుదామని ప్రకటనలు చేస్తున్నారే తప్ప ఆదుకునేందుకు చర్యలు మాత్రం తప్పడం లేదు. దేశీ సంస్కృతిని, వారి అలవాట్లను పుణికిపుచ్చు కుంటున్న నేటి తరం నాటి జ్ఞాపకాలను, కళలను పట్టించుకునే అవకాశం లేకుండా పోతోంది. గ్రామాల్లో జానపద కళాకారులు వివిధ రకాలైన ప్రదర్శనలు ఇచ్చేవారు. వీరు నాటి రాజుల చరిత్రను, భాగవతం, రామాయణం, హరికథలతో పాటు, పద్యాల రూపంలో అందులో విషయాలను వివరించేవారు. రామాయణ, మహాభారతం, భాగవతంలోని సారాంశాన్ని ప్రజలకు వివరిస్తూ ప్రజలు ఇచ్చే తృణమో, పణమో తీసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. బుడగ జంగాలు, గంగిరెద్దులవాళ్లు, చెంచులు సగం రాత్రివాళ్లు, జంగాలు, పాముల వాళ్లు, హరికథా దాసులు, ఎర్రగోళ్లు వారు ఇలా చెప్పుకుంటూ చాలా మంది జానపద పాటలను, వేదాల్లోని సారాంశాన్ని పాటల ద్వారా పలికిస్తూ జీవనం సాగించేవారు.

**సాంస్కృతిక కళలు:** గంగిరెద్దులు వాళ్లు సంక్రాంతి వచ్చిందంటే గ్రామాల్లో ఎద్దులను ఇంటింటికి తిప్పుతూ, పాటలతో సారాంశాన్ని చెబుతూ భిక్షాటన చేసేవారు. హరికథా దాసులు కూడా అంతే. సగం రాత్రి వాళ్లు కూడా వేకువ జామున గ్రామాల్లో తిరుగుతూ భిక్షాటన చేసేవారు.

జానపద, సాంస్కృతిక కళలు, కళా రూపాలు మానవ శ్రమ నుండి పుట్టి పురుడు పోసుకొన్నవే. మానవ వికాసానికి, శ్రమ నుంచి సేద తీరడానికి కళలను శ్రమజీవులే సృష్టించుకున్నారు. ప్రకృతిలో విహరిస్తూ పాటలు అల్లిన కష్టజీవులు, చెట్టు నుండి పుట్టవరకు అన్నింటిని తమ జానపదంలో శిల్పంగా తీర్చిదిద్దారు. ఇదే సమయంలో అనేక ప్రాంతాలకు బతుకు తెరువు కోసం సంచరించిన సంచార జాతులు అనేక ప్రాంతల సంస్కృతులను, సాంప్రదాయాలను పాటలుగా అల్లి సమాజానికి జ్ఞానాన్ని అందించారు. ఇదే కోవలో వృత్తి కులాల వారైన గొర్రెల కాపర్లు, గొల్ల కుర్మలు అడవిలో సంచరిస్తూ ప్రకృతిని వర్ణిస్తూ 'ఒగ్గు కథ'ను సృష్టించారు. సుక్క సత్తయ్య, మిద్దె రాములు వంటి కళాకారులు ఒగ్గుకథను ప్రపంచానికి పరిచయం చేసి దేశానికి కీర్తిప్రతిష్టలు అందించారు. ఒగ్గు కథలను పుస్తక రూపంలో మారిస్తే వేల పేజీల పుస్తకాలుగా ముద్రించవచ్చు. ఇందులో ఎన్నో పదాలు, ఎన్నో పద ప్రయోగాలు, కమనీయమైన ప్రజల వాడుక భాష, తమ దేవతల గొప్పదనం, తమ పూర్వీకుల త్యాగాలు, వీర గాథలు కళ్లకు కట్టినట్టు నాట్య

మాడుతాయి.

ఇదే కోవలో చిందు భాగవతం తెలంగాణలో ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. చిందు ఎల్లమ్మవంటి వారు ప్రపంచ వేదికలపై తమ కళను ప్రదర్శించారు. దేశీయ కవి అంబాల మల్లగౌడ్ తెలంగాణ ప్రాంతం నుండి జానపద కళలను వెలికి తీయడానికి ఎంతో ప్రయత్నించి డోలు విన్యాసం, డప్పుల నృత్యం, భాగవతం, కోలాటం వంటి కళలను ప్రపంచ కళావేదికలపై పరిచయం చేశారు. అదే విధంగా ఎన్నో భాగవత రచనలు చేసి ఇక్కడి దేశీయ సంస్కృతిని ప్రతిబింబించారు. శ్రమైక జీవనం నుంచి ఆవిష్కరించిన ఈ కళలు అనేక రూపాలుగా విలసిల్లి వర్ధిల్లాయి. సంస్కృతి సత్సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను ప్రతిబింబిస్తూ దేశ విదేశాల్లో గుర్తింపు పొందాయి.

అదే సందర్భంలో ఈ సాంస్కృతిక కళలనే వృత్తిగా జీవనం చేసుకొని బతుకుతున్నవారు అనేకమంది. జానపద కళారూపాలను వారే సజీవంగా కాపాడుతున్నారు. అంతే కాకుండా సమాజంలో నడిచే జీవన విధానాన్ని, పూర్వీకుల చరిత్రను, కుల పురాణాలను చెబుతూ ఒక సూత్రబద్ధమైన జీవన విధానానికి అలవాటు పడే విధంగా వీరి కళలు తోడ్పడ్డాయి. మానవుడి మనోవికాసానికి, వినోదానికి, మంచి నడవడికి జానపద కళారూపాలు ఆలంబనగా నిలిచాయి. సినిమాలు, టి.వి.లు లేని ఆ రోజుల్లో ఈ వృత్తి కళాకారుల ప్రదర్శనలకు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. అలిసిపోయిన పల్లె ప్రజలకు వీరి ప్రదర్శనలు సేదతీర్చేవి. వీటిని ప్రోత్సహించేది కూడా ప్రధానంగా గ్రామాల్లో రైతాంగం, చేతి వృత్తి దారులు, గిరిజనులు, దళితులే. నేడు వ్యవసాయ సంక్షోభంవల్ల, ప్రపంచ పరిణామాల ప్రభావం వల్ల చేతివృత్తులు దెబ్బతిన్నాయి. కరవు కాటకాలు మన జానపద రూపాలను క్షీణదశకు తీసుకువచ్చాయి. ప్రధానంగా గ్రామీణ ప్రజానీకంపై ఆధారపడ్డ సాంస్కృతిక వృత్తులు నేడు అంతరించి పోతున్నాయి. ఇప్పటి వరకు ప్రభుత్వం కూడా మన జానపద సాంస్కృతిక వృత్తులను కాపాడడంలో కపట ప్రేమనే చూపుతోంది. అయినా గ్రామాల్లో ఈ వృత్తి కళాకారులు కూలీ, నాలి చేసుకుంటూ ప్రదర్శనలు ఇస్తూనే ఉన్నారు. ఊపిరి ఉన్నంతకాలం జానపద కళారూపాలను కాపాడుకుంటాం. ముందు తరాలకు మా వృత్తి కళలను అందిస్తాం అంటూ ఈ వృత్తి కళాకారులు ఇప్పటికీ ధీమాగా ఉన్నారు.

విశిష్టమైన తెలంగాణ జానపద కళారూపాల ప్రదర్శనే ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన

సమ్మక్కా సారలమ్మ "జానపద జాతర"లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ప్రదర్శనలు, బంజారా నృత్యం, బతుకమ్మ ఆటలు, కోలాటం (పురుషులు, మహి ళలు) ప్రదర్శన, డప్పులు, ఒగ్గు కథ, తోలు బొమ్మలాట, గుస్సాడి, చిరుతల భజన, బైండ్ల కథలు, శారద కథలు, పోతురాజుల ప్రదర్శన, దింసా, చిందు యక్షగానం, అడుగుల భజన కళారూపాల ప్రదర్శనలు అతిథులను, ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

| వరంగల్ జిల్లా జానపద కథలు | గానం చేసేవారు | మండలం పేరు |
|---|---|---|
| కాటమరాజు కథ | కొమ్ముల వారు | వరంగల్ – హన్మకొండ |
| మాతృదేవత కథ | బవనీలు | వర్ధన్న పేట, పర్వతగిరి |
| మల్లన్న కథ | బీరప్పులు | హసన్ పర్తి, సంగెం |
| పోచమ్మ కథ | బవనీలు | గీసు కొండ, |
| పోలమ్మ కథ | బవనీలు | పరకాల, దుగ్గొండి, నర్సన్నపేట్ల |
| ఎల్లమ్మ కథ | బవనీలు | చెన్నారావు పేట,నెక్కొండ,ఖానాపురం |
| మాందాత కథ | బవనీలు | నల్లబెల్లి, శాయం పేట, ధర్మ సాగర్ |
| సర్వాయిపాపని కథ | బవనీలు | స్టేషన్ ఘన్ పూర్,జఫర్ గడ్, పాలకుర్తి |
| సదాశివారెడ్డి కథ | శారదకాండ్రు | రాయపర్తి, రఘునాథపల్లి, నర్మెట్ |
| కన్యకా పరమేశ్వరి కథ | వీరముష్టివారు | ఖాజిపేట, దామెర |
| రెడ్లు, కాపుల కథలు | పిచ్చుక కుంట్లు | భీమదేవర పల్లీ, ఎల్కతుర్తి |
| శెట్టి కథలు | పంబవారు | కమలాపురం, జమ్మికుంట |

**ఒగ్గుకథ:** శివుని ఢమరుకాన్ని పోలిన ఒగ్గు వాద్యాన్ని వాయిస్తూ కథను చెప్పుతారు. ఈ కథను చెప్పే, వాయిస్తూ ఉన్న వాళ్ళని ఒగ్గు వాళ్ళు అంటారు. వీరు గొల్ల/కురుమ కులానికి ఉపకులస్థులు. వీరు గొల్లవాళ్ళు చేసుకునే బీరన్న పండుగకు పూజారులుగా ఉంటారు. వీరు అన్ని కాలాలలో కాల ప్రసక్తిలేకుండా అందరికి కథలు చెపుతారు. పండుగలు, పెండ్లిళ్ళు, చావులు, దినాలు, మొదలైన సందర్భాలలో వీరు కథలు చెపుతుంటారు. సంక్రాంతి నెలముందు నుండి సంక్రాంతి వరకు, శివరాత్రి నుండి దసరా వరకు పట్నాలు వేసి కథలు చెపుతారు. పట్నాలు వేసి కథ చెప్పడాన్ని పట్టి పండుగ అంటారు. బీరన్న, మల్లన్న, ఎల్లమ్మ మొదలైన దేవతలకు పూసపలక, చక్రాలపలక అనే రెండు రకాల పలకలతో పట్నాలు వేస్తారు. ఈ పీలకల కొయ్యతో, చతురస్రాకారంలో, దీర్ఘ చతురస్రాకారంలో చక్రాల డిజైన్ చెక్కబడి ఉంటుంది. ఈ పలకలలో చతురస్రాకారంలో

పసుపు, కుంకుమ, తెల్లపిండి, పచ్చ మొదలైన రంగులతో పట్నాలు చేస్తారు. ఐదుగురు పురుషులు ఒక జట్టుగా ఉండి, ఒకరు ప్రధాన కథకుడు, ఇంకొకరు కథా సహాయకుడు, మిగిలిన ముగ్గురు వాద్యాలు వాయిస్తూ కథ చెపుతారు. వీరు వాయించే వాద్యాలు డోలు, తాళాలు, ఒగ్గు కనకడప్పు, కంజరీ, ఒగ్గు వాద్యాన్ని బీరన్న ఎల్లమ్మ పండుగలప్పుడు పట్నాలు వేసినప్పుడు వాయిస్తారు. కనకడప్పు అప్పు డప్పుడు వాయిస్తారు. వీరు చెప్పే కథలు మల్లన్న కథ, బీరన్న కథ, ఎల్లమ్మ కథ, కాటమరాజుకథ, మార్కండేయ పురాణం, మండోదరి కథలు చెపుతారు. కథ ప్రారంభంలో గణపతి, గ్రామ దేవతను ప్రార్థిస్తారు. కథ ముగిసిన తర్వాత మంగళంతో ముగిస్తారు. ఈ కథలో సిద్ధ హస్తులు చుక్క సత్తయ్య, మిద్దె రాములు. ఈ ఒగ్గు కథకు వరంగల్, నల్లగొండలలో కళాకారులు ఎక్కువ.

**శారదకాండ్రు:** శారదకాండ్రు అనే జానపద కళాకారులు కేవలం తెలంగాణాలోనే కనిపిస్తారు. వీరు ఎక్కువగా వరంగల్ ప్రాంతంలో ఉన్నారు, బుర్రకథ వాద్యకారులు, శారద కథకులకు మధ్య పెద్ద వ్యత్యాసమేమీ కనిపించదు. బుర్రకథకుల మాదిరిగానే వీరు కూడా దక్కీలను ఉపయోగిస్తారు. వీరు ఉపయోగించే తంబురాను 'శారద' అంటారు. అందువల్ల వీరికి శారదకాండ్రు అనే పేరు వచ్చింది. ఈ కళాకారులు వీరికి సంబంధించిన వారు కొత్తూర్ మండలంలో ఉండేవారని, అక్కడ నుండే తెలంగాణ ప్రాంతాలకు వెళ్ళేవారని చెబుతున్నారు.

**గంగిరెద్దులాట:** ఇది తెలంగాణ రాష్ట్రంలో ఒక చక్కని జానపద కళ. సాధారణంగా పూజగొల్ల కులానికి చెందినవారు గంగిరెద్దులను ఆడిస్తారు. వీరు ఎద్దును చక్కగా అలంకరించి, ఊళ్లలో తిరుగుతూ దాన్ని ఆడిస్తారు. వీరు ప్రధానంగా భిక్షాటన ద్వారా జీవనం సాగిస్తారు. ఒక గంగిరెద్దుతో పాటు ముగ్గురు వ్యక్తులు ఉంటారు. వీరిలో ఒకరు గంగిరెద్దును అడిస్తే మరో వ్యక్తి డోలు వాయిస్తాడు. మూడో వ్యక్తి సన్నాయి వాయిస్తాడు. ఇది గ్రామస్థులకు మంచి వినోదం. సాధారణంగా వీరు డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఎక్కువగా కనిపిస్తారు. వీరు వరంగల్‌జిల్లా అంతటా కన్పిస్తారు.

**సాధనాశూరులు:** వీరు ప్రదర్శనలను అందరికీ ప్రదర్శిస్తారు పద్మశాలీలను మాత్రమే యాచిస్తారు. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి సంచరిస్తూ ప్రతీ గ్రామంలోని పద్మశాలీల అనుమతితో వీరు ప్రదర్శనను ప్రారంభిస్తారు. వీరి ప్రదర్శన పగటివేళ జరుగుతుంది. కావున దీనిని పగటి వేషంగా భావించవచ్చు. వీరి ప్రదర్శన ఇంద్రజాలానికి సంబంధించినది. ప్రదర్శన కాలం సుమారు మూడు గంటల వరకు ఉంటుంది. వీరి

రంగస్థలం గ్రామ కూడలిలో ఉన్న విశాల స్థలంలో ఉంటుంది. వీరి కళారూపాల సాధనకు ఎంతో నిష్ఠ అవసరమంటారు. వీరి ప్రదర్శనలో ఇద్దరు వ్యక్తులు రెండు పళ్లేలు తీసుకుని ఏదో ఆకు పసరు పూసుకుని దూరంగా నిలబడతారు. వారి చేతులకున్న ఆకు పసరు ప్రభావం వల్ల వారి. చేతుల్లోని పళ్లాలు ఒక్కసారిగా పైకెగిరి రెండూ కొట్టుకుని మరలా యథాస్థానానికి చేరుకుంటాయి. ఇలా అనేక అద్భుతాలను ప్రదర్శిస్తారు. మాడ్గూల్ మండలంలో వీరి పూర్వీకులు ఉండేవారని, ఈ కళకు అంతగా ఆదరణ లేక ఈ కళాకారులు వలసలు వెళ్ళేవారని చెపుతారు.

**చోడిగాని కలాపం:** ముఖ్యంగా దసరా ఉత్సవాల్లో ప్రదర్శించే విచిత్ర వేషాల్లో పోలిగాడివేషం ఒకటి. ఈ పోలిగాడిని చోడిగాడని, పోడిగాడని, సింగడని వేరువేరు ప్రాంతాల్లో వేరువేరు పేర్లతో పిలుస్తుంటారు. సోలిగాడు వంకర దుడ్డుకర్రతో ప్రవేశించి పిల్లలందరిని పరిగెత్తించేవాడు. వేషధారణ అంతా హాస్యంగా ఉండేది. ముఖం నిండా సున్నపుబొట్లు, బొట్ల మధ్య నల్లచుక్కలు, నల్లగుడ్డ కట్టిన తలకు ఒక పక్కన కాకి–ఈకలను కుచ్చి పెట్టి, మొలకు గోచీకట్టి ఒక చేతిలో వంకరదుడ్డుకర్ర, మరొకచేతిలో జోలెవేసుకొని ఏదో ఒక మూల నుంచి హఠాత్తుగా లేచి పిల్లలందర్ని హడలెత్తించేవాడు. తోలుబొమ్మలాటల్లో జుట్టుపోలిగాడు, బంగారక్క ఎటువంటి ప్రాముఖ్యత వహిస్తున్నారో ఈ చోడిగాడు కూడా చోడిగాని కలాపంలో అటువంటి ప్రాముఖ్యతను కలిగి ఉన్నాడు. బొమ్మలాటలోని పాత్రలు కేవలం హాస్యపాత్రలు మాత్రమే. కానీ చోడిగాని పాత్ర అలాగాక కథానాయకుడిగాను, హాస్య పాత్రగాను జీవిస్తున్నాడు.

**కొలనుపాక భాగవతులు:** కొలనుపాక భాగవతులనే గంటె భాగవతులుగా పేర్కొంటారు. వీరికి, ఆంధ్ర ప్రాంతంలో ఉండే గంటె భాగవతులకూ వ్యత్యాసం ఉంది. తెలంగాణలో గంటె భాగవతులు ఎక్కువగా కరీంనగర్, రంగారెడ్డి జిల్లాలో ఉన్నారు. వీరు రాత్రి వేళల్లోనే ప్రదర్శన చేస్తారు. వీరి ప్రదర్శనలకు సాహిత్యపరంగా అంతగా ప్రాముఖ్యం లేదు. వీరు ప్రదర్శనల్లో ప్రధానంగా గరిటెలను ఉపయోగిస్తారు. అందువల్ల వీరిని గరిటె భాగవతులు, గంటె భాగవతులుగా వ్యవహరిస్తారు. ప్రతి పాత్రధారి చేతిలోనూ ఒక గరిటె ఉంటుంది. అందులో చమురు పోసి, వత్తి వేసి వెలిగిస్తారు. ప్రతి పాత్ర హావభావాలూ, ఆంగిక చలనాలు ఈ గరిటె వెలుతురు వల్ల ప్రేక్షకులకు విశదంగా వెల్లడవుతాయి. ప్రదర్శనలో భాగంగా మధ్య మధ్య నటనను సాగిస్తూ, గరిటెలలోని వత్తిని ఎగదోస్తూ ఉంటారు. గరిట ప్రాముఖ్యంతోనే నాటకాలను ప్రదర్శిస్తారు.

**కప్పతల్లి:** అత్యంత ప్రాచీనమైన జానపద కథ ఇది. నృత్యం, పాట, తప్పెట, లయతో ఈ జానపద కళ ఎంతో రమ్యంగా ఉంటుంది. తప్పెటను ఎదురు రొమ్ముపై పెట్టుకొని వాయిస్తారు. తెలంగాణలో ఈ కళను 'కప్పతల్లి'గా వ్యవహరిస్తారు.

**మాయాజాల కళాకారులు:** వీరిని 'విప్ర వినోదులు'గా పేర్కొంటారు. వీరు గారడి ద్వారా అనేక మాయలను ప్రదర్శించి, యాచిస్తారు. మందెచ్చు కళాకారులు వీరు యాదవ కులానికి చెందినవారు. ఈ జానపద కళాకారులు 'ఒల్లమాదేవి' కథను పాడుతూ యాచిస్తారు. వీరిలో ప్రధాన కళాకారుడు ఒక చేతిలో కత్తి, మరో చేతిలో చిరుతలు పట్టుకొని కథకు సంబంధించిన పాటలు పాడతాడు. మరో ఇద్దరు.. ఒకరు కత్తి, మరొకరు కర్ర, పట్టుకొని ఇతడికి వంత పాడతారు. మంచాల్, బాలాపూర్, రాజేంద్రనగర్, మండలలో ఉన్నారు ఇప్పటికీ ఇక్కడే నివసిస్తున్నారు.

**రంజు కళాకారులు:** విశ్వ బ్రాహ్మణులపై ఆధారపడి రంజు, పవన, సమయాలు ఇచ్చే ప్రదర్శనలు ఎంతో రమ్యంగా ఉంటాయి. వీరు 'రంజు' అనే వాయిద్యాన్ని వాయిస్తారు. వీర బ్రహ్మేంద్ర స్వామి కథ, విశ్వకర్మ పురాణం చెబుతారు. వీరు శైవ మతాన్ని అనుసరిస్తారు.

**డోలి కళాకారులు:** కోయ జాతికి చెందిన వీరు అడవుల్లో, పర్వత ప్రాంతాల్లో నివసిస్తారు. డోలి కళాకారులు వారి జాతికి చెందిన ఆదిపురుషుల గురించి కథల రూపంలో చెబుతారు. కోయజాతిలో మూడో తరానికి చెందిన పేరంబోయరాజు' కథను వల్లె వేస్తారు. బండారు కళాకారులు వీరు పెరిక కులంపై ఆధారపడి ఉంటారు. బండారు కళాకారులు పెరిక జాతి గొప్పతనం గురించి పురాణకథలు చెబుతారు. వీరు ఏ రకమైన వాయిద్యాలను ఉపయోగించరు. ప్రధాన కథకుడు కథ చెబుతూ ఉంటే మరో ఇద్దరు వంత పాడతారు. డోలి కళాకారులను, బండారు కళాకారులుగా పిలుస్తారు. వీరు పెరిక పురాణం చెపుతారు.

**లీల ప్రదర్శన:** వీరు లంబాడీ తండాలకు వెళ్లి అక్కడి పెద్దలను కలిసి ప్రదర్శనలు ఇస్తారు. వీరిని 'భట్టు' అనే పేరుతో కూడా పిలుస్తారు. వీరు తమ జాతిలో మూలపురుషుల కథలను పాడుతూ సంచారం చేస్తూ భిక్షాటన చేస్తారు. వీరు ఒక బృందంగా ఏర్పడి పాటలు పాడతారు. ఒక్కో బృందంలో అయిదు నుంచి 15 మంది సభ్యులు ఉంటారు.

**బుడబుక్కల వాళ్లు:** వీరు తెలంగాణ రాష్ట్రంలో సంచార జాతికి చెందినవారు. వీరు ఊరూరా తిరుగుతూ ఉంటారు. సాధారణంగా వీరు క్షుద్ర దేవతలను పూజిస్తారు. తెల్లవారుజామున విచిత్ర వేషధారణతో ఢమరుకం వాయిస్తూ గ్రామాల్లో వీధుల వెంట తిరుగుతారు. జ్యోతిషం చెబుతూ, తాయత్తులు కడుతూ యాచిస్తారు.

**ఆసాదులు:** తెలంగాణా ప్రజలకు అనేక గ్రామ దేవతలను పూజించే ఆచారం ఉంది. వీరు ప్రకృతి దేవతలను కూడా పూజిస్తారు. ఎల్లమ్మ, పోచమ్మ. నల్లపోచమ్మ, పెద్దమ్మ పేర్లతో దేవతలను పూజిస్తారు. రాష్ట్రంలో అడుగడుగునా ఇలాంటి దేవాలయాలు కనిపిస్తాయి. ఈ దేవాలయాల్లో అన్ని రకాల శూద్ర కులాలకు చెందినవారు అర్చకులుగా ఉంటారు. వీరినే 'అసాదులు' అంటారు. ఈ అసాదులు అమ్మవార్లను 'తాంత్రిక' పద్ధతిలో పూజిస్తారు. వీరు ప్రధానంగా ఎల్లమ్మ కథను గానం చేస్తూ చిందులు వేస్తారు.

**తోటి కళాకారులు:** గిరిజన, అడవి జాతులకు చెందిన కోయ, గోండు, నాయకపోడు కులాలకు ఆశ్రిత కులం తోటివారు. గిరిజన జాతులన్నీ లక్ష్మీదేవి జాతికి చెందినవి. తోటి కళాకారులు కురువంశానికి చెందినవారిగా, వారికి వారసులుగా భావిస్తారు. వీరు కురువంశ మూలపురుషుల కథలు చెబుతారు.

**పెద్దమ్మ కళాకారులు:** వీరు సంచార జాతికి చెందిన మహిళా కళాకారులు, సాధారణంగా ముగ్గురు లేదా నలుగురు కలిసి ప్రదర్శనలు ఇస్తారు. పెద్దమ్మ దేవత విగ్రహాన్ని ఒకరి చేతిలో ఉంచుతారు. మరో కళాకారిణి డోలు వాయిస్తుంది. చేతిలో పెట్టిన విగ్రహాన్ని కళాకారిణి తలపై పెట్టుకొని డోలు శబ్దానికి అనుగుణంగా లయబద్ధంగా నృత్యం చేస్తుంది. వీరు నిజాం ప్రభుత్వాన్ని ఎదిరించిన విప్లవ వీరుడు 'పండుగ శాయన్న' గాథను పాడుతూ ప్రదర్శన నిర్వహిస్తారు.

**యానాది భాగవతం:** యానాది కులానికి చెందినవారు చెప్పే భాగవతాన్ని 'యానాది భాగవతం' అంటారు. వీరు చెంచులక్ష్మీ కథను ఎంతో రమ్యంగా చెబుతారు. దీన్నే 'గరుడాచల భాగవతం'గా వ్యవహరిస్తారు. వీరు నృత్యం చేస్తూ, పాటలు పాడుతూ కథను వల్లె వేస్తారు.

**వర్ధాన్ కళాకారులు:** ఇది గోండు జాతి పుట్టు పూర్వోత్తరాలకు సంబంధించిన జానపద కళ. ఆదిమవాసీలైన పర్ధాన్లు 'దేవాల్ పులాక్' పురాణగాథను ఆలపిస్తూ ప్రదర్శనలు ఇస్తారు. వీరు దక్కి తాళాలు అనే వాయిద్యాలను ఉపయోగిస్తారు. జముకులవారు పోచమ్మ, ఎల్లమ్మ, అక్కమ్మ, సారంగధర మొదలైన గ్రామ దేవతల కథలను వీరు ఎంతో మనోరంజకంగా చెబుతారు. వీరు ఉపయోగించే వాయిద్యాల్లో 'జమిడిక' లేదా 'బవనిక' ముఖ్యమైంది. సాతాను వైష్ణవులు వీరు వైష్ణవ భక్తులు. విష్ణువును ఆరాధిస్తారు. విష్ణువు గురించి పాటలు పాడుతూ యాచిస్తారు.

**పిట్టలదొర:** తెలంగాణాలో ఆదరణ ఉన్న మరో ముఖ్యమైన జానపద కళాకారుడు 'పిట్టల

దొర'. ఈ వేషాన్నే 'లత్కోర్ సాబ్', 'బుడ్డర్ ఖాన్', 'తుపాకి రాముడు'గా పేర్కొంటారు. ఇది పగటి వేషాల్లో ఒక రకానికి చెందింది. వీరు ప్రధానంగా గ్రామాల్లో ప్రదర్శనలు ఇస్తారు. పిట్టల దొర వేషగాళ్లు సమాజంలోని లోపాలు, కుతంత్రాలను హాస్యాత్మకంగా, వ్యంగ్య రూపంలో చెబుతారు. ఖాకీ ప్యాంటు లేదా నిక్కరు, చిరిగిన ఖాకీ షర్టు, తలపై దొర టోపి, రాళ్లకు బూట్లు ధరిస్తారు. టోపి పై ఒక పక్కన తెల్లటి ఈక, చేతిలో కట్టి తుపాకీ, మెడలో రుమాలు ఉంటుంది. వీరు ముఖానికంతా తెల్ల రంగు పూసుకుని, ఫ్రెంచ్ కట్ మీసంతో దొరలా హంగామా చేస్తూ విరామం లేని వాగోరణితో ప్రజలను అలరిస్తారు.

**పగటివేషాలు:** ఒకనాడు మనదేశంలో స్వతంత్ర సామంతరాజుల పరిపాలనలో చిత్రవిచిత్ర వేషాలు వ్యాప్తిలోకి వచ్చాయని తెలుస్తుంది. గూఢచారులుగా మారువేషాలు ధరించి వర్తమానాలు చేరవేసే చారులుగాను, రత్నాలు, పచ్చలు అమ్మేవ్యాపారులుగాను, రాణులు ధరించే ఖరీదైన చీరల వర్తకులుగాను చిత్ర, విచిత్రమైన మారువేషాలతో కోటల్లో చొరబడి ఒక రాజు మరొక రాజును వంచించటం, కోటలోని రహస్యాల్ని, బలహీనతల్ని తెలుసుకొని యుద్ధం ప్రకటించడం జరుగుతుండేది. ప్రజావినోదానికి ఏర్పడిన అనేక కళారూపాలు రాత్రివేళ మాత్రమే. ప్రదర్శింపబడేవి. అలాకాకుండా పగటి పూట ప్రదర్శించడంతో వీటికి పగటివేషాలు అని పేరు వచ్చింది. పగటివేషాల్లో ముఖ్యంగా గమనించాల్సిన విషయమేమిటంటే వారు కేవలం తమ వేషధారణతోగాక వారి పాత్రల ద్వారా సంఘంలో ఉండే మూఢనమ్మకాలను, దురాచారాలను వ్యంగ్యంగా, హాస్య ధోరణిలో ప్రజలకు వివరిస్తూ వారిని చైతన్య పర్చేవారు. ఈనాటి కంటే ఆనాడు గ్రామాల్లో కరణాలు, మునసబులు, వర్తకులు, ఉద్యోగులు మొదలైనవారంతా ఏ విధంగా మోసం చేస్తుండేవారో ఈ వేషాల ద్వారా తగిన సాహిత్యంలో ఎవరికీ బాధ కలుగకుండా వారి గుట్టును బట్టబయలు చేసేవారు. ఈ పగటివేషాలను ఒకప్పుడు బహురూపాలుగా పిలిచేవారు. పగటి వేషాల్లో పంతులు వేషం, పఠానువేషం, రెడ్డి వేషం, తాగుబోతు వేషం, కోమటి వేషం, గారడివేషం, ఫకీరు మొదలైన వేషాలను ప్రదర్శించేవారు. ఫకీరువేషంలో ఫకీరు పాత్రధారి ఖురాన్ చదువుతూ పాడిపంటలు సల్లగుండాలి అల్లాకేనామ్ అంటూ ఆయా పాత్రలకు అనుగుణమైన భాషను ఉపయోగించేవాడు. పగటివేషాల్లో ప్రసిద్ధిపొందినవి భైరాగుల వేషాలు, బుడబుక్కల వేషం, ఫకీరు వేషం, తహశీల్దారు, భోగంవేషం, పాములవాడు, ఎరుకలవేషం, దొమ్మరవేషం, కోయవేషం, పడుచు పెళ్లాం, ముసలిమొగుడు, గయ్యాలి పెళ్ళాం, పిట్టలదొర, గొల్లభామ,

రెడ్డివేషం, భట్రాజువేషం, సింగిసింగడు మొదలైనవి.

**రుంజలు:** విశ్వబ్రాహ్మణులను ఆశ్రయిస్తూ వారిపై ఆధారపడిన తెగ రుంజలవారు. వీరి ముఖ్య వాయిద్యం రుంజ అవడం వల్లవీరిన రుంజలు అని వాడుకలోకి వచ్చింది. వీరు గ్రామ గ్రామం తిరుగుతూ విశ్వబ్రాహ్మణులను యాచిస్తారు. విశ్వబ్రాహ్మణులు వీరిని ఎంతో ఆదరిస్తారు. వీరు విశ్వకర్మ పురాణాన్ని గానం చేస్తూ పారితోషికాన్ని పొందుతారు. రుంజ వాయిద్యం చాలా ఉత్తేజాన్ని కలిగిస్తుంది. ఒక్కొక్క జట్లలో దాదాపు పదిమంది వరకు ఉంటారు. అందరూ రుంజ వాద్యాన్ని వాయిస్తారు. వీరు రంగారెడ్డి జిల్లా అన్ని మండలాలలో పగటివేషాలు వేస్తారు.

**బుట్ట బొమ్మలు:** పేడతో చేయబడిన ఈ బుట్టబొమ్మలు పెళ్లి ఊరేగింపుల్లోనూ, జాతర సందర్భాల్లో ప్రదర్శిస్తుంటారు. ఈ బొమ్మల్ని పురుషులు ఆడిస్తారు. పై భాగమంతా బొమ్మ ఆకారంగా ఉండి లోపలి భాగం డొల్లగా ఉండి బొమ్మ కాళ్లభాగంలో, నోటి దగ్గర రంధ్రాలుంటాయి. ఆటగాడు ఈ లోపలి భాగంలో దూరి నృత్యం చేస్తే కేవలం బొమ్మే నాట్యం చేసినట్లు ఉంటుంది. ఈ బొమ్మల్లో ఒకటి స్త్రీ బొమ్మగాను, మరొకటి పురుషుడి బొమ్మ ఉంటుంది. కొన్ని బొమ్మలు సింగిసింగడుగా ఉంటాయి. ప్రజలను ఆనందపర్చే కళారూపాల్లో ఇది ఒకటి. ఇది ఇప్పుడు పూర్తిగా కనుమరుగై పోయింది.

**వీరముష్టివారు:** వీరశైవ వాఙ్మయానికి సంబంధించిన గేయాలను భక్తుల గాథలను, కన్యకాపరమేశ్వరీ కథలను చెబుతుంటారు. వీరు ఎక్కువగా జంగాలను యాచిస్తారు. వీరముష్టులు పాడేపాటల్లో ఎక్కువ భాగం కన్యకకు సంబంధించినవి. అందువల్ల వీరిని కోమట్లు ఎక్కువగా ఆదరిస్తారు. అయ్యలరాజు నారాయణామాత్యుడు వీరముష్టులను ఉదాహరించినట్లు బిరుదురాజు రామరాజు గారు జానపదగేయ సాహిత్యంలో తెలిపాడు. వీరభద్రుడు దక్షుడిని ధ్వంసం చేయునప్పుడు అతడి చెమట నుంచి వీరముష్టులు జన్మించారని ఒక కథ ఉంది. వీరు వీరభద్ర ఖడ్గాలను కూడా చెబుతుంటారు. వీరు వీరశైవుల వలె కత్తులను కుచ్చుకుని నాట్యం చేస్తారు.

**గారడి విద్యలు:** దీనిని ఇంద్రజాలమని గారడివాళ్లను ఇంద్రజాలికులని వ్యవహరిస్తారు. ఈ గారడి విద్య పూర్వకాలం మంచి ప్రస్తుత కాలం వరకు ప్రచారంలో ఉంది. పూర్వం రాజుల ఆస్థానాలలో విరివిగా ఈ విద్యను ప్రదర్శించి విన్నావాలను పొందేవారు. ఈ నాటికీ గ్రామాల్లో ఈ విద్యను ప్రదర్శిస్తున్నారు. వేపాకులను దూని చేళ్లను తెప్పించడం,

అరచేతిలో రూపాయలను సృష్టించడం, అప్పటికప్పుడు మామిడిటెంకను పాతి మొక్కను మొలిపించడం, మనిషిని బుట్టలో పెట్టి మాయం చేయడం, గొంతును కోసి రక్తం చూపించడం మన వద్దనున్న వస్తువును మాయం చేసి మరొకరి నుంచి తెప్పించడం మొదలైన అనేక ప్రదర్శనలు చేస్తారు. ఈ విద్య పూర్వం నుంచే ప్రచారంలో ఉందనడానికి అనేది గ్రంధాల నుంచి పలు ఉదాహరణలు కనిపిస్తాయి. పాల్కురికి సోమనాథుడు రచించిన పండితారాధ్య చరిత్ర దొమ్మర సొమలు గడలపై ఆడినట్లే, గారడీవారు మోకులపై ఆడినట్లు అని ప్రస్తావించారు.

**పులి నృత్యం:** తెలుగు ప్రాంతాల్లో ప్రతి పల్లెలో ఈ పులి నృత్యం ప్రదర్శిస్తారు. ముఖ్యంగా దసరా పండుగలో, వీర్ల పండుగ సందర్భంలో, పదక్రాంతి. సందర్భంలో ఈ పులి వేషాన్ని ధరిస్తారు. పులి వేషం అంతు నృత్యాలకు అనుకరణ. ఈ కళారూపాన్ని ఎక్కువగా ప్రచారంలోకి తెచ్చినవారు పల్లె ప్రజలే.  ఈ పులి వేషగాళ్లు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి యాచిస్తుంటారు. పిల్లలు భయపడేంత సహజంగా పులి వేషం వేస్తారు. పులి వేషం వచ్చిందంటే పల్లెల్లో పిల్లలకు, పెద్దలకు ఒక పండుగలా అనిపిస్తుంది. పులి వేషధారణ చాలా కష్టమైంది. మామూలు వేషాల్లాగా ఏదో ముఖానికి ఇంత రంగు పూసి తుడిచేయడం వంటిదికాదు. శరీరంలో అన్ని భాగాలను రంగులతో ముంచివేస్తారు. శరీరమంతటా అక్కడక్కడా నల్లటి వాడలను చిత్రించడంతో పెద్దపులి ఆకారం వస్తుంది. నెత్తికి మాత్రం తోలుతో కుట్టిన టోపీని తగిలిస్తారు. వేషం పూర్తయిన తరువాత బజారులో వెళ్లి మధ్యమధ్యలో ఎగురుతూ, పల్టీలు కొడుతూ ఉంటారు. తోడ చించి పొదుపాన్ని ప్రదర్శిస్తారు.

**బాలసంతులవారు:** వీరు తెల్లవారు జామున ఐదు గంటలకే దైవసంబంధమైన పాటలను పాడుతూ గ్రామంలోని ప్రతి ఇల్లు తిరుగుతూ గంటను మోగిస్తూ పాటలు పాడుతుంటారు. పాట పాడిన అనంతరం గంటాన్ని గట్టిగా వాయిస్తూ ఆ ఇంటివారిని నిద్ర నుంచి మేల్కొలిపి, మరొక ఇంటికెళ్లి అదేవిధంగా చేస్తారు. ఇలా ప్రతి రోజూ కొన్ని ఇండ్లను తిరుగుతూ గ్రామంలోని ఇండ్లన్నీ తిరగడం పూర్తయిన తరువాత ఒక రోజును ప్రత్యేకంగా కేటాయిస్తారు. ఒక గ్రామం పూర్తయిన తరువాత మరొక గ్రామానికి వెళ్తారు.

**చెక్కభజన:** పల్లెల్లో కీలక సమయాల్లో ఈ భజన చేస్తుంటారు. దేవుని ప్రమిదను పట్టుకుని ఇంటింటికి తిరుగుతూ భజన చేస్తారు. సుమారు 20 మంది సభ్యులు ఇందులో ఉంటారు. ఈ భవనలో పాట పాడుతూ చేతితో చెర్యల ద్వారా తాళం వేస్తూ గజ్జెలు కట్టిన కాళ్లతో నృత్యం చేస్తుంటే  చూడటానికి ఎంతో ఇంపుగా ఉండి ఉత్తేజాన్ని కలిగిస్తుంది.

ఒక్కోని పాటకు ఒక్కొక్క రకమైన నృత్యం ఉంటుంది.

**పిచ్చుకుంట్ల కథలు:** తెలుగు ప్రాంతాల్లో ప్రాచీన కాలం నుంచి ఉన్న కళారూపాల్లో పిచ్చికుంట్ల కథలు ఒకటి. ఈ కళారూపాన్ని పిచ్చికుంటుల వాళ్లనే జాతివారు ప్రదర్శిస్తుంటారు. ఈ కథా బృందంలో ముగ్గురు వ్యక్తులు ఉంటారు. వీరు చెప్పే కథల్లో ప్రధానమైనది శ్రీనాథుడు రచించిన పల్నాటి వీరచరిత్ర. ఈ కథను ప్రారంభించి మధ్యలో వదలకుండా పదిహేను రాత్రులు చెబుతారు. పిచ్చికుంట్ల కథల్లో శృంగార, కరుణ, వీర రసాలకు ప్రాధాన్యం ఉంటుంది. ముఖ్యంగా వీళ్ళ వేషధారణలో కథకుడికి ఒక తలపాగా, ఒక చేతిలో దస్తి, మరొక చేతిలో డాలు, కాళ్లకు గజ్జెలు ఉంటాయి. ఈయన పాడుతుంటే మిగతా ఇద్దరు అంటూ దీర్ఘం తీస్తూ కథకుడి గొంతుతో గొంతు కలుపుతారు.

**దొమ్మరాటలు:** గ్రామాల్లో ఇతర వినోద కార్యక్రమాలతోపాటు దొమ్మరాట కూడా ప్రాచీన కాలం నుంచి ప్రదర్శిస్తున్నారు. దీనికి పద్మము అను పేరుకూడా ఉంది. దొమ్మలవారు గ్రామాల్లో నాలుగు వీధులు కలిసిన చోట ఒక పొడవైన వెదురుగడను పాతి డోలు వాయిద్యాన్ని వాయిస్తూ గ్రామ, ప్రజలను ఆకర్శించేవా రు. చిత్రవిచిత్రమైన వివాదాలతో పద్మము పనులను చేస్తూ తమ నైపుణ్యంతో ప్రజలను ఆశ్చర్యపరుస్తూ వారి వద్ద నుండే డబ్బును, ధాన్యాన్ని వస్త్రాలను వసూలు చేసుకునేవారు. ఈ దొమ్మరాటలు 13వ శతాబ్దం కాలం నాటికే ఉన్నట్లు పాల్కురికి సోమనాథుడి పండితారాధ్య చరిత్ర పర్వత ప్రకరణ ద్వారా తెలుస్తోంది.

**జంతరుపెట్టె:** అంతరు పెట్టె ద్వారా వివిధ చిటాల బొమ్మలను చూపిస్తూ పిల్లలను ఆకర్షిస్తూ ఉంటారు. జాంతరు వాడు ఆ పల్లెలో చేయి పెట్టి బొమ్మలన్నీ ఒకదాని తరువాత ఒకరు, ఒకరి తరువాత మరొకటి చూపిస్తూ "కాశీ పట్నం చూడర బాబు, విశ్వనాథున్నే చూడం బాబు, మాసి మోక్షం అందం బాబు" అంటూ పాట పాడుతూ దానికనుగుణంగా తాళం వాయిస్తూ ఆనందింపజేస్తాడు. ఈ కళారూపం ద్వారా సమాజంలో, ఉన్నతులను దొంగలను, లంచగొండులను బయట పెడుతూ దేశభక్తి కార్యక్రమాలను కూడా నిర్వహిస్తారు .

## వరంగల్ జిల్లా జానపద కథలు- కళారూపాలు

1. కథా సంబంధమైన నృత్యాలు : జంగం కథలు, శారద కథలు, ఆసాది కథలు, పిచ్చుకుంట్లు కథలు, బుర్రకథలు, ఒగ్గు కథలు, జముకుల కథ, కిన్నెర కథలు, పల్లెసుద్దులు, పంబ కథలు, పాండవుల కథలు.

2. బృంద నృత్యాలు : కోలాటం, పండరీభజన, చెక్క భజన, బోనాలు, గరగలు, గొరవయ్యలు, డప్పు నృత్యం, డోలు నత్యం, తప్పెటగుళ్ళు, ఉరుముల నృత్యం.

3. నాటక సంబంధ కళారూపాలు : యక్షగానం, వీధి నాటకం, బయలాట, తోలుబొమ్మలాట, పగటి వేషాలు, చిరతల రామాయణం, తూర్పు భాగవతం, చెంచునాటకం.

4. కుశల కళారూపాలు : దొమ్మరాట, కర్రసాము, కత్తిసాము, పాముల్ని ఆడించడం, విప్రవినోదాలు, సాధన శూరులు, కాటిపాపలు, గారడి, మోద, కనికట్టు

5. ధార్మిక సంబంధం కళారూపాలు : దాసరి, సాతాని, జియ్యర్, ఫకీర్, జంగం దేవర

6. వినోద కళారూపాలు : గంగిరెద్దులాట, జంతరపెట్టె, కాశికావడి, పిట్టలదొర

7. స్త్రీల జానపద నృత్యాలు : గొబ్బి, స్త్రీల కోలాటం, జట్టిజాము, బతుకమ్మ పండుగ, బొడ్డెమ్మ పండుగ.

**బుర్రకథ :** జంగం కథనే బుర్రకథగా మారింది. ఇవి కూడా యక్షగానానికి దగ్గరగా ఉంటాయి. నాజర్, బెనర్జీ, నిట్టల బ్రదర్స్, భద్రకాళి, శారద, వాణి, వింజమూరి నదిరా మొదలగువారు 'బుర్రకథ' కు చక్కని ప్రాచుర్యం కల్పించారు. బుర్రకథ పితామహుడుగా నాజర్ ప్రసిద్ధికెక్కారు. తెలుగులో బుర్రకథలు రచించి సుంకర సత్యనారాయణ ప్రజాకవిగా పేరుగాంచారు.

- బుర్రకథకు జన్మస్థలం – గుంటూరు
- బుర్రకథలో ప్రధాన వాద్యాలు – గుమ్మెట, బుర్ర, తంబుర,
- జంగం కథనే 'బుర్రకథ' గా రూపాంతరం చెందిందని డా.తంగిరాల సుబ్బారావు పేర్కొన్నారు.

**కోలాటం :**

- పాల్కురికి సోమన ఈ కోలాటాన్ని 'గోడియా' అని పేర్కొన్నారు.
- దీనికే 'దండలాస్యం, దండనం' అన్న పేర్లు కలవు.
- జడకోలాటంలో జంటలుగా ఉంటారు.
- కన్నడ దేశంలో జడ కోలాటాన్ని "జడకోళ్ళు అంటారు.
- కోలాటంలో వాడే పరికరాలు. 1) గజ్జెలు 2) కోపులు (కర్రలు)

**వీరగాథలు :**

- వీరగాథ అన్న పదాన్ని ఆంగ్లంలో Balled అంటారు.
- Balled అన్న పదం Ballare అనే లాటిన్ భాషా పదం నుంచి వచ్చింది.
- Balled కు తెలుగులో మొదట "నృత్యగీతం" అనే పేరుండేది.
- రష్యన్ భాషలో Byling అని పిలుస్తారు.
- Balled పదానికి ఇప్పుడు 'కథాగేయం' అనే అర్థం స్థిరపడింది.
- పెద్ద వీరగాథ కథాగేయాలను Balled Cycles అని పిలుస్తారు.
  ఉదా: పల్నాటి వీరచరిత్ర, కాటమరాజు కథ
- లఘు వీరగాథ కథాగేయాలను Balled Lings అని పిలుస్తారు.
  ఉదా: సర్వాయి పాపడు కథ, చిన్నపరెడ్డి కథ, అల్లూరికథ, గుర్రాలు గోపిరెడ్డి కథ
- "వీర రస ప్రధానమైన కథను చెప్తూ సంచార గాయక బిక్షుకులచేత పాడబడే సరళ కథాగేయమే వీరగాథ" అని తంగిరాల సుబ్బారావు అన్నారు.

**వరంగల్ జిల్లా జానపద కళాకారులు :**

1. బుడిగె జంగాలు :- వీరు భాగవతాలను పాడుతూ ఉరూరా తిరుగుతారు.
2. శారదకాండ్రు :- వీరు తెలంగాణ ప్రాంతంలో ఉంటారు. శారద, బుడిగె వీరి వాద్య పరికరాలు.
3. బాలసంతులు :- వీరు తెలంగాణాలో అధికం. గంట, శంఖం వీరి వాద్య పరికరాలు.
4. భాగవతులు :- వీరు తెలంగాణాలో అధికం. వీరికి జ్ఞాపక శక్తి కూడా అధికం.
5. ఒగ్గులు :- యాదవ భిక్షుక గాయకులలో ప్రసిద్ధులు ఒగ్గులు. ఇటివల వీరిని బీరప్పలు అంటారు. వీరు కూడా తెలంగాణాలో అధికం. ఇటీవల మరణించిన మిద్దెరాములు ప్రసిద్ధ ఒగ్గుకళాకారుడు.
6. పిచ్చుక కుంట్లు :- వీరు రెడ్లను, యాదవులను యాచించి జీవనం సాగిస్తారు. పాల్కురికి సోమన కాలం నుంచి వీరు వికలాంగులని చెప్పబడుతున్నది. రాయలసీమలో కుంటిమల్లారెడ్డి కథను గానం చేస్తారు. వీరు శైవభక్తులు. ఆంధ్ర, రాయలసీమ,

కర్నాటక ప్రాంతాలలో ఉన్నారు.

7. వీరముష్టివారు :- వీరికి వీరభట, భద్రపాద అన్న పేర్లు కలవు. జేగంట, తప్పెట వీరి వాద్య పరికరాలు.

8. బవనీలు :- వీరికి బైండ్లవాళ్ళు అని పేరు. పంబలని కూడా పిలుస్తారు. జమిడిక, బవనికలు, పంబలు వీరి వాయిద్య పరికారాలు.

**వరంగల్ జిల్లా జానపద కళలు– కళాకారులు**

వరంగల్ జిల్లా సంస్కృతిలో జానపద కళలు అంతర్భాగం. విభిన్న ప్రక్రియలతో అనాదిగా తమకు సంక్రమించిన సాహిత్యం, ప్రదర్శనా నైపుణ్యంతో సమాజంలో మనుగడ సాగిస్తున్నవి. వైవిధ్యమైన ఈ మట్టి కళలు తెలంగాణ సంస్కృతిక వైభవానికి, చరిత్రకు ప్రతీకగా నిలుస్తున్నవి. జానపద కళలు ఆశ్రిత, ఆశ్రితేతర కళారూపాలుగా విభజింపబడ్డాయి. నేటి ఆధునిక కాలంలో కూడా తమ మూల సంస్కృతిని పరిరక్షించుకుంటూ మార్పులకను గుణంగా తమ అస్తిత్వాన్ని, ఉనికిని కాపాడుకుంటున్నాయి. ఆశ్రిత కళారూపాలు కేవలం ఒక ప్రత్యేక కులాన్ని మాత్రమే ఆశ్రయించి, కళా ప్రదర్శనల ద్వారా ప్రతిఫలం పొందడం ఆచారంగా వస్తుంది. కులపురాణాన్ని గాని, గోత్రాలను గాని లేదా ఇంద్రజాల విద్యల్ని గాని ప్రదర్శిస్తూ వంశపారంపర్యంగా సంక్రమించిన హక్కులు కలిగి ఉండటం ఆశ్రిత కులాల ప్రత్యేకత. ఆశ్రితేతర కళారూపాలు ఏ ఒక ప్రత్యేక కులాన్ని ఆశ్రయించకుండా అన్ని కులాలను ఆశ్రయించి కళాప్రదర్శనల ద్వారా జీవన భృతిని పొందుతాయి.

తెలంగాణ వరంగల్ జిల్లా తెలంగాణ గడ్డ మీద ఆశ్రిత, ఆశ్రితేతర కళల్లో ఆశ్రిత కళలే ఎక్కువగా మనుగడ సాగిస్తుండడం విశేషం. ఇంద్రజాలం, కథాగానం, నాటకం మొదలైన ప్రక్రియల్లో కూడా తెలంగాణా ప్రాంత కళారూపాలదే పై చేయిగా చెప్పవచ్చు. ఆశ్రిత కళారూపాలను పోషించే ఆయా పోషక కులాలకు ఒక్కటికి మించి ఎక్కువ ఆశ్రిత కళారూపాలు ఉండటాన్ని పరిశీలిస్తే ఈ ప్రాంతంలోని కులాలు ఆయా కళారూపాలకు ఎంతటి ప్రాధాన్యమిస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇందుకు ఉదాహరణగా చూస్తే మాదిగ కులానికి డక్కలి, చిందు, బైండ్ల, నులకచందయ్యలు, మాష్టి, ఆసాది మొదలైన కళారూపాలు నాటకం, కథా గానం, ఇంద్రజాలం వంటి ప్రక్రియలతో ప్రదర్శనలిస్తూ తమ సాంస్కృతిక వైభవాన్ని చాటుతున్నవి.

మాల కులానికి గుర్రపు, మాష్టి, పంబాల, మిక్కిలి మొదలైన కళారూపాలు ఆశ్రిత కళారూపాలుగా నియమింపబడి తరతరాలుగా మాల కులస్థుల సాంస్కృతిక ధారను

పరిరక్షిస్తున్నాయి.  మాదిగ, మాల ఈ రెండు కులాలు మాత్రమే ఎక్కువగా కళారూపాలను పోషించే సామాజిక, ఆర్థికస్థితిని కలిగి ఉన్నాయి. దీంతో వారికి ఆయా కళారూపాల పట్ల ఉన్న గౌరవం, ఆదరణ ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. అంతే కాకుండా ఆయా కళాకారుల ఆవిర్భావ చరిత్రను పరిశీలిస్తే తాము కూడా పోషక కులంలోనే పుట్టి కొన్ని అనివార్య కారణాల చేత వేరుబడి అదే కులానికి ఆశ్రితులుగా నియమించబడినట్లు వారి కుల పురాణాల ద్వారా అవగతమవుతుంది. పోషక కులాలకు, ఆశ్రిత కులాలకు మధ్య ప్రదర్శనకు చెందిన కట్టడి లేదా మిరాశి హక్కులు మాత్రమే కలిగి ఉంటాయి. అయినప్పటికి వీరిరువురి మధ్య కంచం పొత్తు ఉంటుంది. కాని వియ్యం పొత్తు మాత్రం ఉండదు. ఇప్పటికీ ఈ సంస్కృతిని పాటిస్తున్నందునే ఆశ్రిత కళలు మనుగడ సాగిస్తున్నవని అర్థం చేసుకోవచ్చు. ఇక బి.సి కులాలకు కూడా ఆశ్రిత కళారూపాల వ్యవస్థ ఉన్నది. ఇందులో యాదవులకు మంద హెచ్చులు, గొల్ల భాగవతులు, ఒగ్గు, కొమ్ము, గోత్రాల, గొల్లసుద్దులు, బైకాని, పొడపొత్రపు, తెరచీరలు మొదలైన కళారూపాలు తమ ప్రదర్శనా కళలతో పోషక కులవైభవాన్ని, సంస్కృతిని చాటి చెపుతూ నేటికీ సమాజంలో గౌరవప్రదంగా ప్రజ్వరిల్లుతున్నాయి.మిగతా బిసి కులాలతో పోలిస్తే ఎక్కువ ఆశ్రిత కళారూపాలను పోషించే కులం యాదవులే కావడం విశేషం. అయితే యాదవులకు ఆశ్రితులైన కొమ్ము కళాకారులు రిజర్వేషన్ పరంగా ఎస్.సి జాబితాలో ఉన్నప్పటికి వంశపారంపర్యంగా సంక్రమించిన కట్టడిని అటు కళాకారులు ఇటు యాదవులు విస్మరించకుండా కొనసాగిస్తున్నారంటే ఇప్పటికీ కులాలు మధ్య ఉన్న సఖ్యత, సయోధ్య, అవగాహనలే కారణం.

మిగతా బిసి కులాలైన పద్మశాలి, నాయీబ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, కాపు, ముదిరాజ్, గౌడ,మేదరి,రజకలు, ఆరె, గొల్ల కుర్మ మొదలైనవారికి కూడా ఆశ్రిత కళారూపాల వ్యవస్థ నిర్మితమై ఉన్నది.ఈ కులాలు ఒకటి లేదా రెండు ఆశ్రిత కళారూపాలు కలిగి తమదైన శైలిలో పోషిస్తూ ఉన్నాయి.కళాకారులను అక్కున చేర్చుకుంటూ పోషిస్తూ ఉన్నాయి.

తెలంగాణలోని వరంగల్ జిల్లాలో ఆశ్రిత కళాకారుల్లో పటం ఆధారంగా కథాగానం చేసే కళారూపాలు చాలా అరుదైనవి, ప్రత్యేకమైనవి. ఇందులో కూనపులి, ఏనూటి, గౌడజెట్టి, దక్కలి, గుర్రపు, అద్దపు, కొమ్ము, తెరచీరలు, మంద హెచ్చులు, మాసయ్యలు, కాకిపడిగెలు, కొర్రాజులు, పూజరి, పెక్కర్లు తదితర కళారూపాలు ఉన్నాయి. ఈ పటం కళారూపాలు నకాశి కళాకారులతో తాము ప్రదర్శించే కులపురాణ కథాంశాలను పటం మీద చిత్రించుకొని కథాగానం చేస్తాయి. అయితే ఈ పటం కథల్లో కుమ్మరి కులాన్ని

ఆశ్రయించి గుండబ్రహ్మయ్య పురాణం చెప్పే పెక్కర్లు తెలంగాణాలో కనిపించక పోయినప్పటికి ఆంధ్రలోని తూర్పుగోదావరి జిల్లాలో ఉన్నప్పటికి వీరి మూలాలు మాత్రం తెలంగాణాలోనే ఉన్నట్లు తెలుస్తున్నది. అంతే కాకుండా పెక్కర్ల కళాకారులకు తెలంగాణాలోనే ఎక్కువగా హక్కు గ్రామాలుండటం కూడా ఈ వాదనకు బలం చేకూరుతుంది. ఇప్పటికి వీరు ప్రదర్శన నిమిత్తం ఈ ప్రాంతంలో సంచరిస్తూ కుమ్మరి కులాన్ని ఆశ్రయిస్తూ పురాణం చెపుతున్నట్లు పలు ఆధారాలున్నాయి.

వరంగల్ జిల్లా పటం కథ కళారూపాలు మనుగడ కోసం తమ ప్రదర్శనా రీతిలో పలు మార్పులు చేసుకుంటూ వస్తున్నాయి. మొదటగా ఈ కళారూపాల్లో కొందరు కళాకారులు పురాణ కాలక్షేపం మాదిరిగా ప్రదర్శనలు ఇచ్చేవారు. ఇంద్రజాల విద్యలు ప్రదర్శించే ఆశ్రితకళారూపాలు కూడా తెలంగాణ జానపదకళల్లో ప్రత్యేకమైనవే. ఇందులో పద్మశాలికులాన్ని సాధనాశూరులు, మాదిగ కులాన్ని మాష్టి, గొల్ల కుర్మలను, బీరన్నలు, బ్రాహ్మణులను విప్రవినోదులు ఆశ్రయించి పలు రకాలు ఇంద్రజాల విద్యలు ప్రదర్శిస్తారు. నేటి ఆధునిక సమాజంలో కూడా వీరు తమ కళను పోషించుకుంటూ ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు, ఆనందోత్సవాలకు గురిచేయడం గొప్ప విషయం. ఇందులో బ్రాహ్మణులను ఆశ్రయించి విద్యలను ప్రదర్శించే విప్రవినోదులు కాలగర్భంలో కలిసి పోయారు. మిగతా కళారూపాలు కూడా పోషక కులాల దగ్గర ఆదరణ లేక అంతరించిపోయే దశలోనే ఉన్నవి. ఆయా కళారూపాల ప్రదర్శనా నైపుణ్యాన్ని గుర్తించి ఆయా కళాకారులకు బహుళ ప్రాచుర్యాన్ని కల్పించాల్సిన బాధ్యత సమాజం మీద ఉంది. తద్వారా వారి సంస్కృతి పరిరక్షణతో పాటు ఆ కళారూపం సమాజంలో నిలువడానికి ఆస్కారం ఉంది. వరంగల్ జిల్లా ఆశ్రిత కళారూపాల్లో ఒకప్పుడు గొప్పగా వెలుగొంది పోషక కులం ఆదరణ పొంది కనుమరుగైన కళల్లో పనస, బండారి భక్తులు, ఆదికొడుకులు, నులకచందయ్యలు, గంజికూటి, మాష్టి మొదలైన కళలను పేర్కొనవచ్చు. నేడు ప్రాచుర్యం లేక కనీసం సమాజంలో ఏ కులం కిందికి వస్తారో కూడా తెలియని పరిస్థితి ఈ కళాకారులది. గుర్తింపు లేని సమూహంగా జీవనం సాగిస్తూ తమ మూల సంస్కృతిని ప్రతిబింబించే విధంగా తమకు వంశాను గతంగా సంక్రమించిన రాగిశాసనాలను, తాళపత్ర ప్రతులను చూపుతూ తమ ఉనికిని నిలుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాకుండా కొన్ని కళారూపాలకు చెందిన కళాకారులు, జనాభాపరంగా అతికొద్ది మంది ఉండటంతో పోషక కులం పేరునే తమ కులంగా చెప్పుకుంటూ పెళ్లి సంబంధాలు కుదుర్చుకుంటూ మనుగడ సాగిస్తున్నారు. ఈ

రకంగా చేయడానికి కారణం వారి వారి కళా సంస్కృతి అంతరించిపోవడమే. ఆశ్రిత, పోషక కులాల మధ్య ఉన్న కంచం పొత్తు కాస్తా మంచం పొత్తుగా మారుతున్న వైనాన్ని కూడా మనం ఇక్కడ చూడవచ్చు.

ఇప్పటికీ చిందు, ఒగ్గు, కాకిపడిగెల, పంబాల, దుబ్బుల, మందహెచ్చు, బీరన్నలు మొదలైన కళలకు సంబంధించి ఆయా పోషక కులాలు ఆర్థికంగా ఉండి ఆదరణ చూపెడుతుండటంతో సంబంధిత కళారూపాలు సజీవంగా ఉన్నాయి. ఇందులో ఒగ్గు, భీరన్నలు పంబాల, దుబ్బుల కళారూపాలు అనుష్టాన కళారూపాలు కావడంతో మరింత ఆదరణ కనిపిస్తుంది. మిగతా కళల కంటే గొప్ప స్థితిలో విశ్వబ్రాహ్మణులను ఆశ్రయించి విశ్వకర్మ పురాణాన్ని కథాగానం చేసే రుంజ కళాకారులను తెలంగాణాలో వేళ్ళ మీద లెక్క గట్టవచ్చు. ఒకపుడు రెండు మూడు రోజులు కథాగానం చేసే కళాకారులు అర్ధగంట, గంట ప్రదర్శించే స్థాయికే పరిమితమయ్యారు. దీనికి గల కారణాలు అనేకం అయినప్పటికీ వారు ఆ స్థితికి రావడానికి గల కారణాలను అన్వేషించాల్సిన అవసరం ఉంది. అలాగే రెడ్డి, కాపు, మేదరి, బ్రాహ్మణ, వైశ్య, కమ్మ మొదలైన కులాలకు చెందిన పిచ్చుకకుంట్ల. గోత్రాలోళ్లు, విప్రవినోదులు, వీరభద్రీయులు (వీరముష్టి) మొదలైన ఆశ్రిత కళలు కూడా అంతరించిపోయాయి. పిచ్చుకకుంట్ల వారు తెలంగాణాలో మనుగడలో లేకున్నా రాయలసీమ ప్రాంతంలో గౌరవమైన స్థితిలో ఉండి తమ కళారూపాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు.

ఇక వరంగల్ జిల్లా ప్రాంతంలో మనుగడలో ఉన్న చెక్కబొమ్మలాట, గంగిరెద్దులాట, తోలుబొమ్మలాట, పగటివేషాలు మొదలైనవి ఉన్నాయి. ఈ కళారూపాలకు వంశపారంపర్యంగా సంక్రమించిన కట్టడి గ్రామాలున్నాయి. ఇందులో చెక్క బొమ్మలాట, తోలుబొమ్మలాట అతిప్రాచీనమైన జానపద కళలు అయినప్పటికీ ఆయా బృందాలు తెలంగాణాలో ఒకటి లేదా రెండు బృందాలు మాత్రమే ప్రదర్శించే స్థాయిలో ఉన్నాయంటే వాటి స్థితి ఏ రకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

తెలంగాణలోని ఆశ్రిత కళారూపాల మనుగడ పరిశీలిస్తే రాయలసీమ, ఆంధ్రప్రాంతాల కంటే భిన్నంగా ఉంటుంది.రాయలసీమ, ఆంధ్రాలో జరిగే తిరునాళ్లు, దేవతా ఊరేగింపులు, ఉత్సవాలు మొదలైన కార్య క్రమాల్లో పాల్గొనే కళారూపాలే ఎక్కువగా కనిపిస్తాయి. ఆయా కళాకారులకు ఒక ప్రత్యేకమైన కులం అంటూ ఉండకుండా అన్ని కులాలు, వర్గాల వారి భాగ స్వామ్యంతో ఒక బృందంగా ఏర్పడి కళను ప్రదర్శిస్తూ జీవనోపాది పొందుతున్నారు. ఉదాహరణకు కోలాటం, బుట్టబొమ్మలు, కీలుగుర్రాలు,

గరిడీ, సెలంబులు, పిల్లాంగట్లు, చెక్కభజన, కోలల భజన మొదలైన కళా బృందాలను చెప్పవచ్చు. అలాగే వీధినాటక కళాకారులను పరిశీలిస్తే అన్ని కులాలకు చెందిన వారు బృందంగా ఏర్పడి ప్రదర్శించటం కనిపిస్తుంది. ఆయా కళారూపాలకు వంశపారంగా సంక్రమించిన హక్కు పత్రాలు, రాగి శాసనాలు, మౌఖిక సాహిత్యం కనిపించదు. కేవలం పంబ, గురవయ్యలు, కొమ్ము, ఉరుముల కళారూపాలకు మాత్రమే ఇవి కనిపిస్తాయి.

తెలంగాణాలో మనుగడలో ఉన్న జానపద కళలు ఒక నియమిత ఆచారంతో ఒక ప్రత్యేకమైన ప్రదర్శనా నైపుణ్యం కలిగి విభిన్న ప్రక్రియలతో ఈ ప్రాంతం అస్థిత్వపు మూలాలకు సాంస్కృతిక వైభవానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. వీటిలో కొన్ని అంతరించిపోగా, మరికొన్ని అంతరించి పోయే దశకు చేరుకున్నాయి. సంస్కృతికి ఆన వాళ్లుగా చెప్పుకునే రాగి శాసనాలు, తాళపత్రప్రతులు, పటాలను కొందరు కళాకారులు విధిలేని పరిస్థితిలో అమ్ముకుంటూ జీవితాలను గడుపుతున్నారు. ఒక కళారూపం అంతరించిపోవడంతో, ఆ సమూహం తమ సామజిక అస్థిత్వాన్ని కోల్పోయి సమాజంలో గుర్తింపు లేకుండా పోతున్నది. కళలు అంతరించటంతో వారి మౌఖిక సాహిత్యం కూడా కాలగర్భంలో కలిసిపోతున్నది. ప్రస్తుతం తెలంగాణా జానపద కళలు ఎక్కువగా వృద్ధుల చేతుల్లోనే కొనసాగుతున్నవి. ఇందులో కేవలం అనుష్టాన కళారూపాలు తప్ప, మిగతా కళలన్నీ అదే రీతిలో ఉన్నవి. దీన్ని క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసి ఆయా కళారూపాలకు జనజీవాలు కల్పించవలసిన ఆవశ్యకత ఉంది.

తెలంగాణా ప్రాంతానికే పరిమితమై అనాదిగా జానపద సమూహాన్ని అలరిస్తూ, ఆనందపరుస్తూ, విజ్ఞానాన్ని పంచుతూ వస్తున్న జానపద కళలు ఈ గడ్డ మీద మరికొన్ని కాలాలపాటు మనుగడ సాధించాలంటే వారికి సమాజంలో గౌరవమైన స్థానాన్ని కల్పించి వారికి పూర్వ వైభవాన్ని అందించాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఈ కళల్ని జీవించాటానికి అవకాశం ఏర్పడుతుంది. ఆ దిశగా జానపద కళలు మనుగడ సాధించాలంటే వారి కోసం కళానైపుణ్యాన్ని గుర్తించి బహుళ ప్రాచుర్యం కల్పించటం, అంతేగాక వారి సామాజిక ఆర్థిక స్థితిగతుల్ని మెరుగు పరచడం ద్వారా ఆయా కళారూపాల్ని, కళాకారులు కళా మయ జీవితాన్ని విభిన్న కోణాల్లో అధ్యయనం చేయడానికి అవకాశం కలుగుతుంది. తద్వారా భవిష్యత్తు మార్గ దర్శకత్వం ఏర్పడుతుంది. ఈ దశలో ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు, పోషక కులాలు, కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు నిలుస్తాయని ఆశిద్దాం.

**వరంగల్ జిల్లా జానపద బిక్షక గాయకులు – పోషక కులం**

| | | |
|---|---|---|
| 1. | బ్రాహ్మణులు | విప్రవినోదులు |
| 2. | కోమట్లు | మైలారభటులు, వీరముష్టులు |
| 3. | రెడ్లు | పిచ్చుక కుంట్లు |
| 4. | గొల్లలు | మందెచ్చులు, పొడపోతులవారు, పూజగొల్లలు, గొల్లభాగవతులు, గొల్లసుద్దులు, గంగిరెద్దులవారు, |
| 5. | కురుమలు | బీరప్పలు, మైలార్లు, ఒగ్గులు |
| 6. | గౌడులు | గౌడ సెట్లు |
| 7. | పద్మశాలీలు | సావనశూరులు,కూనపులిగాండ్లు, సమయం వాళ్లు, పడిగరాజులు |
| 8. | విశ్వకర్మలు(పంచణంవారు) | రుంజలవాళ్లు, పనసవాళ్లు |
| 9. | మంగలివారు | అద్దసీమవాళ్లు, అద్దపవాళ్లు |
| 10. | మందిరాజు, తెలుగువాళ్లు, | పాండవులవాళ్లు, కాకిపడగలవాళ్లు మంత్రాజులు, బంటువాళ్లు |
| 11. | చాకలివారు (రజకులు) | గంజికూటివాళ్లు, పటంచగాళ్లు |
| 12. | కమ్మర్లు | పెక్కురులు, కులంబిడ్డలు |
| 13. | ఎరుకలవారు | చెంచు, సోదివాళ్లు |
| 14. | గోండ్ల | పృథాన్ |
| 15. | నాయకపోడు | కొర్రంజులు లేదా తోటి |
| 16. | కోయలు | డోలి |
| 17. | మాదిగలు | చిందువాళ్లు, చిందు, డక్కలి, బైండ్లమాస్తి, నులకచందయ్య |
| 18. | మాలలు | మాల దాసర్లు, మాలజంగాలు”[1] |

వరంగల్ జిల్లాలో జోగులవారు, జక్కుల వారు, బాలసంతులవారు, సాతానులు, బుడబుక్కల వారు వంటి జాతులవారు జానపద భిక్షుగాయకులై తెలుగువారి యొక్క జానపద కళల్ని ఆదరించి, పోషించి వారి యొక్క జీవనాన్ని కొనసాగించేవారు. ఇలా అనేక రకాల జానపద కళాకారులు వారి కళల్ని పల్లెల్లో వారి శ్రమను మర్చిపోయెందుకు పంటల కోత సమయంలో, పండుగలు, జాతరులు, జాతరులు, తిరునాళ్ళు, ఉత్సవాల

సందర్భాల్లో వారు ఆడి పాడి ప్రజల్ని ఆనందింపజేసేవారు. ఈ జానపద కళలే పల్లెలకు అందంగా, అలంకరణగా చూడముచ్చటగా ఉండేవి. ఇవి రాను రాను పెరుగుతున్న టెక్నాలజి, ప్రపంచీకరణ నేపథ్యంలో, డబ్బు సంపాదనలో "ఎవరికి వారే యమునాతీరే" అలాగే వ్యక్తిగత జీవిత స్వార్థం కోసం పరుగెత్తే ఈ తరం వారు ఈ కళల్ని ఆదరించక,పోవటం చేత జానపదకళను వీడి వేరే వృత్తులను ఎంచుకుంటున్నారు. ఈ కళలు ఎప్పటిలాగే అలరించాలంటే "మనవంతు భాద్యతగా కళాకారుల్ని గౌరవిద్దాం. వారి కళల్ని ఆస్వాదిద్దాం". "భావితరాలవారికి జానపద కళలను అందిద్దాం.

**1.21. పునర్వ్యస్థీకరణ తరువాత వరంగల్ జిల్లా**

వరంగల్ అర్బన్ జిల్లా

విస్తీర్ణం : 1305 చ.కి.మీ.

రెవెన్యూ గ్రామాలు : 133

జనాభా : 11,35,705

గ్రామ పంచాయతీలు : 45

జిల్లా కేంద్రం : వరంగల్ అర్బన్ మండలాల సంఖ్య : 11

ప్రత్యేకతలు : ఒకప్పుడు కాకతీయుల రాజధానిగా వెలుగొందిన ప్రాంతం. హైదరాబాద్ తర్వాత ఎక్కువ విద్యాలయాలు గల జిల్లా. అనేక మంది కవులకు పుట్టినిల్లు.

వరంగల్ రూరల్ జిల్లా.

విస్తీర్ణం : 2175 చ.కి.మీ.

రెవెన్యూ గ్రామాలు : 233

జనాభా : 7,16,457

గ్రామ పంచాయతీలు : 280

జిల్లా కేంద్రం : వరంగల్ రూరల్ మండలాల సంఖ్య : 15" [2]

ప్రత్యేకతలు : కాకతీయుల సామ్రాజ్యం విస్తరించిన ప్రాంతం. వ్యవసాయానికి పట్టుగొమ్మ. పాకాల చెరువు ఈ జిల్లాలోనే ఉన్నది.

**1.22. వరంగల్ జిల్లా గ్రామదేవతలు – పూజా విధానము**

సంఘంలోని వ్యక్తులు తమ చుట్టూ ఏవో అదృశ్య శక్తులు గలవని విశ్వసించి ఒనర్చిడి ఆచార విశేషమే జానపద మతము. ఏవో తమకు తెలియని అదృశ్య శక్తులు మంచి చెడులతో నిమిత్తము లేక తమను ఆవరిస్తాయని, ఆ శక్తులు వ్యాధుల్ని, ఉపద్రవాలని

కలిగిస్తాయని ఆదిమ మానవులు విశ్వసించినారు. కనుకనే అతి ప్రాచీన కాలము నుండి గ్రామ దేవతారాధన విశిష్ట స్థానాన్ని ఆక్రమించి నేటికిని నిలద్రొక్కు కొనియున్నవి.

ఈ విధంగా గ్రామదేవతలు గ్రామ పరిరక్షకులుగా వెలుగొందేవారని ఒక నమ్మకం, గ్రామదేవతలు గ్రామాలలో సంభవించె కలరా, అమ్మవారు (పొంగు), పశువ్యాధులు నివారణకు గ్రామదేవతలను ఎక్కువగా కొలేచేవారని తెలుస్తుంది. గ్రామ దైవములలో చాలా వరకు స్త్రీ దేవతలే ప్రాధాన్యము వహించుటను గమనించవచ్చును. ప్రాచీన మానవుడు పూజించిన 'శక్తి' యే గ్రామదేవత, సాధారణంగా గ్రామదేవతలకు అలయాలు ఊరి పొలిమేరలలోనే వుంటాయి. గ్రామదేవత ఎవ్వరును తప్పించుకొనలేరనే ధృడ విశ్వాసం జానపదలలో కద్దు, సాధారణంగా గ్రామదేవతలను పూజించేది. అబ్రాహ్మణులుగా ఉందురు. కాని తంజావురుకు మూడు మైళ్ళ దూరంలో మరియమ్మ దేవాలయంలో బ్రాహ్మణపూజారులు కనిపిస్తారు.గ్రామ దేవతలను ఆరాధించుట వలన సకాలంలో వర్షాలుపడి పంటలు బాగా పండుతాయని జానపదుల విశ్వాసం. గ్రామ సంరక్షణ భారము గ్రామ దేవతలదేననేది విశ్వాసం వీరి మనస్సులలో నాటుకుని ఉన్నది.

వరంగల్ జిల్లా నందలి గ్రామదేవతలలో కొందరు మారమ్మ, ఎల్లమ్మ, సంకులమ్మ, పోలేరమ్మ, కొండాలమ్మ, దుర్గమ్మ, చూడమ్మ, పెద్దమ్మ, ఇన్నమ్మ, పోచమ్మ అక్కమ్మ, అంకమ్మ, అంకాలమ్మ, చొక్కాలమ్మ, ముత్యాలమ్మ, చల్లాలమ్మ, ఈదెమ్మ, మొదలగువారు. ఆయా పేర్లకు తగ్గట్టుగానే ఆయా గ్రామములలో గ్రామ దేవతలుగా నిత్యం పూజలు అందుకుంటున్నారు. కొన్ని గ్రామాలలో దేవతలు విగ్రహాల రూపంలో ఉంటారు. వారికి అన్ని రకాల నగలు, ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, చీరలను ధరింపచేస్తారు. కొన్ని గ్రామాలలో పొలము గట్టుల పైన చెరువు కట్టలపైన అధికంగా చిన్న చిన్న గంగమ్మ గుడులు అనేవి అనగా ఒక రాయిని విగ్రహంగా అనగా దేవతలగా కొలుచుచుండటం మనము ఇప్పటికినీ గ్రామములలో చూడవచ్చును. ఏమైననూ గ్రామదేవత పేరు చెప్పగానే జానపదులలో భయభక్తులు తొణికిసలాడుచుండుటను నేటికి గమనించవచ్చును. పైన ఉదహరించిన విధంగా ఈ జానపద విజ్ఞానాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత మనందరిపైన ఉన్నదని ఇది మనందరి సమిష్టి సంస్కృతిక బాధ్యత అని తెలియ జేయుచున్నాను.

జానపదులు ముఖ్యంగా తమ కష్టాన్ని నమ్ముకోవడంతో బాటు ఆ కష్టాలు సఫలీకృతం కావాలంటే దైవ సహాయం ఉండాలని భావించారు.దేవుడి ప్రమేయం లేకుండా తమ మనుగడ సాధ్యం కాదని నమ్మారు.అందుకే తమ జీవనానికి ఏ రంగం అయితే

ఉపయోగపడుతుందో ఆ రంగానికి సంబంధించిన పనిముట్లను కూడా దేవుడి సృష్టిగా భావించారు. తాము నమ్ముకున్న వృత్తిని దైవంతో సమానంగా భావిస్తూనే ఆ వృత్తి తమకు దేవుడే సంక్రమింపచేశాడని గాఢంగా విశ్వసించారు. వరంగల్ జిల్లా జానపద ప్రాంతాల్లోని జానపదాలలో వెలసినన్ని ఆలయాలు, గుడులు, క్షేత్రాలు మరే ప్రాంతం లోనూ ఉండవేమో! కొండ కోనల్లో, అడవుల్లో నివశించే వారు ఆయా ప్రాంతాలలో తమ కులదేవతలకు స్థానం కల్పించుకొని పూజలు నిర్వహించారని మనకు చరిత్ర తెలియజేస్తోంది.

**గ్రామ దేవతలు-పూజా విధానం:** శ్రీ పురాతన మానవులు ప్రకృతి వైపరీత్యాల నుండి, ప్రేతాత్మల బారినుండి తమను తాము రక్షించుకొనడానికి ఒక అతీత శక్తిని పూజించారు. ఆ శక్తినే తల్లి దేవతగా భావించారు. ఈ తల్లి దేవతనే గ్రామదేవతగా స్వీకరించి పూజించారు. మనుష్యులను పీడించు ప్రేతాత్మల నుండి రక్షణకై ఆ మనుష్యుడే భగవద్రూపమును కల్పించుకొని, తనకు సంరక్షకునిగా నిలబెట్టుకొనెను. ఇట్టి భగవద్రూప రూప కల్పనము నందు మొదట కల్పన తల్లి దేవత, అమ్మతల్లి అని నాయని కృష్ణకుమారి గారు అభిప్రాయపడ్డారు. మాతృస్వామిక వ్యవస్థలో స్త్రీయే వ్యవసాయకురాలు కావడం, సఫలతకు స్త్రీయే ఆధారమనే అభిప్రాయం ఏర్పడటం, ఆమె సృజనాత్మక శక్తి స్వరూపం అనే భావన ప్రబలటం, గ్రామదేవతల ఆవిర్భావానికి, రూపకల్పనకు, ఆరాధనకు ముఖ్యకారణాలైనవి. గ్రామరక్షణ, అభివృద్ధి కోసం, పాడి పంటలకు చీడ పీడలు సంక్రమించకుండా ఉండడం కోసం, గ్రామంలో తట్టు, ఆటలమ్మ, మసూచి, కలరా వంటి అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండడం కోసం నాటి జాన పదులు స్త్రీ దేవతలను ప్రతిష్టించుకొని పూజించి, జాతరలు, తిరుణాలలు జరిపారు.

వరంగల్ జిల్లా జానపదులు గ్రామ పొలిమేరలను కాపాడడానికి పోలేరమ్మ, యల్లమ్మలను, అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండడం కోసం గంగమ్మ, అంకాలమ్మలను, ఊట బావుల్లో నీరు సమృద్ధిగా ఉండాలని, చెరువు గట్లను కాపాడాలని గంగమ్మ, అక్క దేవతలని పూజించారు. వీరంతా శిష్ట దేవతలైన రాముడు, కృష్ణుడు, శివుడు, ఆంజనేయుడు, చెన్నకేశవుడు వంటి వారికంటే విశిష్టమైన లక్షణాలతో, పద్ధతులతో జానపదుల చేత పూజలందుకుంటూ గ్రామదేవతలుగా ప్రసిద్ధికెక్కారు. గ్రామ దేవతలు ఊరి పొలిమేరల్లో ఉంటూ, ఊరిలో మశూచి, కలరా వంటివి సోకకుండా కాపాడతారని ఊరికి రక్షకులుగా ఉంటారని ఆరాధించడం మొదలుపెట్టారు. అని పేట శ్రీనివాసుల రెడ్డి అభిప్రాయం.

వరంగల్ జిల్లా గ్రామ దేవతలు ఒక్కొక్క గ్రామంలో ఒక్కొక్క పేరుతో, ఒక్కొ రకమైన నమ్మకంతో, ఒక్కో రూపంలో, ఒక్కో పద్ధతిలో పూజలు అందుకుంటున్నారు. ఇలా వరంగల్ జిల్లా జానపద ప్రాంతాలలో పూజార్హులైన గ్రామదేవతల గురించి తెలుసుకుందాం.

వరంగల్ జిల్లాలో ప్రతి గ్రామంలోను గ్రామ దేవతల ప్రతిష్ఠ జరిపించి పూజలు నిర్వహిస్తున్నారు. కాని అన్ని గ్రామాల గ్రామ దేవతల గురించి తెలియజేయడం ద్వారా విషయం విస్తృతం అయ్యే ప్రమాదం ఉంది. అందువల్ల జిల్లా జానపద ప్రాంతాలలో ప్రసిద్ధి వహించిన గ్రామ దేవతల గురించి వారి పూజా విధానం గురించి మాత్రమే ఇక్కడ తెలియజేయడం సమంజసం. ప్రతి ఉగాది మరుసటి రోజు ఉత్సవం నిర్వహింపబడుతుంది. నాడు కేశఖండన, జంతుబలులు గ్రామదేవతకు సమర్పించుకుంటారు. ఉత్సవం నాడు గుడి ముందు బోణం రాశిగా పోసి, దానికి ఎర్రటి దారం చుట్టి టెంకాయ నిమ్మకాయలు సమర్పిస్తారు. ఆ తరువాత కేశఖండన కార్యక్రమం నిర్వహిస్తారు. దున్నపోతులను, పొట్టేళ్ళను, మేకపోతులను బలి ఇస్తారు. దాదాపు మూడు దున్న పోతులకు తగ్గకుండా సుమారు రెండు వందల పొట్టేళ్ళను, మేకపోతులను బలి ఇస్తారు. అంటే గ్రామంలోని ప్రతి కుటుంబం నుండి ఒక పొట్టేలు కాని, మేకపోతు గాని బలి ఇవ్వబడుతుంది. మధ్యాహ్నం రెండు గంటల నుండి నల్లనమ్మను గ్రామంలోని ప్రధాన రహ దారిలో ఊరేగిస్తారు. ఉత్సవ విగ్రహాలు సమకూర్చ బడ్డాయి. ఈ ఉత్సవ విగ్రహాలను అలంకరించిన ప్రభపై ఉంచి నలుగురు వ్యక్తులు భుజాలపై మోస్తూ ఊరేగిస్తారు.

గ్రామ దేవత ఊరేగే సమయంలో చెక్కభజనలు, కోలాటం వంటివి ప్రదర్శింపబడతాయి. నల్లనమ్మ గ్రామంలోని కొంతమందికి పూనడం జరుగుతుంది. నిత్య దీపారాధన జరుపబడుతుంది. ఇటీవలి కాలంలో దసరా ఉత్సవాలు కూడా నిర్వహింపబడుతున్నాయి. నిత్య దీపారాధన నిర్వహింపబడుతోంది. కేశఖండన మొక్కుబడులు భక్తులు వీలైనప్పుడు చెల్లించుకుంటారు. ప్రతి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించబడుతుంటాయి. ఉగాది పర్వదినం మరుసటి రోజు ఉత్సవం నిర్వహింప బడుతుంది. చుట్టు ప్రక్కల భక్తులు జంతుబలులు సమర్పించి మొక్కులు చెల్లిస్తారు.

నిత్యదీపారాధన నిర్వహింపబడుతోంది. ప్రతి సంవత్సరం తిరునాళ్ళ జరుపుతారు. భక్తులు పొట్టేలు, దున్నపోతులు, కోళ్ళను బలియిస్తారు. పశువులకు, మనుష్యులకు కలరా, మసూచి తట్టు వంటి అంటురోగాలతో పాటు పంటలకు చీడ, పీడలు ప్రబలకుండా ఉండాలని అంకాలమ్మను పూజిస్తారు.

పూజారు యాదవ కులస్థులు. నిత్యదీపారాధన నిర్వహింపబడుతోంది. చైత్రమాసం పున్నమినాడు అంకాలమ్మకు కంకణం కట్టడం విప్పడం జరుగుతుంది. ఆది, గురు వారాలలో తిరునాళ్ళు నాలుగైదు వారాలు నిర్వహిస్తారు. ఈ రోజుల్లో అంకాళమ్మ దుర్గమ్మగా దర్శన మిస్తుంది. కంకణం కట్టిన ఐదవ రోజు సిదిబడిని ఆలయం చుట్టు త్రిప్పుతారు. అమావాస్య నాడు మగ వాడైన గణాచారి స్త్రీ వేషం ధరించి అమ్మవారికి కంకణం విప్పుతాడు. ఆనాడు కత్తికి తలంబ్రాలు పోస్తారు.

పున్నమి నుండి అమావాస్య వరకు దాదాపు పదిహేను రోజులు ఏడాదికొకసారి తిరునాళ్ళ జరుపుతారు.కడగ నాగయ్య పల్లెవారు కుంకుమ బండి కట్టుకొని అలంకరించి ఒక పట్టుచీర తెచ్చి అమ్మవారికి అలంకరిస్తారు.దాదాపు ఐదువేల మంది భక్తులు అంకాళమ్మ తిరునాళ్ళకు హాజరౌతారు. ఎదురు గంగమ్మలు ప్రధాన దేవతకు ముందుభాగంలో ప్రతిష్ఠింపబడినాడు. గుడి పైభాగంలో ఉత్తరం వైపు సుబ్రమణ్యస్వామి, అర్థనారీశ్వరులు, దక్షిణం వైపు నారద, విఘ్నేశ్వరుల చిత్రపటాలు ఏర్పాటు చేశారు. మిగిలిన రెండు వైపుల రాక్షసులు శంఖం పట్టుకొని కాపలాకాస్తున్నారు. మధ్యలో కాళికాదేవి ఈటెతో పొడుస్తున్నట్లు పెద్ద బొమ్మలు ఏర్పాటు చేయబడ్డాయి.

నిత్య దీపారాధన లేదు. యాదవ కులస్థులు పూజారులు. ప్రతి ఆదివారం పూజలు నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం మొలకల పౌర్ణమి శుక్ర, శని, ఆది, సోమ, మంగళ వారాలలో ఐదు రోజులు తిరుణాల నిర్వహిస్తారు. ఈ ఐదు రోజులు రాత్రింబవళ్ళు భోగాదెమ్మను సేవిస్తారు. మ్రొక్కుబడులుగా జంతుబలులు సమర్పించు కుంటారు. దేవతకు సన్న నిమ్మకాయలు, కళ్ళు, కోరలు గొడుగులు, చీరలు భక్తులు సమర్పించుకుంటారు.

ఎల్లమ్మ ఉత్సవాలు

నిత్యపూజలు నిర్వహింపబడుతున్నాయి. పూజారులు. శుక్ర, ఆది వారాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు పంచబడతాయి. ప్రతి సంవత్సరం చైత్ర బహుళ ఏకాదశి నుండి వైశాఖ పాడ్యమి, తదియ రోజు వరకు తిరుణాల నిర్వహింప బడుతుంది. తిరుణాల రోజున పెద్ద చెప్పలి, ఎల్లారెడ్డి పల్లె, ఈ దిగపల్లెలనే మూడు గ్రామాలలో ఊరేగింపుగా ఎల్లమ్మను తీసుకవస్తారు. ఏడు రోజులు తిరుణాల నిర్వహిస్తారు. ఆసాది వాళ్ళు ఎల్లమ్మ కథను వినిపిస్తారు.

నిత్యసేవ లేదు. శివరాత్రి తరువాత రెండవ రోజు (అమావాస్యరోజు) గొప్ప తిరుణాల జరుగుతుంది. గొల్లవారు ఈ క్రమదేవత పూజారులు. ఈ తిరుణాల రోజు అధిక సంఖ్యలో

జంతు బలులు ఇవ్వడం పరిపాటి. దున్నేపోతులను కూడా బలిస్తారు. ఈ ఉత్సవాలలో లక్షలాది మంది పాల్గొంటారు. పొరుగు జిల్లాలోకూడా ఈ పెద్ద గంగమ్మ భక్తులు ఉండడం విశేషం. తిరుణాల రోజు దేవాలయాన్ని పసుపు కుంకుమ నీటితో ఆలయాన్ని' శుద్ధి చేస్తారు. పాల్గుణ మాసంలో ఆది, గురు వారాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గ్రామానికి సంభవించిన అరిష్టాలను అంతరింపచేసే భావనతో రక్తం మాంసంతో కూడిన భోజనం కూడును ఊరి పొలిమేరల్లో చల్లి పెద్ద గంగమ్మ తల్లిని శాంతింపచేస్తారు జానపదులు. తిరుణాల రోజు ఛాందినీ బండ్లు కట్టడం, రాత్రివేళ ఒగ్గు పాటలు నిర్వహిస్తారు. రైతులకు అవసరమైన పనిముట్లు ప్రదర్శన ఉంటుంది. పెద్దమ్మ తల్లి దగ్గర కొన్న పనిముట్లతో వ్యవసాయం చేసినట్లయితే లాభాదాయకంగా ఉంటుందని భక్తుల విశ్వాసం.

కురవలు గుడి పూజారులు, మూడు సంవత్సరాలకు ఒకసారి మార్చినెల పౌర్ణమి రోజు (చతర్దశి, పౌర్ణమి) రెండు రోజులు తిరుణాల నిర్వహింపబడుతుంది. మల్లారమ్మ, ఈ ఉత్సవంలో సుమారు పదివేల మంది భక్తులు పాల్గొంటారు. బయనోళ్ళు, ఆసదోళ్ళు అమ్మవారు ఒగ్గు కథలు చెబుతారు. ముద్దుల వాళ్ళు అమ్మవారిని స్తోత్రాలతో కీర్తిస్తారు. కాపులు, బలిజ, కురువ, సుగాలి, ఎరుకల వారు ముఖ్యంగా మల్లారమ్మ భక్తులు.

చాకలివారు ఈ గ్రామదేవత పూజారులు. ప్రతి ఆదివారం పూజలు నిర్వహింపబుతున్నాయి. జూన్ మొదటి వారంలో ప్రతి సంవత్సరం ఉత్సవాలు చాకలి కులస్థుల ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్నాయి. తిరుణాల మూడురోజులు నిర్వహింపబడుతుంది. శనివారం దాసర్లు, ఆదివారం జాగర్లు, సోమవారం బండలాగుడు పోటీలు నిర్వహిస్తారు. తిరుణాలకు ముందు పదిరోజులు చుట్టుపక్కల గ్రామాలలో నాగారపమ్మను ఊరేగింపుగా తిప్పుతూ ఉత్సవానికి విరాళాలు సేకరిస్తారు. తిరుణాల రోజు మాన్యం వారిపల్లె ఆసదోళ్ళు అమ్మవారి కథలు చెప్పడం, కళాకారులు చెక్కభజనలు, చాందినీ బండ్లను అలంకరించి తిప్పడం వంటివి నిర్వహిస్తారు.

ఈ విధంగా ఎక్కడలేని విధంగా వరంగల్ జిల్లాలోని గ్రామ దేవతలు కలరు. గ్రామీణులు ప్రతిదానికి ఒక నమ్మకాన్ని పెట్టుకొని గ్రామ రక్షణ కోసం, ఆయురారోగ్య ఐశ్వర్యం కోసం గ్రామాలలో దేవతలను ప్రతిష్ఠించి మొక్కుబడులు చెల్లించడం కోసం చేస్తారు.

**వరంగల్ జిల్లాల్లో గ్రామదేవతల్లో కొన్ని :**

పుడవాలమ్మ, కుంకుళమ్మ, రాగులమ్మ, గంగాలమ్మ, సూరమ్మ, కరువలమ్మ, కొండమ్మ, ఎల్లమ్మ, పోలేరమ్మ, నూకాలమ్మ, బతుకమ్మ, పోచమ్మ, ఇరుగళ్ళమ్మ, కట్టమైసమ్మ, గుర్రమ్మ / గుర్రలక్కా, జోగులమ్మ జోగుళాంబ మొదలైనవారు.

**గంగాలమ్మ:** పంచభూతాల్లో రెండవది గంగ. అంటే నీరు. కేవలం భూమి నుండి ఏ వ్యక్తికీ ప్రయోజనం లేదు. ఆ భూమికి ఆకాశం నుండి పడే వర్షం ముఖ్యమైనది. అంతేకాదు ఆకాశం నుండి వర్షం పడని రోజుల్లో భూగర్భజలం అతి ముఖ్యమైనది. పై నుండి జలం పడకపోయినా, భూగర్భం నుండి జలం భూమి మీద ఉన్న చెట్ల వేళ్ళకి అందక పోయినా, పంట చేతికి వచ్చే అవకాశం లేదు. కాబట్టి నీటిని ఒక తల్లిగా భావించిన జానపదులు ఆమెను గంగా తల్లిగా భావించారు. ఆమెకి కొలుపుల్ని నిర్వహిస్తూ వచ్చారు. వర్షం రాకపోయిన పక్షంలో కుండలతో నీటిని తెచ్చి ఆమె విగ్రహాన్ని అభిషేకించగానే కుంభవృష్టి కురవడం నేటికీ మనకు కనిపిస్తున్న సత్యం.

**కొండమ్మ తల్లి:** పంచభూతాల్లో అయిదవది ఆకాశం. ఆకాశాన్ని కొండతో పోల్చడమనేది మనకు కన్పిస్తూ ఉంటుంది. నోటిలో కూడా వేలాడుతూ కన్పించే నాలుకను కొండ నాలుక అంటారు. అదుగో అలాంటి కొండమీద లభించే ఏ పంట ఉందో, ఆ పంట ధాన్యం ఏ మాత్రం నష్ట పోకుండా పిల్లలమైన మాకందించవలసిందని ప్రార్థిస్తూ, కోయజాతి వాళ్ళందరూ కూడా నైవేద్యాలను సమర్పించుకునే తల్లి కొండమ్మ. అందుకే పులిగోర్లు, జింక కొమ్ములు, లేడి చర్మాలు, ఏనుగు దంతాలు వీటితో పాటు చిత్ర విచిత్రమైన వాసనలతో ఉండే కస్తూరి, పునుగు జవ్వాది వంటివన్నీ గిరిజన జానపదుల నుండే లభిస్తాయి.

**ఎల్లమ్మ :** సహజంగా మన ఇళ్ళలో పనిచేసే స్త్రీలకు ఈ పేరు ఎక్కువగా ఉంటూ ఉంటుంది. ఈ పేరు వింటూనే మనం అదేదో తక్కువ జాతి పేరుగా భావిస్తూ ఉంటాం. కాని అది సరికాదు. చదువులకి ఒక అమ్మ ఉంది. ఆమె పేరు సరస్వతి. ధనానికి ఒక తల్లి ఉంది. ఆమె పేరు ధనలక్ష్మి. లయకర్తిగా ఒక తల్లి ఉంది. ఆమె పేరు పార్వతి. ఈ ఎల్లమ్మ అందరు తల్లులకీ అమ్మ .తల్లి వంటిది. ఎవరు ఆమె (ఎల్ల + అమ్మ = ఎల్లమ్మ) అంటే చదువునీ, ధనాన్నీ, మృత్యువునీ జయించగలిగిన శక్తినీ, రక్షణనీ ఇచ్చే సర్వసమర్థురాలని అర్థమన్నమాట.

**పోలేరమ్మ :** ఒక గ్రామం ఇంతటితో అయిపోయిందనీ, అక్కడి నుండి మరో గ్రామం ప్రారంభమైనదనీ తెలియజేసేందుకు ఏ సరిహద్దు ఉంటుందో, ఆ సరిహద్దుని

'పొలిమేర' అని అంటారు. ఆ పొలిమేరలో ఉండి తనని దాటి వెళ్ళే ప్రతి గ్రామస్థుణ్ణి (ఆ గ్రామంలో ఉండేవాడిని) తిరిగి వచ్చేంత వరకూ, కంటికి రెప్పలా రక్షిస్తూ ఉండే తల్లి – పొలిమేర + అమ్మ = పొలిమేరమ్మ. ఇంట్లో తల్లికి నమస్కరించి, ఊరి చివరున్న పొలిమేరమ్మకి నమస్కరించి, తిరిగొచ్చేటప్పుడు పొలిమేరమ్మకి కృతజ్ఞతా పూర్వకంగా మళ్ళీ నమస్కరించి, జానపదులు ఇంటికి రావడం చేస్తూ ఉంటారు. ఈ పొలిమేరమ్మను వీరు తమకొచ్చిన చదువుతో 'పోలేరమ్మ' అని పిలుచుకుంటూ ఉంటారు.

**నూకాలమ్మ** : ప్రతి వ్యక్తికీ ఆధారభూతమైనది ఆహారం. ఆహారం లేనిదే ఏ వ్యక్తి జీవించలేడు. ఆ ఆహారం ఒకరికి గోధుమలైతే, ఇంకొకరికి రాగులైతే, మరొకరికి నువ్వులైతే, మరికొందరికి యవధాన్యాలైతే... ఇలా ఒక్కొక్కరికీ ఒక్కొక్క ధాన్యమవుతూ ఉంటే, ఈ అన్ని ధాన్యాలకీ కలిపి పెట్టిన పేరు నూకలు అని. నూకలనగానే బియ్యానికి సంబంధించిన ముక్కలని అనుకోకూడదు. ధాన్యమనే అర్థంగా భావించాలి. అలా 'తమకు తిండి గింజలని, సరైన తీరులో ప్రసాదిస్తున్న–నూకలనిస్తున్న తల్లీ" అని జానపదులు కొలుచుకొని నూకలమ్మకు నమస్కరిస్తుంటారు. ఈమె కాలక్రమంలో జానపదుల భాషలో నూకాలమ్మగా అయిపోయింది.

**బతుకమ్మ** : ఇప్పటికీ వరంగల్ ప్రాంతంలో ఈ బతుకమ్మ' ఉత్సవాలని విశేషమైన తీరులో చేస్తూ ఉంటారు. బతుకు నిచ్చే అమ్మ బతుకమ్మ. ఆమె పేరే క్రమంగా బతకమ్మగా అయిపోయింది. ప్రతివ్యక్తికీ బతుకుని (జీవించడానికి కావలసిన ఉపాధినీ లేదా వృత్తినీ) అందించే తల్లి బతుకమ్మ. ఏ వర్షమనేది లోకంలోని ప్రాణులందరికీ ఆధారమో, అలాగే వర్షాకాలం వచ్చే సందర్భంలో రోగాల నుండి బతుకుని ప్రసాదించవలసిందని నమస్కరిస్తూ ఉండే జానపదుల ప్రార్థనలను అందుకునే తల్లి బతుకమ్మ. బతుకనేది కొందరికి మాత్రమే చెందినది కాదు కాబట్టి ఈమె ఒక ప్రాంతపు దేవత మాత్రమే కాదు.

**పోచమ్మ** : 'బతకడానికి కొన్ని గంజినీళ్ళున్నా చాలు' అని లోకంలో ఒక నానుడి ఉంది. అలా ఆహారం లేకున్నా, ఆహార ధాన్యానికి సంబంధించిన గంజి కాచుకోవడానికి కావలసిన, ఆ పాటి ధాన్యాన్నైనా ఇస్తూ, గంజిపోసే అమ్మ – పోచమ్మ అవుతుంది. అంటే జీవితానికి తిండి ఉండేలా కాచి రక్షించే తల్లియని అర్థం. కొన్ని ప్రాంతాలలో ఆహార ధాన్యాల కంటే ఆహారాన్ని ద్రవంగా చేసుకుని దానితో జీవించడమే అలవాటున్న జానపదులున్నారు. అలాంటి వారందరికీ ఈ పోసే+అమ్మ – పోచమ్మ పూజనీయురాలు.

**కట్టమైసమ్మ :** ఈమె మనకు తెలంగాణ ప్రాంతంలో ఆరాధ్యురాలిగా కనిపిస్తూ ఉంటుంది. ఈమె అసలు పేరు కట్టమూసే అమ్మ. కట్ట అంటే జీవితానికి అవధి అయిన మృత్యువని అర్థం. అలాంటి మృత్యువును మూసే వాయిదా వేయగలిగిన (మృత్యుంజయ శక్తి గల) అమ్మ – కట్టమూసే అమ్మ – కట్టమైసమ్మ. తమకీ, తమ పిల్లలకీ ఏ విధమైన మృత్యు బాధా లేకుండా రక్షించవలసిందని ఈమెకు జానపదులు ఉత్సవాలని చేస్తూ ఉంటారు.

**జోగులమ్మ / జోగుళాంబ:** దేవతామూర్తులను దర్శించే శక్తి కలగాలంటే అది యోగశక్తితో మాత్రమే సాధ్యమవుతుంది. అందుచేత యోగి జనులకు మాత్రమే సాధ్యమయ్యే తీరులో దర్శనాన్ని అందించే తల్లి యోగుల + అమ్మ = యోగులమ్మ. యోగి శబ్దానికి వికృతి జోగి అని. జోగి+లు= జోగులు, జోగులకు అంటే యోగుల జన్మకి అమ్మ జోగులమ్మ. ఈ తల్లే జానపదుల భాషలో జోగులమ్మ/ జోగుళాంబగా మారిపోయింది. "ఇలా జానపదులు ఆరాధించే గ్రామదేవతలంతా సంస్కృత సాహిత్యంలో స్థిరమైన ప్రధాన దేవతా స్త్రీ శక్తులు కలిగిన వారే తప్ప, స్థాయి తగ్గిన దేవతాజనం కానే కాదు.సంవత్సర చక్రం అలా రాగానే జానపదులు మొట్టమొదటగా చేసే పండుగ ఉగాది. అంతేకాదు అమ్మవారికి తొమ్మిది రాత్రులపాటు చక్కగా సాగే ఉత్సవాలను కూడా వీరు నిర్వహిస్తారు. కాని మనం వసంత నవరాత్రాలనగానే అమ్మవారు ఏ కంచిలో కామాక్షిగానో, మధురలో మీనాక్షి గానో, విజయవాడలో కనుకదుర్గమ్మ గానో.... ఉంటారని అనుకుంటాం. కాని గ్రామాల్లో కూడా అమ్మ ఉంటుంది. ఆ అమ్మను కొలిచే నిజమైన భక్తులు, జానపదులేనని అనటంలో అతిశయోక్తి లేదు."[3]

ఈ విధాంగా వరంగల్ జిల్లాలో గ్రామ దేవతలను జానపద కళాకారులు భక్తి శ్రద్ధలతో పూజించి మొక్కుబడులు చెల్లిస్తారు.

1వ అధ్యాయం

# పాద సూచికలు

1. నవతెలంగాణ, జానపద కళారూపాలు– భిక్షక గాయకులు, తేది.2.05.2019
2. తెలంగాణ ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య GO Ms No 250 Revenue (DA-CMRF) Depart ment, Dated: 11-10-2016
3. నమస్తేతెలంగాణ, వరంగల్ జిల్లా గ్రామదేవతలు, బతుకమ్మ ఆదివారం సంచిక

# 2

# రెండవ అధ్యాయం

## వరంగల్ జిల్లా
## ఒగ్గు కథలు స్వరూప స్వభావాలు

# అధ్యాయం-2

# వరంగల్ జిల్లా ఒగ్గు కథలు స్వరూప స్వభావాలు

## 2.1. పరిచయం

ఒగ్గు కథ విలువైన, అరుదైన ప్రాచీన తెలంగాణ జానపద కళా స్వరూపం. దేశీయ మౌళిక జానపద కళకు ప్రతీక. వందేళ్ళ క్రితం వరకు దేశ విజ్ఞానమంతా జానపద సాహిత్యం, కళల ద్వారా వ్యాపించింది. రాజుల కాలంలో జమీందార్ల హయాంలో జానపద కళా సాహిత్యాలు కొడిగట్టి పోలేదు. కులవృత్తులు వర్ధిల్లాయి. పరాయి రాజుల పాలనలో సైతం పరిఢవిల్లాయి. కానీ, స్వాతంత్ర్యానంతరకాలంలో పారిశ్రామికీకరణ, ప్రపంచీకరణ ప్రభావంతో కులవృత్తులు కూలారి పోయాయి.ప్రాచీన సంస్కృతిని ప్రతిబింబించే జానపద కళలెన్నో కాలగర్భంలో కలిసి పోయినాయి. జానపదులకు రసానుభూతిని ఆత్మానందాన్ని అందించేది శుద్ధ దేశీయ సాహిత్యమంటే అతిశయోక్తి కాదేమో! కళలు మన జాతికి జీవనాడులు, ఆ నాడుల్లో ప్రవహిస్తున్నదంతా శుద్ధ దేశీ సాహిత్య రక్తమే. దానివల్లే మౌఖిక, దృశ్య సంప్రదాయం నిత్య నూతనంగా జీవిస్తూ వచ్చింది.

## 2.2. ఒగ్గు పదము అర్థము – కులోత్పత్తి వాదాలు

ఒగ్గు కథ తెలంగాణ జానపద కళారూపం. ఒగ్గు అంటే శివుని చేతిలోని ఢమరుకం అని అర్థం. ఈ పదం కేవలం తెలంగాణ ప్రాంతంలోనే వినిపిస్తుంది. ఇది అచ్చమైన దేశీపదం. ఒగ్గు అనే పదానికి 'జెగ్గు', 'జగ్గు' అని నామాంతరాలున్నాయి. శివుని చేతిలోని ప్రత్యేక వాద్యం ఢమరుకం. మన ప్రాచీన లాక్షణికులు, వైయాకరణులు ఢమరుకం నుంచి మహేశ్వర సూత్రాలు (అక్షరాలు) ఉద్భవించాయని చెప్పారు. అలా మొత్తం అక్షరాల పుట్టుకకి కారణమైన ఢమరుకాన్ని ఒక కళారూపానికి పేరుగా పెట్టి దానికి పూజార్హతని కల్పించిన కళారూపం ఒగ్గు కథాగానం మాత్రమే.

రాగ భావ యుక్తంగా ఒక కథను అల్లడం, చెప్పడం కథాగానం అని వ్యవహరించ వచ్చు. ఈ కథాగాన కళా ప్రదర్శనంలో ఒకరు ప్రధాన కథకులు, అయితే ఇద్దరూ ముగ్గురూ లేక అంతకు ఎక్కువ మంది సహా కళాకారులుంటారు ఒగ్గు కథలో. ఒగ్గు కథలను చెప్పే కళాకారులను ఒగ్గు గొల్లలు అంటారు.

ప్రేక్షకుడికి విరామం లేకుండా కట్టి పడేసే కళ ఒగ్గు కథ. బోనం ఎత్తుకొని, వేప

మండలు పట్టుకుని ఊగుతూ, తూలుతూ ఎల్లమ్మ కథ చెప్తుంటే జనం ఊగిపోతారు. బోనం నెత్తిమీద పెట్టుకొని, ఎంతో సేపు దాన్ని కదలనివ్వ కుండా కింద వేసిన నాణాల్ని నొసటితో అందుకునే దృశ్యం అద్భుతం. జానపద కళారూపాల్లో 'ఒగ్గు కథ' ప్రముఖమైంది. ఇది కేవలం కథ మాత్రమే కాదు. గానం, నృత్యం, నాటక మిశ్రమం – గొల్ల, కురుమలు తమ కుల పురుషుడు బీరప్ప కథ చెప్పేందుకు ఎంచుకున్న రూపమే ఒగ్గు కథ. ఈ కథా ప్రక్రియకు, చదువు అవసరం లేదు. డోలు, తాళం, కంజీర వాద్యాలతో, తెలంగాణ భాషలో గంటల కొద్ది ఎన్నయినా కథలు చెబుతారు. పాటలు జోడించి కథను పండిస్తారు. పురాణాల మీద పట్టుతో ఆశువుగా కథ అలా చెప్పేస్తారు. నెత్తిన బోనం ఉంచుకుని కథ చెబుతూనే నేలను తలతో ముద్దాడతారు.

కురబ జాతివారు శివున్ని, బసవన్నని పూజిస్తారు. కురుమలకు ప్రత్యేక పూజారులు, కుల వాద్యకారులు ఉన్నారు. తెలంగాణలో ఒగ్గువాళ్లు, బీర్లోళ్లు, రాయలసీమలో గొరవయ్యలు అని వీరిని పిలుస్తారు. వైవిధ్యం కలిగిన ఒగ్గుకథ గాన, కళారూపం ఒక్క తెలంగాణాలోనే కనిపించడం విశేషం. కురుమ కుల పురోహిత వర్గానికి చెందినవారు ఒగ్గుకథని చెప్పే వృత్తిని స్వీకరించారు. బీరన్నలకు ప్రత్యేకమైన వాద్యం ఒగ్గు (ఢమరుకం) ఉపయోగించి చెప్పే వృత్తి పురాణం గురించి తెల్సుకోవడం అంటే కురుమ జాతి చరిత్ర, సంస్కృతుల్ గురించి తెలుసుకోవట మన్నమాట. ఒగ్గు దీక్ష ఒకటి ఈ కురుమల్లో కనిపిస్తోంది. ఒగ్గు కథలో తర్ఫీదు పొందాలంటే కులపెద్దల అనుమతితో శైవక్షేత్రాలలో ఏదో ఒక క్షేత్రానికి వెళ్తారు. ఆలయ లోగిళ్లలో పట్టాలువేసి విభూతి ధరించి, నామాలను జపించుకొంటూ మల్లన్న దేవుడినే ధ్యానిస్తారు. ఈ పూజ అయిపోగానే ఒగ్గువంతులు మంత్రం బోధించి ఆశీర్వదిస్తారు. ఎల్లమ్మ ప్రసాదించిన ఏడు గవ్వల హారం మెడలో వేసుకుని మల్లన్నకు ఒదుగుతూ ఒగ్గులవుతారు. ఈ ఒగ్గు దీక్ష తర్వాతే వారు బీరన్న, మల్లన్న కథలు చెప్పేందుకి అర్హత సంపాదించు కొన్నట్లు అవుతుంది. కురుమలు బీరోళ్ల దీక్ష తీసుకున్న వాళ్లు బీరోళు ్ల ఈ సంప్రదాయం పూర్వం నుంచే వస్తోంది. కురుమల్లో పౌరోహిత్యం చేసేది ఈ ఒగ్గులే. కొంత మంది ఒగ్గులు దేవుని పెట్టెలో మల్లన్న దేవుని విగ్రహాలు పెట్టు కొని కావడి కట్టుకొని ఊరూరా తిరుగుతారు. వీరు నెత్తి విరబోసుకోని, నుదిటిని పసుపు రాసుకొని, కళ్లకి కాటుక రాసుకొని ఎర్రని పొట్టి చేతుల చొక్కా, మువ్వల లాగు ధరించి కాళ్లకి గజ్జెలు కట్టుకొని నృత్యం చేస్తూ శైవగీతాలు పాడతారు.

**ఆవిర్భావం**

ఒగ్గు కళారూపం శైవమత వాప్తిలో ప్రచార మాద్యమంగా ఉద్భవించి ఉంటుంది. ఎందుకంటే పాల్కురికి సోమనాధుడు తెలంగాణ ప్రాంతంలో పుట్టి, శైవమత వ్యాప్తికి విశేషమైన కృషి చేశారు.అటువంటి గొప్పవ్యక్తి ప్రభావం ఈ ప్రాంతంలో కళలపై ఉందనడానికి నిదర్శనం ఒగ్గు కథ. ఈ కథల ఇతివృత్తాల్లో శివుడు కథానాయకుడిగా ఉంటాడు. లేదా శివుని అంశతో జన్మించిన వారు నాయకులుగా ఉంటారు. ఉదాహరణకు శివుని తొలి చెమట నుండి బీరప్ప మలి చెమట నుంచి మల్లన్న పుట్టారని, ఎల్లమ్మ శివుని కూతురని ఆయా కథల్లో వివరిస్తుంటారు.

ఒగ్గుకథల్ని తెలంగాణ ప్రాంతంలోని గొల్ల, కుర్మలు తమ కుల పురాణంగా భావిస్తారు. కుర్మలు ఈ కథల్ని ఎక్కువ ప్రచారం చేసారు. తరువాతి కాలంలో ఇతర కులాల వాళ్ళు కూడా ఈ కళారూపాన్ని నేర్చుకొని ప్రచారం చేసారు. ఇటువంటి వారి సంఖ్య చాల తక్కువ. బీరయ్య, మల్లయ్య కథలు మెదటి నుంచి ఉన్నాయి.ఆ తరువాత ఇతర కథలు పుట్టుకొచ్చాయి.

ఒగ్గుజాతి కులోత్పత్తి గురించి 'మల్లన్న కథ' ఇలా వివరిస్తుంది. "మల్లన్న భ్రమరాంబను ప్రేమించి పెళ్ళాడాలనుకుంటాడు. ఆమె తల్లిదండ్రులైన సిద్ధమ్మ వరదరాజులు తమను జూదంలో గెలిచినవారికి భ్రమరాంబనిచ్చి పెండ్లి చేస్తామంటారు. మల్లన్న జూదంలో ఆమె తల్లిదండ్రులను ఓడించి భ్రమరాంబను తీసుకుపోతాడు. అప్పుడు. వరదరాజులు తన ఏడుగురు కుమారులను పిలిచి, మల్లన్నను యుద్ధంలో ఓడించి, మీ సోదరి భ్రమరాంబను తీసుకురమ్మంటాడు. తండ్రి ఆన ప్రకారం మల్లన్న మీదికి యుద్ధానికి వెళ్ళిన ఆమె అన్నలు ఏడుగురిని మల్లన్న తన మంత్రశక్తితో ఏడుకుక్కలు కమ్మని శపిస్తాడు. వారు భయపడి, మల్లన్నను శరణువేడి శాపవిమోచనం అనుగ్రహించమంటారు. మల్లన్న కరుణించి "నేను ఊరూరా వెలసినప్పుడు మీరు నాకు తలలు 'ఒగ్గి' దాసులై పూజలు చేస్తూ, నా కథ చెప్తూ జీవించ"మని అంటాడు. వారు అంతకంటే భాగ్యమేముందని శివుని అంశతో పుట్టిన మల్లన్నకు 'ఒగ్గి'న వారైనారు కాబట్టి 'ఒగ్గు'లౌతారు. అలా ఆ సంతతి వారే నేడు మల్లన్న కథాగానం చేసేవారే 'ఒగ్గు'లని వరంగల్ జిల్లాలోని మాణిక్యపురం గ్రామస్థుడు చుక్క సత్తయ్య వివరించాడు. ఆ ఏడుగురు ఏడు గవ్వలట. మల్లన్న కొలుపులప్పుడు ఆ 'ఏడు గవ్వల హారాన్ని' ఒగ్గులు తమ మెడలో వేసుకొని పట్నాలు (పటాలు) వేయించుకుంటారు. ఒగ్గులు దాన్నే గవ్వల దర్శనమని అంటారు.

ఒగ్గుకుల ఉత్పత్తిని గురించి ఇంకొకవాదం జనంలో ప్రచారంలోవుంది.శైవ సంప్రదాయంలో చేతిలోని ఢమరుకాన్ని 'ఒగ్గు' అంటారని, ఈ ఒగ్గును వోయిస్తూ కథ చెప్తారు కాబట్టి వాటికి ఒగ్గు కథలని, చెప్పే వారిని 'ఒగ్గులు' అంటారని, అదీ కురుమలే ఈ కథలు చెప్పే వారని, వీరప్ప, మల్లన్నలు వీరి కుల దేవతలనీ డా. బిట్టు వెంకటేశ్వర్లు కరీంనగర్ రాష్ట్రీయ జానపద కళోత్సవాల సంచికలో వివరించారు. ఈ ఒగ్గు వాద్యాన్ని జెగ్గు, జగ్గు, ఒగ్గు అని కూడా వ్యవహరిస్తారు. ఒగ్గుల్లో రెండు గోత్రాల వారున్నారు. శివుని తొలి చెమట బీరప్పగాను, మలి చేమట మల్లన్నగాను పుట్టినట్లు కురుమల కథలు చెపుతున్నాయి. అవి పత్తి కంకణ స్తోత్రం, ఉన్ని కంకల గోత్రం, పత్తి కంకణగోత్రం వారు భూములు, పశు చూసుకుంటారు. ఉన్ని కంకణ గోత్రంచారు. గొఱ్ఱెలను కాస్తుంటారు. జగ్గు వాళ్ళు కురుమల పురోహితులు. కురుమల వివాహ సందర్భంలో మల్లన్న కథ చెప్పిన తర్వాతే వివాహం జరిపిస్తారు వీరికి కూడా గ్రామాలు, తాలూకాలు మిరాశీ హక్కులతో హక్కులుంటాయి. ఆ మధ్య పత్రికలో వచ్చిన సమాచారం "నల్గొండ జిల్లా ఆత్మకూరుకు చెందిన బీర్ల బుచ్చయ్య, తమ హక్కులను పొందుపరచిన క్రీ.శ. 1597 నాటి రాగి శాసనాన్ని పురావస్తుశాఖ సంచాలకులకు చూపాడు. అందులో బీరప్ప పండుగలు. చేసే హక్కుకు సంబంధించిన వివరాలున్నాయి దీన్నిబట్టి ఒగ్గు కథ ప్రాచుర్యాన్ని గమనించవచ్చు. ఒకరి హద్దులోకి వచ్చి మరొకరు వివాహాలు చేయకూడదు. దీన్ని అతిక్రమిస్తే కుల బహిష్కారం వుంటుంది. కురుమల పురోహితులైన బీర్లవాళ్ళ వంశాలకు చెందని వారు ఒగ్గు కథలు నేర్చుకుని ప్రదర్శిస్తే కుల బహిష్కారం శిక్ష విధిస్తారు. ప్రసిద్ధ ఒగ్గు కథకుడు చుక్క సత్తయ్య ఒకప్పుడు కుల బహిష్కార శిక్షకు గురయ్యాడట.

'ఒగ్గు కథలు' ఈనాటి ఒగ్గు కళాకారులు కానీ, ఇతర రచయితలు కానీ . వ్రాసినవి కావు. వీరి తాత తండ్రులు పరంపరగా కథల్లో నాటి సంస్కృతి, జన జీవితం. మానవ సంబంధాలు ప్రధానంగా భాషాపరంగా మరుగునపడిన మాండలికాలు, సామెతలు, జాతీయాలు నుడికారం మార్పులేకుండా అమూల్యమైన భాషా విశేషాలను గమనించవచ్చు. భాషా పరిశోధకులకీ కథలు తరగని భాషా విశేష భాండాగారాలు.

ఒగ్గు కళాకారుల అవిర్భావం గురించిన కులోత్పత్తికి సంబంధించిన పురాణగాథ ఒకటి కనిపిస్తోంది. చంద్రికాపూరినేలే రాజు, ఆయన భార్య డొక్కా మహాదేవి. కుమారుడు మల్లిఖార్జునుడు. జానపదులు చెప్పుకునే మల్లన్న ఈయనే. భ్రమరాంబ తల్లిదండ్రులను జూదంలో ఓడించి బ్రమరాంబను చేపట్టాలని పందెం కాస్తే మల్లన్న గెలిచి ఆమెను

పెండ్లాడాడు. గెలిచిన మల్లన్న మీద భ్రమరాంబ ఏడుగురు సోదరులు ఘోరయుద్ధం చేసి, ఓడిపోయి బానిసలవుతారు. "నేను ఊరూరా దేవునిగా వెలసినప్పుడు మీరు ఏడుగురు సోదరులు ఒగ్గి లొంగిన వారై నా కథలను చెప్తూ జీవించండ"ని విముక్తి చేశాడు. అలా ఒగ్గిన వారే ఒగ్గులైనారు. వారే కురుమ కులానికి పూజారులైనారు.

కురుమజాతికి ఆరాధ్యదైవాలైన మల్లన్న, బీరన్న కథాగానాలను ఒగ్గు కథల్లో చెప్తూ అప్పటి నుండి జీవనం గడుపుతూ వస్తున్నారు. శైవక్షేత్రాలైన కొమురెల్లి మల్లన్న. కట్టమల్లన్న, ఐనవోలు గుడుల వద్ద, శ్రీశైలం లాంటి పెద్ద ఆలయాల వద్ద పట్నాలు వేసి భక్తుల చేత మొక్కులు చెల్లిస్తారు. ఎల్లమ్మ దేవత ప్రసాదించి ఏడు గవ్వల హారాన్ని మెడలో ధరించి వారు దైవ కార్యాలను నెర వేరుస్తుంటారు. కొందరు ఒగ్గోలు మల్లన్న దేవుని విగ్రహాలను కావడిలో పెట్టుకొని ఊరూరా తిరుగుతూ తమ భక్తిని చాటుకొంటారు. నెత్తిని విరబోసుకొని, నుదిటిన పసుపు రాసుకొని, కండ్లకు కాటుక దిద్దుకొని, ఎర్రని పొట్టి అంగిని, మువ్వల లాగుని ధరించి, కాళ్లకు గజ్జెలు కట్టుకొని నృత్యం చేస్తూ నిరంతరం శివారాధనలో ధన్యులవుతుంటారు.

## 2.3. ఒగ్గు కథ స్వరూప స్వభావాలు కథాగమనం

ఇతివృత్తం దగ్గర నుంచి కథనం వరకు ప్రత్యేకమైన శైలిలో నిర్మాణం పొందిన ప్రక్రియ ఒగ్గుకథ. జీవిత చరిత్రల్ని ఇతిహాసాలుగా మలిచే పద్ధతి ఒగ్గు కథని చూసి నేర్చుకోవచ్చు. గొల్ల కుర్మల కులదైవాలు దైవాంశ సంబూతులైనా మానవ మాత్రులుగా జీవించిన తీరు వారికి కుల వృత్తిపైన ఉండే అభిమానం కళ్లకు కట్టినట్టు చూపిస్తారు. ఈ కథలు విన్న ఏ మనిషైన ఈ కులాల్ని గౌరవభావంతో చూస్తారు. కథని ఉపన్యాస ధోరణిలో లేక నాటక రూపంలోనో లేక సంగీత రూపకంలోనో లేదా పద్యాల రూపంలోనో చెప్పటం ఆయా కళారూపాల స్వభావం. ఇవన్ని విభాగాలను తనలో పలికించడం ఒగ్గుకథ ప్రత్యేకత. ఒక ప్రధాన కథకుడు ఒక సహాయకుడు ముగ్గురు వంతగాళ్ళు ఉంటే చాలు ఒగ్గు కథ అలవోకగా సాగిపోతుంది. ఒగ్గు కళాకారులకి ముఖ్యంగా నాలుగు విషయాలపైన పట్టుంటుంది. వీరు ప్రదర్శించే ఈ అంశాల్లోని నైపుణ్యమే ఒగ్గుకథని జానపదుల హృదయస్పందనల్లో ఎప్పటికీ మర్చిపోలేని రీతిలో నిలబెట్టింది.

### సంగీతం

'పువ్వుకి పరిమళం, కళాకారుడికి కంఠం' ఉండాలి. మంచి పరిమళం లేని పువ్వుకి విలువలేదు. మంచి గొంతులేని కళాకారునికి భవిష్యత్తులేదు. ఒగ్గుకథా నిర్వహణలో

శబ్దం పాత్ర కీలకమైంది. సంభాషణలు, ధన్యనుకరణలు, రాగాలు అన్నీ శబ్దంపైనే ఆదారపడి ప్రవర్తిల్లుతాయి. సంభాషణలు స్త్రీ, పురుష పాత్రలకి అనుగుణంగా మలుచుకుంటారు. కొన్ని స్త్రీ పాత్రలు ఏడ్చే సందర్భంలో కళాకారులు కూడా ఏడుస్తారు, శ్రోతల్నీ ఏడిపిస్తారు. కొన్ని కొన్ని చోట్ల ధ్వన్యను కరణ చేస్తుంటారు. గొర్రెలాగా అరవటం, గొర్లకాపర్లు చేసే విచిత్రమైన ధ్వనిని అనుకరిస్తూ శ్రోతల్ని నవ్విస్తూ ఉంటారు. ఇక దేశీసంగీత ఆలాపనలో ఒగ్గుకళాకారులు దిట్టలు.దాదాపు అన్ని జానపద సంగీత బాణీలు ఒగ్గుకథలో ఉన్నాయి. జోలపాటలు, సువ్వి పాటలు, మంగళహారతి పాటలు, బతుకమ్మ పాటలు, శృంగార పాటలు వంటివి ఒగ్గు కథల్లో వినిపిస్తుంటాయి. వీటితో పాటు కథని నడిపించడానికి ఆ...ఆ.... అని వంతకారుల గొంతు ఊతమిస్తుంది. 'రామరామ రామన్నరామ రాఘవా రామన్నరామ' అనే వాక్యాన్ని కూడా కథానడకకి ఉపయోగిస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఒగ్గుకళాకారులు గొంతుతో అభినయిస్తారు. మనలోని ఊహల ప్రపంచానికి రెక్కలు తొడుగుతారు, కల్పనా చాతుర్యాన్ని పరిగెట్టిస్తారు.

**ఆశు రచనా :** ఒగ్గు కళాకారులు ఆశురచనా నైపుణ్యం కూడా కలిగి ఉంటారు.యతి, ప్రాసలు తప్పకుండా మాత్రాచందస్సులో కథాసందర్భానికి తగిన విధంగా పాటలు అల్లుతారు.మూలకథకి ఏమాత్రం భంగం కలగకుండా వీటిని జొప్పిస్తారు.అప్పుడప్పుడు హాస్యపు సంఘటనల్ని కూడా శ్రోతల్లో ఉత్సాహం కలిగించడం కోసం సృష్టిస్తుంటారు.

**మానసిక పరిపక్వత**

ఇది అన్నిటికన్నా ప్రధానమైనది. ఒగ్గు కళాకారుల్లో విస్తృతంగా ఉంటుంది. ప్రేక్షకుల మనసు తెలుసుకుని వారికి నచ్చే విధంగా కథని చెప్తారు. ఎక్కడ ప్రేక్షకుడు ఏడుస్తాడు, ఎక్కడ నవ్వుతాడు, ఎక్కడ భక్తి భావంతో ఉంటాడో తెలుసుకొని కథను నడిపిస్తాడు. కథచెబుతూ వెంటనే పాత్రదారునిగా మారటం అందులో పూర్తిగా లీనమై వెనువెంటనే కథకుడిగా మారటం సంయమనం ఉన్న కళాకారుడు తప్ప ఇతరులకి అసాధ్యం.ఒగ్గుకళాకారుడు ఇవన్నీ కలిగుంటాడు.

**ప్రార్థనాగీతం :** ప్రార్థనాగీతంలో మొదట గంగని తలవటం ప్రత్యేకమైన అంశం. దేశీయత ఉట్టిపడేటట్టుగా గంగ గొప్పతనాన్ని చెప్పడం, జనాల్ని మంత్ర ముగ్దుల్ని చేసేరాగాలాపన, విస్మయం కలిగించే ఆహార్యం, పొడుపు కథలు, జాతీయాలు, సామెతలు, ఇతర అన్యదేశ్యాలు కథలో సహజంగా ప్రవర్తిల్లుతాయి. సీన్ కి తగిన స్టేజ్ ఉండకపోయినా, పాత్రకి తగిన వేషదారణ కనబడకపోయినా ప్రేక్షకులు తమ హృదయసభల్లో ఆ లోటుని

భర్తీ చేసుకుంటారు. మిద్దెరాములు, చుక్కసత్తయ్య, పూదూరు మల్లయ్య మొదలైన ఒగ్గు కళాకారులు ప్రపంచపు జానపద కళాయవనికపై ఒగ్గుకథా రూపాన్ని స్థిరంగా నిలిపారు.

**ఆహార్యం :** ఒగ్గుకథ నాటక ప్రక్రియ కాదు. అయిన నాటక సన్నివేశాలు అనేకం ఉన్నాయి. సంప్రదాయ వేషధారణే కాని పాత్రోచిత వేషధారణ ఉండదు. కూచిపూడి కళాకారులకి ఉండేంత అభినయ నైపుణ్యం ఒగ్గుకళాకారులకీ ఉంటుంది. కథకులు కథని చెబుతూ వెంటనే తమను తాము పాత్రలుగా మలుచుకుంటారు. గాంభీర్యప్రదర్శనలో, లాలిత్య పోషణలో, రసాబాస కలిగించటంలో ఇతర నాటక కళాకారులకి ఏమాత్రం తక్కువ కాకుండా నటిస్తారు. ముఖకవలికలు కదపటంలో. చేతుల్తో నాటక ముద్రల్ని ప్రదర్శించటంలో, ఒంటితో సాత్వికతని ప్రదర్శించండంలో విశేషమైన ప్రజ్ఞని ప్రదర్శిస్తారు.

**సాము :** పూర్వం ఏ గ్రామంలో చూసినా వ్యాయామ శాలలకు సంబంధించిన తాలింఖాలు వుండేవి. ముఖ్యంగా వ్యవసాయ తరుణం అయిపోయిన తరువాత తీరుబడిగా వున్న సమయంలో గ్రామంలో వుండే యువకులందరూ పైన సూచించిన తాలింఖానాలలో చేరు కర్ర సాము, కత్తి సాము, గరిడీలను చేసే వారు. వారు ముఖ్యంగా ఆత్మ రక్షణ కోసం ఈ విద్యను నేర్చుకునే వారు. ఒకప్పుడు రాజాధి రాజులు తమ దేశ రక్షణకోసమూ, ఆత్మ రక్షణ కోసమూ సైనికులకు శిక్షణ ఇచ్చేవారు. పాలకులు కూడా ఈ విద్యలో ఆరి తేరిన వారై యుండేవారు.

**మారిని పరిస్థితులు :** రాజులు, సామత రాజులూ పోయిన తరువాత ఆంగ్లేయులు భారత దేశాన్ని హస్త గతం చేసుకున్న తరువాత అత్యాధునిక మారణాయుధాలు వచ్చిన తరువాత కత్తిసాము, కర్రసాము ప్రాముఖ్యం తగ్గి పోయిన తరువాత వీటి మీద ప్రజలకు ఆసక్తి తగ్గి పోయిందని డా. బిట్టు వెంకటేశ్వర్లు గారు కరీంనగర్ రాష్ట్ర స్థాయి జానపద కళోత్సవాల సంచికలో ఉదహరించారు. ఆనాడు ఈ విద్యకు అధిక ప్రాముఖ్యతనిచ్చేవారు. ఈ విన్యాసాలలో పోటీలు ఏర్పరచేవారు.ప్రజలు ఎంతో ఆసక్తితో ఈ ప్రదర్శనాలను ప్రదర్శించేవారు.ఆంగ్లేయుల కాలంలో కూడా సంస్థానాలలోనూ, జమీందారీలలోనూ ఈ విద్యను పోషించేవారు. విజయనగర సామ్రాజ్యంలోని సంస్థాన సామంత రాజులు కత్తి సాము కర్ర సాములను ఔత్సాహిక ప్రదర్శనలుగా నిర్వహించేవారట.ఎంతో సాహస వంతంగా ప్రాముఖ్య వహించిన ఈ కర్ర సాము, కత్తి సాము విద్యలు వినోదాత్మక ప్రదర్శనలుగా విరాజిల్లాయి. ఈనాడు వీటికి ఏవిధమైన ఆదరణ లేక పోయినప్పటికి ఈ ప్రదర్శనలు ఒక ప్రక్రియగా, ఒక కళగా ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రదర్శనలు వెనుకటి

రోజుల్లో కత్తి సాములో రక్షణ కొరకు కృపాణాలనూ, కవచాలనూ ధరించి సైనికుల్లాగా ఏ పోరాటమైనా జరిపేవారు. అయితే ఈ నాడు మామూలు వస్త్ర ధారణ తోనే ఈ విద్యను ప్రదర్శిస్తున్నారు.

ముఖ్యంగా కర్ర సాములో ఒక కర్ర తోనూ రెండు చేతులతో రెండు కర్రల తోనూ ఒకరి కొకరు పోటీ పడి, ఒకరు కొట్టిన దెబ్బను మరొకరు కాచుకుంటూ ప్రేక్షకులకు భయం కలిగే విధంగా ఉధృతంగా కర్ర సాము చేసేవారు. అదే విధంగా కత్తి, డాలును ధరించి కూడా అలాగే పోరాటం జరిపేవారు. ఈ పోరాటంలో ఎత్తుకు పై ఎత్తులు, దెబ్బ కొట్టడం, దెబ్బ కాచు కోవడం ఒకరి కొకరు తల పడి ఉధృతంగా పోరాటం జరిపే వారు. ఈ పోరాటంలో కొందరు డప్పు వాద్యంతో పోరాట కారుల్ని ఉద్రేకపర్చే వారు. ప్రేక్షకులు, ఈలలతో, కేకలతో ఇరు పక్షాలుగా విడిపోయి ఇరువుర్నీ ఉద్రేకపర్చే వారు.

**టాసా వాద్యం :** కర్ర సాము, కత్తి సాము జరిపేవారు అడుగులనూ, భంగిమలనూ చాలా అట్ట హాసంగా చూపించేవారు. అడుగులకు అనుగుణంగా టాసా అనే వాద్యాన్ని వాయించేవారు. తొలి చెమట, మలి చెమట ......... శివుని తొలి చెమట బీరప్పగానూ, మలి చెమట మల్లన్న గానూ పుట్టినట్లు కురుమల కథలు చెపుతున్నాయి. బీరప్పను కురుమల కులగురువుగా భావిస్తారు. మల్లన్న సాక్షాత్తు జన్మనిచ్చిన వాడు కురుమలకు. మరొక కథనం ప్రకారం, ఆది రెడ్డి నీలమ్మల సప్తమ సంతానం, అతను పద్మాక్షి, రత్నాక్షి అనే ఇద్దరిని పెండ్లాడతాడు.అనగనగ ఒక పేదరాసి పెద్దమ్మ ఉందట.

### 2.4. జానపద కళా రూపాలు – ఒగ్గు వృత్తి కళాకారులు

తెలంగాణా ఘనవారసత్వానికి ప్రతీకలు చెప్పుకునే కళారూపాలు, కళాకృతులు నెలకొన్న ప్రాంతం వరంగల్. తెలుగు సంస్కృతుల్లో తెలంగాణ సంస్కృతి చాలా గొప్పది. కాలగమనంలో ఆంధ్ర సంస్కృతిలో భాగంగా పేర్కొని దీన్ని నష్టపరిచినప్పటికీ, ఇవాల్టి సందర్భంలో తెలంగాణ సంస్కృతి పునరుజ్జీవనం పొందుతోంది. భౌగోళికంగా బాగా సుసంపన్నమైన తెలంగాణకు తూర్పున కందికల్ గుట్టల వరుస, పడమట బాలాఘాట్ పర్వతశ్రేణులు, ఉత్తరాన గోదావరి, దక్షిణాన కృష్ణానదులు ఉన్నాయి. ఇలా ఎన్నో వనరులు ఉన్న ప్రదేశం కావడం వల్ల స్థానికంగా చరిత్ర, నాగరికత, సంస్కృతి ఇక్కడ వికసించినాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మిగతా సంస్కృతులకు ఇంత విస్తృతి లేదు.

వరంగల్ ప్రజలు కష్టజీవులు, వారికి అంకితభావం ఎక్కువ. వీరి జీవితమే సంఘర్షణల మయం. పోరాటం ఇక్కడి జనుల రక్తంలోనే ఉంది. క్రీ.శ.1303లో అల్లా

ఉద్దీన్ ఖిల్జీ సైన్యాన్ని ఓడించి వెనక్కి పంపించారు. 1309లో మాలికా కాఫర్ సైన్యాలతో రోజుల తరబడి యుద్ధాలు చేశారు. 1321లో ఉల్గూఖాన్‌ను ఆరుమాసాలు యుద్ధంలో ఎదుర్కొన్నారు. క్రీ.శ. 1303 నుండి 1433 అహ్మద్‌షా సైన్యాలతో జరిపిన ఎన్నో యుద్ధాల్లో తెలంగాణ ప్రజలు కష్టనష్టాల పాలయ్యారు. ఆ పరంపరే కొనసాగి నిజాం రాజుల పాలనలో భాషా సంస్కృతుల అణచివేత, ఆర్థిక పీడన, జాగీర్దారుల దోపిడీ, కుట్రలు తెలంగాణాలో సాంస్కృతిక వికాసాన్ని నిరోధించాయి.

తెలంగాణాలో,అందులో వరంగల్ ప్రాంతంలో మతసహిష్ణుత ఎక్కువ. ఇక్కడ ఎన్నో మతాలు కలిసి ఉండేవి. ఇక్కడ మొదట్లో జైనమత ప్రభావం ఎక్కువ అనడానికి నిదర్శనాలు పొట్లచెరువు, కొలనుపాక,జనగామ, కొల్చారం,వేములవాడలోని జైనకేంద్రాలు. మొదటి బేతరాజు జైనాలయానికి, రెండవ బేతరాజు జైనబసదికి దానాలు చేసినట్లు శాసనాలు చెబుతున్నాయి. కుతుబ్‌షాహీల కాలంలో సూఫీతత్వానికి ప్రజాదరణ లభించింది. వరంగల్‌లో మతపరమైన సమస్యలు కనిపించవు. ఎంతో వైభవంగా జరిగే బోనాల జాతరలో ముస్లింలు కూడా పాల్గొంటారు. ముస్లిం ఉత్సవాల్లో, ఉర్సుల్లో హిందువులు పాల్గొంటారు. కోర్కెలు నెరవేర్చుకోవటానికి హిందువులు పీర్లకు దట్టీలు కట్టడం, ఊదు చదివించడం ఇక్కడ మనం గమనించవచ్చు. కొమురవెల్లి జాతర, ఏడుపాయల జాతర, వేములవాడ జాతర, సమ్మక్క–సారక్క జాతర, మహంకాళమ్మ బోనాలు, పెద్దగుట్ట ఉర్సు, లతీఫ్ సాబ్ గుట్ట ఉర్సు, జాన్ పహడ్ దర్గా ఉర్సు తెలంగాణ ప్రజల మత సామరస్యాన్ని తెలిపే సందర్భాలు.

ప్రస్తుతం తెలంగాణా మళ్లీ రాష్ట్ర స్థాయిని పొందిన తరువాత సాంస్కృతిక పునరుజ్జీవన ప్రయత్నంలో భాగంగా తెలంగాణ ప్రజలు బతుకమ్మ పండుగ, హోళీ పండుగ, పీర్లపండుగ, దసరా పండుగలను అత్యంతవైభవంగా జరుపుకుంటున్నారు. ఇవికాక వ్యవసాయ సంబంధమైన కొట్రావుల పండుగ, పాడిపశువుల రక్షణ కోసం బాలమ్మ పండుగ, గ్రామరక్షణ కోసం, రోగనివారణ కోసం పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, ముత్యాలమ్మలకు ప్రతి సంవత్సరం జరుపుకునే బోనాల పండుగలు తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే విధంగా అలరారుతూ ఉన్నాయి.

తెలంగాణా ప్రాంతం, అందులో వరంగల్ ప్రాంతం కళలకు పుట్టినిల్లని చెప్పవచ్చు. ఈ ప్రాంతాన్ని పాలించిన కాకతీయులు, కుతుబ్?షాహీలు కళల్ని ఆదరించారు. కాకతీయుల కాలంలో నిర్మితమైన వేయిస్తంభాల గుడి, రామప్ప గుడి నాటి శిల్పకళకు అద్దం

పడుతున్నాయి. కాకతీయుల పాలనలో నాట్యానికి ప్రత్యేక ఆదరణ లభించింది. నృత్యం నేర్పడానికి ప్రత్యేకమైన శిక్షణా కేంద్రాలు ఉండేవి. నాటి లిఖిత సాహిత్యంలో పాలకుల, స్థానికేతరుల చరిత్రలు వర్ణితమైతే, మౌఖిక సాహిత్యంలో స్థానిక గాథలు చోటుచేసుకుంటాయి. గ్రామంలో వ్యవసాయం ప్రధానవృత్తి అయినప్పటికీ ప్రజాజీవనం సౌకర్యంగా సాగటానికి ఇతర చేతివృత్తుల వారు ఉండేవారు. పనిముట్లు చేసేవారు, అవసరాలు చూసే పనివారు పూర్వకాలం నుండి ఉండేవారు. శాతవాహనుల కాలంలో కోలిక (సాలె), కుమ్మరి, కంచరి,కమ్మరి,స్వర్ణకారులు,వడ్రంగులు అనే వృత్తివారు ఉన్నట్లు సాహిత్యం ద్వారా తెలుస్తున్నది. కాకతీయుల కాలంలో పురోహితుడు, కంసాలి, కుమ్మరి, కమ్మరి, కంచరి, వండ్రంగి, చాకలి, మంగలి, సాలె, గొల్ల, బెస్త, ఈడిగ, గాండ్ల, చర్మకారవృత్తి వారు ఉండేవారని తెలిస్తోంది. ఈ కాలాలలో వ్యవసాయ పనిముట్లు చేసే వారికి అధిక ప్రాధాన్యత ఉండేది. తెలంగాణలో నేసిన పట్టువస్త్రాలకు ప్రపంచ ప్రసిద్ధి. గద్వాల, పోచంపల్లి మొదలైనవి ముఖ్యమైన వస్త్రోత్పత్తి కేంద్రాలు ఉండేవి. ఈ విధంగా వరంగల్ వివిధ వృత్తికళా సంస్కృతుల సమ్మేళనమని చెప్పవచ్చు.

వరంగల్‌లో వివిధ కళా రూపాలు ఆయా కాలాల్లో విలసిల్లాయి.కళలు ఎంతగా అభివృద్ధి చెందాయంటే,అవి భిన్న సంస్కృతుల సమ్మేళనానికి దోహదం చేసే విధంగా ఉండేవి. రెడ్డిరాజుల కాలంలో గోడల మీద చిత్రాలు లిఖించేవారు. వేశ్యల పడకగదుల గోడలపై వివిధ పౌరాణిక ఘట్టాల చిత్రాలుండేవని నాటి సాహిత్యం వల్ల తెలుస్తున్నది. వారు బొమ్మలను తూలికలతో గీసేవారు. అలాంటి కొన్ని చిత్రలేఖనాలలో హిందూ-పారశీక సాంప్రదాయాలు కనబడతాయి. కాకతీయుల కాలంలో శిల్పకళ వృద్ధి చెందింది. రామప్ప దేవాలయం, అలంపురం, అహోబిలం, కాళేశ్వరం, పాలంపేట, మంథని దేవాలయాల శిల్పాలలో కాకతీయ శిల్పకళానైపుణ్యం కనబడుతుంది. మనోరంజనం కోసం ఆ రోజుల్లో యక్షగానాలు, తోలుబొమ్మలాటలు ఆడేవారు. కిన్నెర, వీణ, భేరి, దుందుభి లాంటి వాద్యాలుండేవి. నాటి కళలలో ముస్లిం సంస్కృతి ఛాయలు కనబడుతూ ఒక వినూత్నమైన సంకీర్ణ సంస్కృతికి బాటలు వేసినాయి.

తెలంగాణ జానపద కళలు తెలంగాణా సంస్కృతి నిలయాలు.ఈ కళలు మట్టిలో మాణిక్యాలు, కులాశ్రయాలు, వారసత్వ కళానిధులు. జానపదులకు ఇవే వినోద సాధనాలు, విజ్ఞానప్రదాతలు. పల్లెపల్లెనా వీధివీధినా ప్రదర్శించబడి, ఇంటింటా సంభావనలు పుచ్చుకున్న ఈ కళలు ఒకనాడు పల్లీయుల ఆదరణలో కళకళలాడినా, నేటి ఆధునిక సామాజిక

పరిస్థితుల్లో సంక్షోభంలో పడ్డాయి. వెలవెలపోతున్నాయి. కళాకారులు దిక్కులేని పక్షులయ్యారు. పొట్టకూటి కోసం అలమటిస్తున్నారు.

సంస్కృతీ సంప్రదాయాలకు నిలయమైన ఈ ప్రాంతంలో జానపద కళారూపాలు వందకు పైగా ఉన్నాయి. ఇవి ఇక్కడి  విశిష్ట సంస్కృతికి అద్దం పడుతున్నాయి. ఒక కులం సంస్కృతీ సంప్రదాయాలను, ఆ కుల పుట్టు పూర్వోత్తరాలను ఈ కళారూపాలు వివరిస్తాయి. ఈ కళారూపాలు ప్రదర్శించే వారిని ఉపకులాలకు చెందిన వారిగా, హక్కుదార్లుగా పిలుస్తూ, వారి కళారూపాలను ఆశ్రిత కళా రూపాలుగా పిలుస్తున్నారు. ఈ కళా రూపాల ప్రదర్శన విధానాన్ని బట్టి తొమ్మిది రకాలుగా వర్గీకరించవచ్చు. అందులో బొమ్మలాటలు, అనుష్టాన కళారూపాలు, వాద్య కళారూపాలు, పటం కథలు, ఇంద్రజాల ప్రదర్శనలు, నృత్యాలు, కథాగాన కళారూపాలు వేషాలతో కూడిన కళారూపాలు, భజన సంప్రదాయ కళారూపాలు తదితరాలు ఉంటాయి.

**బొమ్మలాటలు** : బొమ్మల ద్వారా ప్రదర్శన ఇచ్చే కళారూపాలు. ఇవి వివిధ రకాల వస్తువుతో బొమ్మలు తయారు చేసి వాటితో ఆడించే బొమ్మలు, తోలుబొమ్మలు, చెక్క బొమ్మలు, మందిచ్చుల బొమ్మలు, పెద్దమ్మలోల్ల బొమ్మలు ప్రధానంగా కన్పిస్తాయి. ఇవే ప్రాచీన కళారూపాలుగా, ఛాయా చిత్రాలకు మాతృకలుగా నిలిచాయి.

**తోలుబొమ్మలు** : జంతు చర్మాలతో బొమ్మలను అందంగా తయారు చేసి వాటికి రంగులు అద్ది తెరమీద ఆడిస్తూ, రామాయణ, భారత, భాగవత కథలతో పాటు ఇతర కథలు కూడ ప్రదర్శిస్తారు. వరంగల్ జిల్లా తొర్రూరు ప్రాంతాల్లోను, నల్లగొండ జిల్లా కోదాడ ప్రాంతాల్లో ఈ కళాకారులున్నారు. కనుమరుగై పోతున్న కళారూపాల్లో ఇది ఒకటి.

**చెక్క బొమ్మలాట** : తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధి పొందిన కళారూపం చెక్క బొమ్మ లాట కళారూపం. వరంగల్ జిల్లా తొర్రురు మండలం అమ్మా పురం, వెంకటాపూర్ మండలం బూర్గుపేటలోను మాత్రమే ఈ ప్రదర్శన ఇచ్చే కళాకారులు ఉన్నారు. చెక్కతో తల, ఛాతి వరకు అందంగా తయారుచేసి మిగితా భాగాలను రంగు రంగుల గుడ్డలతో అలంకరిస్తారు. ఈ బొమ్మల చేతులకు దారాలు కట్టి తెరవెనుక ఉండి ఆడిస్తారు. వీరు ఎక్కువగా భారత, రామాయణాది కథలు ప్రదర్శిస్తారు.

**మందెచ్చులు** : మందెచ్చుల బొమ్మలు, 'నకాశి' వారు పొనిక కర్రతో, చింత గింజల అంబలితో వివిధ రకాలైన బొమ్మలు, పటం కథలకు సంబంధించిన బొమ్మలు, కులపురాణాల వృత్తాంతాలను తెల్లటి గుడ్డమీద వేస్తారు. వీటితో పాటు వివిధ రకాల మాస్కులు, పెద్దమ్మ

బొమ్మలు, లాంటివి తయారు చేస్తారు. వీరు తెలంగాణ ప్రాంతంలోఉండటం మనకు గర్వకారణం.

యాదవులకు ఆశ్రితులైన మందెచ్చుల వాళ్ళు బుడిగె జంగం కులస్థులు. వీరు యాదవులకు సంబంధించిన కాటమరాజు కథ, ఎల్లమ్మకథ, పెద్దిరాజు కథలను ప్రదర్శించేటప్పుడు రంగస్థలం పైన వాటి సంబంధించిన బొమ్మలను చూపుతూ కథ చెపుతారు. వీరు వరంగల్ జిల్లా వెంకటాపూర్, నారాయణపురంలో ఈ కళాకారులు ఉన్నారు. పెద్దమ్మలోల్లు, పెద్దమ్మ దేవతను నెత్తిమీద పెట్టుకొని ఊరూరు తిరుగుతూ, చర్నాకోలాతో కొట్టుకుంటూ, శరీరాన్ని కోసుకుంటూ భయానకంగా కనబడుతారు. వీరు తెలంగాణ అంతట జాతరల్లో ఎక్కువగా ఉంటారు.

**పంబా కళారూపం :** గ్రామదేవతల ఉత్సవాల్లో, బొడ్రాయి ప్రతిష్ఠాపనలో వీరి ప్రదర్శన తప్పక ఉంటుంది. ఎల్లమ్మవేషంలో ఊరు చుట్టూ పొలి చల్లుతూ గ్రామం బాగుండాలని కోరుకుంటారు. ఈ అనుష్టాన కళా రూపాలు తెలంగాణ ప్రజలతో విడదీయరాని సంబంధం ఉన్నప్పటికి ఆధునీ కరణ పేరుతో ఈ కళారూపాలు కూడ రంగస్థల ప్రవేశం చేస్తున్నాయి.

**అనుష్టాన కళారూపాలు :** అనుష్టాన కళారూపాలను పండుగల్లో, దేవతల ఉత్సవాల్లో మాత్రమే ప్రదర్శిస్తారు. వీటిలో బతుకమ్మ, బోనాలు, దుబ్బుల కొలుపులు, పంబా, ఎల్లమ్మవేషం, వీరముష్ఠి వంటి కళారూపాలు మనకు కనబడుతాయి. తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ, బోనాలను రాష్ట్ర పండుగలుగా గుర్తించి సముచిత స్థానాన్ని కల్పించింది. దుబ్బుల వాళ్ళు దుబ్బు వాద్యంతో పెద్దేవరను కొలిచే పూజారులు.

**వాద్య కళారూపాలు :**వాద్య కళారూపాల్లో ప్రధానంగా చెప్పుకునేవి డప్పు,దీనిని శుభా శుభాలకు వాడినప్పటికి ప్రత్యేకమైన దరువులను వాయిస్తూ రక రకాలుగా నృత్యాలు చేస్తారు. ఇక తెలంగాణకే ప్రత్యేకమైన ఒగ్గుడొల్లు, ఒగ్గు కథలతో పాటు వివిధ రకాల దరువులతో నృత్యాలు చేస్తారు.

బుడబుక్కలవాళ్ళు బుడగ అనే వాద్యంతో భవిష్యత్తు చెపుతూ ఇంటిముందు శ్రావ్యంగా వాయిస్తారు. ప్రజలకు వీరిమీద అపార నమ్మకం ఉంటుంది. విశ్వ బ్రాహ్మణులకు కులపురాణాన్ని చెప్పేవారు రుంజ కళాకారులు. 'రుంజ' అనే వాద్యంతో ముప్పై రెండు రకాల ధ్వనులు చేస్తూ విశ్వకర్మ పురాణం, మూలస్తంభం వంటి కథలు చెబుతారు. తెలంగాణవ్యాప్తంగా ఒక్క మహబూబ్ నగర్ ప్రాంతాల్లో ఒకటి రెండు బృందాల వారు మాత్రమే ఉన్నారు.

**పటం కళారూపాలు :** తెలంగాణలోనే ప్రత్యేకంగా ప్రదర్శించే కళారూపాలు పటం కథలు. ఇవి పన్నెండు వరకు కలవు. ఈ పన్నెండింటినీ ప్రదర్శించేవారు వరంగల్ ప్రాంతంలోనే ఉన్నారు. వీటిలో ఒక్కొక్క కులం కులపురాణాలను ప్రదర్శిస్తారు.వాటిలో పద్మశాలీ కులం వారికి 'కూనపులి కళాకారులు', మార్కండేయ పురాణం, మాదిగ కులం వారికి 'డక్కలీ వారు' జాంబ పురాణం, మాల కులంవారికి 'గుర్రపు వారు' భేతాళ పురాణం, చాకలి వారికి 'మా సయ్యలు' మడెలు పురాణం, గౌడ కులం వారికి 'ఏనోటి వారు', గౌడ జెట్టిలు' గౌడ పురాణం, కుమ్మరి వారికి 'పెక్కర్లు' గుండ బ్రహ్మపురాణం, యాదవులకు 'తెరచీరల వారు' మల్లన్న కథను, ముదిరాజు కులస్థులకు 'కాకి పడిగెలవారు' పాండవుల కథలను చెపుతారు."[1]

గిరిజన తెగైన నాయక పోడువారికి 'తోటివారు' పద్మనాయక వృత్తాంతమనే కథను ప్రదర్శిస్తారు. పై కులాల వారికి ఆశ్రితులుగా ఉంటూ కులపురాణాన్ని నకాశి ద్వారా బొమ్మలు వేయించి ఆ బొమ్మల ఆధారంగా ప్రేక్షకులకు కథను చెపుతారు. ఈ కళారూపాలు వరంగల్, కరీంనగర్ జిల్లాలోనే ఎక్కువగా ఉన్నాయి.

**జానపద నృత్యాలు :** నృత్య కళారూపాలు ఎక్కువగా గిరిజన తెగలకు సంబంధించినవే ఉన్నాయి. ఇవి వారి ఐక్యత భావాన్ని వెల్లడిస్తాయి. వీటిలో బంజారాలు సుగాలి నృత్యం, గోండు గుస్సాడి నృత్యం, కోయకొమ్ము నృత్యాలు, ధింసా, రేలా, దండారి లాంటి నృత్యాలు కనబడుతాయి. వీటితో పాటు పండుగలకు సంబంధించిన నృత్యాలు ఆయా సందర్భాల్లో ప్రదర్శిస్తారు.

**ఇంద్రజాల ప్రదర్శనలు :** ఇంద్రజాల ప్రదర్శనలో 'సాధన శూరులు' పద్మశాలీ కులస్థులకు ఆశ్రితులుగా ఉంటారు. వీరు వివిధ రకాల విన్యాసాలు ప్రదర్శిస్తారు. చొప్ప బెండులతో పల్లకి చేసి అందులో కూర్చోవటం, నెత్తిమీద పొయ్యి పెట్టడం, చెవిలో నుండి నీళ్ళుపోసి ముక్కులో నుండి తీయడం, నీటి లో పసుపు కారం లాంటివి కలిపి మళ్ళి పొడి పసుపు, కారం తీయడం లాంటివి ఎన్నో అటు ఆనందాన్ని, భయాన్ని కల్గిస్తాయి. మరొక కళా రూపం 'కాటిపాపల వాళ్ళు' నోట్లో నుండి పాములను, తేళ్ళను, ఉంగరాలను తీస్తూ ప్రేక్షకులను ఆనందపరుస్తారు. 'పాములవాళ్ళు, యక్షిణి వాళ్ళు కూడ రకరకాల ఇంద్రజాల ప్రదర్శనలు చేస్తారు.

**కథాగాన కళారూపాలు :** కథాగాన కళారూపాల్లో రామాయణ, భారత, భాగవత కథలను పురాణాలుగా చెప్పేవారిలో చిందుయక్షగానం, గొందేళివీధి భాగోతం, దాసరి

భాగోతం, వీధి భాగోతాలు వీధి నాటకాలు ఈ కోవలోకి వస్తాయి. ఆ కథలకు సంబంధించి పాత్రలువేషధారణతో కథలను రక్తి కట్టిస్తారు. వీటిలో హాస్యగాడి పాత్ర అందరిని ఆకర్షిస్తుంది.

**వేషాలతో కూడిన కళారూపాలు :** కళారూపంలో ఎక్కువగా వేషాలతో అలరించేవి. ఇందులో పగటి వేష కళాకారులు ముప్పైకి పైగా వేషాలు వేసి ప్రదర్శన ఇస్తారు. ఇందులో అర్థనారీశ్వర, అదేవిధంగా, పులివేషాలు లాంటివి ఉంటాయి. అదేవిధంగా, పులివేషాలు, కాళిక వేషం వంటివి ఇందులోకి వస్తాయి. పగటి వేషకళాకారులు రోజుకొక వేషం వేస్తూ ఊళ్ళో ప్రదర్శన ఇస్తారు. ఇందులో తుపాకి రాముడి వేషం తెలంగాణాలో ప్రత్యేకం.

ప్రధానంగా ఈ విభజన ఉన్నా, కొన్ని కళారూపాలు ఆనూచానంగా, తరతరాలుగా ప్రదర్శన కళలుగా ప్రచారంలో ఉన్నాయి. ప్రతి సామాజిక వర్గంలోనూ కొన్ని కుటుంబాలు ఈ కళారూపాల ప్రదర్శనే వృత్తిగా జీవనం సాగిస్తున్నాయి. వాటిలో కొన్నిటి పరిచయం ఇలా ఉంది–

**శారద కథ :** ఇది రెడ్డి తదితర కులాల వారిని యాచించి బతుకు వెళ్ళదీసే వీరముష్టులు, జంగాలు పాడుకునే పాట. వీరు వాయించే తంబూర పేరు శారద. ఈ వాయిద్యాన్ని వాయిస్తూ పాడే పాట శారదకథ. ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి సంచారం చేస్తూ తిరిగే శారదగాండ్రు అనే గాయకులు నేటికీ చాలామంది వున్నారు. ఒక్కో కథని రెండు, మూడు రోజులు వరుసగా పాడతారు. ఒక స్త్రీ–ఒక పురుషుడుగానీ, కుటుంబంలోని ఇద్దరు ముగ్గురుగాని కలసి దీన్ని పాడుతారు. ముఖ్యంగా రెడ్ల చారిత్రక, సాంఘిక, పౌరాణిక కథలు గానం చేస్తారు. శారద గాయకులే తెలంగాణా పోరాట కాలంలో మరణించి, నేడు స్ఫూర్తిమంత్రాలుగా నిలిచిన రేణిగుంట రామిరెడ్డి, చింతలాపురి రామిరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి వంటి నాయకుల వీరోచిత కృత్యాలను చూసి కథలుగా మలిచారు.

**గొల్లసుద్దులు :** గొల్లసుద్దులు తెలంగాణాలో అత్యంత ప్రచారంలోవున్న ఒగ్గుకథలో ఒక భాగం. కురుమలకు బీరన్న ఆరాధ్యదైవం. ఈ దైవానికి సంబంధించిన కథలు చెబుతూ వాయించే ప్రధాన సంగీత వాద్యమైన 'ఒగ్గు'ని వాయించడం జరుగుతుంది. ఒగ్గుకథలో గొల్లలకు నీతి వాక్యాలు చెప్పే గొల్లసుద్దులు ఒక ఉపకథగా ఉంటుంది. ఈ ఉపకథ పాడే దరువులు గొల్లసుద్దుల్లో ప్రముఖ స్థానాన్ని కలిగి ఉంటాయి. ఆంధ్ర ప్రాంతంలో బుర్రకథకు ఉన్న వ్యాప్తి తెలంగాణాలో గొల్లసుద్దులకు ఉన్నది. దీన్ని సులభంగా ప్రదర్శించవచ్చును. పాత్రధారి గొల్లలు కట్టే ఎర్ర అంచుపంచెని మోకాళ్ళవరకు మడిచి కట్టుకుని, భుజంమీద

గొంగళి వేసుకుంటాడు. కాళ్ళకు గజ్జెలు ఉంటాయి. మొలకు బిళ్ళమొలతాడు ఉంటుంది. వంతలను ప్రేక్షకుల్లోంచి ఆహ్వానించడం ఈ గొల్లసుద్దుల ప్రత్యేకత.

**తందానా కథ :** పిచ్చుకగుంట్లు, జంగాలు అనాదిగా పాడుకుంటున్న ప్రదర్శన కళారూపం తందానా కథ. ఆ కథను ప్రదర్శించే బృందంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు లేదా ముగ్గురు జట్టుగా ఉంటారు. ప్రధాన కథకుడు తంబూర మీటుతూ అందెలు వాయిస్తూ, కథ చెబుతాడు. కథకుడికి అటొకరు, ఇటొకరు చేరి బుడికెలు వాయిస్తూ వంత పాడుతారు. ఈ కథలకే తందానా కథలనీ, సమ్మెట్ల కథలనీ వ్యవహారంలో ఉంది. ప్రదర్శన ధోరణిలో ఇది బుర్రకథను పోలి ఉంటుంది. వీటిని 'తందానా తానా' వరుసలోను, 'దండాలు తల్లీ' మకుటంతోను, స్త్రీలైతే 'కుశలవ' మాదిరి వరుసల్లో పాడుతారు. కథకుని ఆహార్యం కూడా బుర్రకథనే పోలి ఉంటుంది. కాళ్ళకు గజ్జెలు, తలపాగా, చేతిలో రంగురుమాలు, ధోవతి కట్టు ఉంటాయి. ఈ తందానా కథలు ఎంత ప్రభావవంతంగా ఉండేవంటే నిజాం వ్యతిరేక పోరాట కాలంలో నిజాం ప్రభుత్వం నిషేధాలు విధించింది.

**పేరిణి శివతాండవం :** నాట్యకళారంగంలో ఒక కళారూపం 'పేరిణి శివతాండవం'. ఈ సృష్టి, అందులోని జీవకోటి, పంచభూతాల కలయికతో ఏర్పడింది. ఈ పంచభూతాల సమైక్యరూపానికి శివుడు ప్రతీక. శివుడు పంచముఖుడు, పంచాక్షరి ఆయన స్తోత్రం. ఐదు రేకులు కలిగిన మందారం, గన్నేరు పువ్వులు ఆయనకు ప్రీతికరమైన పుష్పాలు. అలాగే ఐదు అంగాలతో రూపొందిన పేరిణి నర్తనం ఆ శివునికి అత్యంత ప్రీతికరమైనది. గర్ఘర, విషమ, వికట, భావాశ్రయ, కవివారక అను ఐదు భాగాలు పేరిణి నాట్యంలో అంగాలు. ఈ పేరిణి పూర్తిగా శివపరమైన నర్తనం. శివశక్తిని తమపై ఆవహింప చేసుకొని, వీరులు, మైలారుదేవులు, పశుపతులు, మహేశులు అనే నాలుగు తెగలకు చెందిన వారిచే ప్రదర్శింపబడిన వీరనర్తనం. తిక్కనకాలం నాటి ఈ నర్తనం ప్రజాదరణ, ప్రభువుల ఆదరణ పొందినట్లు సాహిత్యం ద్వారా తెలుసుకోగలుగుతున్నాం. తిక్కన తన భారత విరాట పర్వంలో బృహన్నలకు తెలిసిన నృత్యాలలో 'పేరిణి'ని కూడా పేర్కొన్నాడు. కాకతీయుల కాలంలో ఈ పేరిణి విశేష ప్రచారంలో ఉండేది. శివుని పూజలో ఈ తాండవ నర్తనం లేకపోతే పూజ సంపూర్ణమయ్యేది కాదు. కాకతీయ గణపతిదేవుని బావమరిది, గజసేనాపతియైన జాయ సేనాని స్వయంగా నర్తకుడు, నాట్యశాస్త్రవేత్త. ఆయనే నృత్యశాస్త్ర గ్రంథమైన 'నృత్యరత్నావళి' రచించాడు. నేటికి తెలంగాణా ప్రాంతంలో కొన్ని పల్లెలకు 'మైలారుదేవుపల్లె' అని పేరు ఉంది.

**యక్షగానం:** ఇది అతి ప్రాచీనమైన కళారూపం. తెలుగునాట ఇది కేవలం తెలంగాణ ప్రాంతంలోనే ప్రదర్శితమౌతున్నది. సామాన్య ప్రజల అభిమాన కళగా, పల్లె ప్రజానీకంలో నేటికీ మన పురాణ, ఇతిహాసాలను సజీవంగా నిలిపి ఉంచుతోంది. దాసరి భాగవతులు, బహురూపులు, భరతులు, సైంధవులు మొదలగు తెగలవారు దీన్ని ప్రదర్శిస్తారు. గానానికి తగురీతిలో హావభావాలను ప్రదర్శిస్తూ, సులభరీతిగా నృత్యం చేస్తూ కథను వివరిస్తారు. వీరి ఆభరణాలు, కిరీటాలు కాకతీయ రాజుల ఆభరణాలను పోలి ఉంటాయి.

**గంటె భాగవతులు :** ఈ ప్రదర్శనా రీతి తెలంగాణాలో తప్ప భారతదేశంలో మరే ప్రాంతంలోనూ లేదు. భాగవతాలు, వీధినాటకాలు, యక్షగానాలను తొలుత కాగడాల వెలుగులోను, ఆ తరువాత కాలంలో గ్యాసులైట్ల వెలుగులోను ప్రదర్శించడం జరుగుతున్నది. కాని ఈ గంటె భాగవతాల నర్తనంలో ప్రతి నర్తకుడు చేతిలో ఒక పెద్ద గంటె పట్టుకుని ఉంటాడు. అందులో నూనెపోసి, వత్తివేసి నర్తన సమయంలో దీపాలని వెలిగిస్తారు. ప్రతి నర్తకుడు తన పాత్రను అభినయించాల్సి వచ్చినపుడు ఆ దీపాన్ని తన ముఖం వద్దకు తెచ్చి ఆ వెలుగులో భావప్రదర్శనం చేస్తాడు. ఆ నూనెదీపపు కాంతిలో అతని ముఖం వింతకాంతులతో కనిపిస్తుంది. ఇది నేటి ఆధునిక కళారూపమైన సినిమాలో కనిపించే 'క్లోజప్'లా ఉంటుంది. గంటెలను చేతిలో పట్టుకుని ప్రదర్శిస్తారు, ఈ కళకు గంటె భాగవతాలని, ఈ కళాకారుల్ని గంటె భాగవతులని అంటారు.

**చిరుతల రామాయణం / భాగవతం :** చిరుతల భజన, భాగవతం రెండింటిని కలిపి ఒక విశిష్ట కళారూపంగా తెలంగాణ ప్రాంత ప్రజలు రూపొందించుకున్నారు. ఈ నర్తనరీతిలో చిరుతల భజన సంగీతశైలి, భాగవత బాణి రెండూ కలిసి ఉన్నందువల్ల ఇది రెండు పద్ధతుల్ని అనుసరించి ఉంటుంది. నర్తకులు రామాయణంలోని కథల్ని నర్తనమాడుతారు. వివిధ పాత్రోచిత అలంకారాలు ధరించి, వలయాకారంలో ఆడతారు. వలయం మధ్యలో మృదంగం,హార్మోనియం వాయించే సంగీతకారులు కూర్చుని ఉంటారు. ప్రతి కళాకారుడు పాత్ర తన వంతు రాగానే వలయం మధ్యలోకి వెళ్లి తమ పాత్రను అభినయిస్తూ, నర్తనం చేస్తాడు. తన వంతు అయిపోగానే తిరిగి అందరితో కలిసి వలయంగా తిరుగుతూ చిరుతలు వాయిస్తూ నాట్యమాడతాడు.

పైన చెప్పిన కళారూపాలే కాక విప్రవినోదులు, కాటికాపలవారు, సాధనాశూరులు అనేవారు ఇంద్రజాల, మహేంద్రజాల విద్యలు తెలిసిన కళాకారులుగా తెలంగాణలోనే కనిపిస్తారు. ఇంకా చిందుమాదిగలు వీధినాటకాలను ప్రదర్శిస్తారు. ఒగ్గు గొల్లలు, బవనీలు

అనే తెగలవారు ఎల్లమ్మ దేవత కథను ప్రదర్శిస్తారు. జోగువారికి నృత్యమాడడమే వృత్తి. శవాన్ని శ్మశానానికి తీసుకుపోయేటపుడు వీరు ఒక ప్రత్యేక పద్ధతిలో నృత్యం చేస్తారు. వీటిని ఆశ్రితకులాల కళారూపాలు అని చెప్పవచ్చు.

జానపద కళలకు కాణాచి తెలంగాణ. తెలంగాణ సంస్కృతిలో భాగమైన జానపద కళారూపాలు 'ఆశ్రిత జానపద కళారూపాలు' ఆశ్రితేతర జానపద కళారూపాలుగా విభజించబడి తమకు మౌఖికంగా సంక్రమించిన సంస్కృతిని కాపాడుకుంటూ మనుగడ సాగిస్తున్నాయి. 'ఆశ్రితుడు' అనే పదానికి 'ఆశ్రయించినవాడు','అవలంబిచినవాడు', 'ఆశ్రయింపబడినవాడు', 'ఆధారముగా చేసుకొనినవాడు' అనే అర్థాలున్నాయి. ఇక్కడ ఒక గుర్తింపు పొందిన సమూహాన్ని ఒక వ్యక్తియే కాక, ఒక సమూహం తమ కళ ద్వారా ఆశ్రయించి జీవంచే కళారూపాలను ఆశ్రిత కళారూపాలని చెప్పవచ్చు. ఈ కళారూపాలు కేవలం ఒక కులానికి మాత్రమే హక్కుదార్లుగా ఉంటూ, వారికి తమ ప్రదర్శన ద్వారా విజ్ఞానాన్న, వినోదాన్ని అందిస్తూ, వారిచ్చే ప్రతిఫలం మీదనే ఆధారపడి జీవిస్తాయి తప్ప, వేరే కులాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఆశ్రయించవు.

ఆశ్రితేతర కళారూపాల కళాకారులు కేవలం ఒక కులానికి మాత్రమే పరిమితం కాకుండా అన్ని కులాలను ఆశ్రయించి ప్రదర్శనలిస్తూ జీవిస్తాయి. ఇందుకు ఉదాహరణగా చెక్కబొమ్మలాట, తోలు బొమ్మలాట, కాటిపాపలు, చిరతల రామాయణం, పగటి వేషాలు మొదలైనవి. ఆశ్రిత జానపద కళారూపాలను ప్రదర్శించే కళాకారులు ఒక నియమిత కులానికి చెంది సంప్రదాయమైన కట్టడి కలిగి ఉంటారు. వీరికే భిక్షుక గాయకులు, వృత్తి గాయకులు, అర్థి బిడ్డలు, ఆశ్రిత గాయకులు, హక్కుదార్లు, ఉపకులాలు, కులం బిడ్డలు ఇట్లా రకరకాల పేర్లున్నాయి. వీరు ఏ కులాన్ని అయితే ఆశ్రయిస్తారో ఆ కులాన్ని పోషక కులమని, ధాతృ కులమని, ప్రధాన కులమని వ్యవహరిస్తారు.

ఆశ్రిత జానపద కళారూపాలను ప్రదర్శించే కళాకారుల పుట్టుకకు చెందిన మౌఖిక కథలని బట్టి వీరు మొదట పోషక కులంలోనే అన్నదమ్ములుగా పుట్టి, కులం కట్టుబాట్లను అతిక్రమించడంవల్ల కొందరు ఆశ్రితులయ్యారు. ఇందుకు ఉదాహరణగా ముదిరాజ్‌లను ఆశ్రయించే కాకి పడిగెలవారు, నాయీబ్రాహ్మణులను ఆశ్రయించే అద్దపు వారు, మాలలను ఆశ్రయించే గుర్రపువారు, గౌడ కులాన్ని ఆశ్రయించే గౌడజెట్టీ – ఏనూటి వారు, రజకులను ఆశ్రయించే మాసయ్యల వారు. మరి కొందరు పోషక కులం మూలపురుషున్ని రక్షించటం కోసం, మూల పురుషుని స్వేదం నుండి పుట్టి ఆశ్రితులుగా మారటం జరుగుతుంది.

ఇందుకు ఉదాహరణగా పద్మశాలి కులాన్ని ఆశ్రయించే కూనపులివారు ఆ కులం మూలపురుషుడైన భావనాఋషి స్వేదం నుండి పుట్టి అతన్ని రక్షించటంతో ఆశ్రితుడయ్యాడు. ఇదే పద్మశాలి కులాన్ని ఆశ్రయించే సాధనాశూరులు పోషక కులంలోనే పుట్టి ఆ వంశాన్ని శ్రీకృష్ణ గంధర్వరాజు నుండి రక్షించి అదే కులానికి ఆశ్రితులయ్యారు. ఈ రకంగా ఆశ్రిత కళారూపాల పుట్టుక కథలు రకరకాలుగా మౌఖికంగా ప్రచారంలో ఉన్నాయి."[2]

ఆశ్రిత కళారూపాలు ప్రదర్శించే కులాల ప్రస్తావన ప్రాచీన కావ్యాల్లో కూడా కనిపిస్తుంది. క్రీ.శ. 12వ. శతాబ్దానికి చెందిన పాల్కురికి సోమనాథుడు ద్విపదలో రచించిన పండితారాధ్య చరిత్ర (పర్వత పుట-237)లో పిచ్చుకకుంట్ల కులం ప్రస్తావన కనిపిస్తుంది. ఈ పిచ్చుకకుంట్ల కులంలో గంట, కత్తి, తిత్తి, తురక అనే నాలుగు తెగలున్నాయి. ఇందులో కత్తి, తిత్తి అనే పిచ్చుకకుంట్లవారు రెడ్లను, తురక పిచ్చుకకుంట్లవారు గొల్లవారిని, గంట పిచ్చుకకుంట్ల వారు కమ్మవారిని ఆశ్రయిస్తారు. ఇందులో ఎవరైనా కళారూపాన్ని ప్రదర్శిస్తూనే పోషక కులం దగ్గర ఆశ్రయిస్తారు. సోమనాథుడు పిచ్చుకకుంట్ల కులాన్ని ప్రస్తావించాడే గాని వీరు ఆశ్రితులనే విషయం చెప్పలేకపోయినప్పటికి, ఆ కాలం నాటికే 'పిచ్చుక కుంట్ల' కులం ఒకటుందనే విషయం స్పష్టంగా తెలుస్తున్నది.అంతేగాక కోమటి కులానికి ఆశ్రిత కళారూపమైన వీరముష్టుల ప్రసక్తి 'హంసవింశతి' తృతీయ శ్వాసం, తొమ్మిదవ రాత్రి కథలో తిరునాళ్ళ వేడుకల్లో పాల్గొన్న వివిధ కళాకారుల కులాల వారిలో వీరముష్టుల ప్రస్తావన ఉన్నది. విశ్వకర్మలకు ఆశ్రితులైన రుంజవారి ప్రస్తావన 'పల్నాటి వీర చరిత్రలో కనిపిస్తున్నది. అలాగే శుకసప్తతి, హంసవింశతి కావ్యాల్లో గొల్లసుద్దులు, ఆసాదులు,మందహెచ్చుల ప్రసక్తి ఉన్నది. ఇట్లా ప్రాచీన కావ్యాలను బట్టి చూస్తే ఆశ్రిత జానపద కళారూపాలు లేదా ఆశ్రిత కులాల ప్రస్తావన 10, 11, 12 శతాబ్దం నాటికే ఉన్నట్లు తెలుస్తున్నది.

క్రీ.శ 1172 ప్రాంతంలోని కాకతీయ ప్రభువైన రుద్రదేవుడు వేయించిన నాగులపాడు శాసనంలో అష్టాదశ ప్రజ(18 కులాలు) పేర్కొనబడ్డాయి. అందులో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర, తంతువాయు (పద్మశాలి) మొదలైన కులాలు ప్రస్తావించబడ్డాయి. ఇందులో ప్రస్తావించబడిన కులాలన్నిటికి ఆశ్రిత కళారూపాలున్నాయి. దీనిని బట్టి ఆకాలం నాటికంటే ముందునుండే పోషక కులాలు ఉన్నట్లు స్పష్టమవుతున్నది. అలాగే ఆశ్రిత కులాలు లేదా ఆశ్రిత కళారూపాలు కూడా ప్రచారంలో ఉన్నట్టుగా భావించవచ్చు. ఈ రకంగా ఆశ్రిత

జానపద కళారూపాల ప్రాచీనత కనిపిస్తున్నది. ఇవి గత సంస్కృతి అనుభవాలను, విజ్ఞానాన్ని వర్తమాన కాలంలో ప్రసరింపజేస్తూ విభిన్న ప్రక్రియల్లో పండితులను, పామరులను అలరిస్తూ వస్తున్నాయి. వీటిలో పటం కథలు, యక్షగానాలు, ఇంద్రజాల ప్రదర్శనలు, కథాగానాలు, బొమ్మలాటలు వంటి విభిన్న ప్రక్రియలతో తెలంగాణా రాష్ట్రంలో ఆశ్రిత జానపద కళారూపాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

కూనపులి – పద్మశాలి – పటంఆధారంగా కథాగానం – మార్కండేయపురాణం

సాధనాశూరులు – పద్మశాలి – ఇంద్రజాలం – ఇంద్రజాల విద్యలు

గౌడజెట్టి – గౌడ – పటం ఆధారంగా కథాగానం – గౌడపురాణం

ఏనూటి – గౌడ – పటం ఆధారంగా కథాగానం – గౌడపురాణం

రుంజ – విశ్వబ్రాహ్మణులు – రుంజవాద్యం ఆధారంగా – విశ్వకర్మపురాణం

పనస – విశ్వబ్రాహ్మణులు – కథాగానం – విశ్వకర్మపురాణం

బీరన్నలు – కుర్మ – గొల్లకుర్మకథాగానం – బీరన్న కథ

మందహెచ్చులు / బైకాని – గొల్ల – బొమ్మల ప్రదర్శన – కాటమరాజు కథ పటం ఆధారంగా కథాగానం

ఒగ్గు – గొల్ల – కథాగానం / ఒగ్గువాద్యం – మల్లన్న కథ ఆధారంగా కథాగానం

గొల్ల భాగవతులు – గొల్ల – భాగవతం/నాటకాలు – రామాయణ, భారత నాటకాలు

కొమ్ము – గొల్ల – పటం ఆధారంగా కథాగానం – కాటమరాజు కథలు కొమ్ము వాద్యం

గోత్రాలవారు – గొల్ల – నాటకాలు / కథాగానం – యాదవ కథలు

గొల్ల సుద్దులు – గొల్ల – కథాగానం – దాసరి కథలు / యాదవకథలు

పిచ్చుకకుంట్ల – గొల్ల – కథాగానం – గోత్రాలు / కథాగానం

పిచ్చుక కుంట్ల – గొల్ల – కథాగానం – యాదవ కథలు / గోత్రాలు

తెర చీరలు – గొల్ల – కథాగానం – గంగమ్మకథ / మల్లన్న కథలు – గంగపుజారులు

గంగిరెద్దులు – ఎర్రగొల్ల – గంగిరెద్దుల ఆట – గంగిరెద్దుల ఆటలు

బేరి పనస – కోమటి – కథాగానం – కన్యకా పురాణం

వీరముష్ఠి – కోమటి – కథాగానం – ఖడ్గాలు / కన్యకాపురాణం

కాకిపడిగెలు – ముదిరాజులు – పటం ఆధారంగా కథాగానం – పాండవుల కథలు

పిచ్చుక కుంట్ల – రెడ్డి / కాపు – కథాగానం – గోత్రాలు / కుంతి మల్లారెడ్డి కథ

ఆదికొడుకులు - మేదరి - కథాగానం - మేదరి కథలు
అద్దపు - మంగలి - పటం ఆధారంగా కథాగానం - అద్దపు పురాణం
పెక్కర్లు - కుమ్మరి - పటం ఆధారంగా కథాగానం - గుండబ్రహ్మయ్యపురాణం
మాసయ్యలు - రజకులు - పటం ఆధారంగా కథాగానం - మడేలు పురాణం
తెనుగు మాష్టి - తెనుగు / కాపు / తెలగ - కథాగానం - మాష్టికథలు
తెనుగు భోగం - తెనుగు / కాపు / తెలగ - ఆటలు - భోగం ఆటలు
శారద గాళ్ళు - కాపు, రెడ్డి - బుర్ర కథ - శారద కథలు
బండారి భక్తులు - పెక్కర్లు - కథాగానం - పెరక పురాణం
గోంధళే వీధి భాగోతం - ఆరె - భాగవతాలు / నాటకాలు - గోంధళే నాటకాలు
చిందు యక్షగానం - మాదిగ - యక్షగానం - రామాయణ, భారత నాటకాలు
డక్కలి - మాదిగ - పటం ఆధారంగా కథాగానం - జాంబపురాణం
బైండ్ల / బవనీలు - మాదిగ - కథాగానం - ఎల్లమ్మ కథ / మాంధాత కథ
నులక చందయ్యలు - మాదిగ - కథాగానం - జాంబపురాణం
ఆసాది - మాదిగ - కథాగానం - ఆసాది కథలు
మాదిగ బోగం / మాదిగ మాష్టి - మాదిగ - మాదిగవారికి కమ్మరి - వడ్రంగి పని చేస్తారు
మాల జంగాలు - మాల - కథాగానం - చెన్నయ్య కథ
గుర్రపు - మాల - పటం ఆధారంగా కథాగానం - భేతాళ పురాణం
మాల మాష్టి - మాల - కథాగానం - పురాణ ప్రవచనం
మిత్తిలి - మాల - కడ్డీతంత్రీ వాద్యంతో కథాగానం - రామాయణకథలు / నాటకాలు
మాల భోగం - మాల - ఆటలు - భోగం ఆటలు
విప్రవినోదులు - బ్రాహ్మణులు - ఇంద్రజాలం - ఇంద్రజాల విద్యలు
జానపదులకు ఆశ్రిత జానపద కళారూపాలున్నట్టుగానే, గిరిజన తెగలకు కూడా ఆశ్రిత కళారూపాలు పట్టెడ, డోలి, తోటి, పర్ధాన్, కొర్రాజులు, పూజారి, భాట్స్, ఢాడి వంటి కళారూపాలు విభిన్నమైన ప్రక్రియలతో ప్రధాన తెగలను ఆశ్రయిస్తూ జీవిస్తున్నాయి. ఈ కళారూపాలు కూడా ప్రధాన తెగకు కట్టడి కలిగిఉన్నాయి.

ఆశ్రిత జానపద కళారూపాలు ఒక పోషక కులానికి భిన్నమైన ఆశ్రిత కళారూపాలు ఒకటి కంటే ఎక్కువగా ఉన్నాయి. ఇవి భిన్నంగా ఉండటమేగాక ప్రదర్శనలో వాటి

ప్రక్రియలు కూడా వేరు వేరుగా ఉన్నాయి. పోషక కులం యొక్క వంశ కీర్తిని తెలియపరుస్తూ వారికి గత సంస్కృతి విజ్ఞానాన్ని వినోదాన్ని పంచుతూ నేటికీ తమ మూల సంస్కృతిని సాహిత్యాన్ని కాపాడుకుంటూ వస్తున్నాయి. ఇవి ఒక నియమితమైన కట్టుబాట్లతో నిర్మించబడటమేగాక, పోషక కులాల్లో వారి కులం పట్ల ఉన్న ఆత్మనూన్యతా భావాన్ని తొలగించడానికి, అంతేగాక వారిలో ఆత్మ చైతన్యాన్ని, వ్యక్తిత్వ స్థాపనను కల్పించే విధంగా నిర్వహిస్తున్నాయి. అందుకే వారికంటూ కొన్ని నియమాల్ని ఏర్పాటు చేసుకొని ఆ కట్టుబాట్లను అతిక్రమించకుండా పోషక కులాల అభిమానాన్ని, ఆదరణను పొందుతున్నారు.

ఆశ్రిత కళారూపాలు పూర్వం నుండి వంశ పారంపర్యంగా వారు ఏ పోషక కులానికి అయితే ఆశ్రితులుగా ఉన్నారో వారినే ఆశ్రయిస్తారు తప్ప మిగతా కులాలను ఎట్టి పరిస్థితుల్లో ఆశ్రయించరు. ఇది తరతరాలుగా సంక్రమించిన నియమంగా పాటిస్తారు. ఎట్టి పరిస్థితుల్లో ఆ నియమాన్ని అధిగమించడానికి సాహసించరు. ఉదాహరణకు అద్దపువారు మంగలి కులాన్ని ఆశ్రయించి పటం ఆధారంగా అద్దపు పురాణాన్ని కథాగానం చేస్తూ ప్రతిఫలం పొందుతారు తప్ప మిగతా ఇతర కులాలను మాత్రం ఆశ్రయించరు. ఒకే పోషక కులానికి ఒకటి కంటే రెండు లేదా అయిదు, ఆరు వరకు ఆశ్రిత కళారూపాలు ప్రచారంలో ఉన్నాయి. ఇలా ఒకే కులానికి ఎన్ని ఆశ్రిత కళారూపాలున్నప్పటికి నియమం ప్రకారం ఒకే సంవత్సరంలో రెండు కళారూపాలు పోషక కులాన్ని ఆశ్రయించడానికి ప్రయత్నించవు. ఒకరు ఒక సంవత్సరం వస్తే మరొకరు మరో సంవత్సరంలో గ్రామాలకు వెళ్తారు. ఇట్లా పోషక కులం దగ్గర నియమిత కాలాన్ని పాటించి ఆయా కులాల మధ్య సంబంధాలను పెంచుకుంటారు.

ఆశ్రిత కళారూపాల కళాకారులు పోషక కులం దగ్గర మిరాశి హక్కులు కలిగి ఉంటారు. ఇవి రాగి శాసనం మీదగాని, శాసనాల మీదగాని, తాళపత్ర ప్రతుల మీదగాని వ్రాయబడి ఉంటాయి. కళాకారులు వీటినే స్థిరాస్థిగా భావించి కళాకారులు భద్రంగా దాచుకుంటారు. ఈ మిరాశి హక్కు పత్రాలనుగాని, రాగి శాసనాలను గాని పరిశీలిస్తే అనేక విషయాలు తెలుస్తాయి. వీటిలో ఆశ్రిత కళాకారుల కుటుంబాలను బట్టి ప్రతి కుటుంబానికి ఇన్ని గ్రామలని ఉంటుంది. ఫలానా గ్రామంలోని పోషక కులం నా మిరాశి హక్కు, హక్కు పత్రంలో ఉంది అంటే ఆ గ్రామాన్ని ఆశ్రయించే హక్కు అతనికే ఉన్నట్టు. పోషక కులం ఆశ్రిత కులం కలిసి నిర్ణయించుకున్న శాసనమిది. కాబట్టి దీన్ని మార్చడానికి వీలుండదు. ఈ హక్కు పత్రాలను లేదా రాగి శాసనాలను ఎంతో పవిత్రంగా

చూసుకుంటారు. ఇందులో కట్టడి గ్రామాలు, ఆయా పోషక కులాలు, ఇంటిపేర్లు, దాతలు ఇచ్చే ధాన్యం, ధనం, గొడ్డు, గోదా, భూమి, ఆభరణాలు, వస్తువులు మొదలైన అన్ని విషయాలు రాసి ఉంటాయి. కొన్ని హక్కు పత్రాల్లో అయితే ఆశ్రిత కళారూపాల చరిత్ర రాసి ఉంటుంది కూడా. ఈ మిరాశి హక్కులను ఒక ఆశ్రిత కళారూపం మరొక ఆశ్రిత కళారూపానికి అమ్మటంగాని, కొనటంగాని చేయరు. ఏ ఆశ్రిత కళారూపమైతే హక్కుగా కలిగి ఉంటుందో ఆ కులం వాళ్ళే తండ్రి కొడుకులకు, ఒకవేళ కొడుకులు లేకపోతే అల్లుళ్ళకు మిరాశి హక్కులను ఇచ్చుకుంటారు. అమ్మాయికి కట్నం కింద కూడా కొన్ని గ్రామాలను మిరాశి హక్కుగా అల్లునికిస్తారు. ఒక ఇంటిలో తండ్రి తన కొడుకులకు మిరాశి హక్కులను పంచితే వారి హక్కులను కొత్త శాసనం మీద రాయించి ఇస్తాడు. లేకుంటే తన రాగి శాసనాన్ని రెండు ముక్కలుగా చేసైనా ఇస్తాడు కూడా. ఎందుకంటే కళాకారులు గ్రామానికి వెళ్ళినప్పుడు పోషక కులానికి తప్పని సరిగా శాసనాన్ని లేదా హక్కు పత్రాన్ని చూపించి అప్పుడు కథల గురించి, ప్రతిఫలం గురించి మాట్లాడుకొని నిర్ణయం తీసుకుంటారు.

ఆశ్రిత కళారూపాలను ప్రదర్శించే కులాలకు కుల చిహ్నాలుగా కొన్ని ప్రత్యేకమైన గుర్తులుంటాయి. అవి వారి యొక్క మూలాల్ని సూచిస్తాయి. ఉదాహరణకు కాకిపడిగెల కళాకారులకు కాకి గుర్తుగా ఉంటుంది. అలాగే గుర్రపు కళాకారులకు కంచుతో చేయబడిన గుర్రపు బొమ్మ ఉండగా, కూనపులి కళాకారులకు పులి జెండాను కులానికి గుర్తుగా ఉపయోగిస్తారు.

జానపద ఆశ్రిత కళారూపాలు పోషక కులాన్ని ఆనందింప చేయడానికి కథాగానాలు, ఇంద్రజాల విద్యలు, యక్షగాన రూపంలో ప్రదర్శనలిస్తూ ఆశ్రయిస్తున్నారన్నది వాస్తవం. ప్రదర్శనలో ఆయా ఆశ్రిత కళారూపాలు మౌఖికంగా వారికి సంక్రమించిన సాహిత్యాన్నే ఆసరాగా చేసుకొని ఆ సంప్రదాయాన్నే కొనసాగిస్తూ నేటికీ వస్తున్నారు.

కథాగానాల రూపంలో ప్రదర్శించే కళారూపాలు పోషక కులం కుల పురాణాలను, రామాయణ భారత కథలను, కథా వస్తువుగా చేసుకొని ప్రదర్శనలో పద్యం, గేయం, వచనంతో కళాకారులు కథాగానం గాని, నాటాకాలు గాని ఆడతారు. కథాగానాలు ప్రదర్శించే కళారూపాల్లో ముఖ్యమైనవి పటం కథల కళారూపాలు. ఇవి ప్రధాన కులం లేదా పోషక కులం యొక్క కుల పురాణాన్ని కథాగానం చేస్తారు. వీరి సాహిత్యంలో సృష్టి పుట్టుక జరిగి దేవతలు జన్మించటం, ఆ దేవతల అవసరాల కోసం కులాల పుట్టుక,

వృత్తుల ఆవిర్భావం, దేవతలను హింసిస్తున్న రాక్షసులను సంహరించటం కోసం కులం యొక్క మూల పురుషులు పుట్టి వారంతా దేవకార్యాన్ని నిర్వర్తించటం, ఆ యొక్క మూల పురుషులే కులాలకు ఆద్యులై నియమించబడిన వృత్తులను చేయడం జరుగుతుంది. అంతేగాక వీరి సాహిత్యంలో కులాలకు దైవత్వాన్ని ఆపాదించడమే గాక కులాల గౌరవాన్ని పెంచుతాయి. అలాగే వృత్తి మనుగడలో ఎదురయ్యే ఆటంకాలను తట్టుకునేలా మనోధైర్యాన్ని కలిగించేలా ఆయా వృత్తుల్లో ఉపయోగించే వస్తువులకు కూడా దైవత్వాన్ని ఆపాదించటం కనిపిస్తుంది. అందుకే పండుగల్లో కూడా వృత్తి పరికరాలను పూజిస్తారు కూడా.

మంగలి కులాన్ని ఆశ్రయించి పటం ద్వారా అద్దపు పురాణం చెప్పే అద్దపు కళాకారుల సాహిత్యంలో దేవతల పెళ్ళిళ్ళు చేయడానికి గందమాను పర్వతం వద్ద మంగ వృక్షం కింద సుమంగలుడు తపస్సు చేస్తుండగా అతనితో త్రిమూర్తులు తీపి వరభక్తుడు కావాలనగా సుమంగళుడు విభూది గుండం ఏర్పాటు చేయగా, బ్రహ్మపాకశాస్త్రం, విష్ణువు నాభికమలం, శివుడు చిత్రకన్ను వేయగా అగ్గిపుట్టి అంగారకుడు జన్మించాడు. ఇతనికి సూర్యుడు అద్దాన్ని, చంద్రుడు కత్తి నూరుకునే చంద్రవంకను గంగనీటికై కలశపాత్ర నిస్తుంది. ఈ రకంగా మంగలి కులం యొక్క వస్తువుల పుట్టుక కనిపిస్తుంది.

కుమ్మరి కులాన్ని ఆశ్రయిస్తూ పటం ఆధారంగా గుండబ్రహ్మయ్య పురాణం చెప్పే పెక్కర్ల కళాకారులు తమ పురాణంలో కుమ్మరి కుల వృత్తి విద్యను పరమ శివుడే ప్రసాదించి, ఆ వృత్తి చేయడానికి కావల్సిన వస్తువులను ఆది కూర్మాన్ని గుచ్చి గడ్డగాను, మందర పర్వతాన్ని ముల్కిగాను, విష్ణుచక్రాన్ని కుమ్మరి సారెగాను, శివుని శూలాన్ని సారె తిప్పడానికి కావల్సిన కోలగాను, బ్రహ్మ తన ఉత్తరీయాన్ని బ్రామపాతగాను, దేవేంద్రుని వజ్రాయుధం వాము ముల్లుగాను, పార్వతీ దేవి హోమగుండాన్ని కుండలు కాల్చే వాముగాను సృష్టించటం కనిపిస్తుంది.

రజకులను ఆశ్రయించి మాసయ్యలు పటం ఆధారంగా చెప్పే మడేలు పురాణంలో మడివేలయ్యను పరీక్షింపదలచిన శివుడు తన దగ్గర ఉన్న బొంతను పిండాలని మడివేలయ్య వస్తువులన్నింటిని మాయం చేస్తాడు. వృత్తి ధర్మాన్ని పాటించడానికి మడివేలయ్య తన భార్య సీతాల దేవిని సంహరించి ఆమె అవయవాలతో బట్టలు ఉతకడానికి ఉపయోగపడే వస్తువులను సృష్టించటం కనిపిస్తుంది. డక్కలివారు మాదిగ కులాన్ని ఆశ్రయించి పటం ఆధారంగా చెప్పే జాంబ పురాణంలో విశ్వబ్రాహ్మణుల వృత్తికి ఉపయోగపడే వస్తువులను జాంబవంతుడు తన పెద్ద కొడుకు అగమునిని సంహరించి సృష్టించటం కనిపిస్తుంది.

పద్మశాలి కులాన్ని ఆశ్రయించి పటం ఆధారంగా కూనపులి వారు చెప్పే మార్కండేయ పురాణంలో భావనా ఋషి శ్రీ మహావిష్ణువు ఆజ్ఞ మేరకు కాలువాసురున్ని సంహరించి అతని పార్థివ శరీర భాగాలలో మగ్గం నిర్మింప చేయటం కనిపిస్తుంది.

గౌడ వారిని ఆశ్రయించి పటం ఆధారంగా గౌడజట్టీ మరియు ఏనూటి వారు చెప్పే గౌడ పురాణంలో కంఠమహేశ్వరుడు గజాసురున్ని సంహరించి అతని పార్థివ శరీర భాగాలతో గౌడ కులానికి చెందిన వస్తువులన్నింటిని దేవతలు సృష్టిస్తారు. చివరకు తాటి చెట్టు ఎక్కడానికి,'మోకు' కావాలని కోరగా పరమశివుడు తన మెడలోని నాగేంద్రుణ్ణి ఖండించి 'మోకు' నిర్మించటం కనిపిస్తుంది. అలాగే విశ్వబ్రాహ్మణులను ఆశ్రయించి రుంజ కళాకారులు చెప్పే విశ్వకర్మ పురాణంలో రుంజకాసురుణ్ణి సంహరించి అతని పార్థివ శరీర భాగాలతో రుంజ వాద్యాన్ని సృష్టించినట్లు కనిపిస్తుంది. ఇందులో ఆశ్రిత కళారూపం వస్తువుల సృష్టి కనిపిస్తుంది.

మాల కులాన్ని ఆశ్రయించి గుర్రపు వారు పటం ఆధారంగా చెప్పే బేతాళ పురాణం లేదా మాల చెన్నయ్య కథలో ఆ పరమ శివుడే వ్యవసాయం పనిముట్లు సృష్టించినట్టు కనిపిస్తుంది. వృత్తి పరికరాల పుట్టుకలో కొన్ని దేవతలే తమ ఆయుధాలను, ఆభరణాలను, వస్తువులుగా సృష్టించటం  ఇందులో ప్రధానంగా శివుడే తన శూలాన్ని, శ్రీమహావిష్ణువు తన విష్ణు చక్రాన్ని, ఇంద్రుడు తన వజ్రాయుధాన్ని, శివుడు తన మెడలోని పామును, బ్రహ్మ ఉత్తరీయం, దేవతలకు నిలయమైన మందర పర్వతం, హిమగిరి పర్వతం, పార్వతీ దేవి హెూమగుండం, శివుని నంది, సూర్యచంద్రులు, గంగమ్మ తల్లి మొదలైనది. ఒక రకమైతే, దేవతల అనుగ్రహంతోనే పార్థివ శరీర భాగాలతో వృత్తి పరికరాలను సృష్టించటం, ఇదంతా పూర్తిగా మొదట దేవకార్యం నిమిత్తమై, దేవతల అంశంతో సృష్టించడినాయని, ఆయా వస్తువులకు దైవత్వాన్ని ఆపాదించబడినాయని ఆశ్రిత కళారూపాల సాహిత్యం వల్ల తెలుస్తున్నది. ఇట్లా జానపదులకు తాము ఉపయోగించే వస్తువులకు ఇంతటి గొప్పనైన సంస్కృతి పరంపర ఉందని తెలిసేలా వీరి సాహిత్యం దోహదం చేస్తున్నది.

వృత్తి మనుగడకు ఉపయోగపడే పలు అంశాలు జానపద ఆశ్రిత కళారూపాల సాహిత్యంలో నిమిడీకృతమై ఉన్నవి. పద్మశాలీని ఎవరైన బట్టలు తొందరగా చినిగిపోతున్నాయని అడిగితే కాల భైరవుని శాపమంటూ బదులిస్తాడు. ఎందుకంటే దీనికి చెందిన కథాంశం కూనపులి వారు చెప్పే మార్కండేయ పురాణంలో కనిపిస్తుంది. పద్మశాలి మూల పురుషుడు భావనాఋషి వస్త్రాలు  నిర్మించి దేవతలందరికి సమర్పించి చివరకు

కాళభైరవునికి సమర్పించబోగా నాకు చివరగా ఇస్తావా అంటూ నువ్వు నేసిన బట్టలు 3 నెలలు కొత్త, 3 నెలలు పాత అంటూ శపిస్తాడు. ఆ కారణంగా బట్టలు తొందరగా చినుగుతాయని చెప్పి పద్మశాలి ఉపశమనం చెందుతాడు. ఇదే వృత్తిలో “పద్మశాలి కూసున్నా బొడ్డువరకే, నిలుచున్నా బొడ్డువరకే” అంటూ పార్వతీ దేవి దీవించింది. ఎందుకంటే పద్మశాలి ఎంత కష్టపడినప్పటికి ఆర్థికంగా మాత్రం అంతంత మాత్రమే, ఎవరైనా పద్మశాలిని బాగా సంపాదిస్తున్నావా అని అడిగితే మాకు పార్వతీదేవి దీవెన ఉందని, మేం ఎప్పుడూ ఒకేలా ఉంటామని చెప్తారు. దీనికి సంబంధించిన కథలో పార్వతీ దేవికి చీర తీసుకెళ్ళిన పద్మశాలి వెళ్ళిన సమయంలో ఆమె స్నానం చేస్తూ ఉంటుంది. అతను ఆలస్యమవుతుందని ఇంటి దగ్గర ‘సరి’ ఎండిపోతుందని చీరను అక్కడే ఉంచి ఇంటికి వస్తాడు. ఈ లోగా షావుకారి పార్వతీ దేవి ఇంటికి వెళ్ళి తల్లీ నేను వచ్చానని చెప్పగా, ఆ తల్లి తలుపు తీసి చాటడు వరాలు పద్మశాలి అనుకొని అతని ఒడిలో పోస్తుంది. షావుకారి ఏమీ మాట్లాడకుండా వెళ్ళి పోగానే పద్మశాలి తల్లి దగ్గరికి ఈ లోగ పోయి నేను వచ్చానమ్మా అంటూ పిలువగా ఇప్పుడే కదరా వరాలు పోసింది, అని తలుపు తీయగా పద్మశాలి కనిపిస్తాడు. అప్పుడు ఆమె పద్మశాలిని మీరు కూసున్న, నిలుచున్న బొడ్డువరకే అంటూ దీవిస్తుంది. ఇటువంటి మౌలికమైన అంశాలు వృత్తిలో కలిగే అసంతృప్తిని తొలగించడానికి దోహదం చేస్తుంది. వృత్తిలో కలిగే రకరకాల సందేహాలను తీర్చడానికి కూడా వీరి సాహిత్యం దోహదం చేస్తుంది ఉదాహరణకు బట్టలకు రకరకాల రంగులు ఎట్లా వచ్చాయనే ప్రశ్నకు సమాధానం వీరి సాహిత్యంలోనే కనిపిస్తుంది. అలాగే కుమ్మరి కుండలను ఎందుకు కాల్చాలి అంటే ఎల్లమ్మ శాపమంటూ బదులిస్తారు.

కుమ్మరి ఒక రోజున కుండను చేస్తుండగా ఒక పలుగుడు(గీత) వస్తుంది. ఆ పలుగుడును మాన్పడానికి కుమ్మరి ఊంచుడు(ఉమ్మి) పెట్టి సరి చేస్తాడు. ఇట్లా చేయడం తప్పని ఎంగిలి పోవడానికి కాల్చమంటుంది ఎల్లమ్మ. అంతేగాక ”నీ సంసారం ఎంత చేసినను, కుండ కిందనే ఉండు” అని శపిస్తుంది. ఎందుకంటే పరశురాముని బారి నుండి ఎల్లమ్మకు రక్షణ ఇవ్వనందుకు కుమ్మరిని శాపమిస్తుంది. అందుకే కుమ్మరి ఎంత కష్టపడ్డ ఆర్థికంగా స్థిరపడడు. ఎవరైనా అడిగితే ఎల్లమ్మ శాపమంటూ తృప్తి చెందుతారు. పైగా కుమ్మరివారు మైసూరు రాజులమంటూ, సచ్చిన్నాడు మాదే, పుట్టిన్నాడు మాదే, దాయాదికి మాదే, గుడికి మాదే, ఏ దేవునికైనా గింత కంచుడు బోతది మాది అంటూ తృప్తి చెందేలా కులపురాణాల సాహిత్యం ఉపకరిస్తున్నది. అట్లాగే గౌడ వృత్తికి సంబంధించి

ఈ రోజు కల్లు రేపటికి పనికి రాకపోవడానికి గల కారణాన్ని, వృత్తిలో భాగంగా తాటి చెట్టుకు మెర వేస్తున్నపుడు మాట్లాడకూడదని, రేఖలు కట్టకూడదని, తాటి ముంజలు కొట్టకూడదని ఇట్లా వృత్తి మనుగడలో అవలంభించాల్సిన విషయాలన్నింటిని వారి ఆశ్రిత కళారూపం సాహిత్యంలో చూడవచ్చు. ఈ రకంగా ప్రతి కులం యొక్క మనుగడకు సంబంధించిన పలు అంశాలు ఆశ్రిత కళారూపాల సాహిత్యంలో కనిపిస్తుంది. ఈ కళారూపాలు ప్రదర్శించే కథా వస్తువు కూడా చాలా ప్రాచీనమైన సంపదగానే చెప్పవచ్చు ఉదాహరణకు కూనపులి వారు ప్రదర్శించే 'మార్కండేయ పురాణం' కథాంశం 15వ శతాబ్దానికి చెందిన 'ఎల్లకరనృసింహ కవి రచించిన అముద్రిత గ్రంథమైన మార్కండేయ పురాణానికి దగ్గరి పాటి సంబంధం కనిపిస్తుంది. ఈ యొక్క కళారూపమేగాకుండా మిగతా ఆశ్రిత కళారూపాలు ప్రదర్శించే కథావస్తువు చాలా పురాతనమైనవనే చెప్పవచ్చు. రజకులకు ఆశ్రితులైన మాసయ్యలు ప్రదర్శించే మడేలు పురాణాన్ని కూడా ఇందుకు ఉదాహరణగా తీసుకోవచ్చు.

ఆశ్రిత కళారూపాల్లో ఎక్కువగా శైవమే కనిపిస్తుంది. వీరశైవం ఉచ్ఛాన స్థితిలో ఉన్నపుడు ఈ కళారూపాలు తమ ఉనికిని నిలుపుకొని మనుగడ సాగించాయనిపిస్తుంది. వీరి సాహిత్యంలో శివుడే ఆధ్యుడని, అన్నింటికి అతనే పరిష్కారవంతుడనే దోరణి కనిపిస్తుంది. ఆయా కథాగానాల కళారూపాలు ప్రదర్శనలో సామెతలు, పొడుపు కథలు సందర్భోచితంగా ప్రయోగిస్తూ తాము చెప్పే కథాంశాన్ని ప్రేక్షకునికి నిరాసక్తి లేకుండా, హాస్యాన్ని జోడించి అందిస్తారు. కళాకారులు తమ ప్రదర్శనతో విభిన్న సంస్కృతులను భిన్న సమూహాలను ఏకం చేయడానికి వీరి సాహిత్యమే దోహదం చేస్తున్నది. అంతేగాక తెలంగాణా 'యాస' కు చెందిన అనేక పదాల భాండాగారం ఆశ్రిత జానపద కళారూపాల సాహిత్యమే.

నాటకాలు లేదా యక్షగాన రూపంలో ప్రదర్శించే ఆశ్రిత కళారూపాలు భాగవతం, రామాయణ, భారత కథలను ఆయా పోషక కులాల దగ్గర ప్రదర్శిస్తూ అందులోని నీతిని నియమాల్ని, రాజనీతిని, భక్తిని, విశ్వాసాలను తమ తమ నైపుణ్యంతో ప్రేక్షకులకు అందిస్తూ, ఇతిహాసాల గొప్పతనాన్ని ప్రసరింపజేస్తూ మనుగడ సాగిస్తున్నాయి. వీరి సాహిత్యంతో సమాజంలో మానవీయ విలువల్ని పెంచే దిశగా తరతరాలుగా కృషి చేస్తున్నారు.

ఆశ్రిత కళారూపాల్లో కొన్ని తమ ప్రదర్శనలో ప్రేక్షకులకు అర్థంకాకుండా ఉండేందుకు, ప్రదర్శనలో ఏదైనా తప్పు దొర్లినా, సమయానికి తోటి కళాకారున్ని అప్రమత్తం

చేయడానికి కళాకారులు మరుగు భాష మాట్లాడుకుంటారు. అంతేగాక కుల పెద్దల దగ్గర 'సంభావన' (ప్రతిఫలం) మాట్లాడుకునేప్పుడు, ఎగతాళి చేయడానికి, తిట్టడానికి ఉపయోగిస్తారు. వీరు ఉపయోగించే భాషాపదాల్లో చిత్ర విచిత్రమైన పదాలతో పాటు, కొన్ని సంస్కృత పదాలే ఉన్నప్పటికి వీరు ఉచ్ఛరించేపుడు ఆ పదాల మూలాన్ని కాకుండా ఒక కొత్త రూపంలో పలుకుతారు. ఇది ఎవరికి అర్థం కాకుండానే ఉంటుంది.

ఇంద్రజాల విద్యలు ప్రదర్శించే కళారూపాలు మాత్రం నాటకీయ రూపంలో ప్రదర్శనలిస్తూ, దానికి హాస్యాన్ని జోడించి మంత్ర తంత్రాలున్నాయని ప్రేక్షకులను భ్రమింప చేసి తమ ఉనికిని నిలుపుకుంటున్నాయి. ఇంద్రజాల కళారూపాల్లో ఒకటైన సాధనా శూరులు ప్రదర్శనలో అక్కడ కూడ మరుగు భాష మాట్లాడుతారు కూడా. జానపద కళారూపాల్లో పై కోవలోకి కాకుండా ఇతర జీవులతో ప్రదర్శన ఇచ్చే కళారూపాలు కూడ ఉన్నాయి. వాటిలో గంగిరెద్దులాట, చిలుక జోస్యం, గారడి వంటివి ప్రేక్షకులకు హాస్యాన్ని పండిస్తాయి.

తెలంగాణా సంస్కృతికే మకుటంగా నిలిచే జానపద ఆశ్రిత కళారూపాల సాహిత్యం ఎంతో ప్రాచీనమైనదిగా తెలుస్తున్నది. అంతేగాక విభిన్నమైన ప్రక్రియలతో, భిన్నమైన కథావస్తువుతో పోషక కులాలను ఆశ్రయిస్తూ మనుగడ సాగిస్తున్న కళారూపాలు వరంగల్ ప్రాంతంలోనే ఎక్కువగా ఉండటం ఈ ప్రాంత సంస్కృతీ ప్రాచీనత గొప్పతనమే. వీటి సాహిత్యంలో ఒక సమాజం లేదా ఒక కులం మనుగడకు కావల్సిన, ఆత్మస్థైర్యాన్ని, ఆత్మనూన్యతా భావాన్ని తొలగించేందుకు కావల్సిన పలు అంశాలు ఉన్నవి. అంతేగాక కులాల ఐక్యతకు దోహదం చేసేదిగా ఉంది. అలాగే వృత్తులకు కులాలకు గౌరవాన్ని కలిగించే విధంగా వీరి సాహిత్యం నిర్మింపబడింది. ఇటువంటి సాహిత్య విలువలు కలిగిన వీరి సాహిత్యాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత ఎంతైన ఉన్నది. భవిష్యత్తు తరాలకు వీరి గొప్పదనాన్ని, వీరి సాహిత్యాన్ని భద్రపరచాల్సిన అవసరం ఉన్నది. ఇప్పటికే కొన్ని ఆశ్రిత కళారూపాలు కనుమరుగయ్యాయి. కొన్ని కనుమరుగయ్యే స్థితిలో ఉన్నవి.

**ఒగ్గు కథా బృందాలు :** ఒగ్గుకథ తెలంగాణా ప్రాంతమంతటా ప్రదర్శించబడుతుంది. అయితే వరంగల్లు, నల్లగొండ, హైదరాబాదు జిల్లాలలో మాత్రం ఎక్కువగా ప్రదర్శించబడుతుంది. ఈ నాలుగు జిల్లాలలో యాభై వరకు ఒగ్గుకథా బృందాలు ఉన్నాయి. ఆ ఊరిలో ఆరు బృందాలు బహుళ ప్రచారం పొందినవి.

ఆరు బృందాల వివరాలు -

1. శ్రీ చేదరపల్లే చుక్కా సత్తయ్య

   గ్రామం : మాణిక్యాపురం

   తాలుకా : జనగాం (మండలం)

   జిల్లా : వరంగల్లు.

2. శ్రీ నేర రామస్వామి

   గ్రామం : చీమల కొండూరు

   తాలుకా : భువనగిరి (మండలం)

   జిల్లా : నల్లగొండ.

3. శ్రీ బండి నరసయ్య

   గ్రామం : నెల్లుట్ల

   తాలుకా : జనగాం

   జిల్లా : వరంగల్లు.

4. శ్రీ మిద్దె రాములు

   గ్రామం : వేములవాడ

   తాలుకా : హన్మాజీ పేట

   జిల్లా : కరీంనగర్.

5. శ్రీ బీర్ల బుచ్చయ్య

   గ్రామం : ఆత్మకూరు

   తాలుకా : మోత్కూరు

   జిల్లా : నల్లగొండ.

6. శ్రీ చర్ల కొండయ్య

   గ్రామం : ఆత్మకూరు

   తాలుకా : మోత్కూరు

   జిల్లా : నల్లగొండ.

ప్రస్తుతం గొల్ల,కురమ కులాలవారే కాకుండా ఇతర కులాల వారు కూడా ఒగ్గుకథలు చెబుతున్నారు. వారిలో ప్రముఖులు హుజురాబాద్ కు చెందిన సాహు హరిజన కులానికి, హైదరాబాద్ కు చెందిన శ్రీ సి.భగవాన్ రావు కాపు కులానికి,కరీంనగర్ జిల్లా హనుమాజి

పేటకు చెందిన శ్రీ.మిద్దెరాములు గౌడు కులానికి చెందిన వారు.

కొన్ని ఒగ్గుకథా బృందాలు –

1. శ్రీ. చుక్కా సత్తయ్య బృందం – మాణిక్యాపురం, జిల్లా – వరంగల్.
2. శ్రీ. మిద్దె రాములు బృందం – హనుమాజి పేట, జిల్లా – నల్లగొండ.
3. శ్రీ. సాహు బృందం – హుజురాబాద్, జిల్లా – నల్లగొండ.
4. శ్రీ. సి. భగవాన్ రావు – హైదరాబాద్.
5. శ్రీ. కోడూరు.సత్యం బృందం – అంబర్ పేట, హైదరాబాద్.
6. శ్రీ. కర్రె. మల్లేశ బృందం – రామ్ నగర్,హైదరాబాద్.
7. శ్రీ. ఒగ్గు బాల సిద్ధులు బృందం – మల్కాజిగిరి, హైదరాబాద్.
8. శ్రీ. శ్రీశైలం బృందం – తాళ్ళగడ్డ.
9. శ్రీ. చాల పొల్లయ్య బృందం – ధూళిపేట.
10. శ్రీ. కొలిసేల మల్లయ్య బృందం – ధూళిపేట.
11. శ్రీ. బీర్లబుచ్చయ్య బృందం – ఆత్మకూరు,జిల్లా – నల్లగొండ.
12. శ్రీ. బండి నర్సయ్య బృందం – నెల్లుట్ల, జిల్లా – వరంగల్.
13. శ్రీ. బండి ఈనయ్య బృందం – నెల్లుట్ల, జిల్లా – వరంగల్.
14. శ్రీ. గోపతి కొమురయ్య బృందం – వరంగల్ జిల్లా.
15. శ్రీ. దుడ్డు కొమురయ్య బృందం – వరంగల్ జిల్లా.
16. శ్రీ. చర్ల. కొండయ్య బృందం – ఆత్మకూరు,నల్లగొండ జిల్లా.
17. శ్రీ. మల్లెల.బీరప్ప బృందం – ఆలేరు, నల్లగొండ జిల్లా.
18. శ్రీ. మంగ పర్వతాలు బృందం – కొలనుపాక.
19. శ్రీ. తుప్పల పెద వీరయ్య బృందం – చిన్నమదుగు.
20. శ్రీ. జన్నె యాదగిరి బృందం – వాసెబ్ నగర్. మొదలైన బృందాలు."[3]

పైన తెలిపిన ఒగ్గు కథా బృందాలే గాక ఇంకా ఎన్నో బృందాలు ఒగ్గుకథలు చెబుతున్నారు. తెలంగాణా జిల్లాల్లో ఒగ్గుకథా బృందాలు వందకు పైనే ఉన్నాయని శ్రీ చుక్కా సత్తయ్యగారు తెలిపారు. ఈ బృందాలు మల్లన్న కథ, బీరన్నకథలతో పాటు సత్య హరిశ్చంద్ర,పార్వతీ పరీక్ష, శిరితొండ మహారాజు, సారంగధర, రత్న మాణిక్యం, సూర్య చంద్రుల కథ, నాగరాజు కథ మొదలగు జానపద,పౌరాణిక, కాల్పనిక కథలెన్నో చెబుతున్నారు.

## 2.5. వరంగల్ జిల్లా ఒగ్గు కథలు విశ్లేషణ

కురుమల పురోహితులైన బీర్ల వాళ్లుతప్ప వేరే వాళ్ళు ఒగ్గుకథ చెప్పడానికి అనర్హులు. కుల బహిష్కరణ ఉంటుందనే ఆచారం వున్నా దానిపై అభినివేశంతో ఒగ్గు సత్తయ్య స్వతంత్రించి కథలు నేర్చుకొని ప్రదర్శించి బహిష్కరణకు గురయ్యారు. కానీ ఆయన ఒగ్గు కథను అద్భుత కళారూపంగా మలచి ప్రచారంలోకి తెచ్చి, డబ్బుతోపాటు పేరు ప్రఖ్యాతుల్ని సంపాదించిన అనంతరం కురుమలు కుల గురువులు అతనే ఆశ్రయించి ఆ నియమాలకు స్వస్తి చెప్పారట.

నేడు ఒగ్గుకథకు జానపద కళల్లో మంచి ప్రాచుర్యాన్ని, గౌరవాన్నీ నేడు కూర్చినవారు చుక్క సత్తయ్య, ఆయన వీరభద్రుడు, మల్లికార్జున, రేణుక ఎల్లమ్మ, అల్కరన్ కథ, హరిశ్చంద్ర, మాంధాత. ఆదిగా ఒగ్గు కథలేకాక ఇరువై, ముప్ఫై చారిత్రక గాధలను కూడా ఒగ్గు కథలుగా మలచి ప్రదర్శించారు. వీరి ఒగ్గు కళా బృందానికి చాలా పేరు వచ్చింది. ఒగ్గు కథాగానంలో ఆయన ప్రదర్శించే నైపుణ్యం అపూర్వం. గానానికి అనుగుణంగా అభినయం, గానబాడీ, గళ గాంభీర్యం, కథాక్రమంలో ప్రవేశించి పాత్రనుగుణ నటన ప్రేక్షకులకు కనబడుతుంది.

ప్రదర్శనపరంగా ఒగ్గు కథలో నూతన ప్రయోగాల గురించి చెప్పాలంటే చుక్క సత్తయ్యనే పేర్కొంటారు. ఒగ్గు కథకు ఆయన దిద్దిన –ఒరవడి నవీనతకు నాంది పలికింది. స్త్రీ పాత్ర ధరించిన ప్రధాన కథకుడు కథాగమనంలో బీరప్పవంటి కథానాయకుడు వస్తే కథా సూత్రానికి భంగం కలుగకుండా, కొద్ది సమయంలోనే కొద్ది మార్పులతో పురుషవేషంతో ప్రేక్షకులు చూస్తుండగానే మార్చుకొని పాత్రలో లీనమౌతాడు. వేషధారణ తెరచాటుగా జరగాలనే నియమానికిది విరుద్ధమే అయినా, ఈ నూతన ప్రయోగం చుక్క సత్తయ్య బీరప్ప కథకు ఆకర్షణగా నిలిచింది. ఇది తరువాతి తరంవారికి మార్గదర్శకమయింది. మరే కళారూపంలో కనిపించని ఈ మార్పు అతని ఒగ్గు కథకు విశిష్టతను కూర్చింది. ఇంతేకాక కథకులు స్త్రీ వేషంలో రంగంపైకి వచ్చే ప్రక్రియకు చుక్క సత్తయ్యే శ్రీకారం చుట్టాడు.

అయితే చుక్క సత్తయ్య ఒగ్గు కథా ప్రదర్శనల్లో ప్రవేశపెట్టిన ప్రక్రియ 'నాటకీయత' బీరప్ప కథలో గుర్రపుస్వారి, గంగకు రక్తాన్ని బలివ్వడమనే సన్నివేశాలు బహుళ ప్రచారం పొందాయి. ఒక కుర్చీపై కూర్చొని, దాన్ని గుర్రపుడెక్కల శబ్దం వచ్చేలా కదిలిస్తూ, ఆ ధ్వనికి అనుగుణంగా దరువును పాడుతూ, చేతిలో కళ్ళెం పట్టుకున్నట్లుగా సెల్లాను పట్టుకు

గుర్రపుస్వారీ అభినయం ఆయన చాతుర్యానికి అద్దం పట్టాయి. అలాగే బీరప్ప ప్రయాణాన్ని గంగ అడ్డగించినపుడు రక్తాన్ని చిందించే సన్నివేశంలో కత్తితో పొట్టమీద పొడుచుకునే హస్త విన్యాసం ప్రేక్షకుల్లో ఉత్కంఠను కలిగిస్తుంది. ఇలా చుక్క సత్తయ్య నూతన ప్రయోగాలు నాటక సన్నివేశాలకు నెలవై మొత్తం ఒగ్గు కథల్లోనే ప్రత్యేకతను సంతరించుకుని ఒగ్గు కథ మొన్నటి వరకు నిత్యనూతనంగా సాగిపోయింది. ఒగ్గు కథ ప్రదర్శనలో చుక్క సత్తయ్య పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది.

తన జవసత్తువలన్నింటిని ఒగ్గు కథకు పరిపూర్ణంగా అందించే ఈ ఒగ్గుకథా దిగ్గజం 2017 నవంబర్ 9నాడు అమరుడయ్యాడు.

అంతర్జాతీయ ఒగ్గు కథా కళాకారుడు మిద్దె రాములు : విఖ్యాత ఒగ్గు కళాకారుడు మిద్దె రాములు కరీంనగర్ జిల్లా వేముల వాడ మండలం హన్మాజీపేటలో తీగల లస్మయ్య ఎల్లవ్వ దంపతులకు జూన్ 16, 1942లో గౌడ కులంలో జన్మించాడు. ఇంటిపేరు మిద్దె, కల్లుగీత కులవృత్తి కూలిపని ఉపవృత్తి, ఒగ్గుకథ ప్రవృత్తి.

హనుమాజీపేట ఇద్దరి పేర్లతో చరిత్ర ప్రసిద్ధమైంది. మొదటిది జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, ప్రసిద్ధ కవి సి. నారాయణరెడ్డి, రెండవది ఒగ్గు కథా దిగ్గజం మిద్దె రాములు కురువ బీరన్నల సొంతమైన ఒగ్గు కథ గౌండ్ల కులానికి చెందిన మిద్దె రాములు అభ్యసించడం వెనుక ఆయనకు దానిపై ఉన్న అభినివేశం, కఠోర పరిశ్రమ ఉన్నాయి. కాళ్ళకు తుమ్మకాయల గజ్జెలు కట్టుకొని, ఇంటి తలుపులు మూసి, ఆముదం దీపం వెలుతురులో తన కదలికలు గమనిస్తూ, నిగ్గుదీస్తూ ఒగ్గు కథలో రాములు తనదైన సొంత ముద్ర సృష్టించాడు.

చిరు గజ్జెల సవ్వడితో, హుషారైన నాట్య భంగిమలతో అద్భుతంగా అనేక ఒగ్గు కథలను చెప్పి, ప్రేక్షక శ్రోతలను మైమరిపించే మిద్దె రాములుకు చదవడం, వ్రాయడం రాదు. సంతకం పెట్టడం రాదు. కానీ లెక్కలేనన్ని కథలను పుక్కిటపట్టి, యాభై ఏండ్ల నుంచి జనాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉర్రూతలూగించాడు. ఒగ్గు కథకు మారుపేరు మిద్దె రాములుగా ప్రఖ్యాతి చెందాడు. అక్షరాలు రాని రాములుకు 1999లో తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం యిచ్చి గౌరవించింది. సంప్రదాయ గ్రామీణ జానపద కళలు కనుమరుగవుతున్న తరుణంలో తెలంగాణ గ్రామీణులను తన్మయపరిచే “ఒగ్గుకథా” ప్రక్రియకు ప్రాణం పోసిన మహా కళాకారుడు మిద్దె రాములు.

రాములు ఎల్లమ్మబోనం ఎత్తుకొని, వేప మండలు చేత బట్టుకొని, బోనంకుండ కదలకుండా బొక్కబోర్లా పడుకొని, ఎడమ కాలిని ఎత్తి, బోనం కుండమీదుగా కుడి

చేతితో అందుకొని, పడగెత్తిన పాములాగా మెలికలు తిరుగడం ఆయన శరీరంలో జీర్ణించుకుపోయింది. దృశ్యాన్ని జనం వూపిరి  బిగబట్టి చూసి కరతాళధ్వనులతో సభాస్థలిని అల్లకల్లోలంచేసేవారు. అలాగే తలపై కుండకింద పడకుండా నేలపై నాణేలను నొసటితో అందుకునే. దృశ్యం ఆయన కల్పనే. ఆయన చెప్పే కథలు ఎల్లమ్మ కథ, మల్లన్న కథ, సారంగ ధర, అయిదు మల్లెపూలు, గంగా గౌరీ సంవాదం, దేశింగురాజు కథ, బాలనాగమ్మ కథ, నల చక్రవర్తి, నల్ల పోచమ్మ కథ, ఇందులో కొన్ని సాంప్రదాయకమైనవేతే, కొన్ని స్వకలపోల కల్పితాలు.

హనుమాజీ పేట నుంచి రాములు ఒగ్గుకథను హస్తినాపురందాకా తీసుకుపోయ్యిండు.

ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు, ప్రధానమంత్రి పీవీ. నరసింహారావు, రాష్ట్రపతి జ్ఞానీ జైల్సింగ్తో 'భళా' అనిపించుకున్నాడు. యాభై ఏళ్ళుగా సుమారు ముప్పైవేల ప్రదర్శనలిచ్చాడు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో రాములు శిష్యప్రశిష్యులు రెండువేలమంది వరకున్నారట. ఆకాశవాణి, దూరదర్శన్లలో దాదాపు రెండు వందల ప్రదర్శనలిచ్చాడట. 1990లో మారిషస్ ప్రధాని అనిరుధ్ జగన్నాథ్, గవర్నర్ రంగస్వామి రంగడు ప్రశంసలు అందుకున్నాడు. నాటి ప్రధాని ధీ, రాజీవ్ గాంధీ, రాష్ట్రపతి జైల్సింగ్, ముఖ్యమంత్రి అంజయ్య, చంద్రబాబునాయుడు దాకా అందరిముందు ప్రదర్శనలిచ్చి ప్రశంసలు పొందాడు.

ఆయనను ఎన్నోసన్మానాలు, బిరుదులు, అవార్డులు, పురస్కారాలు వరించాయి. రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతిక కళా మండలి సభ్యునిగా నియమించింది. 2010 మే 23న పాలకుర్తిలోని సోమనాథ కళాపీఠం ఆయనకు “ఒగ్గు దిగ్గజం” బిరుదు ప్రదానం చేసి ఘనంగా సన్మానించింది. వివిధ కళా సంస్థలనుంచి జానపద కళాబ్రహ్మ, ఒగ్గు కథా చక్రవర్తి, ఒగ్గు కళా బ్రహ్మ, ఒగ్గు కథాగాన సమ్మాన్, గౌడకుల రత్న, కళా పురస్కార్ బిరుదులు పొందాడు. త్యాగరాజ పురస్కార్, ఉగాది పురస్కారవంటివి ఆయన సొంతమైనాయి.

తెలంగాణ ఒగ్గు కథకు వన్నె తెచ్చిన రాములు, ఒగ్గు కథ నేర్పడానికి ఒక బడి పెట్టాలనే ఆయన గుండెలనిండా పెట్టుకొన్న కోరిక తీరకుండానే మూడు నెలలు క్యాన్సర్తోపోరాడి 68 ఏండ్ల వయస్సులో నవంబర్ 23, 2010నాడు కన్నుమూశారు.

### 2.5.1. గొల్ల కేతమ్మ కథ

మల్లన్న కథలో గొల్లకేతమ్మ కథ ఒకభాగం. ఒగ్గు కళాకారులు ఈ కథాంశాన్ని విడిగా ఒక కథగా కూడా ప్రదర్శననిస్తారు. ఆ కథ ఇలా ఉంది.

మల్లన్న ఈ భూమిపై తన అవతారం చాలించి, తన ఇద్దరు భార్యలతో కలిసి స్వర్గానికి వెళ్లిపోతాడు. అక్కడి నుంచి పంచపర్వతం చేరుకుంటాడు. అలా తాను పంచపర్వతం చేరుకున్న 24 సంవత్సరాల తరువాత తాను మారువేషం వేసుకుని వెళ్తే మేడలమ్మ తనను గుర్తుపడుతుందా లేదా పరీక్షిద్దామనుకుంటాడు.

అలా భావన రాగానే వెంటనే తన స్వరూపాన్ని మార్చుకుంటాడు-అప్పుడు మారు వేషంతో ఇట్లా మోకాలు ముందుకు , మోచేతులు వెనుకకు, వీపు డోలంతా గుని గుని. గుని మీద రాచపుండు. గంపెడు ఈగలు, గంపెడు దోమలు, అందవికారము సంధిగోపాలుడై, మంగ దుడ్డుగల కర్ర చేత పట్టుకొని గొంగెడి భుజాన వేసుకొని అక్కడ పర్వతం మీద పోయేటప్పుడు

(గొల్లకేతమ్మ కథ - చౌదరిపల్లి అంజయ్య ప్రదర్శన నుంచి)

ఈ మార్చుకున్న వేషాన్ని ఒగ్గు కళాకారులు పరిశీలిస్తే అది రోగమయమైన, జుగుప్సాకరమైన రూపమని తెలుస్తుంది. మోకాలు ముందుకు, మోచేతులు వెనక్కు అనడంతో అది ఎముకలు వంకర్లు తిరిగిన ఆకారమని తెలుస్తుంది. ఆ వికారస్వరూపానికి తగ్గట్టు గూనివీపు, ఆ గూని వీపుపైన రాచపుండు. రాచపుండు అంటే చీమునిండిన కణితి పుండు. ఇది చర్మంలోపలి నుంచి శరీరాన్ని కుళ్లబెట్టే పుండు. ఇలాంటి రాచపుండు ఆయన గూనివీపుపై ఉంది. సహజంగానే అది కురుపు కాబట్టి దానిపై వాలే ఈగలు, దోమలు. ఇది చాలా జుగుప్సాకరమైన ఆకారం.

ఇలాంటి విరూపాన్ని ధరించి మల్లన బయలుదేరాడు. తమ్ముడు నాగయ్యా అని పిలవగానే పన్నెండు పడగల నాగన్న మల్లన్న చేరాడు. కుశలప్రశ్నలు వేశాడు. ఇన్నాళ్లూ మల్లన్న ఎక్కడున్నాడని ప్రశ్నించాడు. అప్పుడు మల్లన్న నాగన్నను మేడలమ్మ దగ్గరకు పోయి తన సందేశాన్ని వినిపించమన్నాడు. ఆ సందేశాన్ని తీసుకుని నాగన్న మేడలమ్మను చేరుకున్నాడు. ఆమెకు మల్లన్న సందేశాన్ని ఇలా వినిపించాడు-

వదినా మెడలమ్మనా అమ్మ దేవి మెడలమ్మనా
మాయన్న మల్లయ్యనా... అన్న గూడా వచ్చేనా
నిలారు కళ్లలో నిలుపు కోమ్మన్నాడు... అల్లారు కళ్ళతో ఆపుకోమన్నాడు

పంచమంగళాలు హారతి తీసుకవచ్చి అంతా అయివత్తె కయివత్తె
తీసుకువచ్చి కలివిడి లోగిలి నింపుకోమన్నప్పుడే

(గొల్లకేతమ్మ కథ – చౌదరిపల్లి అంజయ్య ప్రదర్శన నుంచి)

నాగన్న తీసుకువచ్చిన సందేశాన్ని గ్రహించి మేడలమ్మ మల్లన్నను కలుసుకోవడానికిగాను అలంకరించుకున్నది. బంగారుఛాయతో ప్రకాశించే మేడలమ్మ చక్కగా స్నానం చేసింది. కత్తుల మండోదరి గుత్తుల దట్ట కట్టింది, పువ్వలాంటి రైక గుత్తెంగా తొడిగింది, కనుబొమల మధ్యన బంగారుబొట్టు పెట్టుకుంది. తలలో నెమలిఈకను ధరించింది. జలం నిండిన కలశంతో చెలులు మంగళారతులు పాడుతూ ఉండగా గంజల దర్వాజాను, శంకుల దర్వాజాను, అన్ని ద్వారబంధాలను దాటుకుంటూ మల్లన్న ఉన్న ప్రదేశానికి వచ్చింది. అక్కడికి వచ్చిన మేడలమ్మకు మల్లన్న కనిపించలేదు. వికార స్వరూపంతో ఉన్న వ్యక్తి కనబడ్డాడు. నాగన్నను మల్లన్న ఎక్కడా అని ప్రశ్నించింది. నీముందు ఉన్న మల్లన్నే అని చెప్పాడు. ఆ వికృత స్వరూపాన్ని చూసిన మేడలమ్మకు–

దేవదేవుని చూచేవరుకల్ల మూడు రోజుల తిన్నా మూడు కింద తిన్న, మరి బయటకి వస్తున్నది అటనేమి, తెచ్చినా హారతి అక్కడ వదిలిపెట్టినాది.

(గొల్లకేతమ్మ కథ – చౌదరిపల్లి అంజయ్య ప్రదర్శన నుంచి)

ఆ వికృతరూపాన్ని చూసిన మేడలమ్మకు వాంతులైనాయి. మూడునాళ్ల క్రితం తిన్నవి కూడా వాంతులుగా బయటికి వచ్చాయంటేనే మల్లన్న ధరించిన వికృతరూపం ఎంత జుగుప్సాకరమో అర్థమౌతుంది.

తన ముందున్న మల్లన్నని గుర్తించలేని మేడలమ్మ ఆ వికృతాకారాన్ని చూపించిన నాగన్నపై కోపించింది. ఆ వికృతాకారునిపై కూడా ఆగ్రహించింది. తనకు ఆశాభంగం కలిగించినందుకు శాపనార్థాలు పెట్టింది.

నువ్వు ఎడపడ్డవాడవు... నువ్వు ఎక్కడ పడ్డవాడవు...
ఎవనికి అండ ఉన్నావు... ఎవని పిండం ఉన్నావు...
నా బలిజా దాని యెచ్చెగ యెచ్చె నీకు తగినేనా
బలిజా దాని ఏడుపు ఏడుపు నీకు తగిలేనా

(గొల్లకేతమ్మ కథ – చౌదరిపల్లి అంజయ్య ప్రదర్శన నుంచి)

మేడలమ్మ ప్రవర్తనకి కినిసి మల్లన్న అహంకారంతో నన్ను తెలుసుకోనందుకు వెళ్లిపోతున్నాను, నీ అహంకారం తొలగిస్తానని కోపించాడు. నీకు సవతిని తీసుకువస్తాను,

నిన్ను గుద్దులు గుద్దుతాను అని బెదిరించాడు. తిరిగి వెళ్లిపోవడానికి సిద్ధపడ్డాడు. మల్లన్న అలా వెళ్లడానికి సిద్ధపడగా వికృతరూపం తొలగిపోయింది. సూర్య చంద్రుల వంటి ప్రకాశంగల నిజస్వరూపం బయటపడ్డది. అప్పుడు మేడలమ్మ మల్లన్నని గుర్తించింది. తనపై కోపించిన మల్లన్నను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నం ఆరంభించింది. మల్లన్నను ఆపమని నాగన్నను వేడుకుంది. నాగన్న మల్లన్న ను ఆపడాని ఆయన్ని వెంబడించాడు.

కుటుంబం అన్నాక ఒకరినొకరు మాటలు అనుకోవడం ఉంటుంది. ఆ మాటల్ని పట్టించుకుని బంధాలు విడదీసుకోరాదు. ఇదే మాటని నాగన్న మల్లన్నతో ప్రస్తావించాడు. ఆడదాని మాటలకు అలగి పోతావా అని అడిగాడు.

అన్న అన్న మల్లన్ననే ఓయన్న మల్లన్ననా ఆడదన్న మాటలకుఅలిగిపోతావున్నావు... అమ్మతోని మాటలు నాయనతోని ఈ మాటలు “అమ్మతో నాన్నతో మాటలు వస్తాయి కాబట్టి వెనుకకు రా... ఆడపిల్లతోని ఏంది మనకు...”

ఇండ్లల్లో భార్య భర్తలు సర్దుకోపోతేనే... మొగుడు పెండ్లాం అంటారు. పొద్దుందాకా మరి ఆలుమగలు పంచాయితీ అంతం అయితే నిట్టుంటాది అన్నప్పుడు గనకనేమి

(గొల్లకేతమ్మ కథ – చౌదరిపల్లి అంజయ్య ప్రదర్శన నుంచి)

నాగన్న ఇలా నచ్చచెప్పేసరికి మల్లన్న ఆగిపోవడానికి సిద్ధపడ్డాడు. అయితే మేడలమ్మ చేసిన పనుల్ని చెప్పి, తన ఆగ్రహానికి కారణం చెప్పాడు.

నిలబడ్డ చోట గనకనేమి నీళ్లు జల్లుకొన్నది అయ్యో ఛీ అని గొల్లోడా... తియ్యవా గొల్లోడా, నా బలిజాదాని ఉసురు, నా బలిజాదాని ఏడుపు తగిలింది అని. అయ్య అనరాని మాటలు... మాటలు యంటఉన్నది.

(గొల్లకేతమ్మ కథ – చౌదరిపల్లి అంజయ్య ప్రదర్శన నుంచి)

తాని నిలబడ్డచోటుని నీళ్లుజల్లి శుద్ధి చెసే ప్రయత్నం చేసిందని, తన ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెట్టిందని, అందుకే తాను వెళ్లిపోతున్నానని చెప్పాడు.

అప్పుడు మేడలమ్మ మల్లన్నను ప్రసన్నం చేసుకోవాలంటే మల్లన్న తల్లిగా భావించే గంగమ్మను వేడుకుంది–

భగవంతుడు మల్లయ్య నన్ను పరీక్ష చేయనికి ఇలాపోతాండు గనకనేమి. మరి ఆయాల నాకి మాటిస్తే మాట పొగొట్టెను. మరి రోజైతే గనకనేమి, నా లగ్గం అయిననాడు గనకనేమి, ఏడు ముడతలు అయిన ప్రాణం. గంగేచా, యమునేచా, కృష్ణా, గోదావరి, సింధు, కావేరి, నర్మద అన్నారు గనకనేమి, మా చిన్నత్త గంగమ్మను వేడుకుంటా ఉన్నాది

ఓ యత్త గంగమ్మని కన్న కోడలు దానిను నేను అడ్డబట్ట కట్టినా... ఆడపిల్లనున్నను కోటి తప్పులు చేసినా నేను కోడలుదానా నున్నను... నీ కొడుకు మల్లయ్యనా అ ఐ ౖ ౨ ృ అలాగా పోతాయున్నాడా... నీ కొడుకు మల్లయ్య అలిగిపోతున్నాడు గనకనేమి,

(గొల్లకేతమ్మ కథ – చౌదరిపల్లి అంజయ్య ప్రదర్శన నుంచి)

ఇక్కడ ప్రదర్శనను గమనిస్తే సంప్రదాయికంగా పూజలు చేసే శిష్టలు కలశంలో జలాన్ని నింపుకుని, ఆజలంలోనే అన్ని నదులు ఉన్నట్లు సంకల్పం చేస్తూ, 'గంగేచ యమునేచైవ గోదావరి సింధు సరస్వతీ నర్మదే కృష్ణ కావేరీ జలేస్మిన్ సన్నిధింకురు' (నిత్యార్చనావిధి, పోతుకూచి శ్రీరామమూర్తి, సాధన గ్రంథమండలి, తెనాలి) అని చేసే కలశారాధన లక్షణాన్ని గమనించవచ్చు.

సంప్రదాయిక పూజలలో అన్ని నదులు గంగానదులే, అన్ని జలాలు గంగాజలాలే. జానపదుని భావనలోనూ అన్నినదులూ గంగానదులే. ఆ భావన మేడాలమ్మ గంగను ప్రసన్నం చేసుకునే సంఘటనలో 'గంగేచా, యమునేచా, కృష్ణా, గోదావరి, సింధు, కావేరి, నర్మద అన్నారు గనకనేమి'అనడంలో వ్యక్తమౌతుంది.

ఇలా మేడాలమ్మ గంగమ్మను వేడుకోగా, గంగాదేవి ప్రసన్నమై అరవై ఏళ్ల వృద్ధురాలి వేషంలో ప్రత్యక్షమైంది. మేడాలమ్మ తరఫున మల్లన్నను బుజ్జగించే ప్రయత్నం చేసింది.

కొడుకా మల్లయ్య ఆడదానికి అలిగిపోతావా మల్లయ్య కోడలు అసువంటిది, ఉసురంటది గనకనేమి, కొడుకో మల్లయ్య మమ్మల్ని ఆడిపోసుకుంటాది నేమి మరి అసువంటి మల్లయ్య పోకుంటా గనకనేమి... ఓ కొడుకా మల్లయ్య.. నీకు ఎవ్వరు చెప్పిన సుద్దులు, నీకు ఎవ్వరు చెప్పిన గానము, కోటి తప్పులు చేసిన కోడలులా ఉన్నది. అడ్డబడ్డ కట్టినా ఆడపిల్ల యున్నది. ఇంతాసేపు ఎట్లా కొడుకా మల్లయ్య మరి ఆలుమగలు పంచాయితీ అట్లానే ఇది. ఇయ్యాలా పర్వతం మీద గనకనేమి వయసు పిల్లను వదిలిపెట్టిపోతే అభం అయిన శుభం అయిన మీ అమ్మతోని మీ నాయనతోని మాటలు వస్తాయి కొడుకా... నా మాటలు కూడా వినరా కొడుకా మల్లయ్య...

(గొల్లకేతమ్మ కథ – చౌదరిపల్లి అంజయ్య ప్రదర్శన నుంచి)

అని గంగమ్మ మల్లన్నకు సుద్దులు చెప్పింది. ఈ బుజ్జగింపు మాటల్ని గమనిస్తే ఇంట్లో భార్యలు అలగడం, కసురుకోవడం సహజమే అని తెలుస్తోంది. కోడళ్లు అత్తమామలను, భర్తను మాటలతో ఆడిపోసుకోవడం సహజమేనని, అంతమాత్రానికి భార్యను వదిలివేయకూడదని నచ్చచెబుతున్నది. ఇది దాదాపు ప్రతి కుటుంబంలో ఉండేదే. అలిగిన

కోడలు అత్తమామల్ని మాటలంటున్నా, వాళ్లు మాత్రం కొడుకు కాపురం నిలబడాలనే చూస్తారు. కొడుకునే మందలించే ప్రయత్నం చేస్తారు.భార్యను వదిలిపోతే సమాజంలో చెడ్డపేరు వస్తుందని హెచ్చరిస్తారు. ఇక్కడ గంగమ్మ కూడా అదే ధోరణిలో మల్లన్నను నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నది. జానపదుల గేయాల్లో దేవతలకు సైతం సామాన్య మానవుని ప్రవృత్తే ఉంటుందనడానికి ఈ సన్నివేశం ఒక ప్రతీక.

అమ్మానాన్నలో, ఇతర పెద్దలో చెప్పినంతమాత్రాన మాటలు పట్ట మగడు అంత త్వరగా సర్దుకుపోడు. తనను అన్న మాటలన్నీ ఏకరువు పెట్టుకుంటాడు. తనకు చేసిన అవమానాలను ఉటంకిస్తాడు. తన కోపానికి అదే కారణంగా చెబుతాడు. తాను భార్యను దారిలో పెట్టుకోవడానికి ఎదైనా చేస్తానంటాడు. ఇది మానవసహజమైన లక్షణం. మల్లన్న కూడా ఇదే చేశాడు.

ఓ తల్లి గంగమ్మ నా అమ్మ మా యమ్మ గంగమ్మనా బలిజోల్లా పిల్లని కానిపోని మాటలు... మాటలు కూడా అన్నది. నువ్వు ఎడపడ్డవాడవు. నువ్వు ఎక్కడ పడ్డవాడవు. ఎవ్వని కన్నావు.ఎవ్వని బిడ్డవు.నా బలిజాదాని యెచ్చ తగులును.నా బలిజాదాని ఉసురు తగులును అన్నది. అసువంటి నిలబడ్డ కాడా నీళ్లు చల్లుకున్నది గనకనేమి, మూడు రోజులు క్రింద తిన్నది నన్ను చూస్తే ఇవతల పడుతుంది గనకనేమి అని మాటలు మాట్లాడేది నేను దాని మొఖం చూడను. నేను పర్వతం మీదికి పోను నా...తాకన్న దానికన్న సక్కనైనా ఏడురేట్లా మా ఉరుమ్మ తీసుకొస్తే గనకనేమి ఇదే పంచపర్వతం మీదనే సల్లాగుండలకాడా సాగి పోరాటం పెట్టించి మరి బలిజా మెడల ముందు రెక్కలు పట్టి మూడు గుద్దులు గుద్దితే గాని నిద్రపోను అన్నాడు.

(గొల్లకేతమ్మ కథ - చౌదరిపల్లి అంజయ్య ప్రదర్శన నుంచి)

నన్ను నానా మాటలు అంది. ఎవడవిరా? ఎక్కడి వాడివిరా? ఎవడి బిడ్డవిరా? అని నన్ను నిందించింది. నా ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెట్టింది. ఇలా మాట్లాడినదాని ముఖం కూడా చూడను, దీనికన్నా అందమైనదాన్ని తీసుకువచ్చుకుంటా, నాతో పంతం పట్టింది కాబట్టి దీని మెడలు వంచి, మూడు గుద్దులు గుద్దికానీ నిద్రపోను అని తన ఆగ్రహాన్ని ప్రకటించాడు.

అప్పుడు గంగమ్మ రెండు వివాహాలు చేసుకోవడం సుఖాన ఉన్న ప్రాణాన్ని దుఃఖాన పెట్టుకోవడమే అని మల్లన్నకు సర్దిచెప్పింది.

కొడుకా కొడక మల్లయ్య
నా కొడుక మల్లయ్య
ఒక్క ఒర లోపల రెండు కత్తులు మెదలవు
ఇద్దరు పెళ్లాలు చేసుకుంటే హీనం తక్కువ గనకనేమి,
మరి అసువంటి గనకనేమి, నీ కంటికి నిద్ర ఉండదు.
ఒంటికి సుఖం ఉండదు గనకనేమి, షదుపు (కడుపు)కి అన్నం ఉండదు గనకనేమి
ఇద్దరు పెండ్లాలపోరు కూడా తప్పది
నీకు రాని బాధలు వస్తాయి
నీకు లేని సేవాలోస్తాయి
ఓ కొడుకా మల్లయ్యనా నా కొడుకా మల్లయ్యనా

(గొల్లకేతమ్మ కథ – చౌదరిపల్లి అంజయ్య ప్రదర్శన నుంచి)

అంటూ రెండు వివాహాల వల్ల కలిగే కష్టాలను వివరించింది. ఇది సరైన బోధ అని చెప్పాలి. ఒక్క ఒర లోపల రెండు కత్తులు ఉండడం ఎలా సాధ్యపడదో సవతులు ఇద్దరు సఖ్యంగా ఉండడం కూడా అంతే సాధ్యపడదు. ఇది సమాజంలో అన్ని వర్గాల ప్రజల్లో అందరూ గమనించే స్వాభావిక అంశమే. ఇందుకు విపరీతంగా ఉండే సవతులు ఎక్కడో అరుదుగా ఉంటారు. అలా సవతులతో కాపురం అంటేనే కష్టాల కడలి. మరోభార్యను తెచ్చుకున్నందుకు మొదటి భార్యకు కోపం, మొదటిభార్యపై ప్రేమ చూపిస్తే రెండో భార్యకు కోపం రావడం సహజం. దీంతో గృహస్థు ఇద్దరి కోపానికి బలి అవుతాడు. అంతేకాదు ఇద్దరూ సవతి విషయాన్ని ప్రస్తావిస్తూ అతన్ని తక్కువచేసి మాట్లాడుతారు. ఈ సవతలు తగవులతో గృహస్థు కంటికి నిద్ర, కడుపుకు అన్నం, ఒంటికి సుఖం కరువవుతాయి. ఇదే అంశాన్ని నదీదేవతయైన గంగమ్మ చెబుతోంది.

గంగమ్మ ఇంత చెప్పిన తరువాత కూడా మల్లన్న శాంతించలేదు. మేడలమ్మ కుటుంబానికి చేసిన అవమానాలను చెప్పుకొచ్చాడు. నాకు కంచం, మంచం దూరం చేస్తానన్నది. నాకన్నా అందమైనదాన్ని తీసుకువస్తే పన్నెండేళ్లు పాదసేవ చేస్తా అని వెక్కిరించింది. నా ఏడుగురు అన్నలకు మెడలో కొంతాలు (గొలుసులు) కట్టి గుంతలో గంజిపోసి అవమానించింది. అందుకే నేను మేడలమ్మతో ఉండను అంటూ మల్లన్న పర్వతం దిశగా సాగిపోవడానికి సిద్ధపడ్డాడు. ముందు నాగన్న చెప్పిన మాటల్ని, తరువాత గంగమ్మ చెప్పిన మాటల్ని పెడచెవిని పెట్టి వెళ్లిపోవడానికి సిద్ధమైనాడు.

ఆగ్రహంతో మల్లన్న తిరిగి వెళ్లడానికి సిద్ధపడ్డప్పుడు అగ్నిజ్వాలలు ఉందయించాయి. ఆ అగ్నిలో సకల జంతుజాలం కాలిపోతున్నాయి. ఆ ఘటనను ఒగ్గు కళాకారులు –

అడివి కాలుతున్నదమ్మ రామా రామా... అడివిలో మల్లయ్య రామా రామా... అగ్ర పెద్దపులికేమి మల్లయ్య, అడవి లోపల లేళ్లు, దుప్పిలు, గండబేరుండులు, బల్లులు లేచిపోతున్నాయి అటా... రెక్కలున్న పక్షులు లేచిపోతున్నాయి, రెక్కలు లేని పక్షులు ఆ అగ్గి లోపల పడి కాలిపోతున్నాయి. కాళ్ళు ఉన్న జంతువులు లేచిపోతున్నాయి. కాళ్ళు లేని జంతువులు అగ్గి లోపల పడి కాలిపోతున్నాయి గనకనేమి

(గొల్లకేతమ్మ కథ – చౌదరిపల్లి అంజయ్య ప్రదర్శన నుంచి)

అని వర్ణిస్తున్నారు. అంతే కాదు ఆ అగ్నిలో జరిగిన నష్టాన్ని కూడా వర్ణిస్తున్నారు.

దేవుడు... అగ్గి బంతిలాడబట్టె మల్లయ్య
అగ్గి లోపల దునికినాడు గురుడు మల్లయ్య
అగ్గిబంతులాడుతుండు మల్లయ్య

అగ్గి లోపల ఆటలాడుతుంటే ముత్తు మూడులోకాలు, పదనాలుగు గునాలు, సిట్టి చీకటి సినిమబ్బులు అయినాయి... ప్రపంచం అంతా కమ్మర లేచిపోయింది... రెక్కలు ఉన్న పక్షులు లేచిపోయినాయి... రెక్కలు లేని పక్షులు మంటలో పడి కాలిపోయినప్పుడు కమ్మర లేచి... ఆ సూర్య భగవానుడు గనకనేమి, మబ్బు దెబ్బలు కట్టెనట్ట కట్టెటోరుకల్ల గనకనేమి, సూరది 33 దేవతలా యగ్నాలు అగిపొయినయి, హెూమాలు అగిపొయినయి, సంధ్యవందనాలు అగిపొయినయి...

(గొల్లకేతమ్మ కథ – చౌదరిపల్లి అంజయ్య ప్రదర్శన నుంచి)

మల్లన్నకు వచ్చిన ఆగ్రహ ఫలితంగా ఉద్భవించిన అగ్నివల్ల అడవులు అంటుకున్నాయి. పులులు లేళ్లు, దుప్పిలు, గండభేరుండులు, బల్లులు చనిపోతున్నాయి. రెక్కలు లేని పక్షులు, కాళ్ళు లేని జంతువులు ఆ అగ్గి లోపల పడికాలిపోతున్నాయి. ఆ అగ్ని వల్ల మూడులోకాలు, పదనాలుగు భువనాలు పొగలతో నిండిపోయాయి. సూర్యుడు కూడా పొగమబ్బులతో ఆవరింపబడ్డాడు. చీకటివల్ల దేవతల యజ్ఞాలు అగిపోయాయి, భూమిపైనవారు చేసే హెూమాలు అగిపొయాయి. బ్రాహ్మణులు చేసే సంధ్యావందనాలు అగిపోయాయి.

ఈ అగ్ని ప్రభావం వర్ణనం మహాభారతం వంటి పెద్దయుద్ధాలలో మహాశక్తివంతమైన మంత్రపూరిత అస్త్రాల వల్ల జరిగే హానిని వర్ణించిన ధోరణిని చూపుతుంది. అగ్ని వల్ల

ప్రకాశం కలుగుతుంది. పెద్ద పెద్ద కవులు ఈ ప్రకాశాన్ని వర్ణించారు. మల్లన్న కథను చెప్పుకునే జానపదులు ఆ అగ్ని వల్ల లేచే పొగను వర్ణించారు. ఆ పొగవలన కలిగే అరిష్టాలను వర్ణించారు. శిష్టకవులు అగ్నిని గమనిస్తే, జానపదులు ఆ అగ్గి వల్ల కలిగిన పొగను గమనించారు. అగ్ని వల్ల జరిగే ప్రమాదం కన్నా దాని పొగ వల్ల జరిగే ప్రమాదం ఎక్కువ అని అందరూ అంగీకరించే సత్యమే. ఆ వాస్తవాన్ని జానపదులు గమనించినంతగా శిష్టకవులు గమనించలేదని ఈ వర్ణనవల్ల మనం గ్రహించవచ్చు.

భూమిపై రేగిన అగ్ని వల్ల వచ్చిన పొగను దేవతలు గమనించారు. ఈ ప్రమాదానికి కారణం ఏమిటో అర్థం కాక శివుని వద్దకు చేరి ఇలా విన్నవించుకున్నారు–

పాహిమాం... పాహిమాం, పరమేశ్వరా, గంగాధర, గౌరీ వల్లభ మరి ఎవరి మాయ ఎక్కడి మాయ చుట్టు చీకటి అయినాయి, సిరి మబ్బులు అయినయి, ప్రపంచం అంతా కమ్మర లేచి పొయిందంటే అగ్గి లోపల పుట్టిన అగ్గిపొరుడు గనకనేమి, అగ్గిపొరును బంధించుచున్నవారు ఎవడో, ఆ పొరుడును బంధించుకున్నట్టు అయితే సూర్య భగవానుడు వస్తానన్నాడు అటా... మరి ఏ దేవుడు పొమ్మాన్నడో వామ్మో మా తరం కాదు. ఆ పొరుడు ఎక్కడ వుంటాడో, ఏడా వుంటాడో, అగ్గి లోపల యాడా ఉంటాడో మమ్ముల్ని ఏం చేస్తారని ఎక్కడోల్లు అక్కడ భయపడ్డారు

(గొల్లకేతమ్మ కథ – చౌదరిపల్లి అంజయ్య ప్రదర్శన నుంచి)

దేవతలు ఆ అగ్నికి కారణం తెలుసుకోదలచారు.ఆ అగ్నిని బంధిస్తున్నదెవరో తెలుసుకోదలచారు. ఆ అగ్నిని బంధిస్తున్న అగ్గిపొరుడు (అగ్నిపుత్రుని) నియంత్రిస్తేనే సూర్యోదయం మళ్లీ అవుతుందని, ఆ అగ్నిని నియంత్రించమని కోరారు. అప్పుడు అక్కడికి బ్రహ్మామానసపుత్రుడైన నారదుడు వచ్చాడు. దేవతలు నారదునికి జరుగుతున్నదేమిటే, తమ విపత్తు ఏమిటో వివరించారు.అప్పుడు నారదుడు మల్లన్న శక్తిసామర్థ్యాలను తెలుసుకోలేక అహంకరించి "ఆ పొరడు నాకో లెక్కనా... వాని పుర్రెకే ఎరుక వాని కట్టెకే ఎరుకా" అంటూ అయ్యోరు (బ్రాహ్మణ) వేషం కట్టుకొని అగ్ని పుట్టిన చోటికి చేరుకున్నాడు.

హరి నారాయణ భజ గోవిందా
అరుకులో ఉన్నది నీ ఆయుస్సు అర ఘడియలో ఉన్నది నీ అయుస్సు
శివ శివ శంకర శివ గోవిందా శిరములో ఉన్నది నీ అయుస్సు
నారీనాథ శివుని నమ్మవాలేరు శివుని నమ్మవాలేరు శివుని పూజ చెయ్యవాలేరు
హరిని నమ్మవాలేరు... హరిని నమ్మవాలేరు... హరి పూజ చెయ్యవాలేరు...

నరుని నమ్మవద్దురా నరుని నమ్మవద్దురా నరుని నమ్మితే
నరకం తప్పది... నరుని నమ్మవద్దురా...
హరి నారాయణ భజగోవిందా అరుకులో వున్నది నీ అయుస్సు
అర ఘడియలో ఉన్నది నీ అయుస్సు...

(గొల్లకేతమ్మ కథ - చౌదరిపల్లి అంజయ్య ప్రదర్శన నుంచి)

అంటూ ఆ అగ్నిపుత్రుని బెదిరించే ప్రయత్నం చేశాడు. అప్పుడు ఆ అగ్నిపుత్రుడు "నేను అగ్గి లోపల ఉన్న... ఎవడు అని చెప్పేటట్టు లేదు అని ముందు నువ్వు కర్ర చేతికి ఇస్తే... గనుక కర్ర పట్టుకొని బయటకు వస్తా... నా పేరు చెప్తా" అన్నాడు. అహంకారంతో నిండిన నారదుడు తన చేతికర్రను ఆ అగ్నిపుత్రునికి అందించాడు. ఆ అగ్నిపుత్రుడు తనను ఎగతాళి చేసిన నారదుని వేధించాడు-

బ్రహ్మ మానసపుత్రుడు నమ్మి కర్ర చేతికి ఇచ్చినప్పుడు నా కర్రకే ఎరుకా... నా పుర్రెకే ఎరుకా అంటివా. సరే మంచిది అన్నప్పుడు గనకనేమి, నారద మునీంద్రుడు అగ్గి లోపల నుండి గుంజినప్పుడు బారెడు గడ్డం కాలిపోయింది, మూరెడు మీసం కాలిపోయింది, కర్ర పోయింది, బెర్రి పోయింది... ఆ... ఆ... ఆ... ఆ... ఆరుమంటు మండుతున్నది అటా... ఆరుమంటు మండుతుంటే ఉరక సాగుతుంటే ఆ పొయ్యేటి దారిలో ప్రాకుడు బండమీద అడుగుపెట్టి జారిపాడి 32 పండ్లు రాలిపొయేనంటా...
అసువంటి బ్రహ్మ మానసపుత్రుడు కైలాసం వచ్చినాడు... ఆ పొరడును మేం పట్టలేము పొరనుతోనే మాతరం కాదు వాడు సామాన్య పిల్లగాడు కాదు కనుక ఆ పిల్లగాన్ని మేం పట్టాలంటే మాతరం కాదు ఏమి...

(గొల్లకేతమ్మ కథ - చౌదరిపల్లి అంజయ్య ప్రదర్శన నుంచి)

అగ్నిపుత్రుడు నారదుని గడ్డం, మీసాలను దహించాడు. భయపడిన నారదుడు పారిపోతుండగా దారిలో ఉన్న ఒక పాకుడుబండపై పడడంతో అతని పళ్లు రాలిపోయాయి. ఇలా అవమానం పొందిన నారదుడు కైలాసానికి వచ్చి అగ్నిపుత్రుడు సామాన్యుడు కాడని, అతన్ని పట్టటం తమ వల్ల కాదని విన్నవించుకున్నాడు.

అప్పుడు శివుడు పార్వతిని పిలిచి అగ్నిని నియంత్రించమని ఆదేశించాడు. అప్పుడు పార్వతీదేవి తన స్వరూపాన్ని మార్చుకుని అగ్నిని నియంత్రించేందుకు బయలుదేరింది. ఆమె స్వరూపం ఇలా ఉంది -.

రాగ భూషణాల పూజల రంగ పార్వతి కోరి వెళ్ళి ముక్కపుడక కట్టి, మరి అంచు

చీర కట్టి మరి మందగముల పాలు, గుడ్లు, పెరుగు, గుడ్లు పెట్టుకొని మరి అమ్మవారు పార్వతి ఇట్లా పోతున్నదేమి.

అయ్ పార్వతినే దేవి పార్వతినా...
ఊరు బయటికి వెళ్లినే ఉళ్లువల్లు దాటినా
ఎక్కి రాని కొండలు ఎక్కి పోతు ఉన్నాదా
దిగరాని కొండలు దిగి పోతు ఉన్నాదా
రాగభుషాలనే రంగ పార్వతినా...

(గొల్లకేతమ్మ కథ – చౌదరిపల్లి అంజయ్య ప్రదర్శన నుంచి)

ఇలా రూపం మార్చుకున్న పార్వతి మల్లన్న ఉన్న చోటికి దుత్త, కవ్వం తీసుకుని వచ్చింది. మైలారు దేవుని స్తుతిస్తూ ఇలా పాటలు పాడింది.

సల్లా సల్లానివాడ రాజు మల్లయ్య సల్లనివాడువు మైలారుడా
సల్లని మండపానా సంద మల్లయ్యో లింగమై నువ్వొస్తే నీలా
లింగమై నువ్వొస్తే రాజు మల్లయ్య నిత్య వేడుకొందును మైలారుడా...
జంగం అయి నువ్వొస్తే రాజు మల్లయ్య దినం అయి ఎడుకొందురు మైలారుడా..

కొనేట్లొ తానాలు రాజు మల్లయ్య కొండల్లో నీ పూజ మైలారుడా...
మడుగులో స్నానం రాజు మల్లయ్య మండపాన నీ పూజ మైలారుడా...
గంగలో తానాలు రాజు మలయ్యో గట్లలో నీ పూజ మైలారుడా...
ఉన్నవాడు ఒక్కడవు రాజు మల్లయ్యో ఇల్లుల్లు పూజలు మైలారుడా...

(గొల్లకేతమ్మ కథ – చౌదరిపల్లి అంజయ్య ప్రదర్శన నుంచి)

పార్వతీ దేవి అలా పాడుతూ వచ్చి మల్లన్నతో "కొడుకా మల్లయ్య నీకు ఈ రూపం ఎందుకు వచ్చింది. ఈ బాధ ఎందుకు వచ్చింది. ఈ కష్టం ఎందుకు వచ్చింది కొడుకా" అని ప్రశ్నించింది. నిజస్వరూపంలోకి రమ్మని కోరింది. అప్పుడు మల్లన్న తన వికృతరూపాన్ని వదిలి, తన నిజ స్వరూపాన్ని ధరించాడు. పార్వతికి పాదాభివందనం చేశాడు. ఆపై–

అమ్మ తల్లి మీద పడ్డాడు అమ్మ మల్లయ్య, తల్లి మీద పడి కల కల కన్నీళ్ల ఒలబోసి... అమ్మ బలిజోల్లా పిల్ల అనరాని మాటలు అన్నది, తిప్పరాని తిప్పలు తిప్పింది, తాను అసువంటి సుందరి తూర్పున సూర్యుడు సక్కదనమట, పడమటని చంద్రుని సక్కదనమట, కైలాసంలో దాని సక్కదనం అటా... బలజొల్లా పిల్ల కన్న సక్కనైనా పిల్ల

పుట్టలేదు అటా... పుట్టినా ఒకవేళ దక్కలేదు అటా... నీ అందాన్ని, నీ సందాన్ని, ముంగిటెళ్ళ బందాన్ని ఇంకా దిక్కుమాలినది పిల్లనిస్తది అని లేనిపోని మాటలు అన్నది. నిలబడ్డకాడనే తూ గొల్లోడా, ఛీ గొల్లోడా అన్నది. నేను దాని ముఖం చూడనమ్మ కన్నతల్లి

(గొల్లకేతమ్మ కథ - చౌదరిపల్లి అంజయ్య ప్రదర్శన నుంచి)

అంటూ మేడలమ్మ చేసిన అవమానాన్ని చెప్పుకున్నాడు. మల్లన పడ్డ అవమానానికి పార్వతీదేవి గుండె కరిగింది. మల్లన్నను ఊరడించింది. మల్లన్న పార్వతీదేవితో కలిసి కైలాసానికి వచ్చేస్తానన్నాడు. ముందు ఈ అగ్నిని చల్లార్చమంది పార్వతి.

కొడుకా మళ్ళ అడివి కాల పెట్టినవు.అగ్గి లోపల ఆటలాడినావు. అగ్గికి నెరువల్లబెట్టువురా మల్లయ్య. అగ్గి నేరుబెట్టే ముందు భూలోకం పుట్టెదున్నది, పెరిగే దున్నది, కట్టె పట్టుకొని అసువంటిది నా పేరుమిది పండుగలు, పబ్బాలు జరిగెదున్నది నాకు

| | |
|---|---|
| మంగళవారంనాడు | మహిళలకు అయితే |
| బుధవారంనాడు | పెండ్లికొడుకు |
| బెస్తావారు నాడు | సాయిబాబా పూజ |
| శుక్రవారం నాడు | సూర్య పెళ్లికొడుకు |
| శనివారం నాడు | గంగా తానం |
| ఆదివారం నాడు | గోవు లగ్గం |

మరి గోవు లగ్గం అయినప్పుడు మరినాడు తొక్కడు మయిలా (మైల) తీసెడిదుంటది. తొక్కుడు మయిలా తీసినాక అగ్ని గుండం కల్ల నడిసి నా లగ్గం అయిన అగ్ని గుండంలోకి నడిసేదుంటాది. అగ్నిగుండంలో నడిసినప్పుడు నా భక్తులు నాకాశి కట్టినా, నా ఆట ఆడినా, నా పాట పాడినా అగ్నిగుండంలో కల్లి వస్తారు గని చెంతమణి అంత కాలు కాలొద్దు, రభమంత బట్ట కాలొద్దు...

(గొల్లకేతమ్మ కథ - చౌదరిపల్లి అంజయ్య ప్రదర్శన నుంచి)

అని చెప్పి, అగ్నిని ఉపసంహరించమని మల్లన్న చెప్పింది. అప్పుడు మల్లన్న ఆ అగ్నిని ఉపశమింపజేసి పార్వతీతో కలిసి కైలాసానికి వెళ్లిపోయాడు. కైలాసానికి చేరిన మల్లన్న శివుడు కూర్చునే సింహాసనంపై కూర్చున్నాడు. అప్పుడు శివుడు అది నేను కూర్చునే సింహాసనం అని చెప్పాడు. అప్పుడు శివుడు- మల్లన్నల మధ్య ఎవరు ఏ వారం నాడు సింహాసనంపై కూర్చుని పూజలందుకోవాలి అనే అంశంపై సంభాషణ జరిగింది. ఆ సంభాషణ ఇలా ఉంది -ఆ సదా సాంబశివుడు కొడుకా మల్లయ్య అది నేను కూర్చునే

కుర్చీ.

మల్లయ్య: నాయనా అన్ని వారాలు నీవే వుంటాయా. నాయనా ఇక్కడకెళ్ళ ఇన్ని వారాలు నీయి వుంటాయి. సోమవారం ఉంటాది మా నాయన నీవి సోమవారం పూజలవి మా నాయనా...

శివుడు: కొడుకా మల్లయ్య ఆదివారం ఎవలిది అంటే

మల్లయ్య: అచ్చం ఆదివారం అమృతగడియల లోపల నా పూజలు ఉంటాయి మా నాయనా...

శివుడు: మంగళవారం ఉన్నదిరా చిన్ని నాయనా, ఆ మంగళవారం ఎవ్వరిది అన్నప్పుడు ఆ రేణుక ఎల్లమ్మ పుట్టంగా పుట్టిమంతురాల, పెరగంగా లక్షమంతురాలు, బుద్దులు నెర్వంగ భూతాలు గల్లది మోహిని ఇల్లుగల మోహిని... వెనుక వేదం ముంగట మూలం కడి గంటం కర్మ గాచారం తినేముందు తీపి చెప్పుతున్నది. దిగే ముందు లోతు చెప్తున్నది. రేణుక ఎల్లమ్మది మట్టు మంగళవారం.

శివుడు: పర్వాలేదు మంగళవారం రోజు రేణుక ఎల్లమ్మది అన్నవ్ అయ్య, బుధవారం ఎవ్వళిదిరా చిన్ని మల్లయ్య...

మల్లయ్య: బుధవారం రోజు గౌర్రె పుట్టిన దినం, ఆడపిల్ల పుట్టిన దినం కాబట్టి గౌర్రె పుట్టింది, ఆడపిల్ల పుట్టింది ఒకటే దినం కాబట్టి అసువంటి గౌర్రె పుట్టిన దినంకి ఎవ్వళ్ళకి మరి ఇచ్చేటానికి వీలులేదు. మరి అసువంటి బుధవారం గౌర్రె పుట్టిన దినం అన్నావ్ పర్వాలేదు.

శివుడు: బెస్తావారం ఉన్నదిరా మల్లయ్య... బెస్తారం ఎవ్వళిది రా కొడుకా నాకు చెప్పు అంటే బెస్తావరాం సాయిబాబా పూజ ఉంటాది. అసువంటి బెస్తావారం సాయిబాబా పూజ వుంటాది. అసువంటి యంత్రకాలు, తంత్రకాల పూజ వుంటది. నాయనా అది మనకు అవసరం లేదు.

శివుడు: బెస్తారం సాయిబాబా పూజ అన్నావు. శుక్రవారం ఉన్నాదిరా మల్లయ్య. శుక్రవారం ఎవ్వళిది అన్నప్పుడు.

మల్లయ్య: చిన్నమ్మ లక్ష్మి, ధనలక్షి, ధాన్యలక్ష్మి, సంతాన లక్ష్మి, గజలక్ష్మి, వరలక్ష్మి, రాజలక్ష్మి, దయలక్ష్మి, మరి అష్టలక్ష్మితో చిన్నమ్మ లక్ష్మిదేవికి రోజు వుంటాది...

శివుడు: మరి చిన్నమ్మ లక్ష్మిది శుక్రవారం అన్నావ్.. శనివారం ఉన్నాదిరా

మల్లయ్య. అది ఎవరికి అని కొడుకా చిన్నిమల్లయ్య.

మల్లయ్య: శనివారం రోజు ఆంజనేయ స్వామి పూజ వుంటాది. శని పూజ వుంటాది. ఆంజనేయ స్వామిది ఉంటాది శనిపూజ వారి ఇద్దరిదే ఉంటాది.

| | |
|---|---|
| ఆదివారం | నా పూజ |
| సోమవారం | నీ పూజ |
| మంగళవారం | అక్క రేణుక ఎల్లమ్మది మరి |
| బుధవారం | గౌౖరె పుట్టిన దినం మరి |
| బెస్తవారం | సాయిబాబా పూజ |
| శుక్రవారం | చిన్నమ్మ లక్ష్మిదేవిది |
| శనివారం | ఆంజనేయస్వామి పూజ వుంటది |

నాయనా ఎవ్వరికీ వారం లేదు, ఒక్కటే వారం. ఒక్క వారం నీది. ఒక్క వారం నాది అన్నాడు ఆయన. దేవదేవుడు మల్లయ్య వారాల పంచేసిండు.

(గొల్లకేతమ్మ కథ – చౌదరిపల్లి అంజయ్య ప్రదర్శన నుంచి)

దేవతలు అందరూ పూజనీయులే అయినా, అన్ని రోజులు అందరినీ పూజించాల్సిందే అయినా హిందువులు వారంలోని ఒక్కోరోజు ఒక్కొక్క దేవతని ఆరాధిస్తారు. ఇక్కడ ఈ సంభాషణను గమనిస్తే,

12 పుట్ల పద్య ముత్యాలు ఒడ్లు పోసి యెట్లా దంచుతున్నారేమి
సువ్వి సువ్వనులార సువ్వనులార సువ్వని నేనొక
పాట పాడంగా పోటీ చేయంగా
కుమ్మరి యెజునా కుచుకుందేనా కుచుకుందేనా
ఒడ్లులుడదీసివన్నెల గళము వన్నెల గళము
కమ్మరి జేసిన గంటలపొన్ను గంటలపొన్ను సంకటి రోకలి
సక్కదనము ఏమి సక్కదనము ఏమి
కుండెనుక మొలకిన గంట మొలగలు గంట మొలగలు
చెరువు యెనుక పండిన చాపకన్నులు చాపకన్నులు
పోచమ్మ తలవారు పొట్టి మొలగాలు పొట్టి మొలగాలు
సీతమ్మ తలవారు చెవిటి ముత్యాలు సెవిటి ముత్యాలు
మల్లయ్య తలవారు మల్లెమొగ్గలు మల్లెమొగ్గలు

బీరయ్య తలవారు బీరగింజలు బీరగింజలు
రాముల తలవారు రామ బాణాలు రామ బాణాలు
గంగమ్మ తలవారు గవిడిగొగ్గలు గవిడిగొగ్గలు
అవికొన్ని కుందట్లా జేరంగబొది జేరంగబొది
రాగును దెంచేటి రంభదేవరే తెచ్చేదేవరు
ఒక్కత్తా కోడలు యేడుగురు ఆడొలు (ఆరలు) యేడుగురు ఆడొలు (ఆరలు)
బంగారు పథకాలు పర్ణశాలలు పర్ణశాలలు
చిలక బొబ్బట్ల చీర చింగుల్లాడ చింగుల్లాడు
జారుపండు రవిక జబ్బలు మెరియ జబ్బలు మెరియ
బారి బొమ్మలు సందు బంగారిబొట్టు బంగారి బొట్టు
కురుస బొమ్మల సందు కుంకుమ్మ బొట్టు
కంకణాల చేత కలవందు కొని కలం అందుకొని
వంగిపొవుట చెయ్యని వయ్యనంయేమి వయ్యనం యేమి
మట్టెల కుడకల మడపంగ చాపి మడపంగ చాపి
జడించి కొటిచి జారుతనమేమి జారుతనమేమి
ముత్యల పడుగల నడుమ చుట్టి బొజ్జ మడతపెట్టి
వంగిపోటుయేమి వయ్యారం యేమి వయ్యారం యేమి
ముప్పై రోకండ్లు మూడు కుందన్లు  మూడు కుందన్లు
వంచితి దొరక్కకుండా దండిరాజు వడ్డెరాజులు
ఆరవై రోకండ్లు ఆరు కుందన్లు ఆరు కుందన్లు
దంచితి దొరక్కుండ దండిరాజులు వడ్డెరాజులు
బంతిపువ్వు వంటిది బారిపళ్ళెలు బారిపళ్ళయలు
బాల్లేవు బసవాన బోయి రైతన్న రాజు రైతన్న
అట్లట్ల పోయేటివి ఆవులు యెవరివి ఆవులు యెవరివి?
ఆవులా బొర్లిరాజు కన్నబిడ్డయి కన్నబిడ్డయి
దుక్కుల మేసేటివి దూడలేవరివి దూడలు యెవరివి
దుప్పట్ల పన్నవాడు మాయన్నగాడ ఎర్రన్నగాడ
యెడ్ల ముంగట మోత ఎవరిది మోత యెవరిది మోత?

యెండి పిల్లపొయ్యే ఎల్లప్ప కాదా ఎల్లప్ప కాదా
సిక్కుడు సెట్టుకు తీగలు అందము తీగలు అందము
సిన్నమ్మ సిరిదేవి మేడలు అందము భవనం అందము
కాకరచెట్టుకు కాయలు అందము కాయలు అందము
కడగొడ్డుకు పత్రియ్యకు కావడ అందము తిరుమునందము
పర్వతాల తొవ్వలో పాలమిన్నులు పాలమిన్నులు
పండన్న పంపడే మా ఒద్దెరన్న వల ఒద్దెరన్న
తిరుపతి తొవ్వలో తీగమావిల్లు తీగమావిల్లు
పండన్న పంపడే మా ఒద్దెరన్న బల ఒద్దెరన్న
సువ్వి సువ్వనులారా సువ్వనులారా
సువ్వన్ని నేనొక పాట పాడంగా పోటీ చేయంగా

అని అక్కడ ఒడ్లు దంచిర్రు. మారి బియ్యం ఏనులు రాజెయ్యలే

సువ్వి సువ్వానిరంగా సువ్వి మోహనరంగా
సువ్వి కస్తూరిరంగా సువ్వాలాలి
సున్నములు జాదుటాల సొంపుతీర జేసిరటా
జనకునింట్ల జనకమ్మ పెళ్ళి సాయాల్లో
అరే కుమ్మరి చేసినాది పూసనొక కుందెనటా
వడ్లవాడు చేసినది వన్నెముల గనలమో
అరే కమ్మరి చేసినాది గంట బొన్ను అంటా
సంగాడి రోకలి సక్కదనమో
కుంట యెనుక మండినాయి గంటమొలక రాజనాలు
చెరువు యెనుక పండినాయి చాపకన్ను రాజనాలు
అవి కొన్ని కుండట్లా జేరంగబొసి
దంచి దంచి బామ్మలేమో తామరమొగ్గలా యున్నరటా
ముంచి ముంచి ఇవ్వరమ్మ మంచి తీర్థము
ఇంతలోన ధాములాయే యేం తిరిగి వచ్చినారు
ఆ పురుషడంత నేతి ఒట్టు పుంటికూరా వంటదము
అప్పుడప్పుడు అన్వయించి ఇప్పుడే వత్తిమో

ఆ ముంచి ముంచి ఇవ్వరమ్మ మంచి తీర్థము
ఇంతలోన తాములాయే యేమి తిని వచ్చినారు.
శారదన్నంత నేతి ఒట్టు శామకూర వంటేగాము
అప్పుడప్పుడు అన్వయించి ఇప్పుడు వత్తిమో
ముంచి ముంచి ఇవ్వరమ్మ మంచి తీర్థము
ఇంతలోన ధాములాయే యేమి తిరిగి వచ్చినారు
ఆవు దోసకాయ పప్పు అప్పుడప్పుడు అన్వయించి
అప్పుడప్పుడు అన్వయించి ఇప్పుడు వత్తిమో

ఇది అయినంక

శ్రీశైలం పర్వతం క్రింద మాదవసాని, మారయ్య యాదవులు వచ్చిర్రు, శంకరుడు, పార్వతి, విష్ణు, బ్రహ్మ వీళ్ళందరు వచ్చిర్రు. సూరదు 33 కోట్ల దేవతలు వచ్చి, నూరుమంది వేదమూర్తులు చదువంగా భట్రాజులు పొగడంగా బ్రాహ్మణులు చదువంగా, యాదవరాజు కాళ్ళు కడిగి కన్యాదానం చేసి లగ్గం అయింది కేతమ్మ మేడల తాలి కట్టిండు తాలి కట్టినాంక అప్పుడు మాదవసాని వచ్చి కాళ్ల మీద పడి నువ్వు దేవుడంటే మాకు తెలియదు నువ్వు నరుడనుకొని అనరాని మాటలు అన్నాం. నా తప్పును మన్నించమని కాళ్ళు పట్టుకుంటాది.

మల్లయ్య: నువ్వు నా తల్లి లాంటిదానివి నా వంతు ఘడియకు నీ ఇంటికి వచ్చేన్నా నేను అన్నావు పడ్డగా నేను సదసు (తదాస్తు) అని అప్పుడు

వాళ్ళను ఒప్పించుకొని బిడ్డను అల్లుడి చేతుల పెట్టి శంకరుడు మారువేషంలో వుండే గౌరమ్మ వాళ్ళ చేతుల పెట్టి, వాళ్ళ కాళ్లు పట్టి మా పిల్ల కాదు నీ పిల్ల కోటి తప్పు చేసిన కోడలిది. అత్త తప్పు చేసిన ఆడపిల్ల ఇదివరిదాక మావంతు ఇప్పుడు మీవంతు తల్లియైన నువ్వే తండ్రి అయిన నువ్వే అయినా బాయినా నువ్వే వియ్యంకుని, వియ్యపురాళ్ళ చేతుల్లో పెట్టిర్రు. అమ్మ ఇగా మేము కూటికి దూరం అయినాం కాటికి దగ్గర అయినాం జాగ్రత్త సెలవు అన్నప్పుడు అప్పుడు దేవుడు పర్వతం మీదికి పొతాయుంటాడు. పర్వతం మీదికి పొయేటప్పుడు మారు వేషం మీదనే పొతాడు.

దరువు: సత్యమతి దేవుడు సామినే మల్లయ్యానా
పర్వతం మీదికి అయితేనా దేవుడు వస్తాయి యున్నాడా
దేవుడు వస్తాయుంటేనా మ్రోగిన గంటలు మొగేనా

గంటనాదం విన్నది, శంఖునాదం వింటాది బలిజమేడలమ్మనా
సెంబుతోనే ఉత్కాను చేత మంగళహారతి దేవిచేత పట్టేనా
గంటలా దర్వదలు దగలము తానే దాట్టేనా
శంఖుల దర్వదలు శవనాంగనే దాట్టేనా
ద్వారంనందు ఉన్నటి దేవుడి దగ్గెరె వచ్చేనా
యెడమ మంగళహారతి కుడికి తియ్యబట్టేనా
కుడి మంగళహారతి యెడమకు తియ్యబట్టేనా

దేవుని పాదాలు కడుగుతాది కేతమ్మ యెనుకమారు ఉంటాది. అయ్యయోయోయో ఏమి తెచ్చినావా తెచ్చిన మరి ఇటు జరుగుతాడు ఇటు చేయి చాపు అంటే చేయి చాపుతాడు ఇటు కాళ్లంటే మరి సూర్యుడు పడమటికి పోతాడు మరి చంద్రుడు తూర్పుకు పోతాడు మరి ఒక నీడ అవుపడక రెండు నీడలు అవుపడుతున్నాయంటే సవతిని చూస్తాది.

మల్లయ్య: సాటుకు సవతి యున్నాది. నేటుకు యారాలునే మరి ఇద్దరు సవతులకు పడతాది.

బలిజ మేడలమ్మ: నువ్వు యాడపడ్డదానివే యెక్కడపడ్డదానివే నా భర్తకు ఒంటరిగా చూసేనే ఒర్వకుంటా వత్తివా గొర్లపాలు తాగిన నీది గొల్ల కులం యున్నాది.

కేతమ్మ: నువ్వు సక్కనిదానివి అయితే నా దగ్గరకు ఎందుకు వచ్చును 'నీ దొడ్లనే పసరము నా దొడ్లకు వచ్చేనా' నువ్వు యాడపడ్డదానిమే యెక్కడపడ్డదానివ్వు నీది బలిజ కులం యున్నది నీది బడువా కులం యున్నది. ఇలా ఇద్దరు కొట్లాడతారు. కొట్లాడినంక ఇద్దరిని సభాయించి సల్ల కుంజల కాడ సల్ల చేయపెడతాది.

యే గొల్లొలదానే పిల్లనే గొల్ల కేతమ్మ
సల్ల కవ్వం పట్టేనా సల్లలు చేయబట్టేనా
మరి సల్ల చేసేటప్పుడు యేం అంటాది
సల్ల సల్లనివాడు రాజు మల్లయ్యో
సల్లని వాడువో మైలారుడా
సల్లని మడువనా సందు మల్లయ్యో
లింగ మధ్య లింగ మైలారుడి
సయ్య సయ్య సల్లలు సల్లలు జేయబట్టేనా

కేతమ్మ:	అక్క మేడలమ్మనా సల్ల నువ్వు చేయ్యవే

మేడలమ్మ: అయ్యా బలిజదానే పిల్లనే బలిజ మేడలమ్మ కేతమ్మ ఇట్లా పట్టి గుంజింది.
మేడలమ్మ యెనుకకు తిరిగి
యెనుకకు తిరిగి అయితేనా సల్లగవ్వం పట్టేనా
దేవి చీపిరికట్ట పట్టేనా చెడ చెడ దెబ్బలు
నువ్వు కులం పుట్టుక పుట్టలే కులందానివి కావున
సల్లచేసే నేరువ ఇట్లా కాదంటాది
గుంజుకు రెక్కలు పట్టేనా మూడు గుద్దులు గుద్దేనా

యేసినాంక అప్పుడు సల్ల పట్టిందటా. ముద్దు పెట్టుకొని సల్ల చేసి సల్లాడ కాడ పనులు నేర్పి, వెన్న తీయడం నేర్పి బలిజల పిల్ల కూరగాయలు అమ్ముతాది. ఈమె సల్ల పెరుగు అమ్ముతాది. ఇద్దరు అమ్ముకొచ్చి భగవంతుడికి ఇస్తారు. ఇద్దరికి ఇగా సవతుల పోరు అయితే ఇది పర్వతం మీది కథ, ఇది గొల్ల కేతమ్మది.

**2.5.2. కీలు గుర్రం కథ**

దేశపతి మహారాజు అయితే దేశపతి మహారాజు దేవగిరి పట్నం పరిపాలన చేస్తావుంటాడు. దేవగిరి పట్నం పరిపాలన చేసుకుంటూ దేవపతి మహారాజు కొడుకు దేశపతి మహారాజు ఆ దేవగిరిపట్నం వైభోగం ఏట్లా ఉందంటే మిద్దెలు, మెడలు, గోపురాలు, లాలా గోపురాలు, అద్దం గొట్టిండు. డెబ్బై రెండు దేవ బురుజులు, ముప్పయి రెండు మూలా బురుజులు, మున్నూట ఆరవై గ్రామాలు, కాశీ దాక పట్నాలు కళియుగ వైకుంఠం. అయితే దేవబతి మహారాజు, దేశబతి మహారాజు ఏం జేసిరంటే రాజ్య పరిపాల చేసుకుంటా ఏలకొట్లా మహారాజు యెడుగురు బిడ్డలను లగ్నం చేసుకుంటాడు. యెడుగురు బిడ్డలను లగ్నం చేసుకుంటే ఒకలాను, వెనుక ఒకలాను సంతానం కాకపోతే ఒకలాను వెనుక ఒకలాను చేసుకుంటాడు. అయితే చేసుకొంగ చేసుకొంగ వాళ్ళకు సంతానం కాలే. సంతానం కాకపోవటం వల్ల సకల యాత్రలు, పూజలు చేయించిండు. సకల యాత్రలు, పూజల చేయించినా కూడా సంతానం కాలే. ఆ దేవగిరి పట్నం లోపల శివుని మందిరం, శివుని మందిరం లోపల యెడుగురు భామమణులు బంగారు జల బిందెలతో నీళ్ల తీసుకొని శివాన శివునికి పూజ చేస్తారు. మన్యాక్ష రుద్రాక్షం చేసుకుంటూ గాయత్రి మత్రం జపం చేసుకుంటూ శివ పంచాక్షరి మత్రం చదువుకుంటూ కట్టిన చీరను కాషాపొషి తపస్సు చేస్తావుంటారు. తపస్సు చేసినపప్పుడు శివుడు దర్శనం ఇస్తాడు. దర్శనం ఇచ్చి

యెదుగురు పుత్రఫలే, పుత్రఫలే అంటారు. పాపం పాలేరు గానం మీద పడుకుంటే వాళ్ళకు పుత్రఫలే పుత్రఫలే అని సంతానం ఒడిగడ్తాడు. ఒడిగట్టినక శివ వరప్రసాదం కాబట్టి యెదుగురు అక్కాచెల్లెలు ఒక్కేసారి గర్భవతులు అయితారు. అయితే ఏడుగురు అక్కాచెల్లెలు గర్భవతులు అని తెలవంగ (తెలిసినాక) దేశపతి మహారాజు ఏడుగురికి ఏడు మేడలు కట్టిచిండు. మేడలు కట్టించి ఏడు రొండ్ల పద్నాలుగు (7 x 2 = 14) మందిని దాసరులను కాపల పెట్టిండు. వాళ్ళకు సేవలు చేసాటానికి అయినాంక.

మాదొంద రాక్కసి ఏడేడు సముద్రాలు దాటంక నల్ల దివగడ్డలు. నల్ల దివగడ్డల బొక్కల సిరికొటా. బొక్కల సిరికొట యందు బక్కర రాక్షసుడి బిడ్డలు ఇద్దరు రక్కసులు (రాక్షసులు) పెద్దది మాదొంద రక్కసి, చిన్నది రావరంబిక యెక్కడ పన్నెండు అమడల దూరం మానవమాత్రులు లేకుండా భుజించారు. భుజించినాక యెక్కడ ఏమీ దొరకకుండా అయిపోయింది. దొరకకుంట అయిపోయినాక చిన్నది రావరంబిక.

దరువు: చిన్నది రావరంబి ఏమంట యున్నది
అక్క దగ్గర వచ్చెన ఏవని మాటలు అంటది
ఓయ్ అక్క రక్కసి నేను బ్రతుకలేనమ్మా
ఈ కొండ మధ్యల నేను బ్రతుకలేను
ఏ రాజ్యం అన్నపోయి ఏ దేశం అన్నపోయి
ఏ పట్నం అన్నపోయి మానవులతోని కలిసిమెలిసి యుండి
మానవులతోని కొన్ని జీవించి ఒత్తానమ్మ... అనగా

మాదొంద రక్కసి:

దరువు: ఇనవమ్మ మా చెల్లెల చెల్లెల రావరంబి
మన గుట్టు బయటనే బయటపడకుంటాను
మానవ లోక పట్నంలా నువ్వు కూడా మెదిలాలే
నేను రానుపొను రామసిలక రూపంలో వుంటానమ్మ...

నీ బాధ నేను తెలుసుకుంటా నా బాధ నీకు చెప్పుకుంటూ వుంటానేమి మన గుట్టు బయటపడకుంట మానవులతో కలిసిమెలిసి వుండాలనుకున్నప్పుడునేమి మాదొంద రక్కసి యట్లనే అని చిన్నది రావరంబి గనకనేమి.

దరువు: చిన్నది రూపము రూపంలెలా యెతేన్నా
యేడేడు సముద్రాలు యెల్లిరానే వస్తాంది

ఆకాశాన భూదేవి మైలుదాటి
యేడేడు సముద్రాలు దాటి గనకనేమి
మానవలోకం వస్తున్నదా...
మానవలోక పట్నము అందరానే వచ్చేనా

మానవ లోక పట్నము ఏవరగలది దేవగిరి పట్నం. దేవగిరి పట్నం లోపలనేమి దేశపతి మహారాజు పరిపాలన చేస్తున్నడట! దేశపతి మహారాజు పరిపాలన చేస్తుంటానేమి మరి అటు నూరుమంది ఆసామి రైతులు గనకనేమి పని చేసుకుంటానేమి. రోహిణి మృగశిల గనకనేమి అయిదొద్దు ఒత్తువు వచ్చుంది సెలకలో చెట్టు కొడ్తునారు మొగోల్లేమోచెట్లను నరుకుతున్నారు. ఆడల్లేమో చెత్తల్ని యెరుకుతున్నారు. మస్త తీర్తుల నీరు తెచ్చుకున్నారు. అమడి బుడ్డి గనకనేమి దుప్ప బుడ్లు తెచ్చుకొని మిట్ట మధ్యాహ్నం మర్రిచెట్టు క్రింద కుస్సొని గనకనేమి దుప్ప నీళ్లు తాగినక ఆ చోట కూర్చున్నరట.

దరువు: ఆ మానవులను చూచింది చిన్నది రావరంబి
చిన్నారి రూపము రూపంలేలా యెత్తెన్నా
ఆరవై యెండ్ల పెద్ద మనిషి అవతారం యెత్తేనా
ఆరవై యెండ్ల పెద్ద మనిషి అవతారం యెత్తుకొని
పొల్లుకుంట రక్కసి సొక్కుకుంట రక్కసి
ఆ మర్రిచెట్టు కాడికి అందరానే వచ్చేనా
ఆ చొంగి పడతయై వున్నది సొక్కి పడతాయి వున్నది
ఆ తాకి తాక ముందైన డొల్లి పడతయై వున్నది.

అసువంటి గనకనేమి నూరు మందిని చూసి గనకనేమి మా పెద్దమ్మ లెక్కనే ఉన్నది, మా సిన్నమ్మ లెక్కనే ఉన్నది, మా అమ్మ లెక్కనే ఉన్నది అని ఆ రక్కసి దగ్గర వారందరూ వచ్చిరి.

పనివాళ్ళు: అమ్మ ఏ ఊరమ్మ పెద్దమ్మ.

రావరంబిక: ఏ ఊరంటే ఈ పట్నం నాకు తెలియదు. నాకు రాజ్యం లేదు, దేశం లేదు, కడుపులో పుట్టిన కొడుకులు లేరు, కడుపున పుట్టిన బిడ్డలు లేరు. సేసుకున్న మొగోడు లేడు. సేసుకున్న మొగోడు సెట్లల్ల కలిసిపొయిందు. అమ్మ నాకు యెవరు లేరంటే. ఆ ఆకలి దప్పయితాంది అంటే దుప్ప బొస్తారు.

దరువు: దుప్పకొద్ది రక్కసి అన్నం తినబట్టేనా

ఆ దుప్పకొద్ది రక్కసి దుప్పం తాగవట్టేనా
ఆకలి కొద్ది రక్కసి గట్క తాగవట్టేనా
మస్కాతీర్తుల నీళ్లు తాగంగ
మాదొండ రక్కసి విశ్రాంతి తీసుకున్నదా...
విశ్రాంతి తీసుకున్నాక రక్కసి ఏం అంటా వున్నది.

రావరంబి: అమ్మ ఈ పట్నం ఏవలదమ్మ?

పనివాళ్ళు: ఈ పట్నం అమ్మ దేశపతి మహారాజుది.

రావరంబి: దేశపతి మహారాజుకు పెళ్లయిందా?

పనివాళ్ళు: అయింది.

రావరంబి: ఎంత మంది భార్యలు?

పనివాళ్ళు: యెడుగురు.

రావరంబి: వమ్మో! వాళ్ళ అమ్మ కడుపుల మన్ను బొయ్య యెడుగురా! యెడుగురు భార్యలా! అమ్మ నాకు యెనకముందు ఎవరూ లేరు. అయిబాయి లేరు. నేను ఆయన పని చర్యలు చేసేందుకు ఉంటా. ఆయన రాజ కచేరి కాడ అకలి సాపు చేస్తా (వాకిలి ఉడుస్తా). నన్ను ఉంచుకుంటాడా?

పనివాళ్ళు: ఏయ్ ముసల్దానా ఏం అంటున్నావు ఏం మాట్లాడుతున్నావు వుంచుకుంటాడని మాట్లాడుతున్నావు. అట్లా కాదు పని చర్యలు చేస్తానికి అయితే
ఉంచుకుంటాడు అనగానే

రావరంబిక: అమ్మా మరి మీతో రావాలంటే ఎట్లా రావాలే ఏ ప్రకారంగా రావాలే, ఏ రూపంగా రావాలే అనగానే పనివాళ్ళు:అమ్మ మేము ముందు పోతావుంటాము. నువ్వు యెనక మారు రా. సేతులు కలిసినా సప్పట్లు, మాటలు కలిసినా ముచ్చట్లు ఆ మెము రాజ కచేరి కాడికి పొంగానే గీతా పెడ్తాము. మా గీత చూసి కచేరి కాడ ఆగు.

ఆడలతోనైనా తాను బయలుదేరేనా మాదొండ రక్కసి అందరానే వచ్చేనా రాజుల కచేరికు రానే వత్తా యున్నది. రాజుల కచేరి కాడా సిన్నలు, పెద్దలు, సీమ సహెూదరులు, గడ్డను కాపులు, కమ్మన ఏలమ్మలు, కవులు, గాయకులు, పాండి లోకములు పగడదత్తా భాగవతములు పన్నెండు మేళ్ళా దొమ్మరులు, ఇటా దొమ్మరులు టలు ఆడుతురు, పాటలు పాడ్తున్నారు. ఇట్టా దొమ్మరులు ఆటబావులు ఆటలు ఆడుతారు, పాటలు పాడుతున్నారు.

మద్దెలు, తాళాలు మారుమ్రోగుతున్నాయి. రాజ కచేరి మీద కుస్సొని రారాజు కనిపెట్టేరు. ఈ మాదొండ రక్కసి గజ రెమ్మల వృక్షం కింద కుస్సొని పన్నెండు రెండు పద్నాలుగు యవ్వనరాసుల అవతారం యేసుకొని సుడివాసుల సుందరి పదహారు ఒక్క వన్నె బంగారు ఛాయ ఈ నారీమణి పైట కొంగును ఉపుతూ ఉన్నదటా గజరెమ్మల వృక్షం క్రింద. రారాజు కళ్ల చూసిందు. ఆ వనిజామణి ఎవరు? ఆ నారీమణి ఎవరు యెక్కడికెళ్లి వచ్చింది యాడికెళ్లి వచ్చింది. అపురూప సౌందర్యవతి సుడివడి లేని సుందరి పదహారు వొక్కవన్నె బంగారు ఛాయ. ఈ నారీమణి యెక్కడికెళ్ళి వచ్చిందని దానిమీద కన్నెస్తాడు. కన్నేసి మంత్రులను తొలుతాడు.

మంత్రులు: అమ్మ మీది ఏ ఊరు? ఏం కథ అంటే

రావరంబిక: నాకు ఊరు లేదు, పల్లె లేదు, రాజ్యం లేదు, దేశం లేదు, అతిగతిలేని అనాధను, దిక్కులేని ధీనురాలిని. నాకు దిక్కు లేదు, గతి లేదు, ఎవరు లేరు అనగానే

మంత్రులు: అయ్యా ఎవరు లేరటా అతిగతి లేదని అనాధటా, దిక్కులేని ధీనురాలు అటా అనగానే

రారాజు: అప్పుడు లేసి ఆ మద్దెలు, తాళాలు బందుపెట్టి వచ్చిన సభవాళ్ళను యెళ్లగొట్టి మంత్రులు అక్కడ వుండగా రక్కసి దగ్గరికి వస్తాడు. రక్కసి దగ్గరికి వచ్చి చూసేసరికల్లా మిడిగుడ్లు గొలుపుతాయి అన్నమాట. చూసేసరికి మైమరిచిపోతాడు. మైమరిచిపోయి ఆ రక్కసిని వర్ణిస్తాడు.

దరువు: ఆహా! ఈ జగన్మోహిణి ఎవ్వరు సుందరిరా...
ధరణి కరణములు శ్రీకారంబులు వర్ణింపతరమా
కామెని దరసులు కాటిక రేకులు కాంతాయి కన్నుబొమ్మల్
వికచించని ఆ తామర కమలములు ధరణి గర్భంబులు.

### 2.5.3. నల్ల పోచమ్మ కథ

పూర్వకాలంలో వల్బుల వైకుంఠం, దాప్రల బ్రహ్మాండం నట్టనడుమ ఎండు కొండ కైలాసం... బ్రహ్మ భక్తులు 11 కోట్లు, విష్ణు భక్తులు 11 కోట్లు, శివ భక్తులు 11 కోట్లు. అయితే 33 కోట్ల దేవతల ప్రతినిధి శంకరుడు. శంకరునంతా దాతానై పార్వతీ అంతా మాతనై అయితే దేవలోకంలో దేవేంద్రుడు పుత్రకామేష్టి యాగం చేసిందు. సురది 33 కోట్ల దేవతలను పిలువనంపి పుత్ర కామేష్టి యాగం చేసినంకా... ఆ పుత్ర కామేష్టి యాగానికి

శంకరుడు అతి పెద్ద దాత... యాగం పూర్తి అయిపోయింది. వచ్చిన దేవతలకు అన్న భోజనాలు, సాహిత్యం, తామరాకు సాహిత్యం, సంభావనం, అతిథులకు అన్నదానం, యివ్వంతా అయిపోయినంకా దేవతలు అంతా నిమ్మలంగా కుసొని వున్నారు ఇంకా... ఆసీనులై కుసున్నారు.

దేవేంద్రుడు: ఏం ప్రశ్న వేసిండు అంటే ఈ సురది 33 కోట్ల దేవతల్లో ఎవరి భార్య పతివ్రత అనేటోరికల్ల దేవతలు అందరూ కినులైపోయిర్రు (ఆశ్చర్యపోయినారు). ఎవళి భార్య పతివ్రత అంటే ఎవళికి తెలిసి వుంటది. పతివ్రత అని ఎవళి భార్య పతివ్రత అని ఎట్లా అంటాం మనం... మావల్ల కాదు, మావల్ల కాదు, మేం చెప్పలేం, మావల్ల కాదు... అని ఆలోచన చేసినంకా... శంకరునంత దాతనై, పార్వతి అంతా మాతనై... శంకరుడే ఏర్పాటు చెయ్యాలి... అనంగనే అప్పుడు శంకరుడు (పార్వతి ఇంటికెళ్లి పోయింది) మారువేషం వేసి ఇవెలల్ల (నిలువెల్ల) జోగిరి (విభూది), ఎద్దుమెత రుద్దరాక్షాలు (రుద్రాక్షాలు), గావంత ఘంట, ఏనుగు మెరుంత (తొండం) శంఖువు, జల జల లింగాలు, చంద్రకాయ వస్త్రాలు, జడల సందు చంద్రకాయ తావులాలు, మెపల్లే జడలు...

ఎడమ కాలు ఏనుగు మెరంతే... కుడికాలు కురస మెరంతే, 66 పుట్ల త్రిశూలం పట్టుకొని శంకరుడు జంగం వేషం వేసుకొని అక్కడ పార్వతమ్మ పరమశాలకు పొతుండు...

అయ్య జంగం అయ్యనా దేవా జంగం అయ్య నా అడాలేదు జంగమా ఇడా లేదు జంగమా... పోవుల తిరిగేటి పుటికా జంగం ఉన్నాడా... రాక్షంబు తిరిగేటి రంకు జంగం ఉన్నాడా... దేశంబు తిరిగేటి దేవ జంగం ఉన్నాడా... ఘన ఘన గంటమ్మే, గంటలు పట్టబట్టేనా ప్రభోవు శంకమ్మ శంకుల పట్టబట్టేనా... పార్వతమ్మ పరణాలే పర్ణశాలకు వచ్చేను.

శంకరుడు: గణ గణ గంట కొట్టి బోవునా శంఖు పట్టి భవతి భిక్షాందేహి అన్నాడు అటా...

ఆరాగి భూషణాలనే రంభ పార్వతి అయితేనా...
శేరిండి కడియాల సెలియా పార్వతి అమ్మెనా...
ముత్యం గుండు ఎక్కెనా ముని జలగం అడేనా.
పొడగుండు ఎక్కెనా పై జలగం ఆడేనా...
వెండి గుండు ఎక్కెనా వేయి జలగం ఆడేనా...
కత్తుల మాండొరెనె గుత్తుల తట్ట కట్టేనా...

కుసుమల్లి రైఖమ్మ గుత్తేంగా తొడిగేనా..
నెమలిక ప్రహోలే తల విరబోసెనా...
చేయితో ఉతకము చేత మంగళహారతి
గంటల దరువాదలు గరముగా దాటేనా...
శంఖుల దరవాదలు శవనముగా దాటేనా...
కత్తెరపండ్ల బట్టేనే కడపలు కూడా దాటేనా...
దారమంటే ఉన్నట్టు జంగమయ్యను చూసేనా...
ఆ జంగమయ్యను చూసి ఏర్పాటు చేసింది
ఎవ్వరిని మోసం చేద్దామని వేషం కట్టిందు ఇది,
ఎవ్వరిని భంగపరచటానికి ఈ వేషం కట్టిందు
అప్పుడు మంగళాలు తిప్పి పాదాలు కడుక్కుంటా...
ఏమయ్యా నాథుడా.. నా ప్రాణాలొదుడా... ఎవ్వరిని మోసం చేస్తావు
ఎవరిని భంగపరచదవు... ఈ వేషం ఎందుకు కట్టినవు నాతొౌటల్ల చెప్పయ్యా...

శంకరుడు: నీ పత్తినిల్లు మెచ్చేనే భావనంబు మెచ్చేనా
కోరవే పార్వతి కోరిందల్ల ఇచ్చేదా...

పార్వతి: మరి ఏం కోరుకోవాలి నేను. కోరవే పార్వతి కోరుకోమన్నాడు మరి ఏం కోరుకోవాలి నేను... డబ్బు కోరుకుంటే డబ్బు నాకెందుకు. రాజ్యం కోరుకుంటే రాజ్యం నాకెందుకు. వెండి, బంగారం నాకెందుకు ఏమయ్య నాథుడా నా ప్రాణలోదుడా... అడిగిందల్ల ఇస్తావా నాతొౌటల్ల చెప్పయ్య...

కొలవని కొటంబరము — తరగని ధాన్యము

కొడుకులు — బిడ్డలు

అడగ నూరుమందైనా ఆడపిల్లలు కావాలి. సవ్వా నూరుమందైనా మగపిల్లలు కావాలే. 225 మంది సంతానం నాకు యియ్యి...

శంకరుడు: చూసి ఈ 225 మందిని నువ్వు ఎట్లా చాదుతావమ్మ. నీ ఈ ప్రపంచం అంతా మన బిడ్డలే కదా... ఈ ప్రపంచం అంతా మన కొడుకులే కదా. వీళ్ళకన్న మించింది ఏం వుంది... అంటే...

పార్వతి: కన్నది కడుపు కాదు... కట్టింది బట్ట కాదు... కళ్ల మీద పద్ద మురికి కాదు

నాథ... ఓ నాథ జంగమయ్య, నాద మొయ్యలే, అన్నంబు తినబెట్టలే... నేను... ఆ... తన చేను పంట పండాలే... ధానము చెయ్యాలే... ధర్మం చెయ్యలే... గావులు నిండాలే.. గరిసె నిండాలే నాథా... జంగమయ్య మంది కుప్పలకు ఒడి చాపితే... గావులు నిండి, గలిసెలు నిండి నాథా... పత్తుకొచ్చిన కుక్క కుందెలు పడ్డదయ్యో... ఓ... జంగమయ్య, సాధినా కుక్క కావాలి... కుందేలు పట్టాలి, కూర కావాలి ఏమి... మామా... మరి నేను అడగ నూరుమంది అడపిల్లలను, సవ్వనూరు మంది మగపిల్లలను ఇస్తే గాని నేను మూడు వస్తువులు కోరుతున్న ఇస్తావా.

శంకరుడు: ఏం కోరుకుంటావు కోరుకో... ప్రపంచంలో లేనిది కోరుకుంటావా... నా తానా ఉన్నది కోరుకుంటావా... నా తాన లేనిది కోరుకుంటావా... ఏది కోరుకుంటావో కోరుకో... పురుగు ముట్టని పుష్పం (పువ్వు), కప్ప ముట్టని గౌతం (నీళ్ళు), శిల (చీడ) లేని పత్రి (పత్రాలు), ఉలప ముట్టని ఉబిది... (విభూది). నాలుగు వస్తువులు తీసుకొచ్చి అంగానా అంగ పూజ, లింగానా లింగ పూజ, నిలువెల్ల పాద పూజ కట్టినట్టయితే నీ అడగ నూరుమంది ఆడపిల్లలని ఇస్తా... పో...

పార్వతి: అవ్వ గిదేనా నువ్వు కోరుకున్నది, పురుగు పుట్టని పుష్పం, కప్ప ముట్టని గౌతం, చీడ లేని పత్రి, ఉలప ముట్టని ఉబిది. ఒక్క బిందెడు నీళ్లు కాకపోతే, పది బిందెలా నీళ్ళు తీసుకొచ్చి మీద పోస్తా. ఒక్క ప్రతికెడు పూలు కాకపోతే పది ప్రతికెలు పొస్తా, ఇంతా పత్రి కాకపోతే నిలువెల్ల వేస్తా... ఇంతా విభూది కాకపోతే బండెలు కొద్ది తీసుకొచ్చి ఇస్తా... నీళ్ల లెక్కింది నీళ్ళ పిశాచి ఏంది, పూల లెక్కింది పూల పిశాచి ఏంది. పత్రి లెక్కింది పత్రి పిశాచి ఏంది... ఇది నాకో లెక్కనా... అంటే...

శంకరుడు: నీళ్ల పిశాచి అన్నావా... నా పిశాచి అన్నావా
పత్రి పిశాచి అన్నావా... నా పిశాచి అన్నావా
పూల పిశాచి అన్నావా... నా పిశాచి అన్నావా

నువ్వు తీసుకరా నేను కట్టుకుంటా పో అని... శంకరుడు పొనొక్క ఘడియ రానొక్క ఘడియ ముక్కలు మూడు ఘడియలు రావాలే... పార్వతి సిద్ధమై పువ్వులు పత్రిక తీసుకొని, నీళ్ళ బిందె తీసుకొని నీళ్ళు తేవడానికి బయలుదేరింది... మీది తుమ్మెద పురుగై కుప్పిల

(కొప్పు) కూసున్నాడు, దీని సంగతి ఏందో చూద్దాం అని.. కూసొని అరచేతి గుండా నీళ్ళు ఉన్నకాడా ఐదు కప్పలు ఆడాలి... ఐదు పువ్వులు వున్నకాడా పది పురుగులు ఆడాలి... శిడలేని పత్రి చీడ పట్టాలి. ఉలప ముట్టని విభూది ఉలప ముట్టాలి... అని హస్తం తిప్పుతడు.

దరువు: అమ్మవారు పార్వతమ్మ నేమి తాను కూడా బయలుదేరినాది
ఓరుగూడ బయలుదేరినాది ఉల్లుమల్లు తల్లిదాటినాది
ఎక్కరాని కొండలేమి ఎక్కి కూడా పోతాయున్నరేమి, దిగరాని
దిగిపోతున్నదేమి... దండి దండి కొండలైన దాపురాలు తల్లి వెళ్ళినాదా.
అమ్మవారు పార్వతమ్మ శివయ్య గుండ ఎర వచ్చినాది.... యి... యి....
శివనాగగుండ కాడికి వచ్చి ఒరగల్ల... అరచేతి కాడ నీళ్ళు ఉన్నచోట
ఐదు కప్పలు ఆడుతున్నాయి అటా...
పువ్వుల తోట లోపల ఒక పువ్వు ఉంటే ఐదు పురుగులు ఆడుతున్నాయి అటా.
శిడ లేని పత్రికి చీడ గూడ పట్టేనా...
ఉలపపట్టని ఉబదికి ఉలప కూడా ముట్టేనా
ఏది మీ మాయమ్మ మాయా నాకు తెల్వదాయే
ఎట్లా చెదు నేనులో నేను ఎట్లా సెదు నేనుల్లా... ఓ... అ..
నేను ఏమి సేదునే....
అరచేతి గుండా నీళ్ళు ఉంటే ఐదు కప్పలు అడబట్టే
ఇదు(ఐదు) పువ్వులు ఉంటే పది పురుగులు ఆడబట్టే
చీడపట్టని పత్రి చీడపట్టినాది
ఉలప ముట్టని విబుది ఉలప ముట్టింది

అయ్యో మరి శివనాగ గుండంలో నీళ్ళు లేకుంటే.. మరి గంగా ఉన్నది గంగ లోపల పొతా అని... గంగకు బయలుదేరి పోయి... గంగకు పోయి నీళ్ళు తీసుకొస్తా అని పోతున్నది పార్వతమ్మ... పార్వతమ్మ పోతుంటే... పార్వతి కొప్పు లోపల కూర్చున్న పరమాత్మ కండ్ల చూసి పార్వతి కన్న ఐదు అడుగులు ముందుకు పొయ్యి

శంకరుడు: ఆ గంగ ఒడ్డుకి త్రిశూలం పాతి గంగా గంగా అని పిలుస్తున్నాడు అటా...
కయ్యిల్లు కోసేటి ఒయ్యారి గంగమ్మ... నిసుబొయుడు బిడ్డవే నీలారి గంగాదేవి,

శంకుదేవుని బిడ్డవే జలధీర గంగాదేవి, ఎవమ్మ ఓ బామా... ఓ బామా గంగమ్మ.

గంగా: అమ్మో... ఎన్నడు లేని ఇక్కడికి వచ్చిందు ఎందుకో? అక్కడ ఏదో లొల్లి అయినట్టుంది అందుకే వచ్చిందు.

దరువు: శంబుతోనే ఉదకము, చేత మంగళహారతి
కట్టెల దరువాదలు గనమున దాటేనా, కయ్యల్లు కోసేటి వయ్యారి
గంగమ్మ రానొస్సువున్నది... జంగమయ్య దగ్గర అందరానే వచ్చేనా
ఎడమ మంగళహారతి కుడికి తియ్యబట్టేనా...
కుడి మంగళహారతి ఎడమ తియ్యబట్టేనా.. తెచ్చేనట్టి నీళ్ళతోటి
పాదములు కడిగేనా, కడిగినట్టి నీళ్ళమ్మ మీద చల్లుకున్నది...
ఎడమ రెట్ట పట్టేనా ఎడికల్లా చేసేనా...
కుడి రెట్ట బట్టేనా కుషాలు వేశేనా...

శంకరుడు: దేవి గంగాదేవి నేను ఒకటి చెప్తా వింటావా...అయ్యో ఏందో చెప్పు మీ అక్క పార్వతి నాతో శరతుగా మాట్లాడి శెట్టుకు గాటు పెట్టి వచ్చింది. అరచేతి గుండా నీళ్ళు దొరకనియ్యెదో... ఆనాడు నిన్ను కైలాసం తీసుకెళ్ళిననాడు ఏమన్నది, రొయ్యలు తినేదానా... కప్పలు తినేదానా... నిసుదానా... కంపుదానా... ఎడాపడ్డవు... ఎక్కడ పడ్డావు... రొయ్యలు తిన్నవ్, రొతన సవతి... మొయ్యలు తిన్నవ్ మేతన సవతి... నిన్ను కైలాసం రానిచ్చిందా...

గంగా: అవునయ్య... రానియ్యలేదు...
మరి ఎందుకని నీళ్ళు దొరకనియ్యెద్దు
పార్వతమ్మకు ఎందుకు దొరకనియ్యెద్దు

శంకరుడు: పార్వతి నామీద శరతుకాసింది. దేవేంద్రుడు పుత్ర కామేష్టి యాగం చేశారు. యాగం కాడా సురది 33 కోట్ల దేవతలు వచ్చినారు. యాగం పూర్తి అయిపోయింది... దేవేంద్రుడు ప్రశ్న వేసిందు 33 కోట్ల దేవతల్లో ఏవని భార్య పతివ్రత అని... 33 కోట్ల దేవతలు చప్పుడు చెయ్యలేదు. శంకరుని అంత దాతనై పార్వతినంత మాతనై అన్నప్పుడు శంకరుడే ఏర్పాటు చెయ్యాలి అన్నారు... నేను మారువేషంలో పోయి మీ అక్క పరీక్ష చేసినా... నన్ను ఏర్పాటు చేసింది... ఏర్పాటు చేసినందుకు ఇంకొటి కోరుకో అన్న... అడగ

నూరుమంది ఆడపిల్లలను కోరింది. సవ్వానూరు మంది మగ పిల్లలను కోరింది అంటే 225 మందిని కోరింది.

గంగా: అయ్యో 225 మంది మా అక్క కొంతమంది చాదుతది నేను కొంతమంది చాదుతా... ఆమెకు వుంటే ఏంది నాకు ఉంటే ఏంది ఎవళికి ఉంటే ఏంది....

శంకరుడు: అది కాదమ్మ ఆమెకు నీళ్ళు దొరకనియ్యొద్దు, నేను పురుగు ముట్టని పుష్పం, కప్ప ముట్టని గౌతం,శిడలేని పత్రి,ఉలప ముట్టని విబూది కోరినా.....
నీళ్ళులెక్కేమీ నీళ్ళ పిశాచి ఏమి, పూల లెక్కేమీ పూల పిశాచి ఏమి, పత్రి లెక్కేమి పత్రి పిశాచి ఏమి, పత్రి లెక్కేమీ పత్రి పిశాచి ఏమి, నా పిశాచి అందా... దాని పిశాచి అందా...

గంగా: అయ్యా మరి నువ్వు మారువేషం కట్టుకోకపోతే అనరా... ఎవరన్న అంటారు.

శంకరుడు: అది కాదే... అరిదాసి నీ తల్లి ఆడదానివున్నావే...

దరువు: నీ అక్క చెందు కొలువుని కోలుకొండా కన్నాడే
అలుముల త్రిశూలంతోని ఒక పోటు పోడిస్తే గాన ఘడి వద్ద
ఒక గండి పడేసి వెళ్ళిపోతివే...
పార్వతమ్మ నీళ్ళు ఇస్తావా... నీ సంగతిలేమిటి చూస్తా...
అని శూలం లేపినప్పుడే...

గంగా: ఓ అమ్మో... నేను నీళ్ళు ఇయ్య... నువ్వు అగయ్య... ఎడ్డన్న పట్టుండ్రి... ఏ గంగాలో అయిన పట్టుండ్రి... అని తప్పిచ్చుకున్నది. ఉసుక మీదికైంది... ఉటా కిందికి అయింది... ఏడేళ్ళ కాలం పోయిన ఎడలారసువంటి గంగా పీక్కాపోయింది.

పార్వతి: అమ్మవారి ఎర్రటి ఎండ లోపల గుమ్మడి పండు ఆ... అర అర అనొస్తుంది. వచ్చేటి దారిలో పల్లేరు గాల్చేస్తాది. ఆ పల్లెరు గాలికెల్లి వస్తుంటే కాలికి పల్లేరు గాలి గుచ్చుకుంటాది. కాలికి పల్లేరు గాలి, సెతు ఇరుగతే చెతుకు ఇరిగితే నొట్ల పడతది (నోటికి ఇరుగుతది)...

దరువు: చిల చిల్ల రుద్రము రుద్రము అల్లా కారెనా...
ఎర్రటి ఎండల్ల గుమ్మడి పండువోలె
ఎర్రంగా పండినా కొర్రయము సందామి...
అమ్మవారు పార్వతి... అమ్మవారు పార్వతి రానే వస్తాయున్నది...

గంగా ఒడ్డువరికి వచ్చి చూచేవరుకల్ల ఏడేళ్ల కాలం పోయిన
ఎడనారు చుట్టు గంగా పిక్కపాయె అని... శెరవుల తియ్యబట్టెనే
ఆ దేవి పార్వతి పొడిమన్నె యెల్తది, తడిమన్ను వెళ్ళది...
ఎంత సేపు చూసినా పొడి మన్ను వెళ్తాది, తడిమన్ను వెళ్ళదు
అమ్మో ఇక్కడ నీళ్ళు దొరకది ఊళ్ళో...
పాతాళగంగకి పోదాం అని బయలుదేరుతాంది.
పాతాళ గంగా ఎన్ని యాగములు అయిన గాని పాతాళ గంగాలో నీళ్ళు ఉంటాయి... నాకు ఎట్లానైనా.. నీళ్లు దొరుకుతాయి అని పోతాది...

దరువు: పాతాళ గంగకు తాను బయలుదేరేనా...
కొండలెక్కబట్టేనా కొండల తీగ బట్టేనా...
ఎర్రటి ఎండళ్ల గుమ్మడి పండొలే...
పాతాళ గంగకు అందరానే వచ్చేనా...
ఆ గంగ కాడికి వచ్చి ఆమెకు చెప్పిండు

శంకరుడు: నువ్వు... నీళ్లు ఇచ్చినవు అనుకో నీకు నాకు ఇడాకులు... "ఆ గంగ సదా ఊట క్రిందికి అయిపోయింది ఇసుక మీదికి అయిపోయింది".

పార్వతి: యుగయుగాలకు తరతరాలకు వరుకు ఇండ్ల నీళ్ళు ఉండేది. మరి పాతాళగంగలో నీళ్ళు లేకుండా అయిపోయింది గనుక

దరువు: ఇంటవయ్య జంగమయ్య దేవ జంగమయ్య
ఇక ఆడవిలాగిందనే నువ్వు అలిగి పోతావా నువ్వు
చెప్పుతూ ఒక ముచ్చటను దేవ జంగమయ్య

దాని అర్థం అల్లా జెయ్యరాదు దేవా జంగమయ్య అనేవరుకల్లా శంకరుడు ఆగిండు అక్కడ. ఆగి యేం అన్నాడు దాని అర్థం చెప్పుము అన్నాడు.

అయ్యా జంగమయ్య యేమి లేదు. దానికి అలాకుడు ఉపాయం ఉంది గనకనేమి, యేడు చింతాలపల్లెకాడా ముగ్గురు యెరుకవాండ్లు పెద్దవాడి భార్య మహా పతివ్రత, నడపివాని భార్య మహా పతివ్రత, చిన్నవాడి భార్య కూడా మహా పతివ్రత మరి అసువంటి గనకనేమి ముగ్గరి భార్యలు పతివ్రతలే. పెద్దవాని భార్య తప్పు చేసింది. తప్పు చేసిన పోటీ మేము చేయాలని, నీ మామా దక్షప్రజాపతికి పరవాను (ఉత్తరం) రాసినట్లయితే పంచాయితి పాలనీళ్లు పాలు చేసి ఇడికే పంపిత్తాడు అన్నప్పుడే. అందరాని చోట ఆకు అందుకున్నాడు,

ముట్టరాని చోట మూలు అందుకున్నాడు. గిరగిరా పరవాను యేమంటా రాత్తాండు.

మారాజా మాన్యరాజా పూజ్యుయుతులైన దక్షప్రజాపతికి రాయడం ఏమనగా అసువంటి యేడు సింతాలపల్లె. యేడు సింతాలపెల్లే లోపల ముగ్గురు యెరుకవాండ్లు నడిపివాడి భార్య, చిన్నవాడి భార్యలు ఇద్దరు మహా పతివ్రతలు, పెద్దపాడి భార్య తప్పు చేసింది. తప్పు చేసినా పంచాయితి నా దగ్గరికి వచ్చింది. ఆ పంచాన్ని విప్పలాని నీళ్లను పాలను జేయాలన్న నావల్ల అయితాలేదు. లక్షయాభై వేల సంవత్సరాల నుంచేలి పరిపాలన చేస్తున్నావు కాబట్టి ఈ పంచాయితిని పాల నీళ్లను పాలన చేసి నా దగ్గర పంపు అన్నాడు దేవా జంగమయ్య.

పంపు అంటే యేంజేసిందు పచ్చరికాలు, రామచిలుకను పిలిసి. రామ చిలుక మేడ లోపల కట్టి పంపుతాండు.

దరువు: ఓ రామచిలుక నా రామచిలుక
పచ్చు పచ్చు చిలుక పచ్చని చిలుక ఓ రామా చిలుక
ఓ రామా చిలుక నా రామా చిలుక
పచ్చని రెప్పలకు ప్రౌడి పొడించేద ఓ రామా చిలుక
ఓ రామా చిలుకా నా రామా చిలుక
యెర్రని మూతికి యెండి పొడించేద ఓ రామా చిలుక
ఓ రామా చిలుక నా రామా చిలుక
బుజ్జారి కాళ్ళకు గజ్జేలు వెయించేద నా రామాచిలుక
జిమ్ము జిమ్మునా సిలుకా లేసిందే గా రామా చిలుకా
అమరబాదు లేవా బట్టేనే గా రామా చిలుక
మూడులోకాలు తిరిగేనే గా రామా చిలుక
మణిపూరి పట్నం వచ్చేనా గా రామా చిలుక

మణిపూరి పట్నంలో సువంటి దక్షప్రజాపతి కోట మీద వచ్చి కిల కిల పలుకులు ఇచ్చినప్పుడు దక్షప్రజాపతి పలుక మీద ఒడి బంగారువుకు ఆవ్ ఆవ్ అని పిలిచేనా... 'పలుక మీద వచ్చినప్పుడు ఒడి రొబ్బు బందరపు ఉగ్గుతుంటే పచ్చరేక రామా చిలుక మేడ లోపల పరవాను యేసింది. పరవాల్ యేసినదాని దక్షప్రజాపతి జూసి గనకనేమి.

మరి మా రాజా మన్యరాజా పూజ్యులైన రాజా దక్షప్రజాపతికి రాయడం ఏమనగా మరి అసువంటి కైలాసం లోపల యేడు సింతాల పల్లె. యేడు సింతాల పల్లె లోపల

ముగ్గురు యెరుక వాండ్లు. నడిపి వాడి భార్య చిన్నవాడి భార్య మహా పతివ్రతలు. పెద్దవాడి భార్య తప్పు జేసింది. తప్పు చేసినా పంచాయితి నాదగ్గరికి వచ్చుంది. ఆ పంచాయితి పాల నీళ్లు చెయ్యాలి నావల్ల కట్లేదు. ఆ పంచాయితిని పాలనీళ్లను చేసి నా దగ్గరకు పంపమన్నప్పుడు దక్షప్రజాపతి అనుకుంటాడు బుడిది విలువ పొట్ట కొసి గంట సింగు పట్టుకొని నాలుగు రాజ్యాలు భిక్షాటన చేసేవానికి యేం యెరుక మరి అసువంటి గనకనేమి తప్పు చేసి పొడినది గనకనేమి,

చెడిపోయిన బిడ్డ తల్లిని గారింటికి పోతాది. చెడిపోయిన చెడ్డ బంగారం అవుసులోల్ల ఇంటికి పోతాది మరి కాను తప్పు చేసిన ఆడది కాబట్టి సింత చెక్కలు సిరిగన్నం సాయలు మామిడి చెక్కలు మరిగన్నం సాయంగలు తీసుకవచ్చి ఆకాశానికి అర్ధగాణం చితివేసి చితికి అగ్నిని గుండం పేరా గురివందనం రైక తొడిగించి, అగ్గిపెరా ఆకుపచ్చ చీర కట్టంచి జిల్లెడ కట్టెల చిక్కిడిమీద కుస్సొండబెట్టి మరి అసువంటి వడుకంగా వాడివాలు అగ్నిగుండానికి ఆహుతి చేయాలన్నప్పుడే ఇట్లా పరవాను రాసి కైలాసానికి పంపిన్నప్పుడైనా, పచ్చని రెక్కల రామచిలుక వచ్చి పరవాను తెచ్చినప్పుడు శంకరుడు కండ్లు జూసిన్నాడు. శంకరుడు కండ్ల జూసి పరవాను విడిచిండు పరవాను పలా పలా చదివిండు.

పళ్ళు తెరచి జంగమ్మ పక్కున నవ్వెనా
పర్వాలేదు అంటాడు ఆ దేవా జంగమ్మ

ఆ పర్వాలేదు అన్నప్పుడు పరమేశ్వరుడు యేం అంటా యున్నాడు. ఈ పరవాను దక్షప్రజాపతి రాసినన్న సంగతి పార్వతమ్మకు తెలుసు. మరి అందరాని చోట ఆకు అందుకొని మూటరాని చోట ముల్లు అందుకొని పరవాను యేమని రాత్తాంది.

నాయన దక్షప్రజాపతి మీరు యెవరు అనుకున్నావు. ఏం అనుకున్నావో యేడు సింతాలపల్లె కాదు యెరుకరోళ్లు కాదు. మీ అల్లుడు జంగమయ్య నామీద లేని తప్పు మోపిండు, కాని బదనాం మోపిండు కనుక ఆ పంచాయితి నీ దగ్గరికి పంపిండు. నీకు తెలువదు కాబట్టి సింతకట్టెలా సిరిగన్నం, సాయలు మామిడి చెక్కల మరిగన్నం సాయలు తీసుకవచ్చి అగ్ని గుండానికి ఆహుతి చెయ్యమన్నావు యెవరుకో రాయమని నీ బిడ్డని కాదనుకున్నవా.

మీ అల్లుడు జంగమయ్య నామీద కాని నిందలు మోపిండు, బదనాం మోపుతున్నాడని. మళ్ళా మారు పరవాను రాసింది. మారు పరవాను రాసినప్పుడు దక్షప్రజాపతి చూసిండు. ఓరి బుడిద జల్లెవాడ బుడ్డగోసివాడ నేను యెవరో అనుకొని ఈ పంచాయితి నీకు చెప్పిన

నా బిడ్డ అనుకోలేదు. ఇప్పుడు యేం జేయాలా కొడుకా నీకు అగ్గి దొరకనీయ్య పాతాల లోకం నుంచి అగ్గి తీసుకొచ్చిండు. అగ్గిని తీసుకవచ్చి కోట లోపల బంధించిండు. శివదూతలు పోయిండు. శివదూతలు పోయి సింత కట్టెలు, సిరిగన్నల సాయలు, మామిడి చెక్కలు మరిగన్నం సాయలు గుట్టినా యెక్కడ చూసిన అగ్గి దొరకతలేదు. దొరకపోతే జంగమ్మ కాడికి వచ్చిండు. వచ్చి అయ్యా యెక్కడ చూసిన అగ్గి దొరకతలేదు. మావల్ల కాదు అనగానే అప్పుడు శంకరుడు అగ్ని దేవుడు యెక్కడ పోయిండు, యాడున్నాడు. అరచేతి అంజన పెట్టి కంటికి కాటుకపెట్టి మూడు లోకాలు పద్నాలుగు భువనాలు చూసేవరుకల్లా మణిపురం పట్నంలో కోట కట్టి కోట లోపల బంధించిండు. ఆహా మంది అయితేనేమో అగ్ని గుండానికి ఆహుతి జేయాలి. నీ బిడ్డ కాబట్టి కోట కట్టి కోట లోపల బంధించుకున్నావు. జాగ్రత్త పడ్డావు. అప్పుడు లవనుకు కాపలా పెడతాడు దక్షప్రజాపతి. ఇయన పచ్చరెక్కల రామచిలుకను పిలిచి గొర్లొల్ల కత్తులు, రెప్పల కత్తులు కట్టి ఈగాకి 20 పుట్ల అగ్గి కట్టుక రావాలే, తొక తొంగుట్ల తాకట్టు అగ్గి కట్టుక రావాలే లవలగున్ని ప్రాణం తియ్యాలని రామచిలుకను పంపిన్నప్పుడు, రామచిలుక పోతాది కోట మీదికి. కోటకు లవలగుడు కావలి. అరే యెవడువురా అని లవలగుడు నువ్వు యెవడువురా అని ఓరి భూరిపిట్ట నువ్వు నామీద యుద్ధం చేత్తావా. అయ్.

దరువు: కొట్టెందు పోనియా కొనసాగనియ్య
అడుగందు పోనియ అడుగు యెత్తనియ్య
కోటంది నిన్ను పోనియ్య రానియ్య అని

లవలంకుడికి దీనికి యుద్ధం జరుగుతాయుంటాది. యుద్ధం జరగంగ జరగంగ ఏం జేత్తాది. ఇది భూరి పిట్టయే రెక్కలు ముడువంగ సక్కగా మీదికి పోయింది. మీదికే పోయింది. మేఘాలయందు, మేఘాలయందు రెక్కలు, కాళ్ళు ఒక దగ్గర మూసుకొని సక్కగా లవలగు గర్భముల పోయింది. లవలగు గర్భముల చొచ్చి రెక్కలు కాళ్ళను విరగొట్టేవరకల్లా కత్తులతోని దెగి పొట్టను చీల్చుకొని బయటికి వెళ్ళింది. బయటికి వెళ్ళి కోట లోపల పోయి ఈగకి 20 పుట్ల అగ్గి, తోకకు తొంగుట్ల 90 పుట్ల అగ్గి కట్టుకొని కైలాసం వచ్చింది. అక్కడ పోసింది 20 పుట్లు అయినాంక అగ్ని గండం మండుతాంది పార్వతి దాని మొఖము నేను చూడ అనంగానే పార్వతమ్మ, లక్ష్మీదేవి, సరస్వతి, శ్యామలదేవి, వరుని భార్య వసంతదేవి.

దరువు: గంగమ్మ గౌరమ్మ అక్కచెల్లెలు అయ్యో అక్కచెల్లెలు

ఒక్కడే శంకరుడు చేబట్టినాడు, జంగమ్మ సేబట్టినాడు
శివాజ్ఞే (శివుని ఆజ్ఞ) యెల్లంగా సిన్నాం (చిన్నం) అయేను పార్వతి
సర్కరు తొయంగా అడ్డం యెవరమ్మ అడ్డం యెవరు
అరే విష్ణు భార్య లక్ష్మీదేవి లక్ష్మీ దేవమ్మ, ఆ సరస్వతి దేవమ్మ
పార్వతమ్మ మీదను తానబడ్డారు తాన అయ్యో తానబడ్డారు

కలకల కన్నీరు ఒలపొత్తారేమి అమ్మ ఒలపొత్తారేమి పన్నిట జలకం పొసుకుంటు పనిట్లా చల్లుకుంటు మొత్తం దుస్తులు కట్టించి ఒడకంగా ఒడివాలు పోసి అగ్ని గుండం తయారుచేసిర్రు. గుండం పేరా గురివందనం రైక తొడిగించి, అగ్గి పెరా ఆకుపచ్చ చీర కట్టించి కొప్పుల మల్లెపువ్వ పెట్టి, మరి పార్వతమ్మకు కొడుకులు, బిడ్డలు లేరు. మరి యెట్లా జిల్లెడ కట్టె చెక్కల మీద కూసొపెట్టి పార్వతమ్మ ముందు నడిచేవాళ్ళేవరు శంకరుడు నడవలే తప్పదు అని శంకరుని నిప్పు పట్టించి అగ్ని గుండంలా వేసేటప్పటికి అప్పుడు ఆ గర్భమున అమ్మవారు బయటికి వెళ్ళింది ఇగా ఒరే జంగ దేవయ్య ఓరి దేవా యెంత పని చేస్తివి నా తల్లిని అగ్ని గుండానికి ఆహుతి చేస్తావా. ఒక రూపం తల్లి గర్భమునా ఉన్నది. ఒక రూపం బయటికి వెళ్ళి ఒరే ఆపదకాల బంధం అనాధరక్ష అగ్నిదేవా చింతాకు మదం చీర కాలిన ఆపద మదం రైక కాలిన నీ కత్తెర జూపలు పట్టి గుద్దులు గుద్దుతా ముడు బుక్కల రక్తం కక్కితే చావలే కొడుకా. ఆ తల్లి అగ్గి గుండంలో దూకగానే భూమి పాతాళ లోకం పొయింది. అప్పుడు శంకరుడు బ్రహ్మదేవ విష్ణుదేవ పార్వతమ్మను అగ్ని గుండలా వేసినాం గంగకు పొయి గంగ లోపల తానం చేసి పాపపుణ్యాలు పారద్రోలి వద్దాం పదండి అని బయలుదేరి పోతాయుంటారు. లేదన్న పాపం పార్వతమ్మ తప్పు చెయ్యలేదు. పార్వతమ్మ తప్పు చెయ్యలేదని వీళ్ళు అంటారు. యే లే లే లే పార్వతమ్మ తప్పు చేసింది. అగ్ని గుండం దగ్గర పొదాం అరే తలకాయ ఇంకా పగులుతలేదు ఇంకా. యెందుకని పగులుతలేదు ఇంకా తలకాయ అనగానే అమ్మవారిని చూడ్డానికి పోతే ఒక్కసారిగా ఢాం అనిపిత్తాది. అరే పార్వతమ్మ శిరస్సు పలిగిపొయింది. పార్వతమ్మ చచ్చిపొయింది. ఇగా పొదాం పద గంగకు పోయి పాపపుణ్యాలు ధానం చేసి వద్దాం పదండి అని బయలుదేరుతుంటారు.

పొయ్యేటి కాళ్లకు పొక్కులేపుతాది. అట్లా బతిలాడి బతిలాడి పొక్కులు తక్కువ అయితాయి. చూసే కాళ్లకు చూపు చీకటి అయితాది. చీకటి అయినాంక అట్లా మళ్ళ వేడుకుంటే తక్కువ అయితాది. కక్కుడు కాలువకు అయితాది. కక్కుడు కాలువకు అయినాంక

తర్వాత తక్కువ అయితాది. ఆరు మంటలు అధికం అయితాయి. పొక్కులు పోషం వచ్చి అట్లా దాన్యం చేస్తే దాన్యం అయితాది. అక్కడికి అవుసపడక.

శంకరుడు: అయ్యా తల్లి పిల్ల బతికి వుంటే కైలాసం తీసుకపోయి కాపురం చేస్తా. ఒకవేళ ప్రాణం పోతే గంగలో యేసి ఖర్మకాండలు చేసి పాపపుణ్యాలు పారద్రోలుతా.

పార్వతి నివ్వు బతికి వుంటే, కైలాసంలా తీసుకపోయి కాపురం చేస్తా ఒకవేళ ప్రాణం పోతే తల్లిపిల్లను గంగ లోపల స్నానం చేసి పాపపుణ్యాలు పారద్రోలి నీ పేరు మీద పిండాలు పెడుతా నాని దండం బెడతాడు. అప్పుడు పార్వతమ్మ జోల పాటలు పాడుతుంది.

ఓ ఓ ఓ అయి జో అచ్యుతానంద జో పాలకుందా జో అచ్యుతానంద
రామ పరమానంద రామగోవిందా రామపరమానంద
పరవళించు నా బిడ్డ పల్వించమ్మ...

అప్పుడు మళ్ళ యెరుకులసాని సన్నిధి వచ్చి నాయన అట్లాకాదు. పాకని నీ తరం అయింది పీక నీతరం కాదు. ఒకవేళ తల్లిపిల్లా బయటికి యెళ్ళాలంటే యేడు గళ్లాల పువ్వు సుద్దిబట్టి, తెలుపు నలుపు వర్ణల పట్లుకొట్టి, కోటి కొబ్బరి కాయలు, లక్ష నిమ్మకాయలు, పసుపు అన్నం వండి పందిట్ల వేసి, కొర్రన్నం వండి కొండ తట్టపోసి, యేడు పక్కలా సూర్య గ్రహణం రోజునా పెట్టి, మచ్చలేని నల్ల మేకను తీసుకొచ్చి బలి ఇచ్చి పదివేల పంబలం అల్లి, మూడు వేల ఉద్దరిదారులు వచ్చి జమడిక దప్పలతోని, కిన్నెర సప్పుడులతోని, ఏడు పక్కల నందరనానికి పెట్టి తల్లిని బారసాల చేసినట్లయితే తల్లి బయటికి వస్తుంది అన్నప్పుడు. అప్పుడు పట్లు కొట్టి నిమ్మకాయలు పెట్టి, కొబ్బరికాయలు కొట్టి, గుమ్మడికాయలు కొట్టి, యాటమాత గుడిపి కల్లుపెట్టి పసుపు అన్నం వండి పందిట్లా పోసి, కొర్రన్నం వండి కొండదాక పోసి తల్లిని ధ్యానం చేసినప్పుడు అప్పు 30 పుట్ల మూర్తి 60 రూపం ఉగ్రం (ఉగ్రరూపం) వచ్చి అగ్నిగుండం నుండి బయటికి దునికినప్పుడు పార్వతమ్మను, పార్వతమ్మ బిడ్డను కైలాసం తీసుకొని పొతాడు పార్వతమ్మకేమో చంద్ర వేడికళలు, సూర్యవేడి కళలు కనిపిస్తుంది బిడ్డ.

### 2.5.4. బీరప్ప ఒగ్గు కథ

దరువు: వీరసంబోధుడైన వీరభద్రుడు గనకనేమి
దక్షుని యజ్ఞం ధ్వంసం చేసిన తర్వాతనేమి...

పూర్వకాలమునందు శివలీలా సంబోధుడైన వీరభద్రుడు దక్షయజ్ఞం చేసినాంక

నాగులకొండ పరిపాలకుడైన రాజరాజ నరభూపతి గర్వము అణుచుటకై గణపతి సూరవానికి వారి చెల్లెలు సూరమదేవి గర్భవాసం నందు జన్మించాడు. చెల్లెలు గర్భంలో మగ పిల్లవాడు పుట్టిందన్న, ఉన్నాడన్న సంగతి తెలుసుకొని వీడు మొలకాయ మొల చిన్నప్పుడు గొడ్డ చూచేంత పెద్ద మానైతే గొడ్డలి కావలేనని పది మంది కటికవాళ్ళు కసాయివాళ్ళు. కటికలను తొలిచి (పంపి) వాళ్ళకు విషపు అన్నాలు పెట్టించి, విషపురాళ్ళు తొడిగించి ఆయన ప్రాణం తియ్యదలిచిండు. అక్కడ ఆయన భగవంతుడు కాబట్టి విషపు అన్నాలు తిన్న కుక్కటిల్లపట్టి, ఆ పట్నం లోపల యేనుగై పోయినాయి, గుర్రాలు పోయినాయి, మంది పోయినాయి, మారు బలం పోయిర్రు. కాని ఆయన భగవంతుడు కాబట్టి మళ్ళా ఆయన పుట్టుకతోటి మళ్ళ బయటికి వచ్చేసిండు. మోక్షం తెలుసుకున్నాడు వచ్చేశాడు. అక్కడికెళ్ళి సూరమ్మ గర్భనా పుట్టిండు. సూరమ్మ గర్భనా పుట్టి అప్పుడు ఉండంగా మళ్ళ పది మంది భటులను పిలిచి వారికి బెస్త వేషాలు ధరింపజేసి ఇట్లా అనెను ఓరి భటులారా కుచ్చులు తాపిన పచ్చని పాతిక తీసుకొని వెళ్ళి చంద్రగిన్నె పట్నంలో గనకనేమి మా చెల్లె సురమాదేవికి ఇట్లాని చెప్పండి గనకనేమి అమ్మా దేవుని నాగులకొండ పట్నం నుండి వచ్చినాం. ఈ మీ అన్న నరభూపతి మమ్మల్ని పంపినాడు గనకనేమి మీ కొడుకును మీరు మంచి ఘడియలో ప్రసవించలేదటా. మూలా నక్షత్రంబున ప్రసవించారటా కాబట్టి కాశీరాజులకు గండమట, తల్లిదండ్రులకు గండమట గనకనేమి అమ్మా మీ కొడుకు టప్ప టప్ప అడుగులు వేసి తలుపు, గొళ్ళెము పట్టేవరకు మీ గోత్రం లేకుండా మునిగిపోతుందట అని భటులు సూరమాదేవికి చెప్పగానే నిజమేననుకొని అయ్యా ఇప్పుడు నేనేమి సెయ్యాలో చెప్పండని ఆ సూరమాదేవి ఆ భటులను అడిగిందటా గనకనేమి అప్పుడు ఆ భటులు ఏమి చెప్పారంటే అమ్మా సూరమ్మ ఈ పిల్లవాడు పన్నెండు సంవత్సరాలు గనకనేమి మీ అన్న అయిన నరభూపతి పట్నంలో పెరిగినట్లయితే అప్పుడు మీ గండం తొలగిపోతుందటనేమి, ఆ తరువాత మీ కొడుకు మీ ఇంటికి రావచ్చును అని ఆ భటులు ఆ సూరమ్మదేవిని నమ్మించిరేమి. అప్డు వెంటనే ఆ కసాయి కటికలు పచ్చని పాతిక లోపల పండబెట్టుకొని ఆ బీరప్ప యెడుత్తాడని (ఏడుస్తాడని) బంగారు కొడెన గొరువున్న పాలు పిండి పచ్చని పాలికల పెట్టి బీరప్ప పుట్టిన ఘడియలో పుట్టిన శివదత్తాను వీరకటర ఖడ్గంను పక్కనపెట్టి పచ్చని పాలికల (పల్లకీలో) వేసి పంపిస్తుంది. ఆ సూరమ్మదేవి అప్పుడు అతను యేం అంటాడు అంటే...

బీరప్ప: అమ్మా నీ దగ్గర వున్న నాకు సావు తప్పదు

మామ దగ్గరపోయిన నాకు సావు తప్పదీ
పంచమపాపకారి కుంచ దుర్యోధనుడి అయితేనేమి
నరభూపతి పెట్టే బాధలను నువ్వు భరింపలేకుంటివి
అమ్మా ఇయాలా నాకు నోరు లేకపాయే చెప్పుదామంటే
నీకు ఇనరాదాయే నాకు అర్థం కాదయే

అమ్మా నేను చెప్పిన మాట నీకు అర్థం కాదాయే నేను యెడ్చినా నీకు అర్థం కాదాయే.

అందగనకనేమి కండ్ల ముందు నీళ్లు పెట్టిండు బీరయ్య వెంటనే ఆ కటిక కసాయి వాళ్ళు పన్నెండు రోజుల పసి పిల్లవాడైన వీరభద్రున్ని పచ్చని పాలికల లోపల యేసుకొని పోయిర్రు. యెత్తుకొనిపోయి మారడివి కారడివి తీసుకపొయిర్రు. మార్గమధ్యన తీసుకపోయి పది మందిలో ఇద్దరేమో సంపోద్దు (చంపకూడదు) అని, తతిమా వాళ్ళేమో మనకు రారాజు డబ్బు ఇచ్చింర్రు, ధనం ఇచ్చిండు, ఆరవై యెకరాల భూమి ఇచ్చిండు, ఆరు మూరల బావి అగ్రహారం ఇచ్చిండు అతని సంపడమే మంచిదన్నారు ఇన్నమన్నుర్లు. ఆ ఇన్నమన్నుగురు అనుకున్న మాటలు మాట్లాడినంక, వాళ్ళు బెస్త వేషాలు విప్పి కటిక వేషాలు ధరించి పిల్లవాని తలగొట్ట తలంచగా ఆ ఇయన్నే తండ్రి చెప్పిన తారకమంత్రాలు ఆనాడు శివుడు వరం ఇచ్చిన్నప్పుడు మే కోరిండు నేను యేది కోరుకుంటే అది కావాలే అట్లాయితేనే నేను తల్లి గర్భనా పుడుతా లేకపోతే పుట్టను అని ఒప్పించుకొని ఆరవై ఆరు అట్లు, 32 బిరుదులు, 320 కాయకాలు, దేవ 12 బిరుదులు ఒప్పించుకొని మంత్రోపదేశం తీసుకొని చత్రగణ సగభాగం, వీరఘట్టం సగభాగం, మరణఘట్టం సగభాగం తీసుకొని ఆయనకు వచ్చిన విద్యలో సగభాగం తీసుకొని ఆమె సూరమ్మ దేవి గర్భంబున జన్మించిండు. తండ్రి చెప్పిన తారక మంత్రం తనువెల్ల చదివి తన హస్తం తీసుకొని నెత్తిన పెట్టుకొని ఇరువై నాలుగేండ్ల వీరపుత్రుడు అయిండు. 32 తర్వార్లు చేతపట్టి పది మంది భటుల తలను చట చట నరికేశాడు, వాళ్ళ జుట్లు, జులపాలు ఒకతాన ముడిపెట్టి కుడి కాలి బొటన వ్రేలితో పెట్టి గిర గిర త్రిప్పి జాడించి తన్నితే నాగులకొండ పట్నం రాజ కచేరి ముందట టప టప పడిపోయినాయి. ఆ పడ్డ తలపండ్లు ఏం అన్నాయి. ఓ రాజా నరభూపతి మా తలపండ్లు కొట్టినవారు యెవరో కాదు మీ చెల్లె కొడుకు పన్నెండు రోజుల పసిపిల్లవాడు మా ఈ గూడ పదిమంది భటుల తలపండ్లు కొట్టిండు. అదియే కాక నీ కుడి పక్కల బాగై నీ యెడమ ముక్కున వేదుకొయ్యయి నీ యేడుగురు బిడ్డలకు ఒక్కడే

మొగుడై పెరుగుతా ఉన్నాడు అని చెప్పి అక్కడ ప్రాణాలు విడిచారు. అప్పుడు యేం జేసిండు రాజరాజు నరభూపతి పట్నం చుట్టు పరిగెత్తు పహారా పెట్టుకున్నాడు. సిక్కు లోళ్లు, రొయ్యలోళ్లు, అరబ్బీయులు, మంది మార్భాలన్ని (ఇప్పుడు మనకు మిలటరీ గ్యాంగ్ యెట్లవుందో) ఆయన అట్లా కాపలా పెట్టుకున్నాడు. మళ్ళ రాకుంటా అయితే అక్కడ అది ఉండగా.

ఇయనా పన్నెండు రోజుల పసి పిల్లగాడు మర మా తల్లి దగ్గర పొయినా మా మామ నన్ను చంపుతాడు. మామ దగ్గర పొయినా నన్ను సంపుతాడు అని మార్గ మధ్యన ఇతిచెందని వృక్షము పెద్దది కనగాల వృక్షం కాంచల మర్రికాడా మర్రి ఊడలు తొట్టెలుగా అల్లుకొని, ఆ తొట్టెల్లో పవళించి మర్రిచెట్టుకు తెనేతెట్టెగా జేసుకొని దానికి కాగిని కాజేసుకొని గంటకే ఓ పొటు పొడుత్తంటే తెనే చుక్క నోట్లో పడుతాంటే ఆయన అక్కడ యున్నాడు. అక్కడికి యెవళ్ళు వచ్చిర్రు.

ఉజ్జయిని పట్నం పరిపాలించేది 20 చేతుల వీరమాంకాళి, పన్నెండు చేతుల పకీర్తా మాంకాళి పోచన కాజ్య పురి విప్పలేదు నాలుగు భుజములు, శంఖం, చక్రం, గద, వనమాల ధరించి శ్రీ మల్లిఖార్జునుడు ఇచ్చిన గొర్ల మందను కొట్టుకొని వచ్చింది. చెల్లె చంద్రమ్మ అక్క మాంకాళి వచ్చేట్టు వచ్చి మర్రిచెట్టు క్రింద ఎండకాల దినం కూర్చున్నారు. కూస్సొని అక్క మాంకాళి చెల్లి చంద్రమ్మ నెత్తి చూచుకుంటాది. ఇయనే క్యావ్ క్యావ్ అని యేడుత్తావుంటాడు.

మాంకాళి: ఏమే చెల్లె ఎవరో పిల్లగాడు ఎడుత్తావున్నట్టు ఉన్నాడు మనం తీసుకుందామా అని అక్క మాంకాళి కొంగు చాపినప్పుడు కిందికి వస్తాడు చెల్లె చంద్రమ్మ కొంగు చాపినప్పుడు మీదికి పొతాండు.

బీరప్ప: ఇందులో నన్ను యెవరైతే సాద గలుగుతారు.నేను పెట్టిన బాధలకు యెవళ్ళు తట్టుకుంటారు అని పరిచ్చ (పరీక్ష) చేసి అక్క మాంకాళి కొంగులో పడుతాడు.

దేవతలు: అక్క మహంకాళి కుంగలో పడ్డప్పుడు దేవేంద్రుడు, నారధుడు, కబీరుదాసు మొదలైన అసువంటి దేవతలు ఏం జేసిర్రు. పాతాళ గంగా లొపల స్నానం ఆడి లక్కరోతలు కట్టుకొని వస్తారు. ఈ పిల్లగాడు మాంకాళమ్మకు దొరికిన సంగతి దేవతలకు తెలిసి ఇయాలా దేవతల పిల్లగాడు మహంకాళమ్మ దొరికిండు రేపు చెడ్డ వుంటాది, మంచి వుంటాది. రేపు ఒకవేళ ఆ పిల్లగాని చెపితే గనక యాడపడ్డొడివి, యెక్కడ పడ్డొడివి, యెవళ్ళు కన్నోల్లో యెవరి

పిండానివో అని వదిలిపెడతాది ఇయాలే కట్టబెట్టలాని అక్కడ జేసి(రు.

దేవతలు: అమ్మ ఈ పిల్లాడు మా పిల్లగాడు మా దేవతల పిల్లగాడు ఈ పాతాళ గంగలో స్నానం చేసేటప్పుడు ఈ చెట్టు మీద పెట్టి పోయినాం. మా పిల్లగాన్ని మాకివ్వు అంటే

మహంకాళి: చూసిందాన్ని చుక్క పట్టిందాన్ని ఏరక ఈ పిల్లగాడు దొరికిందు కాబట్టి నేనే సాదుకుంటా.

దేవతలు: నీవల్ల కాదమ్మ నువ్వు సాదలేవు.

మాంకాళి: యెన్ని బాధలైన పడుతా, యెన్ని కష్టాలైన పడుతా, ఈ పిల్లగాన్ని నేను సాద గల్గుతా.

దేవతలు: నువ్వు సాదుతావు అని గ్యారంటీ యేం వుంది.

మాంకాళి: కోటి తప్పులు చేసిన కొడుకు రీతి చూసుకుంటా. అతిగా తప్పులు చేసిన అన్న రీతిగా చూసుకుంటా. సమర్థ తప్పులు చేసిన కూడా కడుపులో పెట్టుకుంటా అన్నప్పుడు.

దేవతలు: సదస్తు (తథాస్తు) అన్నారు. మాట ఒప్పించారు. వెళ్ళిపోయి(రు.

మహంకాళి: అప్పుడు ఏం అన్నాది గొర్ల మందను కాచడానికి పిల్లగాన్ని సాదడం వీలు పడదు కాదా. సాకు సమడి పల్లి ఇకు దొరకాలా యున్నిట ఇద్దరు ఉన్ని కంకణపులో మున్నిట ఇద్దరు – పత్తి కంకణపులో మరి జగల భాగమా కొడుకు గణపతి అంశం లోపల జన్మించిందు. బోగిడి బొగన్న మరి ముక్కిడి సిరికొండ గర్భవాసం నందు నత్తి మల్లేష, ఎలుగొండ, మలుగొండ, ఉ య్యేదు బసవయ్య ఉం(డాళ్ల భీమయ్య వాళ్ళ గర్భనా జన్మించిందు కాబట్టి వాళ్ళను తీసుకవచ్చి ఈ మంద కాపలా పెట్టి నా తమ్ముడిని సాదుతానని ఇకు దొరకాలు, సాకు సమిడి పల్లిపోయి వాళ్ళను తీసుకవచ్చి ఆ గొ(రె మంద కాడే కాపలాపెట్టి ఆ పిల్లగాన్ని అక్కడ ఉజ్జయిని పట్నంలా.

దరువు: పత్తిపాలు తల్లి పోసినవిగా పావురాన్ని పెంచినాది
దూదిపాలు పట్టనేమి దూదనమున పెంచబట్టనేమి పొయ్య
గొర్ల పాలు పొయ్యపట్టనేమి గౌరన పెంచబట్టనేమి

దరువు: గురుడు భీరయ్యను గౌరవంగా పెంచబట్టేనా... అ...

అక్కడ యెడమన యేడు మంది కుడినా యేడు మంది యేడేడు పద్నాలుగు మంది

దాసులతోటి ఆ పిల్లాగుడ సిమను తుడిచేది ఒకతి, ఉగ్గుపొయ్య ఒకతాయే, పండబెట్ట ఒకతాయే, పాడిపి ఒకతాయే, ఆడిపి ఒకతాయే, తానం చేయించేది ఒకతాయే ఇట్లా దాసులను పెట్టుకుంటూ ఆ పిల్లగాడిని ఇంచి పెంచి యేదేళ్ళ బాలుడిని చేసింది. అయిదేళ్ల పిల్లగాడుగా వున్నప్పుడు గురువుల వద్ద విద్యకు పంపించింది. అయితే నాలుక మీద లచ్చింతరం, పుక్కిట పురాణం, కండ్లళ్ల కలువ రేకులు, మాదన మాణిక్యం, ఆర చేతుల పరీక్ష వేది. పంతులు ఒకటి చెప్పితే ఇయన నాలుగు రాసిండు విద్యను రాసినప్పుడు అప్పుడు ఆ వీరభుజలిరాయున్ని పట్నం కాపలాగా పెట్టుకుంటాది. గుమాస్తాగా పెట్టుకున్నాది. ఈ పిల్లగాన్ని సాదుతూ రాజ్యం యేలడం నావల్ల కాదు కాదా అందుకే గుమాస్తాను పెట్టుకొని రాజ్యం యేలమన్నది. ఆ వీరభుజలి రాయునికి మూడు అయిదుల పదిహేను బిడ్డలు అందరి కన్న చిన్నది ముత్యాల సౌమరతి అయితే ఈ వీరయ్యను చూసి.

సౌమరతి: అక్క ఈ పిల్లగాడు యెవరంటే మాంకాళమ్మ తమ్ముడు మాంకాళమ్మ మనకు ఏమయితాది అంటే వొదిన అయితాది. వొదిన తమ్ముడు ఏమయితాడు బావ అయితాడు. ఈ పిల్లగాన్ని ఎలాగైనా ఆటపట్టించాలని, ఆటపట్టిస్తారు. చిల్లర రాళ్ళతోను కొట్టుడు, మాటలు అనుడు, గిల్లుడు, గిచ్చుడు పెట్టింద్రు. అప్పుడు ఇయన యేం జేసిండు. జవాబుకు జవాబు ఇచ్చేస్తాడు. మాటకు మాట అంటాడు. రౌతుకు రౌతు ఇసిరేస్తాడు. అక్కడ అట్లా సమాధానం చెప్పిండు. అయితే మమ్మల్ని గిచ్చిండు, గిల్లిండు అని వీరభుజలి బిడ్డలు యేం జేత్తారు మా నాయనకి చెప్పి ఇయనను పట్టి బంధించాలని తండ్రితోను చెప్పడానికి పోతారు. నాయనా నాయనా మాంకాళమ్మ తమ్ముడటా. మమ్ముల్ని ఇట్లా చెలాయిచ్చిండు. మేము పోము బడికి అన్నప్పుడు మాంకాళమ్మ అయితే ఏంది మాంకళమ్మ తమ్ముడు అయితే ఏంది. ఇప్పుడే పట్టి బంధించి అడుగుతా మాంకాళమ్మ తమ్మున్ని అని ఆ సౌపుదారులకు చెప్పుతాడు. సౌపుదాపురులను చెప్పిండు గాని ఆ పిల్లగాన్ని కండ్లతోని చూడలే సేయితోని పట్టలేభయపడి ఊరు బయటికి యెల్లిపొయిండు. ఊరు బయట ఎల్లమ్మ ఎగ్గిడి చెరువు వున్నాది. ఆ చెరువు లోపల ఏమైనా అంటారేమోనని నా ప్రాణం తీత్తారేమోనని ఆ చెరువు లోపల దూకిండు. దూకి శివనాగ గుండం లోపల బంగారు లింగమై కూసున్నాడు అప్పుడు మాంకాళమ్మ ఇంటి దగ్గర వున్నాది. నా తమ్ముడు రెండు జాములు అయింది. ఇంతవరకు రాలేదని.

దరువు: యేడు మేడలు యెక్కినాది మాంకాళి...
అమ్మా యెదురుచూడబట్టేనమ్మ దేవీ మాంకాళి
యే తొవ్వనా వత్తాడు నా తమ్ముడు...
యే దారినా వత్తాడమ్మా నా తమ్ముడు
కపెర్ల నీళ్లు దయగాయెరా అ...
నా దయగల తమ్ముడా బీరయ్య

అని యెదురు చూస్తాంది. యెదురు చూసిన రాడు. రాకపోయేటువరుకల్లా దాసొలన్ని అడుగుతాది.

మాంకాళమ్మ: ఏమే నా తమ్ముడు ఇంతవరకు రాలేదు. గురువుల వద్ద పోయి నా తమ్ముడు యెక్కడ ఉన్నాడు. చూసి రాపొండి అని దాసులను తొలితే.

దాసొలు: ఆ గల్లి ఈ గల్లి అంతా తిరుగుతారు. యెక్కడ చూసిన దొరకడు. సదువు కాడ లేడు, సాధన కాడ లేడు, పాఠశాల కాడ, ఆట కాడ, పాట కాడ అవన్ని తిరిగి వస్తారు. తిరిగి వచ్చినప్పుడు పిల్లగాన్ని జాడ దొరకలేదు. దొరకనప్పుడు యేం జేసి(్రు. మళ్ళ మాంకాళమ్మ దగ్గరికి వచ్చి అమ్మ మీ తమ్ముడు యెక్కడ పొయిండో యేం కథో యెక్కడ యెవళిని అడిగిన కూడ జాడ చెప్తాలేరు కాని ఎలమ ఎగుడ్డి చెరువు దగ్గర వీరభుజల రాయుని బిడ్డలను చేడాయిచ్చిడటా. ఆయనకు భయపడి యెక్కడ ఉరికిండో అన్నప్పుడు. అప్పుడు అమ్మవారికి కోపం వత్తాది.

మాంకళమ్మ: అలా ల లా లా లా లా మహంకాళి నేను పెట్టిన గుమాస్తావు నా తమ్ముని యెదిరిస్తావా అని రెండు చేతుల రెండు తల్వార్లు పట్టుకొని
అరే తల్లి మహంకాళి ఆ తల్లి మహంకాళి రా
ఆర్చి గగ్గోలు గగ్గోలు పెట్టేనా
పెడయి బొబ్బలు బొబ్బలు పెట్టి లేపేనా
అరా రా రా రా రా అనుకుంటూ వీరభుజలి దగ్గరికి పొతాది. పొయి రెండు తల్వార్లు లేపుతాది. అరేయ్ వీరభుజలి రాయుడా నేను పెట్టిన గుమాస్తావు నా తమ్ముని యెదిరిస్తావా నీ ధైర్యం యెంత నీ సాహసం యెంత అని లెప్పిన్నప్పుడు

వీరభూజలి: అమ్మా నీ తమ్ముని నేను కండ్లతొని చూడలేదు. చేయితోని పట్టలేదు. నా

బిడ్డలను బెదిరించిండని మాటలే విన్నా కాని నీ తమ్మున్ని నేను కండ్లతోని చూడలేదు అన్నాడు. అన్నంకా

మాంకాళమ్మ: మరి నా తమ్ముడు యెక్కడ పొయిండు. నా తమ్ముడు లేని పట్నం నేనుండలేను.

కల కల కన్నీర్రు అమ్మా మహంకాళి...

అమ్మా ఒలపోసుకుంటుందమ్మ దేవి మహంకాళి...

యెక్కడ యెళ్ళిపోతివి నా తమ్ముడా... అ...

దయగల నా తమ్ముడా బీరయ్య

నా క్షమ గల తమ్ముడా బీరయ్య... అ...

ఎలమ ఎగుడి చెరువు పట్టుకొని పొతాది. పొయి నా తమ్ముడు లేనప్పుడు నేను ఉండి యెందుకు అని ఆ సెరువుకు దగ్గర కూస్సొని ఒలబోస్తాయుంటాది. నా తమ్ముడు లేని పట్నంలా నేను ఉండను. నా తమ్ముడితోపాటు నా పాణం తీసుకుంటానని సెరువులో దూకడానికి సిద్ధం అయితాది. అప్పుడు బంగారు లింగమైన దేవుడు

బీరయ్య: మా క్క చచ్చినాంక నన్ను సాదేవారు యెవరు అని తన హస్తం తీసుకొని నెత్తిన పెట్టుకొని యోగమాయ తోటి నిజ రూపం యెత్తి వచ్చి అక్క మాంకాళమ్మ తొడమీద కూస్సున్నాడు అక్క అన్నప్పుడు.

మాంకాళమ్మ: తమ్ముడా యెవళ్లు నిన్ను కొట్టిర్రు, యెక్కడ కొట్టిర్రు, యెవడ్రా నిన్ను కొట్టి నొళ్లు అన్నప్పుడు.

బీరయ్య: ఇట్లా ఇట్లా సంగతి అన్నప్పుడు.

మాంకాళమ్మ: తమ్ముడా ఈ ఉజ్జయిని పట్నానికి నిన్ను రాజును చేత్తాను రా అంటే

బీరయ్య: అక్క వాని రాజ్యము గుంజుకున్నది ఒక కోపము, వాని బిడ్డలను చేడాయిచ్చింది ఒక కోపము. ఆ.. వానికి నాకు పడదు. ఎప్పటికైన కయ్యమే వుంటాది. నువ్వు సంపాదించిన గొర్ల మంద వున్నాది కాదా. మంటికైన ఇంట్లోడు కావాలి. ఇన్నె యెన్ని ఇడుసకపొయినాయి. యెన్ని పిల్లలు యెన్ని తల్లులు యెన్ని చూసుకుంటానికి నేను కావాలి కాదా. నేను గొర్ల మందను కాత్తాను అంటాడు. గొర్ల మందను కాత్తాంటే...

మాంకాళమ్మ: తమ్ముడా మనకు వందల మంది జీతగాళ్లున్నారు, నౌకర్లున్నారు.

అంతమంది ఉండగా నీకు గొర్ల మందను కాయవలసిన ఖర్మ యెక్కడిది, లేదంటే...

బీరయ్య: లే లే లే నేను యే గొర్రె పాలయితే తాగినో ఆ గొర్రెను నేను కాస్తా అన్నాడు అన్నప్పుడు.

మాంకాళి: సరే తమ్ముడు నీ మాటలను నేనేందుకు కాదానలే. అక్కడ కొన్ని నియమాలు చెబుతాది.

తమ్ముడా బీరయ్య గొర్రెను కాసేవాడి గనకనేమి
సాకలింటి సలోత్తం (సల్వ హస్తం) కట్టొద్దు
మంగలింటి సవురం చేయించుకోవద్దు
చుట్టం ఇంటి గంజి తాగొద్దు
సూర్ కింద నిదుర పోవద్దు
అడవిలా బంధురా బీరయ్యో ఓ...
అసలే వద్దురా నా తమ్ముడా...

కాసే గొర్రెని కాళ్ళతోను తన్నొద్దు, నోటమాట తిట్టోద్దు, పెద్ద పెద్ద గొర్రెల్ని పెద్దమ్మ అనాలే, చిన్న చిన్న గొర్రెల్ని చిన్నమ్మ అనాలే, మొగ పిల్లలు పుడితే తమ్ములు అనాలే, ఆడ పిల్లలు పుడితే చెల్లెమ్మలు అనాలే. మందకాడ నిప్పు ఉండాలే. అగ్ని లేని మంద ఆగం మంద, కుక్కలేని మంద గుడ్డి మంద, గుడ్డి మంద అట్లా నువ్వు కాపాడుతాను అంటే నిన్ను మందకాడికి తొలుతా...

బీరయ్య: అక్క నేను ఇవ్వన్ని జాగ్రత్తగా కాపాడుకుంటాను.

ఆ మాంకాళమ్మ బీరయ్యను తీసుకొని ఆ యేడేళ్ళ పిల్లగాన్ని తీసుకొని గొర్ల మందకాడికి పోతాది. గొర్ల మంద కాడికి పోయినప్పుడు.

బొవిడి బొగన్న: మాయక్క మహంకాళి కొట్టేడి యెండలో పెట్టేడి గాలి లోపల గొర్ల మందకాడికి వత్తాంది. యేమి ఆపద కలిగింది, యేమి బాధ కలిగింది, యెందుకు వస్తాందాని యెదురుంగా వచ్చి కప్పుకున్న గొంగడి కింద వేసి ఆ గొంగట్లా నిలబెట్టి పాలు పిండే దుత్తా తోటి ఆమె పాదాలు కడిగి, కడిగిన నీళ్లు మీద చల్లుకొని, అక్క మహంకాళి నువ్వు యెందుకు వచ్చిన్నావు. యేం బాధ వచ్చింది. ఈ యెర్రటి యెండ లోపల, పెట్టేది గాల లోపల యెందుకు వచ్చినావు అన్నప్పుడు.

మాంకాళి: తమ్ముడా మరి మన తమ్ముడు వీరభద్రుడు బీరప్ప గొర్లమందను కాత్తాడటా. ఇగొరుదాక నేను తల్లి రీతు సాధినా. నువ్వు తండ్రి రీతు సాధాలి. యెండ కొట్టినప్పుడు నాడ తియ్యాలే, ఆకలి అయినప్పుడు అన్నం పెట్టాలే, దుప్పం అయినప్పుడు నీళ్ళు తాపియ్యలే ఆనా (వాన) కొట్టినప్పుడు గొంగడి సాటుగా పెట్టుకొవాలే, అంటే అప్పుడు.

బొగన్న: ఏం అంటాడు అక్క ఇదివరకుదాక నువ్వు సాధినావు. ఇప్పుడు నేను సవరిస్తా. తమ్ముని నాకు ఒప్పజెప్పమన్నప్పుడు.

మాంకాళి: ఆ తమ్ముని గొర్ల మందకాడ పెట్టి వాళ్ళకు బుద్ధులు చెప్పి బురగాలు చెప్పి మహంకాళమ్మ మళ్ళ ఉజ్జయిని పట్నం వెళ్ళిపొతాది.

బీరయ్య ఏం జేత్తాడంటే ఏడుగు బొమ్మలతో సమేతుడై గొర్రెల మందను కాస్తాడు.

అయ్యా పులియున్న గుట్టల మీద గా మందను
దేవుడు పులిమేపులు మేపుతాడు బీరయ్య
మొసళ్లున్న గుండన్న రామా రామా రామా
నిలిపి నీళ్లు తాపుతాడు బీరయ్యా
శేషుల పుట్టల మీద బీరయ్యా
అయ్యా తావు దొడ్ల పెడతయేమి బీరయ్యా

శేషులు అంటే పాములు. పాముల పుట్టల మీద తావు దొడ్లు పెట్టి గొర్రెల మందను అక్కడ పండబెడతారు. అక్కడకెళ్ళి శివనాగగుండంలో స్నానం చేసి ఐదు వేలుకు అష్టనం వేసి మూడు వేలుకు ముష్టి ధరించి ఓంకార శివపూజ చేస్తూ వుంటాడు. ఆరు గంటల పూజ, మూడు గంటలు, మూడు గంటల పూజలు, గంటన్నర, గంటన్నర పూజ, ఘడియన్నర చేసి హనుమంతా అంతా పాల పాండువ, సముద్రామంత సల్ల పాండువ, యెన్నెలంత వెన్న బాండువ, గంటంతా ఉండి రాశి

అయ్యా పాల దానం చేసుతాడు బీరయ్యా...
దేవుడు పెరుగు దానం చేస్తాడేమి బీరయ్యా...
ఉన్ని దానం చేతుడా బీరయ్యా

దానం చేస్తూ వుంటాడు ఈ దానము, ధర్మము, పుణ్యము, పూజలన్ని కైలాసమున్న వలపుల వైకుంఠం దాపల బ్రహ్మోండం నట్టనడుమున యెండి కొండ కైలాసం నందు ఏకశిల అంతరంగమున గంగమ్మ శిరమునందున ఉన్నాది. గౌరీదేవి సంకలో ఉన్నాది

66 పూట్ల త్రిశూలం పట్టుకొని మహిషాద్రి మండపంలో పరమాత్ముడి మీద

గానం: అది పూల వర్షం అయి కురువబట్టేనా
అయ్యా దక్షకుని బడ్డమ్మా పార్వతి
రాగి భూషనాలనేమి రంభ పార్వతి

దరువు: నాథ నాథ ప్రాణేశ్వరా మీరు.. రు... రు..
పాపం గురించా పుణ్యము గురించా
పట్టపగటి వేళ పూలవర్షం కురుస్తుంది
నాథ... అ... అ...

ఇది అన్నం వున్న కన్నీరా, అన్నం లేని కన్నీరా, అడ్డు గొడ్డలి, కన్నీరా పుడ్డు గొడ కన్నీరా యెక్కడికెళ్ళి వచ్చిందో పండితులు అన్నప్పుడు

శివనాగు గుండంలో స్నానం చేసి పులితోలు చర్మం పుణ్యులు జంగమ ధరించి ఐదు వ్రేలుకు అష్టనం, మూడు వ్రేలుకు ముష్టి ధరించి అరచేతిల అంజనం పెట్టి మూడు లోకాలు, పద్నాలుగు భువనాలు కండ్ల చూసి శంకరుడు చూసినప్పుడు ఆ... వీరభద్రుడు బీరప్ప గొర్రెల మందను కాసుకుంటూ దానం, ధర్మం, పుణ్యం, పూజలు చేస్తుండు. కాబట్టి ఆయన ఒక పుణ్యముగా మారి మన మీద పూల వర్షం అయి పడుతాంది.

మాహంకళి: పొతావార తమ్ముడా బీరయ్యా... అ...
నీ మేనమామ పట్టణము పొతావి...
నీ ఇదుజోడికి పొతున్నావురా బీరయ్యా...
నువ్వు జోడుతొని రారా తమ్ముడా బీరయ్యా...
నువ్వు ఉత్త బట్టలతొట్టి పొతున్నావు
నువ్వు పసుపు బట్టలా రారా నా తమ్ముడా...
ఇదుతాని పొతున్నావురా బీరయ్యా...
నువ్వు జోడు తొని రారా నా తమ్ముడా...
యుద్ధం మీద నీదిర కత్తి బీరయ్యా
విడువనియ్యకురా నా తమ్ముడా
కయ్యముల రానియ్యారా నా తమ్ముడా
కలివేళి రానియ్యారా నా తమ్ముడా
నా ఆడపిల్ల దీవెనా నా తమ్ముడో

సల్లంగా పోయి రారా నా తమ్ముడా

అని దీవెనలు పెడుతాది. దీవెనలు పెట్టినప్పుడు

ఇయనా సిద్ధం అయితాడు.

బీరయ్య: అక్కా మాంకాళి నీ తమ్ముడు వీరభద్రుడు అసమర్థుడు అనుకుంటివా. వీరభద్రుడి గుండెలో మండేటి అగ్నిని పర్వతాలు బద్దలుగా చేసే సప్త సముద్రాలు అల్లకల్లోలం చేసి మా తల్లిదండ్రికి విషపు ప్రయోగాలు జేసినా క్రూరజంతువునైన కరి చిత్రంగా వాని పట్నం లోపల పోయివాని ఆరవై వేల దండులు, పదివేలా తురంగాలు, ఐదు వేల ఖడ్గ ద్వారాలు అంతము చేసి వాని యేడుగురు బిడ్డలను కట్టకట్టుకొని వాని జుట్టు నా గుర్రం కాళ్ళకు కట్టుకొని వస్తాను. విజయం సాధించుకాక అని దీవించి పంపు.

మాహంకళి: పయిలం తమ్ముడా వున్నకాడా పయిలం తిన్నతాన పయిలం ఆపద వచ్చినప్పుడు అక్కా మాంకాళి అని అది చేయి ఒక చేయిల నిన్ను యెత్తుకుంటా, ఒక చేయిలా నిన్ను సాధిస్తానాన్ని అక్కడ హామి ఇస్తాది.

దరువు: సత్యమతి దేవుడే సామిరొరి బీరయ్యా

అక్కపాదం మొక్కెనా అశ్వమీద యెక్కెనా

గొవిందా అన్నాడే గుర్రం మీద పడ్డాడా

మడవ తన్నుతన్నెనా కొరడా దెబ్బకొట్టెనా

ఊరు బయటికి వెళ్ళేనే ఊల్లు మల్లు దాటేనా

గుర్రం పొతాయున్నద గురుడు పొతాయున్నాడ

యెక్కరాని కొండలు యెక్కి పొతాయున్నాడ

దిగరాని కొండలు దిగి పొతాయున్నాడ

అక్క దేవతలు మరిగెనె ఆయి గుంటన్న

అయ్ మలకలు ఉండే రాళ్ళనే మన్నువాడ తొక్కెనా

పొకా వుండే రాళ్ళనే పొడివండ తొక్కెనా

తవ్వలుండే రాళ్ళనే తవ్వుడువాడు తొక్కెనా

ఒక కొండ యెక్కెనే ఒక కొండ దిగేనా

దండి దండి కొండలు దాపురాలు యెళ్ళెనా

చమ్మురు కొమ్మురా చరో దారా దట్టి మీద దట్టి డాగొల పిండం మిడిగుడ్లు కొరడవడి

మీసం సమిలై పిపలై ఇరవాల క్రిందికెళ్ళి వీర మొసలి మార్గనా వీర గల్లికే కమ్మర్ కర్రల్ గల్లికి సవగీత మొగపోడ్ ఏనుగోడ సవార బీరయ్యా.

గానం: దేవుడు పోయి తొవ్వలా మరియేమిగల్లది

తల్లి వేడి గంగలే పిల్ల వేడి గంగలా

సత్యవీర గంగలే సాయి పరుతున్నదా

గుర్తు యెదురుంగా లేక గురుడు బీరయ్య. గంగ లోపల గుర్రాన్ని కొడుతున్నాడు. తుమ్మ మండలున్న గంగాదేవి కాళ్లు చూసి అత్తాతాంటే గద్ద కొట్టుకొని పొరొడు నా గర్భం మీద అడుగు పెట్టి పోతుండు. జాగ్రత్త వుండు నేను చూసుకుంటా అంది.

గానం: ఉస్కిలా గంగమ్మ ఉప్పొంగనె బట్టెనా

యెనుగుల తిప్పనై యెడ్చికొట్టబట్టేనా

గుర్రం మీదికి అయెనా గురుడు కిందికైయేనా

మునుగుతాయి వున్నాడు తెలుతాయు వున్నాడు

బాధ చెంది బీరయ్య భయపడుతా వున్నాడు

నడి గంగ లోపల గుర్రం ఆగిపాయెనా

గొవిందా అన్నాడే కిందపడ దుక్కేనా

బీరయ్య: అహో అహో యెమటిది నేను పెళ్లికొడుకునై వీర ప్రయాణం యి పొవుచుండగా, మార్గ మధ్యమునా నా ప్రయాణాన్ని భంగం కలిగించిన ఈ గుర్రం యుండరాదు. దీని ఖండ ఖండాలుగా చీల్చి చెండాడుతాను.

హలకల కటారుగా దేవుడు చేతపట్టేనా ఒక్క యేటునా నీ తల పగలడొతానని కత్తి పైకి యెత్తినప్పుడు గంగాదేవి గడ గడ వణికి గుర్ గర్భమున వచ్చి గురుడ బీరయ్య ఈ మహిమలు నావి కావు తిరిగి గంగాదేవిని వేడుకున్నట్లయితే నీకు రాను పొను రాజీ పడతాది.

బీరయ్య: ఇవి గంగాదేవి మహిమలా

అరే గుర్రం కళ్ళెం పట్టినాడు బీరయ్యా

నది ఒడ్డు చేరినాడు బీరయ్యా

గుర్రాన్ని తీసినాడు గురక చెట్టుకు కట్టేసి చెట్టాకు, మనాకు పోషి గుర్రాన్ని తీసి గునక చెట్టుకు కట్టేసి చెట్టుకు, మనాకు పోసి ఆ గంగ ఒడ్డుకు వచ్చిండు.

గంగా గంగా భవానీ యెవరనుకొని నా ప్రయాణంలో భంగం కలిగిస్తివి.

శివపార్వతుల దక్షస్థలం మందు చెమట బిందును జనించి తపోనిష్టాగరిష్టాపరుడునై భుజ ఫల పరాక్రమ వేకిర సౌర్య సంపన్నుడై సస్ర గద పండితుడై ముక్కోటి దేవగణముల గడ గడ వణికించి ఆర్చి బొబ్బలి అందాలు జూడించి దక్ష యజ్ఞం చేసే దక్షుడి తల తుంచి ముక్కోటి దేవ గణములకు గడగడ వణికిస్తిని. మరి ఒక జలమా బ్రహ్మ వరంచే సూరమ్మ గర్భమున జన్మించి అక్క మహంకాళి అధ్వర్యంలో పెరిగి పెద్దవాడనై నాగులకొండ పట్నం పెళ్లి కొడుకునై పోవుతుండగా మార్గమధ్యనా నా ప్రయాణాన్ని భంగం కలిగిస్తావా ఇప్పుడే డొంకను వలగి నా రక్తంతో రక్తాభిషేకం చేస్తున్నా ఇదిగో చూడుము.

గానం: సత్యనవర్ధుడు సామి బీరయ్యా
సత్యమతి దేవుడే సామిరొరి బీరయ్యా
ఆ దేవత అడుగు యేసే భూదేవంత గలగచే
అడ్డం మూడు గీతలు పొడగు మూడు బండలు
అలకాల కటారుగా దేవుడు చేతబట్టేనా
వీర వర దండనే వీరి ఖడ్గం వేసేనా
పొట్ట మీద బీరయ్యా పొడుచుకుంటయున్నాడ
చెల్లు చెల్లు రుద్రమో చెల్లుతానై యున్నాద
పారేటి గంగాల పారేటి రక్తము
భళ భళ అంటాడే భళి జల్లపట్టేనా
పొయేటి గంగాల పోలీ జల్లపట్టేనా

గంగా గంగా భవానీ ఒకవేళ దర్శనం ఇచి దారి చూపితినే మంచిదికాని, నీ గంగలో పడదానికి బంతంత కొప్పు పట్టి విడుచుకొచ్చి చేవులు కోసి చెవిటి గంగను పెడుతా, ముక్కు కోసి ముక్కుడి గంగను పెడుతా సిక కోసి సేపుకోడి గంగను పెడతా.

గంగా: వామ్మో అందదంటే గద్ద కొట్టుకోపోయి పొరొడు వీడి అమ్మ కడుపుల మన్నుబొయ్య యెక్కడికెళ్ళి వచ్చేనో నన్నే రమ్మంటున్నాడు.
తుంగ ముల్లున గంగాదేవి గడగడ వణికే
గాబరపడి మోకాలు మీది మెందు పుటలు కట్టుకున్న
జబ్బలు పొయిన రైక తొడ్కొని ఊతకొల అరచేతుల పట్టుకొని
సొలుతాది గంగమ్మా సొక్కుతాది గంగమ్మా
యెదురుగడ్డలు యెక్కెనే దివగడ్డలు దిగేనా

యెవడువురా పొరుడో యెడ్డిపడ్డవారుడా
యేం కరుసుకుంటాడే యేం పొడుచుకుంటాడే
యెర్నకొన్నాడో యెంత ముద్దుగా వున్నాడా
నల్లగా వున్నాడో నాభి కొస్తున్నాడా
యెవడు కొడుకా ఉత్తరన్న దగ్గర ఊరు పేరు చెప్పరా
అయిపేరు చెప్పరో బాయి పేరు చెప్పరొ

బీరయ్య: అయ్ అయిపేరు చెప్పవే బాయిపేరు చెప్పవే
తల్లిపేరు చెప్పవే తండ్రిపేరు చెప్పవే
నాపేరు చెప్పుము నీ మొగొడిపేరు చెప్పవే
కత్తిని నూరుతాడు. అప్పుడు గడ గడ వణికి

గంగా: అయ్యో నీరు నీర్చుపొయింది బిడ్డ. నిల్లారి గంగను శంఖుదేవుని బిడ్డను జలవీర గంగను శంకరునికి ఒక భార్య అయితాను.

బీరయ్య: నీవు గంగాదేవివా
నాపేరు నీకు చెప్పెద గంగామ్మ వయ్యారి గంగా
నువ్వు కట్టుకున్న పట్టుచీరెనే వయ్యారి గంగా
గట్టిగా కట్టుకోమను వయ్యారి గంగా

అయ్యో పదహారు ముల్ల పట్టుచీర గుంజు గుజ్జి ముడి వేసున్ననులే కాని నీ పేరేంటే చెప్పుము.

బీరయ్య: బ్రహ్మదేవ కొడుకు బారల బీరయ్యా సూరమ్మ కొమర సుభద్ర బీరయ్య. అక్కలకు పేరు అదృష్టము. నా పేరు గురుమూర్తి బీరప్ప అన్నప్పుడు

గంగా: గడ గడ వణికి వుడిపొయి జారిపొతాది. అప్పుడు గడ గడ వణికి వదులుకుంటాది. ఇట్ల్ పిడుతాంటాది.

బీరయ్య: అమ్మ ఏం జరిగింది.

గంగా: ఓ కొడుకా నువ్వు గద్దల గద్దలమని గద్దిరించి పెడితే కండ్లళ్ల నీళ్లు కడుపులకు పొయిన్నాయి. కడుపుల నీళ్లు కాళ్ళ నుంచి యెళ్ళిపోయింది. అయినాంక
నా కొడుక బీరయ్యా నా సెల్లె కొడుకువురా
కొట్టేటి యెండల పెట్టేటి గాలిలా
మీయక్క మహంకాళి యెక్కడ తొలుతున్నాదిరా

బీరయ్య: అమ్మా తల్లి అంటే నాకు తెలవదు కొడుకు అంటే నీకు తెలవదు. అనరాని మాటలు అన్న జనని నా తప్పును మన్నించు.

గంగా: కొడుకా కొడుకంటే నాకు తెలవదు. తల్లంటే నీకు తెలవదు ఇదివరుకల్లది కాదు కాని ఇప్పుడు అంటే తప్పు కొడుక. ఇవ్వని మనసులో పెట్టుకొకు అన్నాది.

కొడుక మరి యెక్కడికి పొతున్నావు ఏం కథంటే

బీరప్ప: అమ్మా నేను నాగులకొండ పట్టణం పెళ్లికొడుకునై నా మేనమామ బిడ్డను లగ్గం చేసుకుంటానికి పొతానా

గంగా: ఓ కొడుకా వాని పట్నం మీద మన్నుపొయ కొడుకా, వాని పట్నం మీద దుమ్ము పొయ్య కదరో, వాని అమ్మ కడుపుల మన్నుపొయ్య, వాని బిడ్డల బిక్కొలు దొరక, వాడు పంచనా పాపకారి కుంచన దుర్యోధనుడు. నువ్వు తల్లి గర్భములో ఉన్నప్పుడే కలకోటి విషం పెట్టి నీ ప్రాణాలు తియ్యదలచిన పాపాత్ముడు. వాని బిడ్డలు నీకేందుకు కొడుకా. ఈ గంగ ఒడ్డున యే పేదింటి పిల్లను అయిన తీసుకవచ్చి ఈ గ ఒడ్డున నీ లగ్గం జేసి మీయక్క మాంకళి దగ్గరకు పంపిస్తాను పో కొడుకా అంటే

బీరయ్య: లేదమ్మా అక్క మాంకళితొని యేడు రోజులు పోరు పెట్టుకొని అక్క మాటను లెక్క చెయ్యకుండ వచ్చినా ఈ మార్గ మధ్యన కూడా నువ్వు అదే మాట అంటున్నావు. నాగులకొండ రహస్యం తెలిసినవాళ్ళు మా మామ బిడ్డల సంగతి తెలిసినవాళ్ళు మన బంధువులు ఎవరైనా వున్నారా.

గంగా: ఉన్నారు కొడుక.

గంగా: యెవరు వాళ్ళు?

గంగా: యెరుకల్ల తల్లి మావురాల ఎల్లమ్మకు బాగా తెలుసు. మీ మామ పట్నం నాగులకొండ రహస్యం ఇంకా వాని బిడ్డల గురించి రేణుకా ఎల్లమ్మకు బాగా తెలుసు.

బీరయ్య: ఎల్లక్కకు తెలుసా ఇప్పుడు అక్క యెక్కడ వున్నాది.

గంగా: మట్టు మంగళవారం పుట్టు బుధవారం మీ బావా జమదగ్నికి పూజలు చెయ్యడానికి ఇయాలా గంగతనానికి ఇడికే వస్తాది. అక్కని పట్టుకో అని చెబుతాది. పో కొడుకా అంటే

బీరయ్య: పొబొత్తాయుంటాడు.

గంగా: కొడుక ఎవరైన గిట్లానే ఉంటారు రా అవసరం ఉన్నప్పుడు ఆదుకుంటాడు. అవసరం దాటినాక పక్కన పెడతారు.

బీరయ్య: ఏం కావాలమ్మ.

గంగా: గీట్లాంటి మొసలొల్లకు ఏం ఆశలుంటాయి. కొడుక ఓ ఆరు తెల్లయి నాలుగు నల్లయి అయితే సరిపొతాయి.

బీరయ్య: అంటే అవి ఏంటి అంటే

గంగా: తెల్లయి అంటే కల్లు, నల్లయి అంటే సార కొడుక.

బీరయ్య: అమ్మ ఇది కలియుగం. దేవలొకంలా ఇది తేయకూడదు. రానున్న భూలోకం నందు యున్నిట ఇద్దరు ఉన్ని కంకణపొలు, యున్నిట ఇద్దరు పత్తి కంకణపొలు, నన్నుట నా దయ కులబంధపు పుట్టోది యున్నాది. నీ పేరు మీద, అక్క పేరు మీద, నా పేరు మీద పండుగలు, పబ్బాలు జరిగేటివి యుంటాయి కాబట్టి మంగళవారం నాడు మైలా లగ్గం అయితాది, బుధవారం నాడు పెళ్ళి పిల్లగాన్ని చేస్తారు. బెస్తావారం నాడు ఇక లగ్గం అయితాది. శుక్రవారం నాడు సూర పెళ్లి కొడుకు, శనివారం నాడు గంగతనం, ఆదివారం నాడు గొగు లగ్గం నా లగ్గానికి ముందు శుక్రవారం రోజు రాత్రి మైలాలు తీసి, శనివారం రోజు రాత్రి పూట నీ పుట్ట లోపల పుట్టు గంగట్లా కట్టి, పుట్టు గొంగట్లా నీ పొట్ట లోపల వదిలిపెట్టినప్పుడు, నా ఇరగొడుగులు నా ఆట ఆడుకుంటారు, పాటలు పాడుకుంటు కాటికలు తీసుకొని పొట్టపైన కాటేసుకుంటూ రక్తధారలు తీసుకుంటు గట్టంత గైయ ముంద మెట్టంతా మేకపొతు సొప్పమేళ తెప్ప లక్కాకులు, నల్లపూసలు, సక్కటి కుడుక, సన్నపు రైకే, ఇరబొనం, ఉడుకంగా ఒడివాలు తీసుకొచ్చి నీ గంగ ఒడ్డున తెలుపు, నలువుల డెబ్బై వర్ణాల పట్టుకొట్టి పండుగ చేసి నీ పొట్ట లోపల గంగ తెప్ప వదిలిపెట్టి గట్టంత గైయ ముందను మెట్టంత మేకపోతు బలి ఇచ్చి, నీ పొట్ట లొపల నన్ను తానం చేయించుకొని నా లగ్గం చేస్తారమ్మంటే

గంగా: ఇగా చాలు కొడుక నీ దివెనలు నాకు చాలు. అయితే అప్పుడు గంగకు నెరవేరుతాడు.

బీరయ్య: మరి రేణుక ఎల్లమ్మ యెట్లా కలవాలే ఏం కథంటే (రానుపొను రాజమాడి

వస్తాది గంగలకెళ్ళి అన్నది).

గంగా: మంగళవార రోజున రేణుక ఎల్లమ్మ జమదగ్ని పూజలు చేయడానికి గంగా స్నానానికి వస్తాది అని చెప్పి వెళ్ళిపోతాది.

ఆ రాయబడు గుర్రాన్ని తీసుకొని గంగ ఒడ్డుకువచ్చి ఆ గంగ ఒడ్డుకు గుర్రాన్ని కట్టేసి ఆ బండ మీద పవళిస్తాడు. కన్నకొకిలా పుట్టకు తలంటు చేసి పవళించినప్పుడు

రేణుక ఎల్లమ్మ: మట్టేడు మావురమే రేణిపుట్ట ఎల్లమ్మ. భూలొక రంభ శివుని బిడ్డ. సింతల చెల్లెలి పార్వతి బిడ్డ. పంచ దేవత రేణుక ఎల్లమ్మ. కుంచడు గవ్వలు పొసి కుద్రించి పుట్టి మానెడు గవ్వలు పొని.

అమ్మవారు రేణుక ఎల్లమ్మ యెట్లా బయలుదేరి వత్తునాది... ఏ... ఏ...

దరువు: ఒక్కొక్క డప్పంట ఒక్క శివ సత్తాండ
కాళ్ళు కదలియమ్మో మాదేవి ఎల్లమ్మా...
గద్దె కదిలియమ్మో వయ్యార ఒలగంగా
రెండేసి డప్పులాట ఇద్దరు శివసత్తులట
గుగ్గిలం బండారు యాపరిలాలసేత
గద్దె కదిలించామో మాదేవి ఎల్లమ్మా...
యే వాడలా వున్నావో మావాడ రావమ్మా
గండ జ్యోతులు కొండ బొనాల భల్లమ్మ
గద్దె కదిలించామో మాదేవి ఎల్లమ్మా
తలయందు నాగేంద్ర నీ సక్కదానమ్మ
తలుకు దద్దలు మెరియా ముద్దలదారు ఒలువా
గద్దె కదిలించామో మాదేవి ఎల్లమ్మ
యే వాడల వున్నావో మావాడ రావమ్మా
యేగెడి దమిడికాలు మొగ గింజలట
కంచు డొలతొని కదలాడు తల్లి
యేడేసి డప్పులట యెండ శివసత్తులట
ఇరగొడుగులు కొడొ ఒగ్గొలు నిన్ను కొలువా
గద్దె కదిలించామో మావురాల ఎల్లమ్మ
పలకపట్టిన జొవ్వ పిడికెడు నా గొల్ల

పిడికెడి నడవొల పిక్కిలు గుంజలమ్మ

యాపరీలిలా సీరే అద్దలా రవికట

గంగా ఒడ్డుకు వస్తాది. బీరప్ప పొయి ఏం చేస్తాడంటే

బీరయ్య: శరణు శరణు మాత అని రెండు పాదాలు పడతాడు.

ఎల్లమ్మ: గొర్రెకాడి వాడో గొడ్డుకాడి వాడో సేరికాడివాడో, చెట్టుకాడివాడో బెదిరించినట్టు వుండు. అందుకే కాపాడమంటూ నా కాళ్లు పట్టుకుండు. ఏదేమైనా నీ బాధలు తెల్లారుతాలే.

బీరప్ప: లేలే నాకు వచ్చిన ఆపదను ఆదుకుంటానని నా హస్తం లోపల హస్తం వేసినట్లయితే అప్పుడు నేను పట్టిన పాదములు వదులుతా.

ఎల్లమ్మ: అంగమాల లింగమాల బుట్లు వున్న శతకోటి లింగాల సాక్షిగా నీ ఏ ఆపద వున్నా నేను ఆదుకుంటానులే అన్నప్పుడు వదిలిపెడతాడు.

ఎల్లమ్మ: యెవరు నువ్వు అంటే.

బీరప్ప: నేను బ్రహ్మదేవుని కొడుకును బాలుడు బీరయ్యను, సూరమ్మ కుమార సుభద్ర బీరయ్య, మహంకాళి తమ్ముని మహిమ గల దేవుని నాగులకొండ పట్నం పెళ్లి కొడుకునై పొతున్నా మార్గమధ్యన నాకు ఆపద వచ్చింది. నాకు ఒక పిల్ల దొరుకు ఉపాయం చేయి అన్నప్పుడు.

ఎల్లమ్మ: నాగులకొండ పట్టణం మీద మన్నుపొయ్య బీరయ్య...

నా తమ్ముడా... బీరయ్యా...

ఆ పంచన పాపకారి బిడ్డలు నీకేందుకు తమ్ముడా గంగ ఒడ్డున యే పేదింటి పిల్లను తీసుకవచ్చి నీ లగ్గం జేసి పంపిత్తా పొ.

బీరయ్య: లేదక్క మహంకాళి తొటి యేడు రోజులు పొరు పెట్టుకొని అక్క మాటలు లెక్కచేయకుండా వచ్చినా. మార్గ మధ్యన చిన్నమ్మ గంగాదేవి అడ్డం వచ్చి లగ్గం జేత్తానన్నాది. వద్దని చెప్పుకుంటా వచ్చినా. నీ సాధ్యమయితెనో ఒక పిల్ల దొరుకు ఉపాయం చేయి. నీ సాధ్యం కాకపొతే నేను అన్న మాట తప్పిన అబద్ధం ఆడినా అని ఒప్పుకొ.

ఎల్లమ్మ: నేను పార్వతి బిడ్డ పంచ దేవత రేణుక ఎల్లమ్మ వాని మాటలు యేట్లా అబద్దం ఆడుతా.

లేదు తమ్ముడా ఒక మాట చెబుతా విను. ఇప్పుడే యెరుకలసాని వేషం కట్టుకొని

నాగులకొండ పట్నంలా నాలుగు వాడలు తిరిగి నీ మామ బిడ్డలకు యెరుక జెప్పి కలికి చెంగోళ్ళ బావికి తీసుకొస్తాను గాని ఒక మాట కట్టె బండికి 32 చెడు లచ్చనాలు (లక్షణాలు), యెల్లే ఆడపిల్లకు 32 చెడు లచ్చనాలు, యెక్కే గుర్రానికి 32 చెడు లచ్చనాలు, పట్టే తల్వారికి 32 చెడు లచ్చనాలు అది జాగ్రత్తగా చూసుకొవాలి.

బీరయ్య: మరి అవి కాళ్లకు వుంటాయా, చేతులకు వుంటాయా, యెక్కడ వుంటాయో తెలియదు కాని అక్క నువ్వు లెక్కించి చెప్పు నేను లెక్క పెట్టుకుంటా అన్నప్పుడు.

ఎల్లమ్మ: తమ్ముడా బీరయ్య...నాగులగండ పట్నంలోపల మీ మామయ్య బిడ్డల సంగతి చెప్తా బీరయ్యా...

దరువు: పిల్ల పొట్టిగున్న గాని ముద్దుగుండాలి ముద్దుగుండాలి...
నల్లగున్నగాని సక్కగుండాలి... సక్కగుండాలి...
ఇడుకు 20 ఎడ్లు ఎడ్లుండాలి
తప్పురెంటుకలు లేకుండా చూడు లేకుండా చూడు...
పిల్లకు నెత్తిన మాడా లేకుండా చూడు.. లేకుండా చూడు...
పిల్లకు పాపట్ల సుడి లేకుండా చూడు... లేకుండా చూడు...
దాని పిడతాన సుడి లేకుండా చూడు... లేకుండా చూడు...
పిల్లకు ముళ్లు జుట్టు లేకుండా చూడు... లేకుండా చూడు...
కన్నుబొమ్మలు కలిసి లేకుండా చూడు... లేకుండా చూడు...
దానికి కండ్లె మెల్లె లేకుండా చూడు... లేకుండా చూడు...
దానికి బర్రెముక్కు నడ్డి లేకుండా చూడు... లేకుండా చూడు...
పిల్లకు ఎదా రోమాలు లేకుండా చూడు... లేకుండా చూడు...
పిల్లకు ఎత్తుగా పండ్లు లేకుండా చూడు... లేకుండా చూడు...
దాని శంపకు సుడి లేకుండా చూడు... లేకుండా చూడు...
పిల్లకు నాలుక మచ్చ లేకుండా చూడు... లేకుండా చూడు...
పిల్లకు జిర్ర పెదవులు లేకుండా చూడు... లేకుండా చూడు...
దానికి ఎత్తుగా భుజాలు లేకుండా చూడు... లేకుండా చూడు...
దానికి కొయ్య మెడలు లేకుండా చూడు... లేకుండా చూడు...
పిల్లకు చేతులు పొడవు లేకుండా చూడు... లేకుండా చూడు...
పిల్లకు ఎదురు పిక్కలు లేకుండా చూడు... లేకుండా చూడు...

దానికి అడ్డ జిలాలు లేకుండా చూడు... లేకుండా చూడు...
పిల్లకు దెబ్బల సుడి లేకుండా చూడు... లేకుండా చూడు...
పిల్లకు ఉసారెండ్లు లేకుండా చూడు... లేకుండా చూడు...
వినవయ్య తమ్ముడా నా తమ్ముడా చిన్ని తమ్ముడా...
పిల్లకు రొమ్ము కుంపటి లేకుండా చూడు... లేకుండా చూడు...
పిల్లకు అడ్డు కడుపు లేకుండా చూడు... లేకుండా చూడు...
పిల్లకు బొడ్డున సుడి లేకుండా చూడు... లేకుండా చూడు...
పిల్లకు తొట్టి కడుపు లేకుండా చూడు... లేకుండా చూడు...
దానికి తొడపాము లేకుండా చూడు... లేకుండా చూడు...
పిల్లకు తాకుడు కళ్లు లేకుండా చూడు... లేకుండా చూడు...
పిల్లకు గుత్తుల్లో దొడ్డి లేకుండా చూడు... లేకుండా చూడు...
పిల్లకు గుద్దెలు పాదం లేకుండా చూడు... లేకుండా చూడు...
అరికాలుకు సుడి లేకుండా చూడు... లేకుండా చూడు...
వినవయ్యా తమ్ముడా నా తమ్ముడా చిన్ని తమ్ముడా...

బీరప్ప: ఈ ఒక్కమాట అంటే రంది పడతాది అక్క.

ఎల్లమ్మ: ఎందుకురా...

బీరప్ప: ఎందక్క పిల్ల శరీరం నిండా చెడు లక్షణాలే చెప్తివి. ఇగ చెడు లక్షణం లేని తలం (స్థలం) ఎక్కడిది...

అయ్ వెన్న తిన తియ్యబట్టేనా ఆ తల్లి మహంకాళినా
యెన్న ఇట్లా తియ్యవే మరదల కామరతినా
యెడమ చేత సల్లనే సల్లలు చెయ్యబట్టేనా
వచ్చినట్టి యెన్నను తాను నాకబట్టేనా

అప్పుడు మళ్ళీ తొడలు పిండి, శంపలు కొట్టి అట్లా కాదు ఇట్లా సల్ల జెయ్యాలే గిట్లా వెన్న తియ్యాలని సల్లను అమ్మలే పెరుగును అమ్మలే, పాల అమ్మలే అని అక్కడ పనులు నేర్పుతాది. కామరతికి, నేర్పినాక పనులు నేర్చుకుంటాది. నేర్చుకున్నాక యేం వుంటాది. పని వచ్చింది. కాబట్టి దీంతో నాకేం పని అన్న్టు వుంటాది. అప్పుడు శ్రీశైలం పర్వతంలో ఒగ్గువాళ్ళు

సల్ల సల్లనివాడ రాజు మల్లయ్యో

సల్లనివాడవో మైలారుడా
సల్లని మండపన సంధ్య మల్లయ్యో
లింగమై నువ్వు వత్తే మైలారుడా
లింగమై నువ్వు వత్తే రాజు మల్లయ్యో
నిత్యం వేడుకుందురు మైలారుడా
జంగమయి నువ్వు వత్తే రాజు మల్లయ్యో
దీనంగా వేడుకుందురు మైలారుడా
వట్టి దివండలు రాజు మల్లయ్యో
వొలేసు రూపుడో మైలారుడా
పచ్చి దివండరు రాజు మల్లయ్యో
పాముల బెరుడు మైలారుడా
అయినోలు గుల్లల రాజు మల్లయ్యో
ఆనందపరుడవు మైలారుడా
భోజ నాగుల గుళ్ళలో రాజు మల్లయ్యో
వయ్యారి కాడవో మైలారుడా
పర్వత జంగట్ల రాజు మల్లయ్యో
ప్రత్యక్ష దేవుడవో మైలారుడా

ఇట్లా అనుకుంటా అమ్మవారు మారు మ్రోగుతాది. కులం కొడుకులు వచ్చిర్రు. కులం పేరు మీద వచ్చిర్రు. వీళ్లకు సల్ల పొయ్యలే దానం చెయ్యలే, అన్నం పెట్టలేనని వచ్చిన అతిథి వాళ్ళకు సల్లలు తాపిత్తాది. పాలు తాపిత్తాది. పాలు తాపిచ్చి తోచిన కాడికి దానం పెడుతాది. అప్పుడు కామరతి ఏం అంటాది అంటే

కామరతి: ఏం అయ్యో మీ అక్క చేసిన సంసారం చూసినావా వచ్చినోళ్లకు వచ్చినోళ్లకు దానం చేస్తాంది. సల్లలా సల్ల దాసుకుంది, యెన్నలా యెన్న దాసుకుంది, పాలలా పాలు దాసుకుంది. దొడ్డు మూల్య కట్టింది అని బీరప్పకు నేర్పుతాది. నేర్పేట్టువరుకు నేర్పు మాటలు విని

బీరప్ప: ఏమే అక్క నీ దొడ్డు మూల్యాలు కడుతున్నావు అటా
నువ్వు యాడపడ్డదానివే
నువ్వు యెక్కడ పడ్డదానివే

నువ్వు యెవ్వని గండాన వున్నావు
నువ్వు యెవ్వని పిండాన వున్నావు
నువ్వు కాపుదాన వున్నావే
నువ్వు కంత్రీదాన వున్నావే

బీరప్ప అనేటువరుకల్లా

మాంకాళి: అరే బీరా నేను గొడ్డు మూల్యా కట్టలేదు. నువ్వు సముద్రమంతా సల్ల చూసుకో యెన్నలంత యెన్న చూసుకో గట్టంత ఉన్ని చూసుకో. ఆ పర్వతమంత పాలబండ చూసుకో నీ యెన్నల యెన్న అమ్మలేదు, సల్లల సల్ల అమ్మలేదు పాలలా పాలు అమ్మలేదు, ఉన్నిలో ఉన్ని అమ్మలేదు. పెరుగులో పెరుగు అమ్మలేదు. నీ పెరుగు నీకే ఉన్నవి, నీ సల్ల నీకే వున్నది, నీ యెన్న నీకే వున్నది, నీ ఉన్ని నీకే వున్నది చూసుకో అన్నదటా అనగానే

బీరప్ప: ఛీ అని చెప్పి ఇంట్లాకెళ్లి వెళ్లగొడుతాడు.

మాంకాళి: ఛీ అంటే సిరుతాకు, కాదంటే కడ తక్కువ ఇగా నేను నీ ఇంటికి రానని మాంకళమ్మ ఒలపొసుకుంటా వెళ్ళిపొతాది. ఒలపోసుకుంటు వెళ్లిపోయి ఆ సాకి సవాడి పల్లి ఏక డొర్నకల్ మధ్యనా యెండి గుళ్ల కాడ పగిడి గుళ్ల కాడ కూస్సుంటాది. కూస్సునాక బోగన్న వస్తాడు.

బోగన్న: అక్క ఎటు పొయింది అంటాడు.

బీరప్ప: అక్కలేదు గిక్కలేదు పొ.

బోగన్న: నా అక్కలేని చోటన్న నేను యుండను అంటాడు
బోయిడే బోగన్ననా యెళ్ళి పొతాయున్నాడు
బోయిల బొల్ల మీదన గొర్లు ఒంపులోనన

ఆ బోగన్న కూడా సెట్టు యెక్కుతాడు. ఆ తర్వాత బీరప్ప వస్తాడు.

బీరప్ప: ఏమే కామరతి అక్కా యెటు పొయిందే?

కామరతి: ఏమో మీయక్క యెటుపొయిందో నాకేం యెరుకా. నేను చూసినా నువ్వు అన్న మాటలకు వెళ్ళిపొయింది. ఇగా ఇయనా పొయి ఊదపెట్టుడు అన్నగాల పెట్టుడు. కండ్లల్లా పొగ చెప్పిన పని చెయ్యాలి కదా ఇగా

బీరప్ప: నాయక్క లేని బ్రతుకున్న ఇట్లా అయిపాయేనా
సత్యమతి దేవుడు స్వామినే బీరయ్యనా
కల కల కన్నీరున్నా ఒలపొయ్యనే బట్టేనా

అక్క వున్న సొటన్న నేను యెల్లిపోతన్న

కామరతి బీరప్ప అంజని వల్ల పట్టుకొని అక్క దగ్గర పొలే.

మాంకాళి: అరే బీరా! కాదంటే కడ తక్కువ ఛీ అంటే సిరి తక్కువ. నేను ఇంట్లాకెళ్ళి బయట వచ్చేశాను కాబట్టి మళ్ళి తిరిగి నీ ఇంటికి రాను అని అప్పుడు.

యున్నుట ఇద్దరు ఉన్ని కంకణపొల, యున్నిట ఇద్దరు పతి కంకణపొల నన్నుట నా దయ కులాన్ని పిలువనంపి గణపతి అంశతోటి జన్మించునోడు బోయిడి బోగన్న. ముక్కంటి శివుడి కొడుకు జలగు సల్లప్పా వాళ్ళను పిలువనంపి వాళ్లను సెరి సగం మందను ఒప్పజెప్పి నా యెండి గుళ్ళు పగిడి గుళ్ళకాడా మీరు పూజారులుగా ఉండమని వాళ్ళను మందను ఒప్పజెప్పి అమ్మవారు మహంకాళి శిలారూపం ఎత్తుతాది. శిలారూపం ఎత్తినాక.

బీరప్ప: నా అక్క పొయినాక నేను వుండి యెందుకు బీరప్ప కూడ శిలారూపం యెత్తుతాడు.

కామరతి: నా ఆడబిడ్డ పాయే భర్త పాయే నేను వుండి యెందుకని బీరప్ప యెత్తగానే ఈమె కూడా శిలారూపం యెత్తుతాది. అక్కడికి ఆ బీరప్ప కథ అట్లుంటాది.

**2.5.5. మహిషాసురుని కథ**

పూర్వకాలంలో కశ్యబ్రహ్మ, కశ్య బ్రహ్మ భార్యలు ధితి, అధితి. అధితి పెద్ద భార్య, ధితి చిన్న భార్య. అధితి గర్భము నందుదేవతలు జన్మించారు. ధితి గర్భములో రాక్షసులు జన్మించారు. ధితి కన్న కొడుకులు పెద్దవాడు కదంభాచూరుడు, చిన్నవాడురంభాచూరుడు. కదంభాచూరుడు ఏమంటున్నాడు. సహెూదర రంభచూర.

కదంబాచూరుడు:

మనము పాతాళమున ఎంత కాలం ఉండిన ప్రయోజనము లేదు. మనకు రావలసిన యాగ ఫలితాలు, ఇంద్ర వైభవాలు దేవతలే అనుభవించుచున్నారు. కనుక దేవ లోకము జయించటానికి నేను పంచగంగల మధ్య కూర్చోని తపస్సు చేస్తాను. నీవు జాగ్రత్తగా కాపలా వుండుము. ఓం నమః శివాయా ఓం నమః శివాయా ఓం నమః శివాయాఓం నమః శివాయా ఓం నమః శివాయా.

నారదుడు:

నారదుడు చూశాడు దేవేంద్రుని సన్నిధి కెల్లి దేవేంద్ర కతంభాచూరుడు పంచగంగల మధ్య కూర్చోని తపస్సు చేస్తున్నాడు. వాని తపస్సు ఫలించిన దేవలోకము ఆక్రమించుతాడు.

నీవు వెళ్లిభంగము గావించుము. వెంటనే దేవేంద్రుడు పటపట పండ్లు కొరికిండు. మటు మాయలుకల్పించి మొసలి రూపము దాల్చిండు. గంగలో మునిగిండువేగంగా వచ్చిండు. కదంభాచూరున్ని పట్టిండూ. పట్టి ప్రాణముతీసిండు.

రంభాచూరుడు:

ఓరీ దేవేంద్ర కానకుండ వచ్చి మా అన్నను హతమార్చి పోతివారా. వెంటనే నేను పంచగంగల మధ్యన కూర్చోనితపస్సు చేస్తాను. దేవతల నామరూపాలు లేకుండా చేస్తాను. ఓం నమః శివాయ ఓం నమః శివాయ ఓం నమః శివాయ. ఆహా నేనేంత తపస్సు చేసిన నా తపస్సు ఫలించడం లేదు. కరవాలముతో నా శిరస్సు ఖండించి హెూమంలో వేస్తాను.

అగ్నిదేవుడు:

రంభాసుర హింసాత్మకము మంచిది కాదు. నీకేమి కావలయునోకోరుకొనుము నేనిస్తాను.

రంభాసురుడు:

అగ్నిదేవ నాకు వెయ్యి రూపాలు ధరించి మూడు లోకాలుజయించాలే. అటువంటి కుమారుల్ని ప్రసాదించుము.

**అగ్నిదేవుడు:**

రంభాచూర నీవు కోరినటువంటి కొడుకు తొలుతఏ స్త్రీని అయితే ప్రేమించుతావో ఆ స్త్రీ గర్భవాసమున జన్మించును. వెళ్లుము అని అగ్నిదేవుడు వరం ఇచ్చెను.

రంభాచూరుడు వెంటనే పాతాళము పోవు దారిలో యక్షులుసాధిన ఒక గేదె అనగా ఒక బర్రె ఉండెను. ఆ బర్రెనురంభాచూరుడు చూచి కామము నిలుపుకోలేక ఆ బర్రెనుప్రేమించెను. రంభాచూరుడు వెళ్లిపోయెను. ఆ బర్రె వెంటనేగర్భం ధరించెను. ఆ బర్రెను ఒక యెనుబోతు చూచి వెంబడి పడగా ఆ బర్రె తన శీలమును రక్షించుకోవడానికి రంభాఛూరుని వద్ద కేగేను. అప్పుడు రంభఛూరుడు ఆ యెనుబోతుతోయుద్ధము చేయుచుండగా ఆ యెనుబోతుల వాడిగల కొమ్ములతో రంభాఛూరుని డొక్క చింపెను. ఆ యెనుబోతునుఆ ప్రాంతంలో ఉన్న యక్షులు వచ్చి కొమ్ములు నరికి చంపిరి. నిండు చూలాలుగా వున్న బర్రె ప్రసవించి మహిషాసురున్నికని రాక్షసులకు అప్పజెప్పి, నాధుడు చచ్చినంక నేను బ్రతికెందుకని రంభాచూరునితోపాటు కాష్టములో పడగా అక్కడున యక్షులుఆ యెనుబోతును కూడ కాష్టములో పెట్టినప్పుడు చనిపోయినరంభాచూరుని

రక్తముతో రక్తభీజుడు జన్మించెను. ఆ మహిషాసుర, రక్తభీజులు పాతాళయందు పెరిగి పెద్దవాళ్లయి, ఏమనుకుంటున్నారుఅంటే సహోదర రక్తభీజ మన తండ్రియగు రంభాఛూరుడు మన పెదతండ్రియగు కందభాచూరుడు పంచ గంగల మధ్యన కూర్చోని తపస్సు చేస్తుండగా, దేవేంద్రుడు మొసలి రూపమున వచ్చి హతమార్చి పోయెను. కనుక నేనిప్పుడు ఆ దేవేంద్రునితో పగ తీర్చుకోవడానికి ఆ బ్రహ్మను గూర్చి తపస్సు చేస్తాను. నీవు జాగ్రత్తగా కాపలా ఉండుము. ఓం నమోః బ్రహ్మ దేవాయ నమః.

బ్రహ్మదేవుడు: మహిషాసుర నీ తపస్సు ఫలించినది. యేమీ కావలెనో కోరుకొనుము యిచ్చెదను.

మహిషాసురుడు: ధన్యోస్మి బ్రహ్మదేవా ధన్యోస్మి. నేను కోరిన వరము యివ్వగలవా?

బ్రహ్మదేవుడు: ఇవ్వడానికే వచ్చిన అడుగుము.

మహిషాసురుడు: కమల సంభవాఅడుగుచుంటిని వరము వినుము.అతల, వితల, సుతల, తలాతల, రసాతల, మహస్తల, అండ, పిండ, బ్రహ్మాండ, భూల్లోక, నాగలోక, త్రిలోక, చతుర్దశ లోక, భువన సంరక్ష భూమి, ఆకాశ మార్గ మధ్యగగన పాతాళ లోక భూత ప్రేత పిశాచా షాకిని డాఖినిగాలి దయ్యంబులచేనే గాక కామిని మోహిని కాకగంగా అగ్గోత్ర ఇంద్రచెంద్ర దేవేంద్ర గరుడ, గంధర్వ నందునకుంధున కురుడు కుబేర, గాలి దేవ గంభీర అగ్నిదేవయమధర్మజాధి ముక్కోటి దేవ ఘణములేకాక అశ్వనీకుమారవర్నయోగాధి కపరాతి దేవ దానవ నవ యోధనయోధుల చేతనే కాక అష్టముఖ గండబేరుండ శర్బాశార్దుల ముప్పది మూడు కోట్ల మృగజాల, పన్నెండు లక్షలపక్షజాల క్రిమికీటక మచ్చయ జలచరంబుల చేతనే కాక గిరితర పర్వత యేరుగిరుల యందే కాక యస్త్ర, శస్త్ర, గదా దండ ఆయుధముల చేతనే కాక సమస్త ప్రపంచములోచావు లేకుండా వరము ప్రసాదించుము బ్రహ్మదేవ.

బ్రహ్మదేవుడు: మహిషాసుర నీవు కోరరాని వరమే కోరితివి. అయిన పుట్టిన వారికి చావు తప్పదు. చచ్చిన వారు పుట్టకతప్పదు. కనుక ఆడది తప్పా నీకు చావులేదు వెళ్ళుముఅని బ్రహ్మదేవుడు వరం ఇచ్చేను.

మహిషాసురుడు: ఓహెూ ఓహెూ ఆడది నన్ను ఏం చేస్తుంది లే.

ద: బ్రహ్మ వరంబున మహిషాసురుడు ధన్యమొందినాడుఆహెూ ధన్యమొందినాడు

వర గర్వంబున పాతాళంబుకు చేరవచ్చినాడు ఓహెూ చేర వచ్చినాడు.
ధనుజ యోధుల రాక్షసవీరుల కల్సుకున్నదేమి ఏమి %--% కల్సుకున్నదేమి
అండయోధుల దండనాయకుల హెచ్చరించినాడు %--% హెచ్చరించినాడు
అట్టహాసమున దేవలోకము దండుయెత్తుదామూ దండు యెత్తుదామూ
తాతల తండ్రుల పగలూ తీర్చుకుందమోయి తీర్చుకుందమోయి
నిప్పుల పిడుగై మహిషారుడు చిందులేసినాడుపటపట పండ్లు కొరికినాడు
అండయోధులా దండనాయకుల వినుమంటన్నాడులేలెమ్మంటున్నాడూ

వ: అండయోధులారా దండనాయకులారా అష్ట మంత్రులారాదివ్య ప్రధానులారా అసిలోముడా అంధక చూరవిరుపాక్షుడా తామ్ర ఛూర దుర్ముఖి దుర్దమ బాస్కలుడా గద ఖడ్గపాని పదివేల దండయాత్రతో దేవలోకము ముట్టడించిదేవతల తరిమి కొట్టి మనకు రావలసిన యాగ ఫలితాలు యగ్న భాగాలు ఇంద్ర వైభవాలు అనుభవించుదాము పదండి...

ద: రాజుల మాట విన్నారు పోదామంటున్నారూ..
ఆరచి కూతలు పెట్టిరి పెడ బొబ్బలు లేపిరి
కోట గుమ్మాలు యెక్కిరి పోటు కొమ్ములే పట్టిరి
మూల బూర్జులు యెక్కిరి భూర కొమ్ములే ఊదిరి
దస్తీ గుడ్డా పట్టిరి దండు కిసార చేసిరి
లేపండి లేపండి దండును లేచి కాశలు పోయండే
పట పట పండ్లు కొరికిరి వడేసి మీసము తిప్పిరి
కాశ కమ్మలే పట్టిరి విల్లనంభూతి ఎత్తిరి
వీపున యినుపాడా లేసి రొమ్మున భళ్లాలేసిరి
యెనుగ కంభరి కట్టిరి హనుమంత జండా యెత్తిరి
గుఱ్ఱం మీద రణభేరి గుభిల్లుమంట మ్రోగేనూ
రాజుకు దండము పెట్టిరి లడాయి డప్పు కొట్టిరి
రాజు బైలుదేరేనూ రాండవ బైలుదేరేను
దండు వెళ్లుచుంటేనూ ధరస్త్రీ అదురవట్టెనూ
కొండలు కొనలెక్కిరి మెండుగ భూములు దాటిరి
డముక మీద దెబ్బెసరో దేవలోకమే చొచ్చిరి

మహిషాసురుడు:

వ: ఓరీ దేవేంద్ర నేను మహిషాసుర మహారాజును. మా పెద్ద తండ్రియగు కదంభాచారుణ్ని మొసలి రూపమున వచ్చిహతమార్చితివి. మాకు రావాల్సిన యాగ ఫలితాలుయగ్నయాగాదులు ఇంద్ర వైభవాలు ఆక్రమించి అమృత పాన్యముచేసస్తా అప్సరసలతో పారిజాత పూల పాన్పుల పైన కామకాంక్షలతోఆలించి పాలించి లాలించి అమృతపాన్యము చేస్తుంటివా. ఇప్పుడు మా పెద్ద తండ్రిని చంపిన పగ తీర్చుకోవడానికివచ్చితిని పారిపోయేదవా నీ ప్రాణాలతో యేలా.

దేవేంద్రుడు:

వ: ఓరీ పచ్చి గడ్డి తినే దున్నపోతాయెంత మాటంటివిరా ఐరావత వాహనుడను అమరావతికిదొరను, వజ్రాయుధడను ముప్పది మూడు కోట్ల దేవతలకుప్రతినిధిని నీ నోటికి వచ్చినట్లువాగుచుంటివా

ద: యెంతటి వాడవు నాతో పంతములాడేవురా
యిప్పుడే నీ గొంతు నరికి మట్టుపెట్టెదనురా

మహిషాసురుడు:

వ: ఓరీ ఇంద్ర మా వంశానికి చీడపురుగువై తరతరాలుగామా తాతల తండ్రుల హతమార్చుకుంటూ మాకు రావలసినసర్వ హక్కులను అనుభవించితివి కదా చూడు మీ గతి యేమగునో

ద: చూలమొంటి కొమ్ములతో కుమ్మి చంపెదనురా
నా వాడిగల డెక్కెలతో తొక్కి చంపెదనురా

దేవతలు:

వ: ఓరీ దున్నపోత బ్రహ్మ యిచ్చిన వర గర్వము చేతనీ నోటికి వచ్చినట్టు వొర్లుచుంటివా మూరు?డానిన్నిప్పుడే హతమార్చేదను చూడుము

ద: కుక్క రీతి సాగి సాగి మొరుగుచుందువేలరా
చిక్కబట్టి నిన్ను నల్ల గ్రక్క చేతు చూడరా

మహిషాసురుడు:

వ: ఓరీ అమరేంద్ర కారుచీకటిలో కోడి రూపము దాల్చిఆహాల్యను భంగపుచ్చగా గౌతముని శాపమునదేహమంత యోనులుగా మారి నీవు నన్ను

జయించుటయా.

ద: అమృతంబు తాగి మీకు చావులేదు కనుకరా
కత్తులతో కైమా కొట్టి భక్షణ చేతుమురా

దేవతలు:

వ: ఓరీ రాక్షసధమ ముప్పది మూడు కోట్ల దేవతల యెదిరించి బ్రతికి బైట పడుతావ అదిగో చూడుమువాయుదేవుడు గదాదండము ధరించాడు. యమధర్మరాజు కాలదండము ధరించాడు. అగ్నిదేవుడు గాండీవము ధరించాడు. అశ్వనీ దేవతలు అమ్ములపొదలు ధరించారు. వరుణదేవుడు విజయ శంఖము ధరించాడు. దక్ష ప్రజాపతి కరవాలము ధరించాడు చూసుకో నీ గతి.

ద: రమ్మ రమ్మ శూరుడారణములోన దృంచెదను
ఇందిగో వజ్రాయుధముగుండెలోన గ్రుచ్చెదను

మహిషాసురుడు:

వ: ఓరీ ఇంద్ర వజ్రాయుధమున్నదని బెదిరించుచుంటివా అదిగో చూడుము. అసిలోముడ అందుకాఘూర విరుపాక్షుడ తామ్రచూరదుర్ముఖా దుర్ధేయ త్రినేత్రాఘూరబాస్కలుడ చూస్తారేమి దేవతల దొరకపట్టి చిత్రవధ గావించి తరిమి కొట్టండిదేవతల ఆస్థానాలను ఆక్రమించండి. వెంటనే మహిషాసురుడు వేయి అవతారములు ధరించి దేవలోకమంతబీభత్సము చేస్తున్నాడు.

ద: యెండుగలో కోడిపుంజు దూకిన సందంబు గాను
యెనుగుల గుంపులోన సింహారాజు దూకినట్లుగా
వాడిగల కొమ్ములతో కుమ్మి కుమ్మి తరుముచున్నదేమీ

వ: యీ విధంగా మహిషాసురుడు దేవతల తరిమికొట్టి దేవేంద్రునివజ్ర సింహాసనము ఆక్రమించాడు. మిగతా దేవతల సింహాసనాన్ని రాక్షసులకు అప్పగించాడు. అప్సరసలను పారిజాత పువ్వులపాన్పుల పైకి లాగుచున్నారు. రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ చిత్ర నాగిని, పద్మిని మొదలైన దేవకన్యలను కొరడా వాయించుకుంటూ రేయింబవళ్లు ఆటలాడించుచున్నారు.

ద: రాక్షసులు పెట్టు బాధలు తాళలేక దేవతలూ

దేవలోకము వదిలిపెట్టినారూ అడవి దారి పట్టినారూ.

వ: భార్యలను వదిలిపెట్టి భర్తలు, భర్తలను వదిలిపెట్టి భార్యలు

ద: చెట్టుకొక్కరూ పుట్టకొక్కరూ చెదరిపోవుచున్నారేమో

వ: కడుపుకు అన్నము లేక కంటికి నిద్రలేక కాలుకు నిలకడలేకఆరు మాసాల వరకు అందరూ వొక్క చోట కలిసి బ్రహ్మలోకముదారి పట్టినారు.

దేవతలు:

ద: వరమిచ్చిన బ్రహ్మదేవుడాగానుమయ్య మమ్ము కరుణ

బ్రహ్మదేవుడు:

వ: దేవతలారా తపస్సుతో మెప్పించిన వారికి వరమివ్వడమే మన ధర్మము అయిన మహిషాసురున్ని చంపటానికి నా తరము కాదు. మనమంత కలిసి కైలాసము వెళ్లి శంకరున్ని వేడుకుందాము పదండి.

ద: వేగమునా చేర వచ్చినారూ శంకరున్ని వేడుచున్నరేమి

దేవతలు:

వ: కాలకందర పాలలోచన పరుల కంఠ గంగాధర గౌరివల్లభనందివాహన నాగభూషణ చంద్రశేఖర త్రినేత్ర కైలాసవాస మహిషాసురుడు పెట్టు బాధలు భరింపలేము మమ్ము కాపాడు

దేవదేవా.

శంకరుడు:

వ: దేవతలార బ్రహ్మ వరమునకు తిరుగులేదు. మహిషాసురున్నిచంపటానికి నా తరము కూడా కాదు మనమంత కలిసి వైకుంఠ ఏగుదాము పదండి.

ద: శంకరుడు, బ్రహ్మదేవుడు మొదలైన దేవతలూ
వైకుంఠమూ చేరవచ్చినారూ సాగిలపడి మొక్కినారూ.

దేవతలు:

వ: ఓ అనాధరక్ష ఆపద్బాంధవ వాసుదేవ గోవిందా మాధవ మధుసూదన, పద్మనాభ, పురుషోత్తమ, నరసింహాయా శ్రీ మన్నారాయణ మహిషాసురుడు పెట్టు బాధలకు మేముభరింపలేము దేవదేవా.

వాసుదేవ:

వ: దేవతలారా మహిషాసురుడు ఆడది తప్ప యెవ్వరిచేత చచ్చేవాడుకాదు.

ముప్పది మూడు కోట్ల దేవతల తేజస్సులు వొక్కచోటప్రవేశపెట్టి తదేక నిష్ఠతో ధ్యానము చేస్తే జగదాంబ ప్రసన్నమవుతది. ఆ తరువాత మహిషాసురున్ని వధ జరుగును పదండి.

ద: విష్ణుదేవుని తేజస్సు నీలమేఘశ్యామా
బ్రహ్మదేవుని తేజస్సు బంతిపువ్వుశ్యామా
శంకరుని తేజస్సు శుక్ల వర్ణమమేమీ
దేవేంద్రుని తేజస్సు భయంకర వర్ణమూ
యమధర్మరాజు తేజస్సు రక్తవర్ణమేమీ
వాయుదేవుని తేజస్సు దూమ్ర వర్ణమేమీ
అగ్నిదేవుని తేజస్సు అజిత వర్ణమేమీ
వర్ణదేవుని తేజస్సు శుభ్రవర్ణమేమీ

యీ ప్రకారంగా ముప్పది మూడు కోట్ల దేవతల తేజస్సులన్ని వారొక్క చోట ప్రవేశపెట్టి తదేక నిష్ఠతో ధ్యానము చెయ్యగా అమ్మవారు పద్దెనిమిదిహస్తములు కోటి సూర్యుల కాంతితోటి వెలుగొంది యేమన్నది అప్పుడుదేవతలారా మీ దగ్గర వున్న యస్త్ర, శస్త్ర, గదా, దండ ఆయుధాలన్ని నాకు ఇవ్వండి నేనిప్పుడే మహిషాసురున్ని చంపి మీకు క్షేమముసేకూర్చుతాను.

వ: విష్ణు దేవుడు చక్రమిచ్చినాడు. బ్రహ్మదేవుడు బ్రహ్మాస్త్రమిచ్చాడు. శంకరుడుత్రిశూలమిచ్చినాడు. యమధర్మరాజు కాళదండమిచ్చినాడు. వాయుదేవుడు గదాదండము ఇచ్చినాడు. అగ్నిదేవుడు గాంఢీవమిచ్చినాడు. అశ్వని దేవతలు అమ్ముల పొదలిచ్చారు. దక్ష ప్రజాపతికరవాలమిచ్చాడు. హిమవంతుడు గొప్ప సింహామిచ్చాడు. ఈ విధంగా అమ్మవారు యస్త్ర, శస్త్ర, గదా దండ ఆయుధాలుధరించి కోటి సూర్యుల కాంతి వెలుగొందుచుండగా దేవతలు ఏవిధంగా వర్ణించుచున్నారు.

ద: శాంభవీ గంభీర భైరవీ దేవి జగదంబా
నీదు మహిమా లెన్నంగా ఇతరుల తరమగునా
శంఖమొకచేత చక్రమొకచేత
భరి కత్తి ఒకచేత బాణమొకచేత
వీర కోలా ఒకచేత విడము ఒకచేత
కరవాలమొకచేత కంఠమొకచేత

గావు పిల్ల ఒకచేత గటము ఒకచేత
రక్త కుంభము ఒకచేత సర్పమొకచేత
బాలు కిన్నెర ఒకచేత వేదమొక్కచేత
పసుపు కంచుడు ఒకచేత పద్మమొక్కచేత

అమ్మవారు:

వ: దేవతలారా ఇప్పుడే వెళ్లుచుంటిని మీరు నిశ్చింతగా ఉండడి

ద: లెల్లె లెల్లే లెల్లాయిరే తాయిలెల్లే లెల్లాయిరే
మహిషాసురుని దృంచుటకు మహాంకాళి బయలెల్లింది.

ద: ఆరచి కూతలు పెట్టింది అగాయి బొబ్బలు లేపింది
అమ్మవారి ఆర్భాటమునకు గంగలు గడగడలాడెనురా
ఉద్దండ దోర్దండ ఘణం కిల ప్రపంచ శాంభవీ
ఖడ్గ త్రిశూల నానాయుధ ప్రేత సంతాయిని పల్లవాపాణి
కాత్యాయని నమో బీజాక్షర అదే నీ ఆర్భాటానికి అదే
నీ ఆర్భాటానికి కైలాసంబు కదిలగదే భగవతి
విష్ణు దేవుడు ఎగిరిపడేగదే భగవతి
సురపతి మూర్ఛిల్లేగదే భగవతి
భూదేవికి బుసలు పుట్టేగదే భగవతి
ఆదిశేషుండు అట్టెట్ట పోయేగదే భగవతి

ద: కొండలన్ని పిండాయెనురా దనుజుల గుండెలు కదిలెనురా
శంఖనాదము చేసింది ధముఖం మీద దెబ్బేసింది
కమలాక్షి, కంబుకందరి, కటీస్థలి, ఈశ్వరీ, పాంచాలి, జ్వాలామాలిని
నరబోజని, బలహారి, విద్వాంబరి, గణేశ్వరి, సిద్దచారిణి,
అదేన మహామ్మాయి, రక్తనేత్రి, అంబికా భ్రమరాంబిక ఉజ్జయిని
మహాంకాళి, వైష్ణవి, నారాయణి, సర్వమంగళకారిణి, పరమ కళ్యాణి
బయలుదేరిందే.

ద: సింహాము గర్జన చేసింది ఏడు యోజనాలు ఎగిసింది
రక్కస మూకల చూసింది గట్టిగా హెచ్చరించింది

అమ్మవారు:

ఓరే! రాక్షసులారా మీ మహిషాసురుడు ఎక్కడ ఉన్నాడురా. దేవలోకము వదిలిపెట్టి పాతాళము పారిపొమ్మంటి, లేకపోతే ప్రాణాలు తీసివేస్తానని చెప్పండి

భటులు పోవుట:

మహిషాసుర మహారాజా ఎవతో ఆడది అందమైన సుందరి. సింహాము మీద కూర్చొని రకరకముల ఆయుధములుధరించి వచ్చినది. మీ ఎనుబోతు రాజును పాతాళము పారిపోమ్మనది పోకపోతే చంపేస్తానంటుంది. అండయోధులారా, దండనాయకులారా, అష్టప్రధానులారా, దివ్యమంత్రులారా,అసిలోముడా, అందుకాసూరా, విరుపాక్షుడా, దుర్ముకా, దుర్దేయతామ్రాచూరా, బాస్కలుడా అరి భయంకర వీరుల్లారా వెంటనే వేయి గజముల పదివేయిల తురంగములతోబయలుదేరి ఆ ఆడదాన్ని ఓడించి, కొట్టకుండా, తిట్టకుండా రెక్కలు కట్టి తీసుకరండిరా!అందమైన ఆడదైతే లగ్నము చేసుకుంటాను, మామూలు ఆడదైతేదాసిగా ఉంచుకుంటాను.

ద: భళానంటి భళీ తమ్ముడా మేలు భళానోయ్ తమ్ముడా
లడాయి డప్పు కొట్టిరీ పెడాయి బెబ్బలు లేపిరి
కత్తులు కటార్లు పట్టిరి విల్లనంబులే లేపిరి
కత్తి జల్లూ మంటేను కలబడుతుంది రాండువా
విట జల్లూ మంటేను విడువీడుతుంది రాండువా
అమ్మవారును చూచిరే బొబ్బలు లేపా భట్టిరీ

వ: ఓసే! లేడి కన్నుల చిన్నదానా ఎక్కడ నుండి వచ్చితివి. మా ఎనుబోతు రాజు కొట్టకుండా తిట్టకుండా తీసుకురమ్మన్నాడు. మర్యాదతో రాకపోతే బంధించుకు రమ్మన్నాడు. వచ్చెదవా రానందువా!

ద: అమ్మవారు దనుజుల మాటలు విన్నదీ పటపట పండ్లు కొరికింది
గోవింద గోవింద అన్నది దండులోపలా దూకింది
కరవాలము చేబట్టింది కండ కండలుగా నరికింది
దనుజుల గొట్ట భట్టెనురా మండెలు బెట్టా పట్టెనురా
ఏనుగుల గొట్టా బట్టెనురా ఎట్టాము పెట్టా బట్టెనురా
గుర్రాల గొట్టా బట్టెను కుప్పలు పెట్టా పట్టెను
కుప్పలు పెట్టా వట్టెనూ మోకాలు బంటి రక్తము మోలుగుల వంటి పీనుగలు

వ: చంఢికా, నీ నాలుక భూమిపైన పరచి రాక్షసుల రక్తమంతా త్రాగేయుము. ఛాముండేశ్వరీ రాక్షసుల తలలన్ని దండగాముడిపెట్టి నీ కంఠమందు ధరించుము. మళ్ళీ అతుక్కొని లేచి వస్తున్నారు. కౌమారి రాక్షసుల శవాలను నమిలి మ్రింగేసేయుము

ద: రక్కస మూకల చంపింది రతోరతి చేసింది
పీనుగ పెంటలు చేసింది కాకుల గద్దలకేసింది

అమ్మవారు:

వ: ఓరే! పారిపోయే రాక్షసులారా మీ ఎనుబోతు రాజునుయుద్ధానికి రమ్మనండిరా, రాకపోతే పాతాళము పారిపోమ్మనండి.

భటులు:

ఓ ఏనుబోతు రాజా, మన భటులందరిని వచ్చిన ఆడదే చంపేసింది. నిన్ను కూడా యుద్ధానికి రమ్మంది రాకపోతే పాతాళము పారిపోమ్మన్నది.

మహిషాసురుడు:

ఓరే భటులారా వెంటనే రథము సిద్ధము చేయండివెంటనే రారాజు యుద్ధ రంగానికి సిద్ధమే అయితున్నడూగా మహిషాస్సురుండూవెంటనే మహిషాసుండు మనిషి రూపం ధరించికాసలేమ్మలు గట్టి విల్లనంబులు ఎత్తెయుద్ధ రంగానికి సిద్ధమే అయితుండుగా ఎనుబోతూ మహారాజు భుజ కిరీటములు మెరియా తల కిరీటమును పెట్టి గదా దండమును లేపి ఇక భుజమందు పెట్టిండూగా ఎనుబోతు మహారాజువెయ్యి కంచరి గాడుదల రథమునకు బంధించి వెంటనే రథమెక్కెనుగా మహిషాసురా మహారాజు.

ద: రథము కూడా బయలుదేరినది రాజు కూడా బయలుదేరినాడు
దండి దండిగా రక్కసులు గా రథమెంటా వస్తున్నరేమి
రణభూమి మీదికేమి రథము కూడా చేరవచ్చినది
రంగమందూ ఉన్న అమ్మవారిని మహిషాసుర రాజు కండ్ల చూసినాడు

మహిషాసురుడు:

వ: ఓ లేడి కన్నుల చిన్నదానానీ దానిమ్మ బీజములు వంటి దంతము చెక్కిల్లుగుండ గిన్నెల బోలు గురుతర కుచములు, సామరేకుల బోనిపద్దెనిమిది హస్తములు, గున్నటేనుగు తొండముల వంటినీ సొగసైన తొడలు, కందిటీగ నడుము

చిన్నదాన దేవతల పక్షపాతమున యుద్ధము చేయుటకు వచ్చితివానన్ను లగ్నము ఆడదానికి వచ్చితివా!

ద: రామరాజుల చేతికటారి రాజహంస ఇటురావమ్మా

ఇందువదన నిన్నెందరు తెంచిన విడువ జాలనే నిన్నిపుడు

అమ్మవారు:

వ: ఓరీ! దురాంహంకారా! మదాంధుడా! కామ, క్రోద, లోభ, మోహ, మద మచ్చర్యము చేత కండ్లకు పొగరెక్కి నే నెవరుకొని నీ నోటికి వచ్చినట్లుగా ఒర్లుచుంటివి రామూరా?!

ద: నోటికి వచ్చిన కూతలురా దుష్ట రక్కసుడా వర్లకుడారా

మంచి మాటతో నీ విపుడు పాతాళ్ళంబుకు పారిపొమ్మురా

మహిషాసురుడు:

"నవ్వడం"

వ: ఓసే! చిన్నదాన నిన్ను చూచిన వెంటనే కామమోహితుడనైనాకొంత మనుమధ సోకిల్లి మనస్సు రంజిల్లెను. నీ అనురాగ బంధమునీ అందచందాలు నన్ను ఇనుప గొలుసుల్లాగా బంధించాయి. నాహృదయం అంతా చల్లబడి, నా కోపాగ్ని అంతా చల్లబడి, అస్త్ర, శస్త్రగదా, దండ ఆయుధాలు హస్తములు పట్టు తప్పి నీ పైన మక్కునకలిగెను. నీతో యేలా యుద్ధము చేయాలో నాకు తోసబడుటలేదు

ద: లేడి కన్నుల చిన్నదానా కోపమెందుకే మందయణా

ఆడదాన నీ అందము చూచి ప్రేమ కలిగెనే సుందరాంగి

అమ్మవారు:

వ: ఓరీ దున్నపోతా! బండెడు కుట్టి తిని, కుండెడు కుడ్తి త్రాగి ముకితి బొందలు పడి దొర్లే మూరు?డా! ఎంత మాటలంటివిరాఎనుబోతా! చూచుకో నీ గతి

ద: బర్రెకు పుట్టిన దున్నపోతా నీ బలుపు అనగించద ఎనుబోతా

పాపమనకా నిన్నిప్పుడు పట్టి ద్రుంచెదను రాక్షసుడా

మహిషాసురుడు:

వ: ఓసే! చిన్నదాన భర్తలేని ఆడదాని బ్రతుకంతా వ్యర్థమే కదానిన్ను చూచిన దాదిగా నా మనసంతా ఎంతో బాధపడుచున్నదిఅందుకే నన్ను పెండ్లి

యాదుము ఎంతో సుఖపడతావుదేవలోకానికి పట్టమహిషిణిని చేస్తాను.

ద: భర్త లేనిదే ఆడదాని బ్రతుకు వ్యర్థమే ఆడదాన

సుందరాంగి నీ చూపులు నాకు మన్మథ బాణాలు లామెగదనే

అమ్మవారు:

వ: ఓరీ! బర్రెకి పుట్టిన దున్నపోతా నీ అమ్మ కడుపున మట్టి పోయ్య నాకు భర్త లేదంటివా దున్నపోతా నా భర్తనిరాకారుడురా నిరామయుడురా, నిర్గుణుడురా, నిశ్చలచిత్తుడుసర్వంతార్యామి, సకల ప్రాణుల యందు ఇమిడియున్నట్లుఉ న్నాడురా ఆ బ్రహ్మమే నా ప్రాణేస్వరుడారా ఆ బ్రహ్మము యొక్క స్వరూపము అవ్యక్తము. అవ్యక్తము యొక్క పరిణామము మహత్తుమహత్తు యొక్క పరిణామము మహాదహంకారముమహాదహంకారము యొక్క పరిణామము పంచతన్మాత్రలు పంచతన్మాత్రల యొక్క స్థూలము పంచమహాభూతముల నుండే జగత్తు గలిగెనుఈ మొత్తము విరాట్టు నందు జగత్తు గలదు. ఈ జగత్తు పంచమహాభూతముల నుండి కలిగెను పంచ మహాభూతముల యొక్క సూక్ష్మము పంచతన్మాత్రల పంచతన్మాత్రల యొక్క సూక్ష్మము మహాదహంకారము మహాదహంకరాము యొక్క సూక్ష్మం మహత్తు మహత్తు యొక్క సూక్ష్మము అవ్యక్తము అవ్యక్తము యొక్క సూక్ష్మము బ్రహ్మము ఈ బ్రహ్మము అవ్యక్త స్వరూపుడై, మహత్తు యొక్క ప్రేరేపణచేత మహదహంకారములో కూడుకొని పంచతన్మాత్రల ద్వారా పంచమహాభూతముల నుండి చేయు వృత్తి ఏమనగాఈ జగత్తు అనగా పిండంబును (జీవ ఈశ్వర జగత్తులుసృష్టించెను) దీనిని పరిపాలించుటకు జీవోపాదులకు మరియువిరాట్ రూప విశ్వము అనగా ఈశ్వరాండమును మరియుదీనిని పరిపాలించుటకు ఈశ్వరుని సృష్టించెను అనగా? జీవఈశ్వర జగత్తులను సృష్టించెను ఈ సృష్టి కర్తయేనా భర్త రా!

ద: మస్తిభట్టిన దున్నపోతా నీ మదముగించెద ఇటు రారా!

ద: కరవాలమున నిన్నిపుడుకండకండలుగా నరికెదరా!

మహిషాసురుడు:

వ: ఓసే ఆడదానా!నా భర్త నిరాకారుడు అంటావు, నిరామయుడు అంటావు, నిశ్చలచిత్తుడంటావు, సర్వంతర్యామి అంటావు. జీవ, ఈశ్వర జగత్తులను సృష్టించిన సృష్టికర్త అంటావుఅంతటి భర్త యున్నచో నీవు ఎందుకు

యుద్ధమునకు వచ్చితివి. నాతో యుద్ధము చేయలేని ఆ రండా నిన్ను ఎలా సుఖపెడతాడు?అందుకే నన్ను లగ్నమాడుము సుఖపడతావు.

ద: ఓరీ చూపుల ఒగలాడిరణము ఎందుకే రంకులాడి
ఆడదానితో యుద్ధం చేస్తేఆధర్మం అందురు యెనుకటి పెద్దలు

అమ్మవారు:

వ: ఓరీ! మహిషాసురా! నీ అమ్మ కడుపు కాలిపోను ఎంత మాటంటివిరా! కన్నతల్లి అక్కచెల్లి అనే భావన లేకుండా వర్లుచుంటివా మూరా?! చూడు నీ గతి ఏమగునో!

ద: ఎనుబోతా కావరంబున నా తెరుగుంగు ఎరుంగుక మొరుంగుచుంటివా!
దురంబున నీ ఇటురారా నీ మదముగించెద దున్నపోతా!

మహిషాసురుడు:

వ: అబ్బా! ఎంత దెబ్బ గొట్టితివే ఆడదానా. నీ దివ్య మంగళ స్వరూపానికిమోహితున్నయి కట్టుబడితిని (నీ పాదములు మ్రొక్కుతనంటిని) నేనెన్ని విధముల చెప్పిన వినిపించుకోక నీవాటి వాడిగల బాణాలచేనా దేహమంత చిల్లుల బడగొట్టితివా! ఇక నిన్ను చంపేస్తానుచూడూ!

ద: ఇదిగో వచ్చే నా బాణాలు కాచుకోవె నీ ప్రాణాలు
జల్లెడ వలె నీ సుందర తనువు చిల్లుల బడగొట్టెదనిపుడు

అమ్మవారు:

వ: ఓరీ రక్షసాధమా! ఎంత దెబ్బ కొట్టితివిరా! నీ సాహసమునకుమెచ్చితిని ఇప్పటికైన నన్ను శరణు వేడి పాతాళము పారిపోమ్మునిన్ను వదిలిపెట్టెదను.

ద: దేవత యని నన్ను నమ్మమురా నన్ను శరణు వేడుకొని వెల్లుమురా!
పోకపోతే రాకాసి మూకలను రూపుమాపెదను నిన్నుప్పుడు

మహిషాసురుడు:

వ: ఓసే ఆడదాన బ్రహ్మ విష్ణు మహేశ్వరులే కాక ముప్పది మూడుకోట్లదేవతలను చుట్ట చుట్టి కట్టకట్టి తర్మికొట్టి ఇంద్ర సింహాసనముఅలంకరించి ముల్లోకములు పదునాల్గు లోకములను ఏకచక్రాధిపత్యంబుగా పరిపాలనంబు కావించుచున్న మహిషాసుర చక్రవర్తినిన్ను శరణు వేడుటయా ఎంత మాట ఎంత మాట సిగ్గు సిగ్గు.

ద: సిగ్గులేక నే చిన్నదానా ఇట వచ్చితివే ఆడదాన
ఇదుగో వచ్చేనా గద దెబ్బనన్నాపలేడు నీ యబ్బెవడు

అమ్మవారు:

వ: ఓరీ మహిషాసుర నేనెన్ని విధములుగా మన్నించిన నీ పొగరుబోతు కూతలు మానకుంటివి ఇక నీకు వరమిచ్చిన బ్రహ్మదేవుడు కూడ బ్రతికింపలేడురా... దున్నపోతా...

ద: కాలమృత్యువు బోలెడురాభీలంబై ధనహులేవురా
ఇదుగో వచ్చె కరవాలమురానీ శిరము రెండుగా నరకెదరా

వ: అమ్మవారి సింహాము గడ గడ గర్జించి మహిషాసురుని మీద పడ్డదో రామా వెంటనే అమ్మవారు కరవాలము చేతపట్టిమహిషాసురుని కేశజుంపాలు పట్టి ఖండన చేసెనూ దేవాఅమ్మవారు కోపము భరింపలేక కలవాలమొకచేతకంఠమొకచేత పట్టుకొని ఉరుకుచున్నదో రామా...అమ్మవారు భయంకర స్వరూపం చూచి శంకరుడు మూర్ఛపోయిధరణిమీద పడ్డడో రామా కానక శంకరుని రొమ్ముమీద పాదము పెట్టి నేలకు చూచెను అమ్మవారుముప్పది మూడు కోట దేవతలు జయ జయధ్వనులువిజయ దుందుభిలు ప్రయోగించి పూలవర్షం కురిపించి అమ్మవారును వేడుకుంటున్నారు...

అమ్మవారి ప్రార్థన:

ద: అంబా జగదంబా కనకదుర్గాంబా
శాంతించు మాతల్లి సర్వజగమంతా — అంబా
అంబా జగదాంబ కనకదుర్గాంబా
కరుణతో మమ్మేలి కాపాడువమ్మా — అంబా
అంబా జగదంబా కనకదుర్గాంబా
డాలుబల్లెము ఒకచేత ఉముకొకచేత — అంబా
అంబా జగదంబా కనకదుర్గాంబా
శంఖ చక్రము గద ఒకచేత పద్మమొకచేత — అంబా
అంబా జగదంబా కనకదుర్గాంబా
ఒరికత్తి ఒకచేత బాణమొకచేత — అంబా

అంబా జగదాంబా కనకదుర్గంబా
వీరకోల ఒకచేత విడమొకచేత అంబా
అంబా జగదాంబా కనకదుర్గంబా
గావుపిల్లా ఒకచేత గటమొక్కచేత అంబా
అంబా జగదాంబా కనకదుర్గంబా
కరవాలమొకచేత కంఠమొకచేత అంబా
అంబా జగదాంబా కనకదుర్గంబా
భారీ సింహాము మీద బయలెల్లినావు అంబా
అంబా జగదాంబ కనకదుర్గంబా
మహిషాసురుని భట్టి మర్ధించితీవా అంబా
అంబా జగదాంబ కనకదుర్గాంబా
రక్తబీజుని దృంచి రానే వచ్చితివా అంబా
అంబా జగదాంబ కనకదుర్గాంబా
తల కిరీటములు మెరియా జగమంతా వెలుగు అంబా
అంబా జగదాంబ కనకదుర్గంబా
సల్వటద్దల రవికె చన్నంపు చీరే అంబా
అంబా జగదాంబ కనకదుర్గంబా
నిలువెల్లా సొమ్ములు నీ చక్కదనమూ అంబా
అంబా జగదాంబ కనకదుర్గంబా
యాపరిల్లల దండా నీ మెడా నిండా అంబా
అంబా జగదాంబ కనకదుర్గంబా
కోటి సూర్యులు నీకు సాటి రారమ్మ అంబా
అంబా జగదాంబ కనకదుర్గంబా
గరుడ కిన్నెర యక్ష గంధర్వులైనా అంబా
అంబా జగదాంబ కనకదుర్గంబా
హరిహరాదులకైనా ఆ బ్రహ్మకైనా అంబా
అంబా జగదాంబ కనకదుర్గంబా
నీదు మహిమా లెన్నని తరూలతరమా అంబా

అంబా జగదాంబ కనకదుర్గంబా

నిను గొలువ జనులంతా నిలిచియున్నారు అంబా

అంబా జగదాంబ కనకదుర్గంబా

బండీ బోనము నీకు భారీ యాటలూ అంబా

అంబా జగదాంబ కనకదుర్గంబా

కొండ బోనము నీకు గండ దీపాలు అంబా

అంబా జగదాంబ కనకదుర్గంబా

గుడి చుట్టు బోనాలు గుళ్లో దీపాలు అంబా

అంబా జగదాంబ కనకదుర్గంబా

దీపదూపము దివ్యమంగళారతులు అంబా

అంబా జగదాంబ కనకదుర్గంబా

మాణిక్యపురవాసి మమ్మేలు మమ్మా అంబా

అని ఆ విధంగా దేవతలందరూ అమ్మవారిని శాంతింప జేశారు. ఇంతటితో మహిషాసురుని కథ ముగుస్తుంది.

**2.5.6. మాంధాత కథ**

భాగవతం మొదలైన పురాణాలలో ప్రముఖంగా కనిపించే మాంధాతకథ జానపదులలోనూ ప్రచారంలోనూ ఉంది అయితే జానపదుల మాంధాతకథ పురాణాలలోని కథకన్నా కొద్దితేడాతో ఉంది జానపదులలోని ఆ మాంధాతకథను ఒగ్గు కళాకారులు ఈవిధంగా కథనం చేస్తారు ఒకసారి త్రిమూర్తులు రథంపై బయలుదేరి విహారం చేస్తున్నారు వారి వెండిరథం ఒక అరణ్యం వద్దకు చేరింది అక్కడ

దరువు:కాకి చూడని కారడవి పిట్ట చూడని పిరికి అడివి

గద్ద చూడని పెద్ద అడవికి మేగారథము చేరావచ్చినాది

మరి కాల ఋతువు తెలియకుండా సూర్యుడు ఉదయించే టైం దగ్గరికి వచ్చేనా ఆ కీకారణ్యంలో బ్రహ్మ శంకరునితో సంధ్యావందన సమయం అయిందని అక్కడ నీళ్లు లేవని చెప్పాడు ఈ ఘటంలో కథకుడు అరచేతిగుండా నీళ్లు అనే ప్రయోగాన్ని చేశాడు ఇది దోసిలి అని మనం అర్థం చేసుకోవాలి.

ఇదే ఘట్టంలో కథకుడు సంధ్యావందనం టైం అన్న ప్రయోగంలో టైం అనే ఇంగ్లీషు పదాన్ని ప్రయోగించాడు ఇది కథనంలోని ప్రయోగం కాదు ఒగ్గు కళాకారుడు

ఈ ప్రదర్శన చేస్తూ తన కాలపు ఈ ఆంగ్లపద ప్రయోగాన్ని అసంకల్పితంగా చేశాడని భావించవచ్చు అప్పుడు శివుడు రథం దిగి తన త్రిశూలంతో ఒక బంగారు కోనేరు సృష్టించాడు ఆ గంగలో పంచముఖ బ్రహ్మాస్నానం చేసి సంధ్యావందనం చేసుకున్నాడు ఆ తర్వాత వారు ముగ్గురు కైలాసం చేరుకున్నారు.

మరి విష్ణువు, బ్రహ్మ, శంకరుడు కైలాసం తిరిగి వచ్చేనట. కైలాసం వచ్చినప్పుడు దేవేంద్రుడు బిడ్డలు ఏడుగురు దేవకన్యలు ఏమి రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ, నాయిని, పద్మిని మరియు అందరి కన్నది చిన్నది దేవాంగుని అసువంటి దేవకన్యలు తండ్రితోని సెలవులు తీసుకొని నాన్నా మేము త్రియిట మార్గం తిరిగోస్తాం అన్నప్పుడు దేవేంద్రుడు సెలవు కూడా పెట్టినాడుగా పెట్టినాడు ఏమి...

త్రిమూర్తులు కైలాసం చేరుకున్న సందర్భంలో కథకుడు రంభ ఊర్వసి మేనక వంటి దేవ నర్తకిలను దేవేంద్రుని బిడ్డలుగా చెప్పాడు పురాణాల్లో ప్రకారం ఈ రంభ ఊర్వశి మేనక తిలోత్తమ వేర్వేరు ఉద్భవాలు చరిత్రలు కలవారు వారందరినీ దేవేంద్రుని బిడ్డలుగా ఈ కథలో చెప్పడం జానపద విజ్ఞానంలో సర్వసాధారణంగా కనిపించే అంశమే.

జానపద గాథలలో దేవతలు మానవులు కలుసుకుంటూనే ఉంటారు మాట్లాడుకుంటూనే ఉంటారు వారి మధ్య సంబంధ బాంధవ్యాలు కూడా ఉంటాయి ఈ సందర్భంలో కథకుడు చేసిన ఈ ప్రయోగం కూడా అందులో భాగమేనని మనం భావించవచ్చు.

దేవేంద్రుడి కుమార్తెలైన ఆ ఏడుగురు దేవ కన్యలు తాము అలా విహారం చేసి వస్తామని  తండ్రి అనుమతి తీసుకుని బయలుదేరారు వారి సింగారాన్ని కథకుడు వర్ణిస్తాడు దరువు:ఆ దేవేంద్రుని బిడ్డలు బయలుదేరిర్రు దేవకన్యలు...

దేవేంద్రుని బిడ్డలంటా మారచ్చ మౌలలంటా దేవేంద్రా బిడ్డలంటా...

ఆ నారిచీరలంటా సింగారి రవికలంటా నారిచీరలంటా

ఈ ఘట్టంలో కథకుడు చేసిన నారీ చీరలు అనేది ఒక కొత్త ప్రయోగం అవి నారాచీరలు అయి ఉంటే సింగారి రవికులతో పనిలేదు వారు సింగారి రవికలు ధరించారు కనుక అవి నారాచీరలు కాక మరొక రకమైన చీరలని మనం భావించాలి.

ఆ దేవకన్యలు తమ ప్రయాణంలో ఎకరాని కొండలు ఎక్కి దిగుతూ ఉద్యానవనానికి చేరుకున్నారు అక్కడ వారు అచ్చుమల్లెలు నిచ్చుమల్లెలు బొండుమల్లెలు విరజాజిపూలు తెంపుకొని ఆటలాడుతుండగా వారికి శివుడు సృష్టించిన బంగారు కోనేరు కనబడింది

అక్కాచెల్లెల్లో పెద్దదైన రంభ ఆ కొలనులో స్నానం చేద్దామని చెల్లెళ్లకు చెప్పింది అక్కచెల్లెలు అందరూ ఆ బంగారు కొలనులోకి దిగి ఆటలుఆడుతూ ఈత కొట్టారు.

మరునాడు శంకరుడు వేదపండితులైన బ్రాహ్మణులతో సహా ఆ కోనేరు వద్దకు చేరుకున్నాడు ఆ కోనిరు దగ్గర బంగారు దట్ట కదిలి ఉండడం నీళ్లు చెల్లాచెదురు అయి ఉండడం అక్కడ కొన్ని తలవెంట్రుకలు ఉండడం చూసి ఇక్కడికి వచ్చినవారు రేపు మళ్లీ వస్తారు వారిని పట్టుకోవాలి భావించి ఆ బ్రాహ్మణులను పంపి తాను కోనేరు దగ్గరగా కాపలాగా ఉన్నాడు.

మరునాడు ఆ దేవేంద్రుడి బిడ్డలైన దేవకన్యలు లక్కరథాలు మేఘరథాలపై మళ్ళీ కోనేరు వద్దకు చేరుకున్నారు ఆ కొలనులోకి దూకి ఈతలు కొడుతూ పాటలు పాడుతున్నారు అప్పుడు జంగమా రూపంలో ఉన్న శివుడు అక్కడికి వచ్చి గంటలు వాయించాడు స్నానం చేస్తున్న వారిని నగ్నంగా చూశాడు వారు సిగ్గుపడి తలలు వంచుకున్నారు అప్పుడు శివుడు వారితో ఓ భామలారా మీ భర్తలు మిమ్మల్ని చూడటానికి ముందే మిమ్మల్ని నగ్నంగా చూశాను కనుక ఏదైనా వరం కోరుకోండి అన్నాడు అప్పుడువారు

దేవకన్యలు: ఓ పరమాత్మ, ఓ గంగాధర, ఓ గౌరీవల్లభ, ఓ నీలకంఠ, ఓ నిశ్చలచిత్త, ఓ పార్వతి ప్రియ వల్లభుడా... మాకు భర్తలేని సంతానముగా ఇవ్వవలే... భర్తలేని సంతానము ఇవ్వవలెను ఓరామా... సదస్సు (తదాస్తు) అన్నడటా పరమేశ్వరుడు.

ఆ ఏడుగురు భర్త లేని సంతానం కోరుకోగా ఇస్తానని వరమిచ్చిన శివుడు వారికి సంతానం కలగకపోతే తనను నిందిస్తారని భావించి ఆ దేవకన్యలను అక్కడే ఉంచి తాను కైలాసం చేరుకున్నాడు.

ఏడుగురు భామలుకు సంతానం ఇస్తా అని ఒడికట్టినేమి. ఇవాళా నేను సంతానం ఇవ్వకపోతే ఆడిపోసుకుంటాన్ననని ఆ భామలను అక్కడే వుంచిండు ఆ పరమేశ్వరుడు కైలాసం చేరవచ్చినాడే... బ్రహ్మ భక్తులు 11 కోట్లు, విష్ణు భక్తులు 11 కోట్లు, శివభక్తులు 11 కోట్లు, యోగులు, మునులు, ఋషులు తదితరులని అక్కడే కూర్చుండిబెట్టుకొని ఈ ఏనుగు తొండం దొడ్డుని దారబోసుకుంటా 41 రోజులు పుత్రకామేసి యాగం చేసినాడు. యాగం లోపల చేసినాడు. యాగం లోపల సురది 33 కోట్ల దేవతల రొమ్ములుంచి చెమట తీసి హెూమగుండంలో వేసినాడుగా... వేసినాడేమి హెూమగుండంలో వేసినాకా శురది 33 కోట్ల చెమట హెూమగుండంలో సంతానఫలంగా మారినప్పుడు, అగ్నిదేవుడు,

ఏడు కమండలాలు తెచ్చినాడుగా తెచ్చినాడేమి...

సర్వశక్తిమంతుడు అయినా శివుడు ఆ దేవకన్యలకు సంతానం కలిగించడం కోసం 41 రోజులు పుత్రకామేష్ఠి యాగం చేయడం ఒక విచిత్రం సంకల్పం మాత్రం చేతనే సకలం సాధించగల శివుడు తన పురాణ ప్రసిద్ధికి వ్యతిరేకంగా పుత్రకామేష్టియాగం చెయ్యడం అంటే శివుడు కూడా సామాన్య మానవుడు అయినట్లే జానపద గాదులలో దేవతలు మనసులోగా వ్యవహరించడం సాధారణంగా కనిపించే అంశమే ఈఘటంలో శివుడు యాగం చేయడం అలాంటిదే అని మనం భావించాలి.

యాగంలో 33 కోట్ల దేవతలు రొమ్ముల నుంచి వచ్చిన చెమటను శివుడు ఆహుతి ఇచ్చాడు ఆ ఆహుతిగా వేయబడిన చెమట సంతానపలంగా 7 కమండలాలుగా వచ్చింది శివుడు ఆ కమండలాలను తీసుకొని కొలను వద్దకు చేరుకున్నారు ఇక్కడ కథకుడు ముందు బంగారు కోనేరు అని చెప్పిన దానిని ఇప్పుడు బావి అని చెపుతున్నాడు. బావి చెరువు రెండు వేరువేరు అకార విశేషాలుగల జలస్థానాలు చెరువు విశాలంగా ఉండి నీరు బయటకి కనబడేది గాక బావి భూమిలోపల నీరు కలిగిన జలస్థానం చెరువులు ఈతలు కొడుతుండగా బయటవాళ్ళు సులభంగా చూడటం సాధ్యమైన అంశం బావిలో స్నానం చేస్తుండగా అలా చూడడం సాధ్యపడదు కనుక శివుడు చేరింది బావి కాదని చేరువే లేదా కోనేరు అని మనం భావించాలి. కథ గానం చేస్తున్న ఉత్సాహంతో ఒగ్గు కళాకారుడు ఇలా కోనేరుని  బావిగా మార్చి చెబుతుండడాన్ని గమనించి ఉండడు.

బావి వద్దకు వచ్చిన శివుడు స్త్రీలను అప్రమత్తం చేసేందుకు గంటలు కొట్టాడు శంఖం ఊదాడు వారు రాకపోవడంతో వారు వెళ్లిపోయి ఉంటారని భావించాడు శివుడు సరైన అనుకుని ఆ ఏడు కమండలాలలోని జలాన్ని ఒక సొరకాయ బుర్రలో పోసి మర్రిచెట్టు తొర్రలో పెట్టాడు ఈ జలానికి సంతానం బలం ఉన్నది ఎవరైనా తీసుకోవచ్చు అని ఒక మామిడి ఆకు మీద రాసి ఆ తొర్రలో పెట్టి తాను వెళ్లిపోయాడు.

అయోధ్య నగరాన్ని యమునేశ మహారాజు పాలిస్తున్నాడు ఆయన కుసుమగంధి అనే స్త్రీని వివాహం చేసుకున్నాడు వారికి చాలా సంపద ఉంది అన్ని సౌకర్యాలు ఉన్నాయి కానీ సంతానం లేదు ఒక రోజు కుసుమగంధి తమకు అన్నీ ఉండి అమ్మ అని పిలిచే ఆడపిల్లలు లేదా ఏ గోత్రాన్ని నిలిపి కొడుకు లేడా యే ఇక ఈ సంపద ఉండి లాభం ఏమని బాధపడ్డది సంతానం కోసం ఆ భార్యభర్తలు ఊరులోని అన్ని ఆలయాలను దర్శించారు కనపడ్డ రాయి గల మొక్కారు ఢిల్లీ దాకా ఇలా అన్ని చోట్ల మొక్కుతూ

తిరిగారు పచ్చని చెట్లకు మొక్కారు పడిపోయిన బావులు కుడికలు తీయించారు చీమలకు చక్కరలు పంచాడు. పక్షులకు ఫలాలు పెట్టారు. ఇలా ఎన్నో రకాల మొక్కులు దానాలు చేస్తూ తిరిగి అయోధ్యకు చేరుకున్నారు.

యమనేషుడు సభలో ఉండగా కొందరు రైతులు వచ్చి చిలకలు తేలు దుప్పులు ఏనుగులు పొలాల్లోని పైరు పంటలన్ని పాడు చేస్తున్నాయని తమను కాపాడమని వేడుకున్నారు. అప్పుడు మాంధాత రాజు 60 వేలదండుతో ఆ పల్లెసీమలకు చేరుకున్నాడు. ఏడు రోజులు మృగాలను వెంటాడాడు. రోహిణి కార్తె ఎండలో ఏడురోజుల పాటు ఇలా వేటాడిన మాంధాతరాజుకి బాగా దాహం వేసింది నీళ్లు ఎక్కడ దొరికిన తెమ్మని ఆయన భటులను ఆదేశించాడు భటులు కొండలు, కోనలు గాలించి నీటి కోసం అన్ని చోట్ల వెతికి చివరకు శివుడు నీరు దాచిన చెట్టును చేరుకున్నారు అక్కడ చెట్టు తొర్రలో ఉన్న కమండలాన్ని తీసుకున్నారు.

ముందు శివుడు సంతాన జలాన్ని సొరకాయ బూరెల్లో పోసాడు అని చెప్పిన కథకుడు ఇప్పుడు ఆ మర్రిచెట్టులో ఉన్నది కమండలమని చెబుతున్నాడు. సొరకాయ బుర్ర రెండు వేరు వేరు. ఆ రెండింటిని ఒకటిగా భావించడం కష్టం. కథ చెబుతున్న ఆవేశంలో ముందు చెప్పింది వెనుక మారిపోవడం జానపద కథలలో తరచు కనిపించే అంశమే. ఈ సందర్భంలో కూడా కథకుడు అలాంటి మార్పును అసంకల్పితంగా చెప్పాడని మనం భావించవచ్చు.

భటులు తీసుకువచ్చిన ఆ కమండలంలోని నీరుని దాహంతో అల్లాడుతున్న ఆ రాజు తాగాడుతాగగానే ఆయన శరీరంలో ఎన్నో ఉత్పతలు జరిగాయి గడగడాఉడికి పోయాడు, గాబరపడ్డాడు. క్రమక్రమంగా ప్రాణం తిరగబట్టింది ఘడియలు ఎన్నో యాతనాలు పడిన ఆ రాజు తన కడుపులో కామినో మోహిని గాలినో తిరుగుతుందని భావించాడు అప్పుడు బటులు తాము మర్రిచెట్టు తొర్రల నుంచి ఆ నీళ్లుతీసుకువచ్చి ఇచ్చామని చెప్పారు. తొమ్మిదో గడియ వచ్చేసరికి ఆ రాజు కూర్చుంటే లేవలేని స్థితికి వచ్చేసాడు. అప్పుడు ఆయన కడుపులో పెరుగుతున్న పిండం తాను 33 కోట్ల ముష్టిబలంతో కడుపులో ఉన్నానని తాను ఎక్కడ పుట్టాలని అడిగాడు. అప్పుడు ఆ రాజు అతల వితల సుతల లోకాలు అండపిండ బ్రహ్మండాలు భూలోక నాగలోకా పాతాళలోకాలు ఎన్నో ఉండగా నువ్వు నా కడుపులో పుట్టడం ఏంటి ఇక నేను బ్రతకను గనుక పొట్టను చీల్చుకొని రమ్మన్నాడు.

దరువు: ఆ... అరుడి మందాతా చక్రవర్తి తండ్రి గర్భం నుండి పేరు పెట్టుకొని
ఓ రి హర హర మహాదేవ ఎలకులా మా రాజు
బాలుడు పుట్టినాంక ఎదురు అవ్వుతున్నదా... పూలు రాని చెట్లన్ని
పూతలు పట్టెనా... కాయలు రాని చెట్లన్ని కాతలు పట్టెనా...
అయ్య చెలరేగి భూతాలు చెట్లే పట్టెనా... ఘనమయ భూతాలు గట్లేపట్టెనా...
మోహిని భూతాలు మేతలు పెట్టెనా.. ఆకాశమంత అగ్రబట్టెనా...
భూదేవి అంటా భూమిలో పట్టెనా, సూర్యచంద్రులు గడ గడ వణికెనా...
శివశక్తి గానాలకు సిగ్గులు పుట్టెనా... ఉస్సె ఉరి అంటా
ఉహ జగిరి... ఎర్ర పాదము ఎందుకుపెట్టెనా (కుడి పాదము పొట్టికి
పెట్టెనా... కాలు వుండకూడదు గనకనేమి) భూదేవి కన్న గనకనేమి
కన్నుగుంట పుడితే గుడ్డి పిండాన్ని, చెవిట గుంట పుడితే చెవిటి పిండాన్ని

నోరు గుంట పుడితే ఎంగిలి పిండాన్ని, కాలుగుంట పుడితే తొంట పిండాన్న అని, ఎన్నుకు ఎడమ పాదం, బొడ్డుకు కుడి పాదం పెట్టి అయ్య

పువ్వులో బొడ్డె విప్పెనా.. బంతువలె బాలుడు బయటపడ్డాడా...
క్యావు క్యావున ఏడవబట్టెనా... తండ్రి మొఖము చూడనుబట్టెన...
మంధాతారాజు పుట్టి గడ్డమీద పడ్డప్పుడు...

మాంధాత తండ్రి గర్భం చీల్చుకొని బయటకు రాక ఎన్నో శుభశకునాలు కనిపించాయి. మోడుపోయిన చెట్లకు కొత్తగా పూతల పూశాయి కాయలు కాసాయి అలా శుభశకునాలు కనిపిస్తుండగా మాంధాత బంతిలా బయటపడ్డాడు కొడుకును చూసినా రాజు అక్కడే పడిపోయాడు బటులు ఆ బాలుడిని తీసుకొని కుసుమగంధికి అప్పగించి అక్కడ జరిగిందంతా చెప్పారు కుసుమగాంధీతో అప్పుడు కుసుమగంధి ఆ బాలునితోనే ఆ రాజుకి అంతక్రియలు చేయించింది బాలుడిని తీసుకొని అయోధ్యనగరం చేరుకుంది.

ఆ బాలుడికి కుసుమగంధి స్నానాలు చేయిస్తూ అల్లారు ముద్దుగా పెంచుకుంది ఎంతో మంది దాసీలు ఆ పిల్లవాడి సేవలో ఉన్నారు అలా తొమ్మిది రోజులు జరిగిన తర్వాత ఆ బాలుడిని గౌడ్ ఇంటికి తీసుకువెళ్ళు ఐదు బోట్లు పెట్టించారు 21 రోజున వేదపండితులైన బ్రాహ్మణులు ఆ బాలుడి జాతకం చూసి అతనికి మాంధాత అని పేరు పెట్టారు.

ఈ ఘట్టంలో కొత్తగా పుట్టిన పిల్లలకు తొమ్మిదో రోజున కోమటి ఇంటికో గౌడ్

ఇంటికో తీసుకువెళ్లి బొట్లు పెట్టించాలనే జానపద ఆచారం కనిపిస్తుంది అలాగే 21వ నాడు పురుడు పుణ్యాలు చేసి జాతకర్మ చేసి వేదపండితులతో జాతకనుసారం పేరు సూచించడం ఆశీర్వాదాలు పొందడం అనే శిష్ట సంప్రదాయం కూడా కనిపిస్తుంది. జానపదులు తమదైన ఆచార్య సాంప్రదాయాలు కలవారే అయినప్పటికీ సమాజంలో అగ్రవర్ణాల వారు పాటించే సంప్రదాయాలు వాళ్లు ప్రభావితులు అవుతూ ఉంటారు.

ఇది సాంస్కృతికరణంలో ఒక భాగమని మనం గమనించవచ్చు కుసుమగంధి మాందాతను అల్లారు ముద్దుగా పెంచుతున్నది సంవత్సరం నిండగా ఆ బాలుడు అడుగులు వేయడం తలుపు గొల్లాలు పెట్టు కోవడం వంటివి చేస్తూ కుసుమగంధిని అమ్మ అని పిలవడం కూడా ప్రారంభించాడు. బాలుడైన మాంధాత మాట్లాడుతుంటే ముత్యాలు రాలుతున్నట్లే ఉండేది ఆ బాలుడి చక్కదనం సూర్యచంద్రుల కాంతితో కోటి దీపాల వెలుగుల ఉండేది ఆ బాలుడి నాలుకపై నక్షత్రం ఉంది కుసుమగంది పెంపకంలో బాల మాంధాత పెరగసాగాడు ఆ రాజ్యం 72 దేవపురుజులు 32 మూలబురుజులు ఉన్న 320 గ్రామాలతో కాశి దాకా పట్నాలతో విస్తరించింది ఆ నిర్వహణను బ్రాహ్మణులు చూసుకుంటున్నారు. ఇలా బాలుడు ఐదు ఏళ్ళుగా మారే వరకు సాగింది అప్పుడు బ్రాహ్మణులు బాల మాంధాతకు చదువులు నేర్పడం ఆరంభించారు. 4 వేదాలు ఆరు సంవత్సరాలు 18 పురాణాలు భుగోళాది శాస్త్రాలు అతడికి నేర్పించారు.

బాల మాందాత సంవత్సరం చదివే చదువును నెలలో చదివేస్తున్నాడు రాత్రంతా చదువుకొని పొద్దంతా పడుకునేవాడు మంత్రులు సేనాధిపతులు సామంతులు అతనికి కత్రవిద్యను బాణవిద్యను బల్లెంమిద్దెను నేర్పారు మాంధాత బాణం వదిలితే అది మూడు లోకాలు 14 భువనాలు దాటేవి ఇలా అన్ని విద్యలను నేర్పి 14వ ఏట వచ్చాక మాందాతను కుసుమగంధికి అప్పగించారు.

14 సంవత్సరాలుగా రాజ్యానికి రాజులేడు గనుక మాంధాతకు పట్టాభిషేకం చేయించాలని కుసుమగంధి నిశ్చయించుకొని వేదబ్రాహ్మణుల సహకారంతో కొడుకుకు పట్టాభిషేకం చేయించింది మాంధాత అలా రాజు అయ్యాడు.

మాంధాత 14 సంవత్సరాల పన్నులు లెక్కలు చూడసాగాడు అలా తెల్లవారేదాకా లెక్కలుచూసిన మాంధాత పడుకొని ఉండగా కిటికీ నుంచి తెల్లవారు సూర్యకిరణాలు మాంధాతకు సోకాయి అప్పటిదాకా పగలను చూడని మాంధాత తనను ఎవరో కొట్టారని భావించాడు ఆ సూర్యకిరణాలు వేడికి అల్లాడాడు పిడబుబ్బ లేచాడు అప్పుడు సామంతులు

అవి సూర్యకిరణాలని చెప్పారు ఆ సూర్యుడు తనను వేధించడాన్ని కోపించిన మాందాత సూర్యుడిపై బాణం సంధించాడు మాంధాత శక్తికి భయపడి సూర్యుడు మబ్బులో దాక్కున్నాడు ఉదయించడం మానుకున్నాడు దానితో లోకాలు అల్లకల్లోలం అయ్యాయి దీన్ని చూసి 33 కోట్లమంది దేవతలు శివునికి వద్దకు చేరి సూర్యుడు లేకపోవడం వలన చీకటి అయిందని సూర్యుడు ఎక్కడ ఉన్నాడో తెలియడం లేదని శివుడికి చెప్పుకున్నారు అప్పుడు శివుడు 33 కోట్ల ముష్టిబలంతో మాంధాత పుట్టాడని అతనికి భయపడి సూర్యుడు దాక్కున్నాడని వారికి వివరించాడు మాంధాతను కట్టిపడేసే వాడు ఎవరైనా ముందుకు వస్తే సూర్యుణ్ణి తీసుకు వస్తానని హామీ ఇచ్చాడు.

33 కోట్లదేవతలు మాంధాతను బంధించాలని మేఘరథాలు లక్కరథాలపై అయోధ్యనగరం చేరుకున్నారు ఆ దాడి గురించి సేనాధిపతి మాందాతకు చెప్పారు మాంధాత ఒకే బాణంతో ఆ 33 కోట్ల దేవతలను బంధించాడు వాళ్ల వీపులకు డమడమలు కట్టి వాళ్ళ మీదగా నడిచి పోయి సూర్యుడుని పట్టుకోడానికి బయలుదేరాడు అప్పుడు దేవతలు తమను రక్షించమని శివుని కోరుకున్నారు శివుడు బ్రాహ్మణ వేషంతో మాంధాత వద్దకు వచ్చి ఇలా ఎందుకు జరుగుతుందని ప్రశ్నించాడు అప్పుడు మాంధాత వారు తమపై యుద్ధానికి వచ్చారని అందుకే బంధించానని సూర్యుని పట్టుకుంటానని చెప్పాడు వారిని వదిలి పెడితే తాను సూర్యుని పట్టిస్తానని శివుడు మాట ఇచ్చాడు ఆ మాట ప్రకారం మాంధాత దేవతలను వదిలి పెట్టాడు.

మాంధాత సూర్యుని చూపించమన్నప్పుడు శివుడు అతని కోమగిరి పట్నం వెళ్ళమన్నాడు కోమగిరి పట్టణానికి రాజు సోమశిల మహారాజు ఆ మహారాజు కోటి విఙ్ఞాలు చేయగా ఆయనకు యఙ్ఞంగుండం నుంచి హేమలంగి అనే కూతురు కలిగింది యుక్త వయసుకు వచ్చిన ఆమెకు ఎందరి చిత్రపటాన్ని చూసిన వారెవరు ఆమెకు నచ్చలేదు అప్పుడు సోమశిల రాజు పచ్చటి గుమ్మంలో గోపురాలు కట్టి గోపురం మీద హనుమంతుని జండా పెట్టి ఏనుగులను ఏడు అడుగులు జరిపి ఏనుగు కోరలు విడిచిన వాడికి తమ కుమార్తెకు ఇచ్చి వివాహం చేస్తానని ప్రకటించాడు ఆ ప్రకటన పత్రిక శివునికి చేరింది శివుడు ఆ స్వయం పత్రికను మాందాతకు ఇచ్చాడు ఇది నాకు లెక్కన అని భావించిన మాంధాత పెద్దదండుతో హెూమాగిరి పట్టణం చేరుకున్నాడు.

మాంధాత తలుచుకుంటే ఏదైనా సాధిస్తాడు ఇతనీ గర్వాన్నీ ఎలాగైనా దించాలి అని శివుడు భావించాడు ఏనుగుని భూదేవికి అతికించారు దాంతో మాంధాత ఎంత

ప్రయత్నం చేసినా ఆ ఏనుగు చింతాకు మందంకూడా కదలలేదు. అన్నం ఆహారాలు లేకుండా ఏనుగును కదిలించేందుకు ప్రయత్నం చేస్తున్న మాంధాత బలం ఏడో నాటికి సగం దిగిపోయింది. అప్పుడు శివుడు జరిగింది చాలని తలుచుకున్నాక మాంధాత ప్రయత్నాలు ఫలించడం ప్రారంభించాయి అప్పుడు మాంధాత ఆ ఏనుగుని కదిలించి దాని కోరలు విరిచి హిమలాంగిని గెలుచుకున్నాడు.

హెూమాగిరి పట్టణంలో పెద్దలందరూ వచ్చి వధువువరులను ఇద్దరు ఒకరి ఒకరు తగిన వారిని ఆశీర్వదించారు పందిట్ల జలకలు ఆడించారు ఒళ్లంతా పసుపు పూసి వారిని పెండ్లికి సిద్ధం చేశారు. బ్రాహ్మణులు వేదమంత్రాలు మధ్య 33 కోట్లదేవతల సమక్షాన హిమలాంగి మాంధాతల వివాహం జరిగింది శంకరుని దోషం మేరకు ఆ దంపతులిద్దరూ నాలుగు సంవత్సరాల పాటు హెూమగిరి పట్టణంలో కాపురం ఉన్నారు. రెండు సంవత్సరాలయిన తర్వాత వారికి అంబరీష్యుడు జన్మించాడు బార్యని కుమారుని తీసుకొని మాంధాత మళ్ళీ అయోధ్య నగరాన్ని చేరుకున్నాడు.

అయోధ్య నగరానికి చేరిన మాంధాత బ్రాహ్మణ వేషంలో ఉన్న శివునితో సూర్యుని పట్టిస్తానన్నావు. వారు ఎక్కడ అని అడిగాడు .అప్పుడు సూర్యుని పట్టిస్తానని ఆ సూర్యుని తనకే ఇచ్చేయాలని కోరాడు మాంధాత సరే అన్నాడు. అనగా శివుడు తన జోలె నుంచి సూర్యుని తీసి ఆకాశంలోకి వదిలిపెట్టాడు అప్పుడు మాంధాత బాణం సంధించి తన మెడలోని సర్పాన్ని సూర్యునిపైకి విసిరాడు అప్పుడు దేవతలు వచ్చి ఆ సర్పం సూర్యుని మింగితే లోకాలు నాశనం అవుతాయని సూర్యగ్రహణం చంద్ర గ్రహణం నాడు పాము సూర్యుని చంద్రుని కొంత మింగుతుంది అని చెప్పి మాంధాతను పొగిడి సూర్యున్ని విడిపించుకున్నారు.

అప్పుడు శివుడు నువ్వు బాగా బలవంతుడివి అందరినీ గెలిచిన వాడివి ఒక ఆడపిల్లతో యుద్ధం చేయగలుగుతావా అని ప్రశ్నించాడు ఆమె ఎవరని మాంధాత ప్రశ్నించాక మతిమయోగ పట్నంలో ఇనుప గొలుసులతో కట్టేసి ఉన్న అమ్మవారు ఉందని ఆమె పేరు నాంచారి అని చెప్పాడు. మద్య చెక్కతో చెక్కబొమ్మను చేయించి పన్నీటి తోటి జలకం చేసి కొత్త దుస్తులు కట్టించి ఏనుగు కాలుకి కట్టి కొత్త సున్నం కారంపొడి చల్లుకుంటూ చింతపర్కేతో మర్దిస్తే నాంచారి వస్తుందని చెప్పాడు మాంధాత అలా చేసే సరికి మతిమయోగ పట్నంలోని నాంచారి శరీరంలో మంటలు పుట్టాయి.

ఎంతో కోపంతో భయంకర రూపంతో నాంచారి అయోధ్యనగరానికి బయలుదేరింది. అయోధ్యలో మాంధాతకు నాంచారికి మాటలు విద్యం జరిగింది అప్పుడు మాంధాత ఆమెకు తన వైభవాన్ని ప్రతాపాన్ని వివరించి ఆమెపై దాడికి దిగాడు మాంధాత దాడికి తట్టుకో లేక నాంచారి యుద్ధం వదిలి అయోధ్యనగరం నుంచి బయలుదేరింది. ఊరు బయట అదింబోట్లు అవతారం ధరించి మళ్లీ మాంధాత వద్దకు వచ్చింది.

అదింబోట్లు అవతారంలో ఉన్న నాంచారి మాంధాతను జూదం ఆడడానికి ఆహ్వానించింది ముందు కాదనీ మాంధాత జూదానికి అంగీకరించాడు మొదటి రెండు ఆటలో మాందాత గెలిచాడు మూడో ఆటలో ఓడిపోయి రాజ్యాన్ని కోల్పోయాడు. నాలుగవ పందెంలో భార్య విమలాంగిని రాజ్యాన్ని కోల్పోయాడు. తను ఓడిపోవడం గ్రహించి మాంధాత రాజ్యాన్ని అదింబోట్లకు వదిలి భార్యపిల్లలతో కాశీకి బయలుదేరాడు.

ఏడు పగళ్ళు ఏడు రాత్రులు వారు అలా నడవగా హేమలాంగీదేవి అంబరీషుడు ముందుకు సాగలేని స్థితికి వచ్చింది అంబరీషుడు ఆకలికి తట్టుకోలేకపోయాడు. ఎదురుగా కనిపించిన చేనులో దోసకాయలు కోససాగాడు. అప్పుడు నాంచారి కాపుల లక్ష్మమ్మ వేషంలో అక్కడికి వచ్చి అది తన చేనునని మాంధాత దొంగతనం చేస్తున్నాడని అతనికి చెట్టుకు కట్టేసి బాగా కొట్టింది. అక్కడికి వచ్చిన అంబరీషుడిని కూడా బంధించింది మాంధాత కుమారులు తండ్రిని విడిపించారు.

మాంధాత కుటుంబంతో ముందుకు సాగసాగాడు దారిలో నేరేడు చెట్టు కనిపించాయి. పిల్లలు ఆకలి అని చెప్పగా మాంధాత చెట్టు ఎక్కి అల్లనేరేడ్లు కోసి కిందికి పడవేయసాగాడు. నాంచారి చెట్టు మొదట్లో కూర్చుని ఆమె పడ్డ పండ్లన్నీ చప్పరించి విత్తనాలను మాత్రమే కిందికి వదిలింది. కిందికి దిగిన మాంధాత ఆ విత్తనాలతో పంట పండిద్దాం అని భార్యా పిల్లలకు చెప్పాడు. అప్పుడు నాంచారి మూతరాసు వేషంలో వచ్చి మాంధాతను బంధించి కొట్టింది కుల పంచాయతీ పెడతానని నాంచారి వెళ్లగా మాంధాత కట్లు వదిలించుకొని దూరం వెళ్లిపోయాడు.

మాంధాత భార్య పిల్లలతో ముందుకు వెళుతుంటే దారిలో గొల్లవారు గొర్రెలు మందని తీసుకుని రావడం చూసి మాంసము తినడానికి ఒక గొర్రెపిల్లను పట్టుకొని దాని కోశాడు. ఆ మాంసంని ఉడక పెట్టడానికి ఒక చాకలిని చేరి అతని కుండలో మాంసమును వండసాగాడు. అప్పుడు నాంచారి చాకలి ఈదమ్మ వేషంలో వచ్చి మాంధాతను పట్టుకొని కొట్టింది. తన గొర్రె వండుకున్నాడు కాబట్టి కాకుల బర్రెల కప్పల ఏనుగుల మాంసము

తెచ్చి ఇచ్చేవరకు వదిలి పెట్టనని చెప్పింది దూరంగా ఏడు గుడిసెలు వేసి వాటిలో ఒక్కొక్కదానిలో ఒకటిగా ఏనుగు కప్పలు బర్రెల మాంసం మొదలైనవి దాచి పెట్టింది. ఒక గుడిసెలో మాంధాతను ఉంచింది. మాంధాత ఆ గుడిసెలో ఉన్న మాంసంలను తీసుకు వస్తుండగా ఆ గుడిసెలు గాలిదుమారానికి కొట్టుకు పోయాయి. మాంధాత తన కొడుకులని వేరు పోమ్మని చెప్పి తాను కోటిలింగపట్నం చేరుకున్నాడు.

కోటి లింగాలలో కోనయ్య అనే షావుకారు ఒకగుడ్డుతో వ్యాపారం మొదలు పెట్టి లక్షాధికారిగా మారి ఉన్నాడు.మాంధాత ఆ షావుకారు వద్దకు వచ్చి ఉప్పుపప్పు బియ్యం మిరపకాయలు తీసుకున్నాడు.ఈ ఘట్టాన్ని వర్ణిస్తూ ఒగ్గుకథ కారుడు షావుకారి అని ఉర్దూ పదాన్ని షాప్ అనే ఆంగ్లా పదాన్ని ప్రయోగించాడు. జానపద గాథలు లిఖితలు కాదు కాబట్టి వాటికి ఒక నిర్దిష్టమైన పాఠ్యం ఉండదు. మౌఖికంగా ఒకరి నుంచి మరొకరు నేర్చుకుంటారు. కాబట్టి దాన్ని పాఠ్య రూపం మారుతూ వస్తుంది అలా భౌతిక ప్రచారంలో ఉన్నప్పుడు కథకుని చుట్టూ ఉన్న సమాజపు భాష ప్రయోగం ఆ కథలో కనిపిస్తుంది. ఈ షావుకారి షాపు అను పదాలు అలా వచ్చి చేరినవేనని మనం భావించవచ్చు.

ఈ కథకు వస్తే కోనయ్య వద్ద పప్పు ఉప్పు వంటి సామాగ్రి తీసుకున్న మాంధాత వాటికి డబ్బులు ఇవ్వ లేకపోయాడు. కాయకష్టం చేసి చమట ఒడిచి ఆ బాకీ తీరుస్తానని చెప్పాడు. ఆ డబ్బు వచ్చేదాకా విమాలాంగీదేవిని తన వద్దకు వదిలేయమని షావుకారు షరతును విధించాడు. అందుకు అంగీకరించిన మాంధాత పట్నంలో ఏదైనా పని చేసుకుందామని ముష్కుంద అంబరీషలతో బయలుదేరాడు. దారిలో ఒక నది వచ్చింది. పిల్లలను నది దాటించినాక మాంధాత తాను మునిగిపోయాడు. అలా మునిగిన మాంధాతను అమ్మవారు మతిమాయ పట్నంలో దాచిపెట్టింది.

ఈ కథ భాగం పురాణాలలోని హరిచంద్రుని కథను గుర్తుకు తెస్తుంది. చక్రవర్తిగా ఉన్న వ్యక్తి అనేక కష్టాలు పడుతూ భార్య బిడ్డలను ఇతరుల దాస్యానికి వదిలివేయడం అన్న అంశము ఈ రెండు కథలలో సామాన్యంగా కనిపించే అంశం.

హిమాలాంగీదేవి షావుకారి ఇంట్లో అనేక కష్టాలు పడ్డది. షావుకారి హిమాలాంగీదేవిపై కన్ను వేశాడు. అతని నుంచి తప్పించుకోవడానికి నాలుగు రోజులు కేదారేశ్వర నోము చేసి ఆ పై నాలుగు రోజులకు అంగీకరిస్తానని చెప్పింది. ఆమెపై ఆశపడ్డ షావుకారు సరే అన్నాడు. హిమాలాంగీదేవి ఆకులు పోకలు ఖర్జూర పండ్లు మణిమాణిక్యాలతో ప్రజలకు వాయినాలు ఇస్తున్నది. దానితో షావుకారి సంపద క్షీణించింది.

కథాఘట్టంలో షావుకారి బిల్డింగులు క్వింటాల కొద్దీ బంగారం అనే పదప్రయోగాలలో బిల్డింగ్ క్వింటాల్ అని ఆంగ్ల పదాలు కనిపిస్తున్నాయి. పైన చెప్పిన కారణంగానే కథా కారుడు అసంకల్పితంగా ఆంగ్లపదాలను ప్రయోగించడాన్ని మనం గ్రహించవచ్చు.

నోము చివరి రోజున హిమాలంగిదేవి ఆ నోము పూర్తి అయితే షావుకారిని చేరుకోవాలని గ్రహించి అలా అయితే తనను అంగభంగం కలుగుతుందని భయపడి తన భర్తకు తప్ప ఎవరు తెరవలేని డక్కన్ ఉన్న బంగారు సందుకలో కూర్చొని మూత వేసుకున్నది. ఇక్కడ డక్కన్ అనే ఉర్దూపద ప్రయోగాన్ని మనం చూడవచ్చు. 12 సంవత్సరాలుగా రాజులేని అయోధ్యనగరంలో ఎవరో ఒకరిని రాజుగా నియమించుకోవాలని ఒక ఏనుగుపై జగదాంబను ప్రతిష్టపించి దాని తొండానికి ఒక పూలమాలను ఇచ్చి వదిలి వేస్తారు. ఆ ఏనుగు తిరుగుతూ తిరుగుతూ మతిమయోగ పట్టణానికి వచ్చి అక్కడ ఉన్న మాంధాత మెడలో దండవేసి అతని రాజుగా చేర్చుకుంది. మాంధాత అలామళ్లీ అయోధ్యకు రాజు అయ్యాడు.

రాజైన మాంధాత తన భార్య పిల్లలు ఎక్కడ ఉన్నారో తెలుసుకోవడానికి పాత బంగారం తెచ్చి ఇచ్చిన వారికి రెండింతల కొత్తబంగారం ఇస్తానని ప్రకటించినాడు దానితో అందరూ అలా పాత బంగారాన్ని తెచ్చి ఇచ్చి కొత్త బంగారం తీసుకెళ్లసాగారు. హిమాలాంగీదేవిని తాకట్టుగా పెట్టుకున్న షావుకారు తన దగ్గర వేరే ఏ బంగారం లేనందున హిమాలాంగీదేవి దాక్కున్న బంగారు సందుకను తీసుకొని బయలుదేరాడు. అలా వెళుతూ దారిలో ముష్కుందా అంబరీషులు ఉన్న గొడ్డు పాతరాయుని ఇంటికి చేరాడు.

బొడ్డు పాతరాయుని ఇంట్ల ఆ సందుకుని పెట్టి దానిని కాపాడమని కోమటికోరాడు. ఆ రాత్రి ఆ సందుక దగ్గర కూర్చున్న ముష్కుందా అంబరీషులు తమ కుటుంబం విడిపోయిన విధానాన్ని చెప్పుకుంటుండగా బంగారు సందుకలు ఉన్న విమాలాంగీదేవి విన్నది. మర్నాడు షావుకారి ఆ బంగారు సందుకను ముష్కుందా అంబరీషులుని తీసుకొని అయోధ్యనగరం చేరాడు. ఆ బంగారు సందుకని తూకం వేశారు. ఆ సందుకలో ఏముందో చూడాలని ఎంతో ప్రయత్నం చేసిన ఏడు పగళ్ళు ఏడు రాత్రులు కష్టపడ్డ మాంధాత వచ్చి సందుకపై చేయి పెట్టగానే దాని గొల్లేం విడిపోయింది.

ఈ ఘట్టంలో ఓపెన్ అనే ఆంగ్లపదం దక్కన్, పహిల్వాన్ అనే ఉర్దూ పదాలు గన్ అనే ఆంగ్లపదం ప్రయోగించబడ్డాయి. ఈ పదప్రయోగాలు ముందు చెప్పుకున్న కారణాల తోటే కథకుడు అసంకల్పితంగా ప్రయోగించినట్లు మనము భావించాలి.

మాంధాత చెయ్యి వేయగానే సందుక మూత తెరుచుకోవడం హిమాలాంగిదేవి బయటకు రావడం చూసి మాంధాత ఎంత చిత్రం.... ఎంత చిత్రం అన్నాడు. నాంచారి అక్కడికి వచ్చి నువ్వు చిత్ర– విచిత్రాన్ని అంగీకరించావు. అని అంటే మాంధాత అవును అన్నాడు. గతంలో భార్య పిల్లలతో రాజ్యంలో ఉన్నప్పుడు అహంకరించావు అని నాంచారి గుర్తు చేసింది. అప్పుడు మాంధాత నాంచారి మహిమ, మాయ తెలుసుకోలేకపోయానని అనరాని మాటలు అన్నానని అందుకు తనని మన్నించమని వేడుకున్నాడు. ఆమె దేవత అని అంగీకరించాడు. అందుకు నాంచారి తాను లోకమాతను అని చెప్పింది.

ఇవ్వాళ నాకు పండుగలు పబ్బాలు చేయాలంటే, లగ్గం చెయ్యాలంటే తెల్ల జొన్నతోని కొలు రాయాలి. నీ ఆకారం పెద్దగా ఉన్నది కాబట్టి ఈత వృక్షానికి నీకు లగ్గం చెయ్యాలే. నీకు బలిచ్చే మేకపోతును మూడుసార్లు స్నానం చెయ్యాలే నా భక్తులు. జరదలు (పూజారి) పట్టేవాడు. మూడు సార్లు స్నానం చెయ్యాలె... ఏడు రోజుల పండుగా వెతికి కొలవ వలెనా... మాంధాత తోని ఎండు గుళ్ళ, పొడు గుళ్ల, కట్టించుకొని అమ్మవారు కలవిలి నాంచారి ఈత వృక్షానికి అమ్మవారికి కళ్యాణం ఉంటాది... ఈ చరిత్ర విన్నవారికి గాని, ఆట చూసినవారికి కాని, ఆడినవారికి గాని పుణ్యం ఉంటది.

అని మాంధాతకు ఆదేశం ఇచ్చింది. ఆ ప్రకారంగా నాంచారి పూజలు చేసే విధానం ఏర్పడింది.

1. ఈ కథను విశ్లేషించుకోగా ఇందులో పురాణ గాథలలోని హరిచంద్రుని వృత్తత్వం స్మరణకు వస్తుంది.
2. దేవతలు మానవులు పరస్పరం మాట్లాడుకోవడం పంతాలకు పోవడం అనే విషయం జానపద కథ సాధారణంగా కనిపిస్తుంది.
3. నాంచారి అనే వేషాలు ధరించి మాంధాతను సాధించడం అన్న విషయంలో అద్భుత రసం కనిపిస్తుంది.
4. కథాకారుడు కథను చెప్పే సమయంలో తాను ముందు చెప్పిన వర్ణనను మరలా మార్చి చెప్పడం ఈ కథలో కనిపిస్తుంది. మొదటగా బంగారు కోనేరుగ చెప్పిన దానిని తర్వాత బావిగా చెప్పడం, ముందు సొరకాయగా చెప్పిన దానిని తర్వాత కమండలాలుగా చెప్పడం ఇందుకు ఉదాహరణలు.
5. కథను చెబుతున్న క్రమంలో కథకుడు మూలంలో సాధ్యపడని ఇతర భాష పదాలను ప్రయోగించడం ఈ కథలో మనం గమనించవచ్చు. దక్కన్, పహిల్వాన్, షావుకారు

వంటి ఉర్దూ పదాలు. గన్, ఓపెన్, క్వింటాల్ వంటి ఆంగ్ల పదాలను ప్రయోగించడం ఇందుకు ఉదాహరణలు.

6. జానపద కథలు కుల ఆచారాలను పాటిస్తూనే జాతకర్మ నామకరణం వివాహ విధానం శిష్ట సంప్రదాయ ధర్మలను కూడా వర్ణించడం కథలో మనం గమనించవచ్చు.
7. మాంధాతను పలు వేషాలలో లేదా అవతారాలలో వచ్చి నాంచారి వేధించే గట్టాలలో మాంధాతను బంధించిన ఆమె కుల పంచాయతీ పిలుస్తానని ఆమె చెప్పడం జానపదాల వివాద పరిష్కార వ్యవస్థను వారు ఎంతగా పాటిస్తారో తెలియజేస్తుంది.
8. పురాణం గాథలలో మాంధాత కథలో మాంధాత యువనష్యుడి పుత్రుడు గాక ఈ జానపద కథలు ఆయన యవనేశుని పుత్రునిగా వర్ణించడం జరిగింది. అలాగే పురాణం గాథలలో మాంధాత బిందుమతి దేవిని వివాహం మాడగా ఈ కథలో యజ్ఞం వలన ఉద్భవించిన హిమాలంగిదేవిని వివాహం ఆడినట్లు మార్చడం జరిగింది.
9. పురాణాలలోని మాంధాత కథలో యువనాశ్యుడి పుత్రకామేష్టి యజ్ఞం చేసి ఆ జలాన్ని తాగి గర్భం ధరించినట్లు వర్ణించబడగా ఈ జానపద కథలలో సొరకాయ బుర్రలోని మంత్ర జలాన్ని తాగడం వలన గర్భాన్ని ధరించినట్లు వర్ణించడం జరిగింది.
10. ఈ జానపద కథలలో శిశువు అయిన మాంధాతను తల్లి కుసుమ గాంధీదేవి తొమ్మిది రోజుల వయస్సు ఉన్న మంధాతను కోమటి ఇంటికో గౌడ్ ఇంటికి తీసుకువెళ్లి అక్కడ ఐదు బొట్లు పెట్టించడం అన్న అంశం ఇక్ష్వాకు వంశ క్షత్రియుడు అయిన యువనష్యుని కుటుంబం పాటించే సంప్రదాయమని మనం గ్రహించవచ్చు.

జానపదుడైన ఒగ్గు కళాకారుడు తాను పాటించే సాంప్రదాయాన్ని ఈ కథలో రాజకుటుంబం చేత పాటింప చేశాడని మనం గమనించవచ్చు.

## 2.6. ఒగ్గు కథల్లో స్త్రీ పాత్ర చిత్రణ

త్రిగుణాత్మకమైన ప్రకృతియే స్త్రీ. స్త్రీ శబ్దంలో సకార, స్త్రీ త కార, రకారాలున్నాయి. స కారం సత్వగుణానికి, త కారం తమోగుణానికి, ర కారం రజోగుణానికి చిహ్నాలు. సత్య గుణలక్షమైన మృదుత్వం, అణకువ, సహనశీలత. తమోగుణ లక్షణాలైన సిగ్గు, భయం, మందత్వం స్త్రీలలో ఎక్కువగా ఉంటాయి. రజోగుణలక్షణాలైన ధైర్యం, సాహసం, స్వతంత్రతలు సూక్ష్మరూపంగా ఉంటాయి.

### 1. వీర రాజమ్మ

సంఘంలో స్త్రీకి మగవారికున్నంత గౌరవం, స్వేచ్ఛ, అధికారం లేవు. పురుషుని ఆశ్రయం, అదుపాజ్ఞలతో ఉన్నపుడే స్త్రీ జీవితం బంగారుబాట. స్త్రీ గడప దాటితే రక్షణ లేదు. కడగండ్ల పాలవుతుంది. మగవారి కామాంధకారానికి బలవుతుంది, ఇందుకు వీరరాజమ్మ, ఎరుకల నాంచారి జీవితాలే ప్రత్యక్ష సాక్ష్యాలు. ఇంటి నుంచి అత్తచేత వెళ్లగొట్టబడిన వీరరాజమ్మ దైవదుర్విపాకం వల్ల దొంగల పాలపడుతుంది. వారంతా ఆమెను మానభంగం చేయబోతారు. "మానభంగం పొందలేక నా తండ్రి, నిన్ను అర్పించేను" అని కన్న కొడుకునే దొంగలకర్పించింది. వారితో పోరాడి తాను మరణిస్తుంది.

గొడ్రాలికి స్త్రీలోకంలోనేకాక, సంఘంలో కూడా గౌరవాదరాలు లేవు. గొడ్రాలితనం స్త్రీకి తీరని దుఃఖాన్ని కల్గిస్తుంది. బిడ్డలు లేని స్త్రీని గొడ్రాలు అని సంఘం ఈసడించుకొంటుంది. స్త్రీ ఎంత సుందరి అయినా సుకుమారి అయినా, విద్యావతి అయినా గొడ్రాలి తనం ఆమె జీవితానికి మాయని మచ్చ. పిల్లలు లేని ఇంటిని యిరుగు పొరుగువారు 'దీపంబు లేనిల్లు ఎట్టులుండునో ఓయమ్మ చంద్రుడులేని ఆకాశమట్లు మాయమ్మ! తామరపువ్వులు లేణి చెరువట్లు మాయమ్మ! పెద్దలు లేనట్టి యిల్లెట్టు యిండ ఓయమ్మా! ఐదవతనములేని యతివ యెట్లుండూ సూరమ్మ! బిడ్డలు లేని యిల్లు అట్టులేయుండు మాయమ్మ'(వీరరాజమ్మ కథ) అని పరిహసిస్తారు. సంఘంలో స్త్రీ విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం కాని, విద్యవతి అయిన స్త్రీని విశిష్టంగా పరిగణించడంగాని, సంఘంలో ఉన్నట్లు కన్పించదు. గేయగాథల్లో ఒకటి, రెండుచోట్ల మాత్రం ఆడపిల్లలకు విద్యాభ్యాసం చేయించినట్లు చెప్పబడింది.

'కులశీలములు కలిగి సద్బుద్ధి కలిగి మాయమ్మ
చదువు సంధ్యలు కలిగి చక్కనైనట్టి
కన్యాను ఎంచుకొని నే పెండ్లి చేసుకొందును. (వీరరాజమ్మకథ)

అనే గేయ కథాభాగాన్ని బట్టి విద్యావతి అయిన కన్యకు ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పవచ్చు. జానపద సంఘంలో స్త్రీలు స్వేచ్ఛావాతావరణంలో పెరగలేదు. స్వేచ్ఛను అనుభవించలేదు. బాల్యంలో తల్లిదండ్రులచేత, యౌవనంలో భర్త చేత, వృద్ధాప్యంలో కొడుకు చేత పోషింపబడినారు. బాల్య వివాహాలు అమలులో ఉండేవి కాబట్టి, స్త్రీ విద్యకు అంత ప్రాముఖ్య మివ్వలేదు. మధ్య తరగతి స్త్రీలు యింటి పనులలో ఎక్కువ కాలాన్ని గడిపేవారు. ఉన్నత కుటుంబాల స్త్రీలు రాణివాసంలో జీవించేవారు. అందువల్ల వారికి విద్యా భ్యాసం చేసే అవకాశంగాని, అవసరంగాని ఉండేవి కాదు.

**2. ఎరుకల నాంచారి**

ఎరుక చెప్పడానికి ఒంటరిగా వెళ్తున్న నాంచారి రెడ్డి కొడుకు చేత బలవంతం చేయబడుతుంది, సమయస్ఫూర్తితో తప్పించుకొంటుంది. కాని భర్త నాంచారిని అనుమానించి చంపేస్తాడు. (ఎరుకల నాంచారి కథలో) ఇలాంటి పరిస్థితుల్లో 'ఆడదై పుట్టేకంటే అడవిలో మానై పుట్టటం మేలని' తలచి నిరాశపడి తలవంచడం నేనే స్త్రీనైపుట్టి ఉంటే స్త్రీ తనకు ఆటవస్తువు అనుకునే పురుషుడి భావానికి వ్యతిరేకంగా, విప్లవం లేవదీసే వాణ్ణి' అన్న గాంధీజీ వాక్యాలు స్త్రీ హృదయాంతరాలల్లోంచి అగ్నిజ్వాలలై ప్రజ్వరిల్లాలి.

**3. బాలనాగమ్మ**

స్త్రీకి శీలమే ప్రాణం. పగవాని చెరలో ఉండికాని, ఇల్లువదలి అడవులు, పర్వతాలు తిరిగి, అష్టకష్టాలు పడి ఇల్లుచేరిన స్త్రీ, ఎంతటి పవిత్రురాలైన కూడా సంఘం పరీక్షలకు నిలబెడుతుంది. రామాయణంలో సీతాదేవి వలె శీల నిరూపణ చేయవలసిందే లేకుంటే భర్త స్వీకరించడు. ఇందుకు బాలనాగమ్మ, సుందరి వృత్తాంతాలు నిదర్శనాలు. బాలవర్ధిరాజు, బాలనాగమ్మను ఫకీరు చెరనుంచి విముక్తురాల్ని చేస్తాడు. కార్యవర్ధి రాజు "మీ తల్లి బాలనాగమ్మ ఫకీరు చేతుల్లో వ్రతము చెడ్డదేమో దానిని నేను ఏలనంటాడు". అంతట బాలుడు సలసల కాగే (కళవెళ లాడే) నూనెలో వేలి ఉంగరమేసి తల్లిని తీయమంటాడు. బాలనాగమ్మ ఆ పరీక్షకు నిలుస్తుంది. కాని కార్యవర్ధి రాజు 'ఫకీరు చెంత ఉండి చెట్ల క్రియలు జెన్ని నేర్చినాదో, ఆకు పసరులు ఎన్ని నేర్చినాదో' అని పరీక్షను తిరస్కరిస్తాడు. అపుడు బాలనాగమ్మ భగభగ మండే గుండంలో దూకి, కట్టినకోక కాలకుండా, పెట్టిన కుంకుమ చెదరకుండా, దేహం బొబ్బలు పొక్కకుండా బయటికి వచ్చి శీల నిరూపణగావిస్తుంది. 'మీ తల్లిని నేను నమ్మితిని నాయనా' అని బాలనాగమ్మను కార్యవర్ధి రాజు పరిగ్రహిస్తాడు.

**4. గంగా వివాహం**

'ఎన్నో తీర్థాలు కుంకి, సకల క్షేత్రాలు మెట్టి, సుందరి తన భర్త పామును మానవునిగా మార్చుకొని తిరిగి వచ్చిన కోడలిని మామ'దేశ దేశములెల్ల తేటగా వెదకి/మనసు కొచ్చిన రాజు మగువ నీవు గోరి/ ఆ రాజుతో గూడి యిటు వచ్చితివి గాని నీ మాటలెల్లను నిజముగా అంటాడు. సుందరి గగనవాణిని ప్రార్థిస్తుంది. ఆకాశవాణి జరిగిన సంగతి వెల్లడించి, సుందరి నిర్దోషి అని నిరూపిస్తుంది.(ధర్మాంగద చరిత్ర – పాము పాట) సంఘంలో స్త్రీ భార్యగా, తల్లిగా, అత్తగా, సోదరిగా, సవితిగా, ఆడపడుచుగా ఇలా

రకరకాలుగా పాత్రలను నిర్వహిస్తూ ఉంటుంది. స్త్రీ జీవితంలో ప్రాధాన్యం కల భాగం దాంపత్య జీవితం, భార్యగానే స్త్రీకి సంఘంలో గౌరవాదరణలున్నాయి. పవిత్రత, బాధ్యత కలిగి ఉంది.

స్త్రీ కులాంతర వివాహం చేసుకోవడాన్ని సంఘం గుర్తిస్తుంది. కులవ్యవస్థ పాదుకున్న సంఘంలో కులాంతర వివాహం చేసుకొంటే ఆ కుటుంబం నవ్వుల పాలవ్వడమే వారిని కులం నుంచి వెలివేస్తారు. ఈ విషయాలను –

'అబల నువ్వెక్కడ నా జంగమెక్కడః నవ్వరా కనుగొన్న నరులెల్ల నిన్ను
చెలియ మన జాలారి జాతి మహా చెడ్డది! వెలివెయ్యరా మన కులమంత గూడి !
వెలివెయ్యడం కాక కులమంత కూడుకొని !
తప్పులెమ్మందురే తగకోటి ధనంబు' (గంగా వివాహము)

సవతి పాత్రకు సంఘంలో మంచి స్థానంలేదు. భార్యగల పురుషునికి తన కూతురి నివ్వడానికి ఏ తల్లీ ఒప్పుకోదు. ఎన్ని సంపదలున్నా సవతి బ్రతుకు దొంగతనం వంటిదనీ, దొప్పక్రింద చేరి దోసిలొగ్గిన రీతిగా ఉంటుందని భావిస్తారు. ఇందుకు 'ఎన్ని భాగ్యములున్న నెన్ని సౌఖ్యములున్న! సవతి మీద బ్రతుకు జెప్పగాదు పదివేలు గలిగిన పదిలక్షలుండిన! సవతి మీదను బ్రతుకు ఆలున్న విభుని వద్ద నాటలు జెల్లవు ! పోరుకు మూలంబు యేరాలి బతుకు దొప్ప క్రిందను చేరి తోసిలొగ్గిన రీతి' (గంగావివాహము) అనే గేయకథా భాగం సాక్ష్యం.

ఈ విధంగా సంఘంలో స్త్రీని గౌరవించడం, అగౌరవించడం వివిధ సందర్భాలపై ఆధారపడి ఉంది. భార్య, తల్లి, సంతానవతి, ముత్తైదువ అయిన స్త్రీలు సంఘంలో గౌరవ పాత్రులౌతున్నారు. గొడ్రాలు, అత్త, సవతి తల్లి, సవతి పాత్ర వహిస్తున్న స్త్రీలకు గౌరవాదరణలు తక్కువగా ఉన్నాయి.

గంగ ప్రార్థన అయిపోయిన తర్వాత గంగ ఘనకు గల కారణాన్ని గురించి ప్రధాన కథకుడు ఇలా చెబుతాడు. "ఈగంగనెందుకు ప్రార్థించాలంటే గంగవల్ల రుతుగా వర్షాలు పడ్తున్నాయ్, హనువుగా పంటలు పండుతున్నాయ్, గంగ కరుణించకపోయినా రుతుగా వర్షాలు పడకపోయినా హనువుగా పంటలు పండకపోయినా ఏగవర్నమెంటైనా ప్రజల కష్టాలు కడతేర్పదు కాబట్టి గంగప్రార్థన అవసరముంది." అని చెప్పి ఆతర్వాత విఘ్నేశ్వరుని ఇలా ప్రార్థిస్తారు.

"ఆది గణాధిపతీ ఆనందామూర్తీ ఆనందామూర్తీ
ఆది గణాధిపతీ ఒకరైన మూలశక్తి
ముందుపూజలు నీకే కదా మూల కిన్నెరలు మ్రోగంగా
ఎలుక వాహన మెక్కితివయ్యా ఎల్లలోకముల నేలితివయ్యా ॥ఆది॥
తొండాముతో నీళ్ళు తెచ్చి తోరంబు బొజ్జ కడిగి
తండ్రి చేత పూజలు గొన్నా స్వామి గణాదిపతీ నీకు మొక్కెదా ॥ఆది॥
భాద్రపద శుద్ధచవితీ భక్తి మీర గొలుతుమయ్యా
నాగవాసులైనా మీకు నమ్మి మ్రొక్కులిడుదుమయ్యా ॥ఆది॥
జాలి చెంబూ నీళ్ళు తెచ్చి జలకములూ చేపింతుమయ్యా
ఇరవయ్యొక్కా పత్రితోను ఇంపుగా పూజింతుమయ్యా ॥ఆది॥
ఊరు చుట్టూ వరిచేన్లూ, ఉండ్రాళ్ళ పాయసమూ
మెత్తటి కుడుములు సప్పిండుండ్రములు అవి నీకు
ఆరగింపుడూ ఆరగింపుడూ ॥ఆది॥
శరణు శరణు మని వేడితివయ్యా
నీదు కరుణ కాశించితిమయ్యా ॥ఆది॥"

ఆ తరువాత ఒక గేయంలో ఈశ్వరుని, భూదేవతను, ఒగ్గువారి కులదేవతలైన మల్లన్న, బీరప్పలను, విద్య నేర్పించిన గురువులను, జన్మనిచ్చిన తల్లిదండ్రులను స్త్రీ దేవత అయిన పోచమ్మను తలుచుకుంటారు.

"హర హర మహాదేవా శంబో శంకరా- శంభోశంకరా శరణయ్య మహాదేవా
ఆదేవి దండాము తల్లి బూదేవి దండాము - తొక్కిన బూదేవతా తోడై ఉండుమా
మొక్కిన బూదేవతా మోక్షము నీమ్మా - మాదేవుడు మల్లయ్యా కులగురువు
బీరయ్యా మోగె రణబేరి యెండి పిల్లన గొయ్య- మోగేటి తాళాము పాదాన గజ్జెలూ
పాదాన గజ్జెలకు పదివేల దండాలు- విద్యాబుద్ధులు నేర్పిన పెద్దలకూ దండాలు తల్లిదండ్రి
పాదాలకూ పదివేల దండాలు- పోచమ్మ దండాము తల్లీ బొడ్రాయిదండాము".

ఈ విధంగా దైవప్రార్థన చేసిన తరువాత తాము తిరిగిన దేశదేశాల పేర్లనుప్రస్తావిస్తారు. తరువాత తాము అప్పుడు కథను చెబుతున్న ఊరిని గురించి, కూడా వివరిస్తారు. ఆ తరువాత తమతో కథను చెప్పిస్తున్న వారి పేర్లను, వారి తల్లిదండ్రుల పేర్లను, వారి వంశ గౌరవాన్ని కీర్తిస్తారు. ఆ తరువాత ప్రధాన కథకుడు కథను

ప్రారంభిస్తాడు. ఇతను కథను చెప్పేటప్పుడు ఎడమ చేతిని ఎడమ చెవి మీద పెట్టు కొని కుడిచేతిని పైకెత్తి కథను చెబుతాడు. ఇతడు కథను వచనంలోనూ గేయరూపం లోనూ చెబుతాడు. గేయంలో చెప్పేటప్పుడు రాగయుక్తంగా చెబుతూ ఉంటే వంతలు" రామరామరామా రామాఒయ్ రామా" అంటూ వంత పాడుతూ ఉంటారు. ప్రధాన కథకుడు వచనంలో కథను చెప్పేటప్పుడు గూడా రాగయుక్తంగానే చెబుతాడు. ఉదాహరణకు బీరప్ప కథను వచనంలో ఇలా మొదలు పెడతాడు.

"గాజులకొండపట్నమేలేటి దొంతిరాజు ఏమంటయున్నాడే, దొంతి మీద దొంతి ఏడు దొంతులు వెట్టంగ ఏడో కొడుకు పుట్టిండు కావట్టి దొంతిరాజని పేరు పెట్టింద్రటా. గాజులకొండ పట్నం పరిపాలిస్తుంటే మరి అమరగన్నెను లగ్గమాడిండటా, వాళ్ళు రాజ్యపరిపాలన జేస్తున్నరమ్మా, వారికి పిల్లలేకపాయే లేకపాయే, పిల్లల్లేని ఇల్లు పీర్లకొట్టమన్నరు బాలల్లేని ఇల్లు బర్లకొట్టమన్నరే అమ్మా, గొలగొల వలపోస్తున్నది అమరగన్నె, అప్పుడు వేదమూర్తుల పిలిచి సంతాముందా లేదాని చూపెట్టగా, మీరు ఆందమైన బాయి తొవ్వాల్నమ్మో, ఆ బాయిలో ఉన్న నీళ్ళతోటి పూజచేస్తే మీకు సంతాన మోతాదని చెప్పవద్దా పెద్దలే రామరామో, ఆలుమొగలు సేతులకు కంకణాలు కట్టుకున్నారు. గడ్డపారలకు కంకణం కట్టినారే, వందమంది వేదమూర్తులతోటి ఆటువంటి బాయికి మూర్తాలు పెట్టించైనా,

పైన చెప్పిన కథలో ప్రధానకథకుడు కామాలు పెట్టిన వరకు కథను చెప్పి చివరి పదం చివరి అక్షరాన్ని దీర్ఘంగా రాగం తీస్తూ చెబుతాడు. వంతలు తమ వాద్యాలైన డప్పు గజ్జలు తాళాలు మొదలైన వాటిని తగిన మోతాదులో వాయిస్తూ ఆఉ. అని కొంచెం సేపు రాగం తీస్తారు. ప్రధానకథకుడు వచనంలో ఇలా కథను చెప్పేటప్పుడు ఒక్కొక్కసారి వంతలందరూ కలిసి ఒక్కసారిగా వాద్యాలను వాయిస్తూ ఓఉ.. అని ఒక సారి, ఏఉ. అని మరొకసారి అని గట్టిగా గోల చేస్తున్నట్లుగా రాగం తీస్తారు. ఒక్కొక్కసారి వంతలు "రామరామో" అని వంత పలుకుతారు. ఈవిధంగా వంతలు వంత పలుకుతూ ఉంటే కథకుడు వచనంలో కథను చెబుతాడు. కథకుడు గేయరూపంలో కథను చెప్పేటప్పుడు చెప్పే పద్ధతి వేరుగా ఉంటుంది. ఉదాహరణకు కింది గేయభాగాన్ని తీసుకుందాం.

"చల్ బాయి దోడా వట్టిరీ రామన్నరామా –ముత్తాలకాబాయీ మూలనందమమ్మా
పౌడాలకాబాయీ పాకులందమేమీ"

పైగేయంలో మొదటి పాదాన్ని కథకుడు మంచి ఊపు మీద పాడతాడు. వంతలు దానికి తగినట్లుగా వాద్యాలను వాయిస్తూ అదే ఊపు మీద ఆపాదాన్ని తిరిగి పాడుతారు.

కథకుడు అలాగే రెండవ పాదాన్ని గూడా పాడితే వంతలు తమ వాద్యాలను వాయిస్తూ అలాగే వంత పాడుతారు. లేకపోతే "రామరామరామా రామాచయ్ రామా" అనే పాదాన్ని వంతగా పాడుతారు. ఇదే పద్ధతిలోనే కింది వచనాన్ని గేయ బాగాన్ని కథకుడు వంతలు కలిసి ఎంతో రమణీయంగా ఆసక్తికరంగా పాడుతారు.

వచనం: అటువంటి బాయి తోడిచ్చింంద్రో, ఆబాయినీళ్ళు తీసుకోని గనకనేమి ఆనీళ్ళ తోటి నారింజతోట పెట్టింంద్రూ, నారింజతోట పూవులుబూసి కాయలు గాసి పండ్లు పండినాయో. వచ్చేపోయే పచ్చులా పండ్లు దింటున్నయమ్మా, ఆ పండ్లు దిన్న పచ్చుల దీవనార్తి పెర్రీ ఆదీవనార్తిలో కొడ్కు వుద్దున్నడమ్మో నారదా, నారింజపండ్లు దిన్న పచ్చులు దీవనార్తి వెట్టినాయంట, ఆదీవనార్తి వల్ల బుట్టిండు

గేయం : "రాజరాజరాజా రాజ నారదూడూ

అందమైన కొడుకు వుట్టెనూ రామ ఓరామా"

వచనం: కొడ్కు పుట్టిండని సంతోషపడుతున్నరట వాళ్ళు, మరివొక్క బిడ్డుంటే బాగుండు మరి తమ్మల్లేని పెళ్ళి జెయ్యరాదు. ఆడిపిల్ల లేని సావు సావరాదూ, ఆడిపిల్ల గావాలంటున్నారమ్మో, అదే బాయి నీళ్ళతోటి సూర్యనమస్కారాలు చేయవట్టిరి అరటితోట పండ్లతోటి పూజలు సేయవట్టరమ్మా ఆమ్మలారో, సూర్యనమస్కారాలు జేయంగ పుట్టిందీ

గేయం : "అలుగులాది సూరమ్మా దేవీ సూరమ్మా ,

ఆడివిల్ల జన్మమైతధే రామ ఓరామా"

ఈ విధంగా ప్రధానకథకుడు, వంతలు కథను రసవత్తరంగా నడుపుతారు.

మిగిలిన కథాఖ్యాన కళలకు ఒగ్గుకథకు ప్రదర్శనలో తేడా ఉంది. మిగిలిన కథాఖ్యాన కళల ప్రదర్శనలో ప్రదర్శకులు కేవలం కథను చెప్పుకుంటూ పోతారు. వీటిలో ప్రదర్శనకారులు నటించడం ఉండదు. ఒగ్గుకథలో ప్రదర్శకులు కథను చెప్పడంతో పాటు అవసరమైనప్పుడు కథలో వచ్చే అనేక సంఘటనల్లో నటులుగా మారిపోయి తలా ఒక పాత్రను ధరించి పాత్రోచితమైన సంభాషణలతో హావభావాలతో నాటకం మాదిరిగా రక్తి కట్టించి ప్రేక్షకులకు నాటకం చూస్తున్న భావాన్ని కలిగిస్తారు. ప్రధాన కథకుల్లో ఒకరు స్త్రీ వేషాన్ని ధరించి వుంటారు. ఈ స్త్రీ వేషధారి కథలో వచ్చే అన్ని స్త్రీ పాత్రలను చాల సహజంగా పోషిస్తూ ఉంటాడు. మిగిలిన కళల్లో లేకుండా ఒగ్గుకథలో మాత్రమే ఉన్న గొప్ప లక్షణం ఇది. ఈ లక్షణం ప్రేక్షకుల మీద ఎంత గొప్ప ప్రభావాన్ని చూపిస్తుందంటే ప్రేక్షకుల్లో కొంత మంది స్త్రీలు భక్తి సన్నివేశాలు వచ్చినప్పుడు పూనకం వచ్చి

ఊగిపోతుంటారు. కొంత మంది పూనకంతో వేదిక మీదకు వచ్చి ఊగిపోతూ ఉంటారు. దీన్నిబట్టి ఒగ్గుకథ ప్రేక్షకుల మీద ఎంత గొప్ప ప్రభావాన్ని చూపిస్తుందో స్పష్టమవుతుంది. భయంకరమైన సన్నివేశాలు వచ్చినప్పుడు ఒగ్గుకథా కారులు తమ అరపులతో డోలు మొదలైన వాద్యాల శబ్దాలతో ప్రేక్షకులు భయపడే విధంగా చేస్తారు. అంతేకాదు కథలో వచ్చే శృంగారం హాస్యం కరణం, రౌద్రం మొదలైన నవరసాలను నాటకంలోనో సినిమాలోనో ప్రదర్శిస్తున్నట్లుగా వీరు ఎంతో నైపుణ్యంగా చాకచక్యంగా వేదిక మీద నటించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తారు. ఇది నిజంగా అద్భుతమైన విషయం. ఒగ్గుకథ ప్రదర్శన గురించి ఎంత చెప్పినా తీరదు. దాని గొప్ప తనాన్ని తెలుసుకోవాలంటే ప్రత్యక్షంగా దాన్ని చూసి తెలుసుకోవలసిందే. ఇంత గొప్పగా ఈకళను తీర్చి దిద్దినవారు అద్భుతమైన మేధాసంపత్తి కలవారు అని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. అందుకనే జీవితంలో ఒక సారైనా ఒగ్గు కథా ప్రదర్శనను తప్పనిసరిగా చూడాలి. చూడకపోతే నిజంగా అది ఒక లోపమే. ఈ కారణంగానే ఒగ్గుకథ మిగిలిన కళల కంటే గొప్ప ప్రసిద్ధిని, ప్రచారాన్ని సంపాదించింది.

ఒగ్గుకథకులు పైన చెప్పిన విషయాన్ని తమ ప్రదర్శనా చాతుర్యంతో ఎలా రక్తి కట్టిస్తారో కొన్ని సన్నివేశాలను వివరించే ప్రయత్నం చేస్తాను. బీరన్నకథలో రాజ నారదుడు ప్రతినాయకుడు. ఇతని ఏడుగురు కుమార్తెలు బీరన్న మీద నింద వేస్తారు. దానికి భయపడి బీరన్న లింగరూపంలో ఒక చెరువులో దాకుంటాడు. అతని అక్క మహంకాళి అతని కోసం వెదికి వెదికి తమ్ముడు కనిపించక పోవడం చేత చెరువు కట్టమీద కూర్చొని తమ్ముని కోసం దు:ఖిస్తూ ఉంటుంది. ఈసన్నివేశంలో ప్రధాన కథకుడు బీరన్న పాత్రను, స్త్రీ పాత్రధారి అక్క పాత్రను పోషిస్తారు. స్త్రీ పాత్రధారి వేదిక మీద కూర్చొని కొంగు తలకు అడ్డం పెట్టుకొని ఎక్కడికి పోయినావురా తమ్ముడా ఏమైపోయినావురా తమ్ముడా అని దు:ఖిస్తూ ఉంటాడు. అతని దు:ఖాన్ని చూసి కొంత మంది ప్రేక్షకులు కన్నీటి పర్యతమవుతారు. ఆమె దు:ఖాన్ని విని బీరన్న చెరువు లోనుంచి బైటకు వచ్చినట్లుగా ప్రధాన కథకుడు వస్తాడు. ప్రధాన కథకుణ్ణి బీరన్నగా భావించి స్త్రీ పాత్రధారి సంతోషంతో బీరన్నను చిన్నపిల్లవాని లాగా చంకకెత్తుకొని ఎవరు నిన్ను కొట్టినారు బీరయ్యా ఎవరు నిన్ను తిట్టినారు బీరయ్యా అని చాల ఆప్యాయంగా ప్రేమ ఉట్టిపడే విధంగా అడుగుతాడు. ఈ సన్నివేశాన్ని చూస్తే నిజంగా అక్క తమ్ముణ్ణి ఎత్తుకొని లాలిస్తున్నట్లుగా ఉంటుంది. ఐతే బీరన్న పాత్రధారి పెద్దవాడుగా ఉండడం చేత అంత పెద్దవాణ్ణి వేదిక మీద స్త్రీ

పాత్రధారి ఎత్తుకోవడం చూస్తే ప్రేక్షకులకు మంచి హాస్యం కూడా కలుగుతుంది. ఈ విధంగా ఈ సన్నివేశం ద్వారా ఒగ్గుకథకులు ప్రేక్షకులకు కరుణ హాస్యరసాలను కలిగింప జేస్తారు.

బీరన్న తన మేనమామ ఏడవకూతురైన కామరతిని పెళ్ళి చేసుకోవాలనుకొని గొర్రెలమంద దగ్గరనుంచి అక్క మహంకాళి దగ్గరకు వచ్చి తనకు పెళ్ళి చేయమని అడిగే సన్నివేశం రసవత్తరంగా ఉంటుంది. బీరన్న పాత్రను ప్రధాన కథకుడు అక్క మహంకాళి పాత్రను స్త్రీ పాత్రధారి పోషిస్తారు. బీరన్నను చూడగానే మహంకాళి "గొర్రెలు ఎట్లున్నయ్ గొర్రెపిల్లలు ఎట్లున్నయ్" అని అడుగుతుంది. చాల కాలం తర్వాత తాను ఇంటికి వస్తే తన గురించి అడగకుండా గొర్రెల గురించి అడుగుతున్నందుకు బీరన్న చిరాకుపడి అక్క మీద అలుగుతాడు. అక్క అతణ్ణి ఓదారుస్తుంది. ఆతర్వాత బీరన్న అక్కను బైటికి తీసుకొని వచ్చి జంటగా ఉన్న పక్షులను, ఉడుతలను చూపించి అవి ఏమిటని అడుగుతాడు. అక్క ఒకటి మగది ఇంకొకటి ఆడది అని సమాధానం చెబుతుంది. అవన్నీ జంటగా హాయిగా ఉన్నాయని తాను మాత్రం ఉంటరిగా ఉన్నానని బీరన్న విచారిస్తూ ఉంటాడు. అక్క అతనికి దేవతల కూతుర్లను తెచ్చి పెళ్ళి చేస్తానని చెబుతుంది. బీరన్న తాను మేనమామ కూతురును పెళ్ళి చేసుకుంటానని చెబుతాడు. మేనమామ దుర్మార్గుడని అతడు బీరన్న తల్లిని, బీరన్న కడుపులో ఉన్నప్పుడు బీరన్నను చంపడానికి ప్రయత్నించినవాడని పగవాడని అందువల్ల అతని కూతురును చేసుకో వద్దని అక్క చెబుతుంది. కానీ బీరన్న తాను మేనమామ కూతురినే చేసుకుంటానని చెప్పి అక్కను ఒప్పించి తన మేనమామ నారదుని ఊరైన నాగులకొండ పట్నానికి గుర్రం మీద బయలుదేరుతాడు. అతడు గుర్రం మీద ప్రయాణం చేస్తున్నట్లుగా అభినయిస్తూ కట్లకర్రను గుర్రపు కళ్ళెంలాగా పట్టుకొని గజ్జల శబ్దం చేస్తూ ముందుకు వెళ్తూ ఉంటాడు.

ఇలా వెళ్తున్నప్పుడు మిగిలిన ప్రదర్శకులు :

"ఏయ్ .... అక్కపాదం మొక్కెనా గుర్రం మీద ఎక్కెనా

ఆ మడియె తన్ను దన్నెనా తోడదెబ్బ కొట్టినా

గుర్రం బోత యున్నదా గురుత బోత యున్నదా........" అని పాడుతూ బీరన్న నిజంగా గుర్రం మీద పోతున్న భావాన్ని ప్రేక్షకులకు కలిగిస్తారు. ఎల్లమ్మ కథలో శివుడు శిశువుగా ఉన్న ఎల్లమ్మను తెచ్చి పార్వతికి ఇస్తాడు. ఆమె ఆ శిశువుకు ఎల్లమ్మ అని పేరు పెట్టి ఉయ్యాల్లో వేసి జోలపాట పాడుతుంది. ఈ సన్నివేశాన్ని ఎంతో అద్భుతంగా

ఒగ్గుకథకులు ప్రదర్శిస్తారు. ఈ సన్నివేశంలో స్త్రీ పాత్రధారి పార్వతి పాత్రను పోషిస్తాడు. వంతల్లో ఇద్దరు ఒక వస్త్రాన్ని చెరొక చివర ఉయ్యాల లాగా పట్టుకొని ఉంటే స్త్రీ పాత్రధారి ఆ ఉయ్యాల్లో శిశువును వేసి ఊపుతున్నట్లుగా నటిస్తూ కింది జోలపాటను పాడుతాడు.

"జోఅచ్యుతానందా జోఅచ్యుతానందా జోబాలకుందా
ఏడ్వాకు ఏడ్వాకు ఏడ్వాకు ఏడ్వాకు ఏటి ఎల్లమ్మా
ఏడిస్తే నిన్నెవరు ఏడిస్తే నిన్నెవరు ఎత్తుకుంటారు.
ఆయమ్మా జో ..... ఆయమ్మా ఆయీ – జో అచ్యుతానందా
కాళ్లగజ్జలు గొందు కాళగజ్జలు గొందు కట్నాలు గొందు
కాడూరి వారింట్లో కాడూరి వారింట్లో నెలకొన్న తల్లీవి
నీయొక్క బట్టాలు నీయొక్క బట్టాలు వద్ద గూకుంద్రు
జో.... ఆయమ్మా జో ..... ఆయమ్మా ఆయీ – జో అచ్యుతానందా
ఏడ్వాకు ఏడ్వాకు ఏడ్వాకు ఏడ్వాకు ఏటి ఎల్లమ్మా
తన్నోడి నీతండ్రి తన్నోడి నీతండ్రి వద్ద గూకుండు
ఎన్నీల గాయంగ ఎన్నీల గాయంగ మంది నడవంగా .
మందీలో ఎల్లమ్మ మందీలో ఎల్లమ్మ ముందు నడవంగా
జోఅచ్యుతానందా జోఅచ్యుతానందా జోబాలకుందా
ఏడ్వాకు ఏడ్వాకు ఏడ్వాకు ఏడ్వాకు ఏటి ఎల్లమ్మా

ఈపాటను స్త్రీ పాత్రధారి ఒక్కొక్క పాదాన్ని పాడుతూ ఉంటే వంతల్లో ఒకరు చిన్నపిల్ల ఏడుస్తున్నట్లుగా మధ్యలో ఏడుస్తూ ఉంటాడు. మిగిలిన వారు జోలపాటకు వంత పాడుతూ ఉంటారు. ఈ సన్నివేశాన్ని చూస్తే వేదిక మీద నిజంగా చిన్నపిల్ల ఏడుస్తున్నట్లు ఆమెను తల్లి ఉయ్యాల్లో వేసి ఊపుతూ శ్రావ్యమైన గొంతుతో జోలపాట పాడుతున్నట్లుగా ప్రేక్షకులు భావించి మైమరచిపోయి చూస్తారు. అంతేగాదు ఆ సన్నివేశాన్ని మళ్ళీ మళ్ళీ చూడాలనిపిస్తుంది.

మల్లన్న కథలో నీలమ్మ శివుని ఆగ్రహానికి గురై పుట్టింటికి వచ్చినప్పుడు ఆమె అన్నా వదినలు ఆమెను ఇంట్లోకి రానివ్వకుండా పంపించివేస్తారు. ఊళ్లో ఎవరింటికి వెళ్ళినా ఆమెను చీపుళ్ళతో కొడుతూ ఉంటారు. ప్రధాన కథకుడు ఈ సన్నివేశాన్ని వర్ణిస్తూ ఉన్నప్పుడు అతనికి ఇరువైపులా ఉన్న సహాయకులు తమ చేతిలో ఉన్న చేతిరుమాల, కట్లకర్రలతో స్త్రీ వేషధారిని కొడుతున్నట్లు నటిస్తారు. ఈ సన్నివేశాన్ని చూస్తే నిజంగా

నీలమ్మను చీపుళ్లతో కొడుతున్న భావన కలుగుతుంది.

మల్లన్న మేనమామ కూతుళ్ళను తీసుకొని వచ్చి తన అన్నలకు వివాహం జరిపిస్తాడు. కథలో ఈ పెళ్ళి సన్నివేశం వచ్చినప్పుడు వేదికమీద నిజంగా పెళ్ళి కార్యాన్ని కథకులు నిర్వహింప చేస్తారు. దీనికోసం వేదిక మీద గొంగడి పరచి, కింద కూర్చొన్న ప్రేక్షకుల చేత బియ్యం తెప్పిస్తారు. బియ్యాన్ని గొంగడిలో పోసి పసుపు కుంకుమలు చల్లుతారు. స్త్రీ వేషధారి పెళ్ళికూతురుగా ఒక వంత పెళ్ళికొడుకుగా కూర్చొని అక్కడ నిజంగా పెళ్ళి జరుగుతున్న అనుభూతిని ప్రేక్షకులకు కలిగిస్తారు. పెళ్ళి అయిపోయిన తరువాత ఎవరైనా కట్నాలు చదివిస్తారా! అని ప్రేక్షకులను ప్రశ్నించి, కట్నాలు చదివించిన వారిని పేరు పేరునా ప్రశంసిస్తారు. ముందు కూర్చున్న ప్రేక్షకులకు బొట్టు పెడతారు. ఈ విధంగా వివాహ ఘట్టంలో ఒగ్గుకథకులు ప్రేక్షకులను భాగస్వాములను చేస్తారు.

మల్లన్న వదిన అయిన వన్నమ్మ మల్లన్నను అపనిందల పాలు చేయడానికి ఒక పథకం సిద్ధం చేసుకొని, ఆమె గదిలో ఉండి తాను ఉన్న గదిలోకి పాము వచ్చిం దని తనను కాపాడమని తోడికోడళ్ళతో మల్లన్నకు చెప్పించి, అతణ్ణి గదిలోకి రప్పించు కుంటుంది. గదిలోకి వచ్చిన మల్లన్నతో వన్నమ్మ తనకు అతని మీద కోరిక ఉందని, తన కోరిక తీర్చమని అడుగుతుంది. ఈ సన్నివేశాన్ని ప్రధాన కథకుడు చెబుతున్నప్పుడు స్త్రీ వేషధారి అయిన కథకుడు వన్నమ్మ లాగా నటిస్తూ మల్లన్న మీదకు వగలు వలక పోస్తూ వస్తుంది. ఆ సమయంలో స్త్రీ వేషధారి నడిచే నడకతీరు, వయ్యారాలు, మూతి విరుపులు మొదలైన వాటిని చూసి ప్రేక్షకులు గొప్పగా నవ్వుకుంటారు.

మల్లన్న గొల్లకేతమ్మను వివాహం చేసుకొని ఆమెను ముందుగా శ్రీశైలానికి పంపిస్తాడు. కేతమ్మ శ్రీశైలంలో గంపనెత్తిన పెట్టుకొని పెరుగు,మజ్జిగ అమ్ముతూ ఉంటుంది. ఈ సందర్భంలో కేతమ్మ పాత్రను పోషిస్తున్న వేషధారి గంపకు బదులుగా ఒగ్గును తల మీద పెట్టుకొని వయ్యారంగా నడుస్తూ పెరుగు, మజ్జిగను అమ్ముతున్నట్లుగా నటిస్తాడు. అప్పుడు మ్యాడలదేవి కేతమ్మను పిలిచి పెరుగు, మజ్జిగ ఎలా పోస్తున్నావని ధర అడుగుతుంది. ఈ సందర్భంలో మ్యాడలదేవి పాత్రను ఒక సహాయకుడు పోషిస్తాడు. అప్పుడు కేతమ్మ "ముత్యానికి మూడు, పగడానికి పది, వజ్రానికి ఒక్కటి" అని చెబుతుంది. అప్పుడు మ్యాడలదేవి ఇంతవరకు ఎక్కడైనా

అమ్మావా! అని వ్యంగ్యంగా అడుగుతుంది. కేతమ్మ అంతకంటే వ్యంగ్యంగా నీవు ఎప్పుడైనా కొన్నావా! అని అడుగుతుంది. ఈ విధంగా ఇద్దరి మధ్య గొడవ మొదలై

తారాస్థాయికి చేరుతుంది. ఈ సన్నివేశంలో ఇద్దరు స్త్రీ పాత్రధారులు అద్భుతంగా నటించి ఇద్దరు స్త్రీలు గొడవపడుతున్న దృశ్యాన్ని ప్రేక్షకుల కళ్ల ముందు నిలుపుతారు. వారిద్దరూ చేతులు తిప్పడం, మూతి విరవడం, సూటిపోటి మాటలు మాట్లాడడం, తిట్టుకోవడం అతి సహజంగా ఉండి ప్రేక్షకులు వారి వైపు మంత్రముగ్ధులై చూసే లాగా ఉంటుంది. వీరి తగాద శృతి మించుతున్నప్పుడు ప్రధాన కథకుడు మల్లన్న పాత్రధారిగా వచ్చి వారిద్దరికీ రాజీ కుదురుస్తాడు.

ఈ విధంగా ఒగ్గుకథాకారులు ఒగ్గుకథను చెబుతూ, నటిస్తూ సన్నివేశాన్ని రక్తి కట్టిస్తూ తమ ప్రదర్శనను కొనసాగిస్తారు. కథలో కోపాన్ని ప్రదర్శించేటప్పుడు ప్రయాణాన్ని వర్ణించేటప్పుడు కథ వేగంగా సాగుతుంది. ఇలా కథను వేగంగా చెప్పేదాన్ని "చలీదాటి" అంటారు. చత్తీధాటీలో కథ జరిగేటప్పుడు ప్రధాన కథకుడు , వేదిక మీద నాలుగడుగులు ముందుకు వేసి వెంటనే వెనక్కి తిరిగి యధాస్థానంలోకి వస్తాడు.అతనికి ఇరువైపులా ఉన్న వంతలు ప్రధాన కథకుని అనుకరిస్తూ అతనితో పాటు ముందుకు వచ్చి వెనక్కు వెళుతుంటారు.

ప్రధాన కథకుడు చేతులతో కట్లకర్రను, ఒగ్గును పట్టుకొని ఉంటాడు. కొందరు కథకులు సందర్భాన్ని బట్టి తోలుపట్టి, కొరడా కూడా చేతిలో పట్టుకుంటారు. అతనికి ఇరువైపులా ఉన్న సహాయకుల్లో ఒకరు డోలును వాయిస్తూ ఉంటాడు. మరొక సహాయకుడు చిన్నతాళాలు వాయిస్తాడు. ఈ కథకులందరూ కథలో వచ్చే పాత్రలను స్వేచ్ఛగా, ఎంతో ఔచిత్యవంతంగా నిర్వహిస్తారు.

స్త్రీ వేషాన్ని ధరించిన ప్రధాన కథకుడు కథలో వచ్చే స్త్రీ పాత్రలకు తగినట్లుగా తన గొంతును మార్చి మాట్లాడుతూ ఉంటాడు. ఇతడు నడుము మీద చేతులు పెట్టు కొని స్త్రీలాగా హొయలు వలకబోస్తాడు. దుఃఖ సన్నివేశంలో దుఃఖాన్ని, కోప సన్నివేశం లో కోపాన్ని ఎంతో చక్కగా సన్నివేశానికి తగినట్లుగా అచ్చం స్త్రీమాదిరిగా నటిస్తాడు.

ఒగ్గుకథకులు మధ్యమధ్యలో ప్రేక్షకులను రంజింపజేయడానికి పిట్టకథలను హాస్య సంభాషణలను చేస్తుంటారు. అంతేగాకుండా కథకుడు పొడుపుకథల వంటి చిత్రమైన ప్రశ్నలు వేస్తూ ఉంటాడు. సహాయకులు ఆలోచించి చెప్పేలోగా ప్రేక్షకులు వాటికి సమాధానాలు చెబుతూ ఉంటారు. ఈ విధంగా ప్రేక్షకులను భాగస్వాములను చేయడం ఒగ్గుకథలోని ఒక ప్రత్యేకత.

ప్రధాన కథకుడు సందర్భాన్ని బట్టి తన చేతిలోని ఒగ్గును, కర్రను అనేక రకాలుగా

ఉపయోగిస్తాడు. కథలోని పాత్ర తల మీద బరువు ఎత్తుకొని వచ్చే దృశ్యం ఉంటే కథకుడు ఒగ్గును తలమీద పెట్టుకొని బరువు మోస్తున్నట్టుగా నటిస్తాడు. కట్లకర్రను కత్తిగా, గదగా, గుర్రపుకళ్ళెంగా అవసరాన్ని బట్టి వాడుతూ ఉంటాడు. అతను ఆ వస్తువులను పట్టుకొని నిజంగా వాడుతున్న భ్రమను ప్రేక్షకులకు కలిగిస్తాడు. అదేవిధంగా పట్టు సెల్లాను గూడా అనేక రకాలుగా ఉపయోగిస్తాడు. కథకుడు స్త్రీ పాత్రను అభినయించ వలసి వస్తే పట్టుసెల్లాను కొంగులాగా వేసుకొని స్త్రీలాగా హొయలు వలకబోస్తాడు. పురుషునిగా ధైర్యాన్ని ప్రదర్శించ వలసివస్తే దాన్ని నడుముకు కట్టుకుంటాడు. ఈ విధంగా ఒగ్గుకథకులు తమ దగ్గర ఉన్న వస్తువులను ఉపయోగిస్తూ కథను చెబుతూ ప్రేక్షకులకు నాటకాన్ని చూస్తున్న అనుభూతిని కలుగజేస్తారు. కథ చెప్పడం పూర్తి అయిన తరువాత కథకులు మంగళం పాటతో ఒగ్గుకథను ముగిస్తారు. మంగళం పాట కథను బట్టి మారిపోతూ ఉంటుంది. మల్లన్న కథను చెప్పినప్పుడు కింది విధంగా మంగళం పాటను పాడుతారు.

ఆరతివ్వాళి మంగళ ఆరతివ్వాళి– దీరుడా శ్రీశైలవాసా ఇదిగో నివాళి
గనగన నాడింతు గంట నాడింతును–గన్నేరు పువ్వుల్ల నిన్ను పూజింతును
ఎప్పుడూ పూజింతు యాక చిత్తారిణి– సితారి చాపిన సిరి మేడలమ్మమా
సర్వమై ఉన్న గొల్ల కేతమ్మనూ ॥ఆరతి॥
పుట్టమీద కొమ్మ పూతరించిన కొమ్మ– అండ్లదే ఓ కొమ్మ ఆరతుల కివ్వంగ
ఎల్ల పర్వతాల మల్లయ్యకూ– మాయింటి మావురాలెల్లమ్మకూ
చిన్న చెంబుతో నీళ్ళు చీకాయ ఉత్కాలు– అల్లాలు, బెల్లాలు, అరటిపండ్లు
తేనెతో మాగిన తియ్య మామిడిపండ్లు– ఆరుడా అయిలోని మల్లన్నకూ ॥ఆరతి॥
గుర్రాలు ఎక్కేరు స్వారీలు చేసేరు– గుర్రంపు రాజులు పేరునే తెచ్చేరు
ఆరెబూములు దిరిగి ఆరె బాషలు నేర్చి ఔర పెండ్లికొడుకునకూ ॥ఆరతి॥
కొండలోన పెరిగి కొండలోన తిరిగి– కొండలన్ని పిండి పంటలొండి
అమ్మ గౌరమ్మకూ ఆ వెంకటేశునకూ– దిగ దేవతలకెల్ల దిష్టారతి ॥ఆరతి॥ " [4]

ఈ విధంగా ఒగ్గుకథకులు గంగాదేవి ప్రార్థనతో కథను ప్రారంభించి మంగళంతో కథను ముగిస్తారు. ఒగ్గుకథ ప్రధానంగా కథాఖ్యాన జానపద కళ అయినప్పటికీ బుర్రకథ, శారదకథ, జముకుల కథ, పంబకథ మొదలైన కథాఖ్యాన జానపద కళలకు ఒగ్గు కథకు తేడా ఉంది. మిగిలిన కథల్లో కథకులు వంతల సాయంతో కథను మాత్రమే చెబుతారు. వీటిలో కథకులు నటించడం ఉండదు. ఒగ్గుకథలో ప్రధాన కథకుడు కథను చెబుతున్న

సన్నివేశానికి అనుగుణంగా స్త్రీ పాత్రధారి, వంతలుగా ఉన్న సహాయకులు వాద్యకారులు, ప్రధానకథకుడూ అందరూ తాత్కాలికంగా ఆ సన్నివేశంలో వచ్చే పాత్రలుగా మారిపోయి తమ నటనా కౌశలంతో ప్రేక్షకులకు నాటకం చూస్తున్న అనుభూతిని కలిగిస్తారు.

**2.7. మల్లన్న కథ - బీరన్న కథ - సామ్య భేదాలు**

మల్లన్న కథలో శంకరునికి అధిక ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.బీరన్న కథలో కూడా శంకరునికి అధిక ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

మల్లన్న,బీరప్పలిరువురూ శంకరుని అంశవల్లనే జన్మించారు. అయితే మల్లన్న శ్రీశైల మల్లిఖార్జుని అవతారముగా జన్మిస్తాడు. బీరన్న వీరభద్రుని అవతారంగా జన్మిస్తాడు. ఒక విధంగా చెప్పాలంటే వీరిద్దరూ శంకరుని ప్రత్యక్ష రూపాలే.

మల్లన్న, బీరప్పలిద్దరూ సామాన్య మానవులుగా జన్మించినప్పటికీ మానవాతీత శక్తులును కలిగి వుంటారు. సర్వశక్తిమంతులుగా ప్రవర్తిస్తుంటారు. అవసరమైనప్పుడు వేషాలు కూడా మారుస్తుంటారు. మల్లన్న వికృతరూపం ధరించి కేతమ్మను,మ్యాడలాదేవిని పరీక్షిస్తాడు. బీరప్ప తన మరదలైన కామరతికి చెంగోలె బావిదగ్గర వికృతరూపంలో దర్శనమిస్తాడు. చివరికి గారడివాని వేషం వేసుకుని వెళ్ళి కామరతిని తీసుకొస్తాడు.

మల్లన్న,బీరన్నల వివాహాలు చేయడానికి త్రిమూర్తులు,ముప్పది మూడుకోట్ల దేవతలు వస్తారు. వీరిరువురికీ అవసరమైన సందర్భాల్లో వాయుదేవుడు, గంగాదేవి, పార్వతీదేవి, ఎల్లమ్మలు ప్రత్యక్షమై సహాయపడతారు. మైసమ్మ, పోచమ్మ, మహంకాళీ కూడా ఈ కథానాయకులకు సహాయపడతారు.

మల్లన్న,బీరన్నల పెండ్లిల్ల సందర్భంగా విష్ణువు–మంగలిగా,బ్రహ్మ–బ్రాహ్మణునిగా, శంకరుడు– చాకలిగా,యమధర్మరాజు– కుమ్మరిగా, ఇంద్రుడు–తోడు పెండ్లికొడుకుగా, సూర్య చంద్రులు–ఐరేణి కుండలుగా మారుతారు.

మల్లన్నకు మైసమ్మదేవత సహాయం చేసినందుకు మల్లన్న చీరలు,రవికెలు,ఒడిబియ్యం సమర్పించుకుంటాడు.బీరప్ప కూడా గంగమ్మ సహాయం చేసినందుకు,తన భక్తులు బీరప్పపండుగ చేసినప్పుడు చీర,రవిక,పసుపు,కుంకుమ,కుడకలు గంగలో తెప్పపై పెట్టి వదులుతారని,మేకపోతును కూడా సమర్పించుకుంటారని చెబుతాడు.

మల్లన్న తన పంట దగ్గర క్రూరమృగాలను కాపలా ఉంచుతాడు.బీరప్ప కూడా తన గొర్రెల మందకు కాపలాగా క్రూర మృగాలను కాపలా ఉంచుతాడు.

మల్లన్న పెండ్లి చేసుకోవాలనుకున్నా రత్నాంగిని గొర్రెలమంద దగ్గర ఇంటే బయ్యన్న కోరుతాడు. బీరప్ప పెండ్లి చేసుకోవాలనుకున్న కామరతిని మంద దగ్గరున్న బోగన్న కోరుతాడు.

మల్లన్న పెండ్లి చేసుకోవాలనుకున్నప్పుడు ఎన్నో ఆటంకాలు,కష్టాలు ఎదురవుతాయి. వాటిని అధిగమించి చివరకు పెండ్లి చేసుకుంటారు. బీరప్ప కూడా పెండ్లి చేసుకోవడానికి అనేక కష్టాలు పడతారు. ఎన్నో ఆటంకాలను ఎదిరించి చివరకు పెండ్లి చేసుకుంటాడు.

మల్లన్న తాను కోరుకున్న పిల్లనే పెండ్లి చేసుకుంటానని పట్టుబడతాడు. బీరప్ప కూడా ఎంతమంది చెప్పినా వినకుండా మేనమామ కూతుర్నే పెండ్లి చేసుకుంటానని పట్టుబడతాడు.

మల్లన్న కేతమ్మను పెండ్లి చేసుకోవడానికి వెళ్ళేముందు శంకరుడు ఆడపిల్లలకుండ వలసిన లక్షణాలను వివరించి అటువంటి లక్షణాలు గల పిల్లనే వివాహం చేసుకొమ్మని చెబుతాడు. బీరప్ప కామరతిని పెండ్లి చేసుకోవడానికి ముందు ఆడపిల్లలకు ఉండకూడని లక్షణాలు,అవి ఉండడం వల్ల కలిగే కీడును వివరిస్తుంది. అదే విదంగా ఎటువంటి మంచి లక్షణాలు గల పిల్లను చేసుకోవాలో కూడా చెబుతుంది.

మల్లన్న కథలో మల్లన్న ఒక అవతార పురుషునిగా ఆరాధింప బడతారు. వీరునిగా,ధీరునిగా చిత్రింపబడతాడు. బీరన్న కథలో బీరన్న కూడా ఒక అవతార పురుషునిగా పూజించబడతాడు. వీరునిగా, ధైర్యవంతునిగా చూపబడతారు.

బేధం :-

మల్లన్న, చెలమరాజు యుద్ధం చేస్తున్న సమయంలో ఎలనాగదేవి కోరిక తీర్చడం కోసం పసిపిల్లవానిగా మారి ఆమె ఒడిలోకి చేరుకుంటాడు. తర్వార తిరిగే పెద్దవాడిగా మారిపోతాడు.

పన్నెండురోజుల బీరన్న ఇరవైనాలుగేండ్ల యువకునిగా మారి ముప్పది రెండు కత్తులు పట్టుకొని మేనమామ పంపించిన కసాయివాళ్ళ తలలు నరికి మళ్ళీ పన్నెండు రోజులపసికందుగా మారి మట్టి ఊడల ఊయల్లో పడుకుంటాడు.

యువకుడిగా వున్నమల్లన్న చిన్నపిల్లవాడిగా మారుతాడు. చిన్నపిల్లవాడిగా వున్న బీరన్న యువకుడిగా మారుతాడు. వారి కర్తవ్యాన్ని నెరవేర్చిన తర్వాత తిరిగి యథారూపంలోకి మారి పోతారు.

మల్లన్న మేనమామ కూతుళ్ళను తిరస్కరించి పరాయి ఆడపిల్లల్ని పెండ్లి

చేసుకుంటాడు. బీరప్ప పరాయి ఆడపిల్లల్ని తిరస్కరించి మేనమామ కూతుర్ని పెండ్లి చేసుకుంటాడు.

మల్లన్న- బవురాంబను,రత్నాంగిని,మ్యాడలదేవిని,కేతమ్మను పెండ్లి చేసుకుంటాడు. బీరన్న ఒక్క కామరతినే చేసుకుంటాడు.

మల్లన్నకు తోడుగా ఆయన తల్లిదండ్రులు,ఆరుగురు అన్నలు-వదినలు,స్నేహితులు ఉంటారు. బీరన్నకు అక్క మహంకాళి తప్ప ఎవరూ ఉండరు.

మల్లన్న రాజ్యాన్ని ఏలుతాడు. బీరప్ప రాజ్యాన్ని తిరస్కరిస్తాడు. మల్లన్న కొద్ది రోజులు రాజ్యాన్ని వదిలి వ్యవసాయం చేస్తాడు. బీరన్న గొర్రెలమందల వద్ద కాపలా ఉంటూ వాటిని సంరక్షిస్తుంటాడు.

మల్లన్న కచ్చేరీలో కూర్చుని దానధర్మాలు చేస్తుంటాడు. బీరన్న అడవిలో గొర్రెలమంద దగ్గర ఉంటూనే దానధర్మాలు చేస్తుంటాడు.

మల్లన్న వదిన వన్నమ్మ వలన అనేక కష్టాలు ఎదుర్కొంటాడు. బీరన్న మేనమాన నరభూపతి వలన కష్టాలనుభవిస్తాడు.

## 2.8. ఒగ్గుకథ ప్రారంభం, ప్రార్థన సంప్రదాయం

యాదవుల కురుమల కుల హద్దులలో ఆచారాలకనుగుణంగా ప్రారంభమైన ఒగ్గుకథగానం కాలక్రమేణా జానపదుల వినోదాత్మక కళగా సామాజిక వేదికల మీదకు చేరి ఒగ్గుకథగానం ప్రదర్శన కళగా మారింది. ఈ మార్పు సంతరించుకున్న సందర్భంలో ఒగ్గుకథ కొన్ని సంప్రదాయ నాటక లక్షణాలు అనుసరించింది.

"నాటకం శాస్త్రీయమైన, జానపదమైనా ఆంగిక సాత్విక వాచకం ఆహార్య అభినయాల సమ్మేళనమే. ఈ నాలుగింటిలో దేనికదే ప్రత్యేకతను కలిగివున్నప్పటికీ ఇందులో ఆహార్యం పాత్ర చెప్పుకోదగింది. నాటకం స్వరూపాన్ని మార్చడంలో ఆహార్యం కీలకపాత్ర పోషిస్తుంది. నాటకంలో పాత్రోచిత వేషం లోపిస్తే కేవలం ఆంగిక వాచక సాత్విక అభినయాలతో పాత్రను ఆరోపించు కునే నాటకీయత మిగులుతుంది" **(వాసుదేవ్ సింగ్. ఒగ్గు కథ అభినయ సమన్వయం. పుట. 22)**

ఒగ్గుకథలో పాత్రోచిత వేషం ఉండదు. అలాగని అసలు వేషధారణ లేదని కాదు ప్రధాన కథకులు స్త్రీపురుష వేషధారణలో అన్ని పాత్రలను అభినయిస్తూ కథా గానం చేస్తారు. ఇందులో ఆహార్యం కన్నా నాటకీయతకు ప్రాధాన్యత ఎక్కువ. అయితే ఇటీవల కాలంలో

పండుగల సందర్భంలో, ప్రత్యేక కథాగానాల సందర్భంలోనూ ఎల్లమ్మ పరశురాముడు బీరప్ప అక్క మంకాలి వంటి పాత్రలు పాత్రోచిత వేషధారణతో వేదికల మీద కనిపిస్తున్నాయి. ఒగ్గు కథాగాన ప్రదర్శన కొంత నాటక లక్షణాల్ని అనుసరించినట్లు కనిపిస్తున్నప్పటికీ నాటకంలోని మౌలిక అంశాలు ఒగ్గు కథ ప్రదర్శనలో కూడా కనిపిస్తాయి. అందులో కథా ప్రారంభంలో చేసే నాంది ఒకటి. నాటకం నిర్వహణలో కనిపించే క్రియారూప, వాగ్రూప నాందికి సంబంధించిన విశేషాలు ఒగ్గు కథలో కనిపిస్తాయి. ఒగ్గు కథాగాన ప్రదర్శనలో రంగానికి పెద్దగా ప్రాధాన్యత ఉండదు. గుడిలో, కూడలిలో ఇంటి ముందు ఎక్కడైనా ఒగ్గుకథగాన ప్రదర్శన సాగుతుంది. నాలుగైదు చదరపు గజాల స్థలంలో చాపమీదనో పెద్దపీటలతో ఏర్పాటుచేసిన చిన్నపాటి వేదికల మీదనో కథాగానం మొదలుపెడతారు. ఆ వేదిక మీద కథా ప్రారంభం కి ముందు పసుపు వేపాకులు కలిపి ఎల్లమ్మ మల్లన్న లకు మొక్కి, కథాగానం సరిగ్గా సాగాలని ఎవరి దిష్టి పడకూడదని పసుపు బండారు, వేపాకులు కలిపి వేదికమీద ఒక పక్కన పెడతారు. వేదిక మీద కథాగానానికి సహకరించే వస్తువులకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించకపోయినా కథాప్రారంభంలో డమరు, డోలు, కట్లకోల, కాలి గజ్జులు వంటి వాటిని చేతితోతాకి నమస్కరించి కథాగానం ప్రారంభిస్తారు. ఈ విషయాలన్నీ నాటకంలో కనబడే క్రియారూప నాందికి సంబందించిన లక్షణాలకు దగ్గరగా ఉంటాయి.

### 2.8.1. గంగ ప్రార్థన

ఒగ్గుకథను ప్రారంభించడానికి ముందుగా ఒగ్గు కథకులు పాటించే సంప్రదాయం గంగమ్మను, శారదాదేవి గణపతిని ప్రార్థించడం. ఇందులో గంగ ప్రార్థన విశిష్టమైంది. వేద కాలం నుండి ప్రకృతిని, పంచభూతాలను ఆరాధించడం సంప్రదాయంగా కనిపిస్తుంది. అందులో నీటి వనరులను పూజించడమనే సంప్రదాయం ఒగ్గు కథాగానం లో నిలిచి ఉండటం విశేషం. సకల చరాచర సృష్టి మనుగడకు నీరు ప్రధాన వనరు. నీటి వనరుల ఆధారంగానే ఎన్నో నాగరికతలు విలసిల్లాయి. అటువంటి భౌతిక వనరైన నీటిని అది ఏ రూపంలో ఉన్నా గంగ అని పిలిచి దైవత్వాన్ని ఆపాదించి ప్రార్థన చేయడం జానపదుల ప్రకృతి ఆరాధనకు ప్రతీక.

సాధారణంగా పూజా సంప్రదాయాలలో విఘ్నాలను తొలగించే గణపతిని ముందుగా పూజిస్తారు కానీ ఒగ్గు కథకుల ఆచారాలలో గంగ ప్రార్థననే మొదట కనిపిస్తుంది. ఒగ్గు వారి అభిప్రాయం ప్రకారం ఏ పూజా కార్యక్రమం నిర్వహించాలన్న దేవుని రూపాన్ని ముందుగా శుద్ధి చేస్తారు. శుద్ధి చేయడానికి కావలసిన వనరు నీరు. అందుకని ఏ పూజకైనా ముందు

కావాల్సింది నీరే కాబట్టి గంగను ప్రార్థించడమనే సంప్రదాయం ఆచారం ఏర్పడింది. ఒగ్గు కథలో కనిపించే ఈ సంప్రదాయం బీరప్ప పండుగల నిర్వహణలో కూడా కనిపిస్తుంది. బీరప్ప పండుగలో అన్నింటికన్నా ముందు కనిపించేది గంగ పూజ. పండుగ మొదటి రోజు వీర గంధాల పూసుకుని గంగకు బోనం చేసుకుని చెరువు దగ్గరికి వెళ్తారు. అక్కడ గంగపట్నం వేసి గంగ తెప్ప వదలి, బోనం నైవేద్యం పెట్టి గంగలో దాచిన లింగాలను బీరప్ప దేవుని రూపాలుగా వెలికి తీసి కడిగి అందరూ గంగా స్నానం చేసి ఊరేగింపుగా వచ్చి గుడి తెరిచి బీరప్ప పండుగ మొదలుపెడతారు. మొక్కుడు కథలలో ఒకటైనా బీరప్పకథ, బీరప్ప పండుగ లో నిర్వహించే గంగమ్మ ఆరాధన సంప్రదాయమే క్రమంగా కథాగానంలో గంగ ప్రార్థనగా పరిణామం చెంది ఉండవచ్చు.

"శారదా... గంగల ఓ గంగ మాతల్లి గంగ, గంగనాటి వివరాలు మరియెట్టులున్నాయిా..

గంగనాటి కొండ గౌరి పుత్రుండ విగ్గన్న నీ కెల్ల వీపెల్ల జడలేనా.... పార్వతి వరకుమార పదివేల శణార్తి.....ఆ.... గంగ లేకపోతే ఈ జగము గడియాగదమ్మ, నీరు లేకపోతే ఈ జగము నిమిషముండబోదు. తాగేది గంగ, తలకు పోసుకునేది గంగ, కుండలో పోసేది గంగ, కూరాడులో పోసేది గంగ, సకల చండాలం పాపేది సత్య వీర గంగ, దేవదానవ మానవ యోధానుయోధులకు సమస్త ప్రాణకోటికి నీరే ప్రాణాధారం, కాబట్టి ఎంతటి వారైనా గంగను ప్రార్థించ వలసిన అవసరం ఉంది, గంగ కరుణిస్తేనే ఋతువుగా వర్షం పడి అనువుగా పంటలు పండుతాయి. అనువుగా పంటలు పండితే ప్రజల కష్టాలు తీరుతాయి. సకల చరాచర సమస్త ప్రాణకోటికి నీరే ఆధారం కావున గంగను ప్రార్థించివలసిన అవసరం ఆ....

శరణు శరణు మా యమ్మ రాణి శాంభవి రాణి శాంభవి రాణి
కరుణ జూడు మమ్ము గన్నతల్లి గంగాభవాని గంగాభవాని
ముందు మా యాదవులకు మూల దేవత మూల దేవత
మందలోన నెలకొన్న మగువ చౌడమ్మ దేవి చౌడమ్మ
ఎద మీద పొంగుళ్ళు ఎత్తి పొయ్యంగా ఎత్తి పొయ్యంగా
సాలు సాలు యా వందనాలు సాలొందనాలు సాలొందనాలు
సాగనంపగ తోడు పంపె సల్ల పటువాలు, ఎల్లపటువాలు,
లాలీ లాలీ మా అమ్మ లాలి లాలమ్మ లాలీ లాలమ్మ
లాలి లాలి ముద్దుల పాట పాడు రాజు మల్లెల తీగ మల్లెల"

(చుక్క సత్తయ్య ఒగ్గు కథ ప్రారంభం గంగమ్మ ప్రార్థన)

చుక్క సత్తయ్య గారి గంగ ప్రార్థన మిక్కిలి ప్రాచుర్యం పొందింది. ఒగ్గుకథను సామాజిక వేదిక నుండి అంతర్జాతీయ స్థాయి వేదికలలో ప్రదర్శించిన ఘనత చుక్క సత్తయ్య గారిది. వారు ఒగ్గు కథా సంవిధానం నైపుణ్యాలలో చేసిన మార్పుల వలన కథాగానం ప్రజలను విశేషంగా ఆకర్షించింది. వారు చేసిన మార్పులలో గంగ ప్రార్థన ఒకటి. పూర్వం ఒగ్గు కథలో గంగ ప్రార్థన చేసినప్పుడు

"గంగ ఏల పుట్టినది రామ రామ / కోట గుంటల దాపునానే రామ రామ
కోలరాయి సందులానే రామ రామ... నంది ముక్కుల నుంచి నడుస్తుంది గంగ,
ఎద్దు నోట్ల నుంచి ఎళ్ళింది గంగ / జిల్లేడు చెట్ల కింద జల జల వారుకుంటా
మోతుకు చెట్ల కింద మొయ్య మొయ్య పారుకుంట / తంగేడు చెట్ల కింద నుండి
తరలి పారుతుంది" అని ప్రార్థించే వారు దీనిని చుక్క సత్తయ్య గారు మార్పు చేసి "శరణు శరణు మా యమ్మ రాణి శాంభవి రాణి శాంభవి రాణీ "అనే పద్ధతిలో మార్చడం జరిగింది **(బొప్పనపల్లి అయిలయ్య ఇంటర్వ్యూ)**

కుల హద్దులలో ఉన్నప్పుడు, సామాజిక వేదికలపై ప్రదర్శింపబడిన తొలినాళ్లలో సర్వసాధారణమైన తాళ గతులలో ఒగ్గు కథను గానం చేసేవారు. చుక్క సత్తయ్య గారికి యక్షగాన ప్రదర్శన శిక్షణలో ప్రావీణ్య అనుభవం ఉండటం వలన వారు ఒగ్గు కథలు చెప్పే సమయంలో 'ఒగ్గు కథను యక్షగానం దరువులకు దగ్గరగా ఉండేవిధంగా కథాగానం చేసేవారు. అందువలన వారి కథాగానం నాటక అనుభూతిని కలిగించేది. అనుసంధాన వచనం, చల్లి దరువు లలో సాగే గేయంలో చుక్క సత్తయ్య సృష్టించిన గంగ ప్రార్థనకు అనంతరకాలంలో ఇతర కథకులు వివిధ ప్రక్షిప్తలను జోడించి ప్రచారం కల్పించారు. గంగ ప్రార్థనలో గంగమ్మ స్తుతితో పాటు అనేక సామాజిక విశేషాలు కనిపిస్తాయి. చుక్క సత్తయ్య తరువాత మిద్దె రాములు ఒగ్గు కథలో జానపద బాణీలను ప్రవేశపెట్టారు. వారికి కథాగానం లో తెలంగాణ ప్రాంతంలోని సకల దేవతల ప్రార్థన ప్రధానంగా శివపార్వతుల స్తుతి ఉంటుంది. మిద్దె రాములు కథాగానంలో జానపద బాణీలో సాగే గంగమ్మ ప్రార్థన కనిపిస్తుంది.

"గంగ రాయే గంగ జాలారిగంగ జాలారిగంగ
గంగ నిన్ను కొలిచేటి ఘనులెవ్వరమ్మ జనులెవ్వరమ్మ
శంకుబోయిని బిడ్డ చెలియగంగమ్మ చెలియా గంగమ్మ
నీసు బోయిని బిడ్డ నీలారి గంగా జాలారి గంగ
మూడు రంగుల చీర ముత్యంపు రవిక ముత్యంపు రవిక

ముమ్మయ్య కొనియాడ మురిసిన గంగా మురిసిన గంగా" **(మిద్దె రాములు గంగ ప్రార్థన)**

ఇక్కడ తెలుపబడిన రెండు గంగ ప్రార్థనలో గంగా దేవి స్తుతి అలంకార వర్ణణ మొదలైన విషయాలతోపాటు యాదవులకు సంబంధించిన కులదేవత చౌడాలమ్మ గురించి యాదవ రాజులకు ఓరుగల్లుకు ఉన్న సంబంధం గురించి స్పష్టాస్పష్టంగా కొన్ని విషయాలు చెప్పబడ్డాయి ఇరువురు ప్రధాన ఒగ్గుకథకుల కథాగానాలను పరిశీలిస్తే ఒగ్గుకథ గంగ ప్రార్థన తో ప్రారంభించడం అనే విశిష్ట సంప్రదాయాన్ని కలిగి ఉందని తెలుస్తుంది.

**2.8.2. గణపతిప్రార్థన**

ఒగ్గుకథలో గణపతి ప్రార్థనను చుక్క సత్తయ్యగారు ప్రవేశపెట్టారు. యక్షగానం మీద ప్రేమతో ఒగ్గు కథను సంప్రదాయ నాటకం లాగా తీర్చిదిద్దాలనే సద్భావంతో వారు కావ్య సంప్రదాయాన్ని అనుసరించి ఒగ్గు కథా గానంలో గణపతి ప్రార్థన ప్రవేశపెట్టడం జరిగింది. అయినప్పటికీ అనాదిగా వస్తున్న నియమాల ప్రకారం ముందుగా గంగ ప్రార్థన చేసిన తరువాతనే గణపతి ప్రార్థన చేయడం కనిపిస్తుంది.

"విగ్గన్న వివరాలు మరి ఎట్లా ఉన్నాయి... ఎనుక చూస్తే విగ్గన్న ఏనుగు రూపం, ముందు చూస్తే విగ్గన్న ముని రూపం, కూర్చుంటే కుందేలు రూపం లేస్తే లేడి రూపం పంటే పాముల పరువడేనా ....ఆ...నడిచిన విగ్గనేశుడు నంది రూపమేనా....అమ్మ, పార్వతివరకుమారా పదివేల శణార్తి

ఆది గణాధిపతి ఆనంద మూర్తి... ॥ ఆది గణాధిపతి ॥
ఆది గణాధిపతి వనరైన మూల శక్తి ॥ ఆదిగణాధిపతి ॥
ముందు పూజలు నీవే కదా, మూల కిన్నెరలు మోగంగా

పచ్చి కొబ్బెర పాలమీగడ అవ్వి నీకు ఆరగింపులు ఆదిగణాధిపతి ॥
ఎలుక వాహనం ఎక్కి నీవు ఎల్ల లోకములనేలితివయ్యా
శరణుశరణని వేడితిమయ్యా నీదు కరుణకాశించితిమయ్యా
వాసిగాను మాణిక్యపురమున దాసుల పాలిటి దైవ వినాయక ॥ ఆదిగణాధిపతి ॥

చుక్క సత్తయ్యా గారి ఒగ్గు కథ ప్రదర్శన లోని ఈ గణపతి ప్రార్థన చివరి పాదాన్ని బట్టి ఇది చుక్క సత్తయ్య గారి సొంత రచన అని తెలుస్తోంది. ఈ గణపతి ప్రార్థన పాడే విధానం యక్షగానం, నాటకం వంటి కళారూపాల్లో కనిపించే ప్రార్థనకు దగ్గరగా ఉంటుంది. అయినప్పటికీ

ఈ గేయంలో చాలా వరకు మాండలికాలు అచ్చతెలుగు పదాలు కనిపిస్తాయి. కొన్నిచోట్ల చిరుతల రామాయణం లోని గణపతి స్తుతి అనుకరణ కూడా కనిపిస్తుంది. ప్రారంభంలో వచ్చే వ్యాఖ్య వచనంలో ప్రాస గతమైన వర్ణన గణపతి రూపాన్ని ఆవిష్కరింప చేస్తుంది. ఈ విధంగా కథా గాన ప్రదర్శనలో డాక్టర్ చుక్కా సత్తయ్య గారు ప్రదర్శించిన గణపతి స్తుతి సంప్రదాయాన్ని అనంతర కథకులు అందిపుచ్చుకొని గానం చేస్తున్నారు.

### 2.8.3 సకలదేవత ప్రార్థన

చుక్క సత్తయ్య ఒగ్గుకథాగానంలో గంగ, గణపతి ప్రార్థనతో పాటు కొన్ని కథాగానాలలో ఇతర దేవతల ప్రధాన కన్పిస్తుంది.

"హరహర మహాదేవా ఎలాకుమారాజా / శంభో శంకర శరణయ మహాదేవ
ఆదేవి దండామా తల్లి భూదేవి దండమా / తొక్కిన భూదేవతా తోడై ఉండూమ
మొక్కిన భూదేవత మోక్షము ఇవ్వవ / ఎగే రణభేరి వెండి పిల్లనగొయ్య
మావురమేలేటి రేణుక ఎల్లమ్మ / సావాట్ల కూసున్న సన్నాసి బావాజీ
దండము మారాజ ద్వాపరమందున /పండరినేలేటి ఓ విట్టలేశుడా
కథలకు యాల్లాయే దయతో సెలవీయి.... రామా... ఆ... **(చుక్క సత్తయ్య ఎరుకల నాంచారి ఒగ్గుకథ)**

కొన్ని ఒగ్గుకథల ప్రారంభంలో కనిపించే ఇలాంటి ప్రార్థనలో ఒగ్గుకథ ఆవిర్భావ ఐతిహ్యాల తో సంబంధం ఉన్న మల్లయ్య, బీరయ్య, అక్కమాంకాలి, ఎల్లమ్మ వంటి కులదేవతల స్తుతి ప్రధానంగా కన్పిస్తుంది. ఒగ్గుకథాగాన ప్రదర్శన కులహద్దులు దాటి వేదికల మీదకు చేరి వినోదాత్మక ప్రదర్శన కళారూపంగా మారింది అలాంటి సందర్భంలో కురుమ యాదవులు కాకుండా ఇతరులు కూడా నేర్చుకుని ఒగ్గుకథ ను ప్రదర్శించారు. వారిలో పేరెన్నికగన్న వ్యక్తి మిద్దె రాములు గౌడ్. వారి ఒగ్గు కథ ప్రారంభంలో గంగా గణపతి ప్రార్థన కాకుండా సర్వదేవతా స్తుతి ఉంటుంది.

"హరి హరీ ... రఘు నందనా..... హరి హరి బ్రహ్మాండమా, హరిలోకసంచారి, మద్దులు మారేళ్ళు, మానేటిగడ్డ, మరుమన్న తల్లి, విద్య చెప్పిన వాడా వీర హనుమాన్లు, బుద్ధి చెప్పినదాన భూనాంచారి, అమ్మవారు పార్వతి పదివేల దండమే....ఆ.....

ఆదేవి దండామా భూదేవి దండమా / లోకాల శంకర నీకల్ల దండమా
దండము నారాయణ దాపరమందేమో... అవ్వలాల అక్కలాల రామొజ్జె రామ రామ

ఆలకించే దాతలారా రామొజ్జె రామ రామ / చెప్పబోయి కథలోన రామొజ్జె రామ రామ
ఎన్ని తప్పులున్న గాని రామొజ్జె రామ రామ / మన్నించి బ్రోవరమ్మ రామొజ్జె రామ రామ
ఎవరేలే పట్నమనంగా వాళ్ళు ఏలుతున్నారు, శివుడేలేది శివ నందుల కోట..ఆ ..
శివుడేలేది శివ నందుల కోట పార్వతమ్మ ఏలేది పంచన్నగిరులే... ఓ రామ రామ...
రామ రామ ఓ రామ రామ రామ రామ / ఎండి కొండర పైడికొండ రామ రామ
ఏలే వాడుర శంకారుడు రామ రామ / వెండి కొండ పైడి కొండ ఏలె వాడు లోకాల
శంకరుడు, గరళకంఠుడు, గౌరీ మనోహరుడు, నీలకంఠుడు నిత్యానందుడు,
పులిచర్మంబరధరుడు, దండి వాడురా శంకారుడు రామ రామ / శంకరునిరా భార్య

ఉన్నది రామ ఓ రామ / అమ్మవారు పార్వతి దేవి / జగజ్జనని, లోకమాత, భవాని, భక్త చింతామణి, భ్రమరాంబ, శాంభవి, ఆదిశక్తి రా అమ్మవారు రామ రామ / పార్వతి, పరమేశ్వరులకు లోకంలో అనేక మంది భక్తులు అటువంటి భక్తుల లోపల భూచక్రనగరమేలేటి జయ రామ రామ" అంటూ కథను ప్రారంభిస్తారు ఇది ఒగ్గుకథ ప్రారంభం లో కనిపించే సకల దేవతల ప్రార్థన. ఒగ్గుకథ గానంలో తొలినాళ్ళలో మొదట గంగాదేవి ప్రార్థన మాత్రమే ఉండగా కాలక్రమేణా చుక్క సత్తయ్య గారితో గణపతి ప్రార్థన ప్రారంభమైంది. అనంతరకాలంలో మిద్దె రాములు గౌడ్ ఒగ్గుకథాగానం నేర్చుకుని ప్రేక్షకులకు వినోదాత్మకంగా అందించడానికి ఒగ్గ కథలో కొంత జానపద గేయాల ధోరణి ప్రవేశపెట్టాడు. కేవలం గంగాదేవి గణపతి ప్రార్ధననే కాకుండా వేములవాడ రాజన్న, నరసింహ స్వామి బద్ది పోచమ్మ మొదలగు ప్రాంతీయ క్షేత్ర దేవతలను స్తుతించి, గ్రామంలో కథ వినడానికి వచ్చిన వారందరికీ నమస్కరించి నేను ఇష్టంతో కథ నేర్చుకుని చెప్తున్నాను నేను కులపరంగా ఒగ్గువాడిని కాదని కావున తప్పులుంటే మన్నించమని కోరడంలో వినమ్రత కన్పిస్తుంది. ఈయన ప్రవేశపెట్టిన కథాప్రారంభము దేవతా స్తుతి అన్ని ఒగ్గ కథలకు ఒకే విధంగా ఉండి ప్రతీ ఒగ్గు కథను పార్వతీపరమేశ్వరుల భక్తుల కథగా ప్రారంభించడం కనిపిస్తుంది. ఈ విధంగా ఒగ్గుకథ ప్రారంభంలో వాగ్రూప నాందిగా గణపతి ప్రార్థనతో పాటు సకల దేవతా స్తుతిని కలిగి ఉందని చెప్పవచ్చు.

### 2.8.4. రామశబ్దం

ఒగ్గుకథ ఆరంభంలో గంగ ప్రార్థన, గణపతి ప్రార్థన, సకల దేవతల ప్రార్థన ఉన్నప్పటికీ ఎత్తుగడ మాత్రం 'దేవి', 'శారద', 'రామ' అనే పదాలు గాని అనే పదాలతోనే

ప్రారంభమవుతుంది. ప్రధాన కథకుడు ప్రారంభించిన ఎత్తుగడకు వంతలు సహాయకులు ఆ.... ఆ.... అని స్వరాన్ని కలపడాన్ని శ్రుతి పట్టడం అంటారు. ఒగ్గు కథలో శారదాదేవిని స్తుతించడం అనంతరకాలంలో ఏర్పడిన సంప్రదాయం కానీ రామ శబ్దం మాత్రం ఒగ్గు కథ గానంలో ప్రతిపాదంలో కనిపిస్తుంది.

"ఏ కథ చెప్పినా 'రామా' అనే పదం లేకుండా కథ నడవదు **(బొప్పన పల్లిఐలయ్య ఇంటర్వ్యూ)**".

"రామ అనే పదం రాముడు పుట్టే నాటికే ఉంది. "ర" అనేది అగ్ని బీజాక్షరం, "మ" అనేది మోక్ష బీజాక్షరం. రామ పదం ఉచ్చరించేటపుడు మనలోని పాపాలను, అరిషడ్వర్గాలను "ర" అనే అగ్నిబీజం కాల్చి వేసి "మ" అనే మోక్షబీజం మనిషిని మంచి వైపు నడిపిస్తుంది. రామ రామ యన్న రారాదు కర్మంబు ఏ రామరామ ఏర్పాటు జేయ్యి, రామవిభుని మదిలో తలచిన కారకు డొల్లినట్టు నీ కర్మము డొల్లునోయి." **(చౌదరిపల్లి రవి ఇంటర్వ్యూ)**

రామనామం వైష్ణవమతానికి సంబంధించినది అని కాకుండా రామ నామం పాపాలను పోగొడుతుందనీ, కష్టాలను కడతెరుస్తుందని జానపదులు బలంగా విశ్వసిస్తారు. నిత్య వ్యవహార భాషలో కష్టం వచ్చిన సందర్భంలో, మాట్లాడే మాటల్లో, రామ శబ్దం బహుళంగా కనిపిస్తుంది. రామ నామం వలన చెడు తొలగి పోయి శుభం జరుగుతుందనే భావనతో ఒగ్గు కథలో సహాయ కథకుల వంత గానంలో, ఎత్తుగడలో రామ నామం ఎక్కువగా వాడతారు. శైవ కళారూపంగా కనిపించే ఒగ్గు కథలో వైష్ణవ సాంప్రదాయ అనుగుణమైన రామనామానికి ఇంతటి ప్రాధాన్యత ఉండడం విశేషం. "ఎలా కోటీ... ఎలాకోటి రామా...ఆ..." "హరి హరి రఘు నందనా ఆ........" అనే కథ ప్రారంభంలోను

"రాముడా రామన్న రాఘవ – రాముడ రఘు రామ"

"రామ రామ కోదండ రామ, రామ రామ కోదండ రామ రాముడా రామన్నరామా"

"రామ రామ కోదండ రామ కోదండ రామ"

"రామ రామ సీతా రామ నాయినా రామ జయ రామ రామ" వంటి దరువు ఎత్తుగడలో మొదటి పాదమంతా రామ నామం కనిపిస్తుంది. ఎత్తుగడలో దరువుకు తగ్గట్టు రామ నామం లయబద్ధంగా వాడడం వలన వెంటనే చేసే కథాగానానికి సంబంధించిన పాదం అదే దరువులో పాడడానికి అనుకూలంగా ఉంటుంది. ఈ విధంగా ఒగ్గు కథలో ప్రారంభంతో పాటు కథాగానం మొత్తం అడుగడుగున రామ శబ్దం పునరావృతం అవుతూ తూగును లయాత్మకతను కలిగిస్తుంది. ఇటీవల కాలంలో ఒగ్గు కథ ప్రారంభంలో చేసే ఎత్తుగడకు సంబంధించి ఆధునిక కథకులు

కొంత మార్పు చేయడం గమనించవచ్చు."ఆ....ఆ....రఘునందన దేవిశారదా ..ఆ... గుణ గుణవంతులారా గుణవంతులారా కూర్చున్న పెద్దలారా ఓ గుణవంతులారా... ఆ.. ఆ... చెప్పేది ఇద్దరు, వినేది లోకులు, వినండి జనులారా ఈ పుణ్యశాస్త్రం. అబ్బబ్బా అప్పటికీ ఇప్పటికీ ఏమంటారు, లొల్లి చేస్తే లొల్లి కథ అవుతది, అల్లరి చేస్తే చిల్లర కథ అవుతది.

రామ నామం వింటే రంది పాసి పోతది, వినండి తంద్రులారా తప్పులు ఒప్పులు మన్నించండి మా అమ్మలారా... ఓ అమ్మ ఓ కొమ్మ ఓ నీలవేణి, మరిచి పన్నవతల్లి మాయలాది శక్తి, శక్తి వై కొన్నేళ్ళ జగమేలవమ్మ... ఆ... రాముడా రామన్న రాఘవా రామా ఓయ్ రామా **(బడిగె శ్రీను, అరుణవతి కరుణవతి ఒగ్గు కథ)**

ఈ ఒగ్గు కథ ప్రారంభం గమనిస్తే ఇందులో గేయం కన్నా, వచనాన్ని గేయంగా గానం చేయడం గమనించవచ్చు. ప్రారంభంలో రాముని, శారదా దేవిని తలుచుకొని తర్వాత కథ వినడానికి వచ్చిన పెద్దలకు నమస్కరించి అల్లరి చేయకుండా వినాలని అభ్యర్థించి కథను చెప్పే శక్తిని ఇవ్వమని ఆదిశక్తిని వేడుకున్నట్లుగా కనిపిస్తుంది. ఈ విధంగా ఒగ్గుకథ ప్రారంభంలో చేసే ప్రార్థనలో రామ శబ్దం ప్రధానంగా ఉండి, గంగ ప్రార్థన, గణపతి ప్రార్థన, కొన్నిచోట్ల సకల దేవతల ప్రార్థన కనిపిస్తుంది. ఈ విధానం సాంప్రదాయ నాటకంలోని వాగ్రూప నాందికి దగ్గరగా ఉంటుంది.

## 2.9. ఒగ్గు కథల్లో వర్ణనా చాతుర్యం

ఒగ్గుకథాగానంలో కథకులు ప్రదర్శించే సంవిధాన నైపుణ్యాలను పరిశీలించినపుడు వారి వర్ణనాత్మక చాతుర్యం సహజమైన ఆలంకారిక ప్రయోగాలు కథాసందర్భాలకు అనుగుణమైన నవరసపోషణ వంటి అంశాలు కథాగానాన్ని శ్రవ్య దృశ్య ప్రబంధంగా తీర్చిదిద్దినట్లు తెలుస్తుంది. ప్రబంధ కావ్యరచనలకు ఏమాత్రం తీసిపోని విధంగా అష్టాదశవర్ణనలు ఊహాతీతమైన అతిశయోక్తులతోపాటు సహజ సుందరమైన ప్రాకృతిక ఉపమానాలతో కూడిన అలంకారాలు కథాఘట్టాలను దృశ్యంగా ఆవిష్కరింపజేసే నవరసపోషణ వంటి అంశాలు ఒగ్గుకథాగానానికి చక్కని ఆలంకారికతను కలిగించాయి.

కథాసూత్రం ఆధారంగా ఆశువుగా సాగే ఒగ్గుకథా గానం సందర్భానుగుణంగా కొన్నిసార్లు సంక్షిప్తంగాను మరికొన్నిసార్లు విపులంగా గానం చేయబడుతుంది. కథాసూత్రం విపులంగా విస్తృతి పొందడానికి అందులో కథానుగుణంగా కనిపించే పాత్రల ప్రాధాన్యతలు, వివిధ కథాసందర్భాల వర్ణనలు కారణమవుతాయి. ఒగ్గుకథలో కనిపించె వర్ణనలన్నీ కూడా

అలంకారయుక్తాలై నిత్యగోచరాలయిన పోలికలతో సహజ సుందరాలై ఉండి కథాగానానికి పుష్టిని కలిగిస్తాయి. ఒగ్గు కథలో కనిపించే అలంకారాలను పరిశీలిస్తే ఇవి తెలుగు సాహిత్యములో అలంకారిక రచన ఉత్కృష్టంగా సాగిన ప్రబంధ రచనలకు ఏ మాత్రం తీసిపోవని చెప్పవచ్చు.

### 2.9.1. ఎల్లమ్మ బీరప్పకు చెప్పిన స్త్రీ లక్షణాల వర్ణన

బీరప్ప ఒగ్గుకథలో నాగులకొండ నరభూపతి బిడ్డలలో ఒకరిని పెళ్లి చేసుకోవడానికి వెళ్లే సమయంలో బీరప్పకు రేణుకా ఎల్లమ్మ స్త్రీకి ఎలాంటి శుభ లక్షణాలు ఉండాలి ఎలాంటి చెడు లక్షణాలు ఉండకూడదో విపులంగా వర్ణించి చెబుతుంది.

"వినవయ్య తమ్ముడ నాయి తమ్ముడ చిన్ని తమ్ముడ
పిల్ల, నల్లగున్నగాని ముద్దుగుండాలె ముద్దుగుండాలె
ఈడుకు ఇర్వై ఏండ్లుండాలె ఏండ్లుండాలె
దానికి, తుప్పురెంటికలు లేకుంటజూడు లేకుంటజూడు
గుత్తులు దొడ్డు లేకుంటజూడు లేకుంటజూడు
గుడ్డెలుగు పాదం లేకుంటజూడు లేకుంటజూడు
అరికాలికి సుడి లేకుంటజూడు లేకుంటజూడు
వినవయ్య తమ్ముడ నాయి తమ్ముడ సిన్ని తమ్ముడ" **(చుక్కసత్తయ్య బీరప్ప కథ)**

అని ఎల్లమ్మ స్త్రీకి ఉండకూడని లక్షణాల గురించి చెప్తూ అలాంటి లక్షణాలు ఉంటే ఎలాంటి ఇబ్బందులు వస్తాయనే విషయాన్ని విపులంగా వివరిస్తుంది. నెత్తిన మాడ ఉంటే మోత మోయలేదని, అడ్డ శిలలు ఉంటే చేతికి గాజులు పెట్టుకోరాక పగిలిపోయి గాజులు పాడు పాడవుతాయని, ఎత్తు భుజాలు ఉంటే నీళ్ళ బిందె ఎత్తుకుంటే రైకలు చిరుగుతాయని ఇలా ఒక్కో లక్షణం ఉండడం వలన వైవాహిక జీవనంలో ముఖ్యంగా శ్రమజీవనంలో కలిగే ఇబ్బందులను వివరిస్తుంది. మరి ఎలాంటి లక్షణాలు ఉండాలి అని బీరయ్య అడిగితే

"ఎడమ కాలుకు మచ్చ ఎలా దేవతలు మెచ్చ
కుడి తొడకు మచ్చ గుణవంతురాలో
మీగాలుకు మచ్చ మిద్దెలు మేడలు గలుగు

అరికాలుకు మచ్చ ఆవుల మందలు గలుగు" అంటూ శుభలక్షణాలు తెలిపి అలాంటి శుభ లక్షణాలు కలిగిన స్త్రీని పెళ్లాడమని చెబుతుంది. ఈ వర్ణన సమాజంలోని స్త్రీల మనస్సుకు ఇబ్బంది కలిగించినప్పటికీ స్త్రీకి ఉండే కొన్ని లోపాల వలన సమాజంలో ముఖ్యంగా వ్యవసాయ

శ్రమ జీవన సంస్కృతిలో కలిగే ఇబ్బందులను కథానుగుణంగా విపులంగా వివరించడం జరిగింది. అలాగే శుభ లక్షణాల గురించి తెల్పిన విషయ వర్ణనలో జానపదుల నమ్మకాలు వెల్లడవుతున్నాయి.

**వీరుల జననం / పుత్రోదయం**

"దేవుడు బీరయ్య పుట్టే గడియల్ల ఆకాశ మదిరిపడ్డది భూదేవి బుగులు పడ్డది
సుక్కలు పిక్కటిల్లి సూర్యుడు కైమోడ్చె...... ఏయ్
సూరమాదేవి గర్భాన ఉన్న వీరుడు బీరయ్య
జల్లున రాలిపడే ...... ఏయ్ కైలాసం కదిలె,
వైకుంఠం అల్లల్లాడే, నాగలోకం నాట్యమాడే,
భూలోకం బుగ్గటీలి లోకాలన్నీ ఏకమై దేవదుందుభులు మ్రోగంగ.. **(చుక్క సత్తయ్య బీరప్ప కథ)** వీరుడు జన్మించినప్పుడు ప్రకృతి అంతా పులకించి పోయి శుభ శకునాలు కనిపించాయని వర్ణించడం వివిధ కావ్యాలలో కనిపిస్తుంది. అదే విషయాన్ని సహజంగా, వాడుక భాషలో ఒగ్గు కథాగానంలో వర్ణించడం గమనిస్తే ఇందులో అనేక విషయాలు కనిపిస్తాయి. బీరప్ప జననాన్ని వర్ణించే ఈ వర్ణనలో వాడుక భాషతో పాటు దేవదుందుభి వంటి సంస్కృత సమాసాలు కూడా కనిపిస్తాయి. పుట్టే బాలుడు లోకానికి మేలు కలిగించే వాడని చెప్పడానికి పుష్ప వర్షం కురిసి దేవతలు దీవెనలు అందించారని, పూతకాతలతో ప్రకృతి పులకించి పోయిందని ఇలాంటి వీరుడు పెరిగి మమ్మల్ని ఓడిస్తాడని దేవతలు సైతం భయపడ్డారని చెప్పడంతో పాటు, ఎడమ కాలు వెన్నుకు, కుడికాలు నాభికి తన్ని తల్లి గర్భం నుండి బాలుడు బంతి పువ్వోలె బయటపడ్డాడని చెప్పడంలో ఔచిత్యవంతమైన స్త్రీ సుఖప్రసవ వర్ణన కనిపిస్తుంది.

"హరుడే.......మాంధాత పుట్టంగ ముప్పది మూడు కోట్ల దేవతలు మోరుమోరున మూడు గంటలపాటు మూర్ఛ చెందుతున్నారో రామ.......ఆ
ఆకాశమంతా ఎర్రనాయెన, సూర్యచంద్రాదులె మేరువు చాటుకు
మేరువు చాటుకు ఉరుకుతున్నారా, తండ్రి పొట్టల నుండి కండ్ల జూసెనా
సూర్యుడు చంద్రుడు మేరువు చాటుకురికిరి రామా. (చుక్క సత్తయ్య మాంధాత ఒగ్గు కథ) మాంధాత ఒగ్గుకథలో జనన సందర్భంలో చేసిన వర్ణనలో భవిష్యత్ కథాసూచన కనిపిస్తుంది. దేవకన్యలకోసం తెచ్చిన పాయసం తాగడం వలన సద్యోగర్భంధరించిన యవనాశ్వుని పొట్ట చీల్చుకుని భూమి మీద పడ్డ మాంధాత జననం గురించి తెలుపుతూ మాంధాత పుట్టగానే భయపడిన సూర్యుడు దాక్కున్నాడని, దేవతలు మూర్ఛపోయారని చెప్పడం ద్వారా అనంతర

కథలో మాంధాత వీరుడై సూర్యున్ని, దేవతలను ఓడించగలడనే విషయాన్ని తెలియజేస్తుంది. ఒగ్గు కథలో వీరుల జనన సమయంలో చేసే వర్ణనలన్నీ ఇంచుమించుగా ఒకే విధంగా ఉన్నప్పటికి మాంధాత వంటి కొన్ని కథాగానాలలో ఇతివృత్తానికి తగినట్లు వర్ణనలు చేయడం కనిపిస్తుంది.

### 2.9.2. వృత్తి జీవన వర్ణన

సాహిత్యం ఏదైనా సమకాలీన సమాజాన్ని వ్యాఖ్యానిస్తోంది. ఈ విషయం జానపద కళారూపం ఒగ్గు కథలో విశేషంగా కనిపిస్తుంది. ఒకవైపు ప్రధాన కథాగానం సాగుతుండగా దానికి అనుసంధానంగా కథానుగుణంగా వివిధ సందర్భాలలో గ్రామీణ జీవన వృత్తుల వర్ణనలు కనిపిస్తాయి. ఒగ్గు వారి కులవృత్తి అయిన గోర్లు మేకల పెంపకం, చల్ల అంబలి చేయడం గురించి వ్యవసాయక జీవనంతో పాటు గ్రామాల్లో ఉండే కమ్మరి, కుమ్మరి, కంసాలి, చాకలి ఇలా అన్ని రకాల వృత్తుల వారి ఆహార్యాన్ని, లక్షణాలను ఒగ్గుకథలో వర్ణించడం కనిపిస్తుంది.

#### వ్యవసాయ ప్రీతి

ఒగ్గు కథలో నాయకానాయికల వివాహాన్ని వర్ణించే సందర్భంగా గానం చేసే కొట్నం పాటలో వ్యవసాయ వృత్తి జీవన ప్రీతి కనిపిస్తుంది. చేతిలో ఉన్న కట్లకోలతో దంచుతున్ననట్లుగా నటిస్తూ బృందగానంగా ఆలపించే ఈ ఒగ్గు కథ గేయంను ఒగ్గుకథలో వివాహ వర్ణన కథాగానంతో పాటు కులదేవతల పండుగల సమయంలో కూడా గానం చేస్తారు.

"అల్లోనేరేడల్లో అల్లోనేరేడల్లో అల్లల్లనేరడి సల్లనేరెడి అల్లోనెరెడల్లో
సల్లనేరడి క్రింద సల్లని శెలిమె అల్లోనెరెడల్లో
సల్లని శెలిమెకు సంగడిమోట అల్లోనెరెడల్లో
బంగారి బొక్కెన బాయికున్నది అల్లోనెరెడల్లో
మాను అల్లోనెరెడల్లో పేర్పెడు నీళ్ళతో పెంపాయెమాను
అంతాయె ఇంతాయె ఘనమాయె మాను అల్లోనెరెడల్లో
పడమటి పంగలు పర్వతం బోలు అల్లోనెరెడల్లో
ఆ మాను కాయలు పెండ్లి పోకలు అల్లోనెరెడల్లో
ఆ మాను ఊడలు పోలుదారాలు అల్లో నెరెడల్లో"

ఈ పాటలో అల్లోనేరేడల్లో అనే పదాన్ని ఆవృతం చేస్తూ పెండ్లివస్తువులను వర్ణించడం జరిగింది.

పెళ్లి లో ప్రధానంగా కనిపించే మామిడి ఆకుల తోరణాలు, మామిడిచెక్కపీటలను వర్ణిస్తూ ఆ మామిడి చెట్టు పాల మామిడి పండు నుండి మొలకై మొలిచి,నాలుగు దిక్కుల విస్తరించి పెరిగిన విధానం వర్ణించబడింది. మామిడి చెట్లు పెరిగినట్టు వివాహానంతరం వారి జీవనం వర్ధిల్లాలనే భావన ఈ గేయంలో అంతర్గతంగా గోచరమవుతుంది. అలాగే గేయం మొదట్లో శెలిమె బావిని, అందంగా చెక్కిన సంగడి మోటను వర్ణించారు. బావికి బంగారు బొక్కెన ఉందనడం అతిశయోక్తే.ఎంతటి సంపన్నుడైన బంగారు బొక్కెనతో నీటిని తోడలేరు.కానీ వ్యవసాయానికి ప్రధాన ఉపకరమైన మోటను వర్ణిస్తూ దాని గొప్పదనాన్ని ప్రాధాన్యాన్ని తెలియచెప్పడానికి ఆ వస్తువులన్నీ, వెండి బంగారంతో తయారు చేయబడినవని, విలువైనవని వర్ణించారు.అలాగే మోట నడిచే ఎద్దుల చక్కదనము వాటి పేర్లతో సహా వర్ణించడంలో పశు వులతో ఉండే ఆత్మీయ సంబంధం వెల్లడవుతుంది.మోట కొట్టే వాడు,కలుపు తీసే వాడు,నీళ్లు కట్టే వాడు రైతే కానీ ఆ రైతునే రాజుగా చెప్తూ చక్కని నీటి వనరులున్న రైతు రాజులాగా బతుకుతాడనే అర్థాన్ని తెలియచెప్పారు. ఈ గేయం వంటిదే వివిధ ఒగ్గు కథల్లో మరో గేయంలో కూడా వ్యవసాయ సంబంధ వర్ణాలు కనిపిస్తాయి.

సువ్వి సువ్వన్నల సువ్వన్నలాల సువ్వన్నలాల
సువ్వాని నేనొక్క పాట పాడంగ పోటు పొడువంగ
కుమ్మరి చేసిన కూజి కుందేన కూజి కుందేన
వడ్లోల్లు చేసిన వన్నెలాగదము వన్నెల గదము

శెరిగిన ఎండుగ జల్లెట్ల పోసి పైడియ జల్లెడ పడుత ఉన్నాది పడుత ఉన్నాది **(చుక్క సత్తయ్య మల్లన్న కాపుల ఘట్టం)**

ఒగ్గుకథలో అంతర్భాగంగా వివాహ ఘట్టాన్ని వర్ణిస్తూ గానం చేయబడే ఈ సువ్విపాట సహజమైన మాండలిక భాషలో వడ్లు దంచే విధానాన్ని వివరిస్తుంది. ప్రాచీన శ్రమ జీవన సంస్కృతిలో వడ్లు దంచడం ముఖ్యమైన పని. దాని గురించి వర్ణిస్తూ వడ్లు దంచి, చెరగడానికి ఉపయోగించే వస్తువులను సంగటి రోకలి, గంటల పొన్ను, వెండి శాటలు, పైడి జల్లెండ్లు అని వర్ణించడంలో ఆయా పనిముట్ల యొక్క ప్రాధాన్యం, వ్యవసాయ జీవనంలో వాటి పట్ల రైతుల గౌరవ భావన వెల్లడవుతుంది. అలాగే ఈ గేయంలో హరిత విప్లవానికి ముందు గ్రామాలలో సాగు చేయబడిన పొట్టి మొలకలు, చిట్టి ముత్యాలు, శాప కన్నులు, గౌరీ పోగులు అనే పేర్లతో ఉన్న వరి వంగడాల గురించి తెలియజేశారు. ఇందులో తెలిపిన వరి ధాన్యాలన్నీ నేడు కనుమరుగైన ధాన్య సంపద. ధాన్యాల రకాలతో పాటు వాటిని దంచే స్త్రీల చేతులను

"తామరాకులవంటి హస్తాలతోడ" అని చెప్పడం కరకమలాలు, హస్తపద్మాలు వంటి ప్రబంధ పోలికలను స్పురింప చేస్తుంది. "మట్టెల్ల కుడికాలు మట్టంగ జాపి, వంగి పోటేయ్యంగ వయ్యారమేమి 'అని కొంగు నడుము చుట్టి, కాలు ముందుకు పెట్టి రోకలితో దంచే స్త్రీ రూప చిత్రాన్ని కళ్లకు కట్టించారు. ఈ గేయం ఒగ్గుకథ తో పాటు మల్లన్న ఎల్లమ్మ క్షేత్రాలలో బోనం వండడానికి ఉపయోగించే బియ్యాన్ని సుంకించేటప్పుడు కూడా ఒగ్గు పూజారులు గానం చేస్తారు.

"భుజాన కొడవలి నెత్తినదుంపతో భూమి సవరించేది నీ నాగలన్న

పార పగ్గము పట్టి,కాడికెద్దులకట్టి అరకగట్టి శెలక దున్నె రైతన్న

మిట్ట భూములు దున్ని, పత్తిని పండించి ప్రజల రక్షించేది నీ నాగలన్న

రాతి భూములు దున్ని రాజనం పండించి రాజుననిపించేది నీ నాగలన్న' **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ)**

పరశురామునికి భయపడి ఎల్లమ్మ పారిపోయి జాలిచక్ర పురానికి చేరిన సందర్భంలో అక్కడి వివిధ వృత్తుల వారిని వర్ణిస్తూ చెప్పిన సందర్భంలో రైతు జీవితాన్ని వర్ణిస్తూ ఆహారం పండించి ఆకలి తీర్చి, పత్తి పంటలతో ప్రజలకు వస్త్రం అందించిన రైతు గొప్పవాడని, ఆ గొప్పతనమంతా రైతుకు ప్రధాన ఉపకరణమైన నాగలిలో ఉందని చెప్పడంలో వ్యవసాయ వృత్తి జీవన ప్రీతి కనిపిస్తుంది. "ఏటి మీద ఎడ్లమంద, పాటి మీద బర్లమంద, చిన్న గుట్టలమీద చిన్న ల్యాగలమంద, పెద్దగుట్టల మీద పెద్దావులమంద, ల్యాతమామిండ్ల ల్యాగలమంద, కోట బొగుడల్ల కోడెలమంద. అష్టభాగ్యం ఇష్టసంపద" **(మిద్దె రాములు బాలనాగమ్మ కథ)**

వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న పశుసంపదను ఇతర సంపదల కన్నా గొప్పగా, రాజులకు ఇష్టమైన ఉన్నతమైన సంపద గా వర్ణించడం ఒగ్గువారికి గ్రామీణ జీవనం పట్ల, పాడి పంటల పట్ల ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని తెలియజేస్తుంది. మల్లన్న కాపుల ఘట్టం లో రారాజు మల్లన్న, తన అన్నలు వ్యవసాయం చేయడం, అన్నదమ్ముల మధ్య తగాదాలు, వేరుపడడం వంటి విషయాలు వ్యవసాయ కుటుంబ జీవన పరిస్థితుల్ని తెలియజేస్తాయి. అలాగే మల్లయ్యకు బిడ్డనివ్వడం ఇష్టం లేని గోనెవరిమాసమ్మ "ఎద్దు ముడ్డి పొడిసె ఎలమోటు కాపోడు, తుమ్మ నాగలి దున్నె దునుమోటు కాపాడు, కులం తక్కువైన కూరకపోడు" **(చుక్క సత్తయ్య మల్లన్న కాపుల ఘట్టం)** అనని నిందించడం లో నాగరికులకు జానపదులైన సేద్య జీవుల పట్ల ఉండే చులకన భావం కూడా వ్యక్తం అవుతుంది.

## గొర్లు మేకల పెంపకం

యాదవులు, కురుమల ప్రధాన వృత్తి గోర్లు మేకల పెంపకం. దానికి అనుబంధంగా వ్యవసాయం చేయడం కన్పిస్తుంది. యాదవుల కురుమలకు సంధించిన వారే ఒగ్గు పూజారులుగా ఒగ్గు కథాగానం చేస్తారు కాబట్టి కథాగానం లో వారి నోట వెలువడే వర్ణనలలో వృత్తి జీవన ప్రీతి కనిపిస్తుంది. చుక్క సత్తయ్య గారి ఒగ్గు కథల ప్రారంభంలోని "శరణు శరణు మాయమ్మ రాణి శాంభవి రాణి." అని సాగే ప్రార్థన లో "ముందు మా యాదవులకు మూల దేవతా, మంద లోన నెలకొన్న మగువ చౌడమ్మ దేవి చౌడమ్మ "అని యాదవులు ఇలవేల్పు, గోర్లు మేకల మందను సంరక్షించే శక్తి దేవత అయిన చౌడలమ్మ ప్రస్తావన కనిపిస్తుంది. ఇదే గేయంలో యాదవ వంశానికి చెందిన కాటమరాజు వంటి వీరుల గురించి, బీరప్ప ను కన్న సూరమ్మ గురించి కూడా వర్ణించడంలో కురుమ యాదవుల కుల వైభవం చెప్పబడింది. వెండి గొర్రె పైడి గొర్రె కథలో పార్వతీదేవి లోకంలో సృష్టిని చూసి అన్నీ ఉన్నాయి కానీ, గొర్లు లేవని శివున్ని ఒప్పించి గొర్రెలను సృష్టించి వాటికి తన చనుబాలు ఇచ్చి పెంచిందనడం, ఆ వెండి పైడి గొర్రెలను పుట్టలో తోలితే అవి సవలక్షమందను పెంపు చేసాయనడంలో, వృత్తి జీవనాధారాలైన గొర్ల సృష్టి చాలా ఉన్నతంగా జరిగిందని అవి గొప్ప జీవులని వర్ణించడంలో వృత్తి జీవన ప్రీతి కనిపిస్తుంది. ఇదే కథలో మందను సంరక్షించే విధానం, అగ్గి లేని మంద ఆగమవుతుంది, అగ్గిని కాపాడుకోవాలని చెప్పడంలో రాత్రిపూట మంద కావలి ఉన్నవారికి అగ్ని యొక్క అవసరాన్ని వివరించారు. వీటితో పాటు మందును వర్ణించే విధానం, బండి గొర్రె, బొల్లి గొర్రె వంటి గొర్ల పేర్లు ఏర్పడిన విధానం, మేకలు మేసే మంగ చెట్టు మొదలైన పశు వైద్యానికి సంబంధించిన చెట్ల మందుల గురించి వర్ణించడం, మందను పెంపు చేసే తల్లి బొల్లి గొర్రెను పార్వతీదేవి అంశగా భావించడం, జీవనాధారమైన గొర్రెల పట్ల గొల్లల భక్తి భావాన్ని వెల్లడిస్తుంది. అలాగే మంద కాసేవాడు సంసారిక జీవనం సాగిస్తే రాత్రిపూట క్రూర జంతువుల నుండి మందను కాపాడటం కష్టం కాబట్టి "మందకు ఆడదాని అంటు అసలే అంటద్దు "వంటి నియమాలు పెట్టడం మొదలైన విశేషాలెన్నో ఈ కథలో వర్ణించారు. అలాగే ఎల్లమ్మ ఒగ్గుకథలో పరశురామునికి 'ఉక్కుతగరు ఉగ్ర పొట్టేలు' తోడుగా నిలిచిందని దాన్ని పరశురాముడు 'తమ్ముడా' అని సంబోధించాడని వర్ణించడం కూడా వారికి గోర్లు మేకల పట్ల గల ప్రేమాభిమానాలను వ్యక్తం చేస్తున్నాయి.

గొల్ల కేతమ్మ కథలో రారాజు మల్లయ్య తన సంపదలు వదలిపెట్టి గొల్ల కేతమ్మను పెళ్లి చేసుకోవడానికి కనకరేపల్లె లో గొల్ల మాధవసాని ఇంటిలో ఇలిటం పొందాదడని, ఏడు గజ్జి

గొర్లను సవలక్ష మందగా పెంపు చేశాడని వర్ణించారు. రాజ్యానికి రాజైనప్పటికీ గొర్రెల మందలను కాయడం చిన్నతనంగా భావించలేదని గొర్ల పెంపకం అనేది ఉన్నతమైన వృత్తి జీవనమని వర్ణించబడింది. ఇదే కథలో "మ్యాదరి మల్లయ్య తెచ్చిన కొత్త గంపను పూదిచ్చి ఏడు బొందువులు అందులో పెట్టి, సాంబ్రాణి పొగ వేసి, ఇంటి నుండి మంద కాడికి తీసుకుపోయి ఆ ఏబొందువలలో గొర్ల పాలు పిండుకుని తెచ్చి, కాచి, పెరుగు, చల్ల చేసే "మందవారం పట్టడం, మంద గంపనెత్తడం గురించి విపులంగా వర్ణించడం జరిగింది. గొర్లు మేకల పెంపకంతో పాటు కురుమలు ఉన్నితో గొంగడి వేయడానికి అవసరమైన పరికరాల గురించి వెండి గొర్రె –పైడి గొర్రె కథలో చెప్పబడింది. రారాజు మల్లయ్య ఆగొండ రాక్షసిని చంపి దాని ఆధీనంలో ఉన్న బ్రాహ్మణ రత్నాంగిని పెళ్లి చేసుకునే సమయంలో ఆగొండ రాక్షసి నేను మరణించిన తర్వాత నా శరీరమును చెట్టు మీద వేస్తే కుళ్ళిపోతుంది. మిగిలిన ఎముకలు గొంగలి నేసే పరికరాలయి నా బిడ్డ రత్నాంగి సంతానానికి ఆధారం అవుతారని వర్ణించడంలో కురుమల ప్రధాన వృత్తి అయిన ఉన్ని వడకడం, గొంగడి నేయడం గురించి వాటికి సంబంధించిన పరికరాల నేపథ్యం గురించి వర్ణించడం జరిగింది.

"సచ్చవంతులు గొల్లలు సావానధీరులు / సవలచ్చమంద సామిగాసె మంద, దేవదేవుని మంద దేవుని గొర్రెమంద / ఎటుజూస్తేమంద ఎనబైయామెడ ఉంది. అడ్డజాలు మంద అరవై ఆమడలుంది / తొకజాలు మంద తొంబైయామడ ఉంది / వాగుల ఉశికెకు ఎంపుకముందిగని గొల్లలమందకు ఎంపుకంలేదు / మానెడు సోలెడు ఆవాలకు ఎంపుకముందిగని గొల్లలమందకు ఎంపుకంలేదు" **(చుక్క సత్తయ్య మల్లన్న గొల్లకేతమ్మ కథ)**

ఈ వర్ణనలో గొర్లమందను సాక్షాత్తు దైవమే సృష్టించి దైవాంశసంభూతుడైన మల్లయ్య పెంపుచేశాడని లెక్కపెట్టడానికి వీలులేని జీవాలతో గొర్లమంద బయలుదేరిందని, ఇసుకరేణువులను లెక్కించడం సాధ్యమావుతుందేమో కానీ మందలోని జీవాలను లెక్కించడం అసాధ్యమనేంత పెద్దగా ఆ మంద ఉందని వర్ణించడం ఒగ్గు కథకులకు గొర్లపెంపకం మీద ఉన్న అభిమానాన్ని వ్యక్తం చేస్తుంది.

ఈ విధంగా చాలా ఒగ్గు కథల్లో వివిధ సందర్భాలలో ఒగ్గు కథకుల ప్రధాన వృత్తి జీవన మైన గొర్లుమేకల పెంపకం గురించి, వారి వేషధారణ ఆచార వ్యవహారాల గురించి, చల్ల, అంబలి చేయడం వంటి నిత్యకృత్యాలతో పాటు ఉన్ని వడికి, దారం తీసి, గొంగడి నేసే నేర్పు గురించి సందర్భోచితంగా వర్ణించడం జరిగింది.

పరశురాముని బాధల నుండి తప్పించుకోవడానికి జాలిచక్రపురం చేరిన ఎల్లమ్మ సకల కులాల వారిని ఆశ్రయం కోరుతుంది ఆ సమయంలో వివిధ కులాల వారికి సంబంధించిన విశేషాలను ఎల్లమ్మ పాత్ర ద్వారా కథాగానం చేయడం గమనించవచ్చు.

### 2.9.3. కరణాల వర్ణన

"భూమితోబుట్టిన బుడ్డకర్లపయ్య దండము మీకయ్య దయసేయుమయ్య
నక్షలు గీపిచ్చి పట్టభూములు గొలిచి గెట్లు సవరించేటి ఓ కర్ణపయ్య
గెట్లు గెట్లు గలిపె జట్లు ముడివెట్టించి కచ్చీరు దొలించే ఓ కర్ణపయ్య" **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గుకథ)**

ఒక నాటి గ్రామీణ వ్యవస్థలో భూమికి సంబంధించిన రికార్డుల నిర్వహణ లో గ్రామ కరణం ప్రధాన పాత్ర వహించేవారు. భూమికి సంబంధించిన వాజ్యాలలో ప్రధాన తీర్పరిగా ఉండేవాడని ఆయనకు నచ్చినట్టు నడుచుకోనివాన్ని కావాలని భూతగాదాలలో ఇరికించి ఇబ్బందులకు గురిచేసే వాడనే విషయం ఈ గేయంలో వెల్లడవుతుంది.

### 2.9.4.కోమటి వర్ణన

"దండతక్కెడ బాటు ఓ సావుకారి ధనలాభం కల్గించు ఓ సావుకారి
దండి బేరం చేసి ధనము సంపాదించు పూజలు చేసేటి ఓ సావుకారి
లక్ష్మి నీయింటి లావణ్యమై ఉండి కుంటిలచ్చిమి వచ్చి కుచ్చుందునయ్య" **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గుకథ)**

బేరాలు చేస్తూ, రైతులకు అప్పులిస్తూ సంపదను కూడగట్టి, సంపదకు రూపమైన లక్ష్మిని పూజించేవారు వైశ్యులు. ఇక్కడ వైశ్యులు పూజించే లక్ష్మిదేవిని 'కుంటి లక్ష్మి' అని వినూత్నంగా వర్ణించారు. కుంటి లక్ష్మి అంటే కదలకుండా ఒకే చోట ఉండే సంపదల దేవత అని అర్థం. లక్ష్మి చంచలవతి అని ప్రయోగం, అలాంటి లక్ష్మి కుంటి లక్ష్మిగా తమ ఇంట్లోనే స్థిరంగా ఉండాలని భావించే వారనే విషయం ఈ వర్ణనలో వెల్లడవుతుంది.

### 2.9.5. కుమ్మరి వర్ణన

"మృత్పిండమేకము బ్రహ్మాండరూపము మట్టిమన్నన చేసే ఓ కుమ్మరన్న
కుంట మట్టి దెచ్చి సారెపై ముద్దేసి కుండ సవరించేటి ఓ కుమ్మరన్న
పొట్టకూటికొరకు మట్టిలో పొర్లాడి కష్టపడి బ్రతికేటి ఓ కుమ్మరన్న
వృత్తులకు మిత్తులకు సకలకర్మకు కుండ, కుండ లేకుండ జగముండలేదన్న" **(చుక్క సత్తయ్య**

ఎల్లమ్మ ఒగ్గుకథ)

నాగరికత అభివృద్ధిలో చక్రం మొదటి ఆవిష్కరణ అని చెబుతారు. అలాంటి చక్రాన్ని సారెగా చేసి మానవాళికి పాత్రలను అందించిన గ్రామీణ సాంకేతిక విజ్ఞాన నిపుణుడు కుమ్మరి. పుట్టుక, పెళ్లి, చావు వంటి మానవజీవితములోని కీలక సందర్భాలలో మట్టి కుండ ప్రాధాన్యం నేటికీ గమనించవచ్చు. అందుకే కుండ లేకుండా జగము ఉండదనే అర్థవంతమైన యమకాలంకారములో కుమ్మరిని వర్ణించారు.

ఈ విధంగా ఒగ్గుకథ లో సందర్భానుసారంగా పైన తెలిపిన వృత్తుల వారితో పాటు "ఎద్దుమోత పంచాంగం పట్టుకుని వచ్చే బ్రాహ్మణుల" ను, చాకలి, గౌడ ఇలా సమస్తకులాలను వర్ణించడం గమనిస్తే సమాజ జీవనంలోని ఆయా ఉత్పత్తి కులాల ప్రాధాన్యత గతకాలపు సమాజంలో వారి జీవన విధానం గురించిన విశేషాలు గుర్తించడానికి వీలవుతుంది.

### 2.9.6.యుద్ధ సన్నద్ధ వర్ణన

"అండయోధులార, దండనాయకులార, అష్టమంత్రులార, దివ్య ప్రధానులార
పాలివాడు ఎవ్వడు – పగవాడు ఎవ్వడు / మిత్రుడెవ్వడొచ్చెర – శత్రుడెవ్వడొచ్చెర
ఎద్దండుగదల్లమే – పిండివడగొరికెర / కాయిదండ కొరికెనా – కనుగుడ్లెర్ర జేసెనా
ఊరు బయలు ఎల్లిరి – ఊల్లు ముల్లు దాటిరి
నడుములు బిగించి కట్టిరి – లడాయి డప్పు గొట్టిరి" **(చుక్కసత్తయ్య ఎల్లమ్మ ఒగ్గుకథ)**

ఎల్లమ్మ ఒగ్గుకథలో కార్తవీర్యుడు యుద్ధానికి, వేటకు వెళ్ళిన రెండు సందర్భాలలో ఈ వర్ణన కనిపిస్తుంది. త్రిస్రగతి ఛందస్సులో, చల్తీ దరువులో ప్రతి పాదంలో చక్కని అనుప్రాస, అంత్యానుప్రాసలతో పదవిరుపులలో వచ్చే యతిమైత్రితో, మధ్యలో గంభీరమైన అనుసంధాన వచనంతో సాగే ఈ వర్ణన రాజుల కాలం నాటి యుద్ధ సన్నాహాలను తెలియజేస్తుంది. యుద్ధంలో పాల్గొనే మంత్రులు అధికారుల నుండి సైనికుల వరకు ఉత్సాహంతో ముందుకు కదలడం, ఆయుధాల విశేషాలు, దస్తు గుంటగావట్టి " అంటే పిడికిలి బిగించి తిప్పి చేసే యుద్ధ సంకేతాల గురించి, కత్తి కత్తి కలిసి చేసే యుద్ధంలో పదునైన కత్తులు మెరుపులను, ఏనుగు అంబారీ పై హనుమంతుని జెండాతో విజయ ధ్వజం సిద్ధపరచి బయలుదేరడం, మారేల్లి సారయ్య, కోమటి చెల్లప్ప వంటి యుద్ధ వీరులు గురించిన ఎన్నో విశేషాలను ఈ కథాగేయం వివరిస్తుంది. మొదట త్రిస్ర గతితో ప్రారంభమై, చతురస్ర, మిశ్ర గతిలో సాగి ధీరగంభీరమైన చల్తీ దరువులో వీర రసావేశంతో గానం చేయబడే ఈ యుద్ధ సన్నద్ధ వర్ణన దానికి తగ్గట్టుగా డోలు, నపీర

వంటి వాద్య సహకారాలు, కథకుల హావభావాలు చూసేవారికి యుద్ధ రంగంలో ఉన్నామనే భ్రమను కలిగిస్తాయి.

### విరహ వేదన

"నారీ ఒయ్యారి భామ, తాళలేను నారీ నారీ / మన్మధబాణములే నారీ, మరిమరి హెచ్చినయి నారీ ఆ, అయ్యో ఇది పాపమని అంటావా, పాపమెట్లు అవుతాది భామా / పాపము మాయింట్ల నారీ, పత్తి గింజలంట నారీ / దోషము నాయింట్ల నారీ, దోస గింజలంట నారీ తాళలేను నారీనారీ తనువు నిలువవోదే నారీ" **(చుక్క సత్తయ్య మాంధాత ఒగ్గుకథ)**

పేదరికంతో ఆశ్రయం కోరివచ్చిన విమలాంగిని చూసి పోలిశెట్టి అనే వైశ్యుడు ఆమెను పొందగోరుతాడు. ఆమె అది తప్పని తాను వివాహితనని వద్దని వారిస్తుంది. ఆమె అందానికి వివశుడైన వైశ్యుడు ఆమెను తలుచుకుంటూ విరహ వేదన పొందిన సందర్భంలో ఈ వర్ణన కనిపిస్తుంది. వావివరసలు లేక వలచిన స్త్రీతో పొందు చేయడం తప్పయినప్పటికీ ఆ తప్పును, ఆ పాపాన్ని తేలికగా తీసేసే దురాలోచన ఉన్న వ్యక్తుల లక్షణం ఈ వర్ణనలో కనిపిస్తుంది.

### 2.9.7. అడవి వర్ణన

"చీమలు దూరని చిట్టడవి, కాకులు దూరని కారడవి, గద్దలు దూరని పెద్దడవిలో కంచల్లమర్రి, కరుణాల పుట్ట, ఊడలతోని మర్రి ఊరెలుమున్నది పంగలతోని మర్రి పటవృక్షమున్నది అటువంటి మర్రిదగ్గర కాలింగాల మడుగు ఒడ్డున ఒడ్డున తాటికమ్మల గుడిసేసుకుని జమదగ్ని తపము చేయువట్టెనమ్మ రామ రామ". (చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గుకథ)

"ఎక్కరాని కొండలైన ఇగ ఎక్కి పోవుచున్నడేమి
దిగరాని కొండలైన ఇగ దిగి పోవుచున్నడేమి అడవిలో......లేళ్ళు దుప్పులు మనుపోతులు,
సింహశార్థూలములు, మారు పెద్దపులులు, గండభేరుండములు, కొండచిలువలు,
భల్లూకంబులు ఝుల్లి మృగంబులు చెలగాటమాడుతుండగనే.....
ఓపలేని ఎండలంట ఒడలు రంధ్రం పడతయేమో
అడుగుదీసి అడుగువెడితే – చెప్పరాని ఆయసమేమి" (చుక్క సత్తయ్య మాంధాత కథ)

చుక్క సత్తయ్య గారి మాంధాత ఒగ్గు కథలో కనిపించే అడవి వర్ణన మిశ్ర గతి గేయంగా సాగుతూ మధ్యలో వచ్చే అనుసంధాన వచనం ప్రబంధ కావ్య రచన వలె సుదీర్ఘ సమాసంగా సాగుతుంది. గంభీర స్వరంతో అడవిని వర్ణిస్తూ వెంటనే స్వర మార్పులతో ఆ అడవిలో పడే నాయకుల బాధలను కరుణ రసాత్మకంగా వర్ణిస్తూ, అడవిని, అక్కడి పరిసరాలను నాయకుల

కష్టాలను దృశ్యమానం చేస్తాడు. కాకులు దూరని కారడవి, చీమలు దూరని చిట్టడవి అనే ప్రయోగం సాహిత్య జనజీవనంలో కనిపించినప్పటికీ దానికి కొనసాగింపుగా వచ్చిన "గద్దలు దూరని పెద్దడవి' అనే ప్రయోగం పూర్తిగా ఒగ్గు కథకులు సృష్టించిందే. చెట్లు కనపడకుండా పెరిగిన గడ్డిని వివిధ రకాల అడవి మృగాలను, విస్తరించిన వట వృక్షాలను వర్ణిస్తూ సాగే ఒగ్గు కథాగానంలో కరుణము, భయానకం కలగలిసి కనిపిస్తాయి.

ఉగ్రశక్తిరూపం

"మతిమయోగ పట్టణంలో ఉన్న అమ్మవారు విధినాంచారి ఆరుమంటలు మండుకుంట..... ఒరే..... ఏయ్, ఎవడవురా.....ఆ...మాంధాత గొట్టె దెబ్బలకు మంటలు పుట్టె విధమ్మకు ఆర్చికూతలు పెట్టింది– ఆగాయి బొబ్బలు లేపింది ఏడు యోజనాలెగిసింది దంతపు కోరలు చాపింది.
ముప్పలుపుట్లమూర్తులలో అరువైపుట్ల ఉగ్రముతో ఊళ్ళో ఉళ్ళో జనులంత ఊగసాగిరి ఊరంత....." **(చుక్క సత్తయ్య మాంధాత ఒగ్గుకథ)?**

శిష్ట సాహిత్యం లో పురుష పాత్రలకు ఉన్న ప్రాధాన్యం స్త్రీ పాత్రలకు ఉన్నట్టుగా కనిపించదు. కానీ ఒగ్గుకథలో స్త్రీ పురుష పాత్రలను సందర్భానుసారంగా సమాన స్థాయిలో వర్ణించడం జరుగుతుంది. ప్రధానంగా నాయకున్ని ఎదుర్కోగల శక్తిని వర్ణించే సందర్భంలోను, ఎల్లమ్మ ఒగ్గుకథలో ప్రతి నాయకుడైన కార్తవీరునికి ఎదురునిలిచిన ఎల్లమ్మ రూపాన్ని వర్ణించే సందర్భంలోనూ ఈ విశేషం కనిపిస్తుంది.
స్త్రీని చులకనగా భావించిన మాంధాత గర్వము అణచడానికి బయలుదేరి వచ్చిన విధినాంచారి రూపం మిక్కిలి శక్తివంతమైనదిగా వర్ణించబడుతుంది. తాటి చెట్టు పొడుగు కాళ్ళు, చెన్నంగ బడతల వంటి చేతులు, కొడవండ్ల వంటి కోరలు అని వర్ణించడం ఉగ్రశక్తి అయిన విధినాంచారి విశ్వరూపమును కళ్లముందు సాక్షాత్కరింప జేస్తుంది. అలాంటి రూపంలో అమ్మవారు వస్తుంటే రాజులు జేకొడుతున్నారని, డప్పులతో, గుగ్గిలం పొగతో, అమ్మవారిని పూజిస్తుంటే శివశక్తులు శిగాలుగుతున్నాయని వర్ణించడంలో శక్తి రూపం చెడ్డవారికి భీకరంగాను, భక్తులకు తన్మయం కలిగించే దేవత గాను తెలుపబడింది.

మాంధాత ఒగ్గుకథలో విధినాంచారి, మల్లన్నఒగ్గు కథలో ధనాలకోట మైసమ్మ, ఎల్లమ్మ కథలో లంకలో నుండి బయటకు వచ్చిన ఎల్లమ్మ వంటి స్త్రీ శక్తి రూపాలను ఒగ్గు కథకులు వర్ణించే తీరు శ్రోతలలో తన్మయత్వం కలిగిస్తుంది. ఆ వర్ణనకు తగ్గట్టు డోలు డప్పు మోగుతుంటే

కథాగానంలో సైతం భక్తులు పరవశించి పోయి శిగాలుగుతారు. స్త్రీ శక్తిని ఇంత ఘనంగా వర్ణించడంలో స్త్రీ శక్తి బలమైనదని తెలిపే ఆదిమకాలంలోని మాతృ దేవతారాధన ఛాయలు కనిపిస్తున్నాయి.

**పరశురాముని రూపం**

"రాముడె రాముడు, కోదండ రాముడు, ఎల్లమ్మ కుమారుడు, ఎలపరశురాముడు

నల్లనివాడు, నామాలు గలవాడు, శంఖచక్రాలు, భుజ కిరీటాలు, బంగారు తిరుణం,

మెరుగు మీసం, బైరి గడ్డం, పక్కల పగిడి మచ్చ, ప్రాణాల గుత్తోడు బలపరశు రాముడు........ఆ ......బాల పరశురామయ్యా.... ఆ కుడిమీసమొడి వెట్టి గుడ్లెర్రజేసి, ఎడమమీసమొడి వెట్టి వెన్నెరుగజూసి, ఎండివంటి దంతాలు పిండివడ కొరికి

రాముడె కోదండ రామ అరిబల గోవిందరామ / ఎల్లమ్మ కొమరుడేన అరిబల గోవిందరామ ఎల పరశురాముడేన అరిబల గోవిందరామ / మార్గమున పరశురామ అరిబల గోవిందరామ మండిపడుత ఉన్నదేమి అరిబల గోవిందరామ / పౌరుషాన దండివాడు అరిబల గోవిందరామ పరశాప ధీరుడేన అరిబల గోవిందరామ / అదుగుదీసి అదుగువెడితె అరిబల గోవిందరామ అర్ధగజం భూమి రామ అరిబల గోవిందరామ / కుంగి పోత ఉన్నదేమి అరిబల గోవిందరామ"

**(చుక్క సత్తయ్య ఎల్లమ్మఒగ్గుకథ)**

శైవమత ప్రధానంగా కనిపించే ఒగ్గు కథలో విష్ణు అవతారంగా భావించే పరశు రామున్ని, ఎల్లమ్మతల్లి కుమారునిగా భయభక్తులతో పూజిస్తారు. ఒగ్గు కథలో పరశురామునన్ని తిరుగులేని వీరుడిగా వర్ణిస్తారు. పన్నెండేళ్ళ బాలుడిగా పాతాళలోకం వెళ్లి దేవతల బొంగురం సంపాదించడం, యాబైయారు రాజ్యాల రాజులకు లొంగని దేగను లొంగదీసుకోవడం, బలిజ రాజుల పందెంలో గెలవడం, సల్ప ఆయుధం సంపాదించి కార్తవీర్యుని చంపిన ఘట్టాలలో పరశురామున్ని ఉగ్రమూర్తి గా వర్ణిస్తారు. పాత్రోచిత హావభావాలతో గంభీర స్వరంతో వర్ణించడం ద్వారా పరశురాముని రూపాన్ని ప్రేక్షకుల మనసులో స్థిర పరుస్తారు.

**భోజన పదార్థాలు**

"అరటి తామర నారికేళ ఫలములు, గారెలు గజ్జెలు చేసిన బూరెలు, చేగోడీలు లడ్లు, జిలేబీ,షడ్రసోపేతమైన భక్ష్యములు, దండి ఘృతములు, క్షీరాన్నముల మధుర పాయసము నవకాయ పిండి వంటలు, అప్పాలు, దప్పళాలు, పులిహోరాలు పుల్లటి శాకాలు, పప్పు కలియాప నెయ్యి భగారలు గుమ్మడికాయ వడియాల ఘృతములు, అల్లముల పచ్చడ

ఆవదోసకాయలు బెల్లపు మోరుండలు" **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గుకథ)** జమదగ్ని ముని ఆశ్రమంలో ఉన్న కామధేనువును ఇచ్చిన పాలు మర్రిబుర్రల్లో నింపి కార్తవీర్యునిసైన్యం తీసుకెళ్తారు. కామధేనువు మహిమవలన ఆ పాలు వివిధ రకాల పదార్థాలుగా మారాయని తెలిపే సందర్భంలో ఈ వర్ణన కనిపిస్తుంది.

"ముప్పయారు కూరలు మునుగపూలపచ్చడి / అరువైయారు కూరలు అల్లముల పచ్చడి
డెబ్బయారు కూరలు దేవనందుల పెరుగు" చిన్నవరి బియ్యము చిటుకుళ్ళ వంటలు /
పెద్దవరి బియ్యము పేర్పుళ్ళ వంటలు / గుర్తుగ వండిన గుమ్మడికాయ కూర / చిటపట
ఉడికిన చిక్కుడుగాయలు / చుట్టూరుగశాఖాలు నట్టనడుమ అన్నము / నడిఅన్నము
మీద / నల్లనాగువుల పెరుగు **(చౌదరిపల్లి అంజయ్య గొల్ల కేతమ్మ కథ)**
"కాకరపువ్వుల్ల కళ గంగాళము దోమి, చిక్కుడు పువ్వుల్ల సిరి గంగాళము దోమి
కాకరాకు బియ్యము రేకులు వడ గడిగి, పాలకడియాల భోజనము తయ్యారు జేసి
మెట్టు చిక్కుడు గాయ మేకల మజ్జిగలు ములక్కాయతో మున్నూట కూరలు
బంగారు బొద్దు గిన్నె నిండా వద్దన జేసి..." **(చుక్క సత్తయ్య బీరప్ప కథ)**

గొల్ల కేతమ్మ మల్లన్నకు సద్ది తీసుకుని పోయే సందర్భంలోనూ, అక్క మాంకాళి బీరప్పకు తినిపించే సందర్భంలోనూ కామధేనువు పాలు వివిధరకాల ఆహార పదార్థాలుగా మారి కార్తవీర్యుని సైన్యానికి ఆకలి తీర్చిన సందర్భాన్ని వర్ణించడంలో కథా కాలంనాడు వాడుకలో ఉన్న వివిధ రకాల ఆహారపదార్థాల వర్ణన కనిపిస్తుంది. ఒగ్గుకథలో వర్ణించబడిన ఈ విషయం అచ్చతెలుగు, సంస్కృత సమాసాల సమ్మిశ్రితంగా సాగింది. కాకరాకు బియ్యం అనేవి వరిలో ప్రసిద్ధ రకాలు. ప్రత్యేకించి పండగల సమయంలో వీటిని వాడేవారు. ఇటువంటి భోజన పదార్థాల వర్ణన ద్వారా గతకాలపు గ్రామీణ జీవనంలోని ఆహార సాంప్రదాయాలు, వంటకాల వైవిధ్యాలు గ్రహించవచ్చు.

### 2.9.8. గోవు వర్ణన

"ఆవుకుచమున గంగ అవతరించే, నందినోట గంగ నడిచి వచ్చే
ఆవు చక్కదనము హనుమంత మోర, కొమ్ములు చక్కదనము కోట భైరవి,
నడుములు సన్నము నాగ భైరవి / పిక్కలు సన్నము పికిలి కుంచము బోలు,

డెక్కలు సన్నము దేవభైరవి / ఎడమప్రక్కన సూర్య ప్రకాశము, కుడి ప్రక్కన చంద్ర ప్రకాశము రోమరోమాన దేవగనములు కళకళ లాడుచుండ / వీపున వింజామరలు, వెన్నున శివలింగము,దాపున పార్వతి విగ్రహము / కొమ్మున కుప్పెలు, బంగారు లడికుచ్చులు వ్రేలాడుచుండ

మేఘము వలే గంభీరము ఏమీ ఈ ధేనువ శృంగారము" **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గుకథ)**

భారతీయ హైందవ ధర్మ సాంప్రదాయంలో ఆవుకు విశిష్టత ప్రాధాన్యమున్నది. ఆవును కేవలం పాలిచ్చే జంతువుగా కాకుండా గోమాత అని తల్లిగా, దైవంగా భావిస్తారు. ఈ సంప్రదాయం ఒగ్గు కథాగానంలో కూడా కనిపిస్తుంది. నీటి మడుగులో పడిపోయే సమయంలో కామధేనువును జమదగ్ని రక్షిస్తాడు. అందుకు ప్రత్యుపకారంగా ఆ ఆవు ఎల్లమ్మ స్వయంవరంలో జమదగ్నికి సహకరిస్తుంది. ఆ సందర్భంలో వర్ణించబడిన కామదేను రూపం దైవీ భావనను కలిగిస్తుంది. ఆవు శరీరంలోని ప్రతి అంగము సకల దేవతలకు స్థానం అని భావించే సంప్రదాయం ఒగ్గు కథలో చేయబడిన కామధేనువు వర్ణనలో కనిపిస్తుంది. ఈ వర్ణన కథకుల నోటనే కాదు శ్రోతల నోట కూడా "ఆహా ఏమి ఈ ధేనువు శృంగారం" అని అనిపిస్తుందనడం అతిశయోక్తి కాదు.

**తిట్టు పాట**

"రండదాని కొడుక రాముడా పరశురాముడా/నీకు రాజిర్కమెక్కడిది రాముడా పరశు రాముడా ముండదని కొడుక రాముడా పరశురాముడా / నీకు ముంగిళ్ళు ఎక్కడ పరశు రాముడా తండ్రిని చూపెట్టి రాముడా పరశురాముడా /మాతో తగాదా జెయ్యాయి పరశు రాముడా తియ్యటి కల్లుకు రాముడా పరశురాముడా /మరి లేత ముంజలకేమో రాముడాపరశు రాముడా నీతల్లి కొంగేసి రాముడా పరశురాముడా / అట్లా మిమ్ములా గన్నది రాముడా పరశు రాముడ" **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గుకథ)**

దేవతల బొంగురం సంపాదించిన పరశురాముడు కంచుభేరి పట్నం చేరి ఏడుగురు బలిజరాజులను పందెంలో ఓడించాడు. పరుశురామునితో గెలవలేని బలిజరాజులు పరశు రాముడు తండ్రి చచ్చినంక పుట్టాడని నిందించిన సందర్భంలోనిది ఈ వర్ణన. ఆస్తిపాస్తుల కన్నా ఆత్మగౌరవం మిన్న. ఆత్మ గౌరవం మీద దెబ్బ పడినప్పుడు ఎంతటి వీరుడైన డీలా పడిపోతాడు. అందుకే పరశురామున్ని భుజబలంతో గెలవలేక బలిజరాజులు అతని తల్లి చెడిపోయి కన్నదని నిందిస్తారు. ఈ నిందా వర్ణన ద్వారా అపకీర్తి కలిగిన తల్లిదండ్రులకు పుట్టిన బిడ్డలకు నాటి సమాజంలో సరైన గుర్తింపు లేదని అటువంటి పిల్లలకు ఏ అధికారాలు ఇవ్వలేదనే విషయం తెలుస్తుంది. ఒగ్గు కథ మానవాశ్రితాలైన అన్ని భావాలను సమర్థవంతంగా వ్యక్తం చేస్తుందనడానికి ఈ పాట చక్కని ఉదాహరణ.

ఈ ఒగ్గు కథాగేయంలో తిట్ల ప్రయోగంలో కొంత అశ్లీలత చోటు చేసుకున్నప్పటికీ,

భుజబలంతో గెలవలేక వీరుడైన పరశురామున్ని మాటలతో దెబ్బతీయడమనే భావ ప్రధానంగా ఈ గేయం సాగింది. "జానపదుని భాషలో అశ్లీలత ఉంటుందేమో కానీ భావంలో అశ్లీలత ఉండదు" [5]ఈ మాటలు ఒగ్గు కథలో గానం చేయబడే వివిధ వర్ణనలకు చక్కగా వర్తిస్తాయి. ఇలాంటి తిట్టు పాటలతో పాటు ఒగ్గు కథలో నిందించడాన్ని గానం చేసే సమయంలో

"దాని చూసే కండ్లల్ల సూదులు నాట / కనవడే కండ్లల్ల కత్తులు నాట

ఇచ్చిన దేవుడు మెచ్చి కొంటవోను" (మిద్దెరాములు అమెరికా రాజు కథ) వంటి సహజమైన ప్రాసాత్మకపదాలు కనిపిస్తాయి.

## ఒడి బియ్యం పోయడం

"పన్నీట జలకమాడించి, పసుపు కుంకుమ వెట్టి, దప్పులు కొమ్ములు, జాగంటలు మోగించి,

పనసలు కొట్టించి పందిల్లేసి, నిమ్మలు కొట్టించి నీడలేయించి, ఐదుసొల్ల బియ్యము ఆకులు, పోకలు వెట్టి పాలు ఒయ్యారే ఓడి పాలు ఒయ్యారే... అమ్మా వారికి పాలు ఒయ్యారే ఓడి పాలు ఒయ్యారే ముత్యమంతా పసుపు దెచ్చి మొకమెల్ల కడ జేసి /మొకమెల్ల కడ జేసి నెత్తి నిండా పూలు వెట్టి ॥పాలు ఒయ్యారే॥ **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గుకథ)**

తెలంగాణ ప్రాంతంలో ఇంటి ఆడబిడ్డకు మూడేళ్లకు ఒకసారి, ఐదేళ్లకొకసారి పుట్టింటిలో పండగల సమయంలో ఒడివాలు పోయడం అనే సంప్రదాయం ఉంది. ఎల్లమ్మ ఒగ్గు కథలో పరశురాముని బాధలకు తాళలేక రేణుకా ఎల్లమ్మ వెలివాడలో ఆదిజాంబవున్ని ఆశ్రయించిలంద లో దాగి ఉంటుంది. తల్లి జాడ తీసుకుని వచ్చిన పరశురాముడు పంబాల వేషం కట్టి ఎల్లమ్మను లంద నుండి బయటకు రప్పించి తనతోపాటు తోలుకొని పోయే సందర్భంలో జాంబవులందరూ కలిసి ఎల్లమ్మను ఆడబిడ్డగా భావించి ఒడివాలు పోసి సాగనంపుతారు. స్త్రీకి పుట్టినింటితో ఉండే అనుబంధానికి గుర్తుకు గా నిలిచిన ఒడివాలు/ఒడిబియ్యం సంప్రదాయాన్ని ఒగ్గు కథలో చక్కగా వర్ణించడం జరిగింది. బియ్యం లేదా జొన్నలకు పసుపు రాసి, పసుపు కొమ్ములు, తమలపాకులు, ఖర్జూరాలు, పోకలు పసుపు కుడుకలు కలిపి ఆడబిడ్డ ఒడిలో ముత్తయిదు స్త్రీలు పోసే ఓడి బియ్యాన్ని ముత్యాలుగా రకరకాల పువ్వులుగా వర్ణించారు. అలనాడు జాంబవులు ఎల్లమ్మను ఆడబిడ్డగా భావించి ఒడి వాలు పోసి పంపడం వల్ల నేటికి కూడా ఆదిజాంబవులు ఎల్లమ్మను ఆడబిడ్డ గాను వారి లందను ఎల్లమ్మ నివాసం గానూ భావించి పూజిస్తారు. ఈ విషయం ఒగ్గు కథలో ఎల్లమ్మ గురించి "శివునికి చిన్న బిడ్డ శివనెల్లిమాత, గౌతముని కోడలు గంభీర వాణి, మాదుగుల ఆడబిడ్డ మావురాల ఎల్లు" అని తెలిపే వర్ణనల ద్వారా వెల్లడవుతుంది.

### 2.9.9. కుష్టు వ్యాధి గ్రస్తుని వర్ణన

బలిజ మేడలమ్మతో పందెం కట్టి గొల్ల మాధవసాని ఇంట ఇలిటం ఉండడానికి వెళ్ళిన రారాజు మల్లయ్య రూపులు పటమారి గూని కుష్టాది వేషం కట్టాడు. గోరెడు విభూతి తీసి ఉపములు, జపములు, తారకమంత్రం తనువెల్ల జదివి శరీరం మీద కొట్టంగానే కుష్టు వ్యాధి రూపం పుట్టింది.

"నడుమంత్రానికి నాలుగు రోగాలు / కుడికాలు కుష్టాది, ఎడమకాలు మండి
వీపుల గూని, గూని మీద రాసపుండు, రడగబ్బు పెడ మురుగు
ఈగలు దోమలు ఇరువై లక్షలు, తోకటీగలు తొంబై లక్షలు,
నెత్తిమీద సవురం మూతిమీద వడి, మూతిమీద సవురం ఎదమీద వడి,
ఎదమీది సవురం మొలమీదవడి, మొలమీది సవురం మోకాలు మీద వడి
అమాసకు అయిపోతాడు, పున్నానికి పుచ్చి పోతాడు అన్నట్టు..... **(చుక్క సత్తయ్య మల్లన్న-గొల్ల కేతమ్మ ఒగ్గుకథ)**

మల్లన్న ఒగ్గుకథలో మల్లన్న దేవుడు గొల్ల కేతమ్మ కోసం గొల్ల మాధవసాని ఇంట ఇలిటానికి వెళ్ళిన సమయంలో, బీరప్ప ఒగ్గు కథలో కామరతి స్నానమాడే బాయిదగ్గరకు బీరప్ప వచ్చిన సమయంలో కుష్టు వ్యాధిగ్రస్తుని వర్ణన అత్యంత జుగుప్సాకరంగా వర్ణించబడింది. ఈ రెండు ఒగ్గుకథలలోనూ నాయకులు తాము కోరుకున్న పిల్లను పెళ్లి చేసుకోవడం కోసం రూపం మార్చుకుని కుష్ఠ వ్యాధిగ్రస్తునిగా వెళ్తారు.. నాయకుడు ధరించిన కుష్టువ్యాధి రూపం ఈగల, దోమలతో, పుండులో కదలాడే పురుగులతో శరీరమంతా నిండిపోయి క్షవర సంస్కారం లేని వెంట్రుకలతో చూడడం కాదు కదా, వింటేనే మనసుకు రోత కలిగించే విధంగా ఈ వర్ణన సాగుతుంది. దీనిని బట్టి గతంలో కుష్టువ్యాధిగ్రస్తుని ఎవరూ పట్టించుకోక దూరంగా ఉంచడం వలన వారు శరీర సంస్కారం లేక పుండ్లు పడి అత్యంత హేయమైన జీవితాన్ని అనుభవించేవారని తెలుస్తుంది.

### 2.9.10. వివాహ వర్ణన

"నిమ్మలు కొట్టించి నీడలోడ్డి, పచ్చలు కొట్టించి పందిరేసి,
ఆకాశమంత అరుగులు, భూదేవంత గద్దెలేసిచిక్కుడాకు తోరుణాలు శివ కంకుణాలు,
మామిడాకు తోరుణాలు మణి కంకుణాలు, మంగలోళ్ళ పిలిచి మైల పోలు దీసి

సాకలోల్లపిలిచి  చక్కని పోలు ఎట్లా రాస్తున్నారు...ఆ...

రాలేటి సుక్కాలు రంభా తలువాలు ఓనారామయ్య రంభా తలువాలు ఓనారామయ్య

ఈ ప్రకారంగా లగ్గమయినంకా ఒలుకంగా ఓడిబియ్యము పోస్తే...ఆ..

అమాస ఎన్నాడు అలుకుతా నీ అమాసా ఎన్నాడు,

పున్నామ ఎన్నాడు పూదిత్తా నీ కడపా పున్నామా ఎన్నాడు... అని కడప కడిగి కూరాట్ల చేయి వెట్టి, కలి కన్నతల్లి కొంగుకు తుడిచి ఇంట్లకెంచి కుడికాలు ఇవుతల వెట్టింది ఆ గొల్ల కేతమ్మా..ఆ..." **(చౌదరిపల్లి అంజయ్య గొల్ల కేతమ్మ కథ)**

"బాజలు భజంత్రీలు బలువైన సోన్నాయిలు, తురుములు కొమ్ములు దుల్లాన భేరీలు, కారుకొమ్ముల మోత కడలు ధనులెల్ల, బూరకోమ్ముల మోత భూములు ధనులెల్ల టేకుటాకుల తెరలు,తమలపాకుల దడులు, అడుగడుగున బుడిగె బావులు చిన్న చిన్న ముత్యాలు శివ దొరుణాలు, పెద్దపెద్ద ముత్యాలు పెళ్లి దొరుణాలు కట్టి వైభవంగా కళ్యాణము జేసి... ముంతతోని పాలుదాగ మూడువేల బర్లమంద, పటువతోని పాలుదాగ పన్నెండు నూర్ల ఆవులమంద, ఆకువిడెం కింద అరువైఆరు గ్రామాలు అరుణం కొట్టించి ఈ ప్రకారముగా... నీలమ్మకు, ఆదిరెడ్డికి కళ్యాణము జరిపినారు జయరామరామ పెండి జరిగె పూటలు జరిగె జయరామరామ ప్రేమ మీర పాటలు జరిగె జయరామరామ – నాగవెల్లి పూర్తి జేసిరి నీలమ్మకు" **(చుక్కసత్తయ్య మల్లన్న కాపుల ఘట్టం ఒగ్గుకథ)**

పైన పేర్కొన్న ఇరువురు ప్రధాన కథకుల ఒగ్గుకథల్లో కనిపించే వివాహ వర్ణన తెలుగు వారి ప్రాచీన వివాహ సంప్రదాయ వైభవాన్ని తెలియజేస్తుంది. పందిర్లు, తోరణాలతో పాటు పెళ్లిలో విశిష్ట స్థానం గల పోలు పోయడం అనే ప్రక్రియను అత్యంత సుందరంగా వినసొంపైన దరువులో వర్ణించారు. గతంలో ఇంట్లోని కూరాడులో ఉండే కలిని వంటకు ఉపయోగించేవారు. అందుకే కూరాడును శుచిగా శుభ్రంగా కాపాడుతూ ఆడబిడ్డకు ప్రతిరూపంగా భావించేవారు. ఇంటి ఆడబిడ్డకు పెళ్లి చేసి అత్తవారింటికి పంపే సమయంలో కూరాడు లో చేయి పెట్టించి చేతికంటిన కలిని కడగకుండా తల్లి కొంగుకు తుడిపించేవారు. నేడు వంటల్లో కూరాడు కలిని వాడకపోయినా పెళ్లి సమయంలో ఆడపిల్లతో కూరాడుకు నమస్కరించడం అనే సంప్రదాయం కొనసాగుతోంది. ఇలాంటి కూరాడు సాంప్రదాయాన్ని ఆడపిల్లకు అరణంగా పశువులను పంపే ఆచారాన్ని ఒగ్గుకథకుల వివాహ వర్ణన లో చూడవచ్చు.

### 2.9.11.జూదం వర్ణన

మహాభారత కాలానికి ముందు నుండి జూదం అనే క్రీడ ఉన్నట్టు తెలుస్తుంది. గ్రామీణ క్రీడగా గవ్వలతో ఆడే జూదం గురించి ఒగ్గు కథలో వర్ణించారు.

రారాజు మాంధాత విధింబొట్ల వేషంలో ఉన్న అమ్మవారు విధినాంచారి ఎదురెదురుగా కూర్చుని జూదంలో పందెమెట్లు వేస్తున్నప్పుడు........ ఆ

"రంగస్థలముల ఆటకమ్మ రామ ఓ రామా, ఏర్పాటు జేయవట్టిరీ రామ రఘురామా

ఏయ్, దాము గొట్ట వట్టిరీ దాము లేప వట్టిరీ / బాలగవ్వ పందెము, జోడుగవ్వ జూదము గిల్ల గిల్ల గవ్వలు గిలుపుతానే ఉన్నారు / పందెములా గవ్వలు పారేయ్య వట్టిరీ" **(చక్క సత్తయ్య మాంధాత ఒగ్గుకథ)**

ఈ వర్ణనలో పందెంలో ఉపయోగించే గవ్వలను జోడుగవ్వలుగా, బాలగవ్వలుగా చెప్పడం, "గిల్లగిల్ల" అనే క్రియా విశేషణాల తో గవ్వలు వేసే విధానాన్ని వర్ణించడంలో విశేషించి ఈ జూదాన్ని సభలో ఆడడాన్ని రంగస్థలం మీద అని చెప్పడం రాజుల కాలంలో జూదానికి ఉన్న ఆదరణను ఒగ్గుకథ గానంచేస్తుంది.

### 2.9.12. నాగన్న వర్ణన

"నాగ దిగురా నా తండ్రి దిగురా అయ్యా దిగురా ముద్దులయ్య దిగురా

నిండు పున్నామ నాడు పండుటెన్నెల గాసే, నిండు పున్నామ నాడు, పండుటెన్నెల గాసే, సూర్యాగ్రాణాము వట్టె, సందామామాను మెట్టే, ముసిముసి రేపల్లె మునూల గణామయే పకపక రేపల్లె పక్కాల గణామాయే రాజుగారింటేనుక రాజ కచ్చీరు కాడ, నువ్వు కరిసి ఇసం బోసి ఒక్కత్త కోడండ్లు నాగన్న ఎడుగురారండ్లు నాగన్న ఎడుగురారండ్లు నాగన్నా నిను సల్లల్ల పురుగాని నాగన్న సంపి వేస్తరురా ఏయ్ దిగు దిగు దిగు దిగు దిగు దిగు దిగు దిగు" **(చౌదరిపల్లి అంజయ్య అమెరికా రాజు ఒగ్గుకథ)**

కుల హద్దులలో నుండి సామాజిక వేదిక మీదకు చేరిన ఒగ్గుకథ ప్రజలను అలరించడానికి చేసిన ప్రయత్నంలో భాగంగా కొన్ని మార్పులు జరిగాయి. వాటిలో కథానుగుణంగా జానపద గేయాలు గానం చేయడం ఒకటి. ఆ విధంగా మొదట జనవ్యవహారంలో ఉండి అనంతరం ఒగ్గు కథలో చేరి విశేష ప్రాచుర్యం పొందిన గేయం ఈ నాగన్న పాట. ఒగ్గు కథలో కనిపించే నాగుపాము వర్ణన చక్కని స్వభావోక్తి అలంకారంలో ఉంటుంది. ఒగ్గుకథాగానంలో డప్పుకు తాళానికి అనుగుణంగా రెండు చేతులను కలిపి నాగపగిడెలుగా చూపెట్టి నర్తిస్తూ లయబద్ధంగా సాగే నాగన్న వర్ణన, ప్రదర్శన మిక్కిలి జనాదరణను పొందింది.

### 2.9.13. రామచిలక వర్ణన

"ఓ రామా చిలుకా నారామా చిలుకా నువ్వోయే తోవ్వల్ల నిమ్మతోటాలే నారామా చిలుకా ఓ రామా చిలుకా నారామా చిలుకా నిమ్మా తోటాలు జూసి నిద్ర పోయేవు నారామా చిలుకా ఓ రామా చిలుకా నారామా చిలుకా నువ్వోయే తోవ్వల్ల జామాతోటాలు నారామా చిలుకా తెల్లన్నీ తెప్పల్ల, తేలి పోతా ఉన్నాది / నల్లన్ని మబ్బుల్ల, నడిచిపోతా ఉన్నాది దేవలోకము జేరా వచ్చింది చిలుకా రామన్నా" **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ కథ, మల్లన్న కథలు)**

ఒగ్గు కథాగానంలో కథాగతాంశాన్ని వివరిస్తూ పెళ్లి వర్తమానం పంపడానికి చిలకను పంపే ప్రతి సందర్భంలో చిలుకకు సంబంధించిన వర్ణన కనిపిస్తుంది. ఎల్లమ్మ ఒగ్గుకథలో ఎల్లమ్మ స్వయంవరానికి శివుడు సమస్త దేవతలకు ఆహ్వానం పంపే సందర్భంలోను, మల్లన్న తన పెళ్ళికి రమ్మని దేవతలకు ఆహ్వానం పలికే సందర్భంలోను చిలుక వర్ణనను చూడవచ్చు. ఇక్కడ వర్ణింపబడే చిలుకను గండరామచిలక/ గంగరామచిలక అని సంబోధిస్తారు. గండ అంటే పెద్దదని అర్థం ఉంది. అదే శబ్ద పరిణామము చెంది గంగఅయి ఉండవచ్చు. (పెద్ద రేగుపండ్లను గంగరేగి పండ్లని, పెద్ద దీపాన్ని గండదీపం అనే ప్రయోగాలు వ్యవహారంలో కనిపిస్తాయి) చిలుకతో వర్తమానం పంపుతూ ఆ వర్తమానం తొందరగా చేరవేయాలని దారిలో పండ్లతోటలు చూసి మరిచిపోవద్దని, సకాలంలో వర్తమానం చేరవేస్తే నీకు అలంకారాలు చేయిస్తానని చిలకకు చెప్పడంలోలాలిత్యం కనిపిస్తుంది. రెపరెప రెక్కలు కొట్టి జల్లున ఎగిరిన చిలుక వర్ణనలో స్వభావోక్తితో కూడిన సహజత్వం కనిపిస్తుంది.

### 2.9.14. ఎరుకలసాని వేషం, జంగమ వేషం వర్ణన

ఒగ్గుకథలన్నింటిలో సాధారణంగా కనిపించే పాత్రలు ఎరుకలసాని, జంగమయ్య. ఇవి కథలో పాత్రలుగా కాకుండా కథా గమనంలో కీలక ఘట్టాలలో కథను మలుపు తిప్పడానికి ఏర్పరచిన పాత్రలుగా కనిపిస్తాయి. శివుడు జంగమ వేషధారిగా వచ్చి నాయకునికి పెళ్లి మీద ఇష్టం కలిగించడం, స్త్రీ పాత్రలకు సంతాన ఫలము అనుగ్రహించడం చేస్తాడు. అలాగే చాలా కథల్లో ఎల్లమ్మతల్లి ఎరుకలసాని వేషంలో వచ్చి భవిష్యత్తు చెప్పడం, సోది చెప్పి నాయకునికి సహకరించడం కనిపిస్తుంది.

"కుంచెడు గవ్వల్ల కుదిరింది బుట్టి, అడ్డెడు గవ్వల్ల అల్లింది బుట్టి,
మానెడు గవ్వల్ల మలిపింది బుట్టి బుట్టి లోపల కావెల్లి వెట్టినాదీ...
వచ్చీతీ ఎరుకాల సానినోయమ్మ నే వనితానే కొమ్మా
నే హస్త రేఖలు మంచిగున్నాయి మంచిగున్నాయి

ఎక్కేటి గుర్రాలు మీకు ఉన్నాయి మీకు ఉన్నాయి..." **(చుక్క సత్తయ్య బీరప్ప ఒగ్గుకథ)** ఒగ్గుకథలో చాలా వరకు అవసరం మేరకు ఎల్లమ్మ రూపం మార్చుకుని ఎరుకలసానిగా అవతరించినట్లుగా చెప్పబడింది. ఎల్లమ్మ ఒగ్గుకథలో ధనగర్వంలో గౌడకులస్తులు ఎల్లమ్మను నిందించగా, కోపగించిన ఎల్లమ్మ వారి కల్లంతా కుళ్ళి పోవాలని శాపం పెడుతుంది. తర్వాత వారు చేసిన తప్పు చెప్పడానికి ఎరుకలసాని వేషం వేసి వారి తప్పును వివరించి తెలిపి బొడ్డుగురిగిలో కల్లు తనకు నైవేద్యంగా కోరుతుంది.

మల్లన్న బండారుగడ్డ కథలో కూడా ఎల్లమ్మ ఎరుకలసాని వేషంలో మక్కాలో తురక రాజుల ఆధీనంలో ఉన్న బండారి గడ్డ గురించి చెప్తుంది.గొల్ల కేతమ్మకథలో మేడలమ్మతో పందెం కట్టి వచ్చిన మల్లయ్యకు గొల్లకేతమ్మ గురించి చెప్తుంది. అలాగే బీరప్ప ఒగ్గుకథలో బీరప్ప నాగులకొండ నరభూపతి బిడ్డను పెళ్ళి చేసుకుంటానని అన్నప్పుడు ఎల్లమ్మ స్త్రీకి ఉండాల్సిన ఉండకూడని లక్షణాలు తెలిపి పట్టణంలో ఉన్న భూపతి బిడ్డలను బయటకు రప్పించడానికి ఎరుకలసాని వేషంలో వెళుతుంది. ఈ విధంగా చాలా కథలలో ఎల్లమ్మ ఎరుకలసానిగా మారి కథను మలుపు తిప్పినట్టుగా ఒగ్గుకథల్లో వర్ణించబడింది. నిమ్న కులస్తురాలైన ఎరుకలమ్మను ఎల్లమ్మకు ప్రతినిధిగా చెప్పడం ఒగ్గుకథ ఉదాత్త భావనకు నిదర్శనమని చెప్పవచ్చు. అలాగే నేటికీ ఎరుకలసాని దగ్గర ఉండే గవ్వలబుట్టను, గద్దెను ఎల్లమ్మకు ప్రతిరూపంగా భావించడం జానపదుల ఆచారంలో గమనించవచ్చు.

### జంగమ వేషం

ఒగ్గు కథ ప్రధానంగా శైవ సంబంధమైన కళారూపం. శివుని వాద్య మైన డమరుకం/ ఒగ్గు పేరుమీదుగానే శివుని అంశతో పుట్టిన మల్లయ్య పూజ కోసం స్తుతి కోసం ఒగ్గు కథ ఆవిర్భవించింది. మొక్కుడు కథల నుండి దివసాల కథల వరకు దాదాపు అన్ని కథలలో జంగమయ్య పాత్ర కనిపిస్తుంది. భక్తుల కష్టాలకు తాళలేక ఏడ్చినప్పుడు వారి కష్టం కన్నీరు శివునికి మాల్యమై శివుడు జంగమ వేషంలో వచ్చి వారి కష్టాలు తీర్చినట్టు ఒగ్గు కథ లో వర్ణిస్తారు. కథానాయకులకు వివాహం మీద ప్రేమ కలిగించడానికి శివుడు జంగమయ్యగా వచ్చి కథానాయకుని చేరి నీకు పెళ్ళి కాలేదు కావున నీ చేతి దానం స్వీకరించనని చెప్పి వారికి పెళ్లి మీద ప్రేమ కలిగిస్తాడు.

మల్లన్న కథ లోను, బీరప్ప కథ లోనూ రాజ్యపాలన చేస్తున్నప్పుడు మరియు మంద కావాలి ఉన్న నాయకుల దగ్గరకు శివుడు రావడం వారిచ్చే దానాన్ని స్వీకరించక మీరు పెళ్లి చేసుకోనందున దానం చేయడానికి అర్హత లేదని చెప్పి వారి మనసును పెళ్లి పైకి మళ్ళించి

వెళ్లినట్టు వర్ణించబడింది. అలాగే సంతానం కోసం పరితపించి దుఃఖించిన వారికి సంతాన ఫలం అనుగ్రహించడానికి శివుడు జంగమయ్యగా రూపం దాల్చినట్టు కనిపిస్తుంది. మల్లన్న కథలో నీలమ్మకు, బీరప్ప కథలో సూరమ్మకు, మాంధాత కథలో దేవకన్యలకు ఇలా చాలా కథలలో సంతానం లేకుండా బాధపడే నాయికలకు శివుడు జంగమయ్య వేషంలో వెళ్లి సంతానం అనుగ్రహించినట్లు వర్ణించబడింది.

"సంతానం కోసం శివాలయంలో ఏడు పొద్దులు, ఏడు మాపులు నీలమ్మ తపస్సు చేస్తుంటే పతివ్రత నీలమ్మ కన్నీరు ఎండికొండ కైలాసము ఏకాశిలాద్రి యందు, గంగమ్మ శిరసున, గౌరమ్మ సంకన, అరువైయారు పుట్ల త్రిశూలం చేత పట్టుకొని, మైసాక్షి మండపాన కూర్చున్న శంకరుని మీద డల్లు వానై కురువవట్టే.... ఏగని గంటలు ఏగవట్టే, మోగని గంటలు మోగవట్టే,

నాగన్న బుసకొట్టే నంది రంకెలేసేనమ్మ..ఆ.. నీలమ్మ కన్నీరు జూసి, ఆ దేవా జంగమయ్య, రూపులు పటమారి రుద్రావతారుడాయి, జన్మము పటమారి జంగమావతారమేత్తి జలజల లింగాలు, చంద్రకావి వస్త్రాలు, భూతకుడుకల పేరు, పుంగనూలు జంజర మేసిందు... ఆ... ఏనుగ మోరంత జోలె, కాగంత గంట, ఏదుము పట్టే ఎండి జోలె, ముద్దుం పట్టే ముత్యాల జోలె, పందుము పట్టే పగడాల జోలె తొర్రి మొర్రి గంటలు తొంబైయారు వేలు, నాదున్న గంటలు నాలుగు వేలు, నాదులేని గంటలు నాలుగు వేలు గనుక... ఎడమ చేతుల యవ జింకపిల్ల, కుడిచేతుల కురుచనంది, యమదండ భేరీలు గంటలు జెగ్గులు గణగణ మోగంగ..ఆ..

ఒక్కన ఒడిగంట, పిక్కన పిడిగంట, నడుమున నాగపిడిగంట, చాతిన ప్రాణలింగము, కంఠమందున సర్పము, నొసట ఛత్ర కన్ను, చెంపన చంద్రరేఖ, ఒడలెల్ల వీబూది, ఎద్దుమోత రుద్రాక్షలు, కొండంత కొప్పు, బొద్దుమునుగ గడ్డమేమి, బారెడు మీసమేనా, అటువంటి జంగమ వేషము ధరించినాడే.. మేడికట్టేల మేఘ రథము కట్టుకొని ఆలోకము నుండి భూలోకానికి ఎట్లా వస్తున్నాడు... ఆ.. **(చుక్క సత్తయ్య మల్లన్న కాపుల ఘట్టం)**

మల్లన్న కాపుల ఘట్టంలో శివుడు కైలాసం నుండి జంగమయ్యగా రూపం మార్చుకుని భూలోకం చేరేవరకు ఏకబిగిన సుదీర్ఘవచనంగా వర్ణించడం జరిగింది. ఒగ్గుకథ లోని ఈ అనుసంధాన వచనంలో గంగ, గౌరీ, నాగుపాము, నంది వంటి శివ గణాలతో కూడిన కైలాసాన్ని వర్ణించి, అలాంటి పరమశివుడు భక్తుల కోరికలను తీర్చడానికి శివజంగమయ్యగా మారాడని ఆదిభిక్షువైన శివుని మరో రూపంగా జంగమయ్య ఉన్నట్టు వర్ణించడం జరిగింది. శైవ సాంప్రదాయంలో జంగమ దేవతలకు విశిష్టస్థానం కనిపిస్తుంది. జంగమయ్యను శివభక్తులు

సాక్షాత్ శివ స్వరూపంగా భావించి గౌరవిస్తారు. అలాంటి జంగమ వేషానికి సంబంధించిన చక్కని వర్ణనలు దాదాపు అన్ని ఒగ్గుకథలలో కనిపిస్తాయి.

**గారడి వేషం**

మల్లన్న ఒగ్గుకథలో జంగమ వేషానికున్న ప్రాధాన్యం బీరప్ప ఒగ్గుకథలో గారడి వేషానికి కనిపిస్తుంది. బీరప్ప ఒగ్గుకథలో బీరప్పకు భయపడి నాగులకొండ నరభూపతి తన కూతురు కామరతిని మంగలి కత్తులమాలులో దాచి ఉంచుతాడు. బీరప్ప గారడి వేషంలో పట్టణంలోకి వెళ్లి గారడీతో వారిని మెప్పించి కామరతిని గొంగడిలో ఎత్తుకు వచ్చి సవలక్షమంద దగ్గర పెళ్లి చేసుకోవడం ప్రధాన ఘట్టంగా కన్పిస్తుంది. కురుములు పెద్ద పండుగగా నిర్వహించబడే బీరప్ప పండుగలో ఈ ఘట్టాన్ని పాత్రకు తగిన వేషాలతో కథా గానం చేస్తూ ప్రదర్శిస్తారు.

> “సచ్చున్న వరదూడే సామీ బీరయ్య –ఎండంటి దంతాలం పిండివడ గొరికేనా
> అలకల కటారి దేవుడు వట్టేనా– ఎనుగంతపెల్ల దేవుడెలుకలకే సేనా
> ఆ పుట్ట లోపాల బొద్దీ చేసేనా– తెల్ల తాచులు దేవ నల్లా తాచూలు
> గారడీ వేషాము తానే గట్టేనా – లేచి ఆడే ఏడు యోజనాలెత్తేనా
> కూసుండార్తె కున్న జింకల పోడుగేనా – పన్నెండు సుతులు దేవుడు వాయించ వట్టేనా...

**(చుక్క సత్తయ్య బీరప్ప ఒగ్గుకథ)**

గారడి వారు నాగస్వరం వాయిస్తూ, పాములను ఆడిస్తూ అందరినీ మెప్పించి పొట్టపోసుకొని జీవిస్తారు. వీరికి అనేక మంత్ర తంత్ర విద్యలు తెలుసునని ప్రజల నమ్మకం అందుకే గారడివారితో గొడవ పడకుండా ఉన్నంతలో వారు అడిగింది ఇచ్చి సంతోష పెడతారు. అలాంటి గారడి వారి వేషధారణ, గారడీవాడు చేసే ఆట పాటల గురించి బీరప్ప ఒగ్గుకథలో కళ్లకు కట్టినట్టు వర్ణించడం జరిగింది.

### 2.9.15. సత్యాన్న బోనం వర్ణన

తెలంగాణ సంస్కృతిలో బోనం ఒక విశిష్టచిహ్నం. విలక్షణమైన సంప్రదాయం. దైవానికి సమర్పించే పవిత్రమైన నైవేద్యం. అటువంటి బోనానికి ఒగ్గుకథలోనూ, ఒగ్గు పూజారులు నిర్వహించే కులదేవతల పండగలలోను ప్రత్యేక స్థానం కనిపిస్తుంది. కార్తవీర్యుని బాణం దెబ్బకు ప్రాణాలు కోల్పోయిన జమదగ్ని ప్రాణాలను తిరిగి రప్పించడానికి ఎల్లమ్మ సత్యాన్నబోనం తెస్తుంది. ఆ సత్యాన్నబోనం గురించి దాని తయారీ గురించిన వర్ణన ఎల్లమ్మ ఒగ్గుకథలో

విపులంగా వర్ణించబడింది.

"గంగ ఒడ్డున ఎండ్రికాయల గూళ్ళు దెచ్చి, ఏడు బిల్లలు జేసి, మూడుగంగలు కలిసే సంగమముల నిలబడి, నీటి ఒడుపుకు తిరుగుతూ, అరచేయి సారె చేసి, బొటనవ్రేలు బొడ్డు జేసి, మోచేయి కఱ్ఱ చేసి, మోకాలు కుంపటి జేసి, ఏడు బోనం పటువలు తయారు చేసింది. ఏడంత్రాల బోనాన్ని ఎదమీద వెట్టి, ఏడురోజుల ఎండను ఒక్కటే రోజు కొట్టించి కుండల నెండించి, ఖన్నుమని నాదించేతట్లు కుండ మోగంగా, కాలింగాల మడుగున పుట్టిన సేస వరిబియ్యము దూసవరి పంట ఏడు పిడికిళ్ళు దూసి తెచ్చింది. ఏడు చారెడ్ల దూసవరి వడ్లను అరచేయి రోలు జేసి, మోచేయి రోకలి జేసి, దంచి, కనురెప్పల్ల ఉనుక చెరిగి, కుండల్ల పోసింది. మంచు కొండల్ల శీతాలం దెచ్చి ఎసరు పెట్టి, ఉసికె కుప్ప జేసి, కుప్పకు ఒరిగి ఎదమీద కుండ పెట్టుకొని, సూర్యుని వేడికి కడుపుల బొక్కలు కట్టేలయి మండంగ, బోనం వండింది. బోనము పూదించడానికి పసుపు కావలెనని మల్లన్నకు చెప్పంపితే పసుపుకొట్టి పంపించగా పసుపుతో బోనాన్ని పూదిచ్చింది. కానుగు కాయలు కొట్టి నాలుగు సిద్దెల నూనె వోసి, బూరుగు దూది వత్తి జేసి, దీపం బెట్టింది. పంబాల వారు బవనీల వారు, డప్పు జమిడికలు, మొగించంగా బోనం నెత్తిమీద పెట్టుకొని బొర్లుకుంటూ బొర్లుకుంటూ భర్త జమదగ్ని దగ్గరకు ఎట్లా బయలు దేరుతుందీ... ఆ... ఓ రామా

అమ్మోరు ఎల్లమ్మ తల్లి ఎల్లేనా తల్లి ఎల్లేనా / అందెలు మూగాలు అమర గజ్జాలు అమర గజ్జాలు ఎ ఘల్లు ఘల్లున ఏళ్ళు ఘల్లునా ఎల్లు ఘల్లునా ఎల్లు / పోడిసేటి పోద్దోలె తల్లి పోతుంది తల్లి పోతుంది / గున్న గున్నెల్లమ్మ గున్న మామిడి గున్న మామిడి / తాలేడ్లు తంగెళ్ళు తాను దూకేనా తాను దూకేనా / కప్పోలె గంతులు తల్లి ఎసేనా తల్లి ఎసేనా..." **(చుక్క సత్తయ్య – ఎల్లమ్మ ఒగ్గుకథ)**

సత్యాన్నబోనం తీసుకొని ఎల్లమ్మ భర్త దగ్గరికి వెళ్ళే సమయంలో వర్ణించిన బోనం తయారీలో విచిత్రమైన వర్ణన కనిపిస్తుంది. కుండచేయడం, వండడం దాన్ని ఎత్తుకుని తీసుకెళ్లడం అంతా చిత్రమైన గతిలో సాగుతుంది. అందుకే దానికి సాధారణ బోనమని కాకుండా సత్యాన్నబోనం అని పేరు వచ్చింది. మన శరీరాన్ని ఎంత కష్టపడితే అంత ఎక్కువగా భగవంతుని కృప ఉంటుందనే భావన వీరశైవంలో ఎక్కువగా ఉంటుంది. అందుకే గండ కత్తెరలతో తలను సమర్పించడం, మంచినీరు కూడా ముట్టకుండా ఉపవాసం చేసి శివుడిని పూజించడం వంటి సంప్రదాయాలు శైవంలో కనిపిస్తాయి. ఇలాంటిదే సత్యాన్న బోనం. పోయిన ప్రాణాలు తిరిగి

తీసుకు వచ్చే శక్తి ఉండాలంటే అది అసాధారణంగా, విశిష్టంగా, విలక్షణంగా ఉండాలి అనే భావనతో సత్యాన్నబోనాన్ని ఒగ్గు కథకులు ఈ విధంగా వర్ణించడం జరిగింది.

కథాగానం చేసే సమయంలో ప్రత్యేకించి ఎల్లమ్మ ఒగ్గుకథా గానం చేసే సందర్భంలో ప్రధాన కథకులు ఈ సత్యాన్న బోనాన్ని ప్రదర్శిస్తారు. పైన దీపం వెలుగుతున్న బోనాన్ని తలమీద పెట్టుకుని బోనం కింద పడకుండా, ఒడుపుగా తలను ఎత్తి పట్టి పొర్లుదండాలు తీస్తూ భూమి మీద ఉన్న వస్తువును నోటితో తీస్తూ అద్భుతమైన ప్రదర్శన చేస్తారు. ప్రముఖ ఒగ్గు కథ కళాకారులు మిద్దె రాములు గారు ఇటువంటి సత్యాన్నబోనం ప్రదర్శించి మిక్కిలి ప్రజాదరణ పొందారు.

**జోల పాటలు**

"జో అచ్చుతానందా జోజో ముకుందా జోఅచ్చుతానందా
రార పరమానందా రామ గోవిందా రార పరమానందా
జోతలకు జోపందు నీకరటి పందూ జోతలకు జోపందు
నినుగన్న తల్లీకి నిందు నూరేళ్ళు నినుగన్న తల్లీకి
కోగీల కొమ్మెక్కీ చిలుక రథమేక్కె కోగీల కొమ్మెక్కీ
అమర చిలుకలు వలికే ఆ మాలు మీదా అమర చిలుకలు వలికే
లాలి లాలమ్మాలి లాలమ్మ లాలీ లాలి లాలమ్మాలి
లాలించి పాడారే రాజు కొడుకూనూ లాలించి పాడారే(**చుక్కసత్తయ్య కాపులఘట్టం**

ఒగ్గుకథలో బిడ్డ పుట్టిన సన్నివేశాన్ని వర్ణిస్తూ గానం చేసే ఈ జోలపాట అనేక సామాజిక అంశాల సమాహారంగా కనిపిస్తుంది. ఖండగతి ఛందస్సులో మంద్రంగా సాగే ఈ ఒగ్గు కథాగేయం మనసుకు అలౌకిక ఆనందాన్ని కలిగిస్తుంది. మొదట అన్నమాచార్య సంకీర్తన పల్లవితో ప్రారంభించబడి చరణాలన్నీ తేటతెలుగులో పల్లె వాతావరణాన్ని కళ్ళకుకట్టినట్టుగా వర్ణిస్తూ సాగాయి. వివాహ సమయంలో స్త్రీకి పుట్టింటివారు అరణం క్రింద పశుసంపద పంపిస్తారు. ఒకవేళ పెళ్లిసమయంలో పరిస్థితులు అనుకూలించక పంపకపోయినా బిడ్డ పుట్టేనాటికి అరణం పంపాలని ఆచారం ఉండేది. గ్రామీణ జీవనం లో పిల్లలు పుట్టిన తరువాత స్త్రీ చాలాకాలం విశ్రాంతి తీసుకోకుండా పిల్లను ఇంటిదగ్గర పెద్దమనుషుల దగ్గర వదిలి పనికి వెళ్లేవారు. పెద్దమనుషులైన అమ్మమ్మ, నానమ్మలు ఆ పిల్లవాడిని ఊరడించడానికి ఇలా పాటలు పాడేవారు. ఈ జోల పాటలో ఎంతో మార్మికత, సామాజికత కనిపిస్తాయి. ఈ గేయాలన్నీ

లోకం తెలియని పసివానితో చెప్పినట్లున్న సంభాషానాత్మకంగా సాగుతుంది. వెన్న కోసం, పాల కోసం ఏడుస్తున్నావు, మీ మేనమామలు పెళ్లి నాడు పంపాల్సిన అరుణం ఆవులు ఇంకా పంపలేదు, ఇప్పుడు తప్పకుండా పంపుతారని, నిన్ను పడుకోబెట్టి మీ అమ్మ పని చేయడానికి వెళ్లిందని, నీకు కాళ్ళ గజ్జెలు పులిగోర్లు తెచ్చి మీ అమ్మ అలంకరిస్తుందిని చెప్పడంలో నాటి ఆచారాలు, శ్రమ జీవనం, పిల్లల పెంపకం వంటి అనేక అంశాలు తెలుపబడ్డాయి.

"ఎన్నీల గాయంగా మంది నడవంగ.... మందీల మల్లయ్య ముందు నడవంగ" అని చెప్పే చక్కని భావ చిత్రంలో ఈ పిల్లవాడు పెరిగి పెద్దవాడై సమూహానికి నాయకుడు కావాలనే అభిలాష వ్యక్తమవుతోంది. పట్టుబట్టలు చింపి పొత్తిళ్లు పరవడంలో అతిశయోక్తి కనిపించినా ఈ మాటలు పిల్లవాని మీద తల్లి ప్రేమను అభివ్యక్తం చేస్తున్నాయి. "కోగీల కొమ్మెక్కీ చిలుక రథమేక్కే – అమర చిలుకలు వలికే ఆ మాలు మీదా" అని పిల్లవాని ముద్దు ముద్దు పలుకులను కోకిల కూజితాలుగా, చిలుక పలుకులుగా అభివర్ణించడం జరిగింది. ఒగ్గు కథాగాన ప్రదర్శనలో దస్తురుమాలును, డమరుకాన్ని పసిపిల్లవానిగా భావించి లాలిస్తూ పాడే ఈ జోల పాట తల్లులందరికీ తమ సంతానానికి సంబంధించిన బాల్య స్మృతులను గుర్తుకు తెస్తాయి.

**చీకటి సమయం**

అటుసగం ఇటుసగం, చెరిసగం రాత్రి, పసిపిల్ల పాలారగించని యాల్ల,

బసవదేవుడు సొప్పకట్టె కోరుకని యాల్ల బావుల్ల నీళ్ళు దొలుకాడని యాల్ల..... **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గుకథ)**

ఈ వర్ణనలో ఒగ్గు కథకులు రాత్రి సమయాన్ని వర్ణించే సందర్భంలో విలక్షణతను ప్రదర్శించారు. అర్ధరాత్రి అనడానికి బదులు అటు ఇటు సగం, చెరి సగం రాత్రి అని విపులంగా వ్యాఖ్యానించడంతో పాటు ఆ సమయంలో గ్రామీణ ప్రకృతి ఎలా ఉంటుందో తెలపడం విశేషం. సాధారణంగా అర్ధరాత్రి సమయానికి జానపదులంతా గాఢనిద్రలో ఉంటారు. తల్లి పక్కలో పసిపిల్లలు పాలు తాగడం ఆపి గాఢనిద్రలో ఉన్న సమయం. పశువులు సైతం మేత చాలించి కునుకు తీసే సమయం. పొద్దస్తమానం నీటిని చేదడానికి వచ్చిపోయే వారితో కదులుతుండే బావిలో నీరు ఎవరు ముట్టుకోకపోవడంతో ప్రశాంతంగా కదలకుండా ఉన్న సమయం అని ప్రకృతిని ప్రధానంగా చేసుకుని అర్ధరాత్రి వర్ణించారు.

### 2.9.16. వేట వర్ణన

ప్రబంధ కావ్యాలలో మృగయావినోదం పేర వేటను వర్ణించడం కనిపిస్తుంది. అలాంటి

రాజుల వేటకు సంబంధించిన వర్ణన ఒగ్గు కథలో గేయం వచనం కలిసి కనిపిస్తుంది.

"ఒక సమయమ్మున యవనేశుండు వేట మార్గమెల్లె రాజు వేట మార్గమెల్లె
యమా దండ భేరీలు మ్రోగగా ఎత్తినాడు దండు రాజు ఎత్తినాడు దండు
తురంగముల పగ్గముల బిగించి రథము ఎక్కినాడు రాజు రథము ఎక్కినాడు తైతకిటజనథా..
శంకములూది విజృంభించి అడవి జొచ్చినాడు, రాజు అడవి జొచ్చినాడు
అర్రేరే..... ధనుర్బాణములు ధరించి మృగముల సంహరించుకుంటూ...
కొండల కోనల గాలన జేసి దండన గావించే, మృగముల దండన గావించే
అడవిలో....ఓ .. లేళ్ళు దుప్పులు, మనుపోతులు, మారు పెద్దపులులు, వ్యాఘ్రములు,
సింహ శార్దూలములు, గండభేరుండములు ఝిల్లి మృగముల సంహరించుకుంటూ....
ఎండల వేడికి బండలు కాలాగ బాధ గలిగేనాయే, రాజుకు బాధ గలిగేనాయే
అడవిలోన అరచేతి గుంటడు జలము దొరకలేదు రాజుకు జలము దొరకలేదు...

**(చుక్క సత్తయ్య మాంధాత ఒగ్గుకథ)**

మాంధాత ఒగ్గుకథలో గాన చేయబడిన వేట వర్ణనలో రాజు అట్టహాసంగా బయలుదేరడం, వివిధ అడవి జంతువులను వేటాడి చంపడం వేట లో కాలం గడిపి మధ్యాహ్నం అయ్యే సరికి ఎండ వేడికి తాళలేక బాధపడటం వంటి విషయాలను వర్ణించారు. ప్రతి పాదం చతురస్ర గతి, త్రిస్ర గతి సమ్మిళితంగా ఉంది. మధ్యలో అనుసంధాన వచనములో సుదీర్ఘసమాసాలతో వర్ణించబడిన ఈ వేట వర్ణన గంభీరంగా ఉండి కథాగానానికి తగిన అభినయంతో కథా ఘట్టాన్ని దృశ్యమానం చేస్తుంది.

**మంత్రాలు-తంత్రాలు**

"మంత్రకాల్ల మంత్రమోయి... నిక్కమైన రామ మంత్రము / వానికట్టు వానంద కట్టురా భూమికట్టు భూతల్లి కట్టురా, సూడవోతే సూపుల గడతరా / కట్టవోతే గుండెల కదుతరా, మంత్రగాని మాటాల గడుతరా ... మంత్రకాల్ల !

మిద్దెరాములు అమెరికా రాజు ఒగ్గు కథలో కమల దేవి తన భర్త నింబాల మంత్రిని మంత్ర ప్రయోగంతో నల్ల నాగు పామును చేసిన సమయంలో వర్ణించబడిన మంత్రకాళ్ళ వర్ణన ఇలాంటిదే. "మందులు మందూలు మందులు నావద్దనున్న మాయా మచ్చుల మందులూ నావద్దనున్న తూరుపూన తుంగ ఏరు, పడమటాన పత్తి ఏరు, ఉత్తరాన ఊడిగేరు, దక్షిణాన దంటు ఏరు, భూమిల బుత్తంగి ఏరు, కన్నెపిల్ల కాలిగోరు, పుట్టుపాప కొంకినరం బూతపిల్లి రొమ్ము ఎముక పుట్టమీది తెల్లఉనుక చెట్టుమీది పారుతీగ గుట్టమీది గుండుఏరు గట్టుమీది

గండిఏరు తూట ఏరు తుమ్మ ఏరు ఏటి గడ్డ ఎర్రి నక్క..."మాటలు మంత్రాలు మరిచెట్ల క్రియలు, ఏల్లల్ల వేదాలు, గోళ్ళ సిరి మంత్రాలు" అని సాగే చిత్రవమైన వస్తువులతో కూడిన మందుల గేయం మిద్దె రాములు కథ లో కనిపిస్తుంది.

ప్రకృతిలో మానవాతీతమైన శక్తులు, మంత్రాలు, మందులు ఉన్నాయని జానపదులు బలంగా నమ్ముతారు. ఇదే విషయం ఒగ్గుకథాగానంలో మందులను, మంత్రాలను వర్ణించడానికి కారణమైంది. వివిధ సంస్థలు, ప్రభుత్వాలు మూఢనమ్మకాలపై ఎంతో అవగాహన కలిగించినప్పటికీ నేటికీ ఈ మందులు మంత్రాగాళ్ళకు సంబంధించిన విషయాలు అక్కడక్కడ కనిపిస్తున్నాయి.

### 2.9.17. స్త్రీల సౌందర్య వర్ణన

"ఆహా ఈ జగన్మోహినీ ఎవ్వరి సుందరిరా / గజగామిని యా మదారూపిణి తరుణి చక్కదనము బారెడు బారెడు నల్లని కురులు భామా ముంగురులు / పున్నమి చంద్రుని బోలిన తీరు పూవుబోణి వదనము

రాయన రాజుల చేతి కటారి రాజహంస గమనం / ఈ సతీని గన్న పితా దేవతల కేల మొక్కుదూనుఅలవిగాని ఆ బ్రహ్మ దేవుడు ఎట్లు సృష్టి జేసే / ఇందువదన నీ వెందరుదెంచిన విడువజాల నిన్ను..." **(చుక్క సత్తయ్య, మౌనోదరి ఒగ్గుకథ)**

చుక్క సత్తయ్య మౌనోదరి ఒగ్గుకథలో నాయికను గూర్చి చేసిన ఈ వర్ణన యక్షగాన పద్ధతిలో గానం చేయబడుతుంది. గజగామిని, మదరూపిణి, కదళిస్తంభం వంటి సంస్కృత సమాలు. బారెడు ముంగురులు, చిలకలకొలికి, సంగిడికోలలు వంటి అచ్చతెనుగు పదబంధాలు కూడా సమానంగా ప్రయోగించబడిన ఈ స్త్రీ వర్ణన ప్రబంధకావ్యవర్ణనలో నాయికల సౌందర్యవర్ణనను స్ఫురింపజేస్తుంది. దంతాలు దానిమ్మిత్తులు, పువ్వుబోణీ వదనం పున్నమిచంద్రుడు వంటి పోలికలతో కనిపించే సహజమైన అనుప్రాస వర్ణనకు మరింత అందాన్ని కలిగించాయి. పిక్కలను సంగడి కొలలతో పోల్చడంలో తీరైన శరీరసౌష్టవం కనిపిస్తుంది. రాయనరాజుల చేతి కటారి వలె తరుణి అందం మిక్కిలి పదునైనదిగా తళతళ మెరుస్తూ ఉందనే భావన వ్యక్తమవుతోంది. ఒగ్గుకథ లో కనిపించే ఇలాంటి స్త్రీ వర్ణనలు గమనించినప్పుడు తెలంగాణ ప్రాంతంలో ప్రచారంలో ఉన్న చిందు యక్షగానం, బాగోతుల ప్రభావం ఒగ్గుకథపై పడిందనే విషయం వెల్లడి అవుతుంది.

**నాయకుని అందచందాలు**

"నూనూగు మీసాలు నున్నటి బుగ్గలు / అరువైయారు హస్తరేఖలు ముప్పైయారు చంద్ర రేఖలు / పంచబాణుని కన్నా మించిన తేజం / సందమామకన్న మచ్చున్నది కానీ ఈ పిలగానికి

మచ్చలేదు / మాట్లాడితే నవరత్నాలు, కెంపులు మాణిక్యాలు, వజ్ర వైడూర్య / గోమేధిక పుష్యరాగాలు రాలుతుంటే సత్యవంతుడు / సావాన ధీరుడు, అని తప్పని వాడు, పలికి బొంకని వాడు / కలనైనా అబద్ధమాడని వాడు. **(చౌదరిపల్లి అంజయ్య అమెరికా రాజు ఒగ్గు కథ)**

పరశురాముని రౌద్రమూర్తిగా వర్ణించిన ఒగ్గుకథాగానంలో కొన్నిచోట్ల నాయకులను లాలిత్యంగా వర్ణించడం గమనించవచ్చు. సాధారణంగా కథాగతమైన అంశాన్ని, పాత్రస్వభావాన్ని బట్టి ఈ వర్ణన సాగుతుంది. అమెరికారాజు ఒగ్గుకథలో పదహారేళ్ల కుమారస్వామిని వర్ణించే సమయంలో వాడిన విశేషణాలు, అలంకారాలు ప్రబంధసాహిత్య వర్ణనలను స్ఫురింపజేస్తాయి. పంచబాణుని కన్నా మించిన తేజం వంటి ప్రాసయతి పాదాలలో యవ్వనారంభదశలోని బాలుని అందానికి సంబంధించిన ఔచిత్యవంతమైన వర్ణన కనిపిస్తుంది. చందమామకు మచ్చ ఉంది కానీ పిల్లవానికి మచ్చ లేదనే తేట తెలుగు ప్రయోగం వివరణ అవసరం లేని చక్కని పోలికను తెలుపుతుంది. బాహ్య స్వరూపం తోపాటు, సత్యవంతుడు, కలలో అబద్ధమాడని వాడనే వర్ణన ఈ బాల వీరుని మ వ్యక్తిత్వాన్ని తెలుపుతుంది.

## సత్యవాక్కుగొప్పతనం

సత్యవాక్కు గొప్పతనం గురించి చాలా చోట్ల నన్నయ భారతం శకుంతలోపాఖ్యానంలో చెప్పిన "నుతజలపూరితంబులగు......" పద్యాన్ని ఉదహరిస్తారు. ఆ విధంగానే ఉత్తరోత్తరా విశిష్ట లక్షణాన్ని తెలిపే సత్యవాక్కు వర్ణన ఒగ్గుకథగానంలో కనిపిస్తుంది.

"మాట తప్పిన దానికన్నా మరణమయింది నయము, నూట ఎనమిది మంది ఆడవాళ్లను చంపితే ఎంత పాపమో ఒక్క ఆవుని చంపితే అంత పాపం, నూట ఎనమిది ఆవులను చంపితే ఎంత పాపమో ఒక్క పసిపిల్లగాన్ని చంపితే అంత పాపం, నూట ఎనమిది మంది పసిపిల్లలను చంపితే ఎంత పాపమో ఒక్క అబద్దం ఆడితే అంత పాపం, ఎప్పటికైనా అబద్దం ఆడరాదు, ధర్మ కంకణం కట్టుకున్న నీ దగ్గరికి వచ్చి ఎవరు అడిగినా, ఏది అడిగినా కాదనకుండా వాళ్ళ కోరిక తీర్చమని కంఠమాగౌడ్ తన భార్య చెల్లమదేవికి చెప్పి...." **(చౌదరిపల్లి అంజయ్య గౌడ పురాణం)** నన్నయ భారతంలోని పద్యాన్ని అనుసరించినట్లు చెప్పబడుతున్న ఈ సత్యవాక్కు విశిష్టత స్త్రీ హత్య, శిశు హత్య, గోహత్య దోషాలకన్నా అబద్దం ఆడడం మహా దోషమని చెప్పబడింది. గౌడపురాణం ఒగ్గుకథలో ఎవరి పుణ్యం వారికే దక్కాలని తన చేతికి ఉన్న ధర్మ కంకణాన్ని భార్య చెల్లమదేవికి కట్టి దానం చేయమని చెప్తూ, ఆడిన మాట తప్పకుండా సత్యాన్ని నిలబెట్టాలని తెలిపే సందర్భంలో ఈ వర్ణన కనిపిస్తుంది.

**అన్నదమ్ముల ఆప్యాయత**

"కోరుకుంటే రాజ్యాలు దొరుకుతాయి, ఎత్తుక తిరిగితే ఏడూళ్ళు దొరుకుతాయి
చేసుకుంటే పెళ్ళాము దొరుకుతది, చెడిపోతే ముండలు దొరుకుతరు
కొంటె భూములు దొరుకుతాయి కంటే పిల్లగాండ్లు పుడతారు
కానీ తోడబుట్టిన తోడు దొరకదు అన్నా.." **(చౌదరిపల్లి అంజయ్య గౌడపురాణం)**

కులవృత్తిని వదిలి పెట్టిన తుంగమాగౌడు నలుగురు అన్నలు రాజ్యం విడిచి మదమాంసాలకు అలవాటుపడి సంపదను కోల్పోతారు. తరువాత ఏం చేయాలో తెలియని స్థితిలో తిరిగి తమ్ముని ఆశ్రయిస్తారు. ఆ సందర్భంలో ఎవరు మనకు సహాయం చేసినా చేయకపోయినా మన తోడబుట్టిన వాడు మనకు సహాయం చేస్తాడు అనే నమ్మకంతో వారు తమ్ముడైన తుంగమా గౌడు దగ్గరకు వచ్చే సందర్భంలో ఈ వర్ణన కనిపిస్తుంది. రామాయణంలో భ్రాతృప్రేమను తెలిపే "దేశేదేశేచ కళత్రాణి...." వంటి శ్లోకాల భావం సమగ్రంగా ఒగ్గుకథలో అచ్చ తెలుగులో వివరించి చెప్పబడింది.

ఈ విధంగా ఒగ్గుకథలో ప్రతి అంశం శిష్టసాహిత్యంలోని కావ్యవర్ణనలకు ఏ మాత్రం తీసిపోకుండా అందమైన, అద్భుతమైన వర్ణనలతో గానం చేయబడింది. ఒగ్గుకథ లోని వర్ణనలు చాలా వరకు సహజసిద్ధంగా, స్వభావోక్తులుగా కనిపిస్తాయి. ప్రబంధంలో కనిపించే అష్టాదశ వర్ణనలతో పాటు అనేక సామాజికాంశాలను వ్యాఖ్యానిస్తూ గానం చేయబడే ఒగ్గుకథాగానంలోని వర్ణనలు పరిశీలించినప్పుడు ఒగ్గు కథాగానం ఒక ఆశు ప్రబంధ రచనాగానంగా పరిఢవిల్లిందని చెప్పవచ్చు.

2వ. అధ్యాయం

# పాద సూచికలు

1. ఆచార్య జయధీర్ తిరుమలరావు, దక్కలి జాంబపురాణం, పుట. 18
2. డాక్టర్ గడ్డం మోహన్‌రావు, చిందు జాంబవపురాణం, పుట. 29
3. నమస్తే తెలంగాణ- తెలంగాణలో ఒగ్గుకథా బృందాలు, 18.11.2021
4. చుక్కా సత్తయ్య, పరిశోధకురాలుతో వివరించిన ఒగ్గుకథలు
5. కె రుక్నుద్దీన్ జానపద సాహిత్యంలో అలంకార విధానము, పుట. 113

# 3

# మూడవ అధ్యాయం

## ఒగ్గు కథ - ప్రదర్శనా రీతులు

# అధ్యాయం-3

# ఒగ్గు కథ - ప్రదర్శనా రీతులు

## 3.1. పరిచయం

కళారూపం ఏదైనప్పటికీ సమకాలీన మార్పులను అందిపుచ్చుకుని తదనుగుణంగా పరిణామశీలత కలిగి ఉన్నప్పుడే ఆ కళారూపం నిలుస్తుంది. ప్రజల చేత ఆదరించబడుతుంది. ఈ విధంగా కాలానుగుణంగా వస్తువులో, ప్రదర్శనలో భాషలో ఎప్పటికప్పుడు సమకాలీనతను అందిపుచ్చుకొని విశేషమైన ప్రజాదరణను పొందుతున్న కళారూపం ఒగ్గుకథగాన ప్రదర్శన. ఆధునికతను సంతరించుకున్నప్పటికీ సంప్రదాయంగా వస్తున్న కథాప్రదర్శన సంవిధాన నైపుణ్యాలను వదిలిపెట్టకుండా, వాటికి నూతనత్వాన్ని జోడించి ప్రదర్శించడం ఒగ్గుకథ ప్రత్యేకత. కథా ప్రారంభం, ముగింపులో ప్రత్యేకశైలి కథానుగుణంగా చేసే వివిధ వర్ణనలు, అలంకార రసపోషణ ఔచిత్యవంతమైన భాషా వైభవం ఇవన్నీ ఒగ్గు కథలో కనిపించే విశేషాంశాలు. ఒగ్గుకథ జనసామాన్యానికి దగ్గరగా చేయడంలో ఈ అంశాలు ప్రధానపాత్ర వహిస్తాయి. నియమిత రంగాలంకరణ, ఆడంబరమైన వేషధారణ లేకపోయినప్పటికీ కథాసూత్రాన్ని అనుసరించి ఆశువుగా సాగే మాటల ప్రవాహంతో ఒగ్గుకథ శ్రోతలను ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది. కథకుడు ఒకవైపు కథను వ్యాఖ్యానిస్తూనే కథాగత పాత్రగా మారుతాడు. ఒకే సూత్రధారి వివిధ పాత్రలలో ఒదిగిపోయి పాత్రల స్వభావానికి తగ్గట్టుగా గంభీరంగా, లాలిత్యంగా, హాస్యభరితంగా స్వరభేదంతో నటనాకౌశలంతో ఆయా పాత్రలను కళ్ళకు రూపు కట్టిస్తాడు. ఇందులో పాత్రోచిత వేషానికి ప్రాధాన్యత లేదు పాత్రాగత నటనకు తత్సంబంధమైన వాక్చలనానికి ప్రాధాన్యం ఎక్కువ. వివిధ సాహిత్యాంశాలతోపాటు ఈ ప్రదర్శనలో సంగీతానుగుణమైన నృత్తప్రదర్శన, సంభాషణాత్మకమైన కథాగాన వివరణతో ఒగ్గుకథ నాటకం చూస్తున్న అనుభూతిని కలిగిస్తుంది. ఈ విధంగా పండిత పామరజనరంజకమైన ఒగ్గుకథ విశేషంగా ప్రేక్షకాదరణ పొందడానికి కథకులు ప్రదర్శించే సంవిధాన నైపుణ్యాలే కారణం. ఒగ్గుకథ ప్రదర్శనలో కథకులు ప్రదర్శించే వివిధ సంవిధాన నైపుణ్యాల గురించి ఈ అధ్యాయంలో తెలుసుకుందాం.

### ప్రదర్శనలో వైవిధ్యం

ఒగ్గుకథ ప్రదర్శనంతా ప్రధానకథకులైన ఇరువురు స్త్రీ పురుష పాత్రధారులు వాగ్ధాటి అభినయసామర్థ్యం, హావభావ విన్యాసాల మీద ఆధారపడి ఉంటుంది. తెలంగాణ మాండలికభాషలో ధారాళంగా గానం చేయబడే ఒగ్గు కథలలో ప్రతిపదాన్ని ప్రాసాత్మకంగా ప్రయోగిస్తూ సందర్భానుసారంగా జాతీయాలు, సామెతలు వాడుతారు అందువలన కథ

వినసొంపుగా ఉంటుంది. కథాగాన సమయంలో ప్రేక్షకులను ప్రశ్నించి వారిని తీర్పరులుగా చేసి కథలో భాగస్వామ్యం చేయడం వలన శ్రోతలు ఒగ్గుకథను శ్రద్ధగా వింటారు. కథాగానం మధ్యలో కాకుస్వరంతో ప్రదర్శించే హాస్యం ప్రజలను కడుపుబ్బ నవ్విస్తుంది. ఆర్ద్రమైన కంఠధ్వనితో ప్రదర్శించే కరుణరస ఘట్టాలు కంటతడి పెట్టిస్తాయి. కథాగానం చేసే సందర్భంలో అవసరాన్ని బట్టి కథకులు వివిధ పాత్రలలో ఒదిగిపోతారు. కొన్నిసార్లు ప్రధానకథకులతో పాటు వంతలుగా ఉన్నవారు, వాద్య సహాయం అందించే వారు కూడా కథాగత పాత్రగా మారతారు.

"ఒగ్గుకథ ప్రజలను బాగా ఆకట్టుకోవడానికి కారణం ప్రధాన కథకులిద్దరిలో ఒకరు వేషాన్ని ధరించినవారు కథలో వచ్చే స్త్రీ పాత్రలన్నిటినీ సమర్థవంతంగా పోషించడం. వేషధారి కంఠస్వరంలో నడకలో హొయలు ఒలికించడంలో స్త్రీని పోలి ఉంటాడు. అంతేకాదు అతడు తన నటనా సామర్థ్యంతో ప్రేక్షకులకు స్త్రీ అనే భ్రమ కలిగిస్తాడు. ఒగ్గు కథలో సహజత్వం ఉంటుంది అని చెప్పడానికి స్త్రీ పాత్రలను ఉదాహరణగా చెప్పవచ్చు"[1]

ఒగ్గుకథ సాధారణ వేదికల మీద ప్రదర్శించబడి నాటకంలాగా రక్తికట్టి ప్రేక్షకులను ఆనందింపజేయడానికి ప్రధాన పాత్రధారుల హావభావ విన్యాసం, వాక్చాతుర్యం, శ్రావ్యమైన కంఠస్వరం చాలా అవసరం. వీటి ఆధారంగానే కథాగానం విజయవంతం అవుతుంది. ఒగ్గ కథకులు చెప్పిన కథలన్నీ కూడా గతంలో విన్న కథలే అయినప్పటికీ ప్రేక్షకులు విసుగు లేకుండా వినడానికి కారణం కథకులు కథ గానంలో వైవిధ్యం ప్రదర్శించడమే. సూత్రాన్ని ఆధారంగా చేసుకొని ఆశువుగా చెప్పే ఒగ్గు కథను విపులంగా వర్ణించి వారం రోజులు చెప్పగలరు అదే కథను కుదించి అర్థం చెడకుండా ఒకరోజు లోనూ ముగించగల నేర్పు ఒగ్గకథ ఒగ్గుకథకుల ప్రత్యేకత ఈ ప్రదర్శన వైవిధ్యం వల్లనే ఒగ్గు కథ గానం ప్రేక్షకులను అలరించి సజీవ కళారూపంగా నేటికీ విశేష జనాదరణ పొందుతుంది.

'ఒగ్గు కథ'ను కథాగాన కళ అనవచ్చు. ఏదో ఒక కథను ఆలంబనగా చేసుకొని సంగీత అభినయాలతో ఈ కళా రూపం సాగుతుంది. భిన్న భిన్నమైన కథాగాన కళారూపాల్లో ఉన్న 'ఒగ్గు' కథ ఒక్క తెలంగాణలో తప్ప మరో ప్రాంతంలో లేదు. వరంగల్, నల్లగొండ, హైదరాబాద్ జిల్లాల్లో బహుళ ప్రచారంలోను, మహబూబ్‌నగర్ జిల్లాలో పలుచగాను ప్రచారంలో వుంది. ఈ మూడు జిల్లాల్లోనూ సుమారు యాభై ఒగ్గు కథా బృందాలు మనుగడలో వున్నాయి. పోషిత కులమైన కురువల ఆశ్రిత కులమైన బీర్లవాళ్లు ఒగ్గు కథా కళాకారులు. ఈ కథాగానమే తమ జీవికగా మలచుకొన్న కళాకారులు. ఈ జానపద

కళారూప నిక్షిప్త పేటికలు. బీర్ల వాళ్ళూ కురువలే, కానీ కురువ కులస్థుల పూజారి స్థానం వీరిది. బ్రాహ్మణులతో నిమిత్తం లేకుండా తరతరాలనుండి సంప్రదాయంగా వస్తున్న ఆనవాయితీ ప్రకారం 'పెళ్లితంతు'ను వీరే జరిపిస్తారు. కురువలు నిర్వహించే బీరప్ప, మల్లన్న, ఎల్లమ్మ జాతర్లలో కార్యక్రమ నిర్వహణలో ప్రధాన భూమిక వీళ్ళదే.

**3.2. ఒగ్గు కథల లక్షణాలు – ప్రార్థనా గీతాలు**

- ఒగ్గు కథలు ప్రధానంగా వచన శాఖకు చెందినవి.
- గేయ కథలు వ్యాపించినంతగా వచన ఒగ్గు కథలు వ్యాపించలేదు.
- ఒగ్గు కథలను "పురాణ కథలు, ఐతిహ్యకథలు, సాంఘిక కథలు, కాల్పనిక కథలు" అని విభజించవచ్చు.
- ఒగ్గు కథలను పుక్కిటి పురాణాలంటారు, ఊకుడు కథలు అంటారు.

**ఒగ్గు కథలు – లక్షణాలు**

- ఒగ్గు కథలకు జానపద కథ లక్షణాలే ఉంటాయి. అవి...

1) కథ సరళంగా ఉంటుంది
2) మౌఖిక ప్రచారం ఉంటుంది
3) కవి తెలియకపోవడం
4) కాలం తెలియకపోవడం.
5) ఆశువుగా పుట్టడం

- జానపద కథలను బాగా పరిశీలించి వాటిపై చక్కని అధ్యయనం చేసిన పండితులు జానపద కథలపై వెలువడిన పరిశోధన గ్రంథాలు ఇందులో అంతర్భాగంగా ఒగ్గు కథలున్నాయి.

1) తెలుగు జాతీయముల కథలు – ముసునూరి వెంకటశాస్త్రి
2) తెలుగు జానపద కథలు (1980) – కె.సుమతి
3) ఆంధ్ర దేశీయ కథావళి – టేకుమళ్ళ రాజగోపాలరావు
4) మహబూబ్ నగర్ జిల్లా జానపద కథలు (1986) – బి.బాలస్వామి
5) అనంతపురం జిల్లా జానపద కథలు – సి. పెద్దిరెడ్డి
6) కాశ్మీరం జానపద కథలు (1887) – జె.హెచ్. నోవెల్స్
7) Kinderund Housmarchan జానపద కథలు (1812) – గ్రిమ్ సోదరులు

సృష్టిలోని ప్రతి కార్యంలో ఆధార, అధేయాలు ఒక దానితో మరొకటి ముడిపడి

ఉంటాయి. అలాగే సాహిత్యంలోని ప్రతి ప్రక్రియకు లక్ష్యం ఉంటుంది. జానపద విజ్ఞాన వేత్తలనే గాక, మానవ శాస్త్రజ్ఞులను, మనస్తత్వ వేత్తలను, భాషాశాస్త్ర వేత్తలను ఆకర్షించిన ప్రత్యేక జానపద సాహిత్య ప్రక్రియ "జానపద కథ" ఈ జానపద కథకు ప్రత్యేకమైన లక్ష్యం ఉంది. తమ బ్రతుకుదెరువు కోసం పుడమి తల్లినే నమ్ముకొని పొద్దస్తమానం శ్రమపడే జానపదుల శ్రమను ఉపశమింప చేయడం కొరకు కథ ఎంతో తోడ్పడుతుంది. పిల్లలని పెద్దలని వయోభేదం లేకుండా అందరికి మనోరంజనాన్ని కలిగిస్తుంది. నీతిని బోధించడానికి కథ ఎంతగానో పనికి వస్తుంది. దేశం, జాతి, సంస్కృతిని, ఆచార వ్యవహారాలను, సంప్రదాయాలను, ప్రాంతీయ చరిత్రలను ఒక తీరం నుండి ఇంకొక తీరానికి అందించడం నీతిని, ధర్మాన్ని ఉపదేశించడం ఒగ్గు కథల ప్రధాన లక్ష్యం.

ఈ కథ లక్షణాలు మొదటగా కథా గంగా ప్రార్ధనతో శాంభవీ రాణి.... శాంభవీ రాణి మొదలై మంగళంతో ముగుస్తాయి. ఇవి ముఖ్యంగా శైవ సాంప్రదాయానికి సంబంధించినవి.

**కథా లక్షణాలు :**

1. కథా "రామ" శబ్దంతో మొదలవుతుంది.
2. గంగా ప్రార్ధనతో మొదలు.
3. అప్పటికప్పుడు కథను అల్లుకుంటు ఆశువుగా వేషధారణ చెప్పడం.
4. కళా ప్రదర్శనతో ఒక్కొక్కరి శైలి వేరు వేరుగా ఉంటుంది.
5. శ్రోతలకు అనుగుణంగా కథా ఘట్టాలు సందర్భాను సారంగా ఉంటాయి..
6. రాత్రిపూట ప్రారంభమై తెల్లవార్లు ప్రదర్శిస్తారు.
7. రామ పదంతో మొదలై "మంగళం" పాటతో అంతం అవుతుంది.

ఉదా :

హరి మారీ....... రఘు నందా ..........
హరి హరి బ్రహ్మాండమా
హరిలోక నాచారి
మద్దుల మారెళ్ళు, మా వేటి బిడ్డా
బుద్ధి జెప్పిందానా, భూనాంచారి.
విద్య నేర్పిందానా వీరహనుమళ్ళు
చదువు నేర్పిందానా సాంబశివుడా

అగచూడు........అగజూడు ..........

అమ్మవారు పార్వతి పదివేల దండమే. ఓ రామ రామ..........

అంటు కథ ప్రారంభం అవుతుంది. తర్వాత గంగ ప్రార్థనతో దేవతలను తలచుకుని

శరణు శరణు మాయమ్మా రాణి

శాంభవీ రాణి .......శాంభవీ రాణి

కరుణజూడు కన్నతల్లీ... గంగా భవాణి... ఘనకల్పవల్లీ పుట్టినాది గంగతల్లి... ఈ పుడమిలోన...... పుడమిలోన.....

అంటూ గంగను తలచుకుని తర్వాత గణపతి దేవున్ని ప్రార్థించి, తర్వాత పంచభూతాలను ప్రార్థిస్తారు.

ఆయా గ్రామ దేవతలకు సంబంధించిన ఒగ్గు కథలను మూడు, నాలుగు, ఏడు రాత్రులు రాగ, తాళ, నాట్యయుక్తంగా ప్రదర్శిస్తారు. విద్యాగంధ శూన్యులైన వీళ్ళు ప్రధాన కథ. ఉప కథలతో కూడిన 'ఒగ్గుకథ'ను కేవలం మౌఖిక కథన పటుత్వంతో ప్రదర్శిస్తుంటే ప్రేక్షకులు వీరి ప్రతిభకు ఆశ్చర్యపోకమానరు! ఇలా ఒగ్గు కథ శిల్పపరంగా, శబ్దపరంగా, దృశ్యపరంగా విశిష్టమయింది. కాలానుగతంగా ఒగ్గుకథలో నాటకీయత ప్రవేశించడానికి యక్షగానం కారణం కావచ్చునంటారు.

### 3.3. ఒగ్గు కథా బృందం నృత్యం

జానపదులు తమకు కలిగే ఉత్సాహాల్లోనూ, సంతోషాల్లోనూ, విషాదాల్లోనూ తమ సంతోషాన్ని, దు:ఖాన్నివ్యక్తపరచడంలో బాగంగా నృత్యాలను చేస్తారు. జానపద నృత్యాలు కులపరమైనవి కావచ్చు. మతపరమైనవి కావచ్చు. ఆచార సంప్రదాయాలకు సంబంధించినవి కావచ్చు. సాంఘికపరమైన నృత్యాలు కావచ్చు. జానపద నృత్యాలు ఎక్కువగా ఉత్సవాలలోనూ, ఊరేగింపులలోనూ, జాతర్లలోనూ, పండుగల సమయాల్లోనూ ప్రదర్శిస్తుంటారు.

**ఆవిర్భావ వికాసాలు.**

"మల్లిఖార్జునడు (శివుడు) త్రేతాయుగంలో శ్రీశైలంలో వెలసినప్పుడు ఆయనతో పాటే డోలు, నపీర,డేగంట, కఠార్లు పుట్టినాయట మల్లన్న వివాహసమయంలో ఈ రకమైన వస్తువులను (వాద్యాలు) ఉపయోగించి ఉత్సవాలు చేయాలని తన భక్తులకు ఆదేశించాడట. అప్పటి నుంచి శివభక్తులయిన కురుమలు మల్లిఖార్జుని వివాహ మహోత్సవంలో ఒగ్గుడోలును ఉపయోగిస్తూ ఇతర నపీర, కఠార్లను ఉపయోగిస్తూ నృత్యం చేశారట. ఆనాటి కాలంలో ఏడు డోళ్ళతో మల్లిఖార్జునుని వివాహ సమయంలో రథంలో కుర్చోబెట్టుకుని

ఊరేగించే సమయంలో నృత్యం చేశారట."[2]

ఈ విధంగాకురుమలు తమ కులదైవమైన శ్రీశైలం మల్లిఖార్జునుని కొలిచే సమయంలో ఆనందంగా ఒగ్గుడోళ్ళ నృత్యం చేసేవారని, నృత్యానికి అనుగుణంగా మల్లన్నను గూర్చిన ప్రార్థన పాటలను పాడేవారని శ్రీ చుక్కాసత్తయ్య గారి కథనం ప్రకారం తెలిసింది. నేటి ఆధునిక కాలంలో ప్రదర్శించే ఒగ్గుడోళ్ళ నృత్యం వివిధ రకాలయిన క్రొత్త, క్రొత్త అడుగులు,దరువుల చేరి రూపాంతరం చేందుతూ వుంది.ఒగ్గుడోళ్ళ నృత్యం ప్రతీ ప్రాంతంలోనూ ఒకే విధంగా లేదు ఒగ్గుడోలు నృత్య కాళాకారుల వేషధారణలోనూ, వారిదరువులు, అడుగులలోనూ, నృత్య విన్యాసాలలో తేడా కనిపిస్తుంది. ఈ ఒగ్గుడోళ్ళ నృత్యం ప్రేక్షకులను ఎంతగానో ఆకర్షిస్తుండడం చేత కేవలం మల్లిఖార్జునుని పండగ సమయంలోనే కాకుండా కురుమ గొల్లలు తమకు కలిగే సంతోషాల్లోనూ, దు:ఖాల్లోనూ, ప్రేక్షకులు కోరిన సమక్షంలోనూ ప్రదర్శిస్తున్నారు. అంతేగాక నేడు ఒగ్గుడోళ్ళ నృత్య కళాకారులు డబ్బులకు కూడా నృత్య ప్రదర్శన చేస్తున్నారు.

ఈ విధంగా నేడు ఒగ్గుడోళ్ళ నృత్యం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకోవడం వలన జాతీయ స్థాయిలోనూ ఒగ్గు డోలు నృత్య కళాకారులు తమ ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకులను మెప్పిస్తున్నారు.ఇంతేకాకుండా గ్రామాలలోనూ,పట్టణాలలోనూ, నగరాలలోనూ ప్రజలను తొందరగా ఆకట్టుకోనుటకు గానూ రాజకీయ నాయకులు తమ పార్టీ ప్రచార నిమిత్తం ఒగ్గుడోళ్ళ నృత్య ప్రదర్శనలు ఇప్పిస్తూ, ఒగ్గుడోళ్ళ నృత్యంలో పాడే పాటల్లో తమ రాజకీయ పార్టీ గురించి, వారు చేసే మంచి పనుల గూర్చిన అజెండాను అనువర్తించి పాడిస్తుంటారు. అంతేకాకుండా ప్రభుత్వం చేయబోయే ప్రజా సంక్షేమ కార్యాలను, ప్రజలకు అర్థం అవడానికి ఒగ్గుడోళ్ళ నృత్యాన్ని నాలుగు కూడల్లు గల ప్రదేశాల్లోనూ, ఊరి నడి వీధులలోనూ ప్రదర్శనలిస్తూ ప్రజలను తొందరగా ఆకట్టుకుంటూ ఎంతో ఆదరణను పొందుతున్నారు.

ఈ విధంగా ఒగ్గుడోళ్ళ నృత్యం ఆవిర్భావం చెంది వికాసాలు పొందుతూనే వుంది.

**ఒగ్గు నృత్యం లక్షణాలు**

ఒగ్గుడోళ్ళ నృత్యం బృంధ నృత్యాంగా పరిగణింపబడుతుంది. ఒగ్గుడోలు నృత్య కళాకారులు వీరభద్రుని వలె వేషధారణ చేసుకుంటారు. నృత్యంలో పాల్గొనే కళాకారులు ఇద్దరిద్ధరుగా ఏర్పడి జంటగా నృత్యం చేస్తుంటారు. గుండ్రంగా తిరుగతూ ఒకరికొకరు ఎదురెదురు వస్తూ కోలాటం వేస్తూంటారు.ఈవిధంగా ఒగ్గుడోళ్ళను వాయిస్తూ చుట్టూ

తిరుగుతూ కొలటాం వేస్తూ  ముఖ్యంగా మల్లిఖార్జునునిపై, భీరప్పపై, ఎల్లమ్మదేవిపై పాటలు పాడుతుంటారు. ఈ పాటలను ఒగ్గుడోళ్ళ నృత్యంలో పాల్గొన్న ఒక ప్రధాన గాయకుడు పాడుతుండగా మిగతా వారంతా వంత పాడుతుంటారు.ఒగ్గుడొళ్ల నృత్యాన్ని ముఖ్యంగా నాలుగు కూడల్లు కలిసే చోటగానీ, ఊరి మధ్యన ఉన్న విశాలమైన ప్రదేశంలోనూ ప్రదర్శిస్తారు. నేటి ఆధునిక కాలంలో స్టేజీలపై కూడా నృత్య ప్రదర్శన చేస్తున్నారు. శైవ భక్తుల నృత్య లక్షణాలు, కేకలు, గంతులు మొదలైన వాటి లక్షణాలు ఒగ్గు డోళ్ళ నృత్యంలో కనిపిస్తాయి.

అయితే ఈ ఒగ్గు డోళ్ళ నృత్య ప్రదర్శనకు ముందు తమ కులదైవమైన మల్లిఖార్జునుని మొదటగా ప్రార్థించిన తరువాత గంగదేవి ప్రార్థన చేసి, ఆ తరువాత గణపతి ప్రార్థన, గ్రామ దేవతల ప్రార్థన చేస్తారు. ఈవిధంగా ప్రార్థన చేస్తున్నంత సేపు ఒగ్గుడోలును డిల్లెం–బల్లెం శబ్ధం వచ్చేటట్లు వాయిస్తారు. ఈ విధంగా ప్రార్థనలు చేసిన తరువాత తమ నృత్య విన్యాసాలను ప్రదర్శిస్తారు.

ఒగ్గుడోళ్ళ నృత్యంలో కళాకారులు తమ అడుగులను ముందుకు గానీ, వెనుకకు గానీ, కదపాలన్నా, ముందు కుడికాలు అడుగు వేసి ప్రారంభిస్తారు. ఒగ్గుడోలును తాడుతో ఎడమ భుజం పై వేసుకుని ఎడమ చేతితో సర్పుడు దెబ్బకొడుతూ నృత్యం చేస్తుంటారు. ఈ విధంగా ఒగ్గుడోళ్ళను వాయిస్తూ కళాకారులు నృత్యం చేసేవారితో పాటే ప్రత్యేకంగా తాళాలు కొడుతూ డోలు శబ్ధానికి అనుగుణంగా వాయిస్తూ, నృత్యపు అడుగులు వేస్తూ తాళాలువాయించే కళా కారులుంటారు. ఈ తాళాలు కొట్టే కళాకారుడు ఒక్కరు కూడా పాల్గొనవచ్చు. ఒగ్గుడోలు నృత్యంలో డోలు వాయించే కళాకారులు ఇరవైమంది కంటే ఎక్కువ సంఖ్యలో పాల్గొంటే ఆ సంఖ్యకు అనుగుణంగా తాళాలు వాయించే కళాకారులు ఉంటారు. ఈ తాళాల కళాకారులు ఒగ్గుడోలు వాద్య శబ్ధాన్ని, నృత్యపు అడుగులను గమనిస్తూ తాళాలు వాయిస్తుంటారు.ఈ విధంగా ఒగ్గుడోలు, తాళాల నుంచి వచ్చే శబ్ధాలు ప్రేక్షకుల మనస్సులను రంజింప చేస్తుంటాయి.

**ఒగ్గు నృత్య బృంధాల పుట్టుక**

ఒగ్గు డోళ్ళ నృత్యాన్ని ప్రదర్శించేవారు ఎక్కువగా కురుమకులస్థులే ఉన్నార. తమ గ్రామంలో జరిగే ఉత్సవాల్లో, పండుగల్లో ఒక వర్గానికి చెందిన ఒగ్గుడోళ్ళ నృత్య బృంధం వారు ఒగ్గుడోళ్ళ నృత్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకుని వారిచేత ఆదరింపబడుతుంటారు.ఈ ఒగ్గుడోళ్ళ నృత్య ప్రదర్శనను చూసిన ప్రేక్షకులు తాము కూడా

ఒగ్గు డోళ్ళ నృత్యాన్ని నేర్చుకోవాలని ఆసక్తి చెంది నేర్చుకుంటారు. ఈ విధంగా ఒక బృంధాన్ని చూసి వేరే బృంధం ఏర్పడుతుంది. ఈ విధంగా ఒగ్గుడోళ్ళ నృత్యం నేర్చుకున్న కళాకారులు ఒకళ్ళ పై, ఒకళ్ళు పోటీ తత్త్వం పెంచుకుంటున్నారు. ఒగ్గు డోళ్ళ నృత్య గురువు తన ప్రాబల్యాన్ని పెంచుకొనుటకు, తనకు ఎక్కువ మంది శిష్యులు ఉండాలని కూడా ఒగ్గుడోళ్ళ నృత్యాన్ని నేర్పించి ఆ నృత్య బృంధాన్ని తన అజమాయిషీలో ఉంచుకుంటూ నృత్య ప్రదర్శనలు ఒక్కో బృంధం చేత ఒక్కోచోట ప్రదర్శనలు ఇప్పిస్తూ ప్రేక్షకుల మన్ననలను పొందుతున్నారు.

**ఒగ్గు నృత్య ప్రదర్శన సందర్భాలు**

ఒగ్గు డోళ్ళ నృత్యాన్ని ఎక్కువగా మల్లన్న, బీరప్ప జాతర్లలోనూ కురుమలు తమ ఇండ్లలో జరుపుకునే వివాహ సమయాల్లోనూ, మల్లిఖార్జునుడి పండుగ, బీరప్ప పండుగ, ఎల్లమ్మ పండుగ సమయాల్లోనూ, వివాహమైన కొత్త జంటను ఊరేగించే సమయంలోనూ, గ్రామదేవతలను కొలిచే సందర్భాల్లోనూ,బోనాలు తీసుకుపోయే సమయంలోనూ,నాగన్న తెప్పకు వెళ్ళు సమయంలోనూ, సుట్టమన్ను తెచ్చే సమయంలోనూ ఇంకా కురుమ గొల్లల శుభ, అశుభ సందర్భాల్లోనూ, ప్రదర్శిస్తున్నారు. అంటే కురుమ గొల్లలు ఎవరైనా చనిపోతే వారి శవయాత్రలో కూడా ఒగ్గు డోళ్ళ నృత్యాన్ని ప్రదర్శిస్తున్నారు.

**ఒగ్గు నృత్య ఉత్సాహ సందర్భాలు**

కురుమ గొల్లలు తమ కుల సంప్రదాయంలో భాగంగానే కాకుండా తమకు కలిగే ఉత్సాహ సమయాల్లోనూ అంటే ఊర్లోని తమ మిత్రుల వివాహ సమయాల్లోనూ, ఇతర ఊరేగింపు సమయాల్లోనూ, కులాతీతంగా నేడు ఒగ్గు డోళ్ళ నృత్యం ప్రదర్శింపబడుతుంది. అంతేగాక తమకిష్టమైన రాజకీయ పార్టీల ప్రచారాల్లోనూ, ఎంతో ఉత్సాహంగా ప్రదర్శనలు చేస్తూ ప్రజలను ఆకట్టుకుంటున్నారు. అంతేకాకుండా తమ వ్యవసాయపు పంటలు అనుకున్న విధంగా పండినప్పుడు, తమ ఇండ్లలో శుభకార్యాలు జరిగినప్పుడు ఒగ్గుడోళ్ళ నృత్యాన్ని చేస్తూ తమ ఉత్సాహాన్ని తెలియచేస్తుంటారు. అంతేకాకుండా ఒగ్గుడోళ్ల నృత్య కాళాకారులు తమ ఆట విడుపు సమయాల్లోనూ, తీరిక సమయాల్లోనూ, ఆనందంగా, ఉత్సాహంగా ఒగ్గు డోళ్ళ నృత్యాన్ని చేస్తుంటారు.

**ఒగ్గు నృత్య శిక్షణా ప్రదేశాలు**

ఒగ్గు డోళ్ళ నృత్య శిక్షణను ఊరి చివర మైదాన ప్రదేశాల్లోనూ ఊర్లో ఉన్న విశాలమైన ప్రదేశాల్లోనూ, ఇతరులెవరికీ ఇబ్బంది కలుగని ప్రదేశాల్లోనూ నేర్పిస్తుంటారు. “అయితే

ఈ ఒగ్గుడోళ్ళ నృత్య శిక్షణ అంటూ ప్రత్యేకంగా గత కాలంలో లేదని నేటి ఆధునిక కాలంలో రూపాంతరం చెందుతున్న ఒగ్గుడోళ్ళ నృత్యం ఇంకా వివిధ రకాల విన్యాకసాలతో, పద్ధతులతో ప్రదర్శింపబడాలనుకోవడం వల్ల ఈ ఒగ్గుడోళ్ళ నృత్యం అంతరించి పోకుండా ఉండడం కోసం ఈ శిక్షణ కార్యక్రమాలు పెట్టడం జరుగుతుంది. గత కాలంలో ఒగ్గుడోళ్ళ ను వాయించడం తెలిసిన కురుమలు తమ పెద్దలు ఒగ్గుడోళ్ళ నృత్యం చేసేటప్పుడు వాళ్ళలో ఒకరిగా పాల్గొని పెద్దవాళ్ళు చేసే నృత్యపు అడుగులను అనుకరిస్తూ ఒగ్గుడోళ్ళ నృత్యాన్ని నేర్చుకునేవారట"3 ఈ విధంగా కురుమలు తమ వంశపారంపర్యంగా ఒగ్గుడోళ్ళ నృత్యాన్ని నేర్చుకుంటున్నారు.

"గ్రామాలలో గానీ, పట్టణాలలో గానీ ఒగ్గుడోళ్ళ నృత్యాన్ని ప్రజలకె వరికీ ఇబ్బంది కలుగకుండా శబ్ధకాలుష్యం వల్ల దుమ్ము ధూళీ లాంటి సమస్యలు ఎవరికీ కలుగకూండా ఈ ఒగ్గు డోళ్ళ నృత్య శిక్షణను ఇస్తుంటారు. ఊరి చివరనున్న తమ కులగురువు బీరప్ప కులదైవమైన మల్లన్న ఆలయాల వద్ద ఎక్కువగా ఒగ్గడోళ్ల నృత్యా శిక్షణను ఇస్తుంటారు. అంతేకాకుండా ఊర్లో వున్న శివాలయాల్లోనూ, ఇతర దేవాలయాల్లోనూ వున్న విశాలమైన ప్రదేశాలలో ఒగ్గు డోళ్ళ నృత్యశిక్షణను ఇస్తుంటారు"4 ఇటువంటి దేవాలయాల్లో ఒగ్గుడోళ్ళ నృత్య శిక్షణను ఇవ్వడం వల్ల ప్రజలకేవరికీ ఇబ్బంది కలుగకుండా ఉండడమే కాకుండా ఒగ్గుడోళ్ళ నృత్యం నేర్చుకునే కళాకారులు కూడా ఎంతో భక్తిశ్రద్ధలతో ఏకాగ్రతలతో నేర్చుకుంటారు.

ఒగ్గుడోళ్ళ నృత్య శిక్షణను విశాలమైన ప్రదేశాల్లో ఇవ్వడానికే వీలవుతుంది. ఇరుకైన ప్రదేశాలలో ఒగ్గుడోళ్ళ నృత్య శిక్షణ ఇవ్వడానికి వీలుపడదు. ఒగ్గుడోళ్ల నృత్య శిక్షణలో కనీసం పదిమందైనా పాల్గొని వివిధ రకాలుగా విన్యాసాలు నేర్చుకోవలసి ఉంటుంది. కాబట్టి ఊరి చివర ప్రదేశాల్లో, ఆలయాల ప్రాంగణాల్లోనే కాకుండా ఊర్లో వున్న పాఠశాల విశాల ప్రదేశాల్లోనూ, కళాశాల మైదానాల్లోనూ, ఊర్లోవున్న పెద్ద గొల్ల ఇంట్లో వున్న విశాల ప్రదేశంలో వారి అనుమతితో శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఇస్తుంటారు.

ఒగ్గుడోళ్ళ నృత్య శిక్షణ సమయాలకు ప్రత్యేకమైన నియమ, నిబంధనలంటూ లేకపోయినప్పటికీ వీలయిన సమయాల్లోనే శిక్షణా సమయాలను నిర్ణయిస్తారు. "కురుమ గొల్లల వృత్తి గొర్ల పెంపకం, వ్యవసాయం కాబట్టి వారికి మధ్యాహ్న సమయాల్లో వీలుపడదు. ఉదయపు సమయంలో అంటే 6 గంటల నుండి 9 గంటల లోపుగా, సాయంత్రపు సమయాల్లో అంటే 6 గంటల నుండి 10 గంటల లోపుగా శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు

చేస్తారు.”4 ఉదయం 9 గంటల తరువాత పశువులను మేపుటకు వెళ్ళే సమయం అవుతుండడం వల్ల, సాయంత్రం 10 గంటల తరువాత ఊళ్ళో ప్రజల నిద్రకు ఇబ్బంది కలుగుతుండడం వల్ల మాత్రమే పై సమయాలను శిక్షణకు నిర్ణయించుకుంటారు.

ఒగ్గు డోళ్ళ నృత్యం ఎక్కడైనా అత్యవసరంగా ప్రదర్శించవలసి వస్తే తమకున్న పనులను కూడ ప్రక్కకు పెట్టి తమ విధులను ఇతరులకు అప్పగించి అంటే పశువులను మేపడం, పంట పొలాలకు వెళ్ళడం లాంటి పనులను ఇతరులకు అప్పగించి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు, సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు కూడా శిక్షణా కార్యక్రమాల్ని ఏర్పాటు చేస్తున్నారు. అర్ధరాత్రి సమయాల్లో ఒగ్గు డోళ్ళ నృత్య శిక్షణ ఇవ్వడం వల్ల ఊర్లోని ఇతర కులాల వారికి ఇబ్బంది కలుగకుండా వారిని సంప్రదించి ఎవరికీ ఇబ్బంది కలుగకుండా ఒగ్గు డోళ్ళ నృత్య శిక్షణా కార్యక్రమాల్ని ఏర్పాటు చేయిస్తామని శ్రీ చుక్కా సత్తయ్య గారు తెలిపారు.

ఒగ్గు డోళ్ళ నృత్యాన్ని నేర్చుకునుటకు కురుమ గొల్లలే కాకుండా ఇతర కులాల వారు కూడా ఆసక్తి చూపుతున్నారు. “ఒగ్గు డోళ్ళ నృత్య శిక్షణలో నృత్య విన్యాసాలు బాగా తెలిసిన వారే గురువులుగా వ్యవహరిస్తున్నారు. అయితే ఒగ్గుడోళ్ళ నృత్య గురువు ఒగ్గు పూజారి  కాని, కురుమ, గొల్లకులానికి మాత్రమే చెందిన వారై వుండాల్సిన అవసరం లేదు. ఒగ్గు డోళ్ళ నృత్యం నేర్చుకోవాలన్న ఆసక్తి వున్న వారెవరికైనా నేడు నృత్య శిక్షణను ఇస్తున్నారు. అయితే గతంలో ఒగ్గుడోళ్ళ నృత్యం నేర్చుకునే వారు గానీ, ప్రదర్శించే వారు గానీ, శిక్షణనిచ్చే గురువులు గానీ కేవలం కురుమ గొల్లలే ఉండేవారు. కానీ నేటి ఆధునిక కాలంలో ఇతరులెవరైనా ఒగ్గు డోళ్ళ నృత్యాన్ని నేర్చుకుంటున్నారు.”5 ఈ విధంగా ఒగ్గు డోళ్ళ నృత్య గురువు ఎంతో క్రమశిక్షణ తో, ఓర్పుతో నృత్య విన్యాసాల్ని నేర్పిస్తాడు.

ఒగ్గు డోళ్ళ నృత్యాన్ని చేయడానికి గానీ, ఒగ్గు డోలును వాయించడానికి గానీ, కురుమ గొల్లలు ఎంతో ఉత్సాహాన్ని చూపుతారు. ఒగ్గుడోళ్ళ నృత్యం చేసే కురుమలు తమ వంశపారంపర్యంగా పెద్దలనుంచి నేర్చుకున్న ఒగ్గుడోళ్ళ నృత్యాన్ని తమ సంతతికి విధిగా నేర్పిస్తుంటారు. కురుమ కులంలో ఒగ్గుడోళ్ళ నృత్యాన్ని  నేర్చుకోవాలనుకునే వారు తమ అన్నలనుంచి గానీ, తమ తండ్రి నుంచి గానీ, ఒగ్గు పూజారుల నుంచి గానీ, తమ బంధువుల నుంచి గానీ నేర్చుకుంటారు. ఈ విధంగా సంప్రదాయ బద్ధంగా వచ్చే ఒగ్గుడోళ్ళ నృత్యాన్ని నేర్పించే వారినే సంప్రదాయ గురువులు అంటారు.

ఒగ్గు డోళ్ళ నృత్య కళారూపాన్ని అంతరించి పోకుండా కాపాడటానికి ప్రభుత్వం

గానీ, ఇతర ప్రైవేట్ సంస్థలు ఎంతగానో కృషి చేస్తున్నాయి. నేడు ఒగ్గుడోళ్ల నృత్య శిక్షణ అనేది విశ్వవిద్యాలయాల స్థాయిలో ఇవ్వబడుతుంది. విద్యార్థులకు నృత్య శిక్షణలో ప్రత్యేకించి ఒక కులానికి చెందిన వారికి నేర్పించాలని, ప్రత్యేకించి కురుమ కులం వారే ఈ ఒగ్గు డోళ్ళ నృత్యాన్ని నేర్పించాలనే నిబంధన లేకుండా ఎవరైతే ఒగ్గుడోళ్ళ నృత్యంలో మంచి నైపుణ్యం, శిక్షణ ఇవ్వగల ఓర్పు ఉన్నవారు నృత్య గురువులుగా నియమించబడి/నిలిచి శిక్షణ ఇస్తున్నారు. ఈ విధంగా ఇతర కులాలకు చెందిన గురువుల నుంచి కురుమ కులస్థులు ఒగ్గుడోళ్ళ నృత్యాన్ని నేర్చుకుంటున్నారు. ఉదాహరణకు – కరీంనగర్ జిల్లాకు చెందిన శ్రీ మిద్దె రాములు గౌడ్ గారు. ఒగ్గుడోళ్ళ నృత్య శిక్షణ ఇచ్చేవారు.

ఒగ్గు డోళ్ళ నృత్యం నేర్చుకోవాలనుకునేవారు తమ పెద్దల నుంచి గానీ, తన మిత్రుల నుంచి గానీ, లేదా ఒగ్గు డోళ్ళ నృత్యం జరుగుతున్నప్పుడు వారితో సహా పాల్గొని వాళ్ళను అనుకరిస్తూ అడుగులు వేస్తూ నృత్యంలో మెలకువలను నేర్చుకుంటుంటారు. అయితే ఈ విధంగా ఒగ్గు డోళ్ళ నృత్యంపై ఆసక్తి వున్న వారు బలిష్టంగా వుండాలి. యుక్తవయస్సు వారి నుంచి ముప్పై సంవత్సరాల వయస్సు లోపు గల వారు ఒగ్గు డోళ్ళ నృత్యం నేర్చుకోవటానికి గానీ ప్రదర్శించబానికి గానీ అనుకూలంగా వుంటారు. ఒగ్గుడోళ్ళ నృత్య శిక్షణలో ముందుగా కళాకారులు ఒగ్గుడోలును వాయించడం నేర్చుకుని వివిధ రకాలయిన దరువులన తప్పులు పోకుండా నేర్చుకుంటారు. ఆ తరువాత నృత్యపు అడుగులను నేర్చుకుంటూ విన్యాసాలు చేయడం నేర్చుకుంటారు. ఈ విధంగా ఒక దాని తరువాత ఒకటి నేర్చుకుంటారు.

ఒగ్గుడోళ్ళ నృత్యాన్ని కురుమ కులస్థులు పండుగల్లోనూ, జాతరలోనూ, ఉత్సవాలు, ఊరేగింపుల్లోనూ చేస్తుంటారు. "ఈ ఒగ్గు డోలును వాయిస్తూ నృత్యం చేయడం అనేది వంశపారంపర్యంగా వస్తున్నట్టి కళారూపం. కాబట్టి కురుమ యువకులు తప్పకుండా ఒగ్గుడోలు వాయిస్తూ ఒగ్గుడోళ్ళ నృత్యాన్ని నేర్చుకుంటారు. సంప్రదాయంలో భాగంగా జరిగే ఒగ్గుడోళ్ళ నృత్యాన్ని తమ చిన్నప్పటి నుంచి చూస్తూనే వుండడం వల్ల నృత్యాన్ని నేర్చుకునే కురుమ కులస్థులకు సులభతరం అవుతుంది. 6

ఒగ్గు డోళ్ళ నృత్యాన్ని కేవలం కురుమ గొల్ల కులానికి చెందినవారే కాకుండా ఉత్సాహం, ఆసక్తి వున్న వారు కూడా నేర్చుకుంటున్నారు. కులతత్వాల పై నేటి కాలంలో పట్టు సడలటం వల్ల, ప్రభుత్వ, రాజకీయ పార్టీల జోక్యం జానపద కళారూపాలపై పడి జానపద కళారూపాలను తమకు అనుగుణంగా ఉపయోగించడం వల్ల కూడా ఇతర

కులాల వారు ఒగ్గుడోళ్ళ నృత్యాన్ని నేర్చుకోగలుగుతున్నారు."

**ఒగ్గు నృత్య ప్రదర్శన**

ఒగ్గు డోలు నృత్య ప్రదర్శనలో ఒక ప్రత్యేకమైన వేషధారణ చేసు కుంటారు ఒగ్గు వాళ్ళు వీర భద్రుని వేషధారణ ధరించి చక్కగా అలంకరించుకుంటారు. కళాకారులు ముఖానికి పసుపు పూసుకుని నుదుటిపై తెల్లటి విభూధి అడ్డంగా పెట్టుకుంటారు. చెవులకు రింగులు తగిలించుకుంటారు. అందరూ ఒకే విధంగా చిక్కనిరంగు గల తలపాగను ధరిస్తారు. ఈ తలపాగను ఒక కిరీటం ఆకారంలో చుట్టి వీపు పై వ్రేలాడేలా రుమాలును వదులుతారు. ఈ తలపాగ అయిదు గజాలపొడవు వుంటుంది. కళాకారులందరూ రుద్రాక్షమాలను తమ ఛాతి భాగం వరకు వచ్చేలా మెడలో వేసుకుంటారు. అంతేగాక గవ్వల దర్శనాన్ని అంటే నల్లని గొర్రెబొచ్చుతో చేసిన తాడుకు గవ్వలు తొడిగి మెడకు కట్టుకుంటారు. మెడలో భుజం మీదగా వ్రేలాడేటట్లు అందరూ వీరగోలను వేసుకుంటారు. ఇంకా నాగబంధును అంటే నల్లని గొర్రె బొచ్చుతో చేసిన గొంగడి లాంటి వస్త్రాన్ని నడుముకు చుట్టు కుంటారు. మంచి అంచుగల తెల్లటి దొవతిని మోకాలు వరకు బిగుతుగా ఉండేటట్లు కట్టుకుంటారు. నృత్యవిన్యాసాలు చేయుటకు అనుగుణంగా ఈ దోవతిని ధరించడం జరుగుతుంది. అంతేగాక రెండు కాళ్ళకు గజ్జెల తాళ్ళను రెండు – మూడు వరసలు కట్టుకుంటారు. ఎడమ భుజానికి ఒగ్గుడోలును తాడు ద్వారా తగిలించుకుని కుడి చేత ఒగ్గుడోలు కర్రను పట్టుకుంటారు. ఈ ఒగ్గుడోలు కర్రనే "సిర" అని కూడ అంటారు. ఈ విధంగా ఒగ్గుడోలు నృత్య ప్రదర్శకుల వేషధారణ వీరభద్రుని వేషాన్ని పోలి వుంటుంది.

ఈ ఒగ్గుడోళ్ళ నృత్య వేషధారణ అనేది ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా వున్నప్పటికీ, ఎక్కువగా మాత్రం పైన ఉదహరించిన విధంగానే వుంటుంది. అయితే ఇటువంటి వేషధారణ ఒగ్గుడోళ్ళ నృత్య వీరభద్రని వేషాన్ని పోలి వుంటుంది.

ఈ ఒగ్గుడోళ్ళ నృత్య వేషధారణ అనేది ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా వున్నప్పటికీ, ఎక్కువగా మాత్రం పైన ఉదహరించిన విధంగానే వుంటుంది. అయితే ఇటువంటి వేషధారణ ఒగ్గుడోళ్ళ నృత్య ప్రదర్శనలో తప్పకుండా వేయాలనే నిబంధన అంటూ లేదు. కాని వారి యొక్క అనుకూలతను బట్టి వేషధారణ చేసుకుంటారు. అంటే కళాకారులు తాము ప్రదర్శించే ఒగ్గుడోళ్ళ నృత్య ప్రతీ ప్రదర్శనలో ప్రత్యేకమైన వేషధారణ చేసుకోవడం లేదు. కాని వీరు ఒక ప్రత్యేకమైన స్టేజీ పైన గానీ, లేదా ఇతరులు ప్రోత్సాహించి వేషధారణ చేసుకుని

నృత్యం ప్రదర్శించమని అడిగితే వీరభద్రుని వేషధారణ చేసుకుంటారు. అయితే ఈ విధమైన వేషధారణ చేసుకునేది కేవలం ప్రేక్షకులని ఆకర్షించి వారిని ఆనందింపచేయడం కోసమని తెలుస్తుంది. ఎందుకంటే కురుమ కులంలో కేవలం సంప్రదాయం కోసమనే కాకుండా వినోధ కార్యక్రమాల్లో కూడ ప్రదర్శిస్తారు.

**ఒగ్గు నృత్య వేషధారణ**

ఒగ్గు డోళ్ళు నృత్యాన్ని కళాకారులు తమకు తిరికలేని సమయాల్లో సాధారణ అలంకరణ తేసుకుంటారు ఒంటిపై ఒకే రకమైన బనియన్ తొడిగి తెల్లటి దొవతిని కట్టుకుని దానపౌ ఒక రుమాలును నడముకు చుట్టుతారు. తలకు ఒకే రకమైన రిబ్బన్ కడతారు. రెండు కాళ్ళకు గజ్జలు కట్టుకుంటారు. ముఖంపై రంగులు పూసుకునే అలంకరణ అంటూ ఏమీ వుండడు. ఈ విధంగా సాధరణ వేషధారణ ఉన్నప్పటికి అందరూ ఒకే రకమైన వేషదారణను కలిగి వుండి ఒగ్గుడోళ్ళ నృత్య ప్రదర్శన చేస్తుంటారు.

**ఒగ్గు నృత్య విన్యాసాలు**

ఒగ్గుడోళ్ళ నృత్య కళాకారులు తమ విన్యాసాలను ప్రేక్షకుల చూపు మరల్చకుండా ఉండేట్లు ప్రదర్శన చేస్తారు. ఒగ్గు డోళ్ళను ప్రదర్శనలో తమ నోటితో పళ్ళతో పళ్ళ ద్వారా పట్టుకుని డోలును వాయిస్తూ ముందుకు, వేనుకకు అడుగులు కదుపుతూ అందరూ ఒకే రీతిలో ఎగురుతూ నృత్యప్రదర్శన చేస్తారు. ఒగ్గుడోలును వాయిస్తూ పాము వంకరలుగా వెళుతున్నట్లు తమ అడుగులను ముందుకు వేస్తూ వంకరలుగా అటూ ఇటూ తిరుగుతూ నృత్యం చేస్తుంటారు. ఇద్దరిద్దరు జంటగా ఏర్పడి ఒకే రీతిలో ఒగ్గుడోలును వాయిస్తూ ముందుకు వేనుకకు అడుగులు వేస్తూ ఎగురుతూ నృత్య ప్రదర్శన చేస్తారు. అంతేగాకుండా కళాకారులందరూడోలు వాయిస్తూ గుండ్రంగా తిరుగుతుండగా ఇద్దరు ప్రదర్శకులు వాళ్ళ మధ్యలోకి వచ్చి తమ ఒకరి వీపులు ఒకరికిక ఆనించుకుని తమ నోటితో డోలును పట్టుకుని వాయిస్తూ వంగి చుట్టూ తిరుగుతూ నృత్య విన్యాసాన్ని ప్రదర్శిసారు. అంతేగాక ఒకరి భుజంపై ఒకరు కూర్చుని డోలు వాయిస్తుండగా నిల్చున్న వ్యక్తి ఏ మాత్రం తనపై బరువు వున్నట్లుగా ఇబ్బంది పడకుండా అడుగులు అటు, ఇటు వేస్తూ ముందుకు, వేనుకకు కదుపుతూ డోలు వాయిస్తూ నృత్యం చేస్తుంటారు. గుండ్రంగా డోలు వాయిస్తూ తిరుగుతుండగా వాల్ల మధ్యలోకి ముగ్గురు కళాకారులు వస్తారు. వారి భుజం పైకి ఇద్దరు కళాకారులు వచ్చి ఎక్కి నిలబడగా,ఆ ఇద్దరి భుజాలపై ఒక కళాకారుడు నిలబడి డోలును వాయిస్తుంటాడు. ఈ విధంగా నృత్య విన్యాసం జరుగుతున్నంత సేపు ప్రేక్షకులు

కన్నార్పకుండా చూస్తుంటారు. అంతేగాక మధ్య మధ్యలో ఒకరిద్దరు కళాకారులు ఒగ్గుడోలును వాయిస్తూనే పల్టీలు కోడుతూ నృత్యం చేసే ప్రదేశంలో చుట్టూ తిరుగుతూ వుంటారు. కళాకారులు రెండు వరసలుగా సరి సంఖ్యలో ఎదురెదురుగా నిలబడి డోలు వాస్తూ నృత్యం చేస్తూ ఎడమ వైపు వున్న వాళ్ళు, కుడి వైపుకు, కుడివైపు వున్న వాళ్ళు ఎడమ వైపుకు వెళ్తూ నీత్యం చేస్తుంటారు. ఒగ్గుడోలు నృత్య కళాకారులందరూ తాము వున్న చోటనే వుండి డోలును తమ నోటితో పట్టుకుని తమ చుట్టూ తామే తిరుగుతూ కూర్చుంటూ లేస్తూ నృత్య ప్రదర్శన చేస్తుంటారు. ఈ విధంగా నృత్య విన్యాసాలు జరుగుతున్నంత సేపు ప్రేక్షకులకు కన్నుల పండుగగా వుంటుంది.

**ఒగ్గు నృత్య ప్రదర్శన వాద్య విన్యాసాలు**

ఒగ్గు గోలును వాయించే విధానాన్ని దరువు లేదా దెబ్బ అంటారు.ఒగ్గు డోళ్ళ నృత్యంలో వివిధరకాలయిన దరువులను వివిధ సందర్భాలకనుగుణంగా వాయిస్తుంటారు. అంతేగాక ఈ దరువుల ఆధారంగా ఒగ్గు డోళ్ళు నృత్యం జరుగుతుంది. ఈ దరువులు ఒగ్గు డోలు నృత్య వాద్య విధానంలో ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

"కర్రతో డోలును కుడివైపు చర్మంపై కొడితే అది గుబిల్ అవుతుంది. ఆ విధంగా రెండుసార్లు వెంటవెంటనే కొడితే గుబిల్–గుబిల్ అనే శబ్ధం వస్తుంది. మరలా మూడవ గుబిల్ కొట్టి ఎడమ చేతితో చర్మంపై కొడతారు. ఈ విధంగా ఎడమ వైపు చర్మంపై చేతితో చరచడాన్ని సర్పుదెబ్బ అంటారు." ఈ విధంగా మూడు గుబిల్ దెబ్బలు ఒక సర్పుదెబ్బ కొట్టడాన్ని "గుబిల్ గుబిల్" దెబ్బ అని అంటారు.

ఒగ్గుడోలు ఎడమ వైపు చర్మంపై చేతితో సర్పుడు దెబ్బలు నాలుగు సార్లు కొట్టి తరువాత కుడి చేతితో రెండు సార్లు డోలుకు కుడి వైపున చర్మంపై కర్రతో కొట్టడాన్ని గుబిల్? దెబ్బ అంటారు.

"ఒగ్గుడోలుకు కుడి వైపు చర్మంపై కర్రతో ఒకదెబ్బ కొట్టి ఎడమ వైపు చర్మంపై ఒక సర్పు దెబ్బ కొడితే 'ఓ...ం' అనే శబ్ధం వస్తుంది." ఈవిధంగా కొట్టడాన్నే "డిల్లెం – బల్లెం" దెబ్బ అని కూడా అంటారు.

"ఒగ్గు డోలకు కుడి వైపు కర్రతో చర్మంపై కొట్టి ఎడమవైపు చేతితో చర్మంపై మూడు దెబ్బలు కొట్టడాన్ని మూడవ సర్పు దెబ్బ"అంటారు. "ఒగ్గుడోలుపై కర్రతో కుడివైపు చర్మంపై ఒక దెబ్బ కొట్టి ఎడమ వైపు చర్మం చేతిలో నాలుగు దెబ్బలు కొడితే ఆ దరువును నాల్గవ సర్పు దెబ్బ అంటారు.

“ఒగ్గు డోలుపై కుడి చేతి వైపు చర్మంపై కర్రతో ఒకదెబ్బ కొట్టి వెంటనే మిగతా మూడు వ్రేళ్ళతో చర్మంపై కొడతారు. అదే సమయంలో ఎడమ చేతితో డొలు ఎడమ వైపు చర్మంపై దెబ్బలు పడతాయి. ఈ దరువునే తీన్‌మార్ దెబ్బ అంటారు.” “ఒగ్గు డోలుపై కర్రతో కుడివైపు చర్మంపై రెండు దెబ్బలు కొట్టి తరువాత కర్రతో మూడు దెబ్బలు కంచు మీద కొడతారు. అదే సమయంలో ఎడమ వైపు చర్మంపై చేతితో సర్పుడు దెబ్బలు పడుతూనే ఉంటాయి. దీనినే కంచుదెబ్బ అంటారు.

“ఒగ్గుడోలుపై కర్రతో కుడివైపు చర్మంపై రెండు దెబ్బలు, తరువాత కంచు మీద ఒక దెబ్బ పడుతునే ఎడమ చేత ఎడమ వైపు చర్మంపై వరుసగా సర్పుడు దెబ్బలు పడుతూనే వుంటాయి. ఈదరువునే ఒకటవ కంచుదెబ్బ అంటారు.

ఒగ్గుడోలుపై కర్రతో చేత చర్మంపై కొడుతూనే ఎడమ వైపు చర్మంపై చేతితో సర్పుడు దెబ్బ కొడుతూ తమ ముందూ, వెనక ఉన్న వ్యక్తుల కర్రలకు తమ కర్రలను కొడుతూ వుంటారు. ఈ దరువునే కొలాటం దెబ్బ అంటారు.

“ఒగ్గు డోలుపై కర్రతో కుడివైపున చర్మంపై రెండు దెబ్బలు ఎడమ చేతితో ఎడమ వైపు చర్మంపై రెండు దెబ్బలు కొడతారు. నృత్య ప్రదర్శన చేస్తున్నారు. జానపద నృత్యాలతో ఈ అనుకరణ అనేది సహజంగానే ఉంటుంది. అందువల్ల ఒగ్గు డోళ్ళ నృత్యం రూపాంతరం చెందుతూవుంది. ఈ విధంగా ఇతర నృత్యాలను అనుకరిస్తూ ఇతర నృత్యాలకంటే తమ ఒగ్గుడోళ్ళ నృత్యం ప్రేక్షకులను ఎక్కువగా ఆకర్షించడానికి ప్రయత్నిస్తుంటారు

**ఒగ్గు వృత్తికళాకారులు**

ఒగ్గు డోళ్ళ నృత్య కలాకారులు తమ ఆచార,సంప్రదాయాల్లో భాగంగా నృత్య ప్రదర్శలు చేస్తున్నప్పటికీ,ప్రేక్షకుల కోరిక మేరకు ఇతర ప్రాంతాలకు వెళ్ళి తమ ఒగ్గు డోళ్ళు నృత్య ప్రదర్శనను చేస్తున్నారు. ఈ విధంగా ప్రేక్షకాభిమానులు ఏర్పాటు చేసే కార్యక్రమాల్లో పాల్గోనడం వారిని మెప్పించడం తగిన పారితోషికాలను, బహుమతులను అందుకోవడం వల్ల తమ కులవృత్తి అయిన గొర్ల పెంపకం, వ్యవసాయం చేయడ లాంటి పనులను ఇతరులకు అప్పగిస్తూ తమ ప్రాధాన్యతను ఒగ్గుడోళ్ళనృత్యానికే ఎక్కువగా ఇస్తూ వృత్తి కళాకారులుగా తయారవుతున్నారు.

ఒగ్గుడోళ్ళ నృత్య అభిమానులు ఎంతో ఆసక్తితో, ఉత్సాహంతో ఒగ్గుడోళ్ళ నృత్యం నేర్చుకునుటకు ముందుకు వస్తున్నారు. ఒగ్గుడోళ్ళ నృత్యం తమ సంప్రదాయం కానప్పటికీ కొంత మంది ఔత్సాహికులు డోళ్ళనృత్యం నేర్చుకుని ప్రదర్శనలు ఇస్తున్నారు. అలాంటి

వాటిలో నేడు విశ్వవిద్యా ఈ ధరువునే జోగుదెబ్బ. అంటారు.

**ఒగ్గు నృత్యపు అడుగులు**

1. చిత్తడుగు (ఆది అడుగు)
2. కాలు గిలుపుడు అడుగు
3. కోలాటం అడుగు
4. గేరి కొట్టడు అడుగు
5. గంతుల అడుగు
6. సర్కిల్? అడుగు
7. మూడు అడుగుల సర్కిల్ అడుగు
8. మెలికల అడగు
9. ఎడమ అడుగు
10. కుడి అడుగు

**ఒగ్గు నృత్యంలో అనుకరణ విన్యాసాలు**

ఒగ్గు డోళ్ళ నృత్య కళాకారుల తమ ఊర్లో జరిగే ఇతర నృత్యాలను చూసి తమ నృత్యానికి అనుగుణంగా మలచుకుని ప్రదర్శిస్తుంటారు.కోలాటం నృత్యంలో నుంచి కోలాటం వేసే పద్ధతిని డప్పు నృత్యంలో చేసే ఒకరిపై ఒకరు భుజాలపై ఎక్కి డప్పు శబ్దానికి ఆడబ్బులు డప్పు మీదనుంచి క్రింద పడేట్లుగా చేసే విన్యాసాలను తమ ఒగ్గుడోళ్ళ నృత్యంలో మలచుకుని విద్యాలయాల్లో ఒగ్గు డోళ్ళ నృత్యాన్ని నేర్చుకుని తమ సంబరాల్లో ఎంతో ఉత్సాహంగా ఆనందంగా ప్రదర్శిస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు. అంతే కాకుండా వివిధ రకాల విశ్వవిధ్యాలయ స్థాయిల్లో జరిగిన జానపద నృత్యాల పోటీలను విధ్యార్థులు ఒగ్గుడోళ్ళ నృత్యాన్ని ప్రదర్శించి విజేతలవుతున్నారు.

జానపద కళారూపాలు ముఖ్యంగా రూపాంతరం చెందే లక్షణాన్ని కలిగి వుండడం వల్ల ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా వారి నైపుణ్య ప్రదర్శనలు ఉంటాయి. అదే విధంగా ఒగ్గుడోళ్ళ నృత్యం కూడా అనేక రూపాంతరాలు చెందుతూ వుంది. ఒకే జిల్లాకు చెందిన వివిధ ఒగ్గుడోలు నృత్య బృంధాల వారి నృత్య ప్రదర్శనలు వేరుగా ఉంటున్నాయి. కళాకారులు అలంకరించుకునే విధానంలోనూ వారు ప్రదర్శించే నృత్యపు విన్యాసాల్లోనూ వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి.

నల్లగొండ జిల్లాకు చెందిన షారాజిపేట కళాకారులు తమ నృత్య విన్యాసాల్లో భాగంగా పల్టీలు కొట్టడం, ఒకరిపై ఒకరు భుజాలపై ఎక్కి డోళ్ళు వాయించడం లాంటివిన్యాసాలు వరంగల్ జిల్లా జనగాం ప్రాంతంలో కొద్దిపాటి వ్యత్యాసంతో ప్రదర్శిస్తున్నారు. అంతేకాకుండా షారాజిపేట కళాకారుల వేషధారణలో భాగంగా తమ తలకు రుమాలు కట్టుకుంటే, జనగాం ప్రాంత కళాకారులు తమ జుట్టుకు విగ్గులు పెట్టుకుని జుట్టు వ్రేలాడదీసుకుని ఉంటారు. ఇంకా కరీంనగర్ జిల్లా రాఘవాపురంలో ఒగ్గుడోళ్ళ

నృత్య కళాకారుల వేషధారణలో తలకు రిబ్బన్ కట్టుకుని బనియన్, పంచె ధరిస్తారు. ఈ విధంగా ఒగ్గుడోళ్ళ నృత్య కళాకారుల్లో ఒక్కో ప్రాంతం వారు ఒక్కో విధంగా తమ వేషధారణ లోనూ, నృత్య ప్రదర్శనలోనూ వ్యత్యాసం కనిపిస్తుంది.

ఇతర గొల్ల కులాల్లో ఒగ్గు నృత్యం

ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రకాల గొల్ల కులాలు వున్నట్లు గొల్ల కుల పెద్దలు చెబుతున్నారు.

గొల్లకులాల్లో రకాలు

| | |
|---|---|
| 1. ఎర్రగొల్ల | 2. పాకనాటి గొల్ల |
| 3. కురుమ గొల్ల | 4. ముష్టి గొల్ల |
| 5. పెద్దింటి గొల్ల | 6. కరిని గొల్ల |
| 7. ఏయ గొల్ల | 8. పూజ గొల్ల |
| 9. గంప గొల్ల | 10. తెలునూరి గొల్ల |
| 11. నదనపు గొల్ల | 12. ఆల గొల్ల |
| 13. హే గొల్ల | 14. పూనాటి గొల్ల |
| 15. ఉన్ని గొల్ల | 16. పత్తి గొల్ల |
| 17. గంగిరెడ్డి గొల్ల | 18. కరిణ గొల్ల |
| 19. ఎల్లమ్మ గొల్ల | 20. భాగోతుల గొల్ల |
| 21. రాసగొల్ల | 22. పూరి గొల్ల |
| 23. వృష్టి గొల్ల | 24. కోనార్? గొల్ల |
| 25. మంద గొల్ల | 26. సన్నుతి గొల్ల |
| 27. సంపతి గొల్ల | 28. దొడ్డి గొల్ల |
| 29. పూనుగు గొల్ల | 30. కాడు గొల్ల |
| 31. మాదాసి గొల్ల | 32. బ్రహ్మ గొల్ల |
| 33. విష్ణు గొల్ల | 34. బ్రాహ్మణ గొల్ల |

ఇన్ని రకాలయిన గొల్ల కులాల్లో ఎర్రగొల్ల కులం పెద్దదిగా, మొదటిగా గొల్ల కులపెద్దల అభిప్రాయం. భారతదేశంలో వున్న యాదవులను వివిధ రాష్ట్రాలలో ఈవిధంగా పిలుస్తారు.

| | |
|---|---|
| "బెంగాలులో–ఘూస్ | మధ్యప్రదేశ్–బోజన్ |
| మద్రాస్(చెన్నై)–పిళ్లై | కేరళ–పిళ్ళై |

కర్ణాటక–పిళ్ళై

ఆంధ్రప్రదేశ్‌లో వున్న వివిధ రకాలయిన గొల్లలు తమ జాతర్లయిన కొమురెల్లి (వరంగల్),ఐనవోలు (వరంగల్), పెద్దగట్టు (నల్లగొండ) ఆత్మకూర్ (నల్లగొండ) మొదలగు జాతర్లలోనూ, ఎల్లమ్మ పండుగ గ్రామ దేవతల పండుగల్లోనూ ఒగ్గుడోలును వాయిస్తూ డోళ్ల నృత్యాలను చేస్తూ ఆనందిస్తుంటారు. అంతేకాకుండా గణేష్ నిమజ్జన ఉత్సవంలోనూ, దుర్గాదేవి నిమజ్జనోత్సవంలోనూ, ఊరేగింపుల్లోనూ, ఒగ్గుడోళ్లనృత్య ప్రదర్శన చేస్తుంటారు. అదేవిధంగా వివాహ సందర్భంగా చేసే ఊరేగింపుల్లోనూ యాదవులు ఒగ్గుడోళ్ల నృత్యాలు చేసిన సందర్భాలు అనేకం వున్నాయి.

ఒగ్గు డోళ్ళ నృత్యం జరిగే జాతర్లలోను, పండుగల్లోనూ, ఉత్సవాల్లోనూ ఊరేగింపుల్లోనూ మరియు ఇతర సందర్భాల్లోను ప్రేక్షకుల స్పంధన అనూహ్యంగా వుంటుంది. ఒగ్గుడోళ్ళ శబ్ధం వినగానే ప్రేక్షకుల ముఖంలో చిరునవ్వులు చిందుతాయి ఆనందం, సంతోషం, ఉత్సాహాలు వారి ముఖంలో పొంగిపొర్లుతున్నట్లు కనిపిస్తాయి. ఒగ్గుడోళ్ళ నృత్యాన్ని చూడటానికి ప్రేక్షకులు జాతర్లలో పండుగల్లోనయితే వచ్చి ముందు వరసలో నిల్చోడానికి ఆతృత పడుతుంటారు. అదే ఉత్సవాల్లో, ఊరేగింపుల్లోనయితే ప్రేక్షకులు తాము వచ్చిన సంగతి మరచిపోయి కూడా ఊరేగింపులో ముందుకు సాగుతూ అక్కడ జరిగే ఒగ్గుడోళ్ళ నృత్యం పైనే ఆసక్తి కనబరుస్తుంటారు. ప్రేక్షకుల్లో వుండే యువకుల ఆనందానికి హద్దే వుండదని చెప్పవచ్చు. ఒగ్గుడోళ్ళ నృత్యంలో భాగంగా సాగే శృంగారపు పాటల సందర్భం వచ్చినప్పుడు ప్రేక్షకుల్లో వుండే ప్రేమికులు గానీ బావ, మరదల్లు గానీ తమ చూపుల బాణాలు విసురుకుంటూ ఆనంద డోలికల్లో తేలుతుంటారు.

అంతేగాక ఊర్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడే ఒగ్గుడోళ్ళ నృత్యాన్ని చూడడానికి పిల్లలు, పెద్దలు, ఆడ, మగ, తేడా లేకుండా తరలి వస్తారు. ఒగ్గుడోళ్ళ నృత్యం జరిగే ప్రదేశం చుట్టూ గుండ్రంగా ఏర్పడి ఒకరినొకరు తోసుకుంటూ ఒగ్గుడోళ్ళ నృత్యాన్ని చూస్తూ ఆనందిస్తుంటారు. ప్రేక్షకుల్లో కొందరు తమ కాళ్ళు, చేతులు, ఒగ్గుడోళ్ళ, నృత్య శబ్ధానికి అనుగుణంగా కదుపుతూ సంతోషాన్ని వ్యక్త పరుస్తుంటారు. ఒగ్గుడోళ్ళ నృత్యం జరుగుతున్నంత సేపు ప్రేక్షకులు నృత్యంలో లీనమైపోయి ఈలలు, చప్పట్లు చరుస్తూ తమ ఆనందాన్ని వ్యక్త పరుస్తుంటారు. వివిధ రకాలయిన మతాల వారు, కులాల వారు ప్రేక్షక వర్గంలో వుంటారు. కాబట్టి ఒకరి సంస్కృతిని ఒకరు తెలుసుకోవడానికి అంటే ఒగ్గుడోలు నృత్యం ప్రదర్శకుల వేషధారణను వారి ఆటలను, పాటలను ఎంతో ఆసక్తితో తిలకిస్తూ

సంతోషపడుతుంటారు. ఒగ్గుడోళ్ల నృత్య ప్రదర్శన గురించి తమతో వచ్చిన తోటి ప్రేక్షకునితోగానీ, లేదా ప్రక్కనున్న ప్రేక్షకునితో గానీ ఆసక్తిగా ఆతృతగా తెలుసుకుంటూ తమ సంతోషాన్ని వ్యక్తపరుస్తుంటారు. అంతేకాకుండా అక్కడకు వచ్చిన ప్రేక్షకులు తాముకూడా నృత్యంలో పాల్గొనాలని, నృత్యవిన్యాసాలను చేయాలని ఉవ్విళ్లూరుతుంటారు.

ఒగ్గుడోళ్ల నృత్యాన్ని చూస్తున్నంత సేపు ఒగ్గుడోళ్ల శబ్దాన్ని ఆసక్తిగా ఆలకిస్తూ నృత్యపు అడుగులను వారి విన్యాసాలను తీక్షణంగా చూస్తూ కళాకారుల్లో ఎవరెవరు ఎంత బాగా తమ ప్రదర్శనను ఇస్తున్నారని పరిశీలించే ప్రేక్షకులు కూడా వున్నారు. ఈవిధంగా ప్రేక్షకుల స్పందన రకరకాలుగా వుంటుంది.

ఒగ్గుడోళ్ల నృత్యం జరుగుతున్న సమయంలో ప్రేక్షకులు తమకు నచ్చిన సన్నివేశం వచ్చినప్పుడు చప్పట్లు చరుస్తూ, అరుస్తూ ఈలలు వేస్తూ, డబ్బులు విసుర్తూ వాళ్లను పొగడుతూ బాగా నృత్యంచేసే కళాకారుడి దగ్గరకు గానీ ఒగ్గుడోళ్లనృత్యపు పాటలు చెప్పే కళాకారుడి వద్దకు గానీ వెళ్లి వాళ్ల నోట్లో డబ్బులు పెట్టి తమకు నచ్చిన నృత్య సన్నివేశాన్ని మళ్లీ ప్రదర్శించమంటూ ప్రోత్సహిస్తుంటారు. ఒగ్గుడోళ్ల నృత్య ప్రతి విన్యాసంలోనూ ఈలలు వేస్తూ చప్పట్లు చరచడంతో కళాకారులు తమ నృత్య విన్యాసాలను ఇంకా బాగా చేయడానికి ప్రయత్నిస్తుంటారు. అంతేగాక ఈవిధమైన చప్పట్లు, ఈలలు, కేకలు, డబ్బులు చల్లడం లాంటి ప్రేక్షకుల ప్రేరణకు కళాకారులు సంతోషించి తమ అలసటను కూడా మరచి తమ యొక్క ప్రదర్శనను ఇంకా బాగా చేస్తూ ఎక్కువ సేపు నృత్యం చేస్తుంటారు.

ఒగ్గుడోళ్ల నృత్యాన్ని ఎంతో సంతోషంతో, ఆనందంతో, ఉత్సాహంతో చూసిన ప్రేక్షకులు ఒగ్గుడోళ్ల నృత్య కళాకారులను ఎంతో పొగడుతూ వారితో కరచాలనం చేస్తూ వారి నృత్యం చాలా బాగుందంటూ ఎంతో ఆప్యాయంగా పలకరిస్తూ కొన్ని సందర్భాల్లో కళాకారులను ఎత్తుకుంటూ తమ సంతోషాన్ని వ్యక్తపరుస్తారు. అంతేకాకుండా తాము చూసిన నృత్య విన్యాస కార్యక్రమాన్ని ఇతర ప్రదేశాలలోఏర్పాటు చేయించడం వారికి తగిన విధంగా గౌరవ మార్యదలు చేయడం వారికి బట్టలు, డబ్బులు ఇతర బహుమతులు ఇవ్వడం లాంటివి చేయడం అంతేగాక నృత్య కార్యక్రమం అయిపోయిన తరువాత వారికి సన్మాన కార్యక్రమం చేసి వారిని తగిన విధంగా సంతృప్తి పరచడం లాంటివి చేస్తుంటారు. ఈవిధంగా ప్రేక్షకులు జానపద కళారూపాల పట్ల ఎనలేని ఆదరాభిమానాలు చూపిస్తుంటారు. ఇటువంటి జానపద కళారూపాలు ప్రేక్షకుల గుండెల్లోకి తొందరగా చొచ్చుకుపోయి వారిని కదిలించి వేస్తాయి. వారిలో ఒక ఉత్తేజాన్ని కలిగిస్తాయి. కాబట్టి

ఒగ్గుడోళ్ల నృత్యాన్ని నేడు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లోనూ, రాజకీయ ప్రచార కార్యక్రమాల్లోను ఉపయోగించి ప్రదర్శింపచేసి ఒక విధంగా కళాకారులను కూడా ఆదరిస్తూ తాము కూడా లబ్ధిపొందుతున్నారు. అంతేకాకుండా మారుమూల గ్రామాల్లో జరిగే ఈ ఒగ్గుడోళ్లనృత్యాలునేడు రాష్ట్ర రాజధానిలో ఘనంగా జరుపబడుతున్నాయి. అంటే ప్రేక్షకుల ఆదరణ ప్రశంసనీయమని చెప్పవచ్చు. ఈ ఒగ్గుడోళ్ల నృత్యం నేడు విశ్వవిద్యాలయాల దృష్టిలో కూడా పడి ఎంతో ఆదరణకు నోచుకుంటున్నాయి. అందులోనే భాగంగా విశ్వవిద్యాలయంలోని తమ విద్యార్థులకు ఒగ్గుడోళ్ల నృత్యాన్ని నేర్పించి వారిచే ప్రదర్శనలు ఇప్పిస్తూ ఒగ్గుడోళ్ల నృత్యానికి వున్నటువంటి ప్రాముఖ్యతను, ప్రాధాన్యతను చాటి చెబుతున్నాయి.

అంతేకాకుండా గ్రామాల్లోని ఆసక్తి, అభిమానం, వున్నటువంటి యువకులకు నృత్యాన్ని నేర్పించుటకు ఒగ్గుడోళ్ల నృత్యానికి మరింత ప్రాచుర్యం తీసుకురావడానికి మంచి మనస్సు గల,కళాహృదయంతో గొప్ప వ్యక్తులు కృషి చేస్తున్నారు. ఉదాహరణకు జానపద కళా పరిశోధన వేదిక వారు జానపద కళాకారులను ఆదరిస్తూ, ప్రోత్సహిస్తూ నృత్య శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేయడం.

ఈ విధంగా ఒగ్గుడోళ్ల నృత్యాన్ని ఆదరించి అభిమానించడం వలన తమ నృత్య కార్యక్రమాలను అనేక చోట్ల విరివిగా ప్రదర్శించి తమ కళా నైపుణ్యాన్ని చాటి చెప్పటానికి వీలవుతుంది.

### 3.4. వాయిద్యాలు – పరికరాలు – వేషధారణలు

ఒగ్గు కథా బృందంలో అయిదు నుంచి పదిమంది వరకుంటారు. ఇంతమందే వుండాలనే నియమం లేదు. వారి వారి సౌలభ్యాన్ని బట్టి బృందాలను ఏర్పాటు చేసుకోవచ్చు. కనీసం అయిదు మందున్నా వుండాలి. ఈ అయిదుగురిలో ఒకరు ప్రధాన కథకుడు. మరొకరు సహాయకుడు వీరిద్దరూ ముందు భాగంలో వుంటారు. వారి వెనుక భాగంలో ముగ్గురు నిలబడతారు. వారిలో ఒకరు డోలు, మరొకరు కంచు తాళాలు, ఇంకొకరు కంజీరా ధరిస్తారు. వీరంతా ఒక వంశ వాద్యాలు వాయిస్తూనే వంతగానాన్ని కూడా అందుకుంటారు.

వీరి వృత్తికథ బీరప్ప (వీరభద్రుని) కథ. అలాగే మల్లిఖార్జున, మావురాల రేణుక ఎల్లమ్మ. అట్కరన్ కథ, హరిశ్చంద్ర, మాంధాతకథలే కాక చారిత్రక గాధలకు సంబంధించిన ఇరవై, ముప్పై కథల వరకు చెప్తారు. బీరప్ప జననమే ఒక అద్భుతం. ఆయన

అందచందాలను జానపదకవి మనోహరంగా వర్ణించాడు.

"సుక్కలకు సక్కనా సూరమ్మ కొడుకూ

బ్రమ్మ దేవుని సృష్టి బాలుడూ బీరప్పా

అక్కలకు తమ్ముడు అవివేశమంతుడు.

చిక్కులు పెట్టేటి చిచ్చు కన్నులవాడూ–అంటూ ఆయన రూపాన్ని వర్ణించి, ఆయన వీరత్వాన్ని

"వీరులకు వీరుడూ శూరులకు శూరుడూ

సాదువో వీర్, ముసల్మానోంకే పీర్

ధనదోంకే బీర్, బల్వీకే వీర్,

రావరుదు బీరయ్యా, రణకోవిందుడూ, అని వర్ణిస్తాడు. ఈయన అక్క ఎవరోకాదు, మహంకాళే

ఒగ్గు కథలో డోలూ, తాళాల ధ్వనులు లయాత్మకంగా సాగి ఎదుటి వారిని ఉద్రిక్త పరుస్తాయి. ఒగ్గు కథలో వచనాలు, ధాటీలు, మంగళశాసనాలు, ప్రార్ధనలు, సంవాదరూపాల్లో సాగుతాయి. ఒగ్గు గాన కళారూపంలోని 'చర్తీ', ధాటి ప్రధానంగా సాగినప్పటికీ సందర్భాను సారంగా శృంగార హాస్యరసాలు శ్రోతల్ని మైమరిపిస్తాయి.

ఒగ్గు కథలకు వాద్యపరికరాలు

ఒగ్గుడోలు–ఒగ్గు కథలో ఎక్కువ ప్రాధాన్యం వహించేది ఒగ్గుడోలు.

దీన్ని కురువడోలు, కంచురణభేరి అంటారు. ఇది ఒక మీటరు.

పొడవుండి, గుండ్రంగా డ్రమ్ములా వుండే ఇత్తడి వాద్యం. ఇది గంభీరమైన ధ్వని నిస్తుంది. వివాహ సమయాల్లో కురువలు ఈ డోలును మంగళకరమైన వాద్యంగా భావిస్తారు. ఈ వాద్యాన్ని 'వీరప్ప డోల్ల' అని కూడా పిలుస్తారు.

**కంచుతాళాలు**

కంచుతో చేసిన ఆ తాళాలు చాలా పెద్దవిగా వుంటాయి. వీటి ధ్వని తాళాలు అదురుతున్నట్లుగా వస్తుంది. డోలు ధ్వనితో కలసిన చప్పుడు శ్రవణపేయంగా వుంటుంది.

**ఒగ్గు**

"ఇది శివుడు వాయించే ఢమరుకం. దీన్ని జగ్గు, ఒగ్గు అని కూడా అంటారు. దీని ధ్వని కూడా గంభీరంగా వుంటుంది.

**నపీర**

ఇది ఇత్తడి, ఇనుముతో చేసిన బూర. ఒగ్గు కథా ప్రారంభంలో బీర్ల వాళ్ళు శిగాలు వూగేటప్పుడు నపీరను వూదుతారు. దీని ధ్వని ఉత్తేజపూరితంగా వుంటుంది..

**అందెలు**

ఒగ్గు కథకులు కుడి చేతి బొటన వ్రేలికి తగిలించుకునే పెద్ద వుంగరాలలాంటి వాద్య పరికరాలు. వీటి ధ్వని డోలు, కంచు తాళాలతో కలసి వినసొంపుగా ఉంటుంది. బుర్రకథల్లోనూ వీటిని ఉపయోగిస్తారు.

**కాళ్ళ గజ్జెలు**

రెండు మూడు వరుసల కాలిగజ్జెలను ఉపయోగించి ఒగ్గు కథలు చెప్తారు. కథా గమనాన్ని 'ఛల్తీ ' ధాటీలకు అనుగుణంగా అడుగులు వేసేటప్పుడు వాద్యాలను సమన్వయం చేసుకునే వాద్యంయిది. గజ్జెల ధ్వని మనోహరంగా వుంటుంది.

**కంజరి**

ఇటీవలికాలంలో ఒగ్గు కథలో 'కంజరి' వాద్యపరికరాన్ని కూడా ఉపయోగిస్తున్నారు. దీనితోపాటే శంఖాన్ని కూడా ఒగ్గులాగానే మధ్యమధ్య ఉపయోగిస్తారు.

కురుమల సంప్రదాయంగా ఏర్పడిన ఒగ్గుకథ నేడు సామాజిక కళారూపంగా మారింది. అనేక ప్రయోగాలకు వేదికైంది. ఈ ప్రయోగాలు కథపరంగానూ, అటు ప్రదర్శన పరంగానూ పరిణామం చెందాయి.

ఒగ్గు వాళ్ళే వంశపారంపర్యంగా ఒగ్గు కథ చెప్పాలె అనే హద్దును అతిక్రమించి, ఉత్సాహవంతులు, ప్రయోగశీలురు ఇతర కులాలవారు. కూడా ఒగ్గుకథను అభ్యసించి ప్రదర్శనలు ఇస్తున్నారు. బృందాలుగా కూడా ఏర్పడినారు. కరీంనగర్, హుజూరాబాద్ హరిజన కులానికి చెందిన సాహు, హైదరాబాద్ కాపు కులానికి చెందిన సి. భగవాన్ రావు, కరీంనగర్ గౌడ్ కులానికి చెందిన ప్రసిద్ధ ఒగ్గు కథకుడు మిద్దె రాములును చెప్పుకుంటారు.

పరిశోధకులు తెలిపిన దాని ప్రకారం తెలంగాణలో దాదాపు 30కిపైగా ఒగ్గు కథా బృందాలున్నట్లుగా విదితమౌతుంది.

**కళారూప ప్రదర్శన–**

ఒగ్గు వృత్తి కళాకారులు నలుగురు లేదా ఐదుగురు ఈ కథాగాన ప్రదర్శనలో పాల్గొంటారు. వీరి కథాగానానికి ఉపయోగపడే వాద్యాలలో ప్రధానమైంది 'ఒగ్గు' (డమ రుకం). దానితోపాటు పిల్లనగ్రోవి, వీరణం, డోలు, పెద్ద తాళాలు సమయ సందర్భాలను

బట్టి వాద్యాలను ఉపయోగిస్తారు. కళాకారులందరూ వేషధారణతోపాటు, ఆభరణాలను ధరిస్తారు. ఈ కళాబృందంలో ఒకరు ఆడవేషం కడతారు. కాళ్లకు గజ్జెలు ధరించి అద్భుతంగా నృత్యం చేస్తారు. ప్రధాన కథకుడు, సహ కథకుడు కథాగానం చేస్తుంటే మిగతావారు వాయిద్యాలు వాయించుకుంటూ వంత పాడుతారు. కొన్ని సమయాల్లో కథను అద్భుతమైన బోనం నృత్యంతో ముగించే సంప్రదాయం 'ఒగ్గు' కథాగాన ప్రదర్శనలో ఇటీవలే ప్రవేశించింది. ఒగ్గు కళాకారుల నైపుణ్యం వల్ల బోనం నృత్యం ప్రేక్షకుల్ని ఎంతగానో అలరిస్తున్నట్టుగా కనిపిస్తోంది.

ఈ ఒగ్గు కథ కళారూపం కళాకారుడు ఇటీవల మరణించిన చుక్క సత్తయ్య, మిద్దె రాములు ఈ ఇద్దరి వల్లే. ప్రపంచ ప్రఖ్యాతి చెందింది. వీరిద్దరేగాక వనం రాజయ్య, ఒగ్గు సతీష్, బైరి మల్లేష్ లాంటి కళాకారులెంతమందో ఈ కళారూపాన్ని మేటి కళారూపంగా తీర్చిదిద్దుతూ వస్తున్నారు. వీర్ల ఐలయ్య, మల్లెల వీరప్ప లాంటి 'ఒగ్గు' కళాకారులు బీరన్న కథలను చెప్తూ జీవిస్తూ వస్తున్నారు.

**వేషధారణ –**

ఒగ్గు కథను ప్రదర్శించే సమయంలో ఒక ప్రధాన కథానాయకునితో పాటు నలుగురు లేక ఆరుగురు పాత్రదారులు ఉంటారు. వీరిలో ఒకరు వంతగాడు. ఒక్కడే అన్ని పాత్రలు, స్త్రీల పాత్రులు కూడా ఇద్దరు వాద్యకారులు, ఒకరు రణభేరి ఊదు తుంటాడు. మరొకరు తాళం వాయిస్తారు. ప్రధాన కథా నాయకుడు ముఖానికి పసుపును రాసుకొని ఎర్రటి బొట్టుతో తెల్లటి ధోవతిని, రంగు రంగుల అంగిని, కండువను నడుముకు చుట్టుకొని ఒక చేత రంగుల గుడ్డను, ఒక చేత "ఒగ్గు" ను ధరించి ఉంటాడు. మిగితా వారు కడియం, కాళ్ళకు గజ్జలు మొదలైన వస్తువులతో ప్రదర్శిస్తారు. ఒగ్గు కథా ప్రధానంగా కథా ప్రక్రియ అయినా ఇందులోని గేయాలల్లో తాళ, నృత్య గతులకు, వార, శృంగార, రౌద్ర, కరుణా, రసాలు, మొదలైన అంశాలకు ప్రాధాన్యం ఉంటుంది.

ఉదా :

నామీద లేని బదనాము పెట్టి
అగ్గి గుండముల నన్ను అగ్గిపాలు
చెయబట్టే దేవుడు గంగమ్మ
వాడ వాడ చెల్లలు రండమ్మా మీరు
తల్లి దండాలమ్మా మీకు

మీ ముఖము చూసి వెళ్ళిపోతు.

నేను ఇగరాను తల్లి ఇగరాను తల్లి గంగమ్మ

అంటు శోక రసాన్ని పండించి ప్రేక్షకులను ఏడిపిస్తారు. మరో సందర్భంలో

ఒక్కొక్క డప్పంత శివ సత్తంత

కాలు కదిలియమ్మె మావూరాల ఎల్లమ్మ.

గజ్జె కదిలించమ్మా ఒయ్యారం ఒలకంగా..

అంటు వీర రసంతో ప్రజల్ని ఉద్రేకపరుస్తారు. ఈ విధంగ ప్రాధాన్యతను సంపాదించుకున్న "ఒగ్గు కథ" ఎందరో ప్రముఖులు "ఒగ్గు కథకు" విశిష్టమైన సేవ చేసినారు. వారిలో ముఖ్యులుగా మిద్దెరాములు, చుక్క సత్తయ్య, చిట్టి కొమరయ్య కొందరని చెప్పవచ్చు. మిద్దె రాములు 1990 లో మారిషస్లో జరిగిన మూడవ ప్రపంచ తెలుగు మహాసభల్లో ప్రదర్శినలిచ్చి అప్పటి ప్రధాని అనురథ్ జగన్నాథ్, గవర్నర్ రంగస్వామి రంగడుల యొక్క ప్రశంసలందుకొని "జానపద కళాబ్రహ్మ" బిరుదుతో తనదైన ముద్రవేసుకున్నాడు. చుక్క సత్తయ్య ఒగ్గు ప్రదర్శనలో 40 సంవత్సరాల ప్రస్తానంలో దేశ, విదేశాల్లో 12 వేలకు పైగా ప్రదర్శనలిచ్చి, 60 కి పైగా ప్రముఖ కథలను చెప్పి 2004వ సంవత్సరంలో అబ్దుల్ కలాం చేతుల మీదుగా " కేంద్ర సంగీత నాటక గదిలించి ఒలకంగా.. అకాడమీ అవార్డు" పొంది 2017 నవంబర్ 9వ తేదిన ఒగ్గు కళా ప్రదర్శనలో తనదైన శైలి చూపించి శివైక్యం పొందాడు.

**3.5. ప్రదర్శనా స్థలం - ప్రదర్శనా రీతులు**

ఒగ్గుకథ చెప్పేముందు కథకులు కథాస్థలాన్ని ముందే నిర్ణయించుకుంటారు. లేదా కథ చెప్పించే వారు నిర్ణయిస్తారు.కథాస్థలానికి పెద్దహంగులేమీ చేయరు. ప్రత్యేక శ్రద్ధ కూడా తీసుకోరు. ఒగ్గుకథ ఎక్కడ చెప్పబడుతుందో ఆ ప్రదేశంలో వేదిక ఏర్పాటు చేస్తారు.వేదికకు ఎదురుగా ప్రేక్షకులు కూర్చుంటారు. కథాస్తలంలో ఒకటి,రెండు చాపలు నేలమీద పరుస్తారు. ఒక్కొక్కసారి ప్రధాన కథకుడు, ఇతర కథకులు అలసిపోయినపుడు కూర్చోవడానికి నాలుగైదు కుర్చీలుగానీ, ఒక బల్లగానీ వేసి ఉంచుతారు.ఈ రోజుల్లో అయితే ఒగ్గు కథా ప్రదర్శనా స్థలిలో జంపఖానాలు పరుస్తున్నారు.వేదిక మీద బల్లలు వేసి,మైకులు అమర్చి అన్ని హంగులతో కథ చెప్పిస్తున్నారు.

ఒగ్గుకథా బృందంలోని ఇద్దరు సహాయకులు ఒగ్గుడోలును,పెద్ద తాళాలను ఉధృత స్థాయిలో మ్రోగిస్తూ కథ ఏ ప్రాంతంలో చెప్పబడుతుందో గుర్తించేలా చేస్తారు. కథా

ప్రారంభ సూచనగా ఢిల్లెం – భళ్ళెం లేదా ఢిళ్ళెం – కళ్ళెం అని శబ్దం వినిపించేలా డోలును కర్రలతో కొడుతుంటారు. ఆ శబ్దం వినిపించినంత మేర ప్రజలు ఒగ్గుకథ ప్రారంభింపబడుతుందని తెలుసుకుంటారు. వెంటనే ప్రదర్శనా స్థలానికి చేరుకుంటారు. ప్రేక్షకులందరూ వచ్చిన తర్వాత ప్రధాన కథకుడు వేదికపైకి వస్తాడు. ఆ తర్వాత వంతలు, వాద్యకారులు కూడా వేదికపైకి వస్తారు. ముందుగా వేదికపై పసుపుకుంకుమలు చల్లి కొబ్బరికాయ కొట్టి,అగరువత్తులు వెలిగించి ప్రేక్షకులకు నమస్కరిస్తారు. అంతసేపటి వరకూ సహాయకులు ఢిళ్ళెం–కళ్ళెం అని ఉధృతస్థాయిలో మ్రోగిస్తూనే ఉంటారు. వేదికపై పూజానంతరం ప్రధాన కతకుడు ఢిళ్ళెం–కళ్ళెం ఆపుమని సైగ చేస్తాడు.అప్పటి వరకూ డోలును కర్రలతో కొడుతుంటారు. పెద్ద తాళాలను వదిలి చిన్నతాళాలు ఉపయోగిస్తారు.

కథకుడు వేదికపైన మధ్యలో నిలబడతాడు. అటు–ఇటూ ఇద్దరు సహాయకులు నిలబడతారు. వారి వెనక వాద్యకారులు కూచుంటారు. రెండు మూడు అడుగులు ముందుకు వేసి ప్రధాన కథకుడు దైవ ప్రార్థన చేస్తాడు. సహాయకులు వంత పలుకుతారు. కథకులు ముందు గంగాదేవిని ఆ తర్వాత విఘ్నేశ్వరుని,పార్వతీ దేవిని,గ్రామదేవతలను ప్రార్థిస్తారు. అటు తర్వాత దేశ దేశాలపేర్లు ప్రస్థావించి కథ చెప్పే ప్రాంతాన్ని గురించి కూడా వివరిస్తారు.కథ చెప్పించే వారి పేర్లను,వారి తల్లిదండ్రులను, వారి వంశ గౌరవాన్ని కీర్తిస్తారు. అనంతరం కథలోకి వెళ్ళిపోతారు.

కథ చెప్పేటప్పుడు కథకులు ఎడమ చేతిని ఎడమ చెవికి అడ్డంగా పెట్టుకుంటారు. లేదా నడుంపైన పెట్టుకుంటారు. కుడి చేతిని గాలిలోకి ఏటవాలుగా ఎత్తి కథ చెబుతుంటారు. కథలో కొన్ని సందర్భాల్లో రెండు మోకాళ్ళు కొద్దిగా వంచి,కుడిపాదాన్ని పూర్తిగా నేలపై ఆన్చి,ఎడమ మడమను కొద్దిగా పైకెత్తి మెల్లిమెల్లగా ముందుకు జరుగుతూ కథ చెబుతుంటారు. కొందరు ఎడమ పాదంనేలపై ఆన్చి కుడిపాదాన్ని ఎత్తి ముందుకు జరుగుతూ కథ చెబుతుంటారు.గుండ్రంగా తిరుగుతుంటారు.

కథ వేగంగా సాగుతున్నప్పుడు అనగా 'చల్తీధాటీ'లో కథ జరుగుతున్నప్పుడు ప్రధాన కథకుడు వేదికపై మూడు నాలుగు అడుగులు ముందుకు వేసి గిరుక్కున వెనకకు తిరిగి యథాస్థానంలోనికి చేరుకుంటాడు.వాద్యకారులు వారి వారి స్థానాల్లోనే ఉంటారు.వంతలు మాత్రం కథకుని అనుకరిస్తారు.

ప్రధాన కథకుడు ఎర్రంచు ధోవతిని ధరించి కాళ్ళకు గజ్జెలు,నడుముకు పట్టుశాలువా ధరిస్తాడు. చేతులలో పొన్నకర్ర,ఒగ్గుపట్టుకుంటాడు. కొందరు సమయ, సందర్భానుసారంగా

తోలుపట్టీ కొరడా కూడా చేతిలో పట్టుకుంటారు. ఒక సహాయకుడు డోలు వాయిస్తాడు. ఈ డోలును రణడోలు లేదా రణభేరి అంటారు. మరొక సహాయకుడు తాళాలు వాయిస్తాడు. కథకులందరూ తమ ఇష్టానుసారంగా, స్వేచ్ఛగా తమ పాత్రలను నిర్వహిస్తారు. ఆంక్షలు విధించేవారు ఎవరూ ఉండరు. ప్రధాన కథకుడు మాత్రం సహాయకులను అతిగా మాట్లాడకుండా అప్పుడప్పుడు అదుపు చేస్తుంటాడు.

స్త్రీ వేషం వేసినవారు పాత్రకు తగినట్లుగా తమ గానరీతిని మార్చి గొంతులో స్త్రీ కంఠాన్ని పలికిస్తారు. నడుముకు చేతులు పెట్టుకుని, నడుమును త్రిప్పుతూ, స్త్రీ లాగా హొయలు ఒలక బోస్తుంటాడు. సన్నివేశానికి తగినట్లుగా అనగా దుఃఖ సన్నివేశం వస్తే దుఃఖించడం, శోకాలు తీయడం, కొట్టుకునే సన్నివేశం వస్తే కొట్టుకోవడంలాంటివి చేస్తుంటారు.

మగవారు ఆడవేషం వేసినా వారి అలవాట్లు మానుకోలేరు. వారికి పొగ తాగాలని అనిపించినప్పుడల్లా తాత్కాలికంగా ఆ పాత్రను ఇతరుల కప్పగించి ఆ ప్రక్కనే నిలబడి పొగతాగుతుంటారు. చిన్న పిల్లలు ఈ విషయం తెలియక స్త్రీ యే చుట్ట తాగుతుందేమోనని భ్రమ పడుతుంటారు.

కథకులు కథకు సంబంధం వున్నా, లేకపోయినా ప్రేక్షకుల్ని రంజింప చేయడానికి, కథమధ్యలో పిట్ట కథలు, హాస్య సంభాషణలు చెబుతుంటారు. కథకుడు చిత్ర ప్రశ్నలు వేస్తుంటాడు. సహాయకులు ఆలోచించి చెప్పేలోపల ప్రేక్షకులు కూడా వాటికి సమాదానాలు ఆలోచిస్తుంటారు. ఈ విదంగా ప్రేక్షకుల్ని భాగస్వాముల్ని చేయడం వంటి విలక్షణమైన ప్రదర్శనా పద్ధతి ఒగ్గకథలో ఉండడం వల్లనే తరతరాలనుండి ప్రజా హృదయాల్లో ఈ కళారూపం శాశ్వతంగా నిలిచిపోయింది.

కథకుడు సందర్భానుసారంగా తన చేతిలోని ఒగ్గను గంపగా కూడా ఉపయోగిస్తుంటాడు. కఱ్ఱను కత్తిగా, గదగా, గుఱ్ఱపు కళ్లెంగా కూడా కథలో వాడుకుంటాడు. నిజంగా ఆ వస్తువులు కథకుని చేతిలో ఉన్నయేమో అని అనుకునేలా భ్రమింపచేస్తాడు. పట్టు సెల్లాను కూడా అదే విదంగా అదుత సాధనాలుగా వాడుకుంటాడు. కథకుడు స్త్రీ పాత్ర పోషించ వలసి వస్తే పట్టు సెల్లాను కొంగులాగా వేసుకుంటాడు. పురుషుడిగా ధైర్యం ప్రదర్శించవలసి వస్తే దానినే నడుముకు కట్టుకుంటాడు. ఈ విధంగా ఒగ్గు కథకులు తమ దగ్గర ఉన్న తక్కువ వస్తువులతోనే అద్భుతమైన సన్నివేశాలను ప్రదర్శించగలరు.

ఒగ్గుకథను మించిన జానపదకళ మరొకటి లేదు. అసలు మనిషై పుట్టినవాడు

తప్పనిసరిగా ఒక సారైనా ఒగ్గుకథా ప్రదర్శనను చూచి తీరాలి. అలా చూడకపోతే అది ఒక లోపమే .ఒగ్గుకథా ప్రదర్శనను చూడడం ఒక మహత్తరమైన అనుభవం. ఈ కథకులు కథను అనేక రకాల బాణీల్లో, వరుసల్లో చెబుతారు. ఇంచుమించుగా జానపదగేయాల్లోని అన్ని బాణీలను వరుసలను వీరు తమ కథను చెప్పే సందర్భంలో ఉపయోగిస్తారు. ఇంత గొప్పకళ తెలంగాణాకు మాత్రమే పరిమితం కావడం ఆశ్చర్యం. ఇది తెలంగాణ ప్రాంతంలో గొప్ప ప్రచారాన్ని, ప్రసిద్ధిని పొందిన జానపద కళ. ఇది కథను చెప్పడమే ప్రధానంగా ఉన్న కళ. అంటే కథాఖ్యానాత్మక కళ. దీన్ని గొల్ల, కురుమ కులాలకు చెందిన వారు ప్రధానంగా చెబుతారు.ఒగ్గుకథా ప్రదర్శనలో ఐదుగురు లేక ఆరుగురు వ్యక్తులు పాల్గొంటారు. వీరిలో ఇద్దరు ప్రధాన కథకులుగా ఉంటారు. ఈ ఇద్దరిలో ఒకరు స్త్రీ వేషాన్ని ధరిస్తారు. మిగిలినవారు వాద్య పరికరాలను వాయిస్తూ వంతలుగా ప్రధాన కథకులకు తోడ్పడుతూ ఉంటారు. వీరు అవసరం అయినప్పుడు కథలో వచ్చే అనేక పాత్రలుగా నటించి తిరిగి వాద్యకారులుగా, వంతలుగా తమ స్థానాల్లోకి వెళ్ళిపోతూ ఉంటారు. అందువల్ల ఒగ్గు కళాప్రదర్శనలో పాల్గొనే వారందరూ కథలో వచ్చే అన్ని పాత్రలను పోషించగల సామర్థ్యం కలిగినవారై ఉంటారు.

**1. వాద్యాలు – పరికరాలు :**

జానపదకళ ప్రసిద్ధికి, దాని ప్రదర్శన విజయవంతం కావడానికి వాద్యాలు ఎంతగానో తోడ్పడతాయి. కొన్ని జానపద కళలు వాయిద్యం పేరుతోటే ప్రసిద్ధి చెందుతాయి. ప్రస్తుత కళ అయిన ఒగ్గుకథ అలా వాయిద్యం పేరుతో ప్రసిద్ధి పొందినదే. ఈ కళా ప్రదర్శనలో "ఒగ్గు" అనే పరికరాన్నే గాకుండా డోలు, కర్రలు, తాళాలు నవీర మొదలైన వాద్యాలను కట్లకోల, చేతిరుమాలు, గజ్జలు మొదలైన పరికరాలను ఉపయోగిస్తారు.

**1ఒగ్గు :**

ఒగ్గు కథకులు ఉపయోగించే వాయిద్యల్లో ఒగ్గు ముఖ్యమైంది. అయితే ఒగ్గును ఈ కళాప్రదర్శనలో ఎక్కువగా ఉపయోగించరు.మల్లన్నకథ, బీరప్ప కథలను ఒగ్గుకథగా చెప్పేటప్పుడు మల్లన్న పాత్రను పోషించే ప్రధాన కథకుడు అప్పుడప్పుడు మాత్రమే ఒగ్గును ఉపయోగిస్తాడు. ఐనప్పటికీ ఈ కళకు ఒగ్గుకథ అనే పేరు రావడానికి ఈ కథను చెప్పే కురుమలు శైవులు కావడం, శైవాంశ సంభూతులైన మల్లన్న, బీరప్పల గురించి కథలను చెప్పడం, శివుని ప్రధాన వాద్యమైన డమరుకాన్ని జానపదులు ఒగ్గు అనే పేరుతో పిలుస్తూ ఉండడం కారణం కావచ్చు. అంటే శైవులైన కురుమలు శైవమతానికి సంబంధించిన

కథను చెప్పేకళకు శివుని ప్రధాన వాద్యం పేరు పెడితే బాగుంటుందనే ఉద్దేశ్యంతో వారు తమ కళకు ఒగ్గుకథ అనే పేరు పెట్టి ఉండవచ్చు.

ఈ ఒగ్గును జానపదులు జగ్గు, జెగ్గు అని కూడా పిలుస్తారు. దీన్ని చెక్కతోగాని ఇత్తడితో గానీ చేస్తారు. ఇది మధ్యలో సన్నగా ఉండి రెండు చివరలా' కొంచెం వెడల్పుగా గొట్టంలాగా ఉంటుంది. రెండు వైపులా మేకచర్మాన్ని అతికిస్తారు. మధ్యలో సన్నటి తాడుగట్టి ఆ తాడుకు రెండు కొనలు వదిలివేసి ఆ కొనల చివర ముడివేస్తారు. దీన్ని మధ్యలో పట్టుకొని అటూ ఇటూ వేగంగా తిప్పితే మధ్యలో కట్టిన తాళ్ల ముడి ప్రదేశం చర్మానికి తగిలి చక్కటి శబ్దం వస్తుంది. ఒగ్గు కథకులు ఈ ఒగ్గును ఒగ్గుకథా ప్రదర్శనలో మాత్రమే గాకుండా తమ ఆచార సంప్రదాయాల్లో గూడ ఉపయోగిస్తారు. కురుమలు మల్లన్న పండుగ సందర్భంలో తెల్లపాలు తీసేటప్పుడు మైలపోలు వద్ద నాగవెల్లి పటం మీద ఈ ఒగ్గును పెడతారు. అంతేగాకుండా మల్లన్న లగ్న సమయంలో, వీరబోనం తీసేటప్పుడు ఒగ్గును చేత పట్టుకొని వాయిస్తారు.

**2. డోలు :**

ఒగ్గుకథలో డోలును ఎక్కువగా ఉపయోగిస్తారు. దీన్ని ఒగ్గుడోలు అని అంటారు. ఇది ఒక మీటరు పొడవు ఉన్న చిన్న డ్రమ్ములాగా ఉంటుంది. దీన్ని ఇత్తడితోగాని, ఇనుముతో గాని చేస్తారు. ఎక్కువగా ఇత్తడితో చేసినదాన్నే వీరు ఉపయోగిస్తారు. ఈ డ్రమ్ము లాంటి దానికి శుద్ధిచేసి ఆరబెట్టిన మేక చర్మాన్ని బిగిస్తారు. ప్రదర్శన సమయంలో మేక చర్మానికి కట్టిన తాళ్ళను గట్టిగా లాగి కడతారు. ఇలా లాగి కట్టడం వల్ల మంచి శబ్దం వస్తుంది. ప్రదర్శన అయిపోగానే తాళ్ళను వదులుగా ఉంచుతారు. ఇలా చేయడం వల్ల డోలుకు కట్టిన చర్మం దెబ్బతినకుండా ఉంటుంది. డోలును కురుమలు నేలమీద పెట్టరు. నేలమీద పెట్టడాన్ని అపవిత్రంగా భావిస్తారు. చాప మీద గానీ, గొంగడి మీద గానీ లేదా అరుగు మీద గానీ పెడతారు. లేకపోతే చిలుకకొయ్యకు తగిలిస్తారు. డోలు రెండు ఆడుగుల పొడవు, మూడు అడుగుల వెడల్పు ఉంటుంది.

ఒగ్గుకథ మొదలు పెట్టేటప్పుడు కథా ప్రారంభ సూచకంగా డోలును వాయిస్తారు. డోలును కర్రలతో వాయిస్తూ తాము ఒగ్గుకథ చెప్పిన ఊర్ల పేర్లను, తనకు ఆర్థిక సహాయం చేసిన వ్యక్తుల పేర్లను, ఒగ్గుకథను చెప్పించిన వారి పేర్లను పొగుడుతూ చెబుతారు. ఈ డోలు శబ్దాన్ని బట్టి ఒగ్గుకథ ప్రారంభమౌతూ ఉందని ఊర్లో ఉన్న ప్రజలు తెలుసుకొని ఒగు కథను వినడానికి వస్తారు.

డోలును ఒగ్గుకథా ప్రదర్శనలోనే కాకుండా ఆచార సంప్రదాయాల సమయంలో కూడా బాగా ఉపయోగిస్తారు. కురుమలు మల్లన్న పండుగ సందర్భంలో మల్లన్నను ఊరేగించేటప్పుడు, జలదికి వెళ్ళేటప్పుడు, మైలపోలు తీసినప్పుడు, నాగవెల్లి, వీరబోనం చేసినప్పుడు, పటం ఎక్కేటప్పుడు డోలును ఉధృతంగా వాయిస్తారు. ఈ సందర్భాల్లో ఎక్కువ డోల్లను ఉపయోగిస్తారు. అంతే గాకుండా పై సందర్భాల్లో కురుమలు డోల్లతో విన్యాసాలు చేస్తారు. వలయాకారంలో తిరుగుతూ నృత్యం చేయడం, ఇద్దరు వ్యక్తులు ఒకరి డోలును మరొకరు వాయించడం, డోలు తాడును పళ్ళతో పట్టుకొని నృత్యం చేస్తూ వాయించడం, కూర్చొని డోలును వీపుకు ఆనించి చేతులు వెనక్కితిప్పి డోలును వాయించడం లాంటి అనేర రకాల విన్యాసాలను వీరు చేస్తారు. ఈ విన్యాసాల సందర్భంలో డోలు శబ్దం చెవులు గింగురుమనేలాగా ఉంటుంది. అంతేగాకుండా గుండెలు అదిరిపోయేలాగా ఉంటుంది. ఈ డోలుకు తోడుగా పెద్ద తాళాలు, నపీర శబ్దాలన్నీ కలిసి భయాన్ని, భక్తిని, పరవశాన్ని కలిగిస్తాయి. ఈ పరవశత్వం జాన పదులకు ఒక్కొక్కసారి పూనకాన్ని తెప్పిస్తుంది.

డోలును వాయించడానికి రెండు కర్రలను ఉపయోగిస్తారు. ఇవి ఒక్కొక్కటి అడుగు పొడవు, ఒకటిన్నర ఇంచి వెడల్పు ఉంటాయి. ఈ కర్రలుగా సితపాలకర్ర, జిల్లేడుకర్ర, పాలకుర్సె కర్ర, టేకుకర్ర, భూతంకుర్సకర్ర, ఉడుగుకర్రల్లో ఏదైనా ఒక దానిని ఉపయోగిస్తారు.

**3. తాళాలు :**

ఒగ్గుకథకులు కథను చెప్పేటప్పుడు పెద్ద తాళాలను, చిన్న తాళాలను ఉపయోగిస్తారు. పెద్ద తాళాలను ఒగ్గుకథను ప్రారంభించడానికి ముందు ప్రారంభసూచకంగా ఉపయోగిస్తారు. చిన్న తాళాలను కథను చెప్పే సమయంలో ఎక్కువగా ఉపయోగిస్తారు. పెద్ద తాళాలను ఒగ్గువారు మల్లన్న పండుగ సమయంలో మల్లన్నను ఊరేగించేటప్పుడు వీరబోనం తియ్యడం, పటం తొక్కడం లాంటి ఉత్తేజపూరితమైన ఘట్టాల్లో ఉపయోగిస్తారు.

**4. సపీర :**

దీన్ని ఇత్తడితో చేస్తారు. దీని శబ్దం కొమ్మువాద్య శబ్దం లాగా ఉంటుంది. ఐతే ఇది కొమ్ములాగా వంకరగా ఉండదు. కొమ్ము అంతపొడవుగా కూడా ఉండదు. కొమ్ములో సగం పొడవు ఉంటుంది. ఇది నోటి దగ్గర పెట్టుకొని వాయించే వైపు సన్నగా ఉండి గాలి వెళ్ళే వైపు వెడల్పుగా ఉంటుంది. ఒగ్గుకథా ప్రారంభంలో కథ ప్రారంభ మవుతుందని చెప్పడానికి దీన్ని ఊదుతారు. దీన్ని ఊదడానికి మంచి శక్తి అవసరం. దీన్ని నోట్లో

పెదవులకు ఎడమ వైపు ఆనించి కడుపు నిండా గాలి బాగా పీల్చి కడుపు బిగపట్టి గట్టిగా ఊదుతారు. సపీరను ఒగ్గుకథలోనే కాకుండా మల్లన్న, బీరన్న పండుగ సమయాల్లో జలదికి వెళ్ళేటప్పుడు చేసే ఊరేగింపులో, వీరబోనం తీసేటప్పుడు, అలాగే గుండం తొక్కేటప్పుడు ఊదుతారు.

**5. కనకడప్పు :**

ఇది చిన్న డప్పు లాగా ఉంటుంది. దీన్ని ఇత్తడితో గానీ, స్టీలుతో గానీ చేస్తారు. దీని అంచు వెంట చిన్న చిన్న ఇనుపబిళ్ళలు ఉంటాయి. దీన్ని ఎడమ చేత్తో పట్టుకొని కుడిచేత వాయిస్తున్నప్పుడు ఈ బిళ్ళలు శబ్దాన్ని కలిగిస్తాయి.

**6. గజ్జెలు :**

ఒగ్గు కథకులు రవ్వగజ్జెలు, చిరుగజ్జెలు, పిక్కగజ్జెలు అనే మూడు రకాల గజ్జెలను ఉపయోగిస్తారు. రవ్వగజ్జెలను కట్లకోలకు ఒక చివర కడతారు. ఈ కట్లకోలను పురుష రూపంలో ఉన్న ప్రధాన కథకుడు పట్టుకొని ఉంటాడు. చిరుగజ్జెలను ప్రధాన కథకులిద్దరూ కాళ్ళకు కట్టుకుంటారు. మల్లన్న, బీరన్న పండుగుల సందర్భాల్లో ఊరే గింపు సమయంలోను వీరబోనం తీసినప్పుడు ఒగ్గువారు పిక్కగజ్జెలు కట్టిన లాగులను తొడుక్కొని నృత్యం చేస్తారు. అంటే పిక్క గజ్జెలను లాగులకు కడతారు. వీటిని ఒగ్గు కథా సమయంలో వినియోగించరు.

**7. కట్లకోల :**

ఇది నల్లగా ఉన్న కర్ర. దీనికి ఇత్తడికట్లు వేయబడి ఉంటాయి. దీనికి ఒక చివర మూడు లేదా నాలుగు రవ్వల గజ్జెలు ఉంటాయి. పురుష వేషధారి అయిన ప్రధాన కథకుడు దీన్ని పట్టుకుంటాడు. ఇతడు కథను చెప్పేటప్పుడు సందర్భాన్ని బట్టి ఈ కట్లకోలను కత్తిగా, గదగా, గుర్రాలను అదిలించే చర్నకోలగా గుర్రపు కళ్ళెంగా ఉపయోగిస్తాడు. అంతేగాకుండా ప్రేక్షకులకు ఆ కర్రను ఆయా సమయాల్లో పైన చెప్పిన వస్తువుల లాగా భ్రమకలిగించేలా చేస్తాడు.

**8. చేతి రుమాలు :**

చేతిరుమాలను స్త్రీ వేషాన్ని ధరించిన ప్రధాన కథకుడు పట్టుకుంటాడు. ఇతని చేతిలో అది అనేక రకాలుగా ఉపయోగపడుతుంది. కథలో వచ్చే సందర్భాన్ని బట్టి చేతిరుమాలు గంప, చేట, జోలె మొదలైన అనేక వస్తువుల లాగా ఉపయోగ పడుతుంది. ఇది కథకుని చేతిలో ఒక అవయవం లాగా పనిచేస్తుంది. కథ చెప్పినంత సేపు ఇది కథకుని చేతిలో ఉంటుంది. ఇది లేకపోతే కథకుని చెయ్యి విరిగినట్లుగా ఉంటుంది. సందర్భాన్ని బట్టి ఈ

జేబురుమాలు అనేక రసాలను అభినయించడానికి వీలుగా ఉంటుంది.కరుణరస సన్నివేశాల్లో కళ్ళు తుడుచుకోవడానికి, శృంగార సన్నివేశాల్లో హొయలు వలకబోస్తూ వయ్యారాలు చూపించడానికి ఇది బాగా ఉపయోగపడుతుంది.

**9. పట్టుసెల్ల :**

పట్టు సెల్ల అంటే పట్టువస్త్రం. ప్రధాన కథకుడు దీన్ని భుజంమీద వేసుకోవడం గానీ, నడుముకు కట్టుకోవడం గానీ చేస్తాడు. కథలో వచ్చే సమయ సందర్భాలను బట్టి కథకుడు దీన్ని చీరగా, కండువాగా, తలపాగగా నడుముకు కట్టుకొనే వస్త్రంగా, ఆయుధంగా, ఇంకా పాత్రోచిత పరికరంగా ఉపయోగించుకుంటాడు. స్త్రీ పాత్రను పోషించవలసి వచ్చినప్పుడు ఈ పట్టుసెల్లాను భుజం మీద పైటగా వేసు కోవడం వల్ల, తలమీద కొంగుగా వేసుకోవడం వల్ల దాన్ని చీరగా మలుచుకుంటాడు. పురుష పాత్రను పోషించేటప్పుడు నడుముకు దట్టీ లాగా కట్టుకుంటాడు. లేకపోతే భుజంమీద కండువా లాగా వేసుకుంటాడు. పైన చెప్పినవే కాకుండా నాగబంధం, ఒక గజ్జెల చౌక్కా గజ్జెల లాగు, వీరడోలు, ముగ్గు పలకలు, తెల్లపిండి, పచ్చపిండి, తంగేడుపిండి, బొగ్గుపొడి, పసుపు, కుంకుమ మొదలైన వాటిని కూడా ఒగ్గుకథకులు ఉపయోగిస్తారు.

**ఒగ్గుకథకుల వేషధారణ :**

ఒగ్గుకథలో ప్రధానకథకులు ఇద్దరుంటారు. వీరిలో ఒకరు స్త్రీ వేషాన్ని ధరిస్తారు. పురుష వేషంలో ఉన్న ప్రధాన కథకుడు ఎర్రంచు ఉన్న ముతక దోవతిని గానీ, ఎర్రరంగు ఉన్న ముతక దోవతిని గానీ కడతాడు. తలకు తలపాగ చుడతాడు. ముంజేతికి కడియాలు, కుడికాలు రెండవ వేలికి మట్టె, బొడ్లో కీలుకత్తి, చేతిలో కట్లకర్ర పట్టుకుంటాడు. నాగబంధాన్ని అప్పుడప్పుడు నడుముకుగాని తలకు గాని చుట్టుకుంటాడు. స్త్రీవేషంలో ఉన్న రెండవ ప్రధాన కథకుడు ఒగ్గుకథలో ప్రత్యేకమైన ఆకర్షణగా ఉంటాడు. ఇతని చేతిలో చేతిరుమాలు ఉంటుంది. ఇతను కండువాను లేదా పట్టు సెల్లాను చీరకొంగు లాగా వేసుకుంటాడు. లేకపోతే చీరకట్టుకుంటాడు. ఎక్కువగా చీరనే కట్టుకుంటాడు. తలవెంట్రుకలను కిందికి జారవిడుస్తాడు. లేకపోతే కొప్పు లాగా ముడివేసు కుంటాడు. ఇతని స్త్రీ వేషం సహజంగా ఉంటుంది. చూసేవారికి కృత్రిమంగా కనిపించదు. ఎందుకంటే స్త్రీ వేషాన్ని ధరించే కథకుడు ఆడవారి లాగా తలవెంట్రుకలు పొడవుగా పెంచుతాడు. చెవులకు, ముక్కుకు, ఆభరణాలు పెట్టు కోవడానికి రంధ్రాలు ఉంటాయి. గడ్డం, మీసం తీసివేసి ముఖాన్ని నునువుగా ఉంచుకుంటాడు, కాళ్ళకు గజ్జెలు, మట్టెలు, చేతులకు గాజులు, నడుముకు

వడ్డాణం, మెడలో నగలు, నుదుట పెద్దబొట్టు, జడకుప్పె జడలో పువ్వులు పెట్టుకుంటాడు. ఇలాంటి వేషధారణతో అతను నిజంగా స్త్రీయే అన్న భ్రాంతిని కలిగిస్తాడు.

వంతలు దోవతి కట్టుకొని దాని పైన లాల్చీ లేదా చొక్కాను వేసుకొని ముదురు రంగు శాలువాను నడుముకు కట్టుకుంటారు. మిగిలిన వాద్యకారులు సాధారణ వేషంలోనే ఉంటారు.

## ప్రదర్శనా విధానం

ఒగ్గుకథ చాల ఆసక్తికరంగా ఉండడం చేత దాన్ని వినడానికి చాల మంది వస్తారు. అందువల్ల విశాలమైన ప్రదేశంలో అంటే ఎక్కువ మంది కూర్చో వడానికి వీలున్న ప్రదేశంలో వేదికను ఏర్పాటు చేస్తారు. వేదిక ముందు ప్రేక్షకులు కూర్చోడానికి వీలుగా విశాలమైన ఖాళీ ప్రదేశం ఉండేలాగా చూసుకుంటారు. కథకులు అలసిపోయినప్పుడు విశ్రాంతి తీసుకోవడానికి వీలుగా వేదిక మీద ఒకటి రెండు చాపలు . పరుస్తారు. లేదా నాలుగైదు కుర్చీలు గానీ, పొడవైన బల్లను గానీ వేస్తారు. లేకపోతే జంఖానా పరుస్తారు. ప్రస్తుతం ఆధునిక పద్ధతుల్లో వేదిక మీద మైకులు అమర్చివిద్యుద్దీపాల వెలుగులో అన్ని హంగులతో కథను చెప్పిస్తున్నారు.

ఈ కథను ప్రారంభించడానికి ముందు ఒగ్గుకథా బృందంలోని ఇద్దరు సహాయ కులు ఒకరు ఒగ్గుడోలును, ఇంకొకరు పెద్ద తాళాలను గట్టిగా వాయిస్తూ కథ ఏ ప్రాంతంలో చెప్పబడుతుందో ఊర్లోని వారందరికీ తెలిసేలా చేస్తారు. అంతేగాకుండా ఒగ్గుకథ ప్రారంభమవుతూ ఉందనే విషయాన్ని కూడా వాద్యాలను వాయించడం ద్వారా తెలియజేస్తారు.ఈ వాద్యాలు విన్నవెంటనే ప్రజలు ప్రదర్శనా స్థలానికి చేరుకుంటారు. ప్రేక్షకులందరూ వచ్చిన తరువాత మొదట ప్రధాన కథకుడు, ఆ తరువాత వంతలు వాద్యకారులు వేదిక మీదకు వస్తారు. వేదిక మీద పసుపు కుంకుమలు చల్లి, కొబ్బరి కాయ కొట్టి, అగరువత్తులు వెలిగించి అందరూ ప్రేక్షకులకు నమస్కరిస్తారు. అప్పటి వరకు ఒగ్గుడోలు, పెద్ద తాళాలు ఉధృతంగా మోగుతూనే ఉంటాయి. వేదిక మీద పూజ అయిపోయిన తరువాత ప్రధాన కథకుడు వేదిక మీద నిలబడగా అతనికి ఇరువైపులా ఇద్దరు సహాయకులు నిలబడతారు. వీరి వెనుక వాద్యకారులు కూర్చుంటారు.

## 3.6. మల్లన్న, బీరన్న కథల్లో అద్భుతాంశాలు

నీలమ్మకు సంతానం అనుగ్రహించడానికి,మల్లన్నకు కలిగే కష్టాలను నివారించడానికి

శంకరుడు జంగమ వేషం ధరించి కైలాసం నుండి భూలోకం రావడం అనేది మల్లన్నకథా ప్రదర్శనలో ఒక అద్భుతమైన అంశం.

తొమ్మిది ఘడియలకే నీలమ్మ ఆరుగురు కుమారులను ప్రసవిస్తుంది.

మల్లన్న,బీరన్న వివాహాలు చేసేందుకు త్రిమూర్తులు మారువేషాలతో వస్తారు. ఇంకా వీరికి వివాహ విషయంలో గంగాదేవి,మహంకాళి,రేణుకాదేవి, పార్వతీదేవి,పోచమ్మ,మైసమ్మ దేవతలు కూడా సహాయం చేస్తారు.

శంకరుని ఆజ్ఞమేరకు విదియనాంచారి తన చూపులతోనే కొల్లాపురిని దగ్ధం చేస్తుంది. అయితే నీలమ్మ శంకరుణ్ణి స్మరించగానే వెళ్ళిపోతుంది.

నీలమ్మ గర్భంలో వున్న మల్లన్న ప్రభావం వలన అంతకు ముందు నీలమ్మను అవమానించిన వారందరూ ఆదరిస్తారు.

మల్లన్న పందికొక్కులకు ప్రాణంపోసి వాటితో అత్తగారి సామానంతా తన ఇంటికి తరలించుకుంటాడు.ఏడువేల దొంగలను సృష్టించి మేనమాల పట్టణాన్ని దోచుకుంటాడు.

వన్నమ్మ గదిలో బంధించబడిన మల్లన్న తన చేతిని ద్వారాలకు చూపించగానే ఏడు ద్వారాలు తెరుచుకుంటాయి.

మల్లన్న తన నిజాయితీని నిరూపించుకోవడానికి సలసలా కాగుతున్న నూనె నుండి ఉంగరాలను తీస్తాడు.

వన్నమ్మ మల్లన్నకు పెట్టిన విషాహారాన్ని శంకరుడు ఒకసారి పాములాగా, ఇంకొసారి ముత్యాలుగా,వరహాలుగా మారుస్తాడు.

వన్నమ్మ చెల్లెళ్లతో కలిసి విషం కలిపిన ఆహారం తమ భర్తలకు వండి పెట్టగా అది పాములుగా మారిపోతుంది. ఇది కూడా శంకరుని ప్రభావం వల్లనే జరుగుతుంది.

మల్లన్న పంటకు క్రూరమృగాలు కాపలా వుంటాయి.ఒకసారి బవురాంబ(భ్రమరాంబ) కోరగానే అవి తొలగిపోతాయి. మల్లన్న బండారి చల్లి రహదారిని బంగారు రహదారిగా కనిపించేలా చేస్తాడు. బండారిని చల్లి బంగారు పందిరిని ఏర్పాటు చేస్తాడు. బండారిని చల్లి ఏడువేల దొంగలను సృష్టిస్తాడు. ఈ విధంగా మల్లన్న కథలో మల్లన్న అనేకసార్లు బండారిని ప్రయోగించి అసాధ్యమైన పనులెన్నింటినో సాధిస్తాడు.

మల్లన్న ఎన్నోసార్లు అంజనం వేసి చూస్తాడు. మల్లన్న ఏదైనా విషయం తెలుసుకోవాలంటే అరచేతిలో అంజనంవేసి చూసితెలుసుకుంటాడు. మల్లన్న ఈ విధంగా చేసి ఎన్నో అపాయాలనుండి తప్పించుకుంటాడు.

బీరన్న కథలో కూడా బీరన్నను కామరతి మోసం చేసిపోయినప్పుడు కామరతి ఎక్కడ వుందో తెలుకోవడంకోసం బీరన్న అరచేతిలో అంజనం వేసి చూస్తాడు.

బీరన్న బంగారు లింగమైచెరువులో దాక్కుంటాడు. మాంకాళి దుఖం విని తిరిగి మానవరూపం ధరించి పైకి వస్తాడు.

కామరతిని తీసుకురావడానికి బీరన్న వివిధ రూపాలను మారుస్తాడు. చివరికి గారడీవాని వేషంలో వెళ్ళి తీసుకొస్తాడు.

పన్నెండురోజుల బీరన్న ఇరవైనాలుగేండ్ల వానిగా మారి కసాయి వాళ్ళ తలలు నరికి తిరిగి పన్నెండురోజుల పసిపిల్లవానిగా మారుతాడు.

ఇలా ఒగ్గుకథలుగా సుప్రసిద్ధాలైన మల్లన్న కథ,బీరన్న కథలు అద్భుతాంశాలకు ప్రతీకలు. ఆద్యంతం అద్భుతాంశాలతోకూడుకుని ఉంటాయి.దైవత్వం,మహిమ ఆపాదించబడివాటితో పెనవేసుకున్న అద్భుతాంశాలెన్నో ఇందులో చోటు చేసుకున్నాయి.

**3.7. ఒగ్గు కథలు - నవరసాలు**

'విభావనుభావ వ్యభిచారీసంయోగాద్రసనిష్పత్తి' అని "రసం సామాజిక నిష్ఠం" అని లాక్షణికుల సిద్ధాంతీకరించారు. కానీ జానపదకళారూపమైన ఒగ్గుకథలో పాత్రోచితవేషధారణ, ఇతివృత్తాత్మకమైన రంగాలంకరణ ఉండదు. కథాసూత్రం ఆధారంగా ఆశువుగా అవసరం మేరకు సంక్షిప్తంగా లేదా విస్తృతంగా ఒగ్గుకథ కథాగానం జరుగుతుంది. సాధారణ పురుష వేషధారణలో ఉన్న ఇద్దరు ప్రధానకథకులు కథకు సంబంధించిన అన్ని పాత్రలను అభినయిస్తూ కథ చెప్పడం విశేషం. కథాగాన ప్రదర్శన సమయంలో పాత్రకు తగినవిధంగా కథకులు ప్రదర్శించే స్వరభేదం, హావభావవిన్యాసం, పదాలపోహలింపు, లయబద్ధమైన నృత్తం కథలో సామాజికాంశాలను వాడుకోవడం ద్వారా ప్రేక్షకులు వారిని కథకులుగా కాకుండా పాత్రధారులుగా భావించి రసాస్వాదన చేస్తారు. రసం సామాజిక నిష్ఠం అని చెప్పడంలో సామాజిక ప్రేక్షకునికి భావం ప్రధానం. ప్రేక్షకునిలోని స్థాయిభావాన్ని కదలించినపుడే తత్సంబంధిత రసపోషణ జరిగిందని చెప్పవచ్చు. ఈ విషయాన్ననుసరించి వేషం కన్నా భావమే ప్రధానమనే విషయం వెల్లడవుతుంది. కావున పాత్రోచిత వేషధారణ లేకపోయినప్పటికీ, చక్కని కథాగానంతో సామాజికుని మనసును కదలించడం ద్వారా ఒగ్గుకథలో ఔచిత్యవంతమైన రసపోషణ కన్పిస్తుంది. ప్రధానంగా శైవ, శాక్తేయ, దైవ సంబంధంగా ప్రచారంలో ఉన్న ఒగ్గుకథలో వీరము, కరుణము ప్రధానరసాలుగా ఉన్నప్పటికీ లాక్షణికులు పేర్కొన్న నవరసాలను కథకులు ఒగ్గుకథ గానంలో సందర్భోచితంగా చక్కగా ప్రదర్శించడం గమనించవచ్చు. లోకంలో నవరసాలు అనే మాట

వినిపిస్తుంది. రస సంఖ్యలో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ఎక్కువ మంది నవరసాలే అని ఒప్పుకుంటారు.

ఒగ్గు కథలో నవరసాలు మిళితమై ఉన్నాయి. ఒగ్గు కథకులు ఆయా సందర్భాలలో ఆయా రసాలను జోడించి కథను రసవత్తరంగా చెబుతారు.

**1.కరుణ రసం:**

"ఏకో రస కరుణ ఏవ" అని భవభూతి తెల్పినట్టుగా ఒగ్గుకథలో చాలా వరకు కరుణరసాత్మకమైన సన్నివేశాలు కన్పిస్తాయి. లాక్షణికుల సిద్ధాంతాలకు విరుద్ధంగా ఒగ్గుకథల్లో ధీరోదాత్తుడైన నాయకుడు కూడా సాధారణ వ్యక్తిలాగా విలపిస్తాడు. జానపదులు ఎక్కువగా తన్మయత్వం చెందేది కరుణరసమే. కథలో వచ్చే కరుణసాత్మక సన్నివేశాలను చూసి వారి జీవితంలో జరిగిన శోకభరిత సంఘటనలను గుర్తుకు తెచ్చుకొని విలపిస్తుంటారు. ఒగ్గు కథకులు ప్రదర్శనలో అభినయిస్తూ విలపించే తీరు ప్రేక్షకుల హృదయాలను తాకుతుంది.

"సంతానం కొరకు నీలమ్మ శివపూజ చేసి, కట్టినచీర కాసెవోసి, శిరసు కిందికి పెట్టి సిరిపాదాలు మీదికి వెట్టి, ఘోరతపస్సు చేస్తూ సంతానం లేదని...

కల్లకల్లా కన్నీరునమ్మా అమ్మలారా – వలపొయ్య వట్టేనమ్మ నీలమ్మ
గోదుగోదు కన్నీరునమ్మా రామారామా – గోలుతానే ఉన్నాదమ్మ రామారామా
ఏమి రాతలాయేనమ్మ అమ్మలారా నా యేమి పూజలాయేనమ్మ అమ్మలారా
అందరోలె పుట్టాలేదా ఓ దేవుడా నీ నాడజన్మమెత్త లేదా ఓ దేవుడా
కంటికేదుదారలు వొలుక నీలమ్మా వలపొయ్యి వట్టేనమ్మ నీలమ్మ..."**(చుక్క సత్తయ్య – మల్లన్న కథ)**

ఇలాంటి నీలమ్మ వలపోత విన్న తరువాత సంతానం కోసం తపించిన స్త్రీ తన్మయత్వం చెంది దుఃఖించకుండా ఉండలేదు. కాపువారింట ఏగలేని రారాజు మల్లయ్య కొల్లపురిని విడిచి లింగాలపరువడి చేరి వ్యవసాయం చేస్తుంటే నాగలి భూమిలో దిగబడి అలనాడు పుట్టకు పార్వతమ్మ వేసిన ముక్కుపోగు తాళానికి చిక్కుకోగా...

"గోడుగోడు మల్లయ్యానే రామారామా – గోసటీల వట్టె గదనే రామారామా

మల్లయ్య గోలుతుంటే ఒద్దులు గోలుతున్నయి, మద్దులు గోలుతున్నయి, మద్దుల మీద పక్షులు మరి గోలుతున్నయి, కాకి శోకమున్నది, పిట్ట శోకమున్నది, మీద ఎండగొట్టి కింద భూమి కాలి, తామరంటి పాదం ధరణి మీద పెడితే ఓర్చి బుగ్గలచ్చి నవరసులు గారుతున్నయి. ఎండకు మల్లయ్య మల్లెపువ్వోలె కమిలిపోతండు. కుడికంటి ధారలు కుంభదార వర్షము, ఎడమ

కంటి శోకము ఏరులై పారుతున్నది. కొలుకుల్ల కన్నీరు కొనగోలు జిమ్మితే చిల్లిపోయి శివనందుల కోటమీద దల్లు వానై పడుతున్నది... అని చెప్పినపుడు నిత్య జీవిత శ్రమలో భాగంగా ఎండల్లో కాళ్ళుకాలి బొబ్బలెక్కి అవిసిపోయి ఇబ్బంది కలిగించే విషయం గుర్తుకు వచ్చి విలపించని జానపదుడు ఉండడు కదా. జమదగ్ని మరణవార్త విన్న రేణుక ఎల్లమ్మ.

"గుద్దుకుంట ఉన్నదమ్మ ఎల్లమ్మా – కొట్టుకుంట ఉన్నదమ్మా ఎల్లమ్మా

కలకల కన్నీరునమ్మా అమ్మాలాలో – వలపొయ్యవట్టేనమ్మ అమ్మలాలా

లగ్గమొక్కటయ్యినాది ఓ నాథుడా – నాకు నాగవెల్లి నడవలేదు ఓ నాథుడా

నేను కాయల్ల కాయ గాదు ఓ నాథుడా – నేను పండ్లల్ల పండుగాదు ఓ నాథుడా

ఆడి పుటక పుట్టరాదు రామరామా – అవతారమెత్తరాదు రామారామా" **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ కథ)**

అని ఎల్లమ్మ పాత్ర ద్వారా సంతానం పొందడానికి ముందే భర్తను కోల్పోయిన ఇల్లాలి ఆవేదన ఎంతటి కఠిన హృదయాన్నైనా ద్రవింపజేస్తుంది. కాయల్లకాయగాదు పండ్లల్ల పండుగాదు అనేమాట భర్తను కోల్పోయిన స్త్రీకి గుర్తింపు ఉండదనే భావాన్ని వెల్లడిస్తుంది. విధిమాయ వలన కోమటి వారి ఇంటిలో ఉన్న విమలాంగి దేవి "తెల్లవారితే నా వ్రతం భంగమై పూజ భిన్నమై పోతుందని పూజ మందిరంలో కూర్చొని ముఖాన కొంగు పెట్టి – నాకు ఇది ఏమి మీ కష్టమమ్మ అమ్మలారా

ఎట్లా తెల్లవారుతుంది రామ రామ / ఎట్లా పొద్దుగూకుతుంది రామ రామ

నా కన్న కొడుకులారా రామ రామ / మీరు ఏ అడవిలున్న రేమి రామ రామ

ఏ పూజ చేసి మీములా కంటిని రా / ఏ నోము నోచి మిముల కంటిని రా

నా రాత ఎట్లా రాసినావు బ్రహ్మదేవా / నుదుట గీత ఎట్లా గీసినావు రామ రామ

కల కల కల కన్నీరునమ్మ రామ రామ / వలపోస్తు ఉన్నదమ్మ విమలాంగి అమ్మవారు విమల దేవి వల వల వల వల పోసుకుంటూ ఏడు మూడు గడియలు ఏడ్చి మూర్చిల్లింది **(చుక్క సత్తయ్య మాంధాత ఒగ్గు కథ)** వైశ్యుని చెరలో ఉన్న విమలాంగి దేవి ఎలా తప్పించుకోవాలో తెలియక దూరమైన భర్తను పిల్లలను తలుచుకుంటూ విలపించిన సందర్భాన్ని వర్ణించే ఈ కథా గేయం మిక్కిలి కరుణ రసాత్మకంగా సాగుతుంది. భర్త దూరమైన స్త్రీని సమాజం ఏ విధంగా ఇబ్బందులకు గురి చేస్తుందో ఈ ఘట్టం ఆవిష్కరించింది. భర్త పిల్లలు దూరం అయిన బాధ ఆవేదన తనపై కామాన్ని పొందిన వైశ్యుని నుండి తప్పించుకునే వీలులేని క్లిష్ట పరిస్థితి ఆవేదన కలిసి విమలాంగి కష్టాన్ని బాధను స్త్రీ పాత్రదారి ఆ పాత్రలో లీనమై

గానం చేస్తాడు. కథకుడు నిజంగానే ఏడుస్తూ కంట నీరు కారుస్తూ చేసే కథాగానం విన్న ప్రేక్షకులు కూడా కథకునిలో విమలాంగిని చూసి అయ్యోపాపం అని ఆవేదన చెందుతారు. ఇలా ఒగ్గుకథలో కరుణరస ప్రదర్శన సామాజిక జీవితాలకు వాస్తవికతకు దగ్గరగా ఉండి ప్రేక్షకునికి సాంత్వనం కలిగిస్తాయి.

ఆపదల వల్లగాని,ఇష్టమైన వారికి ఏమైనా జరిగినా, ఆప్తులు ఎవరైనా చనిపోయినా దుఃఖం కలుగుతుంది. కరుణ రసానికి స్థాయీ భావం శోకం. ఒగ్గు కథకుడు మల్లన్న కథ చెబుతున్నప్పుడు సందర్భానుసారంగా కరుణరసాన్ని ఒలికిస్తాడు. శంకరుని ఆగ్రహానికి గురైన నీలమ్మ పుట్టింటికి వచ్చినపుడు ఆమె అన్నలు ఆమెను నిరాదరిస్తారు. వదినలు కూడా ఆమెను దరి చేరనివ్వరు. ఎవరింటికి వెళ్ళినా నీలమ్మను చీపుళ్ళతో,రోకళ్ళతో కొడుతుంటారు. ఆ సన్నివేశంలో నీలమ్మ దుఃఖిస్తుంటుంది.

అదే విధంగా బీరన్న కథలో కూడా ఈ  బిడ్డలు బీరన్నపై నిందలు వేయగా ఆ నిందలకు భయపడి బీరన్న చెరువులో బంగారు లింగమై దాక్కుంటాడు. అతని కోసం వెదకిన మహంకాళి చెరువుకట్టపై కూర్చొని దుఃఖిస్తుంది. ఇలాంటి కరుణ రసాత్మక సన్నివేశాలెన్నో మల్లన్న కథ,బీరన్న కథల్లో చోటు చేసుకున్నాయి. ఒగ్గు కథకుడు కథ చెబుతుంటే నిజంగా ఆ సన్నివేశాలు కండ్ల ముందున్నట్లు కనిపిస్తుంది.

**2.శృంగార రసం:**

నవరసాల్లో మొదట చెప్పబడింది. శృంగారరసం, ఇది ప్రాచీన రసరాజంగా కన్పిస్తుంది. క్లిష్ట సాహిత్యంతో పాటు జానపద సాహిత్యంలో కూడా శృంగార రసం ప్రధానంగా కన్పిస్తుంది. “మందయానలువాకు మడుపులందియ్యా... మందయానలువాకు కామసమరరాత్రి జామాయే తండ్రీ...కామసమరరాత్రి....” మల్లయ్య ఒగ్గుకథలో ఒక జోలపాటలో అంతర్గతంగా ఈ చరణాలున్నాయి. ఇందులో మందయాన వంటి తత్సమ స్త్రీవిశేషణాలు, కామసమరం వంటి సమాసాలతో పాటు ఇల్లాండ్రు భర్తలకు తమలపాకులు అందించే సమయం, స్త్రీ పురుషుల సృష్టికార్య సమయం అంటూ సాగే ఈ వర్ణన ప్రేక్షకుని మనసుకు శృంగారాత్మకమైన అవ్యక్తనుభూతిని కలగజేస్తాయి.

మరోచోట మేడలమ్మ సౌందర్యాన్ని వర్ణిస్తూ....

“భామ మేడలమ్మా ఏమి జేయ వట్టేన
పొడపుగుండు ఎక్కిపై జలకమాడేన
కత్తూల మండోలె కుచ్చు లిడిసి కట్టెన

జాలిపట్టు రైకే జబ్బల్లు మెరియంగ

హస్తాలు వారేసి హంసాయి నడకలు

...జాలిపట్టు రైకే జబ్బల్లు మెరియంగ కుసుమల్ల రైకే కుత్తెంగ దొడిగి, శెంపన శెమిలీలు, శంఖదాలి కొప్పు, రాగిబిల్లసందు రాట్టాడికొప్పు, ఎంటికె ఎంటికెల సందున వెయ్యారు ముత్యాలు, పాపేట సందున పదివేల ముత్యాలు. బిళ్ళ బిరుదైన వడ్డాణం, గజగామిని, మదరూపిని, కన్నతండ్రి ఓర్వని కామిని, వయ్యారి, సుడివడి లేని సుందరి, పదారువన్నె బంగారుచాయ' **(చుక్క సత్తయ్య గొల్లకేతమ్మ ఒగ్గుకథ)**

ఈ వర్ణనలో కత్తులమండి లాగ కట్టిన చీర, కుత్తెంగ అంటే బిగుతుగా తొడిగిన కుసుమ వన్నె రైక, గున్నమామిడి వంటి ముచ్చటైన స్త్రీకి అనేక విశేషణాలతో పాటు కన్నతండ్రి ఓర్వని కామిని అని స్త్రీ అందాన్ని వర్ణించడంలో కన్నతండ్రి మనసు కూడా చలింపజేసెంత అందగత్తె అని చెప్పడంతో పాటు స్త్రీ పాత్ర వేషధారి వయ్యారి నడకలు హొయలు, ప్రేక్షకునికి ఆనందాన్ని కలిగిస్తాయి.

ఒగ్గుకథగానంలో స్త్రీల అందచందాల వర్ణన ప్రబంధాల వంటి కావ్యాలలోని వర్ణనలకు ఏమాత్రం తీసిపోకుండా ఉంటుంది.

"ఆహా ఈ జగన్మోహిని ఎవ్వరి సుందరి రా / ఉరుతర కుచములు గుండు గిన్నెలు నిమ్మ పండ్లు ఛాయా / సుందరాంగి మందము తొడు కదళి స్తంభములు / కోమలి పిక్కలు సంగడి కోలలు బంగారపు వన్నె" **(చుక్క సత్తయ్య మాంధాత ఒగ్గుకథ)**

మాంధాత ఒగ్గుకథలో చుక్క సత్తయ్య వర్ణించిన విమలాంగి రూప విలాసము యక్షగాన ధోరణిలో ఉంటుంది. తెలుగు సంస్కృత పదాల సమ్మిశ్రితంగా ఉండి నిత్య గోచరమైన ఉపమానాలతో అలంకారికంగా కనిపించే వర్ణనతో పాటు కథకుల హావభావాలు ఒగ్గు కథలో శృంగార రసపోషణకు కారణమయ్యాయి. అలాగే మాంధాత ఒగ్గు కథలో దేవకన్యల భూలోక ప్రయాణం గురించి.

"ఆ రామ రామ రామ, ఆ రామ రామ రామ, హరికృష్ణ వాసుదేవ

దేవేంద్ర బిడ్డలంట మా రచ్చ మగువలంట / అలకాల వేణులంట కులుకు మిఠారులంట

చారు సుందర గాత్రులంట సద్గుణ నేత్రులంట / దానిమ్మలో వనములోన దాగిల్లు పూసుతారు". అనే ఈ వర్ణనలో దేవకన్య అందచందాలు వర్ణించబడ్డాయి ఈ కథాగానంలో శృంగార రస పోషణతో పాటు ప్రతి పాదంలో భావార్థకం అయినా 'ట' కారాన్ని అంత్యప్రాసగా

వాడడం వలన సహజమైన ప్రాస యతుల వలన, ఈ కథా గమనం శబ్ద మాధుర్యాన్ని పొందగలిగింది. అనేక జన్మల పుణ్య విశేషం వల్ల మానవునిలో అహంకారం జనిస్తుంది. అహంకారం అంటే ఇక్కడ గర్వం కాదు. సాత్వికాహారం. ఆత్మ జనితమైన గుణ విశేషం. దీని వల్లనే మానవుడు ఇతరులను ప్రేమించగలుగుతున్నాడు. తన్ను తాను ప్రేమించుకుంటున్నాడు. మల్లన్న కథలో మల్లన్న అడవిలో నిప్పుకోసం తిరుగుతుండగా రత్నాంగిని చూస్తాడు. చూసినంతనే ఒకరినొకరు ఇష్టపడతారు. పెండ్లి చేసుకోవాలను కుంటారు.

అందమైన గొల్ల కేతమ్మను చూసి మల్లన్న ఆమెకు తనపై ప్రేమ కలిగేలా ప్రవర్తిస్తాడు.

బీరన్న కథలో కలికి చెంగోలె బావి వద్ద బీరన్న తన మరదలైన కామరతితో సరసాలాడతాడు. కామరతి మాయ మాటలు చెప్పి వెళ్ళిపోవడంతో బీరన్న విరహవేదన అనుభవిస్తాడు. ఇటువంటి సన్నివేశాలెన్నో ఒగ్గుకథల్లో చోటు చేసుకున్నాయి. ఈ సన్నివేశాల్లో కథ సాగుతున్నప్పుడు శృంగార రసం జాలువారుతుంది.

**3. అద్భుత రసం :**

అపూర్వమైన భావసృష్టితో, అబ్బురపరిచే వస్తువర్ణతో వినేవారిని ఊహాలోకాల్లో విహరింపజేస్తూ విస్మయానికి గురిచేసేది అద్భుతరసం, చెడిబతికిన ఆదిరెడ్డి నీలమ్మల కొడుకు మల్లయ్యకు తన బిడ్డ పద్మావతినిచ్చి పెళ్లి చేయడం ఇష్టం లేక భర్త ఇచ్చిన మాట కాదనలేక దేవగిరి గొనె కటారి రెడ్డి భార్య గొనె వరిమాసమ్మ తీర్చడానికి వీలులేని విపరీతపు కోర్కెలతో మల్లయ్యకు ఉత్తరం రాసి నేను చెప్పినట్టు పెళ్లి ఏర్పాట్లు చేస్తేనే నీవు వీరుడివి లేదంటే నీవు మల్లయ్యవు కాదు మల్లివి అని మల్లయ్యను రెచ్చగొడుతుంది. మల్లయ్య సంగయ్య పోతరాజుల సహాయంతో ధనాలకోటను దోచుకొని గోనె వరిమాసమ్మ కోరిన విధంగా పెళ్లి ఏర్పాట్లు చేస్తాడు. అలాంటి మల్లయ్య– పద్మావతి పెళ్లికి చేసిన ఏర్పాట్లను వర్ణించడం విన్నపుడు విస్మయం కలుగుతుంది.

"పన్నెండెడ్ల మోత పందిరి కట్నం, ఆరేడ్ల మోత ఆకుపోకల ఖర్చు, అత్తకట్నం ఆరువేలు మామకట్నం మూడువేలు ముందుగా ములాలరుముంతల్లపోసి పంపి, పద్మావతికి పన్నెండువేల పాపెట్ల పతకం, పదివేల పతానపు ఉంగరం, కోటివేయిల కొప్పుల సవరం, నూరువేల నుడి కంటె, ఐదువేల అరికాలి వంకెన, నాగుంబాముల నతులు, వజ్రపు కంకణాలు, బిరుదైన బిళ్ళల వడ్డాణంపెట్టి, ఊసిపోయిన వెంట్రుకలకు ఊర్లు దాపి, రాలిపోయిన వెంట్రుకలకు రత్నాలు దాపి, తెగిపోయిన వెంట్రుకలకు కెంపులు దాపి, కట్టి ఇడువ వెండి బంగారు బనారాసు

పన్నెండు పట్టు చీరలు, పిల్ల కాలికి మన్నంటకుండా దేవగిరి నుండి కొల్లాపురి దాక పన్నెండామడ ఎండి బంగారం కరిగిచ్చి తోవ్వలు పోసి, సూర్యుడు చూడకుండా వెండి గుంజలు పాతి, బంగారు బెలుగులు వెట్టి పైన బంగారు రేకుల పందరివేసి, ఎడమన వెండి తొొట్టెలు, కుడిన బంగారు తొొట్టెలు కట్టి...

నిమ్మలుగొొట్టి నీడలొడ్డి, పచ్చలు గొొట్టి పందిర్లేసి, టేకుటాకుల తెరలు, తమలపాకుల దళ్ళు, అడుగడుగునా బుడిగె బావులు, వంపున వనాంతరాలు, మిట్టన బావులు తోడిచ్చి... పెళ్ళికి వచ్చినవారి కోసం ఆరెకురాల అన్నసత్రం కట్టి, పూటకు పుట్టెడు వండి వార్చి వడ్డించి... వచ్చేవారి కోసం ఆరువేల గాడిబండి, మూడువేల బుర్కబండి, నాలుగువేల నల్లెద్దుబండి, పదివేల పయ్యెద్దుబండి, దొరలకోసం పదివేల పచ్చని పల్లాకీలు, దొరసాకులకోసం ఐదువేల అద్దాలమ్యానలు ఏర్పాటు జేసి... పెద్ద పెద్ద ముత్యాలు పెళ్లి తోరణాలు, చిన్న చిన్న ముత్యాలు శివదోరణాలు కట్టి బాజాలు, భజంత్రీలు, బలువైన సొన్నాయిలు, తురుములు, కొమ్ములు, డుల్లాన భేరీలు, కారుకొమ్ములమోత కడలు దద్దరిల్ల, బూరకొమ్ముల మోత భూములు ధనులెల్లంగ...కాపువాని బండికమ్మి దిగవడితే ఏడెడ్ల బండికట్టి గుంజినా రానంత ఎత్తుగా పన్నెండుపుట్ల పచ్చి ముత్యాల పోలురాసి...

పందుము గోదుమపిండి కుండి జేసి, ఎద్దుమోత పత్తి క్కొటే వత్తి జేసి, ఏడేదు సిద్దెల నూనె అందెం కలిపిపోసి మల్లయ్య మేడమీద దీపం ముట్టిస్తే దీపపు వెలుగులు దేవగిరికి కనబడుతుండగా...

పదివేల పచ్చి బాలింతలు, మంగళారతులు పట్టే మగువులు, ఒళ్ళే పోసుకున్న తవ్వెడు సోలెడు గింజలకు ఇత్తుకు ఇద్దరు సొప్పున ముత్తైదువులు వచ్చి..." (చుక్క సత్తయ్య కాపులఘట్టం ఒగ్గుకథ) అంటూ వర్ణించే పెళ్లి సంగతులు విన్నపుడు ఇవన్నీ అతిశయోక్తులు అనిపించినప్పటికీ ఇక్కడ వర్ణించిన వస్తు సంభారాలను ఊహించినపుడు విస్మయం కలుగుతుంది.

చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గుకథలో పరశురాముని ఓడించడానికి బలిజరాజులు ఏర్పాటు చేసిన పందెం గురించి తెలుపుతూ భూమిలోపల ఐదుగజాల లోతు మట్టి దీసి, అందులో వెండి, బంగారం, రాగి, ఇనుము, పండ్లు ఫలాలు నింపి, దానిమీద పచ్చిసున్నం మేడ గట్టి, మేడ మీద గానుక గడెం బెట్టి, మీద చెరుకుగడ బెట్టి, దానిమీద ఏడు గుండుపోకలు వెట్టి, పోకలమీద తమలపాకులు అందులో రాగిపైస దక్షిణ వెట్టి, ఆ రాగి పైస మీద బొంగరం తిప్పుతుంటే భూమిలో పాతిన వెండిబంగారం వెన్నోలె కలరగాలి" అని తెలిపే పందెం అసాధ్యమైనప్పటికీ పదానికి తగిన పదాలకూర్పు ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది.

"కొడుకా మీరు చేసిన తప్పు వలన కల్లు అంతా కుళ్ళు అయింది. నీవు నీతి తప్పినావు కాబట్టి ఇంతకాలం జరిగినట్లు ఇకనుండి ఈ తాటి చెట్టు వంగుమంటే వంగదు లేవు అంటే లేవదు. అని శపించి విరాట్ విశ్వకర్మ దగ్గరకు పోతే సోమకాసురుని వధించి తీసిన ఎముకలతో లతో నీకు కత్తులు చేసి ఇస్తాడు. వాటితో పంగ లేని ప్రయాణం గల తాటి చెట్టుకు కల్లు గీసుకొని కష్టపడి బతకండి అని చెప్పింది". **(చుక్క సత్తయ్య – ఎల్లమ్మ ఒగ్గుకథ)**

ఆశ్రయం కోరి వచ్చిన ఎల్లమ్మను గౌడ కులస్తులు ఆదరించకుండ వెదలగోడుతారు. ఎల్లమ్మ వారి మీద కోపగించి శాపం పెట్టింది. వైశాఖ వనంలోని తాటి చెట్లు వంగుమంటే వంగి, లేవుమంటే లేచి తేలికగా కల్లు లభించి సునాయాసంగా డబ్బు సంపాదించి గర్వపడుతున్నారని భావించింది. అందుకే శ్రమ లేకుండా వచ్చే సంపాదనతో మనిషి చెడిపోయే ప్రమాదం ఉందని శ్రమించి కల్లు తీసే విధంగా ఇక నుండి తాటిచెట్టు వంగుమంటే వంగకుండా, లేవుమంటే లేవకుండా ఉండాలని శపించింది. భూమికి నిటారుగా కొమ్మలు లేకుండా పొడవుగా పెరిగే తాటిచెట్టు అవసరం మేరకు వంగడం, లేవడం జరుగుతుంది అనే విషయాన్ని వర్ణించినప్పుడు ఆ అద్భుత దృశ్యం మనసులో ఆవిష్కృతమై ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. బలమైన చెట్టు సులువుగా వంగి తిరిగి నిలబడడం మనస్సుకు విస్మయాన్ని కల్గిస్తుంది. ఎల్లమ్మ ఒగ్గుకథలో కనిపించే ఈ అద్భుత వర్ణన ఇటీవలి కాలంలో ప్రసిద్ధ చలనచిత్రలో దృశ్యమానంగా కన్పిస్తుంది. ఇలాంటి అద్భుతమైన ఊహాత్మక కల్పనలు ఒగ్గుకథలో విరివిగా కన్పించి ప్రేక్షకులకు విస్మయాన్ని కల్గిస్తాయి.

ఇదివరకు ఎప్పుడూ చూడని వస్తువులను చూడడం వల్ల, కొత్త సంఘటనలను చూడడం వల్ల కలిగిన మనో వికాసమే అద్భుతం. దీని స్థాయీ భావం విస్మయం. మల్లన్న, బీరన్నల వివాహాలు చేయడానికి సాక్షాత్తు త్రిమూర్తులే పూనుకోవడమనేది అద్భుతమైన చర్య. బీరన్న కథలో పన్నెండు రోజుల బీరన్న ఇరవై నాలుగేండ్ల వానిగా మారి ముప్పది రెండు కత్తులు పట్టుకుని మేనమామ పంపించిన కసాయి వాళ్ళ తలలు నరికి తిరిగి పన్నెండు రోజుల పిల్లవానిగా మారిపోవడమనేది అద్భుతం. మల్లన్న బండారిని ప్రయోగించి అద్భుతమైన పనులెన్నో సాధిస్తాడు. మల్లన్న, బీరన్న లిరువురూ కూడా అంజనం వేసి తెలియని విషయాలు తెలుసుకోవడం ఇంకా ఇటువంటి అద్భుతమైన విషయాలెన్నో ఒగ్గు కథకుడు చెబుతుంటే ప్రేక్షకులకు విస్మయం కలుగుతుంది.

**4. భయానక రసం :**

ఒగ్గుకథల్లో క్షుద్రవేతలను, రాక్షసులను భయానకంగా వర్ణిస్తారు. భయానక రసానికి

స్థాయిభావం భయం, ఒగ్గుకథలో ఆశ్చర్యంతో కూడిన భయం గొలిపే వర్ణనతో పాటు ఉచ్ఛస్వర కథాగాన ప్రదర్శన ద్వారా భయానకరసపోషణ జరగుతుంది. కళ్యాణ పట్టణం రాజులు సంపాదించిన ధనమంతా దాచిపెట్టబడిన ధనాలకోటకు దేవతలు శక్తిదేవత అయిన మైసమ్మను కాపలాగా నియమిస్తారు. అలాంటి మైసమ్మ రూపం గురించి.

"అర్చికూత వెట్టెరా, పెడా బొబ్బలేపెరా–మూలబురుజు రీతిగా ముక్కు గూడ పెంచెరా పాతబాయి రీతిగా నోరు గూడ తెరిచెరా–గంగావూడి తాళ్ళ రీతి కాళ్ళు గూడ పెంచెరా చెన్నెంగ బదుతాలుగా చేతులల్ల పెంచెరా గుమ్మడికాయలోలె గుడ్లు దిప్పి, మేడికాయలోలె మెడలు దిప్పి, మర్రి ఊడలోలె జడలు వీరవోసుకోని". **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గుకథ)**

ధనాలకోటకు వస్తున్న మైసమ్మరూప వర్ణన భయాన్ని కలగజేస్తుంది. మైసమ్మ రూపవర్ణన ద్వారా సామాజికునికి భయం కలిగించడంతో పాటు అనాయాసంగా ధనం కావాలనుకోవడం తప్పని, సంపదమీద ఆత్యాశ చెందడం అనార్థలకు దారి తీస్తుందనే అంతరార్థాన్ని వెల్లడిస్తుంది. మతిమయోగ పట్టణంలో అమ్మవారు ఆరుమంటలు మండు కుంటూ

"ఒరేయ్ ఎవదురా...ఆ మాంధాత గొట్టే దెబ్బలకు మంటలు పుట్టి విధమ్మకు ఏడు యోజనలెత్తు రూపం దాల్చి కొడవండ్ల తీరి కోరలు చాపుకుంటూ మర్రి ఊడలోలె జడలు వీర పోసుకొని దమదమ దప్పులు గొట్టంగా అగులో బుగులో పుట్టంగ మామ్మాయి తల్లి శంభుని ఇల్లాలు శివశక్తి రూపిని శాంభవి మహిషాసుర మర్దిని పన్నెండు బిగాల వటవృక్షం కింది నుండి పోక లాంటి రాళ్లు పొడిపొడి రాలంగా...ఓ... అమ్మవారు బయలుదేరినది...ఆ...

అమ్మవారి ఆర్భాటముకు బండలు పగిలి కొండలు కదిలే
రాజుల గుండెలు కదులంగా నవ రుద్ర రుద్రకాళి బయలెల్లింది
గుబ గుబ గుగ్గిలము వెయ్యంగా శక్తులు మార్తులు నిండగా
ముప్పై పుట్ల మూర్తులతో అరువై పుట్ల ఉగ్రంతో
ఉష్ణో ఉష్ణో జనులంతా ఊగ సాగిరి వారంతా". **(చుక్క సత్తయ్య మాంధాత ఒగ్గుకథ)**

మాంధాత గర్వం అణచడానికి మిక్కిలి క్రోధంతో భయంకర ఆకారంలో బయలుదేరిన విధినాంచారి వర్ణనలో భయానక రసం కనిపిస్తుంది. కథాగానం చేసే వ్యక్తి నాలుక చాచి కనుగుడ్లు తిప్పుతూ భయంకర ఆకారాన్ని ప్రదర్శిస్తూ గుండెల్లో గుబులు పుట్టించే ఈ విధంగా డోలు దెబ్బ అనుగుణంగా కథాగానం చేస్తూ ఉంటే విధినాంచారి భయంకర రూపం, భీకర ఆకారం ప్రేక్షకుడి మనస్సులో రూపం దాలుస్తుంది. గొల్ల కేతమ్మ కథలో ఆగొండ రాక్షసి భూలోకం పోయి తిరిగివస్తూ...

"ఇంటికొక్క వేయి పీనుగుల కట్టుకొని, కొడవండ్ల రీతి కోరలు తిప్పుకుంట, గుమ్మడిపండ్ల రీతి గుడ్లు పెంచి, తాటి పీసుల రీతి జడలు పెంచి. అరఅర రక్కసి రావె వత్త ఉన్నది–ఏడున్నర తాళ్ళ పొడుగు–ఎదిగి వత్త ఉన్నది ఎదురుగడ్డలెక్కిన–దిగుడు గడ్డ దిగేనా–మనిషిగబ్బు మారుమారు–నా గబ్బు తీరుతీరు...' అంటూ రాక్షసి తెచ్చిన పీనుగులను గడ్డపారలకు కుచ్చి నూనెలో వేయించి ఇచ్చి, వరాల మంచం మీద పండుకున్న రాక్షసికి జీడిగింజలంత పేన్లు చూస్తూ"... పదునాలుగేండ్ల బాల రత్నాంగి సేవలు చేస్తూ ఉందని రాక్షసి భయానక రూపాన్ని వర్ణించడం ద్వారా వినేవారికి రాక్షసి పట్ల భయంతో పాటు, అలాంటి భయానకమైన రాక్షసి ఆధీనంలో ఉన్న రత్నాంగి మీద జాలి కూడా కలుగుతుంది. ఇలా ఒగ్గుకథలో పోషించబడిన భయానకరసం కొన్ని సార్లు పరోక్షంగా కరుణరసకారకం కావడం విశేషం.

భయంకర వస్తువులను చూడడం వల్ల, వాటిని గూర్చి వినడం వల్ల కలిగే సంక్షోభమే భయానకం. దీని స్థాయీభావం భయం.

మల్లన్న కథలో మల్లన్న వదిన వన్నమ్మ వేసిన నిందలకు భయపడతాడు. అన్నలు వచ్చి తనను చంపేస్తారని స్నేహితుడైన సంగన్న సాయం కోరతాడు.

బీరన్న కథలో మేనమామ బిడ్డలనే పెండ్లి చేసుకుంటానని బీరన్న పట్టుబట్టడంతో నరభూపతి ఎంతటి దుర్మార్గుడో తెలిసిన మహంకాళి భయపడుతుంది. అతడి వల్ల బీరన్న కెటువంటి ప్రమాదం కలుగుతుందోనని భీతిల్లుతుంది.

వన్నమ్మకు, మల్లన్నకు నిజాయితీ పరీక్ష పెడతారు మల్లన్న కథలో. అయితే సల సల కాగుతున్న నూనెలో నుండి ఉంగరాలు తీయడానికి వన్నమ్మ భయపడుతుంది. ఇంకా ఇలాంటి భయానక రసం నిండిన విషయాలెన్నో కథకులు చెబుతారు.

**5. హాస్య రసం :**

వయోభేదాలకు అతీతంగా అందరిని అలరించేది హాస్యం. ఒగ్గుకథలో ప్రదర్శించే హాస్యంలో మోటుదనం కొంత ఎక్కువే అయినప్పటికీ జానపదులు దాన్ని హాయిగా స్వీకరించడం విశేషం.

ఒగ్గు కథకులు కథాగానం మధ్యలో హాస్య సంభాషణలు చేస్తూ ఒగ్గు కథాగాన ప్రదర్శన చేస్తారు. ఈ హాస్య సంభాషణలు కొన్నిసార్లు కథాగతంగా ఉండగా మరికొన్ని కథకు సంబంధం లేకుండా సామాజిక అంశాలకు అనుగుణంగా కనిపిస్తాయి. ఇలాంటి హాస్య సంభాషణలతో కథకులు ప్రేక్షకులను నవ్వించి వారికి కథపట్ల ఆసక్తిని కలిగిస్తు ఉంటారు.

ఉదాహరణకు కథాగానం మధ్యలో పురుష పాత్రధారి స్త్రీ పాత్రదారి సంభాషణలో ఆమె 'ఏమండీ' అని పిలిస్తే 'ఏందే నా భీమండి' అని సమాధానం ఇవ్వడం ముద్దుగా 'పెళ్ళామా'

అని పిలవమంటే 'పెళ్ళ' పిలవడం నేనేమైనా మట్టి పెల్లనా అని చిరాకు పడుతూ భార్య అని పిలువ రాదు అని కోరితో సరేనని భార్య అనడానికి బదులు 'బర్రె' అనడం 'ఇదంతా కాదు కానీ' నీకు తెలుగు సరిగా వస్తలేదు ఇంగ్లీష్ లో మేడం అని పిలవమని కోరగా కథకుదు మేడం బదులుగా బేడం అని హేళన చేస్తూ పిలుస్తాడు. అలాగే కొన్ని సార్లు "దొమ్మరి దాన నీ మొగడు చచ్చిండే అంటే వాడ కట్టుకో" అని అని చెప్పే మోటు హాస్యం కూడా ఒగ్గు కథలో కనిపిస్తుంది. ఈ విధంగా ఒగ్గుకథలోని హాస్య సంభాషణలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తూ అలరిస్తాయి.

బ్రహ్మచారిగా అడవిలో తిరుగుతున్న జమదగ్ని "ముక్కులెంటికలు ముగుదాళ్ళు" సంకలెంటికలు శాతాళ్ళు" అని వర్ణించడం. మల్లయ్య మాధవసానిల మధ్య సంభాషణలో ఇచ్చిన మాట కాదనలేక, కుష్టు వ్యాధిగ్రస్తునిగా వచ్చిన మల్లయ్యను అల్లునిగా ఒప్పుకోక ఎలాగైనా వెడలగొట్టాలని మాధవసాని అతన్ని ఈసడించుకున్నా కొద్ది మల్లయ్య కావాలని అత్తా అనుకుంటూ రావడం. "ఏ నువ్వు అత్తా అనకు నాకు ఒత్తుగ సిగ్గయితంది" అని అనుకుంటూ దూరం జరగడం, ఏమి చేయలేక భర్త మారయ్యను "నీ మొకం మీద నా మొకం బోర్లెయ్య" అని తిట్టడం. మల్లయ్య పెళ్ళి చెడగొట్టడానికి చీరచింగులలో పిల్లిని దాచి తెచ్చిన వన్నెలక్కమ్మను పిల్లి గీకిపెట్టగా నవ్వులపాలు కావడం. "ఏమాయెసే దాసీ ఎందుకు పొద్దువోయిందో" అంటే "ఆర్నెల్ల పోరాయె – మూన్నెల్ల కడుపాయె" నని ఒకరు "ఇసుర్రవుతుతో ఇల్లలికి వచ్చే వరకు పొద్దు పోయిందని ఇంకొకరు చెప్పడంలో కాకువు ధ్వనిస్తుంది. అలాగే జోలపాటల సందర్భాన్ని వివరించే సమయంలో ప్రసిద్ధమైన జోలపాటను అనుకరిస్తూ "ఇద్దు మొద్దుమొలుక ఇంటెనుక అలుక / బర్రెచ్చి బరుక మీ అవ్వొచ్చి మిదుక / అని కాసారం గట్లకు వాసాలు లేవు, పిలగాని తండ్రికి మీసాలు లేవు" అనే పేరడీ గీతాలు చక్కని హాస్యాన్ని పండిస్తాయి. ఇలా అనేకచోట్ల చక్కని చమత్కార సంభాషణలతో, సన్నివషాలతో ఒగ్గుకథలో హాస్యరసపోషణ కన్పిస్తుంది.

వికృత వస్తువుల్ని దర్శించడం వల్ల పుట్టిన మనో వికారమే హాస్యం. హాస్యం చాలా రకాలుగా ఉంటుంది. దీని స్థాయి భావం హాసం.

ఒగ్గు కథల్లో హాస్య సంభాషణలు ప్రేక్షకుల్ని విపరీతంగా ఆకట్టుకుంటాయి. మల్లన్న కథలో మల్లన్న గొర్రెల మందను తోలుకొని కొల్లాపురికి వస్తుండగా బవురంబ చేనుకు కాపలా కాస్తుంటుంది. అప్పుడు బవురంబ మల్లన్నను గుర్తించదు. ఆ సన్నివేశంలో వారి సంభాషణ హాస్య పూరితంగా ఉంటుంది. చల్ల ల ధర విషయంలో కేతమ్మ,మ్యాడల దేవి ఇద్దరు గొడవ పడతారు. ఈ సన్నివేశం కూడా హాస్య సంభాషణలతో కూడి వుంటుంది.

బీరన్న కథలో బీరన్నకు రేణుకా దేవి ఆడపిల్లల లక్షణాలు చెబుతుంది. ఏ లక్షణం

వల్ల ఏం కీడు కలుగుతుందో అని చెడు లక్షణాల గురించి రేణుకాదేవి బీరన్నకు వివరిస్తుంటే ప్రేక్షకులు విరగబడి నవ్వుతూ ఉంటారు. ఆ సన్నివేశం ఆద్యంతం హాస్యరసంతో నిండి వుంటుంది. మెల్లకన్ను వున్న అమ్మాయి ఎండను తట్టుకోలేక కండ్లు టప టప ఆడిస్తుంటే చూసిన యువకులు తమను చూసి కన్ను కొడుతుందని అనుకుంటారని కథకుడు చెబుతుంటే వింటున్న ప్రేక్షకులకు నవ్వు ఆగదు. ఈ విధంగా ప్రతి అవలక్షణం గురించి కలిగే కీడును కథకుడు అనగా మహంకాళి పాత్ర వివరిస్తున్న సన్నివేశం పూర్తిగా హాస్యమయమై ఉంటుంది.

**6. రౌద్ర రసం :**

రౌద్రరసానికి స్థాయిభావం క్రోధం.ఒగ్గుకథలో ధీరోద్ధతులైన పరశురాముని వంటి కథానాయకులతో పాటు ప్రతినాయకులైన కార్త్యవీరార్జునుడు మొదలైన వారి క్రోధాన్ని వర్ణించడం ద్వారా రౌద్రరసపోషణ చేయడం కన్పిస్తుంది.పరశురాముని బాధలకు ఓర్చుకోలేక తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఎల్లమ్మను మిగిలిన నలుగురు పిల్లలు విడిచిపెట్టక వెంటపబడుతారు.ఎల్లమ్మ మిక్కిలి కోపగించి క్రోధాన్ని పట్టలేక జంపవేశున్ని దండాన ఉరివెట్టి, డొక్కలయ్యను డొక్కల గుద్ది చంపి, చిటికనేశున్ని చీమలపాలుజేసి, ఈలగౌరమ్మ కాళ్ళు విరిచి తప్పించుక పోతుందని వర్ణించిన ఎల్లమ్మ క్రోధంలో పిల్లల మీద ద్వేషం కంటే తన పరిస్థితిని అర్థం చేసుకోవడం లేదనే ఆవేదన గమనించవచ్చు. అలా పట్టరాని క్రోధంతో రౌద్రరూపిణిగా ఎల్లమ్మ అనేక సార్లు తన సంతానాన్ని కాసేపు ఇబ్బందికి గురిచేసేటప్పటికీ వెంటనే తల్లి హృదయంతో తల్లడిల్లి పోయి తిరిగి వారిని సంరక్షిస్తుంది. ఎంతటి వారైనా పరిస్థితుల ప్రాబల్యం వలన కోపానికి గురికవాలసి రావడం అనేది సమాజంలో గమనించవచ్చు.

అలాంటి క్లిష్టపరిస్థితుల్లో ఎల్లమ్మ క్రోధాన్ని వర్ణించడం ద్వారా రౌద్ర రసపోషణ కన్పిస్తుంది. తన తండ్రి జమదగ్నిని చంపిన కార్యవీరుణ్ణి సంహరించే అవకాశం రాగానే పరశు రామునిలో కోపం, ఆవేశం కట్టలు తెంచుకుంది. పరశురాముడు పట్టరానికోపముతో వస్తున్న విధానం తెలియజేస్తూ...

"పానాలగుత్త బలపరశురాముడు, కుడిమీసమొడి వెట్టి, గుడ్లెర్రజేసి. ఎడమమీసమొడి వెట్టి వెన్ను ఒరగ జూసి, మెపెదు ఎడమన, మాయ పిడిబాకు మలిచి బొడ్లె చెక్కి, కోదండ చాపము భుజాన వేసి, మోపెడు అమ్ములు వీపున గట్టి, గండ్రగొడ్డలి చేతులవట్టి, బియ్యమంటి పండ్లను పిండివడ కొరికి కోపంతో వస్తున్న రాముడె కోదండ రామ అరిబలగోవింద రామ

ఎల్లమ్మ కొమారుడైన – ఎలా పరశురాముడేన / మార్గమున రాముడైన మండిపడుత

ఉన్నదమ్మ / పౌరుపాన దండివాడు పర శాప ధీరుడేనా / అడుగుదీసి అడుగు వెడితే – అద్దగజం భూమి గుంగె" **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గుకథ)** అని పరశురాముని క్రోధాన్ని వర్ణించడంలో ఒగ్గుకథలో తారాస్థాయికి చేరిన రౌద్రరస పోషణ గమనించవచ్చు.

జంగమయ్య మాటలు విన్న మాంధాత పురుషాహంకారంతో వీధి నాంచారి బొమ్మను చేసి ఏనుగు కాలుకు కట్టి కొట్టుకుంటూ వాడ వాడలు తిప్పుతుంటే...

"మాంధాత కొట్టె దెబ్బలకు – మంటలు పుట్టె విధమ్మకు

ఆర్చి కూతలు పెట్టింది పెడాయి బొబ్బలు లేపింది

ఏడు యోజనాలెగిసింది దంతపు కోరలు చాపింది ఓరి నరాధమా శతకంఠ మహిషాసుర రక్తబీజులను మర్దించిన మహంకాళి అని తెలియక నీ నోటికి వచ్చినట్లు అంటివి కదరా...

ఆ... ఖండ ఖండలుగ నరికెదర, నీ నామ రూపములు మాపెదరా

నడవర యోధుడ మాంధాత నిన్ను నములుమింగెధ ఇటు రారా

నరుండవై కావరమ్మున నా తెరుంగెరుంగక మొరుంగుచుంటివ

దురంబున నీవిటు రారా నీ మదమనిగించెద మాంధాత" **(చుక్క సత్తయ్య మాంధాత ఒగ్గు కథ )** తాను మగవాడిని అహంకారంతో విధి దేవత అయినప్పటికి ఆదిశక్తిని స్త్రీ అనే చులకనభావంతో బొమ్మను చేసి కొట్టి అవమాన పరచగా విధి నాంచారి శరీరంలో మంటలు పుట్టాయి. అప్పుడు మిక్కిలి కోపంతో మాందాత దగ్గరకు వస్తున్న విధి కోపాన్ని క్రోధాన్ని యక్షగాన ధోరణిలో గానం చేయడం ద్వారా మాంధాత ఒగ్గుకథలో విధి రూపా వర్ణనలో రౌద్రం రసం కనిపిస్తుంది. అడ్డంకుల వల్ల, శత్రువులు అపకారం చేయడం వల్లగాని పుట్టిన హృదయ ప్రజ్వలనం. దీని స్థాయీ భావం క్రోధం. మల్లన్న కథలో మల్లన్న తన మేనమామల దగ్గర కొల్లపురికి సంబంధించిన కౌలు కాగితాలు ఉన్నాయని సంగన్న ద్వారా తెలుసుకుంటాడు. వెంటనే మల్లన్న తన మేనమామల వద్దకు వెళ్ళి కోపంతో కాగితాలు ఇవ్వడి....... ఇస్తారా లేదా అంటూ క్రోధాగ్నిని ప్రదర్శిస్తాడు.

మల్లన్న తన అన్నలకు వివాహం చేయాలనుకొని తల్లిదండ్రులను మేనమామల కూతుళ్ళనడగడానికి పంపిస్తాడు. వారు తల్లిదండ్రులను అవమానించి పంపగా మల్లన్న తానే స్వయంగా వెళ్ళి మేనమామలను నమ్రతగా అడుగుతాడు. అయితే మేనమామలు ఒప్పుకోక పోవడంతో కోపం పట్టలేక మామలను, అత్తలను కట్టివేసి వారి బిడ్డలను ఎత్తుకెళతాడు.

మేనమామ బిడ్డలను పెండ్లాడ వద్దని మహంకాళి ఎన్ని విధాలుగా చెప్పినా బీరన్న పట్టిన

పట్టు విడవడు. పైగా బీరన్న గుండెలు మండుతున్న హెూమాగ్నిలాగా ఉన్నాయని,మామ మీద పగ తీర్చుకుంటానని క్రోధాగ్ని వెళ్లగ్రక్కుతాడు. ఈ సన్నివేశాలే కాకుండా రౌద్ర రసంతో నిండిన ఇంకా ఎన్నో సన్నివేశాలను ఒగ్గు కథకులు చక్కగా వర్ణిస్తారు.

**7. వీర రసం :**

ఒగ్గుకథలు చాలా వరకు వీరగాధల నేపథ్యాన్ని కలిగి ఉంటాయి. కరుణము, వీరము ప్రధానరసాలుగా ఒగ్గుకథగానం సాగుతుంది. వీరరసానికి స్థాయిభావం ఉత్సాహం, ప్రాచీన కాలంలో యుద్ధ సందర్భంలో సైనికుల్లో ధైర్యాన్ని, ఉత్సాహాన్ని కలిగించడానికి వీరనాట్యాలు, వీరకథాగానాలు ప్రదర్శించేవారు, ఒగ్గుకథల్లో అలాంటి ఉత్సాహ వర్ణన చాలా సందర్భాలలో కన్పించి వీరరసప్రధానంగా కథాగాన ప్రదర్శన ఉంటుంది. ఎల్లమ్మ ఒగ్గుకథలో కార్తవీరార్జునుడు యుద్ధానికి వెళ్ళినపుడు మరియు వేటకు వెళ్ళినపుడు రెండుమార్లు ఈ యుద్ధోత్సాహ వర్ణన కన్పిస్తుంది.

అండ యొధులార, దండనాయకులార, అష్టమంత్రులార, దివ్యప్రధానులారా....ఏ...యే చల్....పాలివాడు యెవ్వడు.. పగా వాడు యెవ్వడు / మిత్రులెవ్వడొచ్చెర – శత్రుడెవ్వడొచ్చెర కాయిదండ గౌరికినా కనుగుడ్లెర్ర జేసెనా...కాసెమీద కాసె హనుమంత కాసె, దిండు మీద దిండు దీనాపచండి, ఛండిమీద చండి లవంగ చండి కాసెకమ్మిలే కట్టిందురో...ఏ...య్, ఎండికుచ్చుల బల్లెము, సంకనేసి, పైడి కుచ్చుల బల్లెము కుడి సంకనేసి, ఈపున ఇనుపడాలు, బాకులు, బల్లాలు, వలలు, చిక్కాలు, సమస్తం సమకూర్చుకొని దండు కిచార జేసినప్పుడే..ఏ....య్.

రాజులమాట విన్నారు – పోదామంట ఉన్నారు కోటకోమ్మిలే ఎక్కిరి – పోతుగోమ్మిలే వట్టిరి కత్తి జల్లుమంటూ కలెవడుకుంట వచ్చెనువాయ్, మడిమే జల్లు రాజు –మర్లవాడె రాజువాయ్ కల్తీ కత్తి ఒర్వంగా కనకా పొడి రాలంగా ఆరునే గుర్రాలరా అగీరథమచ్చేరా

ఉరుములు ఉరిమిన చందమునాయ్ – ఊదగందిన చందమునాయ్
మెరుపులు మెరిసిన ఛందమునాయ్... దండు ఎల్ల వట్టిరి మంది ఎల్ల వట్టిరి
మందికైన మొనగాడు వాయ్ .. మారెత్తి సారయ్య నాయ్
కోటిమందికధికారి... వాయ్ కోమటొల్ల చెల్లప్ప వాయ్
పూటకు పుట్టెడు దింటడు... వాయ్ పోతుగొండ ధర్మయ్య...వాయ్
నడుములు బిగించి కట్టిరి లడాయిడప్పు గొట్టిరి"

యుద్ధవీరునికి బాహుబలం కన్నా మానసిక స్థైర్య ధైర్యాలు ఎంతో అవసరం. ఈ నేపథ్యంలోనే పేరిణి వంటి నృత్యాలు, వీరకథాగానాలు ఏర్పడ్డాయి. పైన తెలిపిన యుద్ధసన్నద్ధ వర్ణనలో

మారెల్లి సారయ్య, కోమటి చెల్లప్ప, పోతుగౌండ ధర్మయ్య వంటి వీరుల సంస్మరణ ద్వారా కథనోత్సాహాన్ని మరింతగా ఇనుమడింప జేయడం ఔచిత్యవంతంగా కన్పిస్తుంది. మల్లన్న కాపుల ఘట్టం కథలో మల్లయ్య, సంగయ్యలు కొల్లాపురికి బయలుదేరడాన్ని గురించి ఒగ్గుకథలో

"గోవిందానె యన్నరు – గుఱ్ఱం మీద వడ్డరు –చాల్ చాల్ మన్నరు–చాల్ పోదమన్నారు
అరికాలి పాదమెత్తిరి – అశ్వం మీద దుంకిరి మడిమ తన్ను దన్నిరి – కోర దెబ్బ గొట్టిరి
ఇద్దరన్నదమ్ములు జోడు పెద్దపులులూ – ఒడ్డులెల్ల వట్టిరీ మద్దులెల్ల వట్టిరీ
పోకలాంటి రాళ్ళు – వాయ్ పొడివాడ దొక్కి వాయ్
తవ్వలంటి రాళ్ళు వాయ్ – తపుడు వాడ దొక్కి వాయ్
కుసుమలంటి రాళ్ళు వాయ్ – కుంకుమ్బాడదొక్కి వాయ్
డెక్కదుమ్ము లెసెనా దేవలోకమందెనా – కాలిదుమ్ము లెసెనా కైలాసమందెన

**(చుక్క సత్తయ్య, ఎల్లమ్మ ఒగ్గుకథ)**

ఇందులో రారాజు మల్లయ్య, ప్రధాని సంగయ్య లను జోడు పెద్దపులులతో పోల్చడం వారి స్నేహతత్వంతో పాటు వీరత్వాన్ని తెలుపుతుంది. మల్లయ్యలో ఎగిరిదుంకే చలాకీతనాన్నీ, రాళ్ళను, పిండిగా చేయగల శక్తి సామర్థ్యాలను, దేవలోకం వరకు డెక్కల దుమ్మును ఎగజిమ్మింది అనడంలో గుఱ్ఱాల వేగాన్ని తెలియజేస్తూ మల్లయ్య వీరత్వాన్ని కళ్ళకు కట్టించారు. వేగవంతమైన త్ర్యస్రగతిలో సాగే ఈ వర్ణన ద్వారా ఒగ్గుకథలో చక్కని వీరరసపోషణ కన్పిస్తుంది.

"ఒరేయ్ భటులారా, అండ యోధుల్లారా దండి వీరులారా అష్ట మంత్రులారా దివ్య ప్రధానులారా ఏమిటి గగనము నుండి అనేక వాహనాలు వస్తున్నాయి. ఓహెరీ వారంతా దేవతల? నా మీద దండయాత్రకు వస్తున్నారా? ఇప్పుడే వారిఅంతు చూస్తానని ధనుర్బాణములు పట్టినాడు మాంధాత రథములు గుఱ్ఱాలు పదివేల భటులతో దేవత మీదికి యుద్ధానికి పోతున్నాడే....ఆ... బాణ వర్షం కురియగా దేవతలు బాదపడుతూ ఉన్నారు. దేవతలు హరుడే మాంధాత రాజు 33 కోట్ల దేవతను ఓడించి కట్ట బంధించి చట్ట చుట్టి కట్టగట్టి ఎట్టి పట్టి సూర్య మండలానికి మెట్లు కూడా కడతాడమ్మ మాంధాత". **(చుక్క సత్తయ్య ఒగ్గుకథ)**

మాంధాత మహారాజు మిక్కిలి కోపంతో వీరత్వంతో తన మీద దాడికి వచ్చిన దేవతలను యుద్ధంలో ఓడించి వారితో పని చేయించాడని వర్ణించడంలో మాంధాత ధైర్యాన్ని ఉత్సాహాన్ని వర్ణించడం ద్వారా వీర రసపోషణ కనిపిస్తుంది. ఈ కథాగానంలో వీర రస పోషణకు అనుకూలంగా ఏకపాత్రాభినయం ధోరణిలో వర్ణించడం విశేషం.

లోకోత్తరమైన పనులు చేయడానికి స్థిర ప్రయత్నంతో కూడిన అభిలాష.దీని స్థాయీ

భావం ఉత్సాహం. మల్లన్న కథలో మల్లన్న రాక్షసిని చంపడానికి ఏడు సముద్రాలు దాటి నవద్వీప గడ్డ మీద ఉన్న గండు తుమ్మెదను తీసుకొస్తాడు. రాక్షసిని చంపి రత్నాంగిని వివాహం చేసుకుంటాడు. బీరన్న కథలో బీరన్న మేనమామ పట్టణమైన నాగులకొండకు గుర్రంపై అతి వేగంగా సాగిపోతుండగా గంగ అడ్డగిస్తుంది. గంగ దర్శనం కోసం బీరన్న పొట్టి మీద కత్తితో పొడుచుకొని చిమ్మిన రక్తాన్ని గంగలో చల్లి రక్త తర్పణంగావిస్తాడు. అప్పుడు గంగ దర్శనమిస్తుంది. ఈ విధంగా మల్లన్న, బీరన్నలు వీర రసం ప్రదర్శించి వీరులుగా పేరు తెచ్చుకుంటారు.

**8. బీభత్స రసం :**

ఏదేని ఒక అంశాన్ని చూసినప్పుడు విన్నప్పుడు మన మనసు ఆ అంశాన్ని స్వీకరించిడానికి, సిద్ధంగాలేని, ఆ అంశం పట్ల వెగటు కల్గించే భావననే జుగుప్సా. జుగుప్సాకారకమైన వర్ణనల ద్వారా ఒగ్గుకథలో భీభత్స రస పోషణ కన్పిస్తుంది.

చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గుకథలో పరశురాముడు శత్రు సంహారం చేయడం గురించి వర్ణిస్తూ... “రాముడె కోదండరామ రాముడె కోదండరామ / గండ్ర గొడ్డలి వట్టి రామ-గడగడ గర్జించినాడు / ఎడమీసమొడి వెట్టినాడు -ఎన్ను ఒరుగ జూసినాడు / కుడిమీసమొడి వెట్టినాడు - గుడ్లనెర్ర జేసేనాడు /గోవింద గోవింద అని గొడ్డలి చేత వట్టినాడు / మందిలోన దుంకినాడు చెలుక మీది నల్ల చెరుకు / కోసికుప్పలేసినట్టు - ఏటిమీదిఎర్రజొన్న / కోసికుప్పలేనిసట్టు కలెగూరను తరిగినట్టు / కొర్రసేను కోసినట్టు - రాక్షసుల తలాపండ్లు

పూలచెండ్ల రీతుగానె - ఎగురగొొత్త ఉన్న దేమి / మోకాలిమంటి రక్తమేనా - మొలలమంటి పీన్గులేవ / తలపండ్లాన రిస్తయేమి - మొండెము దద్దరిస్తదేమి / రక్తమూల మునిగినాడు రక్తమూల దేలినాడు / అలల్లలలలా... ఏయ్... నల్లనిరోమాలు, తెల్లనినామాలు పక్కలపగిడిమచ్చ పానాలగుత్తోడు / బలపర్శరాముడు లక్షమంది రాక్షాసులు రయమే జేసిండురో... ఏయ్... అని పరశురాముడు శత్రువులను సంహరించి ఊరుకోండా కోయ్యకూర కోసినట్టు వారిని కోసి కుప్పలెయ్యడం. శత్రువుల రక్తంలో మునిగితేలడం తెగిపడిన తలలు, మొండాలు కదులుతూ దద్దరిల్లడం వంటి వర్ణనలు మనసుకు జుగుప్పను కల్గిస్తాయి.

మరోచోట పరశురాముడు ఉక్కుస్తంభం మీద ఉన్న దేగను పట్టుకొనే సమయంలో అడ్డువచ్చిన యాభై ఆరు రాజ్యాల రాజులను చంపి పారినరక్త గంగమ్మకు ఆహారంగా సమర్పించి దేగను ఆధీనలోకి తీసుకొని రాజుల శవాలను దానికి ఆహారంగా పెట్టగా అది వారి శరీరాలను

చీల్చి చెండాడి తిని ఆకలి తీరక దైవరాజుల ఏడు ఏనుగులను కూడా తిన్నదని బీభత్సరసప్రధానమైన వర్ణన కన్పిస్తుంది.

గొల్లకేతమ్మను పెళ్లి చేసుకోవడానికి మాధవసాని ఇంటికి మారువేషంలో వెళ్తున్న మల్లయ్య రూపాన్ని వర్ణిస్తూ.... "గూని నుండి కుష్టాది అవతారమెత్తి మోకాళ్ళు ముందటికి, మోచేతులు వెనక్కి ముడుగు ముడుగు సందున ముంతెడు చీము నెత్తురు, గంపెడు ఈగలు, గుంపెడు దోమలు, వీపునగూని, గూని మీద రాసపుండు, రాసపుండు లోపల యమదొండ మల్లెలు ఎగవారుతున్నాయి. మిడిగుడ్లు, మిట్టనోసలు, దోనికడుపు, దొబ్బ శివులు, వంకర కాళ్ళు, ఒర్రె నడుము, నెత్తిమీది సవురం మూతిమీద, మూతిమీద సవరం మొలమీద, మొలమీది సవరం మోకాళ్ళమీద పడుతుండగా, కంట్లె ఊసులు, ముక్కుల చీమిడి, నోట్ల సొల్లు కాజేసుకొని చీమిడి, సొల్లు చీము, నెత్తురు కల్సి రడగబ్బు పెడవాసన ఇసిరికొట్టంగ అత్తా మాధవసాని ఇంటికి బయలెల్లినాడు..." అనే వర్ణన విన్నప్పుడు ఎవ్వరికైనా జుగుప్స కలుగుతాయి.వస్తుగతమైన చెడును చూడడం వల్ల ఏర్పడిన రోత.దీని స్థాయీబావం జుగుప్స.

మల్లన్న కథలో మల్లన్న భార్య మ్యాడలా దేవిని పరీక్షించలనుకొని వికృత రూపం దాల్చి ఆమె దగ్గరకు వస్తాడు.ఆ రూపం చూసిన మ్యాడలదేవి అతనిపై జుగుప్స కలుగుతుంది.

బీరన్న కథలో బీరన్న కలికి చెంగోల బావి దగ్గరకు వికృతరూపంలో వెళతాడు. ఆ రూపం చూసిన కామరతికి కూడా జుగుప్స కలుగుతుంది.

ఈ విధంగా ఒగ్గు కథను ఒగ్గు కళాకారులు నవరసాలను మేళవించి హృద్యంగా చెబుతారు.రసం కావ్యానికి ప్రాణం లాంటిదంటారు. అందుకే రస రహిత కావ్యన్ని ఊహించలేము. నవరసాలకు కావ్యాల్లో అంతటి ప్రాముఖ్యత ఉందని జానపదులకు తెలియక పోయినా వారు కూడా వారి కథల్లో నవరసాలొలికించగలరు అని అనడానికి నిదర్శనం ఒగ్గుకథ. ఆయా సన్నివేశాలను బట్టి,సమయ సందర్భాలను బట్టి తమ హావ భావాలతో,వాగ్ధాటితో ఒగ్గుకథకులు నవరసాలను చక్కగా పొందు పరచగలరు. దీనిని బట్టి ఒగ్గు కథా సాహిత్యంలో నవరసాలకు కూడా ప్రాధాన్యత ఉందని తెలుస్తుంది.

**9.శాంత రసం:**

వీటితోపాటు పరశురాముని శమం. ఇహలోక బంధాలు తెంచుకొని పరమాత్మలో లీనంకావడమే మనిషి జన్మ పరమావధి అనే భావన కలిగినపుడు, మనిషిలో వైరాగ్యం ఏర్పడి అన్ని భావాలు శమించి, బాధలు ఉపశమించి మనిషి శాంతిని పొందుతాడు. ఈ భావాన్ని

ఒగ్గుకథలో జంగమ తత్వాల రూపంలో గానంచేయడం గమనించవచ్చు.....

హరిహర మహాదేవ శంభో శంకర...

విష్ణు ఈశ్వరా బ్రహ్మ ముగ్గురు అన్నదమ్ములయ్య, శివశివ అన్నదమ్ములయ్య

వారు మహిమతో చేసిన కొన్ని మట్టి బొమ్మలేరా, ఇవ్వి మాయబొమ్మలేరా

మిద్దెలున్నయని మేడలున్నవని కొంత మరువబోకే మనసా కొంత మరువబోకే

ఇచ్చిన దేవుడు తీసుకపొంగా మిద్దెలు రావెంట నీతో మేడలు రావెంటా

కొడుకులున్నరని బిడ్డలున్నరని కొంత మురువబోకే మనసా కొంత మరువబోకే

యములోడచ్చి తీసుకపోంగా కొడుకులు రారెంటా నీతో బిడ్డలు రారెంటా

గురున్ని నమ్మోవాలెరా గురు పూజలు చెయ్యావాలెరా / హరున్ని నమ్మావాలెరా హరు పూజలు చెయ్యావాలెరా / నరున్ని నమ్మా వద్దురా నరున్ని నమ్మితె నరకము జెందు నరున్ని నమ్మ వద్దురా... **(చుక్క సత్తయ్య మల్లన్న కాపుల ఘట్టం ఒగ్గుకథ)**

ఒగ్గుకథలో అంతర్గతంగా వచ్చే ఇలాంటి తత్వాలు విన్నప్పుడు మనిషిలో సంపదల పట్ల, సంతానం పట్ల అనురక్తి తగ్గి బతికినన్ని రోజులు మంచిగా బతకాలనే భావన కలుగుతుంది. చావుకు ఒప్పుకొని సంతాన ఫలము పొందిన వరదసుందరి బిడ్డని కన్నాక మరణించే సందర్భాన్ని వర్ణించే ఒగ్గుకథగానంలో వైరాగ్య భావన కనిపిస్తుంది.

“ఇప్పటికైనా అప్పటికైనా మనిషి ఈ భూమి మీదికి రావాలంటే ఆయుష్షు ఇచ్చేవాడు విష్ణుదేవుడు రాత రాసేవాడు. బ్రహ్మదేవుడు ప్రాణం తీసుకుపోయేవాడు యమధర్మరాజు...ఆ...

యముడు ప్రాణాలు కొంట పోవంగా కొడుకులు బిడ్డలు అడ్డం రారు, పంత పడిన కాడికి పాదాలు పరిగెడతాయి, ప్రపంచాన్ని జయించిన వాడు కూడా మృత్యువును జయించడని తెలుసుకో ఆలుబిడ్డలు అన్నదమ్ములు ఎవరు నీ వెంట రారు ఒకవేళా వదలక వచ్చినప్పటికీ వల్లకాడు వరకే రా...ఆ... భగవంతుడు మాటతప్పుదు, బ్రహ్మరాత తప్పదు శాట్లవడ్డ నాటి గీత కాట్లే పడిన దాకా తప్పదు అనుకుంటూ ఏడేడు జన్మలదాక నేను నీకు భార్యనై పుట్టాలని బిడ్డను చూసుకుంటూ బిడ్డను భర్త చేతిలో పెట్టి బిడ్డ పదిలం నాథా. చదువుకున్న నువ్వే, చంపుకు నువ్వే అని విలవిల కొట్టుకుంటూ వరద సుందరి భర్త పాదాల కాడ జీవనం విడిసింది. **(సల్పల సతీష్ సరోజినీ దేవి ఒగ్గుకథ)**

ఈ విధంగా శివునికి ఇచ్చిన మాట ప్రకారం సంతానాన్ని పొందిన తర్వాత ప్రాణాలు కోల్పోయిన వరదరాజు భార్య మరణాన్ని తట్టుకోలేక మరణించిన విషయాన్ని గురించి ఒగ్గ

కథకులు గానంచేస్తూ చెప్పే విషయాలన్నీ, ప్రేక్షకులలో వైరాగ్య భావాన్ని కలిగిస్తాయి. ఇలాంటి భావనలు మనసును మోక్షం వైపు నడిపించి ఇహలోక బంధాల నుండి శాంతిని కలిగింపజేస్తాయి. వివిధ ఒగ్గు కథలలో కనిపించే "కోట్లు సంపాదించిన కొంపల్లనే ఉంటాయి కానీ కాట్లే పెట్టినాడు కాసు గవ్వ వెంట రాద' అని తెలిపే సామెతలు లక్షల సంపాదన కన్నా పాపపుణ్యాలు మనిషిని గుర్తిస్తాయి అని చెప్పే భావన ప్రేక్షకులను కొంతవరకు ధనాశ నుండి అధ్యాత్మిక వైపు అడుగులు వేయిస్తాయి సాధారణంగా సమాజంలో మరణించిన వ్యక్తి జ్ఞాపకార్థంగా కథాగానం చేసినప్పుడు చెప్పే వైరాగ్య భావనలు మనస్సుకు శాంతిని కల్గిస్తాయి.

ఒగ్గుకథా ప్రదర్శన కథాసూత్రాన్ని ఆధారంగా చేసుకుని ఆశువుగా చక్కని సంవిధాననైపుణ్యాలతో సాగే కథాగాన ప్రక్రియ, ఆలోచలనకు, ప్రదర్శనకు మధ్య కొన్ని లక్షణాల వ్యవధి మాత్రమే ఉంటుంది. ఒక పాదంను గానం చేస్తూనే, కథకు తగ్గట్టు లయను మారుస్తూ, అడుగులు వేస్తూ మనసులో అనంతరపాదాన్ని ఆలోచిస్తూ, వెంటనే వ్యక్తపరుస్తూ సాగే ఒగ్గుకథ గాన ప్రదర్శనలో పోషించిన రసపోషణ ప్రబంధాది కావ్యాలలో వలె తీర్చి దిద్దినట్లు లేకపోయినా సహజసుందరంగా, మాత్రాగతుల్లో, భావానికి తగిన పదాల పోహలింపుతో ఔచిత్యవంతంగా కన్పించి ఆనందాన్ని కల్గిస్తుంది. రసపోషణ నిమిత్తం ఒగ్గుకథల్లో చేసిన వర్ణనలలో నేటి క్లిష్ట సాహిత్యం దూరం చేసుకున్న అచ్చ తెలుగు పదజాలం విరివిరిగా కన్పిస్తుంది. వైరాగ్యం వల్ల పుట్టిన నిర్వికార చిత్తవృత్తి శాంతం. క్షణ భంగురమైన జీవితాన్ని పరిశీలించి చూస్తే శాంత రసమే కనిపిస్తుంది. దీని స్థాయీ భావం శమం.

మల్లన్న కథలో మల్లన్న పెద్ద వదిన అతనిపై నింద వేసినప్పుడు తనలో తానే కుమిలి పోతాడే తప్ప వదినను ఒక్కమాట కూడా అనడు. కచ్చేరీ అన్నలకు అప్ప చెప్పమని వదిన అనగా మారు మాట్లాడకుండా కచ్చేరీ అన్నలకు అప్పగించి తాను వ్యవసాయం చేసుకుంటాడు. ఇలాంటి సంఘటనల గురించి కథకుడు కథలో చెబుతున్నప్పుడు శాంత రసం ఒలికిస్తాడు.

### 3.8. సమకాలీన కళారూపాల ప్రభావం

కళారూపం ఏదైనా సమాజంలో ప్రచారంలో ఉన్న ఇతర కళారూపాల చేత కొంత ప్రభావితం కావడం జరుగుతుంది. చాలా వరకు జానపద కళారూపాలు పరస్పర ప్రభావితాలై ఉంటాయి. ఆ విధంగా ఒగ్గుకథ ప్రదర్శన మీద ఒకప్పుడు సమాజంలో విశేష ప్రాచుర్యం పొందిన యక్షగానం, తందనానరామాయణం వంటి కళారూపాల ప్రభావం ఉన్నట్లు తెలుస్తుంది.

### 3.8.1 యక్షగాన ధోరణి

సాధారణ స్త్రీ, పురుష వేషధారణలో ఉన్న ప్రధానకథకులు వాద్యసహకారంతో చక్కని హావభావ విన్యాసంతో, లయబద్ధమైన నృత్తంతో గానం చేయబడే ఒగ్గుకథ సంభాషణలో యక్షగానఛాయలు కనిపిస్తాయి. యక్షగానంలో ఛందోబద్ధమైన దరువులతో, చాలా వరకు సరళ గ్రాంథిక సంభాషణలు ఉండగా, ఒగ్గుకథలో దరువులన్నీ లయప్రధానమై, సంభాషణలన్నీ మాండలికభాషలో కనిపిస్తాయి. సామాజిక వేదికల మీద విశిష్ట ప్రదర్శనకళగా ఒగ్గుకథప్రదర్శనను రక్తి కట్టించడానికి, ప్రేక్షకులకు నాటకం చూస్తున్నామనే భావన కలిగించడానికి చుక్క సత్తయ్య వంటివారు ఒగ్గు కథాగాన ప్రదర్శనలో బాగోతంగా ప్రచారం పొందిన యక్షగానధోరణిని ప్రవేశపెట్టారు.

పాత్ర స్వభావాలను ప్రదర్శిస్తూ, కథాత్మక వ్యాఖ్యానంగా సాగే ఒగ్గు కథలో యక్షగానంలో ఉన్నట్లుగానే పాత్రల మధ్య వివిధ తాళగతులలో సంభాషణలు ఏర్పాటు చేశారు. ప్రత్యేకించి చుక్క సత్తయ్య గారి మాంధాత ఒగ్గుకథలో ఈ ధోరణి ప్రబలంగా కనిపిస్తుంది. ఇతర ఒగ్గుకథ ల వలె కాకుండా మాంధాత ఒగ్గుకథ ఎత్తుగడ లోనే మార్పు కనిపిస్తుంది. గంగ ప్రార్థనకు బదులుగా యక్షగానాలు, కావ్యసంప్రదాయంలో కనిపించే సరస్వతీ ప్రార్థనతో మాంధాత కథ మొదలు పెట్టారు. గేయానికి బదులుగా బమ్మెరపోతన గారి "తల్లీ నిన్ను దలంచి..." అనే ప్రసిద్ధ పద్యంతో కథాగానం ప్రారంభించారు. అనంతరకాలంలో చుక్క సత్తయ్య శిష్యులు కూడా ఈ సంప్రదాయాన్ని కొనసాగించారు. ఒగ్గు బాలసిద్ధులు నరసింహస్వామి ఒగ్గుకథను శేషప్ప కవి నరసింహశతకంలోని పద్యంతో ప్రారంభించడం కనిపిస్తుంది. మాంధాత ఒగ్గుకథలోని విధినాంచారి మాంధాత సంవాదము పూర్తిగా యక్షగాన ధోరణిలో నడుస్తుంది.

"విధి: మదోన్మత్తుడ మాంధాత నీ మదమనిగించెద యిటురారా
గొప్పవాడనని నిక్కకురా, నీ కన్న ఎక్కువ నేనున్నా

మాంధాత : ఒసే ఒసే నీవెవ్వతివే అడ్డ బట్టకట్టినదాన
దంతపు కోరలు దయ్యపు రూపము సిగ్గు లేక ఇటు వచ్చితివా

విధి: ఎవరనుకుంటివి ఏమనుకుంటివి కళ్ళకొవ్వు కరిగించెదర ఇదిగొ చూడు
కరవాలమురా నీ శిరసు రెండుగా నరికెదరా

మాంధాత : కాకుల కప్పల బర్రె మాంసము గుర్రపు లద్దె తినెదాన ఎక్కువ నీల్గితె కొప్పు బట్టి
కొప్పుపట్టి నీ తిక్క దింపెదను రారమ్మీ

విధి: బాకులు బల్లెము పట్టెదరా నీ ప్రాణము దీసేద మాంధాత విసీకములచే కసీ తీరగను వసూద గూల్చెద నిటురార

మాంధాత : కసీమసంబులు కరంబున నీ విసంత రావే దురంబున చేతికి చిక్కితె తొక్కిపట్టి నీ ముక్కు చెవులు కోసెద రావే

విధి: విధంట ఒకసారనరోరి ఇస్త భాగ్యము నీకునురా ఎండి ఇస్త బంగారమిస్త నీకెనాలేని ద్రవ్యంబు నిస్త

మాంధాత : పాతకి రక్కసి పడతి పిశాచి మోసపోను నీ మాటలకు ఆడిదానితో యుద్ధము జేసిన సిగ్గుచేటు మారాజులకు

విధి: నరుండవయి కావరంబున నా తెరుంగెరుంగక మొరుంగు చుంటివ దురంబున నీవిటురారా నీ మదమణిగించెద మాంధాత

మాంధాత : ఏడు లోకములు ఎకంబై ఎదురుగ వచ్చిన ఏమగునేపోపో దుర్మతి ఇక్కడినుండి పోకిరి చేష్టలు మానుమిక" **(చుక్క సత్తయ్య మాంధాత ఒగ్గుకథ)**

మాంధాత ఒగ్గుకథలో మాంధాత, విధి పాత్రల మధ్య సుదీర్ఘంగా సాగిన సంవాదం పూర్తిగా యక్షగానాన్ని తలపిస్తుంది. యక్షగానంలో సరళ గ్రాంధికభాషలో కనిపించే ఈ సంవాదం ఒగ్గుకథలో తత్సమపదాలు మరియు అచ్చతెలుగు వ్యవహారభాషలో సాగింది.

ఒగ్గుకథలో మాత్రమే కనిపించే సహజమైన అనుప్రాస వంటి లక్షణాలు ఈ సంవాదానికి అదనపు ఆకర్షణను కల్గించాయి. అలాగే ఈ సంవాదంలో దరువుల మధ్య కనిపించే సుదీర్ఘ వచనంలో ఏకపాత్రాభినయధోరణి కనిపిస్తుంది. ఇందులో గ్రామదేవత అయిన విధి/ఈదమ్మ మాటలు వ్యవహారికభాషలో గానం చేయబడగా, అయోధ్య రాజైన మాంధాత మాటలలో కొంత గ్రాంధికధోరణి కనిపిస్తుంది.

"ఏమి ఏమంటివి ఏమంటివి, నా భుజబల శౌర్యపరాక్రమవిక్రమసంపన్నుడనై, శస్త్రాస్త్ర గదాదండ ఇంద్ర,చంద్ర,దేవేంద్ర గరుడగంధర్వ నందన, కుందన, కుజుడు కుబేర గాలిదేవ గంభీర అగ్నిదేవ వరుణదేవ యమధర్మరాజాది ముక్కోటి దేవతలను ఒక్క బాణముచేత కట్టగట్టి, చుట్టచుట్టి, తొక్కి పట్టి, మట్టుపెట్టి సూర్యమండలం ఎక్కి పోవడానికి దమదమలు కట్టినది ఎరుంగలేక మొరుంగుచుంటివా, ఒసే ఆడదాన నిన్ను చూస్తుంటే, నీ మాటలు విన్న కొలది నాకు ఆశ్చర్యం కలుగుచున్నది. ధన మణి వజ్ర వైడూర్య గోమేధిక పుష్యరాగ మరకత మాణిక్యాలు పచ్చల మీద స్నానమాడే చక్రవర్తికి నీవు ధనము ఇచ్చుటయా అసంభవం అవమానం. సకల వేద శాస్త్ర పురోహిత సమంచిత సముచితాలంకృత సరోవర సువర్ణ మణిమయ రత్నములు

దాపిన ఈ దశనామాల కిరీటం ధరించి, సకల రాజాధిరాజుల వేద శాస్త్ర యుక్తంగా స్థాపించిన వజ్ర సింహాసనమును అలంకరించిన ఈ అయోధ్య చక్రవర్తి ముందు నీ నోటికి వచ్చినట్లు దుర్భాషలాడుతూ....... **(చుక్క సత్తయ్య. మాంధాత ఒగ్గుకథ)**

ఇలా వ్యవధి లేకుండా ధీరగంభీర స్వరంతో, సుదీర్ఘ సమాసాలతో, హావభావ యుక్తంగా ప్రదర్శించబడే మాంధాత ఒగ్గు కథలో ఈ ఘట్టం ఏకపాత్రాభినయాన్ని తలపిస్తుంది. నాటి సామాజిక పరిస్థితుల దృష్ట్యా కేవలం కులహద్దుల్లో కొంతవరకు గ్రామీణ ప్రజా వినోదకళారూపంగా ఉన్న ఒగ్గుకథ కు అప్పటికే మిక్కిలి ప్రచారంలో ఉన్న యక్షగాన స్థాయిలో గుర్తింపు తేవాలనే తాపత్రయంతో సమకాలీన చలనచిత్రాల ప్రభావంతో చుక్క సత్తయ్య మాంధాత ఒగ్గుకథలో ఇలాంటి మార్పులు చేసి ప్రదర్శించి ఉండవచ్చు.

### 3.8.2. తందనానరామాయణం ప్రభావం

ఒగ్గుకథా గానం పై ప్రభావం చూపిన సమకాలీన ప్రదర్శన రూపం తందనాన రామాయణం. ఇది భజన సాంప్రదాయకళారూపం. నాలుగు దశాబ్దాల కిందట ఉత్తర తెలంగాణలో విశేష ప్రజాదరణ పొందిన తందనాన రామాయణాన్ని రుక్మాభట్ల విధుమౌలి శాస్త్రి రాశారు. శారదకాంద్ర గేయాలననుసరించి రాసిన తందనాన రామాయణ గానం జానపద గేయాలకు దగ్గరగా ఉంటుంది. ఒగ్గుకథలో ఉన్నట్టుగానే ఇందులో కూడా జయ రామ రామ పదం వంతగానంగా కనిపిస్తుంది. తందనాన రామాయణ గానపద్ధతిలో కూడా కొన్నిచోట్ల ఒగ్గుకథా గానం కనిపిస్తుంది.

"సున్నాన లోగిల్లేమి జయరామరామ, సుద్ది జేయ వట్టిరి గాదె జయరామరామ
గంధాన లోగిల్లేమి జయరామరామ, గచ్చులు కడిగించినారుగా జయరామరామ
నెమలీకల పందిర్లేసి జయరామరామ, చిన్నచిన్న ముత్యాలేమి జయరామరామ
శివ దొరుణాలు రామ జయరామరామ
రెండొ లగ్నమాడుతున్నాడు జయరామరామ, భార్యా విమలాంగి దేవిని జయరామరామ
కర్కాటక లగ్నమందున జయరామరామ, కాంత మెడలో తాళి గట్టెను జయరామరామ
పెండ్లి జరిగె పూటలు జరిగె జయరామరామ, ప్రేమమీర పాటలు జరిగె జయరామరామ
రామరామ ఓ రఘురామ జయరామరామ, ఈ కథ వినియేటి వారకు జయరామరామ ఇలలోన సుఖములు గలుగు జయరామరామ, పరమందు మోక్షము గలుగు జయరామరామ తొలగును దోషాలు మీకు జయరామరామ, కలుగును పుణ్యాలు మీకు జయరామరామ" **(చుక్క సత్తయ్య మాంధాత ఒగ్గుకథ)**

ఒగ్గుకథ గానంలో తందనాన రామాయణం పద్ధతిని అనుసరించి వివాహ ఘట్టాన్ని, ఫలశ్రుతిని గానం చేయడం కన్పిస్తుంది. జయ రామ రామ అనే వంతగానంతో సాగే తందనాన రామాయణం, రామ పదం వంతగానంతో ఉండే ఒగ్గుకథ పైన ప్రభావం చూపడం వలన గానయోగ్యమైన తందనాన రామాయణంలోని కొన్ని దరువులను ఒగ్గుకథలో కూడా గానంచేయడం జరిగింది. ఈ విధంగా ఒగ్గుకథకు సమకాలీనంగా ప్రాచుర్యం పొందిన యక్షగానము / బాగోతం, తందనాన రామాయణం వంటి సమకాలీన కళారూపాలలోని వివిధ అంశాలను ఒగ్గుకథకు అనుకూలంగా మార్చిప్రదర్శించడం కన్పిస్తుంది.

**3.8.3. మేలుకొలుపులు – స్తుతిగానాలు**

ప్రతీ మానవుడు తన మాతృ భాషలోనే మనసులోని భావాన్ని సమగ్రంగా సమర్థవంతంగా వ్యక్తం చేయగలరని మానసిక శాస్త్రజ్ఞుల అభిప్రాయం. భారతీయ భాషలన్నిటిపైనా సాహిత్యపరంగా వ్యవహారపరంగా సంస్కృత భాషా సాహిత్యాల ప్రభావం కనిపిస్తుంది. అయినప్పటికీ తిరుప్పావై వంటి ప్రసిద్ధ స్తుతి గీతాలన్నీ కూడా ప్రాంతీయ భాషలలోనే వెలువడి ప్రశస్తి పొందాయి. సాహిత్యం ఏదైనా స్థానిక భాషలలో వెలువడినప్పుడే సామాన్యుడికి చేరువవుతుంది. సాధారణ మానవుడే కాదు సాహితీ సృజనశీలురైన కవి గాయకులు కూడా పరభాషల కన్నా మాతృభాషలోనే తమ భావాల్ని కవిత్వీకరించినప్పుడు నిర్దిష్టమైన భావంతో ఆ కవిత్వం ప్రజల మన్ననలు పొందుతుంది. నన్నయ భారతాని కంటే ముందే తెలుగులో గేయ సాహిత్యం విరివిగా ఉందని పాల్కురికి సోమనాథుని రచనలలో పేర్కొన్న వివిధ గీతల ద్వారా నిర్ధారణ అయింది. అటువంటి గీతాలు ఒగ్గుకథాగానంలో అంతర్భాగంగా కనిపిస్తాయి. ప్రధానంగా ఎల్లమ్మ, మల్లన్న దైవాల స్తుతిగీతాలుగా కనిపించే వీటిలో కొన్ని కథాపరంగా వచ్చినవి కాగా మరికొన్ని ఆయా గీతాలననుసరించి కథకులు సృష్టించి గానం చేసినట్లు తెలుస్తుంది.

**3.8.4. మల్లన్న మేలుకొలుపులు – పవళింపులు**

నన్నయ భారత రచన ఆరంభించే నాటికే తెలుగుపై సంస్కృత ప్రభావం ప్రారంభమై సంప్రదాయ సంస్కృత సాహిత్యంలోని ఇతివృత్తాలు తెలుగులోకి రావడంతో ఆ భాషా ప్రభావం బలపడింది. ఈ ప్రభావం తెలుగుతోపాటు దక్షిణాది భాషలన్నింటిలో కూడా కనిపిస్తుంది. సాహిత్యపరంగా ఈ విధమైన సంస్కృత ప్రభావాన్ని తట్టుకుని నిలబడిన తమిళగేయ రచన తిరుప్పావై వంటి మేలుకొలుపు ఒగ్గు వారి సంప్రదాయాల్లో కూడా కనిపిస్తుంది. అదే మల్లన్న మేలుకొలుపు. అచ్చ తెనుగు పదాలతో, నిత్య వ్యవహారంలో ఉపయోగించే భాషలో గానం

చేయబడే మల్లన్న మేలుకొలుపులోని భక్తి భావం శ్రోత మనస్సుకు నేరుగా చేరుతుంది.

సంస్కృతంలో గానం చేయబడి విశేష ప్రసిద్ధి పొందిన వెంకటేశ్వర స్వామి సుప్రభాతం వంటి రచనలు గానయోగ్యమై వీనుల విందుగా ఉండి మనసుకు ఆనందాన్ని కలిగిస్తాయి. అయితే అటువంటి సుప్రభాతాలలోని భావాన్ని అర్థం చేసుకొని ఆనందించే వారి కన్నా అందలి వినసొంపైన శబ్దమాధుర్యాన్ని పదలాలిత్యాన్ని విని పరవశించే వారే ఎక్కువ. అటువంటి సుప్రభాతాలను అర్థం చేసుకోవాలంటే అందులోని పదాలన్ని వింగడించుకొని అర్థాలను అన్వయం చేసుకోవాలి. ఇటువంటి శ్రమ లేకుండా భక్తుని మనసులోని భక్తి భావనను నేరుగా ఉన్నది ఉన్నట్లుగా సహజమైన అలంకారాలతో మల్లన్న మేలుకొలుపు అభివ్యక్తం చేస్తుంది.

"శివశివ గణనాథ చిత్తగణనాథ పూజలకు ముందు విగ్గన్న పార్వతి కుమార పదివేల శరణం...ఆ / ఓం ఓం నీలకంఠ ఓంనీలకంఠ శివశివ నీలకంఠ శివనీలకంఠ, ఎలా కోటి ఎలా కోటి రామా / పోసేది నీ కాశ, చేసేది మీసేవ, ఎగిలేత్తే నీ సేవ ఏమారక చేసేము మల్లన్న...... చుట్టుముట్టు పాతాళ గంగ, నట్టనడుమ పర్వతము, పర్వతము గుళ్ళలో నీవు ప్రత్యక్ష దేవుడవు మల్లన్న...ఆ.../ నిన్ను దలిసే యాల్లాయె నిద్రలు మేలుకో, పూజలకు వేళాయె, పువ్వోలె మేలుకో మల్లన్నా..ఆ... / రవ్వడోలు మోగంగా, రాజ్యం ధ్వనులెల్లె, కంచు జగ్గులు మ్రోత కడలు ధ్వనులెల్లె ఓంకారం ఓంకారం మల్లన్న..ఆ... / శివ శివ నీ పూజ చిత్తగించేటి యాల్ల బసవయ్య నీ పూజ ప్రార్థన చేసేటి యాల్ల....ఆ.. / బలబల తెల్లవారే బ్రహ్మనాదులు పలికే, చుక్కలు పెక్కటిల్లి సూర్యుడు ఉదయించే మల్లయ్య.. ఆ / తూర్పు రేఖలు వారి తుమ్మిల్లు పూసి, పక్షులు పలుకుతున్నవి రావయ్య... ఆ... / భూత కోళ్లు కూసి భూములు తెల్లవారే, రాత కోళ్ళు కూసి రాజ్యం తెల్లవారే, కారు కోళ్లు కూసి కడలు తెల్లవారే మల్లయ్య..ఆ... / ఒద్దుల్ల ఉన్నవో, ముద్దుల ఉన్నవో స్నానానికి వేళాయే తావులు మేల్కొని రావయ్య...ఆ.. ఎర్ర గూడు పచ్చ గూడు, ఏడుపాయల నీళ్లు, మంగ కాయల తోటి నీకు మైలలు తీసేరు. మల్లయ్య ..ఆ.../ నీకు గోమూత్ర శుద్ధి పాలకాయ జలకాలు మల్లయ్య...ఆ / నీకు నిమ్మకాయ జలకాలు శీతల్ల శివ పూజ, మంచినీళ్ల తోటి నీకు మారేడు వస్త్ర జలకాలు, నీవు బండ ధోని నీళ్లు జాలిచెల్మెల్లో జలకమాడేటి యాల్లా ...ఆ.../ముక్కోటి దేవతలు ఒక్కటై నీ కొరకు, ధరలోన తిరిగి తీరొక్క తీర్థాలు నీకు టెంకాయ నీళుతీయటి తీర్థాలు బారెడేసి జడలు, బసవన్న పూతలు మల్లయ్య... ఆ... / గుండంలో తానాలు గుళ్లలో నీ పూజ, మడుగులో తానాలు మండపంలో నీ పూజ, కోనేరులో తానాలు కొండలలో నీ పూజ మల్లయ్య...ఆ../ నీకు గంగ లో స్నానాలు గట్లల్ల

పూజలు, శంకుతో నాదాలు గంటతో మోతలు రావయ్య...ఆ.../పాలు నెయ్యి తేనె పంచామృతాలు నీకు అచ్చునావుపాలు నిచ్చాభిషేకాలు మల్లయ్య...ఆ.../

మంచి గంధము నీకు మల్లెపూల దండలు మెడ నిండా హారాలు చలి గంగ స్నానాలు బిందెతో తీర్థం నందిని నోట గంగ లింగాభిషేకం మల్లయ్య...ఆ.../ జంగాల ఇళ్లలో లింగాల పూజ, బలిజ వారు భక్తులై పూజింప, నమ్మినవారికి ఇమ్మైన దేవుడవు మల్లయ్య ...ఆ.../ ఏల్లల్ల విభూతి రూపెల్ల రుద్రాక్షలు పంచాక్షరి మంత్రం పఠనం చేసేటి వేలా... ఆ.../ నీకు అత్తరు పన్నీరు జాజి జావ్వాజి మంచి గంధము నీకు మల్లెపూల దండలు సాంబ్రాణి మైసాక్షి పూలుబండారి పూజలు చేసేటి యల్లా... ఆ.../ ఒట్టిది బండారి ఓగేశ రూపులు పచ్చిది బండారి పాములాభరణాలు, త్రాచుపాములు నీకు తలమీది కిరీటాలు మల్లయ్య...ఆ.../నీకు ఒంటినిండా పాములు ఒనమాల పేరులు, పుట్టెడు బండారుతో నీకు పూజలు చేసేరు. మల్లయ్య..ఆ.../ శుక్రవారం నాడు సూర పెళ్ళికొడుకవు, శనివారం నాడు గంగాస్నానం నీకు, ఆదివారం నాడు ఓగుల లగ్నం నీ పెయ్యంత పసుపు రాసి, పెండ్లి కొడుకును చేసి హస్తాన కంకణం నొసట బాసింగం కట్టెటి యాల్లా...ఆ...

"ఎగిలెత్తే నీ పూజ ఏమారక జేసేము మల్లన్న..." అని నిండైన భక్తితో వేడుకోలుగా మొదలై సూర్యోదయ కాలపు ప్రకృతి పరవశాన్ని, డోలు డమరు నాదాలను, గుండంలో స్నానం చేసి వస్తున్న భక్తులను, గుడి శుద్ధి చేసే విషయాన్ని, దేవుని స్నానం చేయించి అలంకరించగా పసుపు బండారి పాములతో ఉన్న స్వరూపాన్ని, మల్లన్న జననం నుండి నాలుగు వర్గాల స్త్రీలను పెళ్లి చేసుకొని దైవంగా నిలిచిన విధానం వరకు జరిగిన విషయాన్ని, ఆరగింపులను, చుక్కల కొండలను, వివిధ క్షేత్రాలను గురించి వర్ణనాత్మకంగా మేలుకొలుపు కొనసాగుతుంది. ఈ మేలుకొలుపులో ఎక్కడా అర్థంకాని క్లిష్టత కనిపించదు. చక్కనిమాండలికంలో మనసువిప్పి దైవంతో ముచ్చటించినట్లు మల్లన్న మేలుకొలుపు సాగుతుంది.

ఈ విధంగా వచనగేయంగా సాగే మల్లన్నమేలుకొలుపు గానం చేసిన తరువాత దేవాలయం తలుపులు తెరిచి గుడిని శుద్ధి చేస్తారు. ఆ సమయంలో మల్లికార్జున లీలలను గానం చేస్తుంటారు. మొదట వచనంలో చెప్పిన విషయం అంతా ఇక్కడ గేయ రూపంలో గానం చేయబడుతుంది.

"శరణు మల్లన్న శరణు మల్లన్న శరణయ్య మీసేవ చేతు మల్లన్న

బాలమల్లేశుడా బాల మల్లెశా బాల కొమురెల్లి చేరాల మల్లేశా" అనే పల్లవితో సాగే ఈ

మేలుకొలుపు గేయంలో కూడా మల్లికార్జున క్షేత్ర ప్రాధాన్యం కనిపిస్తుంది. దీని తరువాత మేలుకొలుపు లో కనిపించే మరో గేయం.

శివశివ గణనాథ రాజుమల్లయ్య – చిత్తగణనాథుడవు మైలారుడా
చల్లచల్లని వాడ రాజుమల్లయ్య సాయమయి ఉండాలి మైలారుడా
చల్లని మండపాన రాజుమల్లయ్య – లింగమై నీవుంటే మైలారుడా
కొమురెల్లి గుళ్ళల్ల రాజుమల్లయ్య – కోడాటగాడవు మైలారుదా
గద్దరిచ్చిన వారి రాజుమల్లయ్య – గర్భాలు చింపుదువు మైలారుడా
ఎత్తుకున్నోరింట్ల రాజుమల్లయ్య – వేడుకలు పొందినవు మైలారుడా " **(చుక్క సత్తయ్య మల్లన్న మేలుకొలుపు)**

ఈ గేయమంతా కూడా మొదటి సగపాదం "రాజుమల్లయ్య" అనీ రెండవ సగపాదం "మైలారుడా" అని అంత్యప్రాసతో సాగుతుంది. చారిత్రిక ఐతిహ్యాలను అనుసరించి మరాఠా ప్రాంతానికి చెందిన జేజురిలో మల్లాసురుడనే రాక్షసుని సంహరించడానికి శివాంశతో జన్మించిన ఖండేరాయుడు మల్లాసురున్ని చంపి "మల్లరి" మల్హరి గాను ప్రసిద్ధి పొందాదు. అతడే కన్నడ దేశాన మైలారుడి గాను తెలుగునాట మల్లన్నగాను ప్రసిద్ధి చెందాడు. మరాఠా లోని ఖండోబా, కన్నడ ప్రాంతంలోని మైలారుదేవుడు, తెలుగునాట మల్లన్న దేవుని విగ్రహాలు పూజా విధానం, తత్సంబంధ కథా సాహిత్యాలలో పోలికలున్నాయి. తెలుగు, కన్నడ సోదర భాషలు కావడం వలన మైలారుడు అనే కన్నడ పదం ఈ మల్లన్న మేలుకొలుపు గేయంలో నిలిచి ఉండవచ్చు. ఈ విధంగా కొన్ని చారిత్రక విశేషాల్ని కలిగి ఉండి రారాజు మల్లన్న దేవుని మీద అచంచలమైన భక్తి విశ్వాసాలను మల్లన్న మేలుకొలుపు ద్వారా గానం చేయబడే ఈ మేలుకొలుపు తెలుగుకు సంబంధించిన అచ్చమైన దేశీ సాహిత్యమని చెప్పవచ్చు.

ఒగ్గు పూజారులు నిర్వహించె మల్లన్న పూజలలో, కథాగానాలలో అచ్చతెలుగు మేలుకొలుపుతో పాటు పసందైన పవళింపుగేయాలు ఉన్నాయి.

"చల్లచల్లని వాడ చల్లన్నివాడా / చల్లని మండపాన ఉన్న మల్లయ్యా
చిక్కు చీకట్లాయే సిరి మబ్బులాయే / నిద్రకు వేళాయె నీకు మల్లన్న
ఉన్నవాడొక్కడవు చిన్న మల్లయ్య / ఊరూరు మండపాలు నీకు మల్లయ్య
బొడ్డుగంటలు కట్టి నందినెక్కితివా / ఎద్దునెక్కి జగమునేలిన వాడా
కామసమర రాత్రి జామాయే తండ్రి / నీలారి కండ్లల్ల నిదుర పోవయ్యా
నీ భార్య భ్రమరాంబ బాసటుందంగా / హంసతూలిక పైనా పవళించవయ్య

వెలది మేడలదేవి దగ్గర ఉండి / వెలయ వింజామరలు వీయుచుండంగా

బంగారి కడియాల బాల కేతమ్మ / నీ సేవ చేయంగా నిదురపో తండ్రి" **(చుక్క సత్తయ్య మల్లన్న మేలుకొలుపు)**

సిరి / చిరు మబ్బులతో చీకట్లో ఆవరించాయి నిద్రపోయే సమయమయిందని తెలియజేస్తూ సాక్షాత్తు శివుని అంశతో జన్మించి, వివిధ క్షేత్రాలలో వెలసి, రాజుల భక్తులు నిన్ను పూజిస్తూ ఉండగా లోకాలను పాలించి భక్తుల మొరలాలించి అలసి పోయావు, నీ భార్యలు నీకు సేవలు చేస్తుండగా నిద్ర పొమ్మనే ముగ్ధ భావనతో మంద్రస్థాయిలో గానం చేస్తూ ఒగ్గు పూజారులు చేసే మల్లన్న పవళింపు సేవ కూడా చక్కని కథా గానం లాగా ఉంటుంది. బ్రాహ్మణులు పూజారిగా ఉండి ఆగమశాస్త్ర నియమాలననుసరించి పూజలు నిర్వహించే ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో ఉన్నట్లుగానే మల్లన్న క్షేత్రాలలో కూడా కొన్ని సంప్రదాయాలు కనిపిస్తాయి. ఒగ్గు వారు చేసే మేలుకొలుపు పవళింపు పాటలలో కనిపించే "చిలుకలకు చేరాల చిన్ని కొమురెల్లి – హంసలకు చేరాల ఆదికొమురెల్లి/ బండల సొరికెల ఉన్న బాల కొమురెల్లి" వంటి ప్రయోగాలను బట్టి ఈ మేలుకొలుపు కథాగానం ప్రధానంగా సిద్దిపేట జిల్లా చేర్యాల దగ్గర ఉన్న కొమురవెల్లి మల్లికార్జున క్షేత్రంలోనే ప్రారంభమై ఉండవచ్చని తెలుస్తుంది. ఇందులో వర్ణించబడిన "స్థాలికయి స్తంభాలు చదరు మండపాలు / సఖియలందరు గూడి చల్ల చేయంగా" వంటి వర్ణనలు చిత్రాత్మకంగా మనసుకు రూపు కట్టడంతో పాటు కథాగాన ఆవిర్భావ కాలంనాటి సామాజిక పరిస్థితులను తెలుపుతున్నాయి. ఈ మేలుకొలుపులు పవళింపులు కేవలం క్షేత్రాలలోనే కాకుండా మల్లన్నఒగ్గుకథ లో కూడా గానం చేస్తారు. ఈ విధంగా గ్రామీణ పలుకుబడులతో కూడిన చక్కని భాషా ప్రయోగాలు, వచనాత్మక గేయాలుగా ఒగ్గు పూజారులు చేసే మేలుకొలుపులు దేశీయ భాషలలో ఆవిర్భవించిన తిరుప్పావై వంటి భక్తి సాహిత్యంతో సమాన ప్రాధాన్యం కలిగి ఉన్నాయని చెప్పవచ్చు.

### 3.8.5. ఎల్లమ్మ కొలుపులు

భారతీయ సంస్కృతిలో మాతృస్వామ్య వ్యవస్థ, శక్తి ఆరాధన అత్యంత ప్రాచీన సంప్రదాయాలు. ఒగ్గు కథలన్నింటిలో ప్రధానమైన మొక్కుడు కథ గా భావించే ఎల్లమ్మ ఒగ్గు కథలో ఈ విషయాలు కనిపిస్తాయి. తనకు పసుపు బండారి తెచ్చిన తమ్ముడు మల్లయ్యకు ఏడు గవ్వలు పంపి ఈ ఏడు గవ్వల కట్టినవాడు మనకు ఒగ్గు పూజారిగా పూజలు చేస్తాడని ఎల్లమ్మ చెప్పినట్లు ఒగ్గు కథలలో చెప్పబడింది. మల్లన్న ఎల్లమ్మ దేవతల పూజ కోసమే ఒగ్గువారు, ఒగ్గు కథలు ఆవిర్భవించాయి. అందుకే ఒగ్గుకథకులు మిక్కిలి భయభక్తులతో ఎల్లమ్మ కథాగానం

నిర్వహిస్తారు. కథాగాన సమయంలో అనేక సందర్భాలలో భక్తితో పరవశించిపోయి ఎల్లమ్మ స్తుతి చేస్తారు. ఒగ్గు కథలలో భాగంగా ఎల్లమ్మ తల్లిని చుక్క సత్తయ్య భక్తితో స్తుతించిన ఒగ్గుకథా గేయాలు విశేషంగా ప్రజాదరణ పొందాయి.

"ఒక్కొక్క డప్పంట ఒక్క శివసత్తంట
కాలు కదిలించమ్మో మావురాల ఎల్లమ్మ గద్దె కదిలించమ్మో మావురాల ఎల్లమ్మ
రెండేసి డప్పులు ఇద్దరు శివసత్తులు – గుగ్గిలము బండారి యాపరిల్లలు చేత "రెండేసి"
మూడేసి డప్పులట ఎంట శివసత్తులట వీర గొడుగులు కోడే ఒగ్గులు నిన్ను గొలువ "మూడేసి"
జమిడికలు జాగంటల్ కిన్నెరలు నాదుల్ల– నినువాహన జేయ్యంగా మూర్తులు నిండంగ నాల్గేసి.
ఏ వాడలున్నావో మావాడ రావమ్మా – గండ జ్యోతులు కొండ బోనాలు బండ్లమ్మ "ఐదేసి"
పిడికిటి నడుముల పికిలి కుంచాలమ్మ – అమర గజ్జలు మ్రోగా నాటలాడవేతల్లి "తొమ్మిది"
లలన బంగరు బొమ్మ వనిత ముద్దులగుమ్మా – జమదగ్ని ఇల్లాల జగదేక సుందరి "పాదేసి"
తలుకు తలుకు మెరియంగ తల కురులు జారంగ.
తల యందు నాగేంద్ర నీసక్కదనమ్మమ్మా
చెక్కుటద్దలు మెరియ ముజ్జగము నినుగొలువ –ఏ వాడలున్నవో మా వాడ రావమ్మ
కాలు గదిలించమ్మో మావురాలెల్లమ్మ
వాసిగా మాణిక్యపురం చౌదరి పల్లి సత్తయ్య నిన్ను బొగుడ సల్లంగా కరుణించు
ఏ వాడలున్నవో మా వాడ రావమ్మ – కాలు గదిలించమ్మో మావురాలెల్లమ్మ" **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గుకథ)**

కవినామాంకిత ముద్రతో ఉన్న ఈ ఎల్లమ్మ స్తుతి గేయాన్ని చుక్క సత్తయ్య వ్రాసి గానం చేశారు. డప్పుల శబ్దాన్ని శివసత్తుల రూపాన్ని ఉత్తరోత్తరా పెంచుకుంటూ అమ్మవారి విశ్వరూపాన్ని వర్ణించారు. గుగ్గిలం, బండారు వేపమండలతో గవ్వల పేర్లు పాములతో అలంకరించబడిన ఎల్లమ్మ తల్లి రూపాన్ని కోడె ఒగ్గుల కొలుపులలో జమిడిక వంటి వాద్యాల చప్పుళ్ళతో జమదగ్ని ఇల్లాలిగా, జగదేక సుందరిగా వర్ణించారు. చుక్క సత్తయ్య గారు రాసిన ఈ గేయం ఖండగతిలో డప్పు శబ్దానికి అనుకూలంగా సాగి వినేవారికి భక్తి పారవశ్యాన్ని కల్గిస్తుంది.

"శివ నందుల మావురాల ఎల్లమ్మ తల్లి – సిద్ధులకు చెల్లెలంట ఎల్లమ్మ తల్లి
ఆవునూరు కొండాపురం ఎల్లమ్మ తల్లి – ఆమంచ గిరులంట ఎల్లమ్మ తల్లి
ముత్యపు గుండు ఎక్కినది ఎల్లమ్మ తల్లి –మునిగి జలకమాడినది ఎల్లమ్మ తల్లి
పగడపు గుండు ఎక్కినది ఎల్లమ్మ తల్లి – పై జలకమాడినది ఎల్లమ్మ తల్లి

ఎల్లమ్మ తల్లి ఆదేవంత ఆపుడు కోల ఎల్లమ్మ తల్లి – భూదేవి అంతా దీటి గోల ఎల్లమ్మ తల్లి

వేసినది ఎడమబందు ఎల్లమ్మ తల్లి ఎల్లమ్మ–వెళుతుంది జగమ్మీద ఎల్లమ్మ తల్లి" **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గుకథ)**

శివునికి బిడ్డ సిద్ధులకు చెల్లెలయిన ఎల్లమ్మ తల్లి అలంకరణ గురించి విస్తృత వర్ణ ఈ స్తుతిగేయంలో కనిపిస్తుంది. పన్నీట జలకమాడి, కలియాప చీరకట్టిన ఎల్లమ్మ తల్లి సూర్యుని చుక్క బొట్టుగాను చంద్రుని జడకోప్పు గాను ధరించి ఉందని చెప్పడం ఎల్లమ్మ విశ్వరూపాన్ని నయనగోచారం చేస్తాయి. తాచు పాముల తలకిరిటాలు, జెర్రిపోతుల జంజరాలు శత్రు పాముల చేతి చౌకట్లు(చేతికి వేసుకునే గాజులు) తుంట పెంజరాల తుళ్మ (తుశ్మ అనేది గతంలో స్త్రీలు ధరించే కంఠాభరణం మెడకు బిగుతుగా గజ్జెలతో కూడిన హారం)గా ధరించడం ఇలా రక రకాల పాములను ఎల్లమ్మ ఆభరణాలుగా ధరించిందని అభివర్ణించారు. సాధారనంగా జానపదులు పామును ఎల్లమ్మకు ప్రతిరూపంగా భావించి పూజిస్తారు. అందుకే అలాంటి పాములన్నింటిని ఎల్లమ్మ ఆభరణాలుగా వర్ణించడం జరిగింది. గవ్వలను కూడా ఎల్లమ్మతల్లి చిహ్నాలుగా భావించి పూజిస్తారు. అందుకే వివిధ పరిమాణంలో ఉన్న గవ్వలను ఎల్లమ్మ రకరకాలుగా అలంకరించుకుందని అభివర్ణించారు. ఎల్లమ్మ ఒగ్గకథలో పరశురాముని బాధకు భరించలేక ఎల్లమ్మ జోగురాలు అవతారమెత్తి జాలిచక్రాపురానికి వెళ్ళే సమయంలో ఈ ఎల్లమ్మ వర్ణన కన్పిస్తుంది.

"ఆ రామ శ్రీ రామ అయోధ్య రామ అయోధ్యరామ

శ్రీ రామ జయ రామ జమదుర్గదేవి జమదుర్గదేవి శిరస్సున నాగన్న పడిగెలెలుగంగా /

నీ రూపు నీ రాక నీ చక్కదనం నీ చక్కదనం / నీలవరులను గన్నా రేణుకెల్లమ్మ రేణుకెల్లమ్మ పుట్ట పుట్టల ఎల్లు ఈ పుట్టలలెల్లు ఈ పుట్టలలెల్లు / పుట్టచుట్టూ తిరుగోల పుట్టు పాపలు

గట్టుగట్టున ఎల్లు ఈ గట్టునెల్లు ఈ గట్టునెల్లు

అగ్గిదేవుడెదురు గుగ్గిలమెదురు గుగ్గిలమెదురు

ఏగేటి జమిడీక మ్రోగే కిన్నెరలు మ్రోగే కిన్నెరలు

నీ కొలుపు కొలువంగా మూర్తి నిండంగా మూర్తి నిండంగా

ఎల్లుఎల్లవే ఎల్లు ఎల్లమ్మ రావో ఎల్లు ఎల్లమ్మ రావో ఎద మీద గవ్వల పేరులల్లాడ పేరులల్లాడ" **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గుకథ)**

ఎల్లమ్మ ఒగ్గు కథలో పరశురామునికి భయపడి జాంబవులు లందలో దాగి వున్న

ఎల్లమ్మ బయటకు రప్పించడానికి పరశురాముడు బైండ్లవానిగా రూపమెత్తి, చెల్లెలు ఈలగౌరీని వీరజోగురాలుగా చేసుకుని జోగెత్తి తెచ్చిన వస్తు సంభారాలతో పట్నం వేస్తాడు. అనంతరం భూమి లోపల సేదతీరుతున్న ఎల్లమ్మకు ఉగ్రరూపం తెప్పించడానికి ఎల్లమ్మ కొలుపు చేస్తాడు. ఈ ఎల్లమ్మ స్తుతి ఒగ్గుకథ పద్ధతులలో కాకుండా భవనీల వారి పద్ధతిలో గానం చేయబడుతుంది. నాగుపాము అవతారంలో పుట్టలో దాగున్న ఎల్లమ్మ బయటకు వెళ్లిరమ్మని అలా బయటకు వస్తున్న ఎల్లమ్మను పుట్టుపాపలు, గావు పిల్లలు, ఘటముకుండలు, మేకపిల్లలతో ఎదుర్కొంటామని, వీరగోల, చురకత్తి, బల్లెము వంటి ఆయుధాలు ధరించి బయటకు రమ్మని, ఎల్లమ్మకు ఉగ్రం వచ్చి నడుస్తుంటే ఎద మీద గవ్వల దండలు కదులుతున్నాయని ఎల్లమ్మ రూపాన్ని పూజా విధానాన్ని కళ్ళ ముందర సాక్షాత్కరింప చేస్తారు. ఈ విధంగా ఎల్లమ్మకు ఉగ్రరూపం తెప్పించి బయటకు రప్పించే విధంగా చేసే ఒగ్గు కథ గానం డోలు దప్పుల సహకారంతో కోలాహలంగా సాగుతుంటే శివసత్తులంతా మూర్తులు నిండి శిగాలుగుతారు. అలా ఉగ్రరూపంలో ఎల్లమ్మ బయటకు వచ్చిందని చెప్పి ఎల్లమ్మను “ఎల్లు ఎల్లవే ఎల్లు మావురాలెల్లు ఓ మావురాలెల్లు” కథా గానం చేస్తూ శాంతింపజేస్తారు.

నీవు సంతానాన్ని విడిచిపెట్టి దాగి ఉన్నావు, మీ పుత్రుల మైన మేము అంతా నీకోసం వివిధ రకాల వేషాలో వచ్చామని అని చెప్పడంలో శక్తి దేవతలను పూజించే వారంతా ఎల్లమ్మ సంతానానికి సంబంధించిన వారుగా చెప్పబడింది. పరశురాముడు పంబాల వేషంలో పట్నం వేసి ప్రార్ధన చేయగా పుట్టలోని నుండి రేణుక ఎల్లమ్మ బయటకు వస్తుంది. రేణుక ఎల్లమ్మను వేడుకుంటూ పాడే మంగళ హారతి చుక్క సత్తయ్య గారి నామాంకితంగా రాయబడినట్లు కనిపిస్తుంది.

“మంగళం మైరాసఎల్లమ్మ, మహి మండలమున నిండి వెలిగిన దండి దేవతా
॥ మంగళం మైరాసఎల్లమ్మ ॥
మంగళం మైరాస రేణుక మమ్ము రక్షణ చేయుమమ్మ
అంగనామణులొసగు బంగరు హారతులు గొను కన్నతల్లి
ఎట్టి ప్రశ్నలు ఎరుగనోయమ్మ నీ కరుణతోటి వ్రాసీతీ ఈ చిన్నిపాటమ్మా
॥మంగళం మైరాసఎల్లమ్మ ॥
వాసిగా మాణిక్యపురము మంచినీళ్ల బాయికాడ
నిక్కముగా చుక్క సత్తయ ఎల్లవేళలా నిన్ను గొలుచును ॥ మంగళం మైరాసఎల్లమ్మ”

(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గుకథ)

ఈ విధంగా ఒగ్గు కథ లో కథాగతంగా అనేక సందర్భాల్లో ఎల్లమ్మ స్తుతి కనిపిస్తుంది. వీటిలో కొన్ని ఎల్లమ్మ ఒగ్గు కథలో తప్పకుండా గానం చేసేవి. మొదటి చివరి రెండు గీతాలలో కవి నామ ముద్రను బట్టి వీటిని చుక్క సత్తయ్య గారు రాసి సందర్భానుసారంగా ఒగ్గు కథలో గానం చేసినట్లు తెలుస్తుంది. శిష్ట సాహిత్య రచనలయిన సంకీర్తనలలో కనిపించే కవినామాంకిత సాంప్రదాయం చుక్క సత్తయ్య గారి ఎల్లమ్మ స్తుతిలో కూడా కనిపించడం విశేషం. చక్కని మాండలిక భాషలో, తాళ బద్ధమైన మాత్రాఛందస్సులో ఉన్న ఎల్లమ్మ భక్తి గీతాలు ఒగ్గుకథాసాహిత్యంలో ప్రత్యేకమైనవి. ఈ ఒగ్గు కథ భక్తి గీతాలు పరిశీలిస్తే భారతీయ సంస్కృతిలోని మాతృ దేవతారాధన, వేదకాలం నాటి మాతృస్వామ్య వ్యవస్థ మొదలైన విశేషాలు తెలుసుకోవచ్చు.

### 3.8.6. మంగళ హారతులు

కథాగాన వస్తువు ఏదైనప్పటికీ మంగళప్రదంగా ముగించడం తెలుగు వారి సాంప్రదాయం. జానపద సాహిత్యంతో పాటు ప్రాచీనసాహిత్యంలోని కథలన్నీ చాలావరకు శు భకరమైన ముగింపును కలిగిఉంటాయి. తమతో పాటు సమాజంలో ఉన్న ప్రజలందరూ బాగుండాలనే ఆలోచన మంగళకరమైన ముగింపు సాంప్రదాయంలో కనిపిస్తుంది. వీర, కరుణ రస ప్రధానంగా గానం చేయబడే ఒగ్గుకథ ఇతివృత్తాలలో కష్టాలు, కన్నీళ్లు, యుద్ధాలు, బాధలు వర్ణించబడ్డప్పటికీ చివరికి కథను సుఖాంతంగా ముగిస్తారు. కథను శుభంగా ముగించడంతో పాటు ఈ కథాగానం చేసిన వారికి, చేయించిన వారికి కథాగానానికి సహకరించిన వారికి, విన్నవారికి సకలశుభాలు కలగాలని ఆశీర్వదించే ఫలశ్రుతి కూడా ఒగ్గు కథగానం చివరలో కనిపిస్తుంది. ఈ విధంగా మంగళకరమైన ముగింపు చేయడంతోపాటు దైవస్తుతి చేస్తూ మంగళహారతి పాడి ఒగ్గుకథ గానాన్ని ఆపుతారు. ముగింపులో మంగళహారతి అనేది భజన సాంప్రదాయం నుండి ఒగ్గుకథలో చేరిన విషయమని భావించవచ్చు. సాధారణంగా మంగళహారతి సాంప్రదాయం కూడా చుక్క సత్తయ్య కథాగానధోరణిలో ఒక విధంగానూ,మిద్దె రాములు ఒగ్గుకథ ధోరణిలో మరొకవిధంగా కనిపిస్తుంది.

"హార నివాళి మంగళార నివాళి ధీరుడా శ్రీశైల వాస ఇదిగో నివాళి
గణ గణ గంటిత్తు–గంట నాదిత్తును, గన్నేరు పువ్వల్ల నిన్ను పూజిత్తును,
ఎప్పుడూ పూజిత్తు ఏక చిత్తారికి, చిత్తారి దాల్చిన సిరిమేడలమ్మకు
సత్యమైన గొల్ల కేతమ్మకు. ॥హార నివాళి॥
ఆరెభాషలు నేర్చి అమర పెళ్లి కొడుక నీకారతి... ॥హార నివాళి॥

మంగళం భగవాన్ విష్ణు, మంగళం పుండరీకాక్ష శ్రీమద్భగవద్గురు, పరమగురు,పరమేశ్వర గురుభ్యోనమః మల్లికార్జున స్వామి దేవా నీకు మంగళం ఎలాకోటి, ఎలా కోటి రామా...

అరువైయారుకోట్ల ఆదిగణాలు, ముప్పదిమూడుకోట్ల ముద్రగణాలు, డెబ్బైయేడుకోట్ల దేవాగణాలు సూర్యుడు, చంద్రుడు, గంగ, యగ్నోత్రుడు సురా ముప్పదిమూడు కోట్ల దేవతలు ఎలా కోటే.." **(చుక్కసత్తయ్య. మల్లన్న కాపులఘట్టం ఒగ్గుకథ)**

"మంగాళమాని పాడరే మల్లయ్య నీకు వత్తామాని చెప్పరే

పూలు బండారు దెత్తు పూజకాడ నేను ఉందు / హారతీయ నేను వత్తు భారతీయ నేను వత్తు

వత్తామాని చెప్పరే నా ఆరుకోట్ల అయ్యాలాకు దండామాని చెప్పరే

మల్లెపూల దండ దెత్తు మల్లయ్య మెడల వేత్తు / కోర్కెతోటి నేను వత్తునో కొమిరెల్లి మల్లు

మంగళం మంగళం మహాదేవ మంగళం మంగలనీరాజనం నైవేద్యం సమర్పయామి, బృహస్పతీ నమస్తుతే, ధనం ధాన్యం, పశు, పుత్రలాభం శతసంవత్సర సువర్ణకలశే దీర్ఘమాయు.."
**(మిద్దె రాములు ఐదు మల్లె పూల ఒగ్గుకథ)**

ఈ రెండు రకాల మంగళహారతులు పరిశీలిస్తే వీటిలో ఒగ్గువారి ప్రధాన దైవం అయిన మల్లన్నదేవుని స్మరణ మొదటగా కనిపించి అనంతర చరణాలలో ఇతర దేవతలను, మల్లన్న దేవుని పరమభక్తులైన ఆచారమంతులను స్మరించినట్లు తెలుస్తుంది. అలాగే ఈ రెండు గేయాల చివర ఉపయోగించిన మంగళాశాసనంలో కనిపించే సంస్కృత పదజాలం బ్రాహ్మణుల ఆశీర్వాద మంత్రాలను అనుసరించినట్లు తెలుస్తుంది. ఈ మంగళాశాసనంలో తత్సమపదాలతో పాటు అచ్చతెలుగు పదాలు ఉండడం విశేషం. కులగురువు స్థానంలో ఉన్న ఒగ్గుకథకులు ఆశీర్వదించే సమయంలో బ్రాహ్మణులను అనుకరించటం వల్ల, కథకుల పాండిత్య ప్రదర్శన వలన ఇటువంటి సంస్కృత పదజాలం ఒగ్గుకథలో చేరి ఉండవచ్చు.

3వ. అధ్యాయం

# పాద సూచికలు

1. మన్నెబోయిన జయదేవ్ యాదవుల జానపద ప్రదర్శన కళలు, పుట. 105

2. తూమాటి దొణప్ప, జానపద కళాసంపద, పుట. 189

3. నమస్తే తెలంగాణ, ఒగ్గుకథా బృందం నృత్యం, ప్రత్యేక వ్యాసం, 22.11.2020

4. చుక్కా సత్తయ్య, ఒగ్గుకథకుల వేషధారణ- ప్రదర్శన విధానం గురించి పరిశోధకురాలుతో వివరించిన విశేషాలు.

5. చౌదరిపల్లి అంజయ్యగారు పరిశోధకురాలితో ఒగ్గుకథల్లో నవరసాల గురించి వివరించిన ప్రత్యేక విశేషాలు.

6. చౌదరపల్లి అంజయ్యగారు పరిశోధకురాలితో ఒగ్గ డోలు నృత్యం గురించి వివరించిన సందర్భంలోనిది.

# 4

# నాలుగవ అధ్యాయం

## ఒగ్గు కథ - సాహిత్య భాషాంశాలు

# అధ్యాయం-4

# ఒగ్గు కథ - సాహిత్య, భాషాంశాలు

## 4.1. పరిచయం

సాహిత్యం మీద ఆయాప్రాంతాల పాలకుల ప్రభావం తప్పకుండా ఉంటుంది. ఒగ్గుకథ తెలంగాణా ప్రాంతానికి చెందింది. అందువల్ల ఒగ్గుకథా సాహిత్యంపై తెలంగాణాలోని భాషా ప్రభావం ఉంటుంది. తెలంగాణా ప్రాంతాన్ని నిజాం రాజులు పరిపాలించడం వల్ల ఇక్కడ ఉర్దూ భాషా ప్రభవం ఎక్కువగా ఉంటుంది. ముస్లింల సాహిత్యం వల్ల ఏర్పడిన ఉర్దూ పదాలు అనేకం వీరి భాషలో చేసుకున్నాయి.

ఒగ్గుకథ గేయ, వచన రూపంలో ఉండి జన సామాన్యంలోని మాటలను, అలంకారాలను,నుడికారాలను తనలో ఇముడ్చుకుంటుంది.పద్యాలు ఒగ్గు కథలో ఉండవు. కఠిన పదాలు,దీర్ఘ సమాసాలు ఇందులో చోటు చేసుకోవు. జానపదుల సాహిత్యం ఎంత సరళంగా,సుందరంగా ఉంటుందో వారి భాష కూడా అంతే సరళంగా ఉంటుంది. సామాన్య ప్రజానీకం నిత్య జీవితంలో ఉపయోగించే భాషే ఈ సాహిత్యానికి ఆధారం. కాబట్టి వ్యావహారిక భాషతో పాటు అన్నిరకల వ్యావహారిక రూపాలు ఒగ్గుకథలో చోటు చేసుకుంటాయి. అనగా యాసలు, మాండలికాలు, పలుకబడులు, సామెతలు, నానుడులు,మారుమూల పదాలు, అన్య దేశ్యాలు,ఇతరాలు ఒగ్గుకథా సాహిత్యంలో చోటు చేసుకున్నాయి. ఒగ్గుకథా సాహిత్యంలో అలంకారాలు,నవరసాలు కూడా ఉంటాయి. ఇంకా ప్రేక్షకుల్ని ఆలోచింపజేసే చిత్ర ప్రశ్నలు, ద్వంద్వార్థాల మాటలు,కొన్నిసార్లు అనుచిత పదాలు (బూతుపదాలు) ఒగ్గు కథా సాహిత్యంలో చోటు చేసుకుంటాయి.

**జానపదుల భాష** : జానపదసారస్వతానికి, జానపద వాఙ్మయానికి జాన పద భాషయే మూలధారం. వారి భావాల వలెనే భాష కూడా జీవకళ ఉట్టిపడునదిగా ఉంటుంది. చెప్పదలచిన విషయాన్ని సూటిగా హృదయానికి తాకునట్లు చెప్పబడునేకానీ, కవి ప్రౌఢకృతులవలె కఠినబోధనంగా ఉండదు. వ్యాకరణపు మూసలో యిముడదు. అందుచే వారిభాషను శిష్టులు గ్రామ్యమని ఎద్దేవాచేస్తారు. కారణం తెలుగు భాషా, సాహిత్యాల క్రమపరిణామ వికాస చరిత్ర పై నిబద్ధతతో కూడిన అవగాహన లేకపోవడమే. ఒక్క మాటలో చెప్పాలంటే పట్టభద్రుడగు పండితునకు బాలశిక్ష చదువు నవస్థ పునాదియైనట్లే శిష్టసాహిత్యానికి కూడా జానపదసాహిత్యమే పునాది. అందులోని ఛందో లయ, ధ్వన్యనుకరణపదం, ప్రాస, అనుప్రాసలు, అనుసరణం మొదలగునవి భాషకి సౌందర్యాన్ని

చేకూర్చే అంగాలు. అందువలననే K.Vossler అనే పాశ్చాత్య పండితుడు Its phonetic body is equivalent to its poetic capacity అని పేర్కొన్నాడు. ఈ మాట జానపదభాషకు కూడా పూర్తిగా అన్వయిస్తుంది. ఆ కారణంచేతనే ఎమర్సన్ అనే పండితుడు కూడా As this is the first language, so it is the last- అనగా 'జానపదుల భాషే ప్రాచీనమైంది, మొదటిది' అన్నాడు.

జానపద గేయ సాహిత్యమందుండు భాష వాడుకభాష కనుక యిది కావ్యభాషా వ్యాకరణానికి లొంగదు. వ్యాకరణ విరుద్ధాలగు భాషావిశేషాలు బహుమెండుగ ఉంటాయి. వ్యవహారిక పదరూపాలు, దుష్టసంధులు, దుష్ట సమాసాలు, భ్రష్టరూపాలు, శివకవులుపయోగించినట్టి పదసముదాయం ఎక్కువగా కనిపిస్తాయి. వైయా కరణులకు సమ్మతంకాకున్నా భాషాశాస్త్రజ్ఞులకింపు గొలుపుతాయి. మరియు కోట్ల జనుల నిత్య వ్యవహారంలో ప్రయోగింపబడుటచేనివి తమ వ్యాకరణాన్ని తామే నిర్మించుకొన్నట్లు కనిపిస్తాయని కీ.శే. ఆచార్య బిరుదురాజు రామరాజు గారభిప్రాయపడినారు.

దినవెచ్చము, ప్రాణగొడ్డము వంటి శబ్దములను శిష్టసాహిత్యంలో ప్రయోగించిన శ్రీనాథుడు జానపదులకై రచించిన పలనాటి వీరచరిత్రలో అట్టి శబ్దాలు ప్రయోగించారు. కొలువులో నాయుడు కొనరెట్టవట్టి, కులపగదీర్ప నీకొడుకితడంచు" అనేచోట 'కులపగ' మిశ్రమ సమాసం. అలాగే 'ఘనమైన పంజలు, కనకతప్పెటలు'. ఇది కూడ మిశ్రమసమాసాలే. ఇలా వ్యాకరణమంగీకరింపకున్నను శిష్టకవిప్రయోగమునను, ప్రయోగబాహుళ్యము చేతను సాధువైనది. అట్లే 'ఇతరవస్తులు మోసి యేతెంచునట్టి' - వస్తువులనుటకు మారుగా వస్తులనుటచే ప్రథమావిభక్తి ప్రత్యయం లోపించింది. ఇట్టి ప్రయోగాలు శివకవులు అధికంగా చేశారు.

'దేశింగురాజుకథ'లో 'ఘనగుఱ్ఱము' వంటి మిశ్రమ సమాసాలు అధికం. కోళ్ళ (కొల్లగొట్టుట), ఒళ్ళుకు (ఒడలికి) వంటి వ్యవహారికరూపాలున్నాయి. 'బొబ్బిలిపదం'లో తయారుగన్నండి. భేటికి రన్నండి, తెన్నండి వంటి రూపాలు తయారుగండు, భేటికి రెండు, తెండు అనుటకు మారుగా వాడబడినాయి. గొల్లున, భల్లున నవ్వులనుటకు మారుగా మల్లు నవ్వులు అనినాడు. ఉల్పాయ, ఉలుఫా (కానుక) శబ్దానికి వ్యవహారికరూపం. 'అలంగారము యెక్కినారు భేరీస్త్రీలు' అనుచోట 'అలంగము' శబ్దం అలంగారముగా మారింది. అలంగము అంటే కోట ప్రాకారపు గోడకు మట్టిచేతగాని, రాళ్ళచేతగాని ఏర్పరుపబడిన కొఱడు. అలాగే రవిడిగుండ్లు దొరలించినారు భేరీస్త్రీలు'. శత్రువులపై

కోటమీద నుండి దొరలించెడి గుండ్లు. రావడిగుండ్లు రవిడిగుండ్లైనాయి. ఈ విధంగా బొబ్బిలిపదంలో అధికంగా వ్యావహారిక ప్రయోగాలున్నాయి. ఇది సిసలైన జానపదగేయం కాబట్టి భాషయంతయూ వ్యావహారికమే ఉదాహరించుట అనవసరం; మరొక పదమైన 'కాంభోజరాజుకథ లో బ్రాహ్మణుడు రాజుగారిని, 'స్వయంపాకము ఇప్పుడియ్యుము సదావర్తి ఇప్పుడియ్యుము' అంటాడు. సదావృత్తి అనేది సదావర్తిగా మారింది. 'సదావృత్తి' అనగా బైరాగులు లోనగు వారికిచ్చెడి వంటసామాగ్రి. మాణిక్యాల దేవిని 'శరాబందికాన' లో ఉంచిరి. చెరమరియు బందిఖానా శబ్దాలు కలిసి 'కత్తిచాకు; 'గేటుతలుపు' వలె శరాబందికాన యైంది. తల్లి చెరలో నుండగా పుట్టినవాడు కాబట్టి 'శరాబందిరాజు' అయినాడు. ఇలాంటివే క్షత్రియ గొడుగు (ఛత్రము గొడుగు) మరియు బారాపన్నెండు వంటివి. 'అట్లే శ్రీవరాహ చరిత్రంలోని మృగజంతువు, సప్తయేడులోకాలు, రణయుద్ధం మొదలగునవి.

## 4.2. సంధి - సమాస రూపాలు

సంధి రూపాలు : ఒగ్గుకథా సాహిత్యంలో రకరకాల సంధి రూపాలు కనబడతాయి. కొన్ని సంధులు సూత్రాలకు లోబడి వుంటే మరికొన్ని సంధిరూపాలు నిబంధనలను అతిక్రమిస్తాయి. ఇది జానపద సాహిత్యంలో అందరికీ సమ్మతమైన విషయమే.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | అ | + | అ | = | ఆ |
| | శారదా | + | అ | = | శారదాంబ |
| 2. | అ | + | ఉ | = | ఓ |
| | తెప్ప | + | ఉత్సవం | = | తెప్పత్సవం |
| 3. | ఇ | + | ఇ | = | ఈ |
| | తెచ్చి | + | ఇత్తు | = | తెచ్చిత్తు |
| 4. | ఉ | + | అ | = | అ |
| | బాపు | + | అమ్మ | = | బాపమ్మ |
| 5. | ఎ | + | అ | = | అ |
| | కంటె | + | అదిరిపడి | = | కంటదిరిపడి |
| 6. | గ్ | + | క్ | = | క్క |
| | అడుగు | + | కొని | = | అడుక్కొని |
| | నాలుగు | + | కోళ్ళ పట్టె మంచం | = | నాలుక్కోళ్ళ పట్టె మంచం |
| 7. | ల్ | + | ల్ | = | ల్ల్ |

| | | | | |
|---|---|---|---|---|
| నెల | + | లు | = | నెల్లు |
| చాల | + | లేక | = | చాల్లేక |

పర పదం మొదటి ప, వ – లు లోపించి, అచ్చులు వచ్చే రూపాలూ కనబడుతుంటాయి.

| | | | | |
|---|---|---|---|---|
| ఐదు | + | పొద్దులు | = | ఐదొద్దులు |
| మూడు | + | పొద్దులు | = | ముప్పొద్దులు |
| పచ్చి | + | వడ్లు | = | పచ్చొడ్లు |

సమాసరూపాలు : దుష్ట సమాసాలు, వైరి సమాసాలు అని లాక్షణికులు వేటినైతే అంటారో అలాంటి రూపాలు ఒగ్గుకథ సాహిత్యంలో కనిపిస్తుంటాయి. ఇది తత్సంమ,ఇది ఆచ్ఛికం అనే విచక్షణ జానపదులకు లేకపోవడమే దీనికి కారణం.కొన్ని అన్య దేశ్యాలు కూడా సమాసాల్లో కనబటుతుంటాయి.

1. తెలుగు పదం + సంస్కృతపదం

   తెప్పోత్సవం

   తల్లిదండ్రాదులు

2. సంస్కృతం + తెలుగు

   హస్త కడియాలు, కవాట పందెములు, కనకగద్దె, బహువన్నెకాడు, ఇతర సొమ్ములు, సర్వచోటులు.

3. సంస్కృతం + తెలుగు + సంస్కృతం

   సప్త యేడు లోకములు

4. ఉర్దూ + తెలుగు

   బాపమ్మ, మీ బాపు, శానతనము, తీని పీటలు, బారా పన్నెండు.

5. ఉర్దూ + తెలుగు = సంస్కృతము

   మైదాకువనము

**4.3. క్రియరూపాలు – ధ్వని పరిణామాలు**

జానపద భాషా స్వరూపాల్లో కొన్ని సాధారణమైన మార్పులను గమనిస్తే శిష్టోచ్చారణకు, జానపదోచ్చారణకు బేధం స్పష్టంగా కనబడుతుంది. డా. భద్రిరాజు కృష్ణమూర్తిగారు ఈ విధంగా పొందుపరిచారు.

| శిష్టోచ్చారణ | జానపదోచ్చారణ |
|---|---|

| | |
|---|---|
| 1(ఎ) ఒత్తులు నిలుస్తాయి. | 1(ఎ) ఒత్తులుపోతాయి. |
| భాగవతం, ధర్మం | బాగవతం, దర్మం |
| (బి) 'హ' కారం నిలుస్తుంది | (బి) 'హ' కారం పోతుంది. |
| హరివిల్లు, రోహిణి | అరిల్లు, రోయిణి |
| (213) రావాలి. | |
| 7. 'ట' 'ప' వేరుగా ఉంటాయి. | 7. 'ట' 'ప' గా మారుతుంది. |
| ఆఫీసు, కాఫీ, తోపు | ఆపీసు, కాపీ, తోపు |
| 8. పదాది 'గ' కారం దేశ్య శబ్దాల్లో నిలుస్తుంది. | 8. 'గ', 'గె', గా మారుతుంది. |
| గట్టు, గడ్డ, గండి | గెట్టు, గెడ్డ, గెండి." [1] |

జానపదుల భాషలో స్థూలంగా కనిపించే బేధాలివి.ఇవేగాకుండా సూక్ష్మంగా పరిశీలిస్తే మరికొన్ని రూపాలు కనబడతాయి.

**వర్ణసమామ్నాయం-**

అచ్చులలో 'అ'. 'ఆ' లకు 'ఎ', 'ఏ' లకు మధ్యగా వుచ్ఛరించబడే 'అ', 'ఆ' వర్ణాలు జానపదుల వాడుకలో ఎక్కువగా వినబడతాయి. ఇ, ఎ,లకు హ్రస్వ అకారంతో సంధి జరిగినపుడు దీర్ఘ 'ఆ' కారమూ వినబడుతుంది.

| | | | | |
|---|---|---|---|---|
| గుడిసె | + | అంటివి | = | గుడిసంటివి |
| పాడి | + | ఆవు | = | పాడావు |
| లేవు | + | అని | = | లేవని |

**నామ విభక్తులు:-**

జానపదుల వ్యవహారంలో వాడు - వోడుగా ,ఓడుగా మారుతుంది.

| | | | | |
|---|---|---|---|---|
| పేద | + | వాడు | = | పేదోడు |
| చాకలి | + | వాడు | = | సాకలోడు |
| మా | + | వాడు | = | మావోడు |

తోడ - తోన్ ప్రత్యయాలకు రూపాంతరాలై తోడటి - తోను, తోని - తోనగా మారతాయి.

| | | |
|---|---|---|
| మాతోడ వస్తాడు | - | మాతోడి వస్తాడు. |
| చింత బరికెతో | - | చింత బరికతోని |

జానపద సాహిత్యంలో మార్పులెన్నో జరుగుతున్నాయి. మార్పులెట్లు జరుగుతున్నాయనటా నికి కారణాలు అనేకం. ఎటువంటి మార్పులు జరుగుతున్నాయనేది తెలుసుకోవడం అవసరం. జానపద సాహిత్యంలో మార్పులు పరిశీలిస్తే చాలా వరకు ధ్వనిపరంగానే ఉన్నాయి.

ధ్వనిపరిణామం గురించి డా. కృష్ణకుమారి గారి అభిప్రాయం ఈ విధంగా వుంది. "భాషా నిర్మితికి ధ్వనులు ఇటుక రాళ్ల వంటివి. ప్రాచీన భాషకు, వర్తమాన భాషకును మధ్య వంతెనలు నిర్మించినట్లుగా నమరిన యనేక లక్షణములీ ధ్వని పరిణామమునకు చెందినవే. ఈ మార్పు, జీవభాష యందు ఏ భాష యందైనను జరుగుచుండును".

ధ్వని పరిమాణ క్రమాన్ని సూచించేవి వర్ణసమీకరణం, వర్ణ వ్యత్యయం, అచ్చులోపం, దీర్ఘలోపం, లోపదీర్ఘత వంటి అనేకాలైన మార్పుల్ని మనం చూడటానికి వీలుంది. ఒకే మాటకు భిన్న భిన్న రూపాలంటాయి. ఆ విధంగా ఏర్పడటానికి కారణాలు ఏమిటో ధ్వని పరిణామంలో గమనించవచ్చు.

**ధ్వని పరిణామాలు :**

1. వర్ణవ్యత్యయం-

| | | |
|---|---|---|
| ప్రీతి | - | పీర్తి |
| బర్లు | - | బఱ్రలు |
| చర్నకోల | - | చన్ద్రకోల |
| గుండె బగులు | - | గుండె బలుగు |
| పలగ జీరు | - | పగుల జీరు |

2. వర్ణ నాశనం-

| | | |
|---|---|---|
| ఎక్కడ | - | ఏడ |
| తోడెమంత | - | తోమంత |
| ఎదురు ఊొమ్ము | - | ఎదురొమ్ము |
| పోక చెక్క | - | పోచెక్క |

3. వర్ణ సమీకరణం -

| | | |
|---|---|---|
| మంచె | - | మచ్చె |
| వర్ధి | - | వద్ది |

4. పదం మధ్యలో అచ్చు లోపించి సంయుక్త పదం ఏర్పడడం-

| | | |
|---|---|---|
| ఏడువకండి | – | ఏడ్వకండి |
| కుతికెల | – | కుత్కెల |
| ఎవరికి | – | ఎవర్కి |
| బలగం | – | బల్గం |
| తీసుకుంట | – | తీస్కుంట |
| వెనుకకు | – | యెనక్కు |
| ఆరుగురు | – | ఆర్గురు |

5. లోప దీర్ఘత :

| | | |
|---|---|---|
| గ్రహణము | – | గ్రానము |
| పెండ | – | పేడ |
| మొహిరీలు | – | మోరీలు |

6. దీర్ఘ లోపము :

| | | |
|---|---|---|
| దూడ | – | దుడ్డె |
| త్రోవ | – | తొవ్వ |
| తీనె | – | తిన్నె |
| సోరలు | – | సొర్రలు |
| చీకట్లు | – | చిక్కంట్లు |

7. పదం చివర 'ఇ' లేదా 'అ' , 'ఎ' గా మారుతుంది :

| | | |
|---|---|---|
| కావాలి | – | కావాలె |
| చెల్లి | – | చెల్లె |
| చెయ్యాలి | – | చెయ్యలె |
| వదిన | – | వదినె |

8. 'ఒ' , 'ఎ' గా మారుతుంది :

| | | |
|---|---|---|
| ఊళ్ళో | – | ఊల్లె |
| మంట్లో | – | మంట్లె |
| ఏట్లో | – | ఏట్లె |

9. పదాల మధ్య 'అ' , 'ఉ' గా మారుతుంది :

| | | |
|---|---|---|
| ఎకరాలు | – | ఎకురాలు |

| | | |
|---|---|---|
| పెడతానని | – | పెడుతనని |
| అవసరం | – | అవుసరం |
| ఉంగరం | – | ఉంగురం |

10. ‘ళ’ కారం ‘ల’ కారంగా మారుతుంది :

| | | |
|---|---|---|
| గొళ్లెం | – | గొల్లెం |
| తాళాలు | – | తాలాలు |
| వాళ్లు | – | వాల్లు |
| కళ్యానం | – | కల్యానం |
| పవళింపు | – | పవలింపు |
| మహంకాళి | – | మాంకాలి |

11. పదం ముందు ‘వ’ కారం వస్తుంది :

| | | |
|---|---|---|
| ఆయుధం | – | వయిదం |
| ఇచ్చినారు | – | విచ్చినారు |
| అన్నం | – | వన్నం |

‘గ’ కారం రావడం

| | | |
|---|---|---|
| అట్ల | – | గట్ల |

12. ‘వ’ కారం బదులు ఏదైనా ‘అచ్చు’ వస్తుంది :

| | | |
|---|---|---|
| విభూతి | – | ఇబూతి |
| వస్తుండు | – | అస్తుండు |
| వచ్చి | – | అచ్చి |
| వెలితి | – | ఎలితి |
| వీధి | – | యీది |
| వెండి | – | యెండి |
| విల్లు | – | యిల్లు |
| వేడి | – | యేడి |

13. ‘ణ’ కు బదులు ‘న’ వస్తుంది :

| | | |
|---|---|---|
| కళ్యానం | – | కల్యానం |
| పట్టణం | – | పట్టనం, పట్నం |

| | | |
|---|---|---|
| వీరణాలు | – | వీరనాలు |

14. 'లలో' కు బదులు 'ల్ల' వస్తుంది :

| | | |
|---|---|---|
| తోటలలో | – | తోటల్ల |
| పల్లెలలో | – | పల్లెల్ల |
| రెక్కలలో | – | రెక్కల్ల |
| చుక్కలలో | – | చుక్కల్ల |
| మొద్దులలో | – | మొద్దుల్ల |

15. 'ఎ' 'య' గా మారుతుంది :

| | | |
|---|---|---|
| ఏడ | – | యాడ |
| ఏపాటి | – | యాపాటి |
| వేడి | – | యేడి |
| వెండి | – | యెండి |
| వెనుక | – | యెన్క |

16. 'వెంట' కు బదులు 'పొంటి' వస్తుంది :

| | | |
|---|---|---|
| ఊళ్ల వెంట | – | ఊళ్ల పొంటి |
| పల్లెల వెంట | – | పల్లెల పొంటి |
| తోటల వెంట | – | తోటల పొంటి |
| బావుల వెంట | – | బావుల పొంటి |
| కాలువ వెంట | – | కాలువ పొంటి |

17. 'కడ' కు బదులు 'కాడ' వస్తుంది :

| | | |
|---|---|---|
| మట్టి కడ | – | మర్రి కాడ |
| గుండాల కడ | – | గుండాల కాడ |
| గుంజల కడ | – | గుంజల కాడ |

18. 'సంయుక్తాక్షరాలు' లేని అక్షరాలకు చేర్చడం :

| | | |
|---|---|---|
| మేనమామ | – | మ్యానమామ |
| నేల | – | న్యాల |
| మేడ | – | మ్యాడ |
| మేడల దేవి | – | మ్యాడల దేవి |

| | | |
|---|---|---|
| మేకలు | – | మ్యాకలు |
| లేత | – | ల్యాత |

19. 'చ', 'స' గా మారుతుంది :

| | | |
|---|---|---|
| చస్తనని | – | సత్తనని |
| చస్తే | – | సత్తే |
| చుక్క | – | సుక్క |
| చాకలి | – | సాకలి |
| చవుడు | – | సవుడు |
| పలుచన | – | పలసన |

20. 'దీర్ఘం' లేని పదాలను 'దీర్ఘం' తీసి పలకడం :

| | | |
|---|---|---|
| బీరన్న | – | బీరన్నా |
| ధనము | – | దనమూ |
| చందమామ | – | చందమామా |
| మొగపిల్లలు | – | మొగాపిల్లలూ |
| ఒక్కగడియ | – | ఒక్కా దడియా |
| కొలువు తీరంగ | – | కొలువూ తీరంగా |
| మల్లయ్య | – | మల్లయ్యా |

21. ఒత్తులు లేకుండా పలకడం :

| | | |
|---|---|---|
| స్వామి | – | సామి |
| స్వర్గం | – | సొర్గం |
| వృక్షం | – | రుచ్చం |

22. కథ మధ్యలో 'గని' , 'గనుక' అనే పదాలను ఊతగా ఉపయోగించడం :

ఆ చెల్లి గనుక

తిన్నారు గనుక

ఎల్లిపోత గని

పెట్టినారు గనుక

చెప్త గని

పెల్లాం లేదాయె గనుక

క్రియా రూపాలు : ఒగ్గు కథకులు సంభాషణల్లో, వారి గేయాల్లో లక్షణ బద్ధమైన క్రియారూపాలతో పాటు, మరికొన్ని వింత రూపాలు మాండలికాల యాసల్లో వినబడతాయి.

భూతకాలికాలు(ఉత్తమ పురుషలో)

కానైతి, తాగిన, తలపోస్తి

(మధ్యమ పురుషలో)

తెస్తవి, ఇస్తివి, తెస్తిరి, ఇస్తిరి, వస్తిరి,వచ్చిండు, పాయె, కలిపింది, పోయింది.

భవిష్యత్తద్ధర్మ కాలాలు

కూసో బెడుత, ఉరుకుతవు, కొంటడు, తలుగుతాది, అయితది, మొక్కెగజీత్తాది

ప్రత్యయాంతాలు

సంకనేసుక, తలచుక, తీసుకోని, గుచ్చుకోని

| | |
|---|---|
| చేదర్థకములు | – లేకుంటే, వస్తే, తంతే,జననమైతే. |
| ఉభయ సంప్రార్థనాలు | – పోటుదిగుదాం, తిందాం, లేద్దం, పోదాం. |
| వ్యతిరేకార్థాలు | – కానైతి, మేలుకోదు, వినకపోతి, రానైతి. |
| ప్రశ్నార్థకాలు | – వరు కొట్టింద్రు బీరయ్యా, ఎవరు తిట్టింద్రు, పోసినవ లేదె, చూస్తివా, ఎలా పుట్టిస్తివి |
| తద్ధర్మాత్మక క్రియా విశేషణాలు | – నువు బోయ్యే తోవలోనే, కపిల జోలేచిన్నవానికి, నువ్వు వచ్చేటప్పుడు |

## 4.4. మాండలిక పదాలు

ఒక మండలంలో వాడే పదాలను 'మాండలికాలు' అని అంటారు. డా.ఆర్వీయస్. సుందరం గారు మండలాలను గురించి ఈ విధంగా అన్నారు. "నిర్ణీత జన సమూహాన్ని గాని,నిర్దిష్ట భౌగోళిక పరిధిని గాని మండలం అని పిలవడం కద్దు". ఆ మండలంలోని వారు మాట్లాడే భాషనే మాండలిక భాష అని అంటారు. 'మాండలిక భాష' వ్యక్తులు కులాలను బట్టి, వారు నివసించే ప్రాంతాన్ని బట్టి, చేసే వృత్తిని బట్టి, వయస్సును బట్టి, అక్షరాస్యతను బట్టి, స్త్రీ – పురుష బేధాలను బట్టి మారుతూ ఉంటుంది.

మాండలికాలను విభజించేటప్పుడు వృత్తి పద పరిశోధనను ఆధారంగా చేసుకుని భద్రిరాజు కృష్ణమూర్తిగారు జానపదులు వాడే భాష ఆధారంగా నాలుగు భాషా మండలాలను వారు గుర్తించారు. అవి–

1. పూర్వమండలం – (కళింగ దేశం – శ్రీకాకుళం, విశాఖపట్టణం జిల్లాలు)

2. దక్షిణ మండలం – (రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు)

3. ఉత్తర మండలం – (తెలంగాణా, మహబూబ్ నగర్, ఖమ్మం జిల్లాలో రాయలసీమను ఆనుకున్న తాలుకాలు ఆయా భాషామండలాలల్లో కలుస్తాయి)

4. మధ్య మండలం – ఉభయ గోదావరులు, గుంటూరు, కృష్ణ (జిల్లాలు)'' వివిధ మండలాలను బట్టి మాండలికాలు ఏర్పడతాయి.'' [2]

రతువు – రాయి, పుస్తెలు – మంగళ సూత్రాలు, ముల్లెలు – మూటలు, యేరాలు – తోటి కోడలు, బాయిలి – బావిలో, పెయ్యి – శరీరం, సమురు – నునె, రంది – విచారం, కంటు – పగ, సనివారం – శనివారం, ఇసుర బాటు – విసురు రాయి, గలుమ – ద్వారం, అటిక – మట్టి పాత్ర, అచ్చి – వచ్చి, ఇగం – చలి, వుశికె –ఇసుక, అఱ్ఱ – గది, సమితి – సవితి, ఎంటిక – వెంట్రుక, సీర – చీర, సవురం – క్షవరం, గార్వం – గారాబం, ఆగం – అస్తవ్యస్తన, ఆవుసు – ఆయువు, మ్యాడలు – మేడలు, పోరడు – పిల్లవాడు, పోరి – ఆడపిల్ల, పమానం – ప్రయాణం, సందెయాల – సంధ్యవేళ, మయిమ – మహిమ, తొవ్వ – త్రోవ, పచ్చి – పక్షి, విద్దె – విద్య, మురుగాలు – మృగాలు, బాషింగం – బాసికం, సల్ల – చల్ల, తల్లె – పళ్లె మాల్యం – మాలిమి,శుభలాకలు – శుభలేఖలు,ఒక్కపొద్దు – ఉపవాసం, ముచ్చం – ముత్యం, సూపు – చూపుబీ,నొష్ట – నొసట, మొకం – ముఖం, గోగు – గోవు, శపన – శాపం, యెన్న – వెన్న, ల్యాగ – లేగ, శెణం – క్షణం, తిరుమూర్తులు – త్రిమూర్తులు, అత్తాంది – వస్తున్నది, ఎచ్చు – హెచ్చు, ఉఉచుతున్నారు – ఉమ్మివేస్తున్నారు, అతారం – అవతారం, బ్రమ – భ్రమ, దర్మతి – ధర్మం, జూస్తడు – చూస్తాడు, గావురం – గారాబం, పీర్తి – ప్రీతి, ఒల్కబోదు – ఒలకపోదు, పట్నం – పట్టణం, శికురం – శిఖరం, అతని పొంటి – అతని వెంట, గొడ్డు – గొడ్రాలు, అయిన దినం – మంచిరోజు, ఎత – బాధ, తలము – స్థలము, దునికి – దుమికి, గుల్లు – గుళ్ళు, పెట్టిన్రు – పెట్టి వారు, జాగర్త – జాగ్రత్త, ఎంబడి – వెంబడి, మోగుతాంది – మ్రోగుతున్నది, సరం – స్వరం, యిగో – యిదుగో.

**4.5.ఒగ్గు కథల్లో భాషా సౌందర్యం**

జానపదులు పాడుకునే పాటలను లేదా గేయాలను జానపదగేయాలంటారు. వీటిని ఆంగ్లంలో "Folk songs" అంటారు. ఈ పదము 'Volkslied' అను జర్మన్ భాషాపదానికి

అనువాదము. ఏ భాషలోనైనా మొదట వెలువడేది జానపద సాహిత్యమే. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ భాషలో లిఖిత సారస్వతం వెలువడడానికి ముందు నుండీ ప్రవహించే మౌఖిక సాహిత్యమే జానపద సాహిత్యము.

ఈ అపారమైన జానపద సాహిత్యంలో ప్రధానంగా ఐదు అంశాలున్నాయి. అవి: 1) జానపద గేయాలు 2) కథా గేయాలు 3) కథలు 4) సామెతలు 5) పొడుపు కథలు. వీటిలో అత్యంత ఆదరణ పాత్రమైనవి జానపద గేయాలు. ఇవి అనేక విభాగాల్ని కలిగి ఉన్నాయి. అవి: పౌరాణిక గేయాలు, చారిత్రక గేయాలు, మత సంబంధ, పారమార్థిక, స్త్రీల గేయాలు, శ్రామిక, పిల్లల, శృంగార, అద్భుత, కరుణ హాస్యరసగేయాలు మొ॥నవి.

"జానపద విజ్ఞానంలో ప్రత్యేకశాఖగా పరిగణించదగినంత వ్యాప్తి కలది పొడుపు కథ. జానపద కవిత్వం, గద్య కథ, సామెత వైవిధ్యం గల ప్రక్రియలైతే, పొడుపు కథల్లో వాటన్నింటి కంటే ఎక్కువ వైవిధ్యం ఉంది. పొడుపు కథల్ని జానపద సాహిత్యంలో భాగంగా పేర్కొంటున్నా వీటిలో కొన్ని గణితరూపంలో, చిత్ర రూపంలో కూడా చూపించవచ్చు. జానపద గేయ రూపంలో, కథాగేయ రూపంలో, కథా రూపంలో, సామెతల రూపంలో కూడా పొడుపు కథలుంటాయి. వినోదాన్ని, విజ్ఞానాన్ని సమానంగా పంచి ఇచ్చే ప్రక్రియల్లో పొడుపు కథను మించి లేదు. ఇలాంటి ప్రయోజనాత్మక దృష్టితోనే ప్రపంచంలోని ప్రతి సమాజంలోని వ్యక్తులు వీటిని ఉపయోగించు కుంటారు. ఇవి నిత్య జీవితంలో భాగమయిపోయాయి." ఆదిమ మానవుని చిత్తవృత్తి, బుద్ధి వికాసం పొందుతున్న దశలో మానవుని తహతను, అభివ్యక్తి శక్తిని ఇవి ప్రతిబింబిస్తాయి.

ఒగ్గుకథాగానం అంతా కూడా చాలా వరకు ప్రాంతీయ మాండలికంలో స్థానిక మాండలిక భాష లోనే గానం చేయబడుతుంది. తెలంగాణలో విశిష్ట కళారూపంగా గుర్తింపు పొందిన ఒగ్గుకథ ఉత్తర తెలంగాణ ప్రాంతంలో ఎక్కువగా కనిపిస్తుంది. కథా గానంలో ఉపయోగించే భాష పూర్తిగా మాండలిక భాష గా ఉండడంతోపాటు కథా సందర్భాలకు అనుగుణంగా ప్రయోగించే సామెతలు పలుకుబళ్ళు కథాగతమైన అంశాన్ని సాధారణీకరణం చేయడం వలన కథాంశం సులువుగా అర్థం అవుతుంది. స్థానిక ప్రాంతీయ భాషను ఉపయోగించడం వలన ఇతివృత్తం ఏదైనప్పటికీ ప్రేక్షకులు దానిని స్థానిక అంశాలు గా భావించి అర్థం చేసుకోవడానికి వీలు అవుతుంది.

ఒగ్గుకథాగానానికి లయాత్మకతను చక్కని తూగును అందించే మరో అంశం ప్రాస, ఒగ్గుకథాగానంలో ప్రతిపాదంలో పదవిరుపుల్లో యతి, సహజమైన ప్రాస కనిపిస్తుంది. ఇటువంటి

యతి ప్రాసల వలన కథాగాన సమయంలో కథకునికి సహజంగానే విశ్రాంతి లభించడంతో పాటు కథాగానానికి నాదమాధుర్యం కలుగుతుంది. ఈ విధంగా ఒగ్గుకథాగానానికి అలంకారంగా నిలిచిన పలుకుపడులు సామెతలు, ప్రాసాత్మక అంశాలను తెలుసుకుందాం.

**4.5.1. పలుకుబడులు – సామెతలు**

ఏ భాషకైనా పలుకుబళ్ళు సామెతలు ఒక ప్రత్యేకతను అందిస్తాయి వీటిద్వారా ఆయా ప్రాంతాల సంస్కృతి సాంప్రదాయాలు అభివ్యక్తమవుతాయి. ఒక భాషలో ఉన్న పలుకుబళ్ళు మరో భాషలో ఉండవు. ఒకే భాషలో వివిధ ప్రాంతాలలో ఉపయోగించే సామెతల మధ్య తేడా ఉంటుంది. ప్రతి పలుకుబడి, సామెత ప్రత్యేక వైవిధ్యాన్ని కలిగి ఉంటాయి. తెలుగు పలుకుబడికి ఆత్మీయత ఎక్కువ. అర్థంలో ఆత్మీయతతో పాటు శబ్దంలో సహజమైన ప్రాస కనిపిస్తుంది. నేటి జనవ్యవహారం నుండి కనుమరుగయిపోతున్న ఎన్నో అపురూపమైన పలుకుబడులు ఒగ్గుకథాగానంలో నిలిచి ఉండడం విశేషం.

"అమ్మ కోడండ్లు" 'అమ్మకోడలు' అనే పదం నేటి వ్యవహారంలో నుండి కనుమరుగవుతున్న పలుకుబడి. ఒగ్గుకథ లో వివాహ వర్ణన గానం చేసేటప్పుడు "హంసలాంటాడోళ్ళు అమ్మకోడండ్లు,అమ్మకోడండ్లు"అనే ప్రయోగం కనిపిస్తుంది తెలంగాణ పల్లె ప్రజలు అందరి ముందు తన భర్తను ఇతను నా భర్త అని చెప్పడానికిగాని, తన భార్యను ఈమె నా భార్య అని చెప్పడానికి కొంత బిడియపడతారు. ఆ బిడియంలో నుండే "అమ్మకోడలు" అనే విలక్షణమైన పదం ఏర్పడింది. నా భార్య అని చెప్పడానికి బదులు మా అమ్మకోడలు/అవ్వకోడలు అని చెప్పడం నేటికీ తెలంగాణ ప్రాంతంలో అక్కడక్కడా కనిపిస్తుంది. భార్యను అమ్మ కోడలు అని చెప్పి హంస తో పోల్చడంలో ఆత్మీయ ఆకర్షణ వ్యక్తమవుతుంది.

"మొక్కుడు కోడెలు" స్త్రీకి అత్తింటి వారి పట్ల బాధ్యతలు, పుట్టింటి మీద ఆత్మీయ అనురాగాలు ఎక్కువ. పిల్లలకు కూడా తమ ఇంటి కన్నా అమ్మ పుట్టినిల్లు అయిన అమ్మమ్మ గారి ఇంటి మీద అవ్యాజమైన ప్రేమానురాగాలు ఉంటాయి. పుట్టినింటి వారితో సత్సంబంధాలు కడదాకా సాగాలని తాపత్రయం లోనే మేనరికం, ఒడిబియ్యం వంటి సాంప్రదాయఆచారాలు ఏర్పడ్డాయి. పిల్లలకు బాల్యంలో తల్లిదండ్రుల తర్వాత మేనమామల దగ్గరే అంతటి ఆదరణ లభిస్తుంది. మేనమామలు కూడా చెల్లి/అక్క కొడుకులకు తమ బిడ్డలను ఇచ్చి సంబంధం కలుపుకొని నిలుపు కోవాలని భావిస్తారు అందుకే మేనల్లుడిని ప్రేమగా ఆదరిస్తారు. ఆడబిడ్డకు పెళ్లి సమయంలో అరణంగా పశువులను ఆవు ల్యాగలను పంపినట్లు మేనల్లుండ్రు కొంతకాలం మేనమామ దగ్గర ఉండి తిరిగి తమ పట్టణానికి బయలుదేరే సమయంలో మేనమామలకు

నమస్కరిస్తారు తమను గౌరవించినందుకు బదులుగా మేనల్లులకు ప్రేమగా కొల్యాగలను బహుమతిగా ఇస్తారు. వీటిని మొక్కుడుకోడెలు అంటారు. కనుమరుగైన ఈ సంప్రదాయం గురించి మల్లన్న ఒగ్గుకథలో వర్ణించబడింది. రారాజు మల్లయ్య మేనమామల పట్నం కళ్యాణపట్నం నుండి బయలుదేరి వచ్చేటపుడు వారి నుండి మొక్కుడు కోడెల కింద రామన్న లచ్చన్న అనే జోడు కోల్యాగలను బహుమతిగా పొందాడని చెప్పబడింది.

"ముఖాన కొంగుపెట్టడం" భారతీయ స్త్రీల వస్త్రధారణ జీవనవిధానంలో అనేక అవసరాలకు అనుగుణమైన అనుకూలతను కలిగివుంటుంది. గ్రామీణ స్త్రీలు ధరించే చీరలోని కొంగు భాగాన్ని శ్రమజీవనానికి అనుకూలంగా రకరకాలుగా వాడుతారు. అలాంటి చీర కొంగును దుఃఖం కలిగినప్పుడు కంటనీరు తుడుచుకోవడానికి వాడతారు. అలవికాని దుఃఖంతో నిరాఘాటంగా కారే కన్నీరు తుడుచుకోవడానికి చీర కొంగు ముఖానికి దగ్గరగా ఉంటుంది కాబట్టి 'మొకాన కొంగు పెట్టడం' అంటే మిక్కిలి బాధకు లోనై విలపించడం అని అర్థం వస్తుంది. ఒగ్గు కథ లో దుఃఖాన్ని వర్ణించేటప్పుడు స్త్రీపురుషులిద్దరికీ కూడా ఈ పలుకుబడిని ఉపయోగిస్తున్నారు. ఒగ్గుకథకులు నిజంగానే కొంగును ముఖం పై పెట్టుకొని ఏడుస్తూ కరుణ రసాత్మకంగా కథాగానం చేస్తారు.

"కష్టం తెల్లారడం" తెల్లవారడం లేదా తెల్లారడం అంటే సూర్యోదయం కావడం అనేది ప్రత్యక్ష అర్థం. కానీ ఇక్కడ తెల్లారడం అంటే ముగిసిపోవడం, పూర్తవడం, గడిచిపోవడం అని అర్థంలో ఈ పద ప్రయోగం కనిపిస్తుంది. మాంధాత ఒగ్గు కథలో విమలాంగిదేవి వైశ్యుని నుండి తప్పించుకునే వీలు లేక ఏడుస్తున్న సమయంలో "కష్టం ఎట్లా తెల్లారుతుంది రామ రామ" అనే ప్రయోగం కనిపిస్తుంది. కష్టం తెల్లారడం అంటే కష్టం తొలగిపోవడం అని అర్థం. ఒక వ్యక్తి మరణించిన సమయంలో కూడా 'ఇగ వాని కథ తెల్లారింది' అని వారి జీవితం పూర్తయిందనే అర్థంలో ఈ పద ప్రయోగం కనిపిస్తుంది.

"ఎట్టి పట్టడం" తెలంగాణ ప్రాంతంలో నిజాం కాలంలో ప్రారంభమైన వెట్టిచాకిరీ వ్యవస్థ అత్యంత క్రూరమైనది. నాటి పెత్తందారులు అధికారులు ఎలాంటి జీతం ఇవ్వకుండానే ప్రజల చేత వివిధ రకాల కష్టాలు చేయించుకునే వారు. ప్రజలు కూడా వారి అధికారానికి తలొగ్గి ప్రతిఫలం ఆశించకుండా ఎంత కష్టమైనా సరే వారు చెప్పిన పనులు చేసేవారు. ప్రతిఫలం లేకుండా చేసే పని వెట్టి/ఎట్టి. చుక్క సత్తయ్య మాంధాత ఒగ్గు కథలో "దేవతలందరినీ మాంధాత ఒక్క బాణంతో కట్టగట్టి, చుట్టచుట్టి, తొక్కిపెట్టి, ఎట్టిపెట్టి సూర్యమండలానికి మెట్లు కట్టించాడు" అనే ప్రయోగం ఉంది. తెలంగాణ సమాజంలో వేళ్లూనుకుపోయిన వెట్టి వ్యవస్థ

ఆధారంగా ఏర్పడిన పలుకుబడిని ఒగ్గు కథ లో ప్రయోగించడం కనిపిస్తుంది.

"డొక్కల కార్యం" మనిషికి సంబంధించిన భావోద్వేగాలను మెదడు గ్రహించి స్పందిస్తుంది. మనసుకు హృదయం అనే పదాన్ని పర్యాయపదంగా వాడతారు. నిజానికి ఆలోచనాత్మకంగా స్పందించేది మనస్సే అయినప్పటికీ వ్యవహారంలో దాన్ని హృదయానికి ఆపాదించి చెబుతారు. ఇదే విషయాన్ని ఒగ్గుకథలో కార్యానికి (కాలేయం అనే పదం శబ్ద పరిణామం చెందగా ఏర్పడిన పదం కార్యం) ఆపాదించడం విశేషం. డోక్కలకార్యం అంటే కడుపులో ఉన్న కాలేయం అని అర్థం. మిక్కిలి బాధకు గురి అయ్యే పని జరిగినప్పుడు హృదయం ద్రవించింది అనడానికి బదులు గా ఒగ్గు కథకులు "డొక్కల కార్యం దొల్లాడ వట్టే" అనే పదప్రయోగం కనిపిస్తుంది. మన శరీరంలో హృదయం లాగే కాలేయానికి ప్రాధాన్యత ఎక్కువ. పరిమాణంలో కూడా గుండె కంటే పెద్దగా ఉండడం వలన ఈ పలుకుబడి ఏర్పడి ఉండవచ్చు. దానితోపాటు భరింపరాని దుఃఖాన్ని గురించి తెలిపినప్పుడు హృదయం తల్లడిల్లింది వంటి ప్రయోగంకి బదులుగా వారి దుఃఖాన్ని చూస్తుంటే "కడుపులో పేగులు అవిసిపోతున్నాయి" అనే విలక్షణమైన పలుకుబడి ప్రయోగం కూడా ఒగ్గుకథలో కనిపిస్తుంది.

"సత్యవంతుడు సావాన ధీరుడు" ఒగ్గుకథలో నాయకుల వీరత్వాన్ని వర్ణించే సందర్భంలో ఈ విశేషణం కనిపిస్తుంది. సత్యవంతుడు అంటే అబద్ధం ఆడకపోవడం సావాన ధీరుడు అంటే యుద్ధంలో గొప్ప ప్రతాపం కలవాడు అని అర్థం. నాయకుడు మానసిక స్థిరత్వం, శారీరక దృఢత్వం కలిగిన వాడు అని చెప్పడానికి ఈ ప్రయోగం వాడుతారు. సావాన అనే పదం శబ్ద పరిణామం చెందడం వల్ల ఏర్పడిన పదం సమరమున అనే పదంలో ర, మ వర్ణాలు లోపించి మొదటి అక్షరానికి దీర్ఘం రావడం వల్ల గాని, సమరాన అనే పదం వ్యవహారంలో సావన గా మారడం వల్ల గానీ ఈ పదం ఏర్పడింది. ఎల్లమ్మ ఒగ్గుకథలో పరశురాముని గురించి మల్లన్న కథలో మల్లన్న గురించి చెప్పే సందర్భంలో ఈ ప్రయోగం కనిపిస్తుంది.

"కూరట్ల చెయ్యి పెట్టిన కుద్దాడి బిడ్డ" తెలంగాణ సాంస్కృతిక చిహ్నాలలో కురాడు ఒకటి. కొంతకాలం క్రిందటి వరకూ కూరాడు లో కలి (బియ్యం కడిగిన నీరు)ని వంటకు ఉపయోగించే వారు. ఇంట్లో ఏ శుభకార్యమైనా, పండుగలైనా సున్నము, పసుపు కుంకుమల తో కూరాడును అలంకరించి పూజిస్తారు. అటువంటి కూరాడు ను ఆడబిడ్డకు ప్రతీకగా భావిస్తారు. ఇంటి ఆడ పిల్లకు పెళ్లి చేసి అత్తారింటికి పంపే సమయంలో కూరాడు లో చెయ్యి పెట్టించి చేతికి అంటిన కలి నీళ్లను కన్నతల్లి కొంగుకు తుడుస్తారు. కేవలం ఇంటి ఆడబిడ్డ కు మాత్రమే కూరాడులో చేయిపెట్టే అధికారం ఉంటుంది. తమ ఆశ్రమంలో ఉన్న ఎల్లమ్మను పరశు

రాముని వెంటపంపే సమయంలో ఆది జాంబవంతుడు ఎల్లమ్మను కూరాట్ల చెయ్యి పెట్టిన కుద్దాడబిడ్డగా భావించి ఓడివాలు పోసి సాగ తోలినట్లు ఒగ్గుకథగానంలో చెప్తారు. కుద్దు అంటే సొంతం అని అర్థం. అలాగే ఆడిబిడ్డ అనే పదం ఇతర ప్రాంతంలో ఆడపడుచుగా వ్యవహరించగా తెలంగాణ మాండలికంలో ఆడబిడ్డ ఆడపిల్లగా వ్యవహారంలో ఉంది. పడుచు అనే పదం కన్నా బిడ్డ అనే పదంలో ఆత్మీయత, ప్రేమాభిమానాలు కన్పిస్తాయి.

"మక్కీ మక్కని పళ్ళు మాట సక్కదనం" కసుగాయల కన్నా, బాగా మగ్గిన పండ్ల కన్నా దొరమాగిన పండ్లు రుచిగా ఉంటాయి. అలాగే ఏమీ తెలియని బాల్యదశలోని మాటల కన్నా, అన్నీ తెలిసిన వయోజనుల మాటల కన్నా పూర్తిగా తెలిసి తెలియని కౌమారదశ లోని పిల్లల మాటలు వినసొంపుగా ఉంటాయని చెప్పే సందర్భంలో ఈ ప్రయోగం కనిపిస్తుంది.

పన్నెండేండ్ల బాలుడు రారాజు మల్లయ్య మేనమామలను మెప్పించి అనేక సంపదలను గ్రహించాడు. మక్కీ మక్కని పండ్లు మాట చక్కదనంతో మేనల్లుడు మల్లయ్య మాటలకు మురిసిపోయి కళ్యాణపు రాజులు అడిగింది కాదనకుండా ఇచ్చారు అని చమత్కారమైన మాటల్ని పండ్ల తో పోల్చిన సందర్భంలో ఈ పలుకుబడి ప్రయోగం కనిపిస్తుంది. దోరమగ్గిన అనే శిష్ట సాహిత్య శబ్దం కన్నా మక్కీమక్కని అని అసమాపక క్రియతో ఏర్పడిన పదబంధం ఎంతో అర్థవంతంగా కనిపిస్తుంది.

"అరటి గొడ్రాలు – పురిటి గొడ్రాలు" సమాజంలో సంతానం స్త్రీ జన్మసాఫల్యతకు గుర్తుగా భావిస్తారు. గ్రామీణ సమాజంలో సంతానం కాని స్త్రీ చుట్టుపక్కల వారి నుండి అనేక సూటిపోటి మాటలు ఎదుర్కొంటుంది. సంతానం పొందడం అనే లక్షణం స్త్రీ జన్మకు వరంగా భావించడం వల్లనే గతంలో సంతానాన్ని కూడా సంపదగానే భావించేవారు. ఆ క్రమంలో ఒకే ఒకరిని కన్న స్త్రీ ని కూడా సంతానవతిగా కాకుండా అరటి గొడ్రాలు గా పిలిచేవారు. అరటి చెట్టు కేవలం ఒక గెలను వేస్తుంది కాబట్టి ఒక్కరే సంతానం పొందిన వారిని అరటి గొడ్రాలనీ, పుట్టిన పిల్లలు పురిటిలోనే అంటే రోజుల వ్యవధిలోనే మరణిస్తే పురిటి గొడ్రాలుగా భావించేవారు. ఎల్లమ్మ సత్యాన్నబోనం తో జమదగ్నిని పునర్జీవితున్ని చేసి సంతానం కావాలని కోరుకుంటుంది. జమదగ్ని వద్దని వారించినా వినలేదు. చివరకు జమదగ్ని ఒక సంతానఫలాన్ని అనుగ్రహిస్తాడు. అప్పుడు ఒకే సంతానం ఉంటే అరటి గొడ్రాలు పురిటి గొడ్రాలు అంటారు కావున నాకు నలుగురు సంతానాన్ని ప్రసాదించమని కోరుతుంది. సంతాన రహితురాలైన స్త్రీకి నాటి సమాజంలో కలిగిన అవమానాన్ని ఈ పలుకుబడి ద్వారా తెలుసుకోవచ్చు.

"అద్ద బట్టకట్టిన ఆడది" మాంధాత ఒగ్గు కథ లో ప్రయోగించబడిన ఈ పలుకుబడిలో

సూటయిన అభివ్యక్తీకరణ కనిపిస్తోంది. యవనాశ్వుని గర్భం నుండి జన్మించిన వీరాధివీరుడు అయినా మాంధాత పురుష అహంకారంతో శక్తి దేవత అయిన విధిని దిక్కరిస్తాడు. సమయంలో అడ్డబట్ట కట్టిన ఆడది అని విధినాంచారిని తక్కువ చేసి మాట్లాడతాడు. ఈ మాటలు పురుషుడు బట్ట కట్టకుండా జంకు లేకుండా తిరుగ గలడని, స్త్రీ మాత్రం తన మానాభిమానాలు కాపాడుకోవడానికి అడ్డుగా బట్ట కట్టుకోవాల్సి ఉంటుందని వీధినాంచారి శక్తి దేవత అయినప్పటికీ స్త్రీ అని, తాను పురుషుడినని పైగా స్త్రీ తో సంబంధం లేకుండా మగవాడి గర్భంలో జన్మించాననే పురుషాహంకారం ఈ పలుకుబడిలో వెల్లడవుతుంది. సమాజంలో మాతృస్వామ్య వ్యవస్థను దిక్కరించి పితృస్వామ్య వ్యవస్థ బల పడుతున్న సమయంలో ఈ పలుకుబడి ఏర్పడి ఉండవచ్చు.

"కాయల్ల కాయ కాదు పండ్లల్ల పండు గాదు" ఎల్లమ్మ ఒగ్గుకథలో ఎల్లమ్మ జమదగ్ని పెళ్లి జరిగి నాగవెల్లి జరగకముందే కార్తవీర్యుని చేతిలో జమదగ్ని మరణిస్తాడు. ఆ సందర్భంలో ఎల్లమ్మ ఆవేదన ను వర్ణిస్తూ ఈ ప్రయోగం కనిపిస్తుంది. వివాహ వేడుకలో నాగవెల్లి ప్రధాన ఘట్టం. నాగవెల్లి జరగకుండా పెళ్లి పూర్తి కానట్టే భావిస్తారు ఎల్లమ్మ కు పెళ్లి జరిగింది కానీ నాగవెల్లి జరగకముందే భర్తను కోల్పోయింది. ఆమె పరిస్థితి పెళ్ళికాని స్త్రీ గా ఉండాలో పెళ్లైన స్త్రీ గా ఉండాలో తెలియని సందిగ్ధావస్థలో ఉందని చెప్పడానికి 'కాయల్లో కాయ కాదు పండ్లలో పండు కాదు' అనే ప్రయోగం వాడబడింది. కాయ అంటే పెళ్ళికాని స్త్రీ అని పండు అంటే పెళ్లి అయిన స్త్రీ అనే అర్థాన్ని గ్రహించినప్పుడు ఎల్లమ్మ ఆవేదనలోని అంతరార్థం అవగతమవుతుంది.

"కూరాడు పులిసింది" బియ్యం కడిగిన నీరు కురాడులో పోసి అవి పులిసిన తర్వాత వాటిని వంటకు ఉపయోగించడం ఒక నాటి సాంప్రదాయం కురాడు పులిసింది అంటే వంట చేయడానికి నీరు సిద్ధంగా ఉందని అర్థం. మల్లన్న ఒగ్గు కథ లో పద్మావతి దేవి రజస్వల అయిందని వన్నెలక్కమ్మ చెప్పినప్పుడు నీలమ్మ సంతోషిస్తుంది. అదే విషయాన్ని కొడుకు మల్లయ్య తో "కొడుకా నీ కూరాడు పులిసింది కుతికెల పూలు వద్దయి నేను ఇప్పుడే దేవగిరి పోయి నీ భార్య పద్మాక్షిని త్వరగా తీసుకొని వస్తాను" అని చెప్పింది. పూర్వం బాల్యవివాహాలు జరిగినప్పుడు పెళ్లి తర్వాత అమ్మాయి రజస్వల అయ్యేంతవరకు తల్లి గారి ఇంటి దగ్గరే ఉంచేవారు అనంతరం వేడుక జరిపి అత్తవారింటికి తోలుకొని వచ్చేవారు. నీ భార్య సాంసారిక జీవితానికి సిద్ధంగా ఉందని చెప్పడాన్ని కూరాడు పులిసింది అని సభ్యోక్తితో సూచించడం ఒగ్గుకథలోని భాషా సౌందర్యాన్ని వినూత్నమైన అభివ్యక్తీకరణలో తెలుపుతుంది

"అలతేరడం" అలతేరడం అంటే పదే పదే గుర్తుకు తెచ్చుకొని దుఖించడం తల్లి మీద పడిన నింద గురించి విన్న పరుశరాముడు ఆంబోతులా అలతేరందు అని ఎల్లమ్మ ఒగ్గుకథలో

పరశురాముని దుఃఖ వర్ణనలో ఈ ప్రయోగం కనిపిస్తుంది. నీటివనరులలో తరంగాలు/అలలు కదులుతూ ఉంటాయి. ఆ విధంగా ఏదైనా ఒక విషయం మనసును పదేపదే ఇబ్బంది పెట్టినప్పుడు ఆ విషయం గుర్తుకు వచ్చి పదే పదే మిక్కిలి ఆవేదన చెందడాన్ని అలతేరడం అంటారు. ఒగ్గుకథ గానంలో గాయకుల దుఃఖాన్ని వర్ణించడంలో అలతేరడం అనే పదం కనిపిస్తుంది.

"నెత్తిలిత్తులు దులపడం" నెత్తిలో ఇత్తులు అంటే తల మీది అక్షతలు, తలంబ్రాలు అని అర్థం. విత్తు విత్తనం అనే శబ్దం శబ్ద పరిణామం పొంది ఇత్తుగా మారింది. వివాహ సమయంలో బియ్యం, జొన్నలు అక్షంతలుగా తలంబ్రాలుగా వధూవరుల తలమీద పోస్తారు. వివాహ వేడుకలు పూర్తయ్యేవరకు అందరూ ఆశీర్వదించడం వలన తలలోని వెంట్రుకలులో ఈ ధాన్యం అలాగే ఉంటుంది. పెళ్లి పూర్తయిన తరువాత వెంట్రుకలలో చిక్కుకున్న బియ్యం జొన్నలు దులిపివేసి తల స్నానం చేస్తారు. నెత్తిలిత్తులు దులపడం అంటే పెళ్లి వేడుక పూర్తి కావడం అని అర్థం. మల్లన్న ఒగ్గు కథలో నెత్తిలిత్తులు దులిపి నెలవారము వెళ్ళింది అనే పద ప్రయోగం కనిపిస్తుంది. తల మీద అనడానికి బదులు నెత్తి మీద అని చెప్పడం మాండలిక భాష సొగసు ఆవిష్కృతమైంది.

"రెండు జివునాల మనిషి" ఒగ్గుకథ లోని అభివ్యక్తీకరణకు ఈ పలుకుబడి చక్కని నిదర్శనం. గర్భవతి, నెల తప్పింది, నీలాడింది వంటి సభ్యోక్తుల కన్నా రెండుజీవునాల మనిషి అని చెప్పడం సహేతుకంగా కనిపిస్తుంది. గర్భవతి అయిన స్త్రీకి రెండు ప్రాణాలు ఒకటి తనది, రెండు కడుపులో ఉన్న బిడ్డది. ఈ రెండు ప్రాణాలు ప్రధానమే వీటిలో ఒక ప్రాణానికి ఇబ్బంది కలిగితే మరో ప్రాణం తల్లడిల్లుతుంది. రెండు ప్రాణాలు విడివడి బిడ్డ భూమ్మీద పడేంత వరకూ జాగ్రత్తగా చూసుకుంటారు. సాధారణ మానవులు ఒకే ప్రాణాన్ని కలిగి ఉండగా గర్భవతి అయిన స్త్రీలు రెండు ప్రాణాలను కలిగి ఉంటారు కావున ఈ పలుకుబడి ఏర్పడింది. బీరప్ప ఒగ్గు కథ లో చంద్రగిన్నెపట్టణం నుండి వచ్చిన పద్మశాలీలు సూరమ్మ గర్భవతి అని చెప్పడానికి బదులు నాగులకొండ నరభూపతితో "రాజా నీ చెల్లెలు రెండుజీవునాల మనిషి అని చెప్తారు. ధ్వన్యమైన అర్థంలో ప్రయోగించిన ఈ పలుకుబడి లో విలక్షణత కనిపిస్తుంది.

"రాయసంటోడు లక్కసంటోడు" మనిషికి శారీరక దృఢత్వం కన్నా మానసిక స్థిరత్వం చాలా అవసరం మానసిక స్థిరత్వాన్ని చెప్పడానికి ఈ ప్రయోగం వాడుతారు రాయసంటోడు అంటే స్థిర చిత్తం కలవాడు ఎన్ని అడ్డంకులు ఎదురైనా పని చేయాలనే సంకల్పం కలవాడు లక్కసంటోడు అంటే చపల చిత్తం కలవాడు ఎవరు ఏది చెప్పినా విని మనసు మార్చుకున్న వాడు. తొందరగా స్పందించే వాడు అని అర్థం. బీరప్ప ఒగ్గు కథ లో కామరతిని ఎత్తుకొని వచ్చి పెళ్లి చేసుకుంటానని స్థిరచిత్తంతో ఉన్న బీరయ్య కామరతి మాటలు నమ్మి ఆమెను

నాగులకొండకు పంపిస్తాడు తన మాటలతో రాయసంటోన్ని లక్కోలే చేసి తప్పించుకు పోయింది అని కథనాత్మక వ్యాఖ్యానంలో కనిపిస్తుంది. అంటే స్థిరచిత్తం గల బీరప్ప మనసు రాయి వంటిది అని కామరతి మాటలతో కరిగిపోయి సరేనన్న బీరయ్య మనసు లక్క వంటిదని అర్థం.

"గోటికి మీసంమందే యాల్ల" యుక్తవయస్సు అని చెప్పడాన్ని సొగసుగా వ్యక్తీకరించిన ఈ పలుకుబడి రంభ రంపాల ఒగ్గుకథలో కనిపిస్తుంది. పాండవ పుత్రుడైన నకులుడి కొడుకు రంపాల రాజు గొప్పవీరుడు, అందగాడు. యువకుడైన రంపాల రాజుకు పెళ్లీడు వచ్చిందని చెప్పడానికి బదులు గొటికి మీసమందే యాల్ల అని చెప్పడం జరిగింది. కౌమారదశలో పదహారేళ్ల ప్రాయంలో అప్పుడే వస్తున్న మీసాలను చూసుకొని సంబరపడిన పురుషుడు తాను పెద్దవాడినయ్యాననే గర్వంతో మొలుస్తున్న మీసాలను మునివేళ్ళతో పట్టుకొనే ప్రయత్నం చేస్తాడు. అటువంటి చర్య నుండి ఈ పలుకుబడి ఆవిర్భవించింది. గోటికీ అంటే చేతివేళ్ల గోరుకు మీసం అందే వయస్సు అంటే యుక్త వయస్సు అటువంటి నూనుగు మీసాల వయసును గోటికి మీసంమందేయాళ్ళ అని సహజ సుందరంగా వ్యక్తీకరించడం జరిగింది.

"దొంగలు కొట్టిన తొవ్వ" వెళ్ళడానికి వీలు లేని విషయాన్ని, సందర్భాన్ని ఉద్దేశించి ఈ పలుకుబడి ఏర్పడింది. పూర్వం రోజులలో నడకదారిలో, బండ్ల దారిలో దారి దొంగలు కాపు కాచి ప్రజల సొమ్ము దోచుకునేవారు. అలా దోపిడీకి గురైన ప్రజలు మరోసారి అలాంటి దారి వెంబడి వెళ్లడానికి భయపడి ప్రయాణాలు మానుకునే వారు. సన్యాసమ్మ ఒగ్గుకథ లో రామానాయుడు తన చెల్లెలు కష్టాల్లో ఉందని తెలుసుకుని వస్తుండగా సన్యాసమ్మ ఎదురెళ్లి అన్నను అడ్డుకుంటుంది. నీవు వచ్చి మన మేనత్త దాలమ్మను అడిగితే ఇంటి పరువు పోతుందని తిరిగి వెళ్ళమని అంటుంది. మళ్లీ వస్తే ప్రాణం మీద ఒట్టు అని పలికిన చెల్లెలు మాటలు విని రామానాయుడు చెల్లెలి ఇంటికి వెళ్ళే అవకాశం లేక "మ్యాన సుట్టిర్కంలా మన్నువొయ్య దొంగలు కొట్టిన తొవ్వయింది" అని ఆవేదన చెందుతారు.

"పుస్తె మట్టెలకు పురుగు పట్టింది" పెళ్లి తరువాత ధరించే ప్రత్యేక ఆభరణాలు పుస్తె, మట్టెలు. భర్త ఉన్న స్త్రీ అని తెలిపే మంగళ చిహ్నాలుగా వీటిని భావిస్తారు. భర్తను కోల్పోయిన స్త్రీలు వీటిని తీసివేస్తారు. ఇది తెలుగునాట కనిపించే సంప్రదాయం. అమెరికా రాజు ఒగ్గ కథలో భర్త మరణించి విలపిస్తున్న బాలవతిని ఆమె సోదరుడు నిమ్మాలమంత్రి ఓదార్చడానికి వస్తాడు. ఆ సందర్భంలో "నీ పుస్తెమట్టెలకు పురుగు పట్టింది చెల్లెలా" అని బాధ పడతాడు. పురుగు పట్టడం అంటే పాడవడం. చెట్టుకు ధాన్యానికి కలిగే పురుగు పట్టడం అనే క్రియను లోహ ఆభరణాలయిన పుస్తె మట్టెలకు ఆపాదించారు. పురుగు పట్టిన వస్తువేదైనా పూర్తిగా

నాశనం కాక తప్పదు కాబట్టి వాటిని తొలగించాల్సి వస్తుంది. అలాగే భర్త మరణించిన తర్వాత భార్య ధరించిన పుస్తెమట్టెలు తీసివేస్తారు కాబట్టి పుస్తెమట్టెలకు పురుగు పట్టింది అనే ప్రయోగం ఏర్పడింది. ప్రాస కోసమని కాకుండా తాళి అనే పదానికి బదులుగా తెలుగు మాండలికంలో వ్యవహారంలో ఉన్న పుస్తె అనే పదాన్ని ప్రయోగించడం విశేషం.

"పువ్వుల్ల దారమా నా పుణ్య పురుషుడా" పురుషాధిక్య వ్యవస్థలో పెళ్లైన స్త్రీ భర్తనే సర్వస్వంగా భావిస్తుంది. భర్త లేకుండా జీవించి ఉండడం కష్టమనే భావన సమాజంలో కనిపిస్తుంది. కీలుగుఱ్ఱం ఒగ్గుకథలో దేశపతిరాజు చివరి భార్య రవరింబి మాటలు నమ్మి ఏడుగురు భార్యలను అడవికి పంపిస్తాడు. ఇటువంటి సమయంలో వారు తమ జీవనాధారంగా భావించిన భర్తకు దూరమయ్యామని విలపించిన సందర్భంలో ఈ ప్రయోగం కనిపిస్తుంది. దండలోని పువ్వులకు దారమే ఆధారం. దారం లేకుండా పువ్వులు దండగా ఉండలేవు. అలానే స్త్రీకి ఆధారంగా ఉండాల్సిన భర్త లేకుండా భార్య మనుగడ సాధించడం కష్టం అని, ఈ విషయాన్ని ధ్వన్యంగా వ్యక్తీకరించడానికి ఈ ప్రయోగం వాడబడింది.

"ముక్కులో ఏదు కొయ్య" ఏదు అంటే ముళ్లపంది. ఇది అడవి జంతువు. దానిమీద ఏదైనా ఇతర జంతువు దాడికి దిగినప్పుడు దాని శరీరం మీద వాడిగా ఉన్న ముళ్లను విసురుతుంది. అవి దాడి చేసే జంతువు ముఖంపై గుచ్చుకొని బాధిస్తాయి. వాడిగా గట్టిగా ఉండే ఏదు ముళ్ళు /ఏదు కొయ్య ముఖం భాగాలలో గుచ్చుకున్నప్పుడు జంతువుకు చాలా ఇబ్బంది కలుగుతుంది. అటువంటి ఏదు ముల్లు ముక్కులో గుచ్చుకున్నప్పుడు శ్వాస తీసుకోవడానికి కూడా చాలా ఇబ్బంది కలుగుతుంది. అలాగే దాన్ని తొలగించడం సులువు కాదు. ఈ విధంగా తాను అనుకున్న పనికి తొలగించడానికి వీలు కాని విధంగా అడ్డుగా ఏదైనా ఉంటే ముక్కుల ఎదు కొయ్యలాగా అడ్డుకున్నారని చెబుతారు. కీలుగుఱ్ఱం ఒగ్గుకథలో పొద్దంతా రాణిగా ఉన్నా రవరంబి ప్రతి రాత్రి రాక్షసిగా మారి గుర్రాలను తినడానికి వెళుతుంది.

అక్కడ ఆగంపురాజు కాపలా ఉంటాడు. తాను చేసే ప్రతి పనికి అడ్డుగా ఉన్న ఆగంపురాజునిచూసిన రవరంబి "వీడు ముక్కులో ఏదుకోయ్య లాగా ఇబ్బంది కలిగిస్తున్నాడ"ని అనుకుంటుంది.

"కుప్పవాడు కూలివాడు" బంగారు గొర్రె ఒగ్గుకథలో పార్వతీదేవి మల్లన్నకు సవలక్ష గొర్లమందను అప్పగించి బయ్యన్నతో కలిసి మందను సవరించాలని చెబుతుంది. మందను అప్పగించే సమయంలో కుప్పవాడు బయ్యన్న, కూలి వాడు మల్లన్న అని చెబుతోంది. ఇక్కడ కుప్ప అంటే సంపద, కుప్ప వాడు అంటే సంపదకు అధికారి, మందపై అధికారం కలవాడు

అని అర్థం. కూలివాడు అంటే చెప్పిన పని చేసేవాడు అని అర్థం. ధాన్యపు రాశి అనే అర్థం లో ఉపయోగించే కుప్ప అనే అచ్చ తెలుగు పదాన్ని ప్రాసాత్మకంగా గొల్లెలమంద, సంపద అనే అర్థంలో ఉపయోగించడం విశేషం.

"చాట్ల వద్ద నాటి రాత –కాట్లె పడేదాక తప్పదు" మనిషి జన్మించినప్పుడు బిడ్డను చాటలో ధాన్యం పై పడుకోబెట్టి పురుడు మొదలైన కార్యక్రమాలు నిర్వహించడం ఒక ఆచారం. మానవ జన్మను పొంది నాటినుండి మరణించేవరకు ఇంకా చెప్పాలంటే మరణానంతరం శవం కాటిలో కాలే వరకు అంతా బ్రహ్మ రాత ప్రకారం జరుగుతుందని భావిస్తారు. ఈ అంశం ఆధారంగా ఏర్పడిన సామెత యిది. చాట్ల–కాట్లే అని ప్రాసయతితో కనిపించే ఈ వాక్యంలో మానవ జీవితమంతా దైవనిర్ణయానుసారం జరుగుతుందని ఏది జరిగినా స్వీకరించాలనే తాత్వికత యిమిడి ఉంది. సరోజినీదేవి ఒగ్గు కథలో బిడ్డ పుట్టిన వెంటనే తల్లి మరణిస్తూ ఆవేదన చెందిన సందర్భంలో ఈ పదప్రయోగం ఉంది.

"అవ్వ కరువైతే బువ్వ కరువు" సృష్టిలో ప్రతి ప్రాణి జీవితంలో తల్లి పాత్ర విలువైనది. తల్లి లేకుండా ఒక ప్రాణి బతకడం చాలా కష్టం. అటువంటి తల్లి ప్రాధాన్యత గురించి తెలిపే ఈ సామెత సంధ్యారాణి ఒగ్గు కథలో కనిపిస్తుంది. సంధ్యారాణి పుట్టిన కొద్ది రోజులకే తల్లి మరణిస్తుంది. మరణించె ముందు తల్లి తాను చనిపోయిన తరువాత తన బిడ్డల బాగోగులు ఎవరు చూసుకుంటారని బాధపడుతూ అవ్వ కరువైతే బువ్వ కరువు అని విలపిస్తుంది. అంటే కన్నతల్లి లేకపోతే పిల్లలకు కడుపు నిండా తిండి దొరకదని అర్థం.

"భర్త లేని ఆడదానికి బదునాములు ఎక్కువ – భార్య లేని మగవాడికి బాధలు ఎక్కువ" సాధారణ సమాజంలోని ప్రజల ఆలోచన విధానానికి అద్దంపట్టే సామెత యిది. సరోజినీ దేవి ఒగ్గుకథలో వరదరాజు తన భార్య మరణం తట్టుకోలేక "లోకంలో భర్త లేని ఆడదానికి బదునాములు ఎక్కువ, భార్య లేని మగవాడికి బాధలు ఎక్కువ"అంటూ విలపించి ప్రాణాలు వదులుతాడు. భారతీయధర్మంలో దాంపత్యజీవనానికి భార్యభర్తల సంబంధానికి ప్రముఖస్థానం కనిపిస్తుంది. దంపతులిరువురిలో ఒకరి వియోగం మరొకరిని తట్టుకోలేని బాధకు గురి చేస్తుంది. భాగస్వామి వియోగం కన్నా సమాజం నుండి ఎదురయ్యే బాధలు వారిని మిక్కిలి ఇబ్బంది పెడతాయని ఈ సామెత చెబుతుంది. భర్తను కోల్పోయిన స్త్రీ పురుషాధిక్య సమాజంలో పిల్లల పెంపకం, ఆస్తిపాస్తుల వ్యవహారం ఇతర కార్యక్రమాల నిమిత్తం మగవారి పైన ఆధార పడడం అనివార్యం. ఆ వ్యక్తి మంచి మనసుతో సహాయం చేసినప్పటికీ సమాజం వారిద్దరి మధ్య చెడు సంబంధాన్ని ఆపాదించి బదునాం (నింద) చేస్తుంది. భర్త వియోగం కన్నా చేయని నేరాన్ని

మోయడం స్త్రీని అమితమైన బాధకు గురిచేస్తుంది. అలాగే ఇంటి పనులన్నీ చక్కదిద్దే భార్య మరణిస్తే ఇంటి పని, వంట పనులు, పిల్లల పెంపకం వంటి పనులను స్త్రీ నిర్వహించినంత సమర్థవంతంగా పురుషుడు నిర్వహించలేక మిక్కిలి బాధలకు గురవుతారు. ఈ విధంగా భార్యాభర్తల సంబంధంలో ఒకరి వియోగం మరొకరిని ఎంతటి బాధలను గురిచేస్తుందో ఈ సామెత ద్వారా వ్యక్తం చేయబడింది.

"తల్లి తండ్రి చచ్చి మేనమామలు ఉండాలి" తెలంగాణ సమాజంలో ప్రతి వ్యక్తి జీవితంలో మేనమామ ప్రాధాన్యాన్ని వివరించే సామెత యిది. పురుడు పుట్టు వెంట్రుకలు పెళ్లి వంటి ఆచారాల నిర్వహణలో మేనమామకు విశేష ప్రాధాన్యత కనిపిస్తుంది. తన తోడబుట్టిన సోదరి పిల్లలను మేనమామ ప్రేమగా ఆదరిస్తాడు. వారి వల్లనే తమ సంబంధబాంధవ్యాలు కొనసాగుతాయని ఆశించి ఆదరిస్తారు. అందుకే జానపదులు తల్లి తండ్రి తరువాత మేనమామకు అంతటి ప్రాధాన్యం కలిగించారు. మల్లన్న ఒగ్గుకథలో రాజ్యం కోల్పోయిన మల్లన్న తల్లిదండ్రులను సోదరులను మేనమామలైన కళ్యాణపు రాజులు ఆదరించి వారు అడిగింది ఇస్తారు. వారి ఆదరణ పొందిన సమయంలో మల్లన్న తల్లి తండ్రి చచ్చిన మేనమామలు ఉండాలని భావించి వారిని గౌరవిస్తాడు. మేనమామ ప్రాధాన్యాన్ని తెలిపే ఈ సామెత జానపదుల జీవన విధానాన్ని తెలియజేస్తుంది.

"పెయ్యంత కొట్టినా పెరుగుకు ఒక కొత్త లేదు" ఇవ్వడానికి ఏమీ లేదు అని చెప్పడానికి ఈ సామెతను ఉపయోగిస్తారు మాంధాత ఒగ్గుకథ లో అడవి పాలైన మంధాత బిడ్డల ఆకలి తీర్చడానికి అల్లనేరెడు పళ్ళు తెంపినప్పుడు విధీనాంచారీ తెనుగువిద్దమ్మ రూపంలో వచ్చి తెంపిన పళ్ళకు బదులుగా డబ్బు చెల్లించమంటుంది. కానీ తన దగ్గర ఏమి లేవని రాజు బ్రతిలాడాడు. విదమ్మ తన భటులతో రాజును దెబ్బలు కొట్టిస్తుంది. అప్పుడు మీరెంత దండించిన ఇవ్వడానికి నా దగ్గర ఏమి లేదని చెప్పే సమయంలో పెయ్యంత కొట్టిన పెరుగుకు ఒక కొత్త లేదు అని అంటాడు. ఇక్కడ కొత్త అంటే డబ్బు అని అర్థం. డబ్బును కొత్తలు అని వ్యవహరించడం తెలంగాణ గ్రామీణ మాండలికంలో నేటికి కన్పిస్తుంది.

"గట్లు గనవడుతయి కానీ గతులు కనవడయి" విధినాంచారి చేతిలో మాయాజూదంలో ఓడిపోయిన మంధాత తన భార్యాపిల్లలతో అడవిపాలవుతాడు. చక్రవర్తిగా వీరునిగా రాజ్యపాలన చేసిన రాజు ఇచ్చిన మాటకోసం బికారిగా మారి అడవి పాలు కావడం గురించి ఒగ్గుకథ లో మంధాత పాత్రను వ్యాఖ్యానిస్తూ గట్లు గనవడుతయి కానీ గతులు కనవడయి అనే ప్రయోగం కన్పిస్తుంది. గట్లు అంటే హద్దులు, చిన్న కొండలు అని అర్థం. పరిక్షించి చూస్తే భూమికి

సంభందించిన హద్దులు, కొండలు కన్పిస్తాయి. కానీ ఎంతగా ఆలోచించిన ఎంత జ్ఞానవంతుడికైనా భవిష్య జీవితంలో ఎదురయ్యే సమస్యలు తెలియవని చెప్పే ఈ మాట మానవ జీవన తాత్వికతను తెలియజేస్తుంది.

"ఉడికే వరకు ఊకున్నవు గానీ సల్లారే వరకు చచ్చి పోతున్నావా" లౌక్యంతో కూడిన వెటకారం ధ్వనించే ఈ సామెత మాంధాత ఒగ్గుకథలో ప్రయోగించబడింది. సుబ్బిశెట్టి దగ్గర తన భార్య విమలాంగిని తాకట్టు పెట్టి, కట్టెలు కొట్టడానికి వెళ్లిన మాంధాత రాజు, అతని కొడుకులు అడవిలో ఆగమై పోతారు. విమాలంగి అందానికి ఆకర్షితుడైన సుబ్బిశెట్టి ఆమెను పొందాలని భావిస్తాడు. ఈ విషయం గ్రహించిన విమలంగి తప్పించుకోవాలని ప్రయత్నించిన వీలు కాక ఒక పన్నాగం పన్నుతోంది. "నన్ను కాపాడలేని భర్తను వదిలి నిన్ను పెళ్లి చేసుకోవాలని ఉంది నీలాంటి వాడు దొరికితే పార్వతీ దేవి నోము నోచుకుంటననుకున్నాను. నోము పూర్తికాగానే నిన్ను పెళ్ళాడతా" అని అబద్ధం చెప్తుంది ఆ సందర్భంలో అనుమానం వ్యక్తం చేసిన సుబ్బిశెట్టితో "ఉడికే దాకా ఊకున్నవ్ గాని సల్లారేదాకా సచిపోతున్నవ" అని వెటకారం తో కూడిన కపటప్రేమ చూపిస్తుంది. అనుకున్నది అందుబాటులోకి వచ్చే దాకా ఓపిక పట్టారు కానీ అనుభవించే సమయం దాకా ఎందుకు ఆగడం లేదు అని దీనర్థం చల్లారే వరకు చచ్చిపోతున్నావా అనే పదం ప్రాసాత్మకంగా ఉంటూనే చక్కని వెటకారం వ్యక్తీకరిస్తుంది.

"సిరి పోయినంక సింగారం ఎందుకు భర్త పోయినంక భాగ్యం ఎందుకు బోరెమొలే మొగుడు పొంగా బొంత చింపులకేడ్చుడెందుకు" అమెరికా రాజు ఒగ్గుకథలో రాజు మరణించిన తర్వాత అతని భార్య బాలావతిని కూడా రాజ్యం నుండి వెళ్ళగొట్టాలని నింబాలమంత్రి భావిస్తాడు. చెల్లె దగ్గరికి వచ్చి "బావ మరణించిన సమయం మంచిది కాదు, నీవు కొంతకాలం పట్టణం విడిచి అడవిలో ఉండాలని బ్రాహ్మణులు చెప్పా"రని చెప్పగా బాలవతి నిర్వేదంగా భర్త మరణించిన తర్వాత ఈ సిరిసంపదలు ఎందుకని భావించి అడవి కి వెళ్లడానికి సిద్ధపడుతుంది. ఆ సమయంలో చెప్పబడిన ఈ సామెతలో వైరాగ్యభావన వ్యక్తమవుతోంది. ఏ భార్యకయినా భర్త ఉంటేనే సకల సంపదలు ఉన్నట్టుగా భావిస్తుంది. భర్తను కోల్పోయిన తర్వాత ఎన్ని సంపదలు ఉన్నా అవన్నీ వ్యర్థమే అని భావిస్తుంది. అదే భావాన్ని సిరి పోయినంక సింగారం ఎందుకు భర్త పోయినంక భాగ్యం ఎందుకు అని చెబుతూ అనంతర వాక్యంలో బోనం వలె నిండుగా అలంకారప్రాయానికి ఆధారమైన మొగడు మరణించాక పనికిరాని వట్టి బొంత చింపుల కోసం ఆరాటపడడం ఎందుకనే నిర్లిప్తత ఇందులో కనిపిస్తుంది. భర్త మరణించిన తర్వాత ఎంత సంపద ఉన్నా అది అనుభవింప వీలుకానిదని అలాంటి సంపదలు బొంతచింపుల

వలే వ్యర్థమైనవనే భావన ఈ మాటలో వ్యక్తమవుతుంది.

"ఉంటే పులి పిల్ల లేకపోతే బలి పిల్ల" బతికితే పులి బిడ్డ లాగా ధైర్యంగా రాజసంగా బతకాలి లేదా మరణించాలి అనే భావాన్ని తెలిపే ఈ సామెత నరసింహస్వామి ఒగ్గుకథ లో కనిపిస్తుంది. ప్రహ్లాదుని హరి పూజ మానిపించడానికి హిరణ్యకశిపుడు అనేక రకాలుగా హింసిస్తూ ఒకదశలో విషం తాగించడానికి సిద్ధపడతాడు. అది చూసి లీలావతి భర్త చర్యను అడ్డుకుంటుంది. ఆ సమయంలో బ్రతికితే నాలాగా రాజసంగా బతకాలి లేదంటే చావాలి అని చెప్పే సందర్భంలో ఈ ప్రయోగం కనిపిస్తుంది.

"చెప్పుడు నా వంతు చేసుడు నీ వంతు" ఎల్లమ్మ ఒగ్గు కథ లో భర్త ప్రాణాలు రక్షించుకోవడానికి ఎల్లమ్మ సత్యాన్నబోనం ఎలా చేయాలి అని గంగమ్మను అడుగుతుంది. గంగాదేవి మిక్కిలి కష్టసాధ్యమైన సత్యన్నభోనం తయారీ గురించి వివరించి చెప్పుడు నా వంతు చేసుడు నీ వంతు అని తెలుపుతుంది. అంటే ఏదైనా సమస్య వచ్చినప్పుడు దాని పరిష్కారం గురించి తీవ్రంగా ఆలోచించినప్పుడు కొందరు సలహాలిచ్చి మార్గదర్శనం చేస్తారే తప్ప వారే సమస్యను పరిష్కరించరు. సమస్య ఎవరిదో వారే పరిష్కరించుకోవాలి. సలహాలు ఇవ్వడం వరకు మాత్రమే ఇతరులు చేస్తారనే భావన ఇందులో వెల్లడవుతుంది. ఎవరైనా సలహాలు ఇచ్చి ముందుకు నడిపిస్తారు కానీ ఆ సమస్యను పరిష్కరించుకోవాల్సిన బాధ్యత, పరిష్కరించే శక్తి అంతా మనకు సంబంధించినదనే వ్యక్తిత్వవికాస నైపుణ్యం కూడా ఈ సామెతలో వ్యక్తమవుతుంది.

"మ్యాన వారి పిల్ల మ్యాకల్ల కుక్క" మేనరికపు సంబంధాల వలన కలిగే ఇబ్బందులను వివరించే ఈ సామెత బీరప్ప ఒగ్గుకథ లో కనిపిస్తుంది. పెళ్లి మీద ప్రేమతో అక్క దగ్గరికి వచ్చిన బీరయ్య తాను మేనమామ నాగులకొండ నరభూపతి బిడ్డను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నానని అక్కకు చెబుతాడు. అక్కమంకాళి "మేనరికం సంబంధం వద్దు తమ్ముడు మ్యాన వారి పిల్ల అది మేకల్ల కుక్క" అంటుంది. మేకల మందలో ఉండే కుక్క మంద మొత్తాన్ని బెదిరించి తన ఆధీనంలో ఉంచుకుని ముందుండి మందకు పెద్దరికం వహిస్తుంది. దాని కన్నా వయసులో ఆకారంలో పెద్దగా ఉన్న మేకలను కూడా బెదిరిస్తుంది. అలాగే మ్యానరికపు పిల్ల ఇంటి కోడలు అయితే అత్తమామలు, పెద్దల పట్ల భయం లేకుండా అంతా తాను అనుకున్నట్లు కుటుంబాన్ని నడిపిస్తుందని భావన ఈ సామెతలో అభివ్యక్తమవుతుంది.

"ఎలంకర వెడితేనే ఎన్న" బీరప్ప ఒగ్గుకథలో నాగులకొండ నరభూపతి బిడ్డను పెళ్లి చేసుకోవడానికి వెళుతున్న బీరప్పకు ఎల్లమ్మ స్త్రీలకు ఉండాల్సిన లక్షణాలు తెలిపి కయ్యం తో వెళ్లి వియ్యంతో రమ్మని ఆశీర్వదిస్తూ ఏలంకర వెడితేనే ఎన్న అంటుంది వేలు వంకర పెట్టినప్పుడే

గిన్నెలో నుండి వెన్నను తీసుకునే అవకాశం ఉంటుంది కదా, అలాగే ఏదో ఒక విషయంలో గొడవ పడితేనే నరభూపతి వంటి నీచుడిని దారిలోకి తెచ్చుకుని వాని బిడ్డను పెళ్లి చేసుకునే వీలు కలుగుతుందనే భావన ఈ మాటల్లో వ్యక్తం అవుతోంది.

"మొలకయితే గోటితో చిమ్మితే పోతది మాను అయితే గొడ్డలి కావాలి" బీరప్ప ఒగ్గుకథలో నాగులకొండ నరభూపతి తన చెల్లెలు సూరమ్మ గర్భవతి అని తెలియగానే చెల్లెలు కొడుకును కంటే తిరిగి సంబంధాలు ఏర్పడతాయని భావిస్తాడు. అది ఇష్టం లేని నరభూపతి గర్భంలో ఉండగానే ఆ పిండాన్ని చంపాలని లేకపోతే పిల్లవాడు పుట్టి పెరిగి పెద్దయ్యాక వాడిని వదిలించుకోవడం, సంహరించడం కష్టమని భావించిన ఈ సందర్భంలో ఈ సామెత ప్రయోగం కనిపిస్తుంది. మొలకను గోరుతో సులువుగా త్రుంచి వేయవచ్చు కానీ బలంగా పెరిగిన మానును పడగొట్టాలంటే అంటే గొడ్డలి వంటి ఆయుధం, శక్తి కావాలి. అలాగే శత్రువు బలహీనంగా ఉన్నప్పుడు చంపడం సులువవుతుంది కానీ బలవంతుడిగా ఎదిగిన శత్రువును సంహరించడం కష్టమవుతుందని ఈ సామెత వెల్లడిస్తుంది.

"అర చేతిలో బెల్లం పెట్టి మోచేత నాకించడం" అసాధ్యం అనుకున్న పనిని సుసాధ్యం చేయడం అనే అర్థంలో ఈ ప్రయోగం కనిపిస్తుంది. బీరప్ప ఒగ్గు కథలో మారువేషంలో ఉన్న బీరప్ప ఒంటరిగా ఉన్న కామరతిని అడ్డగించి ఎత్తుకుపోయి పెళ్లి చేసుకుంటానని అంటాడు. బీరప్ప శక్తిని గుర్తించిన కామరతి లౌక్యంగా ఇంటిలో నేను దాచుకున్న ధనం, నగలు, చీరలు ఉన్నాయి అవి తెచ్చుకుని నా తండ్రికి తెలియకుండా వచ్చి నిన్ను పెళ్లి చేసుకుంటాను అని మాయమాటలు చెబుతుంది. ఆ మాటలు నమ్మి బీరప్ప కామరతిని విడిచి పెడతాడు బీరప్ప నుండి తప్పించుకు వెళ్లడం అసాధ్యమైనప్పటికీ తన మాటలతో అంకించి బొంకించి అల్లనేర్పుల నేర్పి బీరయ్యను మోసగించి వెళ్ళిన కామరతి లౌక్యాన్ని అర చేతిలో బెల్లం పెట్టి మోచేత నాకించడం అని ప్రయోగంలో వ్యక్తీకరించారు. అర చేతిలో ఉన్న బెల్లాన్ని నేరుగా తినవచ్చు కానీ అలా కాకుండా మోచేత నాకించడం అంటే తినడానికి వీలు కాకుండా చేయడం. బీరప్ప ఒంటరిగా దొరికిన కామరతి ఎత్తుకు పోయే అవకాశం ఉన్నా ఆమె మాటలు నమ్మి విడిచి పెట్టడాన్ని ఈ సామెత ద్వారా సమర్థించారు.

"కోట్ల ధనమున్న కోక రైక దాన్ని లక్షల ధనమున్న ల్యాగటావు దాన్ని" ఆడబిడ్డకు పుట్టింటి వారితో ఉండే ఆత్మీయ సంబంధాన్ని తెలిపే సామెత ఇది. సన్యాసమ్మ ఒగ్గుకథలో ఆడబిడ్డ దాలమ్మ తన అన్న దాలినాయుడు దగ్గరికి వచ్చినప్పుడు తనని ఆదరించనీ అన్న తో మాట్లాడిన ఈ మాటలో పుట్టింట నిరాదరణకు గురైన స్త్రీ వేదన వెల్లడవుతుంది. స్త్రీకి పెళ్ళి

చేసి మరో ఇంటికి పంపడం, తల్లిదండ్రి ఆస్తిలో పాలుపంచక పోవడం అనే ఆచారాలు ఉన్నకాలంలో స్త్రీకి పుట్టింటి వారి ఆదరణ ఎల్లప్పుడూ ఉండాలని ఏడాదికోసారి ఒడిబియ్యం, పెళ్ళయ్యాక ఆవుల్యాగ అరణం పంపడం వంటి ఆచారాలు ఏర్పడ్డాయి. పుట్టింటి వారికి ఎంత సంపద ఉన్నప్పటికీ ఆడపిల్ల ఆ సంపదని కాకుండా ప్రేమగా ఆదరించి సత్కరించే చీర రవికలనే ఆశిస్తుంది. ఎంత పశుసంపద ఉన్నప్పటికీ ఆ సంపద లో పాలుకోరకుండ అత్తింటి వారి దగ్గర తన గౌరవం నిలిపే పుట్టింటి వారి ఆవులేగల ఆదరణాన్ని కోరుతుంది. ఈ మాటల ద్వారా స్త్రీ ఎల్లప్పుడూ పుట్టింటి వారి నుండి ఆత్మీయ ఆదరణను కోరుకుంటుంది కానీ సంపదను కాదనే విషయం వెల్లడవుతుంది.

"సోలెడు బియ్యానికి పొంగులు ఎక్కువ, చెల్లని రూపాయికి గీతలెక్కువ,

కొంచెపోనికి మాటలు ఎక్కువ"

"కోట్ల శ్రీమంతం ఉన్న కొంపలోనే ఉంటది, కానీ కాట్లె పెట్టినాడు కాసు గవ్వ తోడు రాదు" "తొండ బిర్రు ఎనుగుల దాక, ఉడత బిర్రు చెట్టుమీది దాక"

"ఏట్ల ఉసికకు ఎంపకం ఉందిగాని ఎర్ర గొల్ల వారి ఆవుల మంద కు ఎంపకం లేదు"

"పుల్లలేరె దాని కన్నా పురుషుడు మేలు, కట్టెలేరే దానికన్నా కాపురం మేలు"

"ముత్యాలు మా ఇంట ముక్కిన జొన్నలు / పౌడాలు మా ఇంట పగిలిన జొన్నలు / వజ్రాలు మా ఇంట వట్టి మక్కలు" / "ముక్కుపచ్చలారని మూగలాగె" "బాలింత సంసారం" ఇలాంటి ఆలంకారికంగా కనిపించే సామెతలు, పలుకు బళ్ళు ఒగ్గుకథలో విశేషంగా కనిపిస్తాయి. ఇలాంటి సామెతలు కథాగతంగా వచ్చిన సందర్భాన్ని ప్రేక్షకులకు అర్థమయ్యేటట్టు వివరించడంతో పాటు ఈ ప్రాంతపు సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించిన విషయాల్ని వెల్లడిస్తాయి."[3]

ప్రాచీన కాలానికి చెందిన భారతీయ ఋషులు, అరిస్టాటిల్, ప్లాటోలాంటి ఎందరో తాత్త్వికులు సామెతలను వాడారు. ఆచారాలు, ఆదర్శాలు, ప్రకృతి పరిశీలన, స్వభావ పరిశోధన, చారిత్రక స్థలాలు, ప్రాచీన పురాణాలు, నిత్య జీవితంలో చూసి మనం అనుభవించే ప్రతి విషయం సామెతల పుట్టుకకు కారణం కావచ్చు.

పైన జరిపిన చర్చను పురస్కరించుకొని సామెతలకు నిర్దుష్ట లక్షణాలను ఇలా వివరింపవచ్చు. 1. సంక్షిప్తత 2. వాక్య రూపంలో ఉండడం 3. అనుభవ రూపంలో ఉండడం 4. తీవ్రత 5. వివేకవంతమైన అంశాన్ని కలిగి ఉండడం 6. సార్వజనీనత 7. ఉపదేశాత్మకత 8. వాక్యార్థం కంటె వ్యంగార్థానికే అధిక ప్రాముఖ్యత ఇవ్వడం.

వస్తువును బట్టి సామెతలను విభజించినట్లయితే పౌరాణికాలనీ, చరిత్రకాలనీ, సాంఘికాలనీ మూడు రూపాలుగా విభజింపవచ్చు. కొన్ని సామెతలు స్థల పురాణాలు. అంటే అవి ఆయాస్థలాల వైశిష్ట్యాన్ని తెలుపుతాయి. వస్తువును బట్టి చేసే వర్గీకరణలో ప్రకృతి వస్తువులను గురించిన సామెతలను కూడా చేర్చవచ్చు.

సామెతలలో ఎంత వైవిధ్యం ఉందంటే నిజానికి ఒక్కొక్క సామెత ఒక్కొక్క విభాగమని చెప్పదగింది. మానవుని అనుభవానికి, స్వభావానికి సంబంధించిన సామెతల్ని పెద్దవిభాగంగా పేర్కోవచ్చు. వేదాంతపరమైన సామెతల్ని కూడా ప్రత్యేక విభాగంగా చెప్పవలసి ఉంది. సలహాలు, చమత్కారాలు, విజ్ఞానానికి సంబంధించిన సామెతలను మరో విభాగంగా పేర్కొవచ్చు. కథలకు తోకలుగా పుట్టుకొచ్చే సామెతలను ప్రత్యేకంగా పేర్కోవాలి. ఇవికాక ఆలంకారికమైన సామెతలను అన్నింటినీ కలిపి ఉపమలు, రూపకాలు, శబ్దాలంకారాలు కలవి – ఈ విధంగా కొన్ని రకాలుగా విభజించుకోవచ్చు. ఇవిగాక, ఆయా ప్రదేశాలలో ఉండే విశేషాలను దృష్టిలో పెట్టుకొని సామెతలను వర్గీకరణ చేయవచ్చు. విషయ ప్రాధాన్యాన్ని బట్టి సామెతలను ఈ క్రింది రకాలుగా విభజించుకోవచ్చు.

1. సూత్రపు సామెతలు : సామెత సూత్రప్రాయంగా ఉండి, ఏదైనా ఒక విషయాన్ని స్థాపిస్తుంది.
   ఉదా : దుష్టున్ని చూసి దూరంగా ఉండు.
2. ఉపమాన రూపక సామెతలు : ఏదో ఒక పోలికను కలిగి ఉంటాయి.
   ఉదా : ఆడలేక అంగణం వంకర అన్నట్లు
3. నీతి భోదక సామెతలు: నీతి ప్రధానంగా ఉంటాయి.
   ఉదా: పులిని చూసి నక్క వాత పెట్టుకొన్నదట.
4. పౌరాణిక సామెతలు : రామాయణ, భారత, భాగవతాలకు సంబంధించినవి.
   ఉదా: రాత్రంతా రామాయణం విని రామునికి సీత ఏమి కావాలని అడిగాడట.
5. ప్రశ్నార్థక, రూపక, ప్రశ్నోత్తర సామెతలు:
   ఉదా: ఆవునలుపైతే పాలునలుపా?
6. సాంఘికాచార వ్యవహారాలు, విశ్వాసాలు, నమ్మకాలు :
   సంఘంలోని ఆచార వ్యవహారాలను, వారి విశ్వాసాన్ని తెలియజేసే సామెతలు.
   ఉదా: ఉంటే ఉగాది, లేకపోతే ఏకాశి.
7. వ్యక్తిగత సామెతలు : ఒక వ్యక్తికి సంబంధించిన సామెతలు ఈ కోవకు చెందుతాయి.

ఉదా : అనంతయ్య చేతిమాత్ర వైకుంఠ యాత్ర.

8. హాస్యపు సామెతలు : పరిహాసాలలో, ఆక్షేపణలతో కూడి ఉంటాయి.

ఉదా : ఆరు నెలలు సాము చేసి మూలనున్న ముసలిదాన్ని కొట్టాడట.

9. వ్యవసాయ సంబంధ సామెతలు :

ఉదా : స్వాతి వాన ముత్తెపు వాన.

10. శబ్దాలంకార సామెతలు: ప్రాసలు, యమకాలు, అనుప్రాసలుంటాయి.

ఉదా : అన్ని దానముల కంటె నిదానమే ప్రధానము." [4]

శబ్దాలంకార సామెతలే కాకుండా ఉత్ప్రేక్ష, అత్యుక్తి, ఉపమానాలతో కూడిన సామెతలు అనేకంగా ఉంటాయి.

ఉదా: 1. ఏనుగు తినే వానికి పీనుగులు పిండాకూడు.

2. తల ముగ్గు బుట్ట లాగుంది.

3. ఇంకా, ఇలాగే మరికొన్ని సామెతలున్నాయి.

"1. అశ్లీలపు సామెతలు :

ఉదా : మొగునికి నేస్తగాడు, ఆలికి మిండగాడు.

2. స్థల నామాలు :

ఉదా : హంపీకి పోయేదానికన్నా కొంపలో ఉండేది మేలు.

3. గృహజీవన సంబంధి సామెతలు :

ఉదా : అత్త వచ్చిన ఆరు మాసాలకు కోడలి కంట్లో నీరు వచ్చిందట. " [5]

సామెతల వయస్సును నిర్ణయించడం అంత సులభం కాదు. కేవలం గ్రంథస్థమైన సామెతలను కవికాలాదులతో నిర్ణయింపవచ్చు. గాని మౌఖిక ప్రచారంలో నలిగి పోయిన సామెతం కవి కాలాదులను నిర్ణయింపలేం. చారిత్రక గాథలతో కన్పించే సామెతలను, పురాణ గాథలలోని సామెతలను పరిశీలించి కొంత వరకు వాటి వయస్సును నిర్ణయింపవచ్చు.

సామెతలు సందేశాత్మకంగా, ఉపదేశాత్మకంగా కూడా ఉంటాయి. ఒక విషయాన్ని మరో విషయంతో పోల్చి మంచి చెడ్డలను, సత్యాసత్యాలను చెప్పడానికి సామెతలు చక్కగా ఉపయోగపడుతాయి. ఎన్నడో జరిగిన విషయాలను జ్ఞప్తికి తెచ్చుకొని, ప్రస్తుత విషయంతో పోల్చడం వల్ల ఎదుటి వారికి తాము చేసే పని సమంజసంగా ఉందా, లేదా, అని తర్కించడానికి సామెత వీలు కల్పిస్తుంది. సామెతల పరిశోధనాత్మక అధ్యయనం వల్ల

ప్రజల జాతీయ, సాహిత్య, సాంస్కృతిక స్వరూపాన్ని, వారి అనుభవాలను క్షుణ్ణంగా తెలుసుకోడానికి వీలవుతుంది. ఇవి చారిత్రక సంఘటలను వెలికి దీయడానికి, స్థల విశేషాలను పరిశీలించడానికి, భాషా శాస్త్రజ్ఞులకు భాషా శాస్త్ర విశేషాలపై పరిశోధించటానికి, సాంఘిక శాస్త్రజ్ఞునికి సమాజంలోని సంప్రదాయాలను, పద్దతులను గుర్తించడానికి దోహదం చేస్తాయి. నిత్య జీవితంలో మానవుడు సుఖ దుఃఖాలను రెండింటిని సమానంగా అనుభవిస్తాడు. తాను అనుభవించిన దాన్ని ఇతరులకు ఉపదేశాత్మకంగా, సందేశరూపంలో చిన్న వాక్యంలో అందిస్తాడు అల్పాక్షరాలలో – అనల్పభావాన్ని ఇస్తుంది సామెత. సామెతలు అనుభవాలు నుంచి పుట్టాయని, అనుభవం కేవలం ఒక్కరిదే కాదని జనసామాన్యులందరిదని చెప్పవచ్చు. సామెత కూర్పు ఒక్కరే కావచ్చు కాని అదిపలువురి అనుభవం మీద ఆదారపడి ఉంటుంది.

సామెతలు జానపదుల నిత్యవ్యవహారాలలో వినిపించే జీవన సత్యాలు ఒక భాషకున్న అస్తిత్వాన్ని, సాంస్కృతిక నేపథ్యాన్ని తెలుసుకోవడానికి సామెతలు ఎంతగానో తోడ్పడ తాయి. సామెతలు బోధించే నీతివాక్యాలతో ఎందరో తమ జీవితాలను చక్కదిద్దుకొని వుంటారు. అంటే సామెత మనిషిని ఎన్నో విధాలుగా చైతన్యపరిచి, స్పృహకల్పించి తన జీవితంలో పూలబాట వేస్తుందని చెప్పక తప్పదు. మనిషికి సరైన జీవన మార్గనిర్దేశాన్ని చేయడంలో ప్రముఖపాత్ర పోషించేవి మచ్చుకు కొన్ని

మొక్కై వంగనిది – అడుసుతొక్కనేల

మానైవంగునా

కాలుకడగనేల

పులిని చూచి నక్క వాత పెట్టుకొన్నట్లు

ఉంటే ఉగాది, లేకపోతే ఏకాసి

దేవుడు వరం ఇచ్చినా పుజారివరం ఇయ్యడు.

కాకిపిల్ల కాకికి ముద్దు

రామాయణం అంతావిని రాముడికి సీతేంఅయ్యిందన్నట్లు

కుంచాలమ్మ కూడిదీస్తే మంచాలమ్మ యాయచేసింది.

ఇంట గెలిచి రచ్చ గెలవాలి.

మనిషికి ఎంతో సృజన కల్పించి, పాత్రపోషిస్తాయని చెప్పడం కద్దు

ప్రతి వ్యక్తికి సాంఘిక జీవిత పరిధి ఉంటుంది. ప్రతి వ్యక్తి ఏదో ఒక కులానికి

చెంది ఉండడం, ఆ కులానికి సంబంధించిన వృత్తిని వంశపారంపర్యంగా చేపట్టడం జానపదుల్లోనూ, బంజారాలలోనూ, అటువంటి వృత్తులకు, తదితర సామజికాంశాలకు సంబంధించిన తెలుగు- బంజారా సామెతలు ఈ అధ్యాయంలో తులనాత్మకంగా చర్చించబడతాయి. ఇటువంటి వ్యవసాయానికి సంబంధించిన కొన్ని సామెతలు ఈ దిగువన ప్రదర్శించబడ్డాయి. "ఊళ్ళో ఇల్లయినా ఉండాలి. అడవిలో పొలమయినా ఉండాలి. కడుపున పుట్టిన బిడ్డలైనా ఉండాలట". 'తాల్‌కో తవుడుకో ఆపణ్‌ఖేతేమ పాచ్‌ఞు, కాణోకో టూంటోకో అపణ్ పేటేమ హువఞు' (తాలో తవుడో మన చేలో పండాలి, గుడ్డివాడో కుంటివాడో మనకడుపున పుట్టాలి).

ఈ సామెతను పరిశీలిస్తే కడుపున పుట్టిన సంతానం తప్పక వుండాలని తెలుస్తుంది. ఆ పుట్టిన సంతానం ఆడకానీ, మగకానీ మన సొంతం అనే ఒకానొక ధైర్యం. అవిటివాడైనాకాని మనపిల్లలు ఎప్పటికైనా మనకు సహాయంగా ఉంటారు అనే ధోరణి మాత్రమే కాకుండా వంశాన్ని నిలపెడ్తారనే నమ్మకం కూడా కనపడుతుంది.

'ఒకరోజు చేపలకోసం చూసుకుంటే తరాలనాటి చుట్టరికం పోయిందట'

'సోళ్‌గా దాణార్ మూండోదేక్‌లతో ప్యానార్ పామణ్ డగర్‌గోజు'

(సోలేడు గింజల మొహం చూసుకుంటే తరాలనాటి చుట్టరికం పోయిందట)

ఈ సామెతను పరిశీలించి నట్లయితే తాత్కాలికమైన కొద్దిపాటి లాభం కోసం శాశ్వతమైన లేక పెద్ద లాభాన్నిగానీ, సుఖసంతోషాలనుగాని పోగొట్టుకోకూడదనే నీతి ఈ సామెత ద్వార వ్యక్తం అవుతున్నది.

'పండనినేల పందుం కంటే పండేనేల కుంచెడుచాలు'

'పాచేనిజకో జమ్మి పాంచ్ ఎకరమేతి పాచజకో జమ్మి పాంచ్ మడి థేర్ కజు'.

(పండనినేల అయిదు ఎకరాలకన్నా పండే నేల అయిదు మడులు చాలు)

'మలావురియాన ఢెడియాన మరేజావతీ పడేనీ'.

(మాలవాడికి మాదిగ వాడికి చచ్చినా పడదు)

ఈ సామెతను పరిశీలించినట్లయితే సంకుచిత కుల వ్యవస్థ ఎంతగా పాతుకుపోయిందో తెలుస్తుంది. అంతేకాకుండా ఎటువంటి కొంచెం భేదము ఉన్నా రెండు వర్గాల వారికి ఎప్పుడూ పడదు. ఇది మనిషిలోని బలహీనతను బేధభావాన్ని, ద్వేషాన్ని సూచిస్తుంది. కావునా దీనిని హాస్యపూర్వకంగా చెప్పుకుంటారని తెలుస్తుంది.

'మీసంలేకపోయినా రోషానికి తక్కువకాదు'

'ఖాయోనకమ్ రియతోయి జాతేనకోనిజు'.

'తింటానికి తిండిలేక పోయినా కులానికి తక్కువకాదు

ఈ సామెతను పరిశీలించినట్లయితే ధనముకంటే కులము ఎక్కువ శక్తివంతంగా మనిషిని ప్రభావితం చేస్తుందని తెలుపుతుంది. అంతేకాకుండా కులవ్యవస్థ ఎంత బలీయంగా ఉందో కూడా దీని ద్వారా తెలుస్తుంది. హెచ్చులకు పోయే వారి మనస్తత్వం కూడా తెలుస్తుంది. ఒక జాతి అనుభవాలను తరతరాలకు అందించే పలుకుబడులు సామెతలు. సామెతలు లేని భాషలు లేవు. తరతరాలుగా జానపదుల వాడుకలో నలిగిన, వారి నోళ్ళల్లో నానిన అభివ్యక్తి రూపాలు సామెతలు. మానవుడు తన దైనందిన జీవితంలో పొందే కష్టసుఖాలు మొదలైన విషయాలను సామెతలు ప్రకటించేవిగా ఉంటాయని నిరూపించడం జరిగింది. సామెతలు అల్పాక్షరాలలో అనల్పభావాన్ని, అనుభవాన్ని సూటిగా చెప్పగలుగుతాయి. బంజారాలకు తెలుగు వారికి ఆచార వ్యవహారాలలోను, జీవనశైలిలోను కొద్దిపాటి తేడాలు ఉన్నా ఆలోచన విధానంలో మౌలిక భావాలు, స్పందన, ప్రతిస్పందనలు, భావావేశం, జీవిత పరిశీలన, ఆదర్శాలు, ఊహలు మొదలైనవి ఒకే విధంగా ఉన్నాయని నిరూపించటం జరిగింది.

### 4.5.2. పొడుపు కథ

జానపద గేయ ప్రక్రియలాగే పొడుపుకథలు కూడా మానవుల ప్రయత్నపూర్వక మేధాశక్తితో జనించాయి. శుద్ధమైన పొడుపుకథ జానపదుల హృదయాంతరాళాల నుండి ఉద్భవించింది. సామెతలు ఒక విధంగా కర్తృకమై, పిమ్మట సామూహికముద్రను వేసుకోగా, పొడుపుకథలు సామూహిక కర్తృత్వంచేత ఏర్పడి జానపద గేయాలవలె అప్రధాన కర్తృకమైనాయి. దేశంలోని పలు ప్రాంతాల పొడుపుకథలకు వేదాలలోని పొడుపు కథలే మాతృకలని పలువురు విద్వాంసుల అభిప్రాయం. 'పొడిచేలా ప్రశ్నించు' అనే అర్థంలో పొడుచు లేదా పొడుపుకథ అనవచ్చు. 'కథ' అనడంలో ఇక్కడ 'విషయం' అని అన్వయించవచ్చు. సమాధానం చెప్పలేని వ్యక్తి దానికి మారుగా మరొక విషయాన్ని (కథ) వాడడం పరిపాటి. అందుచే దీనిని 'మారుకథ' అని కూడా అనవచ్చు. రాయలసీమలో ముఖ్యంగా చిత్తూరు మండలంలో దీన్ని 'మారుకథ' అంటారు. అనంతరపురం మండలంలోని కొన్ని ప్రాంతాల్లో అడ్డుకథ, అడ్డుకత అంటారు. కడపజిల్లాలో పొడుపుకథ, విచ్చుకత, విప్పుకత అని అంటారు. తెలంగాణాలోని కొన్ని ప్రాంతాల్లో 'శాస్త్రం' అంటారు.

శాస్త్రార్థమెంత కఠినమో వీనిని విడదీయడం అంత కష్టమని కాబోలు పొడుపుకథలకు 'శాస్త్ర'మని పేరొచ్చింది. "ఆంగ్లంలో వీనిని (Riddles) రిడిల్స్ సాధారణంగా పొడుపుకథ ప్రశ్నరూపంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో, సంపూర్తిగానో, అసంపూర్తిగానో సంప్రదాయబద్ధంగా ఉంటుంది. చూడటానికి అసంబద్ధంగా, పరస్పర విరుద్ధంగా కనిపిస్తుంది. కానీ ఒక విశిష్టదృష్టితో పరికిస్తే అది కేవలం సత్యాన్నే వెల్లడిస్తుంది. ఈ పొడుపుకథల గురించి అనేక నిర్వచనాలున్నాయి. వాటినన్నింటిని పరిశీలిస్తే తేలిన అంశమేమంటే 'ఊహచే సమాధానాన్ని వెదకి, వినోదాశ్చర్యాలతోపాటు గూడార్థాన్ని వెలువరించే, సవాలు చేసే ప్రశ్నార్థక రూపకాతిశయోక్తి ప్రక్రియ పొడుపుకథ". ఈ పొడుపుకథల్లో ఉపమాన వాచ్యంగాను, ఉపమేయం సూచ్యంగాను ఉంటుంది. అంటే వాచ్యమైన ఉపమానంతో సూచ్యమైన ఉపమేయాన్ని గుర్తించటం సమాధానమనిపించుకుంటుంది. ఇది యిందులోని ప్రధానాంశం."

జానపదవిజ్ఞానం 'వివరణాత్మకాలు, పరిహాసాలు, విడికథలు, అనుకరణ కథలు అని విభజింపబడినా, భాషాశాస్త్రాధ్యయానానుగుణంగా రూప ప్రధానాలు, క్రియా ప్రధానాలు, అర్థప్రధానాలు అని ప్రధానంగా వర్గీకరింపబడినాయి. ఒక సరళవాక్యంలో కానీ, ఎక్కువ సరళవాక్యాలలో కానీ లేదా గొలుసు రూపంలో ఒకదానిలో మరొకటి ఇమిడిపోయిన శబ్దాలతో కూడినవి రూప ప్రధానాలు (former based) అంటే వర్ణనాత్మకనామవాచకం యిందులో ప్రధానం. ఉదాహరణకు- 'పెద్దయిల్లు-పెద్ద యింట్లో చిన్నయిల్లు చిన్నయింటిలో గుంట- గుంటలో స్తంభం మీద రాజు కూర్చొని తపస్సు చేస్తాడు. సమాధానం : గ్లోబు (Globe). ఇక సరళమైన, సమానమైన, నిషేధాత్మకమైన క్రియా కూడినవి క్రియా ప్రధానాలు (action based). ఉదాహరణకు 'దేహమెల్లకండ్లు దేవేంద్రుడు కాదు, నరవాహనమెక్కి నడచిపోతాడు, నిండుప్రాణంలేదు. తాను జీవులచంపు. సమాధానం-'వల'. ఇక ముక్త పదగ్రస్తంలా వుండి, అర్థప్రాధాన్యం కలిగి మొదట చెప్పిన విషయంలోని చివరిశబ్దం, రెండోసారి ముందు చేర్చబడి వుండే (Sementicaly controlled) అర్థం ప్రధాన పొడుపుకథలు మూడవరకం. ఉదాహరణకు 'అంభాలు- అంభాలు మీద కుంభాలు (కాళ్ళు, పిరుదులు) - కుంభాలుమీద బాన (కడుపు) - కుడితి బానమీద ఈరపలక (రొమ్ము) - ఈరపలక మీద ఇనుప గుండు (తల), ఇనుప గుండు మీద ఇద్దరు జవానులు (కళ్ళు), ఇద్దరు జవాన్ల మీద సీకుపొద (వెంట్రుకలు) సీకు పొదలో పది రేసు కుక్కలు (పేన్లు). ఇలా పొడుపు కథలను మూడు విధాలుగా విభజించినా,

కథలోని విషయాన్ననుసరించి ప్రశ్నించే పద్ధతే సరియైన పొడుపుకథ అనిపించుకుంటుంది.

జానపద విజ్ఞానంలో ప్రత్యేకశాఖగా పరిగణించదగినంత వ్యాప్తి కలది పొడుపు కథ. జానపద కవిత్వం, గద్య కథ, సామెత వైవిధ్యం గల ప్రక్రియలైతే, పొడుపు కథల్లో వాటన్నింటి కంటే ఎక్కువ వైవిధ్యం ఉంది. పొడుపు కథల్ని జానపద సాహిత్యంలో భాగంగా పేర్కొంటున్నా వీటిలో కొన్ని గణితరూపంలో, చిత్ర రూపంలో కూడా చూపించవచ్చు. జానపద గేయ రూపంలో, కథాగేయ రూపంలో, కథా రూపంలో, సామెతల రూపంలో కూడా పొడుపు కథలుంటాయి.

వినోదాన్ని, విజ్ఞానాన్ని సమానంగా పంచి ఇచ్చే ప్రక్రియల్లో పొడుపు కథను మించి లేదు. ఇలాంటి ప్రయోజనాత్మక దృష్టితోనే ప్రపంచంలోని ప్రతి సమాజంలోని వ్యక్తులు వీటిని ఉపయోగించు కుంటారు. ఇవి నిత్య జీవితంలో భాగమయిపోయాయి. ఆదిమ మానవుని చిత్తవృత్తి, బుద్ధి వికాసం పొందుతున్న దశలో మానవుని తహతను, అభివ్యక్తి శక్తిని ఇవి ప్రతిబింబిస్తాయి.

'పొడుపు కథ' అనేది సర్కార్ ప్రాంతంలో వాడే పదం. దీనికి ' మాఌకథ' అని పేరు. దీనినే ఇచ్చుకథ, విచ్చు కత, నిప్పు కథ అనీ, కొన్ని ప్రాంతాలలో అడ్డకత, అడ్డ కథ, అడ్డ కథ అనీ, కర్ణాటకలోని కోలార్ మండలంవారు ఒడ్డు కత అనీ వ్యవహరిస్తున్నారు. 'పొడుచునట్లుగా ప్రశ్నించు' అనే అర్థంలో పొడుచు లేదా పొడుపు కథ అనవచ్చు 'కథ' అనడంలో ఇక్కడ 'విషయం' అని గుర్తించుకోవాలి. ఒకరు ఒక కథను ' పొడిచినపుడు' సమాధానం చెప్పలేని వ్యక్తి మారుగా మరో విషయాన్ని (కథను) 'పొడుచుట' పరిపాటి. కాబట్టి దీనికి ' మాఌకత' అని పేరు వచ్చి ఉండవచ్చు. ఒకరు ఒడ్డిన కథలను ఇంకొకరు ' విప్పుట' జరుగుతుంది. కాబట్టి ఇచ్చుకత, విచ్చుకత, విప్పుకత అనే పేర్లు దీనికి తగి ఉన్నాయి. పొడుపు కథలను జీవితమే మూలధనం. జీవితంలో సమస్యల్ని విడగొట్టడానికి మనిషి చేసే ప్రయత్నమే వీటికి ప్రేరణ. ఎదుటి వాని బుద్ధికుశలకు ఒక పరీక్షగా ఉద్భవిస్తాయి పొడుపు కథలు. సామాన్య మానవునిలోని బుద్ది చాతుర్యం, హాస్యప్రియత్వం, సమస్యలకు పరిష్కరించుకోవాలనే మనస్తత్వం పొడుపు కథలను తీర్చిదిద్దుతాయి. ప్రత్యుత్తరం తెలియని వారి బుద్ధి కుశలతను పరీక్షించడానికి వారిని తికమక పెట్టడానికి తయారు చేసిన ప్రశ్నలు పొడుపు కథలు" అన్నారు రోగెర్డి అబ్రహామ్స్, అలన డండస్.

ఇంగ్లీషులో పొడుపుకథను 'Riddles' అంటారు. దీనికి మూలమైన (raedan) అనే పాత ఇంగ్లీషు పదానికి 'సలహా ఇవ్వడం' అని అర్థం. సంస్కృతంలో ప్రహేళికలు

వేదకాలంనుంచీ ప్రచారంలో ఉన్నాయి. తెలుగులో, ఇంగ్లీషులో, కన్నడంలో ఇతర భాషలలో పొడుపు కథలు" అన్నారు శ్రీ నేదునూరి గంగాధరం (1961). పొడుపు కథ అనే పేరులోని కథవల్ల, బహుశా సమస్యాత్మక కథలకు ముందు ఈ పేరుండి తర్వాత అన్ని రకాల సమస్యలకూ ఈ పేరు వచ్చిందేమో అనిపిస్తుంది. 'పొడుపు' అంటే చాలేమో కన్నడంలో ఇదే అర్థంలో ' ఒగటు' అన్నపేరు ప్రచారంలో ఉంది. ఒకటిన కథ అంటే సమస్యాత్మక కథ అని అర్థం. తమిళంలోని విడుకలై అనే పేరు మన పొడుపు కథను పోలిందే.

టేలర్ నిర్వచనం ప్రకారం "పొడుపు కథల్లో ఒక వస్తువుకు సంబంధించిన ఆలంకారిక వివరణ, సాహిత్య వివరణ ఉంటాయి. అవి వినేవారిని తికమకపెట్టే విధంగా ఉంటాయి" టేలర్ చెప్పినట్లుగా ఒకటి రూఢంగా, మరొకటి వ్యతిరేకంగా ఉండే గుణం అన్ని పొడుపు కథల్లోనూ కన్పించదు. "పొడుపు కథ నిజమైన అర్థాన్ని కప్పి పుచ్చేదిగా ఉండవచ్చు. ప్రశ్నరూపంలో ఉండవచ్చు కాని ఇది జావాబును నేరుగా సూచించదు" – అని పొడుపు కథను నిర్వచించడం జరిగింది.

గంభీరమైనవిగా ఉండడం పొడుపుల కథల ప్రధాన లక్షణంగా పేర్కోవచ్చు. బుద్ధిచాతుర్యానికి వీటిలో ఎక్కువ ప్రాముఖ్యం ఉంటుంది. ఊహాతీతంగా కన్పించడం, గూఢంగా వుండే జవాబు తెలియగానే ఎదుటివాడికి దిగ్భ్రమ కలిగేట్లుగా చేయడం పొడుపు కథల లక్షణం. పొడుపు కథను గాంభీర్యం ఉట్టిపడేలా ఒడ్డడం ప్రశ్నించేవాడివంతు. దాన్ని ప్రతిభావంతంగా విప్పడం విన్నవాడివంతు గాంభీర్యానికి సంబంధించిందే అర్థగోపనమనే లక్షణం. చెప్పాల్సిన విషయాన్ని గోప్యంగా ఉంచడం ప్రయత్న పూర్వక సృష్టికి సంబంధించింది. అప్రయత్నంగా వెలువడే జానపదగేయాల వంటి ప్రక్రియల నుంచి పొడుపు కథను వేరు చేసేగుణమిదే. ఎదుటివ్యక్తి బుద్ధి శక్తిని పరీక్షించడానికి పొడుపు కథలు ప్రయత్నపూర్వకంగా వెలువడ్డాయి.

రూపకంగా ఉండడం పొడుపు కథకుండే మరో లక్షణం. ఇది వాచలత్వానికి సంబంధించిన ప్రక్రియకాదు. ఏదో ఒక వస్తువును గాని, వ్యక్తిని గాని సూచించే ధ్వని ప్రధాన రూపం ఇది. పొడుపు కథల్లోని అలంకారం, రూపకం, వ్యాజోక్తి, గూఢొక్తి మొదలైన వాటిల్లో ఒకటి. ప్రాచీన సంస్కృతాలంకారికులు వ్యాజోక్తికి, గూఢొక్తికి, వక్రోక్తికి ఇచ్చిన ఉదాహరణలు వివిధ రకాల పొడుపు కథలే. చిన్న పిల్లలు మాట్లాడుకొనే 'క' భాష (ప్రతి అక్షరంముందు 'క' ను చేర్చి మాట్లాడడం కూడా ఒక విధమైన పొడుపుకు ఉదాహరణమే.

ఆలంకారికంగా ఉండడం పొడుపు కథకు చమత్కార గుణాన్ని కలిగిస్తుంది. పదగూఢత, భావగూఢత, వస్తుగూఢత, అన్వయ గూఢత, కనిపించే పొడుపు కథ సంస్కృతంలోని ప్రహేళిక నిర్వచనాలకు దగ్గరి ఉదాహరణ మనవచ్చు. జేమ్స్ ఎ. కెల్సో "పొడుపు కథ అర్థ స్పష్టత లేని రూపకం లేక రూపక సముదాయం" అనడం పొడుపు కథకుండే ఆలంకారిక గుణాన్ని తెలుపుతుంది. పొడుపు కథకు, రూపకానికి ఉండే సంబంధాన్ని గుర్తించిన వారిలో మొదటివాడు అరిస్టాటిల్. పొడుపు కథల్లో ముఖ్యంగా రెండు భాగాలుంటాయి. ఒకటి ఉపమానం మరొకటి ఉపమేయం. ఉపమానం వాచ్యంగా, ఉపమేయం సూచ్యంగా ఉంటాయి. ఉపమానాల సహాయంతో ఉపమేయాన్ని తెలుసుకోవలసి ఉంటుంది. పొడుపు కథల్లోని ఉపమానాలు నిత్యజీవితంలో మనకు పరిచితమైనవే ఉంటాయి.

పొడుపు కథల్లో మరోగుణం హాస్యస్ఫోరకంగా ఉండడం. కొన్నిట్లో హాస్యం మితిమీరి అశ్లీలమవుతుంది. అయితే అశ్లీలం పదాల వరకే పరిమితమై ఉంటుందిగాని అర్థంలో కాదు. హాస్యానికి తోడు ఒక్కొక్కసారి వ్యంగ్య గుణం కూడా పొడుపు కథల్లో కనిపిస్తుంది. మనిషిలో సహజంగా ఉండే హాస్య ప్రవృత్తి కొన్ని పొడుపు కథలు రూపొందడానికి కారణం. గాంభీర్యం సూచ్యంగా ఉండడం, హాస్యం వాచ్యంగా ఉండడం పొడుపు కథలకు ఒక వింత అందాన్ని ఇస్తుందనడంలో సందేహం లేదు.

ప్రకృతితో సంబంధం పొడుపు కథల మరొక లక్షణం. ప్రకృతికి సంబంధించిన అనేక వస్తువులు వీటిలో స్థానం సంపాదించుకున్నాయి. ప్రాచీన కాలంనాటి మానవుడు తన జీవితంలో ప్రకృతికి ఇచ్చిన ప్రాముఖ్యాన్ని ఈ గుణం తెలుపుతుంది. ప్రకృతిలోని వస్తువుల్ని ఉపమానంగా, కొన్నిట్లో ఉపమేయంగా జానపదులు ఉపయోగించుకుంటారు. జానపద విజ్ఞానంలోని అనేక ప్రక్రియల్లో లాగానే పొడుపు కథలకు కూడా సార్వజనీన గుణం ఉంది. ప్రపంచంలో ఒక మూలకనిపించే పొడుపు కథలాంటిదే మరోమారుమూల ప్రదేశంలో కనిపించవచ్చు. ప్రపంచంలోని వివిధ ప్రదేశాలలో దొరికే పొడుపు కథలను సేకరించి పరిశీలిస్తే కొన్ని సార్వత్రిక గుణాలు బయల్పడుతాయి. మానవ మనస్తత్త్వంలోని సమానాంశాలు తెలిసివస్తాయి. మొత్తంమీద చాతుర్యంతో కూడిన, కళాత్మకమైన, లయబద్ధమైన, సంక్షిప్త గూఢోక్తిగా పొడుపు కథను చెప్పుకోవచ్చు. ఇది బుద్ధికి కసరత్తునిస్తుంది. ప్రాక్తన మానవుని బౌద్ధిక సృష్టి ఇది. పొడుపు కథలకు శ్రీ జి.శంకరరావు ఏడు ప్రధాన లక్షణాలను పేర్కొన్నారు. అవి 1. సంక్షిప్తత 2. నిగూఢత్వం 3. అపార్థకల్పన 4.

వినోదాత్మకమైన క్రీడారూపం, 5. రేఖామాత్రమైన భావస్ఫురణ 6. రసస్ఫూర్తి 7. సమస్యగా భాసించి పరిష్కారాన్ని కోరడం. ఈ ఏడింటిలో కొన్ని లక్షణాలు మాత్రమే ఉంటే వాటిని పొడుపు కథలుగా చెప్పలేం. కాని, పొడుపు కథల్లో రెండు ప్రధానాంశాలను గుర్తింపవచ్చు. ఒకటి నిగూఢత్వం, రెండోది వినోదాత్మకమైన క్రీడారూపం.

పొడుపు కథలకు పైన చెప్పిన లక్షణాలే కాకుండా మరికొన్ని లక్షణాలను అదనంగా చేర్చారు డా.జి.యస్. మోహన్‌గారు.

1. పొడుపు కథ ఒడ్డెడువానిని, విప్పెడి వానిని శ్రోతను ఉత్సాహంతో ముంచెత్తాలి.
2. కేవలం బుద్ధి కౌశల్యానికి, హాస్యానికి మాత్రమే కాకుండా జ్ఞాపక శక్తికి, పొడుపు కథను విప్పెడి శక్తికి స్ఫోరకం కావాలి.
3. ఆలోచనలను రేకెత్తించి, సందిగ్ధతను పోగొట్టి అన్వేషించేదిగా ఉండాలి.
4. అస్పష్టత
5. సవాలు చేసే గుణం ఉండాలి.

పొడుపు కథల్లో ఐదు అంశాలను Robert Petsch సూచించాడు. అవి ఇలా ఉన్నాయి.

1. సూత్రప్రాయమైన ఆరంభాంశం.
2. వర్ణింపవలసిన విషయానికి నామకరణం చేయడం.
3. ఆ విషయాన్ని గురించిన వర్ణనాత్మక కథనం
4. అదే విషయాన్ని గురించి తప్పుతోవ పట్టించే కథనం
5. సూత్రప్రాయమైన ముగింపు.

మనోరంజకత్వం కలిగిస్తాయని చెప్పడం అతిశయోక్తి కాదు. భాషలలో ప్రహేళిక వివిధ నామాలతో వ్యవహరిస్తారు. రామాయణ, భారత, భాగవత ఘట్టాల్లో వీటిని విరివిగా వాడిన తమిళ, కన్నడ, మలయాళం మొదలగువారు కందుకూరి రుద్రకవి, తెనాలి రామకృష్ణుడు గారు వంటి వాళ్ళను పేర్కోనవచ్చు.

ఉదా : కుంజయూదంబు దోమ కుత్తుక జోచ్చెన్
చాపచుట్టలేము చక్క బెట్టలేము
వంకటింకర శో
వానితమ్ముడు. అ

రెండు మిద్దెలకు ఒకటేదూలం వంటి పొడపు కథలు కాలక్షేపం కోసం సృజింప బడ్డ ప్రక్రియే అయినా ఇది పెద్దలు, పిన్నలు మధ్య సామాజిక విషయ సామగ్రిగా బుద్ధికి

గోచరిస్తుంది.

'పొడుపు కథ : పొడిచేల ప్రశ్నించేవే పొడుపు కథలు. జానపద సాహిత్యంలో ఇది ఒక వినోదాత్మక ప్రక్రియ. 'ప్రత్యుత్తరం తెలియని వారి బుద్ధికుశలతను పరీక్షించడానికి, వారిని తికమక పెట్టడానికి తయారు చేసిన ప్రశ్నలే.. పొడుపు కథలు. పొడుపు కథ ప్రశ్న రూపంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో, సంపూర్తిగానో, అసంపూర్తిగానో సాంప్రదాయ బద్ధంగా ఉండేదే పొడుపు కథ. ఇది సాధారణంగా అసంబద్ధంగా ఉంటుంది. కానీ ఒక విశిష్ట దృష్టితో చూస్తే మాత్రం ఇది సత్యాన్నే బోధిస్తుంది. పొడుపు కథలన్నీ సాధారణంగా ప్రయత్న పూర్వకమై, రూపకాలంకారాలై ఉంటాయి. కసిరెడ్డి వెంకటరెడ్డి గారు "పొడుపు కథలు – ఒక పరిశీలన" అనే గ్రంథం ద్వారా పొడుపు కథలపై సమగ్ర పరిశోధన చేశారు.

**నిర్వచనాలు :**

1) పొడుపు కథ ప్రక్రియ వాస్తవాన్ని దాచిపెట్టే ప్రక్రియ – రాగౌ
2) ఋగ్వేదంలోని ప్రశ్నోత్తర రూపాలే భారతంలో యక్ష ప్రశ్నలై అవే నేడు పొడుపు కథలై పరిణమించినవి. – ఆచార్య దుర్గాభగవత్
3) పొడుపు కథ అర్థ స్పష్టత లేని రూపకం లేదా రూపక సముదాయం – జేమ్స్ ఎ.కెల్స్
4) "పొడుచుట, విప్పుటలో అనందమును వెల్లివెరియించునవి పొడుపు కథలు" – నేదునూరి గంగాధరం

**పొడుపు కథ – వ్యవహార నామాలు :**

| | | |
|---|---|---|
| "1) | ఆంగ్లం | RIDDLES, పజిల్, ఎనిగ్మా |
| 2) | సంస్కృతం | బ్రహ్మోదయం, ప్రశ్న, ప్రత్యుత్తర కూటం, ప్రశ్నావళి, ప్రహేళిక, హృదయ మాలిక |
| 3) | సర్కారు ప్రాంతం | పొడుపు కథ |
| 4) | చిత్తూరు | మారుకత, విప్పుకత, ఇచ్చుకత |
| 5) | అనంతపురం | అడ్డుకత, అడ్డకత |
| 6) | వరంగల్ | శాస్త్రములు |
| 7) | కర్ణాటక | ఇడ్డుకత |
| 8) | కోలార్ | ఒడ్డుకత " 7 |

లక్షణాలు : ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు పొడుపు కథలపై చక్కని పరిశోధన చేసి తన సిద్ధాంత గ్రంథంలో ఈ క్రింది లక్షణాలు పేర్కొన్నారు.

1. సంక్షిప్తత 2. నిగూడత 3. అపార్థ ద్యోతకత 4. కథాత్మకత 5 . కథారహితాత్మకత 6. ప్రతీకాత్మకత 7. ఘటనా విశిష్టత 8.లోకోక్తి రమణీయకత 9. చమత్కారికత 10. దృశ్యాత్మకత 11. అలంకారికత 12. సమస్యాత్మకత 13. రసాత్మకత 14 ధ్వన్యాత్మకత 15. సంప్రదాయకత 16. కవితాత్మకత

పొడుపు కథలు – వర్గీకరణ

రూపక ప్రధానాలు క్రియా ప్రధానాలు అర్థ ప్రధానాలు

వర్గీకరణ : పొడుపు కథల వర్గీకరణంలో పల్వురు పలు మార్గాలను అవలంభించారు.

1. గ్రంథస్తాలు, మౌఖికాలు – అవి స్థూలంగా రెండు రకాలుగా విభజింపవచ్చు. గ్రంథస్తాలు కృతకాలు, సాహిత్య వాసనగల వికాగా, మౌఖికాలు ప్రాచీనములు. ఒక తరం నుండి మరో తరానికి సంక్రమించినటువంటివే.
2. Folklore and Folklifeలో అయిదు రకాల పొడుపు కథలు సూచింపబడినాయి. అవి
   1. వివరణాత్మకాలు : గేయత్వం రూపకంతో కూడి ఆకర్షకంగా ఉంటాయి.
   2. పరిహాసపు ప్రశ్నలు: వీటినే reverse riddles అని కూడా అంటారు. వీటిలో వివరణాత్మకమైన సమాధానం ప్రశ్నింపబడుతుంది.
   3. వివేకపు ప్రశ్నలు : వీటిని విప్పడానికి ముందే పొడుపు కథకు సమాధానం తెలిసి ఉండాలి. హాస్యానికిగాని, కపటానికిగాని తావులేదు.
   4. విడికథలు : ఇవి దిగ్భ్రమ కలిగించేవిగా ఉంటాయి. సాధారణంగా ప్రారంభంలోనే తికమక పట్టించేవిగా వుండి. సమాధానం కోసం అధిక కాలాన్ని అపేక్షిస్తుంది.
   5. అనుకరణ కథలు : తక్కిన మౌఖిక సాహిత్యంవలె ఇవి కూడా స్వాభావికంగా సాంకేతికాలు.
3. Archer Taylor పొడుపు కథలను ఐదు వర్గాలుగా సూచించాడు.

1. మనుష్యులు, జంతువులు అని గుర్తింపరాని జీవాలతో పోలిక
2. జంతువులతో పోలిక
3. మనుష్యులతో పోలిక
4. వృక్షాలతో పోలిక
5. వస్తువులతో పోలిక

దశమాంక పద్ధతిలో చేసిన ఈ విభజన పల్వురు విద్వాంసుల మన్ననలను పొందింది. పోలికలు లేని పొడుపు కథలకు ఇది అన్వయింపదు.

4. భాషా శాస్త్ర అధ్యయానుగుణంగా కొందరు వీటిని గుర్తించారు. "[7]

1. రూప ప్రధానాలు :

ఒక సరళ వాక్యంలో గానీ, ఎక్కువ సరళ వాక్యాలలో గానీ గొలుసు రూపంలో ఒక దానిలో ఒకటి ఇమిడి పోయిన శబ్దాలతో గానీ ఉండవచ్చు. వర్ణనాత్మకమైన నామవాచకం ఇందులో ప్రధానం.

ఉదా: పెద్దయిల్లు
పెద్దయింటిలో చిన్నయిల్లు
చిన్నయింటిలో గుంట.

2. క్రియా ప్రధానాలు

వీటిలో క్రియాత్మక వర్ణన ప్రధానం. ఇక్కడ సంకీర్ణ వాక్యాలే అధికంగా ఉంటాయి. సరళాలు, సమానాలు, విషేధాత్మకాలు అయిన క్రియాపదాలతో కూడి ఉంటాయి. కొన్నింటిలో నిషేదం లేక పోవచ్చు.

ఉదా: దేహమెల్ల కండ్లు దేవేంద్రుడు కాడు
నరవాహనమెక్కి నడచిపోతాడు
నిండు ప్రాణములేదు తాను జీవులు జంపు.

3. అర్థ ప్రధానాలు

వీటిలో మొదట చెప్పిన విషయంలోని చివరి శబ్దం రెండవసారి చెప్పిన విషయానికి ముందు చేర్చబడి పొడుపు కథ సాగుతుంది. ఇది ముక్తపద గ్రస్తం వలె ఉంటుంది.

ఉదా: అంభాలు, అంభాలు మీద కుంభాలు – (కాళ్ళు, పిరుదులు)
కుంభాలు మీద కుడితి భాన – (కడుపు)
కుడితిబాన మీద ఈర పలక – (రొమ్ము)

ఈర పలక మీద ఇనుప గుండు – (తల)

ఇనుప గుండ్ల మీద ఇద్దరు జవాన్లు – (కండ్లు)

ఇద్దరు జవాన్ల మీద సీక్ పొద (వెంట్రుకలు)

సీక్ పొదలో పది రోస్ కుక్కలు – (షేన్లు)

5. పొడుపు కథలను అకారాది క్రమంగా, ముఖ్య పదాలను బట్టి, కథలోని విషయాన్ని బట్టి వర్గీకరింపవచ్చు. విషయప్రాధాన్యాన్ని బట్టి పొడుపు కథలను ఇలా విభజింపవచ్చు.

1. ప్రశ్నార్థకాలు :

ప్రశ్న : ఒక్కొక్క అడుగు పోయిన కొద్దీ కొంచెం తగ్గుతుంది. దాని పేరేమి ? సూది, దారం

2. వినోదాత్మకాలు: హాస్యం లేదా వినోదం ప్రధానం.

ప్రశ్న : చాపను చుట్టలేము, చంకను బెట్టలేము – ఆకారం

3. కథాత్మకాలు : కథను ఇముడ్చుకొంటాయి.

ఉదా: పంగలా పంగలా ఆకులు, సీమలా సీమలా అన్నం, చుక్కల చుక్కలచారు, పైగా గొౖరె సీమిడేసి తినుతిను అంటే వలాగమ్మా తినేది !

4. గొలుసు కట్టు కథలు : విప్పడానికి కష్టతరంగా, దిగ్రమ కలిగించేవిగా, సవాలు చేసేవిగా ఉంటాయి.

ఉదా : వీధిలో వుండే పొడుచెంత సక్కన (ఆముదపు మొక్క)

రైకలో ఉండే గుబ్బెంత సక్కన (గింజ)

5. వృత్తి సంబంధులు

ఉదా : ఒంటి గొల్లవాడు ఇద్దరిని పొడుచు (ముల్లుగర్ర)

6. సంఘజీవన సంబంధులు:

ఉదా : రెండు మిద్దెలకు ఒకటే దూలం (ముక్కు)

మిద్దెమీద మిరప చెట్లు నీళ్ళు లేక ఎండిపాయ (దీపం)

7. చిత్రశబ్దాత్మకాలు :

ఉదా : వంకర టింకర – (దొ)

నాకేమిస్తావు – (తే)

8. అశ్లీలార్థకాలు :

ఉదా: ఆలూ మొగుడు వాటేసుకుంటే అల్లీసాయి బొచ్చి యిడిపిచ్చాడు – బీగము

పొడుపు కథ కాలక్షేపానికి మాత్రమే కాదు. మానవ జీవితంతో సన్నిహిత సంబంధం

ఉండే సాహిత్య ప్రక్రియగా పొడుపు కథను గుర్తింపవచ్చు. ఇది వినోద సాధనం మాత్రమే కాకుండా విజ్ఞాన సాధనంగా కూడా చెప్పవచ్చు. రాజకీయంగా, తాత్త్వికంగా, మతపరంగా పొడుపు కథకు మానవ సంస్కృతితో సంబంధం ఉంది. ఇది జానపదుల బుద్ధి వికాసానికి తోడ్పడే బలమైన మాధ్యమం. కథను అడగడం, ఎదుటి వారు దానిని విప్పడం పిల్లలకు వినోదాన్ని, దానితో పాటు బుద్ధి వికాసాన్ని కలిగిస్తాయి. పొడుపు కథలతో ఆదిమానవునికి సంబంధించిన అనేక ఆచారాలు, సంప్రదాయాలు ముడిపడి ఉన్నాయి. వానను రప్పించడం కోసం, పెళ్ళిళ్ళలో వినోదం కోసం, పంటల సమృద్ధి కోసం కూడా పొడుపు కథలను వాడుతారు. వీటికి సంబంధించిన కొన్ని నిషేధాలు కూడా ఉన్నాయి. కొన్ని సందర్భాలలో పొడుపు కథలను ఉపయోగించరాదు. అన్ని వేళల వినోదాలతో కాలం వెళ్లబుచ్చితే పొలంపనులు సరిగా సాగవనే అభిప్రాయం. దీనికి కారణం కావచ్చు. పంట చేతికి వచ్చిన తర్వాత పండుగ చేసుకొని వినోదంగా కాలం గడిపితే తప్పులేదు.

పొడుపు కథలను గురించి పరిశీలన జరిపిన వారిలో అరిస్టాటిల్ మొదటివాడు. భారతీయులలో శ్రీ దుర్గా భాగవత్గా గారి పుస్తకం చాలా ప్రసిద్ధమైంది. రాగౌ సంకలనం ' నమ్మ ఒగటుగళు' మంచి సేకరణ. తెలుగులో పొడుపు కథల గురించి కొన్ని వ్యాసాలు కనిపిస్తున్నాయి.

సాధారణంగా జానపద సాహిత్యంలో ఉండే పొడుపు కథా లక్షణాలే బంజారాల పొడుపు కథలకు వర్తిస్తుంది.

**సామెతలు– పర్యాయ పదాలు :** 'సామెత' అను పదానికి సమానమైన పదం కన్నడంలో 'సామతి', ఈ 'సామతి' 'సామ్యతె' నుండి ఉద్భవించినట్లు తెలుగులో 'సామ్యత' నుండి 'సామెత' ఆవిర్భవించినట్లు చెపుతారు. "సామ్య" శబ్దానికి 'సామ్యత' అను అసాధురూపం ఏర్పడి, 'సామెత' గా మారి ప్రచారంలో ఉన్నదని డా॥ చిలుకూరి నారాయణరావు గారి అభిప్రాయం. ఈ పదం 15 వ శతాబ్దంలోని వరాహ పురాణంలో తొలిసారిగా ప్రయోగింపబడింది.

'నానుడి', 'లోకోక్తి', 'శాస్త్రం', 'జనశ్రుతి' – అని సామెతకు పర్యాయ పదాలు. సామెతను నిర్వచించడం అంత పనికాదు. 'ఏదో' సామెత చెప్పినట్లే అవుతుంది' – మనం నిత్యం ప్రతిప్రసంగ విషయంలోనూ సందర్భానుసారంగా 'ఏదో సామెత చెప్పినట్లుగా ఉండే నీ సంగతి' అనే మాటను సామెత వలెనే ఉపయోగిస్తాం. దానికి కారణం, మన అనుకొంటున్న సామెత సమయానికి గుర్తుకు రాకపోవడం, ప్రతి విషయం వెనుక ఏదో

ఒక సామెత నిశ్చయంగా ఉంటుందనే అభిప్రాయం పరిపాటిగా మారింది.

ఆంగ్లంలో సామెతను 'proverb' అంటారు. 'A General or common saying' అని దీనికి అర్థం. 'హిందీ భాషలో 'కహోవత్' అనీ, కన్నడ, తుళు భాషల్లో 'గాదె' అనీ వ్యవహారంలో ఉంది. తమిళులు 'పళమొళి' అనీ, 'మలయాళీలు' 'పళంచోల్' అనీ సామెతన సామెతలు సంక్షిప్తంగా ఉంటాయి. వివేకవంతంగా ఉంటాయి. పల్వురి జ్ఞానం ఒక్కని వివేకంగా వెలువడడం సామెతల పుట్టుకకు వ్యవహరిస్తున్నారు.

సామెతలు సంక్షిప్తంగా ఉంటాయి. వివేకవంతంగా ఉంటాయి. పల్వురి జ్ఞానం ఒక్కని వివేకంగా వెలువడడం సామెతల పుట్టుకకు సంబంధించింది. సామెతలలో ఇరవై పదాల కంటె అధికంగా ఉండవని కొందరి అభిప్రాయం.

'అల్పాక్షరాలలో అనల్పార్థ రచన' అన్న వాక్యానికి సామెతలు ఉదాహరణ ప్రాయంగా ఉంటాయి. సామాన్యంగా సామెతలలో ఒక వాక్యం మాత్రమే ఉంటుంది. ప్రాచీన కళాత్మక అభివ్యక్తులతో సామెతలు ముఖ్యమైనవి. అయితే సామెతలు ఎప్పుడూ సంక్షిప్తంగా ఉంటాయను కోవడానికి వీలు లేదు. నాతి దీర్ఘంగా, గంభీరంగా, సూచ్యంగా అనుభవాన్ని అభివ్యక్తీకరించేట్లయితే అలాంటి వాక్యాలను సామెతలని పిలువడంలో తప్పులేదు. సామెతలలో ఒక వాక్యంగాని, ఒకే పరిమాణం కలిగిన రెండు వాక్యాలు గానీ ఉండవచ్చు. చివరికి అక్షరాల సంఖ్యలో కూడా పోలిక కనిపిస్తుంది. అంటే, సామెతలోని రెండు భాగాల అక్షరాల సంఖ్య సమానంగా ఉంటుందన్నమాట 'చేసింది పోదు, చేయంది రాదు'– "చేసేవి లోపాలు" చెప్పిడే కోపాలు' –'నలుగురు నడిచిందే బాట, పలువురు పలికిందే మాట'. సామెతల్లో ప్రాసాను ప్రాసలతో కూడిన లయ కనిపిస్తుంది. ఛందో దృష్టితో చూస్తే వీటిలో ద్విపద పాదాలూ, తేటగీతి పాదాలూ, ఆటవెలది పాదాలు కనిపించవచ్చు. 'లయ' అన్నది ప్రాచీన కవితా గుణాలలో ఒకటి. ప్రాక్తన మానవుని భాష మామూలుగా లయబద్ధంగానే ఉండేదని మానవ శాస్త్రం చెపుతుంది. అందువల్ల ప్రాచీన సంస్కృతిని ప్రతిబింబించే సామెతల్లో కూడా లయ ఉంటుందని చెప్పాలి. లయ సామెతలను గుర్తు పెట్టుకోవడానికి ఉపయోగ పడుతుంది. కవితాగుణం సామెతల్లో ఉంటుందని చెప్పవచ్చు." [8]

డా. బిరుదురాజు రామరాజు గారు తమ 'జానపదగేయసాహిత్యం'లో కొన్ని జానపద గేయాలలోని సామెతలను తెలిపియున్నారు. అందులో కొన్ని –

గుర్రు మనగలేని కోపమెన్నటికి – బాలచంద్రుని యుద్ధం.

గొల్లమీది పుల్లరి గోగుమీద బచ్చలు, ఉలవలెత్తా మంటె ఊళ్ళనడిగెదవు
తెడ్డడిగినప్పుడే కొయ్యడిగినట్లు, పేదవానికోపం పెదవుల తీట
రక్షించువారిని రమ్మని పిలిచి–భక్షింపజూచినపని యింతలేదు – కాటమరాజుకథ
చల్లకోసంవచ్చి ముంత దాచగనేల, ముంజేయికంకణ
మరయుటకు ముకురముగావలెనా – దేశింగురాజు కథ
తనుగట్టుటకు త్రాళ్ళు తాదెచ్చుకొన్నట్లు –నల చరిత్ర
తానొకటి తలచితే దైవమొకటి తలచు
క్రొవ్వుచేతనుబోయి కొరత బడ్డట్లు –శశిరేఖా పరిణయం
ఇల్లు ఇరకటమంచు ఆలిమరకటమంచు
ఉడుమునకేలా ఊరి పెత్తనము వీరయ్య. వీర రాజమ్మ కథ

ఇలా జానపదగేయాలలో ఎన్నో ప్రసిద్ధమైన సామెతలు చోటుచేసికొన్నాయి. ఇక సామెతలలో ముఖ్యంగా చెప్పు కోవలసినది వ్యవసాయిక పరమైన సామెతలు. కారణం నూటికి తొంబదిశాతం గ్రామాలుండటమే. ఆకారణంచే అనేక వ్యవసాయిక సామెతలు మన జీవితంలో చోటు చేసికొన్నాయి. మచ్చునకు కొన్ని: 'రైతు దున్నితే రాజులకు అన్నం, నాగలి ఉన్న ఊళ్ళో ఆకలి చేరదు. కోటి విద్యలు కూటికోసం, కృషితో నాస్తి దుర్భిక్షం, దొరలు ఇచ్చిన పాలు కన్నా ధరణి యిచ్చిన ధాన్యంమేలు, జననిని, ధరణిని నమ్మినవాడు చెడడు, వానరాకడ ప్రాణం పోకడ తెలియవు, పెట్టుబడిలేని సేద్యం చద్దిలేని పయనం, ఎంత చెట్టుకంతగాలి, కాపులకష్టం భూపతిసంపద, సొమ్ముఒకడిది సోకొకడిది.

ఇలా ఈ సామెతలన్నింటినీ పరిశీలిస్తే ఇవి సమాజ అధ్యయానికి అభ్యుదయానికి సాధనాల వంటివని అంగీకరించక తప్పదు.

ఈ సామెతలనే ఆంగ్లంలో "PROVERBS" అంటారు. 'సామెత' ను సంస్కృతంలో 'లోకోక్తి' అంటారు. 'సామ్యత' అనే సంస్కృత పదం నుంచి 'సామెత' అనే తెలుగు పదం జనించిందని వాదన. సామ్యత అంటే సామ్యం. సామ్యమంటే పోలిక, దృష్టాంతం. కళ్ళకు కట్టినట్లుగా వుండే ఉదాహరణం అని చెప్పవచ్చు. సామ్యం శబ్దం సామ్యతగా మారి సామెత అయిందని చిలుకూరి నారాయణరావు పేర్కొన్నారు. నానుడి, శాస్త్రం, జనస్తుతి, లోకోక్తి అని సామెతకు పర్యాయపదాలు. తెలుగులో చిలుకూరి నారాయణరావు లక్షకు పైగా సామెతలను సేకరించాడు. 1868 లో M.W Car అన్న ఆంగ్లేయుడు "ఆంధ్రలోకోక్తి చంద్రిక" అన్న పేరుతో సామెతలు ప్రచురించారు. సామెతలు సార్వకాలికాలు. ఇవి

ప్రధానంగా వాక్య రూపంలో ఉంటాయి.

**సామెత వ్యవహార నామాలు**

| | |
|---|---|
| సంస్కృతం | సూక్తి సుభాషితము |
| అరబ్బీ | మతేత |
| తమిళం | పళమొళి (పాతమాట) |
| కన్నడం | గాదె (నాణ్ణుడి) |
| హిందీ | కహవత్ |
| మలయాళం | పళించాల్ |

**లక్షణాలు– వర్గీకరణ :**

**సామెత పర్యాయపదాలు**

1) నానుడి 2) లోకోక్తి 3) శాస్త్రం 4) జనశ్రుతి

**సామెత రకాలు :**

1. సూత్రపు సామెతలు : దుష్టుని చూచి దూరంగా ఉండు.
2. ఉపమాన రూపక సామెతలు : ఏదో ఒక పోలికను కలిగి అన్నట్లు 'అట్లు' అనే ప్రయోగాలతో కూడి ఉంటుంది, ఉదా : ఆడలేక అంగణం వంకర అన్నట్లు
3. నీతి బోధక సామెతలు : పులిని చూచి నక్క వాత పెట్టుకున్నదట
4. పౌరాణిక సామెతలు: రాత్రంతా రామాయణం విని రామునికి సీత ఏమి కావాలని అడిగాడట.
5. ప్రశ్న రూపక, ప్రశ్నోత్తర సామెతలు :
   1) ఆవు నలుపైతే పాలు నలుపా (ప్రశ్నార్థ రూప సామెత),
   2) పెండ్లాడుతావా? తాతా ! అంటే నా కెవరిస్తార్రా అబ్బాయి ! అన్నాడట.
6. సాంఘికాచార వ్యవహారాలు, విశ్వాసాలు, నమ్మకాలు :
   1) గతికితే అతకదు
   2) ఉండే ఉగాది లేకపోతే ఏకాదసి. మొదలైనవి
7. వ్యక్తిగత సామెతలు : అనంతయ్య చేతి మాత్ర వైకంఠ యాత్ర
8. హాస్యపు సామెతలు :
   1) ఆరు నెలల సాము చేసి మూలనున్న ముసలిదాన్ని కొట్టాడట
   2) బాపన సేద్యం – బాలవైద్యం.

9. వ్యవసాయం సంబంధ సామెతలు :

1) అశ్విని కురిస్తే అంతానష్టం.

2) స్వాతి వాన ముత్తెపువాన

10. శబ్దాలంకార సామెతలు: అన్ని దానాల కన్నా అన్నదానమే ప్రధానం.

**సామెతలపై వెలువడిన పరిశోధన గ్రంథాలు :**

1. Racial Proverbs గ్రంథకర్త – చాంపియన్
2. పసిడి పలుకులు – నేదునూరి గంగాధరం
3. కన్నడ – తెలుగు సామెతలు – జి.ఎస్.మోహన్
4. కన్నడ సామెతల సమీక్ష – తపస్వీకుమార్

"సామ్యత" అనే పదం వరాహపురాణంలో తొలిసారిగా ప్రయోగించబడింది.

సామెతల లక్షణాలతో మానవుని వివేకాన్ని ప్రతిబింబించేవిగా ఉండడం ఒకటిగా చెప్పుకోవచ్చు. పదునైన భావాలను పదునైన మాటల్లో చెప్పడం సామెత లక్షణం. చెప్పే విషయాన్ని సాధ్యమైనంత సూటిగా చెప్తాయి. మానవుని దీర్ఘానుభవం ఆధారంగా రూపుదాల్చిన సంక్షిప్త వాక్యాలు కావడం వల్ల సామెతలకు ఈ తీక్షణత లభ్యమైంది. చెప్పే విషయాన్ని ఆలంకారికంగా గూఢార్థద్యోతకంగా చెప్పడం సామెతకు మరో లక్షణంగా చెప్పవచ్చు. సామెతలలోని భాష సాంకేతికంగా ఉంటుంది. రూపకం, ఉపను, దృష్టాంతం సామెతల్లో తరుచుగా కనిపిస్తుంటాయి. అయితే స్వభావోక్తులు కూడా కొన్ని ఉంటాయి. మొత్తం మీద సంక్షిప్తంగా, వివేకవంతంగా, తీక్షణంగా, సాంప్రదాయికంగా, జనప్రియంగా, అనుభవ మూలకంగా ఉండే అభివ్యక్తులే సామెతలు అని నిర్వచింపవచ్చు.

## 4.6. అలంకార వైవిధ్యం

భారతీయ సాంప్రదాయానికి ఆర్షజీవన విధానానికి మూలమైన ఋగ్వేదంలో అలంకారం అనేది అరజ్కృత **"కాలే అస్యర కృతిః సూక్తా కదా । నూనెంతె మఘవన్ దాశేషు..."**[9] అని చెప్పబడింది. అలంకరించు శీలము గలవాడు అని దీని అర్థం. అంటే శబ్దాన్నిగానీ, అర్థాన్ని గానీ అలంకరించేది అలంకారము, ఇంతకు ముందున్న శబ్దార్థాలకు మరింత వన్నె కలిగించి అందంగా తీర్చిదిద్దేది శ్రోతల మనసును ఆకట్టుకునేటట్టు చెప్పబడేది అలంకారము. సాహిత్యానికి అందాన్ని ఆకర్షణీయతను కలిగించే అలంకారాలు రెండు విధాలుగా ఉంటాయి

1. కృత్రిమ విషయాలు, 2 సహజ విషయాలు

**కృత్రిమ విషయాలు** : మానవులకు అందుబాటులో లేకుండా కేవలం ఊహల్లో మాత్రమే

భావించి వాటిని అందుకునే వీలులేని విషయాలైన స్వర్గము, ఆకాశగంగ, హంసలు, అప్సరసలు మొదలైనవి అన్ని పూర్తిగా కవి కల్పితాలు, భౌతికంగా మానవుడు దర్శించలేని విషయాలు వీటిని ఉపమానాలుగా గ్రహించి శిష్ట సాహిత్యంలో, అలంకార పోషణలో ఉపయోగిస్తారు. ఇక్కడ చెప్పిన విషయాలన్నీ శ్రోతకు అపరిచితులు కాబట్టి అని తెలిపే భావాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకోలేరు.

**సహజ విషయాలు:** చుట్టూ ఉండే సమాజంలో ప్రకృతిలో నిత్య వ్యవహారంలో కనిపించే విశేషాలైన ముద్దబంతులు, పారే వాగులు, పంట పొలాలు మొదలైన పోలికలతో అలంకారిక రచన చేసినప్పుడు పాఠకునికి శ్రోతకు ఆయా ఉపమానాలు సుపరిచితాలు కాబట్టి చెప్పే భావనను సమగ్రంగా అవగాహన చేసుకోగలుగుతారు. ఆనందాన్ని పొందగులుగుతారు.

"పందము వడ్ల గుమ్మి దొడ్డు ఉక్కు స్తంభం" చుక్క సత్తయ్య గారి ఎల్లమ్మ ఒగ్గు కథలో పరశురాముడు దేవతల బొంగురం తీసుకుని వచ్చేటప్పుడు దారిలో దేగను కట్టిన స్తంభం గురించి చెప్తూ స్తంభం చాలా పెద్దగా లావుగా ఉంది అని చెప్పడానికి పందుము వడ్ల గుమ్మి దొడ్డు అనే పోలికను చెప్పాడు. పందము అనేది వ్యవసాయంలో ధాన్యాన్ని కొలిచే కొలమానం (పందము అనగా పది పుట్లు) గుమ్మి అనేది పూర్వ కాలంలో ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవడం కోసం ఉపయోగించేది. ఇది మేదరులు / ఎరుకలవారు అల్లి చేసిన గుండ్రని గంప వంటి వస్తువు. పందము ధాన్యం పట్టే గుమ్మి ఎంత లావుగా ఉంటుందో అంతటి లావుతో స్తంభం ఉంది అని పోలిక చెప్పినప్పుడు శ్రోతకు ఈ భావన సులభంగా అర్థమై తనకు పరిచయం ఉన్న గుమ్మి దొడ్డుతో ఇక్కడ చెప్పబడిన స్తంభాన్ని ఊహించుకుంటాడు. "గ్రాంథిక కవి తాను చదివి నేర్చుకున్న వానిని, ఊహాలోకంలో ఉండేవానిని ఉపమానాలుగా తెచ్చుకుంటాడు. కానీ జానపదకవి అలా కాకుండా నిత్య జీవితంలో కనిపించే వస్తువులను తనకు సుపరిచితాలైన వానిని ఎన్నుకొని గానం చేస్తాడు. అదీ వాని స్వచ్ఛతకు ఉదాహరణ"[10]

ఈ విషయాన్ని పరిశీలించినప్పుడు శిష్ట సాహిత్యంలో చాలా వరకు కృతకంగా కనిపించే ఊహాతీతాలైన వస్తువుల్ని పోలికలుగా తీసుకునే అలంకార ప్రయోగం కనిపించగా జానపద కళారూపాలలో ముఖ్యంగా నేటికి ప్రజలచే అత్యంత ప్రజాధరణ పొందుతున్న ఒగ్గు కథాగాన ప్రదర్శనలో కథకులు నిత్య జీవితంలో కనిపించే వస్తు విశేషాలను జానపదులకు సుపరిచితాలైన వస్తు విశేషాల్ని పోలికలుగా తీసుకుని అలంకార ప్రయోగం చేస్తాడు. జానపద సాహిత్యంలో ఆలోచనాయుత రచన /గానం కన్నా ఆశువుగా చెప్పడమే ఎక్కువగా కనిస్తుంది. జానపదులు

సుఖదుఃఖాలలో కలిగిన సహజమైన భావాలు శబ్దార్థాలుగా లయబద్ధంగా వివరించబడుతాయి. అవి సహజమైన పోలికలతో కవితాత్మకాలై ఉంటాయి. "తదల్పమపినోపేక్షం కావ్యేదుష్టం కథంచన" అని కావ్యంలోని ఏ చిన్న దోషమున్న అది కావ్యానికి లోపం అనే విషయం జానపద సాహిత్యానికి వర్తించదు. జానపదుల భావాల్ని తాదాత్మ్యం చెందిస్తూ కథాసూత్రాన్ని ఆధారంగా చేసుకుని ఆశువుగా మనసులో భావోద్రేకంతో వడిగా దూకే సెలయేరుగా, పాడే పద ప్రవాహంతో సాగే జానపద కళారూపమైన ఒగ్గుకథలో కథానుగుణంగా ఎన్నో విధాల అలంకారిక పద ప్రయోగం ఉంటుంది. కొన్ని చోట్ల లాక్షణికుల సిద్ధాంతపరిధిదాటిన పద, భావ ప్రయోగాలు కనిపిస్తాయి. అంతమాత్రాన అది దోషం కాదు. ఎందుకంటే ప్రకృతి అంతా గాలి, నీరు, చెట్టు, పుట్ట, కొమ్మ రెమ్మ ఇవన్నీ లయబద్ధంగా కదులుతాయి. కానీ నియమబద్ధంగా కాదు. అలాంటి ప్రకృతి నేపథ్యంగా వచ్చినటువంటి లక్షణ గ్రంథాల అక్షరజ్ఞానం పొందని ఒగ్గుకథాగానంలో ప్రయోగించి అలంకారాలన్నీ కూడా ప్రాకృతికాలే. సాహిత్యం పరమప్రయోజనాలైన ఆనందం, ఉపదేశాలు రెండు ఒగ్గు కథాగానం ద్వారా సంపూర్ణంగా సిద్ధిస్తాయి. కావున ఒగ్గు కథాగానంలో కనిపించే అలంకారిక ప్రయోగాలన్నీ సరైనవనీ సహృదయ సమ్మితాలని గ్రహించాలి.

### 4.6.1. శబ్దాలంకారాలు

ముందుగా మనస్సును ఆకర్షించే బాహ్య సౌందర్యము లాగా వినగానే మనస్సుకు హాయిని కలిగిస్తూ పండిత పామర జనరంజకంగా ఉండే ఒగ్గుకథాగానంలోని శబ్దాలంకార విశేషాల్ని తెలుసుకుందాం. భరతుడు నాట్యశాస్త్రంలో తెలిపిన శబ్ధాలంకారం యమకం మాత్రమే, దాన్ననుసరించి వ్యవహారంలో ఉన్న శబ్ధాలంకారాలు, 6. వృత్యానుప్రాస చేకానుప్రాస, లాటానుప్రాస, అంత్యానుప్రాస, యమకం ముక్తపదగ్రస్తం.

**1. వృత్యానుప్రాస :** ఒక వాక్యంనందు గానీ, పద్య పాదమునందు గానీ, వచ్చిన అక్షరం పదేపదే ఆవృత్తి కావడం తిరిగి తిరిగి ప్రయోగించబడడం వృత్యానుప్రాస.

శిష్ట సాహిత్యానికి పునరుక్తిదోషం అయితే జానపద సాహిత్యానికి పునరుక్తి లక్షణం. సహజంగా ఆశువుగా కైగట్టి పాడే జానపద సాహిత్యంలో ఒక పాదం / పదం నోటి నుండి బహిర్గతమవుతున్నప్పుడే దాని తర్వాత చెప్పబోయే పాదానికి మనసులో బీజం పడి అది వాగ్రూపాన్ని సంతరించుకుంటుంది. ఇది అత్యంత వేగంగా సాగే ప్రక్రియ. అలా ఆశువుగా చెప్పే సమయంలో ఒక విషయం తర్వాత మరో విషయం చెప్పడానికి మధ్య కొద్దిగా వ్యవధి ఎక్కువైనప్పుడు మొదటి పాదంలోని పదాలు పునరావృతం అవుతాయి. ఈ పునరావృత్తి జానపదానికి

అలంకారం కేవలం పదమో, పాదమో కాదు అక్షరాల ఆవృత్తి కూడా కథాగానానికి చక్కని మాధుర్యతను కలిగిస్తుంది. అలా ఒకే అక్షరం పలుమార్లు ఆవృత్తి కావడం చాలా సందర్భాలలో కనిపిస్తుంది.

"మోగోళ్లు ర్యాగళ్లు నాగళ్ళు దున్నంగ... **(చుక్క సత్తయ్య - మల్లన్న కాపుల ఘట్టం)** మల్లన్న కాపుల ఘట్టం ఒగ్గు కథలో రారాజు మల్లయ్య రాజ్యపాలన చేస్తుంటే అతని ఆరుగురు అన్నలు వ్యవసాయం చేస్తారు. వారి ఇంటి పెద్దకోడలు వన్నెలక్కమ్మకు తన భర్త వ్యవసాయం చేయడం ఇష్టం ఉండక తన యారాళ్లను (తోడికోడళ్ళను రెచ్చగొడుతూ"మోగోళ్లు ర్యాగళ్లు నాగళ్ళు దున్నంగ మల్లయ్య ఒక్కడే రాజ్యమేలుతుండు" అంటుంది. ర్యాగడి (సారవంతమైన నేల రేగడి / గ్యారడి) బహువచనం ర్యాగళ్లు. మన మొగోళ్ళు అంటే మన భర్త అని అర్థం. గ.ళ్లు అనే అక్షరాలు ముమ్మారు ఆవృత్తమై ఈ వాక్యానికి చక్కని అనుప్రాసను కలిగిస్తున్నాయి. ఒకే విధమైన అక్షరం ఆవృత్తమైన అందాన్ని కలిగించినందున ఇది వృత్యానుప్రాస.

"కోపం తాపం పాపమెరుగదని" **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ)** తన తండ్రి పేరు చెప్పమని పరశురాముడు రేణుకా ఎల్లమ్మను నానా రకాలుగా హింసించి నిప్పుల గుండం లోపల బొర్లించగా ఎల్లమ్మ ఆ వేడికి మూర్ఛపోతుంది. తల్లిని చూసిన పరశురాముడు తానే చేజేతులా తల్లిని చంపుకున్నానని బాధపడ్డప్పుడు "కోపం, తాపం పాపమెరుగదని" కథకుడు వ్యాఖ్యానించిన సందర్భంలో 'ప' అనే అక్షరం పలుమార్లు ఆవృత్తి కావడం గమనించవచ్చు.

"వాడ వాడల చేడెల పిలిచి ఒలకంగా ఒడివాలు పోసి.."**(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ)** ఆది జాంబవులవాడ నుండి ఎల్లమ్మను తిరిగి పరశురాముని వెంట పంపించే సమయంలో ఆదిజాంబవుడు-మాత లింగమ్మ అప్పటి వరకు తమ ఆశ్రయంలో ఉన్న ఎల్లమ్మను ఆడిబిడ్డగా భావించి వాడ వాడల చేడెల పిలిచి ఒలకంగా, ఒడివాలు పోసిసాగనంపుతారు. ఈ వాక్యాలలో డ కారంతో పాటు ల కారం కూడా పలుమార్లు ఆవృత్తి అయి వృత్యానుప్రాస అలంకారంగా శోభిస్తుంది. మరియు వాక్యాన్ని రెండుగా విభజించినప్పుడు అంత్యానుప్రాస కూడా కనిపిస్తుంది.

"పట్టు బట్టలు చింపి పక్కలు పరిచి పండుమని మీయమ్మ పల్లెకు ప్రాయే..." **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ)** ఎల్లమ్మ తల్లి తన పిల్లలకు జోలపాడుతూ ఉన్న సందర్భాన్ని వివరిస్తూ ఒగ్గు కథకుడు గానం చేసిన సందర్భంలో వినిపించే ఈ పాటలో 'ప' అనే అక్షరం మరియు దాని మిత్రక్షరాలైనా బ, వ అనే అక్షరాలు పాఠంలో పలుమార్లు అవృత్తం అయినందున

ఇది వృత్త్యానుప్రాస.

"ఇద్దరన్నదమ్ములు జోడు పెద్ద పులులురా, ఒద్దులెల్ల వట్టిరి మద్దులెల్ల వట్టిరి..." **(మల్లన్న కాపుల ఘట్టం)**

పటేలు మల్లయ్య ప్రధాని సంగయ్యలు కొల్లాపురికి బయలుదేరిన సందర్భంలో వర్ణించబడిన కథాగానంలో ప్రాసయతిగా ప్రయోగించబడిన ద్విత్వ దకారం (ద్ద) రెండు పాదాలలో ఆవృత్తమైనందున ఇది వృత్త్యానుప్రాస. ఈవిధంగా ప్రాసయతిగతంగా వచ్చే వృత్త్యానుప్రాస కథాగమనానికి చక్కని తూగును అందిస్తాయి.

"రామ రామ రామన్న రామ... రామ రామ రానున్న రామ... రామన్న రామ... " కథాగానంలో కథకు తగిన దరువును ప్రారంభించే సమయంలో ముందుగా రామ శబ్దంతో దరువును పాడుతారు. ఆ దరువులోనే ఆయా సందర్భంలోని కథాగానాన్ని కొనసాగిస్తారు. కథాగానంలో దరువు వచ్చినప్పుడు దానికి తగ్గట్టుగా తాళం, డోలు సవరించుకునేందుకు వీలుగా రామ నామంతో దరువు మొదలు పెడతారు.

ఒగ్గు కథాగానం మొత్తం ప్రాసాత్మకంగా చెప్పబడుతుంది. పద విరుపు స్థానంలో వచ్చే యతి ప్రాసాత్మకంగా మారి కథాగానానికి లయాత్మకతను చేకూరుస్తుంది. అందులోను ఒకే అక్షరం పలుమార్లు అవృత్తమై కథాగానానికి వీనులవిందైన నాద సౌందర్యాన్ని అందించే వృత్త్యానుప్రాస ద్వారా పండితపామర  జనరంజకంగా మారుతుంది.

**2. లాటానుప్రాస:** అనుప్రాసలో మరో భేదం లాటానుప్రాస, వాక్యములో వచ్చిన పదము నామవాచకమైనా లేదా క్రియాపదమైనా వెంటవెంటనే వ్యవధి లేకుండా ప్రయోగింపబడిన ఆ పదం యొక్క అర్థానికి దృఢత్వాన్ని, నిశ్చితత్వాన్ని కలిగింప చేయడాన్ని, ఒకేపదం అర్థం భేదం లేకుండా తాత్పర్యభేదంతో వ్యవధిలేకుండా ప్రయోగించడాన్ని లాటానుప్రాస అంటారు. ఇక్కడ ఒకసారి వచ్చిన పదం తిరిగి వెంటనే ప్రయోగించబడడం పునరుక్తి దోషం కాదు. నిజానికి జానపదానికి పునరుక్తి ఒక లక్షణం. ఇక్కడ పునరుక్తి వల్లనే లాటానుప్రాస అలంకారం ఏర్పడుతుంది. గోనెవరి మాసమ్మ తన బిడ్డ పద్మావతిని మల్లయ్యకు ఇచ్చి పెళ్లి చేయడం ఇష్టం లేక కష్టసాధ్యమైన రకరకాల కట్నాలు కోరుతూ దెప్పుడు కొంచెపు రాతు రాసి లేఖ పంపుతుంది. అందులో చివరగా "నేను నా బిడ్డ లగ్గం మల్ల చేసే చెయ్యవోతన అయ్యాలారో అయ్యలారా.... చిన్నవాడు మల్లయ్య శివలీల పుత్రుడు / గండాన పుట్టిన ఘనుడు మల్లయ్య అని మీరనట్లు / రారాజు మల్లయ్య నిజంగ వీరుడే అయితే నేను కోరిన కట్నాలన్ని / తెచ్చి నా బిడ్డను కళ్యాణం

చేసుకొమ్మని చెప్పుఉండి అయ్యాలారో అయ్యలారా...! / ఇవన్నీ తెచ్చినట్టయితేనే రారాజు మల్లయ్య మల్లయ్య / లేకుంటే మల్లి అని ఆడిదాని తీరుగ కొంగుముసుగేసుకుని తిరుగమనుండ్రి అని చెప్తుంది. **(మల్లన్న కాపుల ఘట్టం)**

ఇందులో మల్లయ్య మల్లయ్య అనే పదం వ్యవధి లేకుండా వెంటవెంటనే ప్రయోగించబడింది. రెండు పదాల అర్థం ఒక్కటే అయినప్పటికీ తాత్పర్యంలో భేదం కనిపిస్తుంది. మొదటిపదం మల్లయ్యను సూచించగా, రెండవ పదం గోనెవరి మాసమ్మ కోరిన కట్నాలు తెస్తేనే వీరుడిగా కీర్తించబడే మల్లయ్య పేరు నిలుపుకున్న వాడవుతాడు అనే భావాన్ని స్ఫురింపజేస్తుంది. అలాగే ఈ సుదీర్ఘవచనంలో చివరగా ఆవృతమయ్యే అయ్యాలారో అయ్యలారా అనే సంబోధనలో కూడా లాటానుప్రాస కనిపిస్తుంది.

ఎల్లమ్మ ఒగ్గు కథలో ఎల్లమ్మ తన భర్త జమదగ్నిని సత్యానబోనం సహాయంతో పునర్జీవితాన్ని చేసి సంతానఫలం కోరుకుంటుంది. జమదగ్ని రేణుకా ఎల్లమ్మకు పుత్రసంతానాన్ని ప్రసాదించగా ఇంకా సంతానాన్ని కోరుకుంటూ "నాథా, ప్రాణేశ్వరా ! ఒక్క కొడుకు కొడుకు కాదు, ఒక్కెద్దు ఎవుసం కాదు, ముక్కుపుల్ల సొమ్ము గాదు, మూడు పైసలు ముల్లె గాదు, ముసలోడు మొగుడు కాదు" అందుకని అని నాకు సంతానాన్ని అనుగ్రహించమని కోరుకుంటుంది. **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ)**

ఇందులో ఒక్క కొడుకు కొడుకు కాదు అని చెప్పడానికి బింబ ప్రతిబింబ భావనతో కూడిన ఇతర ఉదాహరణలతో చెప్పడం వలన ఇది దృష్టాంతాలంకారం అయినప్పటికీ ఒక్క కొడుకు కొడుకు కాదు అనే మొదటి వాక్యంలో లాటానుప్రాస కనిపిస్తుంది. ఇందులో కొడుకు అనే రెండు పదాలకు పుత్రుడు అనే సమాన అర్థం ఉన్నప్పటికీ మొదటగా ప్రయోగించిన కొడుకు అనే పదానికి ఒకే కొడుకు ఏకైక పుత్రుడు అనే భావం రెండవసారి ప్రయోగించబడిన కొడుకు పదానికి ఇది వరకు చెప్పిన ఒకే కొడుకు కొడుకు కాలేదు అనే భావం. ఈ విధంగా కొడుకు అనే పదం ఒకే అర్థంలో తాత్పర్యభేదంతో వ్యవధిలేకుండా ప్రయోగించినందున ఇది లాటానుప్రాస.

నువ్వి సువ్వన్నల్ల సువ్వన్నల సువ్వన్నలాల / వడ్లోల్లు చేసిన వన్నెలా గదము వన్నె లాగదము కమ్మరి చేసిన గంటలా పొన్ను గంటలా పొన్ను / సంగడి రోకలి సక్కదనమేమి సక్కదనమేమి **(చుక్క సత్తయ్య మల్లన్న కాపుల ఘట్టం ఒగ్గు కథ)**

ఒగ్గు కథాగానంలో వివాహ వర్ణ సమయంలో గానం చేసే కొట్నం పాట ఇది. ఇందులో

దంచడానికి అవసరమయ్యే పరికరాల్ని వర్ణిస్తూ కథాగానం చేస్తారు. అందులో భాగంగా "సంగడి రోకలి సక్కదనమేమి సక్కదనమేమి" అని సంగడి రోకలి గురించి వర్ణించారు. సంగడి రోకలి అంటే దంచడానికి అవసరమైన సాధారణ రోకలినే గుండ్రంగా చెక్కి నునుపుగా తీర్చిదిద్దబడిన రోకలి అని అర్థం. ఈ వర్ణనాత్మక కథాగానంలో సక్కదనమేమి అనే ప్రశ్నాత్మక పదం రెండుసార్లు తాత్పర్యం భేదంతో ప్రయోగించబడింది కావున ఇది లాటానుప్రాస. "సంగడి రోకలి సక్కదనమేమి సక్కదనమేమి" అనే పాదంలో మొదట ప్రయోగించబడిన సక్కదనమేమి పదంరోకలి చక్కదనంకు సంబంధించిన ప్రశ్నాత్మక భావాన్ని కలిగి ఉండగా, రెండవసారి ప్రయోగించబడిన సక్కదనమేమి అనే పదానికి గంటలపొన్నుతో ఉన్న సంగడి రోకలి ఎంత చక్కగా ఉంది అనే ప్రశంసాత్మకభావం ఉంది. ఈ విధంగా ఒకే పదం అర్థం భేదం లేకుండా తాత్పర్య భేదంతో వ్యవధి లేకుండా ప్రయోగించబడినందున ఒగ్గు కథాగానం కొట్నం పాటలో అంతర్గతంగా వచ్చే రోకలికి సంబంధించిన ఈ వర్ణనలో లాటానుప్రాస అలంకారం కనిపిస్తుంది.

**3. ఛేకాను ప్రాస :** కొన్ని అక్షరాల సమూహం లేదా కొన్ని పదాలు పదే పదే ప్రయోగించబడడం ఛేకానుప్రాస, ఛేకులు అంటే చమత్కారంగా మాట్లాడేవారు. ఒకే పదాన్ని పదే పదే ఆవృత్తి చేస్తూ చెప్పడం ఛేకానుప్రాస.

కుంచాన కొలువనీయక / మంచాన పండనీయక / కంచాన పండనీయక నా తల్లిని కష్టపెట్టిన అని పరశురాముడు అనుకున్నాడు. **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ)**

ఎల్లమ్మ ఒగ్గు కథలో తండ్రి పునర్జీవితుడైన తర్వాత పరశురాముడు అంతకాలం తాను తల్లి ఎల్లమ్మను బాధపెట్టిన సంగతిని గుర్తు తెచ్చుకుంటూ చెప్పిన సందర్భంలోని ఈ వాక్యానికి మనశ్శాంతిని, తృప్తిగా ఉండనివ్వలేదు అని అర్థం. ఇందులో 'చానా' నీయక అనే పదాలు పలుమార్లు అర్థ భేదంతో ఆవృతం అయినందున ఇది ఛేకానుప్రాస, స్థానాన్ని బట్టి ఇందులో ఉన్న అక్షర ప్రాసను గమనిస్తే చాన అక్షరాల్ని మధ్య ప్రాస గాను, నీయక అనే అక్షరాల్ని అంత్యప్రాసగాను గుర్తించవచ్చు.

పొద్దుజూడ పట్నము పొన్నలంగడున్నది / మాపుజూడ పట్నము మల్లెలంగడున్నది **(ఎల్లమ్మ ఒగ్గు కథ)** ఎల్లమ్మ మావురం పట్నాన్ని వర్ణిస్తూ, మల్లన్న కొల్లాపురిని వర్ణిస్తూ ఒగ్గు కథాగానం చేసి సందర్భంలో వినిపించే ఈ కథాగేయంలో జూడపట్నము, అంగడున్నది అనే పద సముదాయం పలుమార్లు అవృత్తమైంది. కావున ఆది ఛేకానుప్రాస.

"శిగముడి యిప్పి శివుని తలచుకుని / తలముడి యిప్పిం, తల్లిని తలచుకుని...

తారకమంత్రం తనువెల్ల చదివి పుట్టుపుట్టుమంటెరా మరి ఏమి పుట్టెరా...." **(మల్లన్న**

గొల్ల కేతమ్మ) మరియు (ఎల్లమ్మ ఒగ్గు కథ)

ముడి యిప్పి తలచుకుని అనే పదాలతో పాటు ద్వితీయా విభక్తి ప్రత్యయమైన 'ని' కూడా రెండు సార్లు ప్రయోగించబడింది. కావున ఇది ఛేకానుప్రాస.

"ముక్కులెంటికలు ముగుదాళ్ళు / సంకలెంటికలు శాతాళ్ళు" (చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ) అడవిలో తపస్సు చేసుకుంటున్న జమదగ్ని గురించి తెలియజేస్తూ క్షవర సంస్కారం లేని ఆయన రూపాన్ని శరీరం మీద వెంట్రుకలు పొడవును అతిశయోక్తిగా వర్ణించిన ఈ కథాగానంలో లెంటికలు తాళ్లు అనే పదాలు రెండు సార్లు ఆవృతం అయ్యాయి కావున ఇది ఛేకానుప్రాస..

"ఈగలు వద్ద గంజిదాగి ఇల్లావరించాలె / దోమలు వడ్డ గంజిదాగి దొడ్డా వరించాలె" (చుక్క సత్తయ్య మల్లన్న గొల్ల కేతమ్మ ఒగ్గు కథ)

బలిజమేడలమ్మతో సాటికి సవతిని తెచ్చి సల్లగుంజల కాడ పంచాయితీ పెట్టించి కొట్టిస్తానని పందెం కాసి బయలుదేరిన పర్వతాల మల్లయ్యకు మేడలమ్మ కంటే అందెగత్తె ఎక్కడున్నదో తెలియక బాధపడుతాడు. అప్పుడు రేణుకా ఎల్లమ్మ వచ్చి గొల్ల కేతమ్మ అందం గురించి చెప్పి అటువంటి గొల్ల కేతమ్మను నువ్వు పెళ్లి చేసుకోవాలంటే "తమ్ముయడా మల్లయ్య, నీవు ఏడేండ్లపాటు గొల్లల ఇండ్లల్ల ఇలటాలు పొంది గొర్లు గాయాలే, ఈగలు వడ్డ గంజిదాగి ఇల్లు వరించాలె. దోమలు వడ్డ, గంజిదాగి దొడ్డవరించాలె" అని చెప్తుంది. ఇక్కడ ఆవరించడం అంటే నిలపడం కాపాడడం అభివృద్ధి చేయడం అనే వ్యవహారిక అర్థాన్ని గ్రహించాలి. ఈ కథాగానంలో పడ్డ గంజి దాగి ఆవరించాలె అనే పదాలు రెండుసార్లు అవృతమయ్యాయి కావున ఇది ఛేకానుప్రాస.

చేతులు కలిస్తే చప్పట్లు / మాటలు కలిస్తే ముచ్చట్లు. (మల్లన్న కాపుల ఘట్టం)
వన్నెలక్కమ్మ తన తోడికోడళ్ళతో కలిసి మల్లయ్య మీద నింద మోపాలని పన్నాగం వేసిన సందర్భాన్ని వర్ణించిన కథాగానంలో బహువచన ప్రత్యేకమైన లు పలుమార్లు ఆవృత్తమై వృత్యానుప్రాస కలిస్తే అనే పదం రెండుసార్లు ప్రయోగించబడిన ఛేకానుప్రాస కనిపిస్తుంది.
చెట్టాకుదిని శెలిమె నీళ్ళుదాగి / మానాకుదిని మడుగు నీళ్ళుదాగి (చుక్కా సత్తయ్య మల్లన్న కాపుల ఘట్టం)

కాలుదుమ్ము లెసెనా కైలాస మందెనా / దెక్కదుమ్ము లెసెనా దేవలోక మందెనా (చుక్క సత్తయ్య – మల్లన్న కాపుల ఘట్టం)

కుడిమీస మొడివెట్టి గుడ్లెర్రజేసి / ఎడిమీ్మనమొడివెట్టి వెన్ను ఒరుగజూసి **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ)**

ఇలా ఒగ్గు కథాగానంలో వివిధ సందర్భాలలో కథాగత విశేషాలను వర్ణిస్తూ చెప్పే కొన్ని గేయాలలో, వచనంలో పైన తెలిపిన విధంగా ఒకే విధమైన పదాలు ఆవృతమవుతూ ఛేకానుప్రాస అలంకారంలో కథాగానానికి శబ్ద చమత్కారాన్ని కలిగిస్తాయి.

4. అంత్యానుప్రాస

వాక్యం చివరన, గేయంలో పాదాల చివరన ఒకే విధమైన పదాలు ఆవృత్తి అయితే దాన్ని అంత్యానుప్రాస అంటారు. ఒగ్గు కథాగానంలో అంత్యానుప్రాస విరివిగా కనిపిస్తుంది. పునరుక్తి లక్షణంగా ఉండే జానపద సాహిత్యంలో బతుకమ్మ పాటలలో చాలా వరకు కథాగేయాలలో ఈ పునరుక్తి పదాంతంలో లేదా పాదంతంలో ప్రయోగింపబడి అంత్యానుప్రాసగా గానాన్ని అలంకార శోబితం చేస్తుంది. వివిధ దరువులలో కథాగానం చేస్తున్నప్పుడు, అనుసందాన వచనం చెప్తున్నప్పుడు అంత్యానుప్రాస కనిపిస్తుంది.

పుంటికూర తిన్న పుట్టినిల్లు / తైదంబలి దాగిన తల్లిగారిల్లు **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ)** పుంటి కూర, తైద అంబలి అనేవి తెలంగాణ మాండలిక వ్యవహార రూపాలు. పుట్టినిల్లు అన్నా, తల్లిగారిల్లు అన్నా ఒకే అర్థం. పుట్టినిల్లుకు పుంటికూర, తల్లిగారిల్లుకు తైదంబలి అనే పదాన్ని తీసుకోవడం ప్రాస కోసమే అయినప్పటికీ రెండు వాక్యాల చివరన ఇల్లు అనే నామవాచకం ప్రయోగించబడింది. కావున ఇది అంత్యానుప్రాస అలంకారం.

ఈ ప్రయోగాన్ని లోతుగా పరిశీలించినపుడు పుంటికూర, తైదలు ఈ రెండు ఆహార పదార్థాలు తెలంగాణ ప్రాంతంలో విరివిగా లభించేవి. ఒకనాడు తెలంగాణ ప్రాంతంలో నిత్యం తినే ఆహార పదార్థాలు. పెళ్లయిన తర్వాత తల్లిగారింటికి బిడ్డ వచ్చినప్పుడు ఏదో ఒక ప్రత్యేక వంటకం చేయడం పరిపాటి, కానీ తల్లిగారి పేదరికం వలన బిడ్డకు ఏమి ప్రత్యేకంగా వండి పెట్టకపోయినప్పటికీ బిడ్డకు తల్లిగారి ఇంటి మీద ప్రేమ తగ్గిపోదు. స్త్రీకి పుట్టింటి మీద ఉండే అవ్యాజమైన ప్రేమానురాగాల గురించి తెలిపే ఈ మాటలలో ప్రాంతీయ విశేషాలు నిబిడీకృతమై చక్కని అంత్యానుప్రాస కనిపిస్తుంది.

"పున్నానికి పుచ్చిపోతరు / అమాసకు ఆరిపోతరు **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ)**

"నీకుడి బాదు గుళ్ళు గుర్రాలు దొక్క / ఎడమబాదు గుళ్లు ఏనుగులు దొక్క **(చుక్క సత్తయ్య మల్లన్న గొల్ల కేతమ్మ కథ)**

"పగోన్ని తిట్టినా పాసంగం తప్పదు" అనే సామెత ఒగ్గు కథాగానంలో తిట్లను వర్ణిస్తూ

సాగే కథాగానంలో కనిపిస్తుంది. సత్యాన్నబోనాన్ని ఎంగిలి చేసిన కార్త్యవీర్యుని ఘటుల్ని ఎల్లమ్మ తిట్టిన సమయంలో 'పోతారు' అనే క్రియాపదం అంత్యానుప్రాసగా కనిపించగా, తాను మానవ జన్మ ఎత్తడానికి కారకుడైన శివుడే తన దుఃఖానికి కారణం అని భావించి ఏడుస్తూ ఆవేదనతో దేవుని నిందించిన మల్లయ్య నిందలో 'తొక్క' అనే క్రియ పదం అంత్యాప్రాసగా ఉంది.

"వంగిన నడుములెత్తరు / వంటికి చేతులు వెట్టరు" **(చుక్క సత్తయ్య మల్లన్న కాపుల ఘట్టం)**

ఆదిరెడ్డి-నీలమ్మ దంపతులు అడవిపాలై కష్టాలు అనుభవిస్తూ ఉండగా వారి ఆరుగురు కొడుకులు జొన్న చేనుకోయడానికి కైకిలి వెళ్తారు. అక్కడ వారు పడే శ్రమను వర్ణిస్తూ సాగిన ఈ కథాగానంలో 'ఎత్తరు', 'పెట్టరు' వంటి వ్యతిరేక క్రియలలో బహువచన ప్రత్యయం 'రు' అంత్యప్రాసగా కనిపిస్తుంది.

కడుపుకన్నము లేదు కంటికి నిద్ర లేదు / చెట్టుగాని పిట్టరీతి శేరులేని ఉయ్యాల రీతి **(చుక్క సత్తయ్య మల్లన్న కాపుల ఘట్టం)** అడవిపాలై తిండి లేక తిరుగుతున్న నీలమ్మ కుటుంబాన్ని వారి కష్టాలను వర్ణిస్తూ చేసే కథాగానంలో లేదు, రీతి అనే పదాలు అంత్యప్రాసగా ప్రయోగించబడ్డాయి. ఈ విధంగా అనుప్రాసలతో ఆశువుగా సాగే ఒగ్గు కథాగానంలో కనిపించే అంత్యానుప్రాస అలంకారం కథాగానానికి గాన యోగ్యతను కలిగిస్తుంది.

**5. యమకం:** వాక్యములో ఒకే పదం అర్థభేదంతో వ్యవధితో ప్రయోగించడాన్ని యమకం అంటారు. భరతుడు నాట్యశాస్త్రంలో తెలిపిన ఏకైక శబ్దాలంకారం యమకం మాత్రమే. ఇది అనుప్రాసనే అయినప్పటికీ అర్థం బేదం, వ్యవధి ప్రధానంగా ఉండడం వలన ఇది యమకాలంకారంగా పిలవబడుతుంది. అర్థభేదం కలిగిన పదాల ఆవృత్తి యమకం ప్రధాన లక్షణం.

ఎల్లు ఎల్లవే ఎల్లమ్మ తల్లెల్లమ్మ / ఎల్లి సూడవే ఎల్లమ్మ తల్లెల్లమ్మ **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ)** ఇందులో ఎల్లమ్మ అనే పదం వ్యవధితో అర్థభేదంతో ప్రయోగించబడింది. వెళ్ళుపదం శబ్ద పరిణామం పొంది పదాది హల్లు లోపించి 'ఎల్లు'గా మారింది.

ఎల్లు+ అమ్మ ఉత్వసంధి జరిగి ఎల్లమ్మ అయింది. ఎల్లమ్మ ఒగ్గుకథలో కన్న కొడుకు పరశు రాముడు పెట్టే బాధలు భరించలేక చివరికి జాంబవుని ఇంటిదగ్గర లందలో ఆశ్రయంపొంది దాక్కుంటుంది. తల్లిజాడ తెలుసుకున్న పరశురాముడు లందలో నుండి తల్లికి ఉత్సాహం, ఉగ్రం తెప్పించి బయటకు రప్పించడానికి పంబాల వేషం కట్టిపాడే సమయం లేనిది ఈ పాట. ఎల్లు ఎల్లవే ఎల్లమ్మ (ఎల్లు + అమ్మ ) తల్లెలమ్మ (తల్లి + ఎల్లమ్మ ) ఈ పాదంలో రెండు సార్లు

యమకాలంకారం ప్రయోగం కనిపిస్తుంది. ఎల్లు అనే అర్థ భేదంతో (వెళ్ళు, ఎల్లమ్మ) వ్యవధితో ప్రయోగించబడింది. అలాగే ఎల్లమ్మ అనే పదం కూడా అర్థబేధంతో (ఎల్లు అమ్మ = బయట కెళ్లుతల్లి అని) (తల్లి + ఎల్లమ్మ = తల్లీ ఎల్లమ్మ అని) వ్యవధితో ప్రయోగించబడింది. "వృత్తులకు మిత్తులకు సకలకర్మకు కుండ కుండలేకుండ జగముండబోదన్న" **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గుకథ)** వంటి వర్ణనలలో సహజసిద్ధమైన యమకాలంకారం కనిస్తుంది.

**6. ముక్తపదగ్రస్తము:** ముక్త-పద-గ్రస్తము విడిచిన పదాన్ని మరల గ్రహించడం అని అర్థం. ఒక వాక్యం చివరనున్న పదంతో తరువాతి వాక్యాన్ని ప్రారంభించి చెప్పడం ముక్తపదగ్రస్తం. ఎల్లమ్మ ఒగ్గు కథలో పరశురాముడు దేవతల బొంగురం కావాలని అడిగినప్పుడు తల్లి ఎల్లమ్మ పరశు రామున్ని గంగమ్మ దగ్గరికి పంపిస్తుంది. గంగమ్మ బొంగురం జాడ తనకు తెలియదని కాళమ్మ దొరసానిని అడగమంటుంది. కాళమ్మ పరశురామునికి బొంగురం జాడ చెప్తుంది.

"ఇక్కడికి దగ్గర ఎండి కొండ కైలాసం, ఎండి కొండ కైలాసం లోపల శివుని మందిరం, శివుని మందిరం ముందు శివనాగనంది, శివనాగనంది మెడలు పట్టి తింపితే నాగ లోకానికి దారి, ఆదారెంటి పోతే కాలింగాల మడుగు, కాలింగాల ముడుగు దరిలోపల మంధర పర్వతానికి వాసుకి జాల చుట్టి తిరుగుతున్న బొంగరం కనబడుతుంది. అదే దేవతల బొంగురం" **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ)**

ఎల్లమ్మ ఒగ్గుకథలో పరశురామునికి కాళమ్మ బొంగురం జాడను తెలిపిన ఈ అనుసంధాన వచనంలో మొత్తాన్ని క్రియారహిత వాక్యాలుగా విభజించుకున్నప్పుడు ప్రతి వాక్యం చివరన ఉన్న పదం / పదబంధంతో తర్వాతి వాక్యం మొదలవుతుంది.

ఇక్కడికి దగ్గర ఎండికొండ కైలాసం : ఎండికొండ కైలాసం లోపల శివుని మందిరం... ఈ వాక్య క్రమాన్ని పరిశీలించినప్పుడు విడిచి పెట్టబడిన పదంతో తర్వాతి వాక్యం మొదలుకావడాన్ని గమనించవచ్చు. కావున ఇది ముక్తపదగ్రస్తం.

పరశురాముడు బలిజ రాజులతో పందెం కట్టినప్పుడు బలిజ రాజులు పరశురామునికి పరీక్ష పెడతారు. "భూమి లోపల అయిదు గజాల లోతు పొక్కదీసి, పొక్కలోపల ఇనుము ఇత్తడి వెండి బంగారం కరిగిచ్చి పోసి, బంగారం మీద పండ్లు ఫలారాలు వెట్టి, పండ్లు ఫలారాలు మీద వచ్చి సున్నం మేడగట్టి, మేడ మీద గానుగ గడెం బెట్టి, గానుగ గడానికి చెరుకుగడ మీద ఏడు గుండపోకలు పెట్టి, గుండు పోకల మీద తమలపాకులు వరిసి, తమలపాకులమీద రాగి దక్షిణ పెట్టాలె బొంగురాల పందెంల బొంగురం ఇసురితే అది ఇది మిగిలిన బొంగురాల్ని పగులగొట్టి రాగి దక్షిణ మీద తిరుగాలే అలా తిరుగుతుంటే రాగి పైస కదలద్దు, ఆకుచినుగ వద్దు, మేడ

కూలవద్దు కానీ భూమిలోపల ఉన్న ఎండి బంగారం ఎన్నోలె కరుగాలె ” **(ఎల్లమ్మ ఒగ్గుకథ)**

ఇందులో క్రియా పదాలు వదిలివేస్తే మిగిలిన వచనం అంతా ముక్తపదగ్రస్తాలంకారంలో ఉంటుంది. పరశురామున్ని భంగపరచడానికి కంచిరేగి పట్టణంలోని బలిజ రాజుల బొంగురం ఆడడానికి వచ్చిన పరశురామునికి విచిత్రమైన, క్లిష్టమైన నిర్మాణంలో ఉన్న కష్టసాధ్యమైన పందెం పరీక్ష పెట్టిన సందర్భంలో చెప్పిన ఈ వచనం అసమాపక క్రియలతో ఉంటుంది. ఇందులో అసమాపక క్రియల్ని వదిలేస్తే ఇదివరకు చెప్పినట్టు మిగిలిన వచనమంతా క్రియారహిత వాక్యాలుగా విడిపడి ప్రతి వాక్యం చివరగా ఉన్న పదంతో తర్వాతి వాక్యం ప్రారంభమవుతుంది కావున ఇది ముక్తపదగ్రస్తం.

### 4.6.2. ఒగ్గు కథ అర్థాలంకారాలు

కవి పాండిత్య ప్రకర్షను తెలియజెప్పటంతో పాటు హృదయావిష్కరణ చేసేవి అర్థాలంకారాలు, శిష్ట కవులు ప్రయోగించే అర్థాలంకారాలన్నీ పండిత జనరంజకాలుగా కాగా జానపద కవి ముఖ్యంగా ఒగ్గు కథకులు కథాగానంలో చెప్పే అర్థాలంకారాలన్నీ కూడా శబ్దాలంకారాలవలె సులభ గ్రాహ్యమై పండిత పామర జనరంగకంగా ఉంటాయి. ఒగ్గు కథలో అర్థాలంకారాలు గమనించినప్పుడు అర్థపరంగా ఆయా వాక్యాలలో వివిధ అర్థాలంకారాలు ఉన్నప్పటికి అంతర్గతంగా ప్రాసాత్మకత ఉండడం విశేషం.

**1. ఉపమాలంకారం:** “భరతుడు తన నాట్యశాస్త్రంలో పేర్కొన్న అలంకారం ఉపమ, అలంకారాలన్నిటింకి మూలం ఉపమ అనుననది సర్వ సమ్మతం. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉపమఛాయలు ఇంచుమించుగా అన్ని అలంకారాల్లో ఇమిడి ఉంటాయి. అన్ని అలంకారాలకు ఉపమ ప్రాతిపదిక మౌలికము''[11]పైన తెలిపిన భావాన్ని పరిశీలించినప్పుడు అర్థాలంకారాలన్నింటిలో ఏదో ఒక రకమైన పోలిక ఆధారంగా కనిపిస్తుంది. ఉపమ అంటే పోలిక. పోలికను ప్రధానంగా చెప్పే ఉపమాలంకారం అన్నింటికీ మూలమైంది.

“ఉపమా కాళిదాసస్య”అని పేరు పొందిన కాళిదాస మహాకవి, పార్యగేయేచ మధురంగా రామాయణం రాసిన వాల్మీకి మహాకవి విశేషంగా ఉపమాలంకార ప్రయోగం చేశారు. చిన్న చిన్న పదాలలో అనుసంధాన వాక్యంలో గేయంలో ఇలా ఒగ్గు కథాగానంలో ప్రాసాత్మకమైన ఉపమాలంకారం కనిపిస్తుంది.“ఉపమేయ ఉపమానాలకు పోలిక చెప్పి వర్ణించడం ఉపమాలంకారం” ఉపమేయం అనగా ప్రస్తుతాంశం, ఉపమానం అనగా ప్రస్తుతాంశాన్ని పోల్చడానికి తీసుకున్న మరో అంశం. ఒగ్గు కథాగానంలో కనిపించే పోలికలన్నీ కూడా నిత్యజీవిత

వ్యవహారంలో కనిపించేవే ఉంటాయి. ప్రధానంగా గ్రామీణ జీవన విధానంలో ఉపయోగించే వస్తు సామగ్రిని ప్రకృతిని ఉపమనాలుగా గ్రహించి ఒగ్గు కథాగానంలో ఉపమాలంకారం పోషించబడింది.

**"కుంచమోలె కూలవడ్డది" (మల్లన్న ఒగ్గు కేతమ్మ ఒగ్గు కథ)** కుంచము ధాన్యాన్ని కొలిచే వస్తువు (సోల, తవ్వ, మానిక, అడ్డా, కుంచము ఇవి కొలతలు) ఎనిమిది తవ్వలకు కుంచము కొలత ప్రమాణము. పల్లీయులు నిత్యం ఉపయోగించేవి తవ్వ ఎప్పుడో ఒకసారి వాడేది కుంచం. తవ్వ చిన్నగా ఉండగా కొంచెం పెద్దగా ఉంటుంది. కొద్ది లావు పాటి మనిషి హఠాత్తుగా కూలబడి ఎటూ కదలేని స్థితిలో ఉన్న సమయంలో కుంచమోలె కూలవడ్డది అని చెప్తారు. మల్లన్న గొల్ల కేతమ్మ కథలో రారాజు మల్లయ్య మందకాడ దొమ్మరాటలు ఆడించి వారికి గొర్రెలను దానం చేస్తున్నాడని విన్న గొల్ల మాధవసాని కోపంతో పరుగు పరుగున వస్తూ దారిలో మల్లయ్య మహిమతో భూమికి పుర్రె పుట్టి ఆ పుర్రెల మాధవసాని కాలువడి కుంచమోలె కూలవడ్డది గయ్యాలి అని. నిండు శరీరంగల మాధవసానిని కుంచంంతో పోల్చారు కథకులు. కుంచం జడపదార్థ వస్తువు ఒకసారి కింద పడితే దాన్ని తీసి సరిగ్గా పెట్టేంతవరకు అది అలాగే ఉంటుంది. రేణుకా ఎల్లమ్మ కథలో జమదగ్ని కార్యవీర్యుని చేతిలో హతమయ్యాడని వార్త విన్న రేణుక ఎల్లమ్మ కుంచమోలె కూలవడి భర్తకోసం వల పోస్తుంది. ఇక్కడ ఆవేదనతో హఠాత్తుగా కూలబడి కదలలేని స్థితిలో ఉన్న వ్యక్తిని తెలిపే సందర్భానికి కూడా ఈ పోలికను ఉపయోగిస్తారు.

**"ఆంబోతోలే అలతేరుతండు" (మల్లన్న గొల్లకేతమ్మ ఒగ్గు కథ)**

సమాజంలో అనాది కాలంగా కొన్ని నియమ నిబంధనలు సహజంగా ఆచరణలో ఉన్నాయి. వాటిలో కష్ట సమయంలో స్త్రీలు ఏడవచ్చుగాని పురుషుడు ఏడవరాదు. అనేది ఒకటి స్త్రీలు వలపోత ద్వారా తమ ఆవేదదను వ్యక్తం చేస్తుంటారు. అలా బహిరంగంగా ఏడవడం ద్వారా హృదయం తెలికపడుతుంది. కానీ మగవాడి పరిస్థితి వేరు. అతడు బహిరంగంగా ఏడవడానికి వీల్లేదు. అలాగని మనసులో దుఃఖం పొందకుండా ఉండలేడు. పొంగి వస్తున్న దుఃఖాన్ని శోకం ద్వారానో, వలపోత ద్వారానో వ్యక్తం చేయలేడు. అలాంటి సమయంలో దుఃఖాన్ని ఆపుకుని ఆపుకుని ఎవరైనా ఆత్మీయులు దగ్గరికి రాగానే బావురుమంటాడు. అలాగే ఆంబోతు కూడా దానికి కష్టమో / దుఃఖమో కలిగినప్పుడు తనకు పరిచితమైన వ్యక్తి కనిపించగానే అంబా అంటూ అరచి తన దుఃఖాన్ని వ్యక్తీకరిస్తుంది. అందుకే ఉపశమింప సాధ్యంకాని దుఃఖాన్ని గురించి చెప్పినప్పుడు ఆంబోతోలె అలతేరాడు అంటారు. అలతేరడం అంటే గుర్తుకు తెచ్చుకొని బాధపడడం.

మల్లన్న ఒగ్గు కథలో మల్లయ్య గొల్ల కేతమ్మతో వచ్చి తన పెళ్ళికి దేవతలనాహ్వానించి పార్వతమ్మ వచ్చినప్పుడు తల్లి పార్వతి మీదపడి తన కష్టాన్ని గుర్తుకు తెచ్చుకునే సందర్భంలో ఎల్లమ్మ ఒగ్గు కథలో పరశురాముడు తల్లి మీద ఉన్న నింద గురించి విన్నప్పుడు వారికి కలిగిన దుఃఖాన్ని కథకులు 'రారాజు మల్లయ్య ఆంబోతోలే అలతేరుతుండు". అని చక్కని ఉపమాలంకారంతో వర్ణించారు. సంప్రదాయ సాహిత్యంలో కథానాయుకుడు విలపించడం నిషేధం. ఒకవేళ విలపిస్తే రసాభాసం. కానీ మనిషన్న వాడికి సుఖదుఃఖాలు, రాగద్వేషాలు సహజం. అలాంటి సహజత్వంల్లో ఒకటైన దుఃఖాన్ని సామాజిక నియమాలను అనుసరించి వ్యక్తపరిచే మగవాడి దుఃఖాన్ని ఆంబోతు దుఃఖంతో పోల్చడం ఒగ్గు కథకుల సహృదయతకు నిదర్శనం.

"సన్నీళ్ల కుండోలె సల్ల వడ్డడు" (మల్లన్న గొల్ల కేతమ్మ ఒగ్గుకథ)

చల్లగా బతుకుబిడ్డ అనేది తెలుగునాట ఒక దీవెన, చల్లగ ఉండడం అంటే ప్రశాంతంగా ఉండడం. తల్లి మాటలు విన్న పరశురాముడు సన్నీళ్ళ కుండోలె సల్లబడ్డడు. 'బలిజ మేడలమ్మ తో పంతం కట్టి బయలుదేరిన మల్లయ్యనకు దారిలో అడవి అడ్డవుతుంది. మల్లయ్య కోపంతో అడవిని అంటువెడుతాడు. అడవిలో పక్షులు శోకిస్తే అది శివునికి మాల్యమై శివుని ఆజ్ఞతో పార్వతమ్మ గొల్ల వేషం కట్టి మల్లయ్య వద్దకు వెళ్లి కోపంతో ఉన్న మల్లయ్యకు సల్ల తాగించగా సన్నీళ్ల కుండోలె మల్లయ్య సల్లవడ్డాడు". అప్పటివరకు కోపంగా ఉన్న వ్యక్తి శాంతాన్ని పొందాడు అనే విషయాన్ని నిత్య పరిచయవస్తువైన సన్నీళ్ల కుండతో పోల్చి చెప్పారు.

"సొప్పకోలె సోలిపోతంద్రు" (చుక్క సత్తయ్య మల్లన్న కాపుల ఘట్టం)

జొన్న, మక్క జొన్నల ఆకులను చొప్ప / సొప్ప అంటారు. అది పశువులకు ఇష్టమైన గ్రాసము. తెలంగాణలో ప్రధానమైన ఆరుతడి పంట మక్కజొన్న. వర్షాధారంగా సాగు చేసే ఈ పంటలో వర్షాలు పడక ఎండలు దండిగా కొట్టినప్పుడు ఆకులు వాడిపోతాయి. పొడవుగా ఉండే ఈ ఆకులు వర్షం పడ్డప్పుడు దళసరిగా కనిపించి ఎండవేడికి వడలిపోతూ ఎటు వేస్తే అటు పడిపోతాయి.

మల్లన్న కాపుల ఘట్టం ఒగ్గు కథలో నీలమ్మ ధన గర్వంతో జంగమను కొట్టి శాపం వలన ధనం రాజ్యం కోల్పోయి ఆరుగురు బిడ్డల్ని వెంటపెట్టుకుని అడవిపాలై నడుస్తుంటే కడుపుకన్నం లేక కంటికి నిదురలేక నీరసించిపోయిన నీలమ్మ కొడుకులు సొప్పకోలె సోలిపోతంద్రు అని అంతవరకు రాజ భోగాలతో పెరిగిన పిల్లలు సంపదలు కోల్పోయి తిండి కరువై ఎండ

వేడికి నడవలేక అలసిపోయిన విధానాన్ని సొప్పాకులతో పోల్చి చెప్పారు. "ఎర్రంగ వండిన కొర్రసేనోలె ఏడు మడుములు క్రుంగిపోయిందు" **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ)**

కొర్రలు, అరికెలు, సజ్జలు మొదలైనవి ఒకప్పుడు తెలుగునాట విరివిగా పండిన పంటలు కంకి పంటకోత దశలో ఎర్రగా మారి వంగి ఉంటుంది. తలవంచినట్టు కనబడుతుంది. తప్పు చేసినప్పుడు అహం దెబ్బతిన్నప్పుడు మనిషి తల వంచుతాడు.

"గంగమ్మ కాళమ్మలు చెప్పిన దేవ బొంగురాన్ని తన ధైర్య సాహసాలతో సాధించి, 56 రాజ్యాల రాకుమారులను కాదని ఉక్కు స్తంభం పడగొట్టి దేగను, ఆధీనంలోకి తెచ్చుకుని బలిజరాజులు పెట్టిన పందెంలో గెలిచి గర్వంతో ఉప్పొంగిన పరశురాముడు తన తల్లి తప్పుచేసే తనను కన్నదనే విషయం విన్న తరువాత కృంగిపోయాడని తెలిపే సమయంలో ఎర్రంగ వండిన కొర్రసేనోలె పరశురాముడు ఏడు మడుములు కృంగిపోయిండని పోల్చి చెప్పినందున ఇది ఉపమాలంకారం, ధృడమైనకాడతో నిటారుగా ఉండే కొర్ర చేను చివరికి వంగి పోయినట్టు ధీరోతాత్తుడైన పరశురాముడు క్రుంగిపోయాడని సహజంగా వర్ణించడం విశేషం. "కాయలుగొట్టిన మామిడి వోలెరా కళ చిన్న పోయినాడు" **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గుకథ)**

మామిడి చెట్టు పూత, కాత దశలో నిండుగా చూడముచ్చటగా ఉంటుంది. మామిడి చెట్టు కాయలు పక్వానికి రాగానే తెంచడం పరిపాటి. ఇక్కడ కాయులు కొట్టిన అనే క్రియా విశేషణం ఉంది. కొట్టడం అంటే కాయలు రాల్చడం పూర్వపు రోజులు మామిడి చెట్లు చాలా పెద్దగా ఉండడం వలన కొమ్మ కొమ్మకు వెళ్లి కాయల్ని జాగ్రత్తగా తెంచడం వీలయ్యేది కాదు. అందుకే కొమ్మల మీద ఒడుపుగా కూర్చుని పొడవాటి కర్రలతో కొడుతూ కాయలు రాల్చేవారు. అలా కొట్టినప్పుడు కాయలతో పాటు ఆకులు, చిన్న కొమ్మలు కూడా రాలి పడిచెట్టుకున్న అందమంతా పోయి బోసిగా కనిపించేది. కాయ కొట్టడం అనేది చింతలు రాల్చడం. మామిండ్ల రాల్చడం అనే అర్థంలో నేటికీ తెలంగాణ ప్రాంతంలో వ్యవహరిస్తారు.

తన తల్లి ఎల్లమ్మ తప్పుచేసి తనను కన్నదనే విషయం తెలిసిన పరశురాముడు కాయలు కొట్టిన మామిడివలె కళ చిన్నబోయి ఉన్నాడని, భరింపరాని వేదనతో ఉత్సాహం కోల్పోయి విచార వదనంతో చిన్న బోయిన పరశురామున్ని కాయలు కొట్టడం వలన కాయలు ఆకులు కొమ్మలు రాలిపోయి కళ తప్పిన మామిడిచెట్టుతో పోల్చడం జరిగింది.

**"నేల గీతలు గీస్తూ నెమలి వడికినట్లు ఏడ్చిందు" (చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ)** మౌనంగా రోదించడం అనే సందర్భంలో ఈ పోలిక చెప్తారు. పరశురాముడు తల్లి మీద పడిన నింద గురించి ఆలోచిస్తూ చిన్నబోయి కూర్చుని మౌనంగా బాధపడుతున్నాడని తెలియజేస్తూ

నేల గీతలు గీస్తూ నెమలోలె వడికిందు / నెమలి వడికినట్టు ఏడ్చిందు. సాధారణంగా పక్షుల కన్నీరు పెద్దగా కనబడదు. పక్షి అరుపు ద్వారానే బాధను వ్యక్తం చేస్తుంది. కానీ కన్నీరు కార్చినట్టు కనిపించదు. కానీ నెమలి మాత్రం కన్నీరు కారుస్తుంది. మగ నెమలి కన్నీరు త్రాగి ఆడ నెమలి గుడ్లు పెడుతుంది. అనే కట్టుకథ కూడా లోకంలో ప్రచారంలో ఉంది. అందుకే పక్షులన్నింటిలో కన్నీరు కార్చే పక్షిగా గుర్తించబడిన నెమలి కన్నీరుతో పరశురాముని ఏడుపును పోల్చడం జరిగింది. ఈ ఉపమానానికి ముందు నేల గీతలు గీస్తూ అనే క్రియ పదం కనిపిస్తుంది. వ్యక్తం చేయలేని మిక్కిలి దుఃఖంతో మౌనంగా కూర్చుని దీర్ఘాలోచనలో ఉన్న వ్యక్తి నేల మీద కూర్చొండి ఏదో ఒక కట్టె పుల్లతో నేల మీద గీతలు గీయడం పల్లెలో గమనించవచ్చు. ఆ గీతలలో ఎలాంటి విషయం ఉండదు. అలాగని ఊసుబోక గీసిన గీతలు కావవి. మనసు అచేతనావస్థలో చేసే క్రియ నేల గీతలు గీయడం. అలా మిక్కిలి బాధతో దీర్ఘాలోచనాపరుడై ఏం చేయాలో పాలుపోని స్థితిలో నేల గీతలు గీస్తూ కూర్చుని మౌనంగా రోదిస్తున్న పరశు రామున్ని ఏడుస్తున్న నెమలితో పోల్చి చెప్పడం జరిగింది. కేవలం ఏడుపులోనే కాకుండా పెద్దగా ఉండడం నల్లగా ఉండడం బ్రహ్మచారిగా ఉండడం వంటి లక్షణాల కారణంగా పరశు రాముని నెమలితో పోల్చి ఉండవచ్చు.

**"లేచిందు మల్లయ్య లేగటావు రీతి" (చుక్క సత్తయ్య – మల్లన్న కాపుల ఘట్టం)** లేగటావు అంటే చిన్న లేగను కలిగి ఉన్న తల్లి ఆవు, బిడ్డను విడిచి మేతకు వెళ్ళిన తల్లి ఆవు తిరిగి ఇంటికి రావడానికి సిద్ధపడే సమయంలో దాని కదలికలు (పడుకున్న స్థానం నుండి లేవడం, వేగంగా నడవడం) చాలా చురుకుగా ఉంటాయి. ఒగ్గు కథలో చాలా సందర్భాలలో రారాజు మల్లయ్య ప్రయాణానికి సిద్ధమైన సమయంలో ఈ అలంకార ప్రయోగము కనిపిస్తుంది. స్త్రీ పురుష భేదం పాటించకుండా రారాజు మల్లయ్యను, పరశురామున్ని ఆవుతో పోల్చడం లాక్షణికులు నియమాలకు విరుద్ధమైనప్పటికీ ఒగ్గు కథకులు లింగ భేదం కన్నా లక్షణమే ప్రధానంగా భావించి పోలిక చెప్పి చక్కని ఉపమాలంకారం ప్రయోగం చేయడం విశేషం. బలిజ మేడలమ్మతో పందెం కట్టి రారాజు మల్లయ్య మేడలమ్మ కన్నా అందమైన స్త్రీని పెళ్ళాడానికి బయలుదేరుతుంటే అడవి అడ్డమైంది. ఆ అడవిలో మల్లయ్య నడుస్తుంటే...

"మాఘమ ఎండలు మలిపికొడుతున్నయి – దమనమ ఎండలు దండిగ కొడుతున్నయి మీద ఎండగొట్టి క్రింద ధరణి కాలి – తామరంటి పాదం ధరణి మీద పెడితే ఓర్చి బుగ్గలచ్చి నవరసులు కారుతున్నయి. ఎండకు మల్లయ్య మల్లెపువ్వోలె కాలిపోతుందు". **(చుక్క సత్తయ్య గొల్ల కేతమ్మ ఒగ్గు కథ)**

స్త్రీ పురుషుల శరీర భాగాల్ని పద్మాలతో పోల్చడం ప్రాచీన సంప్రదాయ సాహిత్యంలో విరివిగా కనిపిస్తుంది. (పాద పద్మాలు, ముఖపద్మ, కరకమలాలు ఇలా....) ఇక్కడ క్లిష్టమైన సమాసపదంగా కాకుండా వినగానే సులభంగా అర్థ గోచరమయ్యే విధంగా పాదాల్ని తామర పువ్వుతో పోలుస్తూ తామర వంటి పాదం అని చెప్పిన కథకుని మాటల్లో ఉపమాలంకారం కనిపిస్తుంది. జానపద సాహిత్యంలో క్లిష్టతకు తావు లేకుండా చెప్పే విషయం సూటిగా ఉంటుందనడానికి తామరంటి పాదం అనేది మంచి ఉదాహరణ, వీరుడైనప్పటికీ మలయ్య పాదాలు తామరల వలె సుకుమారమైనవి ఎండవేడికి, భూమి వేడికి ఆ పాదాలు ఓర్చుకుపోయి బొబ్బలచ్చి అవి చిట్లిపోయి రసి కారుతుందని కరుణారసాత్మకంగా వర్ణించారు. ఇలా పదాలను తామరతో పోల్చి వెంటనే "ఎండకు మల్లయ్య మల్లె పువ్వోలె కాలిపోతుండు అని మల్లయ్యను మల్లెపువ్వుతో పోల్చి చెప్పారు. ఈ సందర్భంలో కథానాయాకుణ్ణి పువ్వుతో పోల్చడం మీదు మిక్కిలి ఎండ వేడితో వాడిపోయిన పువ్వులతో పోల్చడం నాయకుని పట్ల శ్రోతలకు అయ్యోపాపం అనుకునే విధంగా కరుణ రసపోషణకు కూడా కారణమైంది. మల్లయ్య మల్లెపువ్వు అని చెప్పడంలో శబ్ద సౌందర్యంలో కూడా వినిపిస్తుంది.

**"తాటి చెట్టోలె ధరణి మీద పడ్డది" (చౌదరి పల్లి అంజయ్య కీలుగుర్రం కథ)** వెండి గొర్రెపైడి గొర్రె ఒగ్గు కథలో ఆగొండ రాక్షసి ఆధీనంలో ఉన్న బ్రాహ్మణుల పిల్ల బాల రత్నాంగి చెప్పిన విధంగా మల్లయ్య ఆ రాక్షసి తలమీది బండి చక్రమంత ఉన్న సుడిలో దూకి రోకలి దొడ్డు బంగారి రోమాన్ని కత్తితోని ఖండించగానే ఆగొండ రాక్షసి ప్రాణంబోయి అది తాటి చెట్టోలె ధరణి మీద పడ్డది. తాటిచెట్టు పెద్దగా (పొడవుగా తల విస్తృతంగా) ఉంటుంది. దాని మొదలు నరికినప్పుడు కొమ్మలు లేకపోవడం వలన ఒక్కసారిగా నేల మీద పడుతుంది. అలాగే భీకరాకారంతో విరబోసుకున్న తలతో ఉన్న రాక్షసి ఒక్కసారిగా నేలకూలింది కావున ఒక్కసారిగా నేలమీద కూలిపోవడం అనే సమాన ధర్మం వలన రాక్షసిని తాటిచెట్టుతో పోల్చడం ఇందలి ఉపమాలంకారం.

**"దొండకాయలోలె కండలెగురుతెంటె" (చుక్క సత్తయ్య మల్లన్న కాపులఘట్టం)** ఈ ప్రయోగంలో ప్రాసయతి వలన శబ్ద సౌందర్యంతో పాటు కండల్ని దొండకాయలతో పోల్చడం వలన ఉపమాలంకారం కనిపిస్తుంది. ఒగ్గు కథాగానంలో నేరుగా దండించే సందర్భాన్ని గురించి చెప్పినప్పుడు ఈ ప్రయోగం కనిపిస్తుంది. నీలమ్మ ధనగర్వంతో జంగమను కొట్టినప్పుడు, అడవిలో దొంగతనం చేసిన నీలమ్మను కాపువారు దండించినపుడు, కళ్యాణపట్నంలో బ్రాహ్మణుల కోమట్ల, కాపు వాళ్ళ ఇళ్ళల్లో పనిచేసిన నీలమ్మను జంగమయ్య శాపం వలన వాళ్లు కొట్టినప్పుడు

దొండకాయలోలె కండలెగురుతుంటే వారు దండించారని చెప్పడం జరిగింది. దెబ్బలకు శరీరం మీద వాతలు తేలిన కండలను దొండకాయలతో పోల్చడం జరిగింది. కండలకు ప్రాసగా దొండకాయల్ని తీసుకున్నారని భావించినప్పటికి దెబ్బలకు కమిలిన శరీర భాగాలు దొండకాయల వలె ఉబ్బి ఎర్రగా మారాయనే అర్థం కూడా కనిపిస్తుంది. ఈ విధంగా శబ్ద మాధుర్యంతో కూడిన ఉపమాలంకార ప్రయోగం ఒగ్గు కథకుల పాండిత్యానికి చక్కని ఉదాహరణ అని చెప్పవచ్చు.

మలకలంటి రాళ్ళు మన్నువాడ దొక్కివాయ్ / పొకలంటి రాళ్లు పొడివాడ దొక్కివాయ్
తవ్వలంటి రాళ్లు తవుడువాడ దొక్కివాయ్ / కుసుమలంటి రాళ్లు కుంకుంబడ దొక్కివాయ్
ఉరుములు ఉరిమిన చందము వాయ్ / ఊత గందిన చందము వాయ్
మెరుపులు మెరిసిన చందము వాయ్ / దండు ఎల్లవట్టిరీ మంది ఎల్ల వట్టిరి **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ)**

కార్తవీర్యార్జునుడు వేటకు బయలుదేరిన సమయంలో, తన తోటలోకి బంగారు పంది రూపంలో వచ్చిన పరశురామున్ని పట్టుకునేందుకు బయలుదేరిన సమయంలో వీరుల ఉత్సాహాన్ని వర్ణిస్తూ చెప్పిన సందర్భంలోనిదీ గేయం.

కార్తవీర్యుని సైన్యంలోని వీరులు వెళ్తుంటే రాళ్లు నుగ్గు నుగ్గయ్యాయి. ఈ భావాన్ని ఒక్క మాటలో చెప్పి వదలకుండా రాళ్ల పరిమాణాన్ని నిత్యజీవితంలో కనిపించే వస్తువులైన పోకలు, తవ్వలు, కుసుమలతో పోల్చడం జరిగింది. అలాగే రాళ్లు నుగ్గునుగ్గుగా మారిన విషయాన్ని సైతం మన్ను, పొడి, తవుడు కుంకుమ వంటి పొడి పదార్థాలతో పోల్చి చెప్పారు. రాళ్లను అది పొడిగా మారడాన్ని చక్కని ప్రాసలతో (పోక–పొడి, తవ్వ–తవుడు, కుసుమ–కుంకుమ) ఉపమాలంకార యుక్తంగా చెప్పడం విశేషం. దీనికి కొనసాగింపుగా ఉరుములు ఉరిమిన చందము మెరుపుల మెరిసిన చందము దండు బయలుదేరిందని కేవలం ఉపమానాలను తెలిపి ఉపమేయమైన సైన్యం యొక్క శబ్దాల్ని ఆయుధాల తళతళల్ని గోపనం చేసి వర్ణించారు. వివిధ ఒగ్గుకథలలో వివాహ ఘట్టాన్ని వర్ణించే సమయంలో పాడే కొట్నం పాటలో సైతం ఇలాంటి ఉపమాలంకారం కనబడుతుంది.

"అంతాయె యింతాయె ఘనమాయె మాను అల్లోనేరడల్లో
తూరుపు కొమ్మలు దుల్లారి బోలు అల్లోనేరడల్లో
పడమటి కొమ్మలు పర్వతము బోలు అల్లోనేరడల్లో

దక్షిణము కొమ్మలు ధర్మపురి బోలు అల్లోనేరడల్లో

సక్కటి కొమ్మలు సుక్కలను బోలు అల్లోనేరడల్లో" **(చుక్క సత్తయ్య మల్లయ్య కాపుల ఘట్టం)**

ఇందులో సమాన ధర్మం లేనప్పటికీ పోలిక చెప్పబడింది. పర్వతానికి, ధర్మపురికి, చుక్కలకు చెట్టుకొమ్మలతో సాదృశ్యం కనిపించదు. అయితే ప్రాసను ప్రధానంగా గ్రహించి క్షేత్రాల ప్రాధానాన్ని గుర్తించి వాటి స్థాయికి తగ్గ చెట్టు అని చెప్పడానికి చెట్టు యొక్క వివిధ దిక్కులలో ఉన్న కొమ్మల్ని పుణ్యక్షేత్రాలతో చుక్కలతో పోల్చి వినూత్నంగా ఉపమాలంకార ప్రయోగం చేసినట్టు కనిపిస్తుంది.

**"మేడి కాయల చందాన మెడలు దిప్పి / గుమ్మడికాయల చందాన గుడ్లు దిప్పి బియ్యమంటి పండ్లు పిండివడ గొరికి" (చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గ కథ)**

ఎల్లమ్మ ఒగ్గకథలో ఎల్లమ్మ శివుని మీద కోపగించిన సమయంలో పరశురాముడు ఎల్లమ్మ మీద కార్తవీర్యార్జునునిమీద కోపగించిన సమయంలో ఈ పోలికతో కూడిన ఉపమాలంకారం కనిపిస్తుంది. మేడికాయుల గుండ్రంగా ఉంటాయి. ఈ విధంగా కోపంతో మెడలు తిప్పి గుమ్మడి కాయలు పెద్దగా గుండ్రంగా ఉంటాయి. అటువంటి గుమ్మడికాయ వలె కనుగుడ్లు త్రిప్పి బియ్యం వలె తెల్లగా మెరిసే దంతాలను కోపంగా పిండిపిండిగా అయ్యేటట్లు కొరికి వేసి కోపాన్ని ప్రదర్శించాడని భావం.

మేడికాయల చందాన మెడలు తిప్పడం అన్నప్పుడు గుండ్రంగా తిప్పడం అనే భావాన్ని గ్రహించి చెప్పగా గుమ్మడికాయలు చందాన గ్రుడ్లు తిప్పడం అన్నప్పుడు కొంత అతిశయోక్తి కనిపించినప్పటికీ గుమ్మడికాయ వలె కనుగుడ్లను బయటకి కనిపించేలా తెరచి గుండ్రంగా తిప్పడం అని గ్రహించాలి. అయితే పళ్ళను బియ్యంతో పోల్చడం గట్టిదనం అనే లక్షణం కాకుండా తెల్లగా ఉండడం అనే బాహ్య స్వరూప సమాన ధర్మాన్ని ప్రాతిపదికగా తీసుకుని పోల్చి చెప్పడం జరిగింది. ఈ విధంగా కథానాయక / నాయక / ప్రతి నాయకుల కోపాన్ని వర్ణించే సందర్భంలో కనిపించే వస్తు సామగ్రి అయినా మేడి కాయలు, గుమ్మడికాయలు, బియ్యం వంటి వాటితో శరీర భాగాల్ని పోల్చి చెప్పడం ద్వారా ఇక్కడ ఉపమాలంకారం పోషించబడింది.

మల్లన్న కాపుల ఘట్టం ఒగ్గు కథలో ధనాలకోటకు కాపలా ఉన్న మైసమ్మ రూపాన్ని వర్ణిస్తూ బీభత్స రస పోషణలో సైతం చక్కని ఉపమాలంకార విశేషాలు కనిపిస్తాయి.

"ఆర్చికూత వెట్టెరా – పెడబొబ్బ లేపెరా / మూల బురుజు రీతిగా – ముక్కు గూడ

పెంచెరా పాతబాయి రీతిగా – నోరు గూడ పెంచెరా / గంగపూడి తాళ్ళ రీతి – కాళ్ళు కూడా పెంచెరా చెన్నెంగ బడతలుగా చేతులేమో పెంచెరా / ఈత పీసులోలెరా – ఎంటికెల్లల్ల పెంచెర **(చుక్క సత్తయ్య మల్లన్న కాపుల ఘట్టం)**

త్రిస్రగతితో వేగంగా సాగే దరువుతో అనుప్రాస, అంత్యానుప్రాసలతో సాగే ఈ బీభత్సరసవర్ణాలలో ముక్కును మూల బురుజుతో, నోరును పాత బాయితో, కాళ్లు గంగపూడి తాళ్లతో, చేతుల్ని చెన్నంగ బడతలతో, వెంట్రుకల్ని ఈతపీసుతో పోల్చడం ద్వారా ఉపమాలంకారం కనిపిస్తుంది. మూల బురుజు, పాతబాయి, గంగపూడి తాళ్లు, చెన్నెంగ బడతలు (చక్కగా పొడవుగా ఉండే చెన్నంగ చెట్టు కాండాలు) ఈత పీసు ఇవన్నీ పల్లెల్లో కనిపించే ప్రకృతి గత విశేషాలు. మనిషి అవయవాల కంటే ఎక్కువ పొడవు వెడల్పు గలవి. మైసమ్మ రూపం మహా భయంకరంగా ఉంది అని చెప్పడానికి కథకులు ఇలాంటి ఉపమానాలను ఎంచుకున్నారు.

“పొడిసేటి పొద్దోలె మెలిగేటి దియ్యోలె పున్నమ ఎన్నీల పూసిన తంగేడు తీర పూసిన తంగేడు చెట్టోలె వచ్చే రేణుకా ఎల్లమ్మకు ఆది జాంబవంతుని కొండుకులెదురైంద్రు” **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ)**

తంగేడు చెట్టు తెలంగాణ సాంస్కృతిక చిహ్నం, ఎర్ర నేలల్లో పెరిగే ఈ మొక్క వృత్తులకు సహాయకారిగా (చర్మకార వృత్తి వారికి చర్మాన్ని శుద్ధి చేయడానికి తంగేడు చెక్కని ఉపయోగిస్తారు) దేవతల పట్నం వేసే సమయంలో తంగేడు ఆకుల్ని మెత్తగా నూరి ఎండబెట్టి పొడిచేసి పచ్చ ముగ్గుగా ఉపయోగిస్తారు. తెలంగాణలో పర్వరాజమైన బతుకమ్మ పండుగతో ప్రధానంగా ఉపయోగించే పువ్వు తంగేడు. తీర పూసిన తంగేడు అంటే నిండుగా పూసిన తంగేడు అని అర్థం. పసుపు బంగారం వర్ణంతో మెరిసేపూలతో ఉన్న తంగేడు చెట్టు కనులకింపుగా శోభాయమానంగాఉంటుంది. పరశురాముని బాధలు పడలేక, ఎవ్వరు ఆశ్రయం ఇవ్వకపోవడంతో రేణుక ఎల్లమ్మ ఆది జాంబవుల వాడకు బయలుదేరుతుంది. అలా వస్తున్న ఎల్లమ్మ తీర పూసిన తంగేడు చెట్టులా ఉందని ఎల్లమ్మను తంగేడు చెట్టుతో పోల్చి చెప్పారు. భారతభాగవతాల్ని కల్పవృక్షాదులతో, నాయిక శరీరావయవాల్ని సంపెంగ, తామెర, కలువ వంటి ప్రాకృతిక విషయాలతో పోల్చడం శిష్ట సాహిత్యంలో కనిపించగా, ఒగ్గు కథా గానంలో కథకుడు సాధారణ జనానికి ఊహాతీతమైన వాటిని వదిలేసి నిండుగా ఉన్న ఎల్లమ్మ తల్లిని నిత్యం కనిపించే తీర పూసిన తంగేడు చెట్టుతో పోల్చడం విశేషం.

కథాగానంలో కొన్ని చోట్ల జానపదదేవతలకు అశ్లీలంగా అనిపించవచ్చు. ఇక్కడ భావమే ప్రధానం కానీ భాష కాదు. ఆచార్య రుక్నుద్దీన్ గారు అన్నట్లుగా జానపదుని భాష అశ్లీలం

అగునేమో కానీ భావం మాత్రం కాదు.

**"మేక సండ్లోలె మేము తల్లికిద్దరం" (చుక్క సత్తయ్య వరరచ్చ మల్లన్న ఒగ్గు కథ)**
మల్లన్న కళ్ళుగప్పి పోతుగొండ ధర్మయ్యతో పొందు చేసిన ఆకుమంచి ఎలాగైనా మల్లన్నను చంపి తమ పెళ్లికి అండ్డు తొలగించుకోవాలని పన్నాగం పన్నుతుంది. మల్లన్న వచ్చేవరకు వింత వ్యాధిగ్రస్తురాలిగా నటిస్తూ కోరల పెద్దపులి పాలు తెస్తేనే వ్యాధి తగ్గుతుందని వైద్యులు చెప్పింద్రు అవి తెచ్చేదెవరన్నా అంటూ దొంగ ఏడుపులు ఏడుస్తుంది. చెల్లెలు బాధను చూసి చెల్లెలు మీద ప్రేమతో మేక సండ్లోలె మేము తల్లికిద్దరం ఎలాగైనా సరే పులి పాలు తెచ్చి నా చెల్లెను కాపాడుకుంటానని మల్లన్న అనుకుంటాడు. పూర్వం ఎక్కువ సంతానం ఉన్న రోజులలో ఒకరు లేదా ఇద్దరు పిల్లలు మాత్రమే ఉంటే వారిని చాలా అపురూపంగా చూసుకునేవారు, పాలిచ్చే మేకకు ఆవులకు, బర్లకు ఉన్నట్టు నాలుగు కాకుండా రెండు చన్నులు మాత్రమే ఉంటాయి. తమ తల్లి ఎలనాగదేవికి నేను నా చెల్లెలు ఆకుమంచిదేవి ఇద్దరమే సంతానం. మేం మేక సండ్లోలె మేము తల్లికిద్దరం. ఇందులో నుండి నా చెల్లెలు ప్రాణం పోయే స్థితి వచ్చిందని వరరచ్చమల్లన్న బాధపడుతాడు. ఇద్దరు మాత్రమే ఉన్న సంతానాన్ని రెండు మాత్రమే ఉన్న మేక చన్నులతో పోల్చినందున ఇది ఉపమాలంకారం. సృష్టిలో రెండు మాత్రమే లేదా జంటగా ఉండే విశేషణాలెన్నో ఉన్నప్పటికీ ఇక్కడ ఒగ్గు కథకునికి మేక సండ్లే స్ఫురించడానికి ప్రధాన కారణం అతని వృత్తి జీవనమే. ఎందుకంటే ఒగ్గు కథకులయిన గొల్ల కురుమలకు గొర్ల పెంపకం, మేకల పెంపకం వృత్తిగా ఉంటుంది. అందుకే తాను నిత్యం గమనించే మేక చన్నులతో ఇద్దరు సంతానాన్ని పోల్చి చెప్పాడు.

కథకుని భాషలో కొద్దిగా అశ్లీలత కనిపించినప్పటికీ భావనలో ఔచిత్యమైన విశేషము, చక్కని సమర్థవంతమైన సారుపత్యత కనిపిస్తుంది.

"రామరామ రామన్న రామ రాఘువా రామన్న రామ
అమ్మవారు మాంకాళిదేవి చిన్ని తమ్ముని కళ్ళ జుసెనె అక్క మాంకాళిదేవి
చెంబుతోని ఉత్కాలు వట్టెనె, శేత గూడ మంగళారతులు
గున్న గున్న మాంకాళిదేవి గున్న మామిడి సందమేమి
ద్వారా మందున్న చిన్నతమ్ముని వేడ్కతొడ ఎదురుకుంట ఉన్నది

వ॥ అమ్మవారు మాంకాళి దేవి ఏడేడు లోగిళ్ళు దాటి వచ్చి తమ్ముడు బీరయ్యను చూసి ఎడమ నివాళి కుడికి దీసి కుడి నివాళి ఎడమకు దీసి సందనపు బొమ్మోలే సంకనెత్తుకుంది. **(చుక్క సత్తయ్య బీరప్ప ఒగ్గు కథ)**

సవలక్ష గొర్ల మంద కావాలి చాలించి వచ్చిన బీరయ్యను అక్క మాంకాళి అప్యాయంగా ఆదరించిన విధానాన్ని వర్ణించిన బీరప్ప ఒగ్గు కథాగాన సందర్భంలో ప్రతిపాదంలో పద విరుపులో యతి మైత్రి సొబగులుతో పాటు చక్కని ఉపమాలంకారం కనిపిస్తుంది. చెంబుతో నీరు, చేతిలో మంగళారతి పట్టుకుని శుభప్రదంగా వస్తున్న మాంకాళిదేవిని గున్న మామిడితో పోల్చడం, పొడిసేటి పొద్దు (ఉదయిస్తున్న సూర్యుడు) వెలిగేటి దియ్యె (వెలుగుతున్న దీపం) వలె ద్వారా వద్ద తేజోవంతుడైన నిలబడిన బీరప్పను పోల్చడంలో సాభిప్రాయమైన ఉపమానాలు కనిపిస్తున్నాయి. ఇక్కడ ప్రయోగించిన నిండయిన గున్న మామిడి, పొడిసేటి పొద్దు. మెలిగె దివ్వె ఇవన్నీ జానపదులకు, గ్రామీణులకు చిరపరిచితాలు. అలాగే ఈ గేయం చివరన వచ్చిన వచనంలో అక్క మాంకాళి బీరయ్యను "సందనపు బొమ్మలే సంకకెత్తుకుంది" అని క్రియాధారితంగా ఉపమాలంకారం వర్ణితమైంది. చందనపు బొమ్మ తేలికగా ఉండేది. కలిగిన వారింటి అపురూపమైన ఆటవస్తువు, పిల్లలు ఆడుకునేటపుడు చందనపు బొమ్మను చంకకెత్తుకున్నంత ప్రేమగా, ఆత్మీయంగా, తేలికగా పదహారేళ్ళ ప్రాయంలో నూనూగు మీసాలతో నిలువెత్తుగా నిలుచున్న తమ్ముడు బీరయ్యను అక్క మాంకాళి చంకకెత్తుకుని ఆత్మీయతను చాటిందని పోల్చి చెప్పడంలో చక్కని ఉపమాలంకారంతో పాటు నిర్మలమైన అక్కాతమ్ముళ్ల ఆత్మీయతానురాగాలు సైతం వెల్లడవుతున్నాయి.

"మసికొక బొంతోలె నీవున్నవోయి – మాణిక్యమోలె నేనున్న బావ నేనున్న బావ
అంబటి కుండోలె నీవున్నవొయి నీవున్నవోయి – అంబట్ల తెడ్డోలె నేనున్న బావ నేనున్న బావ
చెట్టు మీద పిట్టోలె నీవున్నవొయి నీవున్నవోయి చేసిన బొమ్మాలె నేనున్న బావ నేనున్న బావ
గుడి మీద కొంగోలె నీవున్నవొయి – గుళ్ళె లింగమోలె నేనున్న బావ నేనున్న బావ
దొంగోని కుక్కోలె నీవున్నవోయి నీవున్నవోయి – దొరసాని బిడ్డలె నేనున్న బావ నేనున్నబావ".
**(చుక్క సత్తయ్య బీరప్ప ఒగ్గుకథ)**

పాలగుండంలో స్నానం చేస్తున్న కామరతి దగ్గరకు బావ బీరయ్య మారువేషం ధరించి వచ్చి నేను నీ బావ బీరయ్యను మనం పెళ్లి చేసుకుందాం అని అడుగుతాడు. వికారపు వేషంలో ఉన్న బీరయ్యను కామరతి అసహ్యించుకుంటుంది. ఆ సందర్భంలో ఆమెలోని అందాన్ని గొప్పదనాన్ని మారువేషంలో ఉన్న బీరయ్య వికారపు రూపాన్ని చక్కని ఉపమానాలతో పోల్చి చెప్తుంది.

బీరయ్యను మాసిపోయిన మసిక బొంతతో, శుభ్రత లేని అంబటి కుండతో, అలంకరణ లేని చెట్టుమీద పిట్టతో పాలిపోయిన గుడి మీది కొంగతో భయం గొలిపే దొంగవాని కుక్కతో

పోలుస్తూ కామరతిని మెరిసే మాణిక్యంతో నాజూగ్గా సన్నగా ఉన్న అంబటి తెడ్డుతో తీర్చిదిద్దిన బొమ్మతో, అలంకారయుక్తమైన గుడిలోని లింగంతో, ఆకర్షణీయమైన సంపద గల దొరసాని బిడ్డతో పోలుస్తూ కామరతి నోట సాగే ఈ కథాగానంలో పాద పాదన అనుప్రాసతో పాటు సందర్భానికి తగినట్టు ఔచిత్య వంతమైన పోలికలు కనిపిస్తాయి. అందవికారం ఉన్న బావ బీరయ్య పెళ్లి చేసుకోవడం ఇష్టం లేని కామరతి ఆ విషయాన్ని నేరుగా చెప్పకుండా తన అందాన్ని మరింత గొప్పగా ఎదుట నిలిచిన బీరయ్య వికార రూపాన్ని మరింత తక్కువ చేసి వర్ణించింది. తద్వారా ఇంతటి అంతరం ఉన్న మన మధ్య సంబంధం పొసగదు అని పోలికల ద్వారా తన మనసులోని మాటను చెప్పకనే చెప్పింది. ఇందులో చెప్పబడిన మసికబొంత అంబటి కుండ, పిట్ట కొంగ కుక్క మాణిక్యం తెడ్డు, బొమ్మ, లింగం, దొరసాని బిడ్డ ఈ ఉపమానాలన్నీ కూడా జానపదులకు చిరపరిచితాలై ఉండడం వలన కథాగానం చేస్తున్నప్పుడే భావాన్ని సులువుగా గ్రహించగలుగుతారు.

**"అంకించి బొంకించి అల్ల నేర్పులు నేర్పి రాయపొంటోన్ని లక్కోలెజేసి అరచేతిల బెల్లం బెట్టి మోచేత నాకించి" (చుక్క సత్తయ్య బీరప్ప కథ)**

పాలగుండంలో స్నానం చేసి వస్తున్న కామరతిని బీరయ్య అడ్డగించి గొంగట్ల కూర్చుండబెట్టుకొని ఎత్తుకుపోతానని అన్నప్పుడు వికార రూపంలో ఉన్న బీరయ్యతో వెళ్ళలేక అలాగని అతని నుండి తప్పించుకునే మార్గం లేక అతనిమీద ఇష్టం ఉన్నట్లు నటించి సొంపుగా మాట్లాడి ఇంటి దగ్గర దాచుకున్న ధనం తీసుకుని వస్తాను ఇక్కడే ఉండమని చెప్పి కామరతి తప్పించుకొని నాగులకొండకు చేరుకుంటుంది. ఈ సందర్భంలో తన మాటలలో కామరతి బీరయ్య మనసు మార్చిన విధానాన్ని చక్కని ఉపమాలంకారంలో వర్ణించారు. రాయి దృఢంగా ఉంటుంది. అది కరగటం కష్ట సాధ్యం. లక్క మృధువైనది, కొద్దిగా వేడి తగిలిన కరిగిపోతుంది. కామరతి అంకించి బొంకించి అల్ల నేర్పులు నేర్పి అంటే రకరకాల అబద్ధాలు మాట్లాడి ఇప్పటికిప్పుడు ఎత్తుకుపోయి పెళ్లి చేసుకుంటాడనని దృఢనిశ్చయంతో రాయిలాగా కఠినమైన నిర్ణయంతో / మనసుతో ఉన్న బీరప్పను తన మాటలతో లక్కలాగా కరిగించింది అని బీరప్ప మానసిక స్థితిని ఏకకాలంలో రాయితో, లక్కతో పోల్చినందున ఇందులో ఉపమాలంకారం కనిపిస్తుంది. చివరగా, అరచేతిలో బెల్లం బెట్టి మోచేత నాకించడం అని చెప్పడంలో అసాధ్యమైన విషయాన్ని చెప్పి నమ్మించి వెళ్లిదని ధ్వన్యార్థం కూడా కనిపిస్తుంది.

**"సన్నగ సున్నంల పుల్లోలె అయితడు" (చుక్క సత్తయ్య బీరప్ప ఒగ్గుకథ)**

మంద కావలి చాలించిన బీరయ్య అక్కమాంకాళి అనుమతితో పెళ్లి కోసం బయలుదేరుతాడు. మధ్యలో మావురాల ఎల్లమ్మను కలుసుకుని నాగులకొండ నరభూపతి రాజు బిడ్డను పెళ్లి చేసుకునే ఉపాయం అడుగుతాడు. అప్పుడు రేణుకా ఎల్లమ్మ నేను నేను ఎరుకలసాని వేషంలో వెళ్ళి ఎరుక చెప్పి నరభూపతి ఏడుగురు బిడ్డలను ఊరవతలి చందనాల బాయి దగ్గరికి వచ్చేటట్టు చేస్తాను. కానీ ఆ ఏడుగురిలో శుభ లక్షణాలు గల స్త్రీని గుర్తుపట్టి పెళ్లి చేసుకోమ్మని బీరయ్యకు చెప్తుంది. ఆ సందర్భంలో వివాహం చేసుకోబోయే స్త్రీకి ఉండవలసిన మంచి లక్షణాలు, ఉండకూడని చెడు లక్షణాలు గురించి తెలుపుతుంది. అరికాలికి మచ్చ ఉన్న పిల్లను పెళ్లి చేసుకుంటే ఆమె ఎప్పుడూ మందిల్లలోనే తిరుగుతుందని భర్తకు తిండి కూడా సరిగా పెట్టొద్దని తిండిలేక భార్య ఆదరణలేక మగవాడు కుంగిపోయి సన్నబడతాడని చెప్తూ అలా భార్య అనాదరణ వల్ల "సన్నగ సున్నంల పుల్లోలె అయితడని వర్ణించారు. తమలపాకు మీద సున్నం రాయడానికి వీలుగా ఉపయోగించే పుల్ల సన్నగా ఉంటుంది. ఎందుకంటే పుల్ల లావుగా ఉంటే ఆకు మీద ఎక్కువ సున్నంపడి తాంబూలం ఘాటుగా ఉంటుంది. అందుకనే తక్కువ పరిమాణంలో తీసుకోవడానికి వీలుగా సున్నంలో ఉపయోగించడానికి సన్నటి పుల్లను వాడుతారు. గ్రామీణ జీవనంలో ఆకు వేసుకోవడం సహజంగా ఉండేది. అందరికీ సున్నంలో ఉపయోగించే పుల్ల ఎలా ఉంటుందో తెలుసు కాబట్టి బక్కగా మారాడని చెప్పడానికి బదులుగా సున్నం పుల్లోలె అయిందని చక్కని ఉపమానంతో పోల్చడం వలన విషయ స్పష్టత కలుగుతుంది.

**"పిడుకల కుచ్చోలె మంగలి కత్తుల మాలుకూలింది". (చుక్క సత్తయ్య బీరప్ప ఒగ్గుకథ)** గారడి వేషంలో బీరప్ప నాగులకొండ పట్నం చేరి నరభూపతిని ఏమార్చి, నరభూపతి బిడ్డ కామరతిని ఉంచిన మంగలికత్తులమాల మీదికి వెళ్లి కామరతిని గొంగట్లో పెట్టుకుని వచ్చేటప్పుడు తన కత్తితో దెబ్బ కొట్టగానే మంగలి కత్తులమాల పిడుకల కుచ్చు లాగా కూలిపోయిందని మంగలికత్తులను పిడుకల కుచ్చుతో పోల్చి చెప్పినందున ఇందులో ఉపమాలంకారం కనిపిస్తుంది.

నాగులకొండ నరభూపతి రాజు బీరయ్య బారి నుండి తన బిడ్డ కామరతిని కాపాడుకోవడానికి కత్తులమాలలో ఉంచుతాడు. మాలు అనేది మహల్ అనే పదానికి రూపాంతరం. అంటే లోనికి వెళ్ళడానికి వీలులేకుండా గట్టి ఏర్పాట్లతో నిర్మించిన మేడ అని అర్థం చేసుకోవాలి. అటువంటి మంగలికత్తులమాలు పిడుకలకుచ్చెలాగా కూలిపోయింది. పశువుల పేడతో చేసే పిడకలను వంట చెరుకుగా ఉపయోగిస్తారు. అలాంటి పిడకలను వానకు తడవకుండా ఒక మూలన పేర్చి ఉంచుతారు. దాన్నే పిడకల కుచ్చు అంటారు. ఒక్కసారి క్రింది నుండి పిడకలు

తీసేటప్పుడు ఆ కుచ్చు మొత్తం కూలిపోతుంది. ఇక్కడ పటిష్టమైన మంగలి కత్తుల మాలు సైతం బీరప్ప కత్తి దెబ్బకు పిడుకల కుచ్చె కూలినట్లు తేలికగా కూలిపోయిందని చెప్పడంతో అంతర్గతంగా బీరప్ప శక్తి సామర్థ్యాలు సైతం వెల్లడవుతున్నాయి. 'ఉపమాలంకారమే సర్వాలంకారాలకు బీజమని' ఒగ్గు కథకులకు తెలియకపోయినా ఈ అలంకారాన్నే ఎక్కువగా తమ భాషలో ఉపయోగిస్తుంటారు. వీరి భాష సహజంగా ఉంటుంది అలాగే వీరు ఉపయోగించే అలంకారాలు కూడా అంతే సహజంగా ఉంటాయి. ఈ అలంకారాలు ఒగ్గుకథా సాహిత్యానికి మరింత శోభను సమకూర్చి పెడుతున్నాయి.

1.'యేనుగంత మేఘం'
2.'సీత కన్న సక్కదనం పార్వతీ దేవి కన్న పసందు'
3.'ఆకాశమంత పందిళ్ భూ దేవంత గద్దెలేసి'
4.'నునె ముంత కాయోలె మల్లయ్య నునుపు'
5.'కొండవోలె బాధవచ్చె'
6.'చిలుక వంటి వంటి ముకం చిన్నబుచ్చుకునె'
7.'మొగలి పూవందనాలు మోటాల్ రెడ్డి'
8.'గునుక పూవందనాల గుడారి కాపు'
9.'లక్క పూవందనాల లక్కనాటి కాపు'
10.'పత్తి పూవందనాల పాకనాటి కాపు '
11.'చిక్కుడు పూవందనాల చిట్టమారి కాపు'
12.'ములుక వందనాల మున్నూరు కాపు'
13.'పాడి గొర్రె తీరు తల్లి అల్లాడుతున్నది'
14.'సల్లీల్ల కుండోలె అత్త సల్లబడ్డది'
15.'ఎలుక తోకంత పొగ'
16.'తాటి కాయలోలె బంగారి లింగాలు'
17.'ఏనుగు లావు పెల్ల'
18.'కాపంత గంట, గుమ్మంత శంకు'

ఈ విధంగా ఎన్నో అలంకారాలు ఒగ్గుకథ సాహిత్యంలో కనిపిస్తుంటాయి. ఈ అలంకారాలను గమనిస్తే ఒగ్గుకథకుల వర్ణన అతి సహజంగా ఉంటుందనడంలో

అతిశయోక్తి లేదు. ఈవిధంగా ఒగ్గు కథాగానంలో అడుగడుగునా అను ప్రాసలతో కూడిన ఉపమాలంకారాలు కనిపిస్తాయి. ఇందులో కథకులు ఉపయోగించే ఉపమానాలు అన్నీ కూడా సహజ సిద్ధమైన పల్లె ప్రకృతిగత విశేషాలుగా విశేషించి శ్రోతలకు నిత్యగోచరాలుగా కనిపించేవి కావడం వలన కథాగానంలోని విషయం సులభగ్రాహ్యమవుతుంది. ఉపమ కాళిదాసస్య అని పేరు గాంచిన కాళిదాసాది కవులకు కూడా ఇలాంటి జానపద కథాగానాలే మార్గం వేసాయనడంలో సందేహం లేదు.

**2. ఉత్ప్రేక్షాలంకారం:** ఉత్ప్రేక్ష అంటే ఊహ అని అర్థం. ప్రస్తుతం చెప్తున్న అంశాన్ని దానికి దగ్గరి లక్షణాలు కలిగిన అప్రస్తుత అంశమేమో అని ఊహిస్తూ వర్ణించడం ఉత్ప్రేక్ష. సమాన ధర్మ ప్రభావంతో ఉపమేయాన్ని ఉపమానంగా ఊహించి చెప్పడం ఉత్ప్రేక్షాలంకారం. ఒగ్గు కథకుల కథాగానంలో కనిపించే ఉత్ప్రేక్షాలంకారం శిష్ట సాహిత్య కవుల ఊహలవలె అసాధ్యాలుగా కాకుండా నిత్యజీవన వ్యవహారంలో సాధ్యమయ్యే విశేషాలే ఉంటాయి. "సాలులోపల పోలు పోసినట్లు" **(చుక్క సత్తయ్య మల్లన్న వెండి గొర్రెపైడి గొర్రె కథ)**

అన్నలు వదినలతో వేగలేని మల్లయ్య భార్యతో కలిసి కొల్లాపురం విడిచిపెట్టి లింగాల పరువడి చేరి వ్యవసాయం మొదలు పెడతాడు. మల్లయ్య భార్య పద్మావతికి అప్పటి వరకు వ్యవసాయం గురించి ఏమీ తెలియదు. మల్లయ్య నాగలి దున్నుతూ పద్మావతిని విత్తనం వేయమంటే ఆమె సాలులోపల పాలు పోసినట్లు విత్తనమేస్తుంది. పాలు పోయడం అంటే వివాహ సంప్రదాయంలో (మైల పోలు, పెళ్లి పోలు) దోసిలితో, పిడికిలితో ధాన్యాన్ని పట్టుకుని పోలు పోస్తారు. (పోలు రాస్తారు అనే ప్రయోగం కూడా వ్యవహారంలో కనిపిస్తుంది) విత్తనం వేయడం తెలియని పద్మావతి నాగటి చాలులో ఒక్కొక్క విత్తనం వేయకుండా ఒడిలో ఉన్న విత్తనపు ధాన్యాన్ని పిడికిలితో పోసుకుంటూ వెళుతుంది. అలా పిడికిలి నిండుగా తీసుకున్న విత్తన ధాన్యాన్ని సాలులోపల ధారగా / ఒత్తుగా పోయడాన్ని పోలుపోసినట్లుగా ఊహించినందున ఇది ఉత్ప్రేక్ష. పద్మావతి నాగటిచాలులో పోలు పోసినట్లు వేస్తున్న విత్తనంను పెళ్లిలో పోలు పోసినట్టుగా ఊహించడం విశేషం.

"ఎల్లిగారానికి బంగారమతికినట్లు" **(చుక్క సత్తయ్య మల్లన్న గొల్ల కేతమ్మ కథ)** ఎల్లిగారం అనేది నగల తయారీలో బంగారాన్ని అతకడానికి వాడే పదార్థం. దీనితో అతికించిన వస్తువు విడిపోకుండా గట్టిగా అతుక్కుని ఉంటుంది. ధృడమైన సంబంధాన్ని గురించి తెలిపేటప్పుడు ఈ పదాన్ని వాడుతారు. శివుడు జంగమ వేషం వేసుకుని కనకరేపల్లె వాడకు చేరి కేతమ్మ

తల్లిదండ్రులైన మాధవసాని మారయ్యల దగ్గరికి వచ్చి మీ బిడ్డకు తగిన వరుడున్నాడు. మీ ఇంట ఇల్లరికం ఉంటాడు. ఆ పిల్లగాడు మీ పిల్లా కలిస్తే ఎల్లిగారానికి బంగారమతికినట్లు ముద్దుగుంటరు అని చెప్పాడు.

**3. రూపకము :** ఉపమేయానికి ఉపమానంతో అభేదముగాని, తాద్రూప్యాన్ని గానీ వర్ణించినప్పుడు అది రూపకాలంకారం. ప్రస్తుతం చెప్పబడే విషయమైన ఉపమేయానికి అప్రస్తుతాంశమైన ఉపమానంతో అభేదం చెప్పడం వలన రెండు ఒకటే అనే భావన కలిగించడం రూపకాలంకార ఉద్దేశ్యం. ఒగ్గు కథ గానం పెళ్లి వర్ణనలో కనిపించే

**"పోశమ్మ తలువాలు పొట్టి ములుకాలు ములుకాలు**

**సీతమ్మ తలువాలు చిట్టి ముత్యాలు చిట్టి ముత్యాలు" (చుక్క సత్తయ్య మల్లన్న కాపుల ఘట్టం)**

పొట్టిములుకాలు, చిట్టిముత్యాలు, శాపకన్నులు ఇవన్నీ ఒకప్పటి వ్యవసాయంలో మేలుజాతి వరి వంగడాలు. జానపదునికి సుపరిచితమైన అప్రస్తుతాంశాలు వీటికి ప్రస్తుత వర్ణనతో తెలిపే తలంబ్రాలకు అభేదం చెప్పడం వలన ఇక్కడ రూపకాలంకారం పోషించబడింది.

**"పొడిసేటి చుక్కలు పోలు ముంతల్లు / రాలేటి చుక్కలు రంగు తలువాలు**

**సూర్యుడు చంద్రుడు అన్న దమ్ములు / అన్నదమ్ములు వారు అయిరేణి కడువలు" (చుక్క సత్తయ్య మల్లన్న ఒగ్గు కథ, ఎల్లమ్మ ఒగ్గు కథ)**

పోలు ముంతలు వివాహ సాంప్రదాయంలో కనిపించే వస్తు విశేషాలు, పొనగంటి తెలుగన్న వంటి కవులెందరో తెలుగింటి పెళ్ళిని వర్ణిస్తూ పోలుముంతల్ని వివిధ ఉపమానాలతో పోల్చి చెప్పారు. అలాగే తలువాలు పెళ్లిలో వధూవరులు పరస్పరం తల మీద పోసుకుని బియ్యం / జొన్నలు వంటి ధాన్య విశేషాలు. ప్రాలు అంటే బియ్యం. తలన్+ ప్రాలు= తలంబ్రాలు/ తలబ్రాలు –తలవాలుగా శబ్ద పరిణామం చెందిన పదమిది.

పెళ్లిలో ప్రధాన వస్తువిశేషాలైన పోలుముంతలు, తలవాలు కాంతివంతంగా ఉన్నాయి అని చెప్పడానికి కాంతివంతంగా కనిపించే చుక్కలకు వీటికి అభేదం చెప్పినందున ఇది రూపకాలంకారం. చుక్కలకు పొడిసేటి, రాలేటి అనే పదాన్ని విశేషణాలుగా వేయడం ప్రాసకోసమే తద్వారా అర్థాలంకారంతో పాటు శబ్ద సౌందర్యం కలిగిస్తుంది.

తర్వాతి పాదంలో సూర్యచంద్రుల్ని అన్నదమ్ములుగా, ఆ అన్నదమ్ముల్ని అయరేణి కడువలుగా భావించారు. అన్నదమ్ములిరువురికి సహజంగానే కొన్ని పోలికలు ఉండడం

సర్వసాధారణం. సూర్య చంద్రులు ఇరువురి రూపాలు గుండ్రంగా కనిపిస్తాయి. కావున ఖగోళ శాస్త్రపరంగా వాటి మధ్య ఎంతో భేదం ఉన్నప్పటికీ కంటికి కనిపించే రూపాన్ని బట్టి వాటిని అన్నదమ్ములని చెప్పారు. తెలంగాణ ప్రాంతంలో పెళ్లిలో ప్రధానంగా పూజింపబడేవి అయిరేణి కడువలు, సున్నం జాజులతో సింగారించి ఉండే రెండు కుండలు ఇవి. రూపంలో గుండ్రంగా సూర్యచంద్రుల వలె ఉన్నందున వీటికి సూర్యచంద్రుల అభేదం చెప్పబడింది. కావున ఇది రూపకాలంకారం. అయితే ఇక్కడ నేరుగా అయిరేణి కడువలకు సూర్యచంద్రుల అభేదం చెప్పకుండా ముందుగా సూర్యచంద్రుల్ని అన్నదమ్ములని ఆ అన్నదమ్ములే అయిరేణి కడువలని, సూర్యచంద్రులు-అన్నదమ్ములు-అయిరేణి కడువలు ఈ మూడు అంశాలకు మధ్య అభేదం చెప్పడం వలన విశేషంగా రూపకాలంకారం సాధించబడింది. దీన్ని లోతుగా గమనించినప్పుడు ఇందులో కొంత వక్రోక్తి సైతం కనిపిస్తుంది.

**"చిన్న చిన్న ముత్యాలు శివ తోరణాలు / పెద్ద పెద్ద ముత్యాల పెళ్లి తోరణాలు" (చుక్క సత్తయ్య మల్లన్న కాపుల ఘట్టం)** వేడుకల సమయంలో శుభంగా అలంకరించుకునేవి తోరణాలు సాధారణంగా పువ్వులతో, మామిడి ఆకులతో కడతారు. ఇక్కడ కట్టిన తోరణాలు ప్రకాశవంతంగా ఉన్నాయని చెప్పడానికి పెద్దగా రూప సారూప్యం లేకపోయిన తోరణాలకు ముత్యాలకు అబేధం తెలిపినందున ఇది రూపకాలంకారం. శివ తోరణాలు చిన్న ముత్యాలు, పెళ్లి తోరణాలు పెద్ద ముత్యాలు అని చెప్పడంలో ప్రాస కూడా కనిపించడం విశేషం.

**"ఒలికిన కన్నీరు వరదలై, కారిన కన్నీరు కాలువలై, కురిసిన కన్నీరు కుంభధార వర్షమై కొలుకుల్ల కన్నీరు కొనగోలు చిమ్మితే చిల్లిపోయి శివనందుల కోట మీద పడుతుంది". (చుక్క సత్తయ్య మల్లన్న గొల్ల కేతమ్మ కథ)**

భరించలేని దుఃఖం కలిగినప్పుడు కన్నీటి ధారలు స్రవించడం సహజం. ఆ కన్నీటి ధారలను తెలియజేస్తూ నాయకుని దుఃఖం ఎక్కువగా ఉంది అని చెప్పడానికి కంటి నుండి వచ్చిన కన్నీటికి నీటితో ప్రవహించే కాలువలు, వరదలు, కుంభధార వర్షానికి అభేదం చెప్పబడింది. రూపపరంగా కన్నీటికి కాలువలు, వరదలు, వర్షపు నీటికి సాదృశ్యత ఉంది. ఆ భావనతోనే ఆ అంశాల మధ్య అభేదం చెప్పడం ద్వారా ఇక్కడ రూపకాలంకారం సాధ్యమైంది. దీంట్లో కన్నీటిని అతిశయించి వర్ణించినందున అంతర్గతంగా అతిశయోక్తి కూడా కనిపిస్తుంది.

**పైడి దువ్వెన పట్టనాది ఎల్లమ్మ-తల్లి పై చిక్కు తీసినాది ఎల్లమ్మ**
**చంద్రవంక జడకొప్పు ఎల్లమ్మ-తల్లి సూర్యవంక సుక్కబొట్టు ఎల్లమ్మ**

**వ॥ జెర్రిపోతుల జంజిరాల తాచుపాముల తలకిరీటాలు వెట్టి (చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గుకథ)**

ఎల్లమ్మ ఒగ్గుకథలో ఎల్లమ్మ అలంకరణ సందర్భంలో కనిపించే ఈ గేయం వచనంలో రూపకాలంకారం కనిపిస్తుంది. ఎల్లమ్మ శక్తి దేవత. గ్రామీణ వ్యవస్థలో గ్రామాన్ని సంరక్షించే చల్లని తల్లి కోపం వస్తే భరింపశక్యంకాని ఉగ్రమూర్తి. అలాంటి ఎల్లమ్మ రూపాన్ని వర్ణిస్తూ ఆమె ఆహార్యం అలంకరణలో కనిపించే జడకొప్పు, చుక్కబొట్టు, జంధ్యం, కిరీటం వంటి వాటిని చంద్రవంకగా, సూర్యునిగా జెర్రిపోతులుగా, త్రాచుపాములుగా చెప్తూ ఈ రెండు అంశాల మధ్య అభేదం చెప్పడం జరిగింది.

లలితా సహస్రనామంలో విష్ణు సహస్రనామంలో సూర్యచంద్రులను విశ్వకారకుడైన విష్ణువు యొక్క కళ్ళు అని భావించగా ఒగ్గుకథలో అమ్మవారి ప్రధాన అలంకారాలుగా కనిపించే చుక్కబొట్టు, జడకొప్పుగా భావించడం కనిపిస్తుంది. ఎందుకంటే ఆ త్రాచు / నాగుపాము ఎల్లమ్మ తల కిరీటంగా ప్రకాశిస్తుంది. కాబట్టి గ్రామీణులు నాగుపామును ఎల్లమ్మ తల్లిగా భావిస్తారు. ఇలా ఎల్లమ్మ అలంకరణలో ప్రస్తుత అంశాలకు, ప్రకృతిగతమైన అప్రస్తుత అంశాలకు మధ్య అభేదం చెప్పినందున ఇది రూపకాలంకారం.

**'మొగవాడు లేని ఇల్లు రామ రామ అది మోత్కుల్లేని అడివంట రామ రామ' (చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ)**

జమదగ్ని మరణం తర్వాత ఎల్లమ్మ దుఃఖాన్ని గురించి తెలిపిన సందర్భంలోని ఈ గేయంలో మగవాడు లేని ఇంటిని మోతుకు / మోదుగు చెట్లు లేని అడవికి అభేదం చెప్పినందున ఇది రూపకాలంకారం, పురుషాధిక్య సమాజంలో మగతోడు లేని ఇంటికి బంధుమిత్రుల రాకపోకలు కూడా తక్కువే. భర్త వియోగంతో నాడు స్త్రీలు శుభకార్యాలకు దూరంగా ఉండేవారు. కావున వారింట్లో ఎలాంటి శుభకార్యాలు ఉండేవి కావు. తెలంగాణ అటవి నేలలో కనిపించే చెట్టు మోదుగ, దీని చెక్కల్ని ప్రధానంగా వంట చెరుకుగాను, యజ్ఞయాగాదుల్లో సమిధలు గాను వినియోగిస్తారు. మోతుకు ఆకులతో కుట్టిన విస్తళ్ళను పండగ పబ్బాలలో ఉపయోగిస్తారు.

విశేషించి ఇది ఏ చెట్టు పుష్పించని సమయంలో నడి ఎండకాలంలో ఎర్రగా నిప్పు కణికలవంటి పుష్పాలతో ఉంటుంది. ఇలా అనేక రకాలుగా ఉపయుక్తమైన మోతుకు చెట్టు లేని అడవిలో ఇతర చెట్లు ఎన్ని ఉన్నప్పటికీ అవి మోతుకు చెట్టులాగా అనేక అవసరాల్ని తీర్చలేవు.

మొగవాడు లేని ఇల్లు ఎలా కళావిహీనంగా ఉంటుందో మోతుకులు లేని అడవి కూడా అలాగే ఉంటుందని మొగుడుతోడు లేనిఇంటికి మోదుగ / మోతుక చెట్టులేని అడవికి అభేదాన్ని చెప్పినందున ఇది రూపకాలంకారం.

"మక్కి మక్కని పండ్లు మాటలు సక్కదనం" (చుక్క సత్తయ్య మల్లన్న కాపుల ఘట్టం)

మల్లన్న కాపుల ఘట్టం ఒగ్గు కథలో మల్లయ్య తన తల్లిదండ్రులు, అన్నలతో కలిసి మేనమామలైన కళ్యాణపు రాజుల పట్టణంలో ఆశ్రయం పొంది ఉండి అక్కడి నుండి తిరిగి తమ కొల్లాపురి పట్టణానికి బయలుదేరే సమయంలో తన మాట చాతుర్యంతో మేనమామగల నుండి అనేక విధాలైన సహాయాన్ని పొందుతాడు. పన్నెండేళ్ళ బాలుడైన మల్లన్న మాట చాతుర్యాన్ని వర్ణిస్తూ కథకుడు మక్కి మక్కని పండ్లు మాట సక్కదనం అనడంలో ప్రస్తుతాంశం మాట సక్కదనం. విషయాన్ని పోల్చడానికి తీసుకున్న ఉపమానం మక్కి మక్కని పండ్లు అంటే పూర్తిగా మగ్గని పండ్లు అని అర్థం. అవి తినడానికి వీలుగా రుచికరంగా ఉండి రసనకు మనసుకు ఆనందాన్నిస్తాయి. మల్లయ్య మాట సక్కదనం కూడా మనసుకు హాయినిచ్చేటట్లుందని పండ్లకు మాటలకు అభేదం చెప్పినందున ఇది రూపకాలంకారం.

"చెల్లెలు కాదు చేదు బీరకాయ" (చుక్క సత్తయ్య వరరచ్చ మల్లన్న ఒగ్గు కథ) చెడ్డ గడియలో పుట్టిన తన బిడ్డ ఆకుమంచి వలన రాజ్యం నాశనమైందని ఎలనాగదేవి బిడ్డ ఆకుమంచిని చిన్నప్పుడే చంపి రమ్మని దాసి వారికిచ్చు పంపగా వరరచ్చ మల్లన్న అడ్డగించి కాపాడి అడవిలోనే ఆ బిడ్డను పెంచి పెద్ద చేస్తాడు. పూర్వజన్మలో జంగమను కొట్టిన పాపానికి మల్లయ్య తల్లి నీలమ్మ అడవిలో నీలపతి గుండై పుడుతుంది. వరరచ్చ మల్లన్న ఆకుమంచితో ఆ నీలపతి గుండు దగ్గరే ఆశ్రయం పొంది ఉంటారు. "ఆకుమంచి ఎవరో కాదు గత జన్మలో రారాజు మల్లయ్య మీద పగబట్టి ఆ పగ తీరకుండా ఈ జన్మలో మల్లయ్య మీద పగ తీర్చుకోవడానికి పుట్టినదని గుర్తించి వరరచ్చ మల్లన్నను పిలిచి కొడుకా మల్లయ్య నీవు చెల్లెలని భావించి తల్లిదండ్రులను విడిచి అడవిలో అష్టకష్టాలు పడుతున్నవు. అది చెల్లెలు కాదు చేదు బీరకాయ కొడుకా... ఆ... నీ తల్లి చెప్పినట్టుగా దాన్ని నరికి నీ రాజ్యాన్ని నీ ప్రాణాన్ని కాపాడుకో కొడుకో... ఆ..." అని హితవు చెప్తుంది. ఇక్కడ చెప్పబడే ప్రస్తుతాంశం మల్లన్న చెల్లెలైన ఆకుమంచి అప్రస్తుతాంశమైన ఉపమానం చేదు బీరకాయ బీరకాయలలో కొన్ని చేదు బీరకాయలు ఉంటాయి. కూరలో ఒక్క చేదు బీరకాయ వచ్చిన కూరంతా పాడువుతుంది. అందుకే తోటలో చేదుబీరను గుర్తించి దాన్ని మొదలుతో సహా తీసివేస్తారు. ఎందుకంటే ఒక్క చేదుబీర వలన తోటంతా పాడువుతందని ఉద్దేశ్యంతో దాన్ని తొలగిస్తారు. ఇక్కడ కూడా ఆకుమంచి వలన

అందరూ పడరానిపాట్లు పడుతున్నారు. కావున నీవు ప్రేమగా చెల్లలని భావిస్తున్న ఆకుమంచి నీకు చెల్లెలు కాదు. చేదు బీరకాయ దాని మీద ప్రేమ వదిలి తొలగించుకొమ్మని చెప్తుంది. ఈ విధంగా చెల్లెలుకు చేదు బీరకాయకు అభేదం చెప్పినందున ఇది రూపకాలంకారం. ఇందులో చెంచే ల మధ్య పదవిరుపు ప్రాసతో పాటు కథకుల వ్యవసాయ విజ్ఞానం కూడా వెల్లడవుతుంది.

**4. దృష్టాంతాలంకారం** : అంశాన్ని రెండు వాక్యాలలో బింబ ప్రతిబింబ భావనతో చెప్పడం దృష్టాంతము. సాధారణ పామర జనులను దృష్టిలో ఉంచుకొని వేమన వంటి కవులు చెప్పిన సాహిత్యములో దృష్టాంతాలంకారము ఎక్కువగా కనిపిస్తుంది. ఎదుటి వారికి సులభంగా అర్థమయ్యే విధంగా ఉదాహరణాత్మకమైన ఒక వాక్యం చెప్పి దాన్ని పోలిన ప్రస్తుతాంశాన్ని చెప్పడం వలన చెప్పదలచిన విషయం సులభంగా అర్థగ్రాహ్యం అవుతుంది.

**"ముక్కుపుల్ల సొమ్ముకాదు, మూడు పైసలు ముల్లెకాదు, ఒక్కెద్దు ఎవుసం కాదు, ఒక్క కొడుకు కొడుకు కాదు" (చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ)**

ఎల్లమ్మ కథలో రేణుకా ఎల్లమ్మ తన సత్యాన్నబోనం సహాయంతో తన భర్త జమదగ్నిని అయిదు ఘడియలు ప్రాణాలతో ఉంచగలుగుతుంది. ప్రాణాల విడుస్తూ జమదగ్ని ఎల్లమ్మను ఏం కావాలో కోరుకోమన్నప్పుడు సంతానం కావాలని అడుగుతుంది. సంతానం వలన సమస్యలు వస్తాయని చెప్పినా ఎల్లమ్మ వినకపోయేసరికి ఎల్లమ్మకు ఒక కొడుకును ప్రసాదిస్తాడు. అప్పుడు ఎల్లమ్మ ఇంకా ముగ్గురు కొడుకులు కావాలని కోరుకుంటూ నాథా ! నాథా ముక్కుపుల్ల సొమ్ముకాదు, మూడు పైసలు ముల్లెకాదు, ఒక్కెద్దు ఎవుసం కాదు, ఒక్క కొడుకు కొడుకు కాదు అని భర్తతో చెప్తుంది. ఇక్కడ చెప్పాల్సిన ప్రస్తుతాంశం ఒక్క కొడుకు సరిపోదు ఇంకా సంతానం కావాలి అని అందుకు లోకంలోని ఉదాహరణల్ని చెప్తుంది. ముక్కుపుల్ల సొమ్ము కాదు. స్త్రీలకు నగలంటే ప్రీతి. నగల్నింటిలో అతి తక్కువ బంగారంతో తయారయ్యే నగ ముక్కుపుల్ల (ముక్కుపుల్ల వేరు ముక్కు పుడక వేరు) అన్ని నగలు ఉండి ముక్కుపుల్ల లేకపోతే లోపమే కాని ఏవిధమైన నగలు లేకుండా ముక్కుపుల్ల మాత్రమే ఉంటే నగలు ఉన్నట్లు కాదని భావం. మూడు పైసలు ముల్లె కాదు. ముల్లె అంటే పొదుపుగా దాచుకున్న ధనం సంపద. కేవలం మూడు పైసలు దాచి పెట్టుకున్నంత మాత్రాన సంపద ఉన్నట్టు కాదు కదా !

ఒక్కెద్దు ఎవుసం కాదు వ్యవసాయం చేయడానికి నాగటికైనా, బండికైనా, రెండు ఎద్లు అవసరం. కేవలం ఒక్కెద్దు ఉంటే వ్యవసాయం పనులకోసం ఇతరుల మీద ఆధారపడాల్సి వచ్చేది. పనుల సమయంలో ఎవరూ తమ ఎద్దులు బదులు ఇవ్వరు కదా! తద్వారా ఒక్కెద్దు

వారి వ్యవసాయం సరిగా నడవదని అర్థం. అలాగే ఒక్క కొడుకు కొడుకు కాదు. ఈ పదానికి వాచ్యార్థం తీసుకుంటే భావం కుదరదు. పైనతెలిపిన ఉదాహరణలను దృష్టిలో ఉంచుకొని ఈ వాఖ్యార్థాన్ని గ్రహించాలి. శిశు మరణాలు అధికంగా ఉన్న పూర్వపు రోజుల్లో ఎక్కువ సంతానాన్ని కనేవారు. ఇవాల్టి లాగా కాకుండా ఇంటి నిండా పిల్లలు ఉండడాన్ని సంపదగా ఐశ్వర్యంగా భావించేవారు. ఒక్కరే సంతానం పొందిన వారిని అరటి గొడ్డురాలు అని నిందించడం కూడా ఉండేది. ఒక్కరికన్నా ఎక్కువ మంది పిల్లలున్న ఇంట్లో పెరిగే పిల్లలో సర్దుకుపోయే తత్వం ఎక్కువగా కనబడుతుంది. అందుకని కేవలం ముక్కుపుల్ల సొమ్ము కానట్లే కేవలం మూడు పైసలు సంపద కానట్లే. కేవలం ఒకే ఒద్దుతో ఎవుసం నడవదు. కేవలం ఒకే కుమారుడు కుమారుడు కాదు. అనే భావాన్ని బింబ ప్రతిబింబ భానతో చెప్పినందున ఇది దృష్టాంతాలంకారం.

**"అవ్వ ఉన్నవాడె బువ్వ / ఎద్దు ఉన్ననాడె ఎవుసం". (బడిగె శ్రీను సరోజినిదేవి ఒగ్గు కథ)** జీవితాసూచకం నుండి వచ్చిన ఈ కథనాత్మక వ్యాఖ్యానంలో చక్కని దృష్టాంతాలంకారం కన్పిస్తుంది. ఏనుగంత తండ్రి లేకున్నా ఏకుల గుల్లంత తల్లిఉండాలి వంటి సామెతలు. పిల్లల పెంపకంలో తల్లి ప్రాధాన్యతను తెలుపుతున్నాయి. సరోజినిదేవి ఒగ్గుకథలో వరద సుందరి మరణిస్తూ తన బిడ్డ భవిష్యత్తుగురించి బాధపడిన సందర్భంలో ఈ వర్ణన కపినిస్తుంది. తనకు తినడానికి లేకపోయిన పిల్లల కడుపునింపాలనే ఆలోచన తల్లికి మాత్రమే ఉంటుంది.

అలాంటి తల్లి దూరమైతే పిల్లలకు తిండి కరువవుతుంది. ఈ విషయాన్ని ఎద్దుఉన్ననాడే ఎవుసం అని ప్రతిబింబంగా చెప్పారు. వ్యవసాయంలో యాంత్రీకరణ జరుగడానికి ముందు నాగలి నడిచే ఎద్దులపాత్ర కీలకంగా ఉండేది. ఎద్దులేకపోతే వ్యవసాయం నడువడానికి వీలయ్యేదికాదు. తల్లిలేకపోతే పిల్లలకు తిండి దొరకనట్లే, ఎద్దులేకపోతె వ్యవసాయం నడువదని రెండు విషయాలను బింబప్రతిబింబ భావంతో చెప్పినందున ఇది దృష్టాంతాలంకారం. మానవ సంబంధాలకు గ్రామీణ వ్యవసాయక జీవనాన్ని జోడించి చెప్పిన ఈ అలంకారిక ప్రయోగంలో విశేషమైన జీవితానుభవం కనిపిస్తుంది.

**"కూరాడు లేనిల్లు కుంసుండ దోషం / ఆడివిల్ల లేనిల్లు అడుగుపెట్ట దోషం" (చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ)**

కూరాడు తెలంగాణ సాంస్కృతిక చిహ్నం. కొన్ని దశాబ్దాల క్రిందట వరకు కూరాడు కలిని వంటకు ఉపయోగించేవారు. ప్రతి పండగ పబ్బానికి కూరాడును సున్నం పసుపు

కుంకుమలతో అలంకరించడం ఆచారం. కూరాడు ఆడపిల్లకు ప్రతీక. దీన్ని గృహ ప్రవేశం సమయంలో ఇంటి ఆడబిడ్డ చేత పూదిచ్చి దేవునిగదిలో భద్రపరిచి చాలా జాగ్రత్తగా కాపాడుకుంటారు. ఇంట్లో కూరాడు లేదు అంటే ఆ ఇల్లు ఆచార సాంప్రదాయం ప్రకారం గృహప్రవేశం జరగలేదని అర్థం. అటువంటి ఇంట్లో పండుగలు, నోములు వంటివి నిర్వహించుకోడానికి అవకాశం కానీ అధికారం కాని లేవు. ఈ విధంగా కూరాడు లేని ఇంటిలో పూజాధికాలు నిర్వహించడాన్ని దోషంగా భావించినట్టే ఇంట్లో ఆడపిల్ల లేకపోతే ఆ ఇంటిలో అడుగు పెట్టడమే దోషం అని చెప్తున్నారు. ఇంట్లో ఆడపిల్ల ఉంటే తీర్చిదిద్దినట్టు సర్ది ఉంటుంది. ఆడపిల్ల తల్లికి ఆసరా అవుతుంది. ప్రేమాభిమానాలకు నిలయమైన ఆడపిల్ల సంతానం కావాలని భావించడం లాభనష్టాల జోలికిపోని జానపదుల హృదయ నిర్మాతలకు నిదర్శనం. ఇదే భావాన్ని ఎల్లమ్మ ఒగ్గు కథలో వ్యక్తం చేయడం జరిగింది.

సత్యానబోనం ద్వారా ఎల్లమ్మ తన భర్త జమదగ్నిని కొంత సేపు పునర్జీవితాన్ని చేసుకుని భర్త అనుగ్రహంతో నలుగురు మగ పిల్లల సంతానాన్ని పొందుతుంది. తర్వాత తనకు నలుగురు కొడుకుల తోడు ఒక ఆడపిల్ల కావాలని కోరుకుంటుంది. భర్తను కోల్పోయిన స్త్రీకి సంతాన సంరక్షణ ముఖ్యంగా ఆడ పిల్లలను పెంచి పెద్దచేసి పెళ్లి చేయడం చాలా కష్టం కావున వద్దని వాదిస్తాడు జమదగ్ని. ఆ సమయంలో తనకు తప్పకుండా ఆడపిల్ల సంతానం కావాలని కోరుతూ... "ఎల్లమ్మ కూరాడు లేని కుసుండ దోషం ఆడివిల్ల లేనిల్లు అడుగుపెట్ట దోషం" అని ఆడపిల్లలను సంతానంగా పొందాల్సిన ఆవశ్యకతను తెలుపుతుంది. ఇక్కడ గృహప్రవేశం జరిగిన ఇంటిలో కూరాడుకు ఎంతటి ప్రాధాన్యం ఉందో ఇంటిలో ఆడ పిల్లలకు అంతటి ప్రాధాన్యం ఉందనే అంశాన్ని బింబప్రతిబింబ భావనతో చెప్పినందున ఇది దృష్టాంతాలంకారం.

**5. వ్యాజోక్తి అలంకారం:** ఏ సాహిత్యములోనైనా నేరుగా సూటిగా చెప్పిన విషయం కన్నా కొంత వంకరగా ధ్వన్యంగా చెప్పిన విషయమే రమ్యంగా వుంటుంది. దీన్నే లాక్షణికులు వక్రోక్తి అన్నారు. అర్థాలంకారాలన్ని చాలా వరకు ఇదే భావాన్ని ప్రత్యక్షంగానో పరోక్షంగానో కలిగి ఉంటాయి. "కారణాంతరమును చెప్పుట చేత ఆకారగోపనము చేయుట వర్ణితమైన ఎడల అది వ్యాజోక్తి అలంకారమగును. నిజమైన కారణమును దాచిపెట్టి కారణాంతరమున చెప్పి మోస పుచ్చుటయే యిక్కడ జరుగును. వ్యాజమనగా మోసమని అర్థం కలదు. మోసముతో కూడి ఉన్న వచనము ప్రవృత్తమగుటయే ఇక్కడ ప్రధాన అంశము. కావుననే వ్యాజ్యోక్తి అనే పేరు దానిని సార్థకమగుచున్నది"[12] ఇలాంటి లక్షణాలతో కూడిన ఒక గేయం ఎల్లమ్మ ఒగ్గు కథలో

కనిపిస్తుంది. బొంగురాలాటలో ఓడిపోయిన బలిజరాజులు పరశురామునితో పందెం గెలవలేక తండ్రి లేక పుట్టావని పరశు రామున్ని దూషించినప్పుడు పరశురాముడు తన తండ్రి ఎవరో తెలుసుకోవాలని తల్లి దగ్గరకు వచ్చి నేరుగా అడగలేక వ్యాజోక్తి అలంకారంలో అడుగుతాడు.

"ఇత్తు లేంది తల్లి ఎల్లమ్మ తల్లి ఎల్లమ్మ/ మొలకెట్లు మొలిసెనే తల్లి ఎల్లమ్మ తల్లి ఎల్లమ్మ
మొలక లేనిది ఆకెట్లు పెట్టనె ఆకెట్లు పెట్టనె / ఆకు లేంది తీగెట్లు వారె తీగెట్లు వారె
తీగ లేంది మొగ్గట్టవెట్టె మొగ్గెట్టవెట్టె / మొగ్గ లేంది పూతెట్లు పూసె పూతెట్లు పూసె
పూత లేంది కాతెట్లు గాసె కాతెట్ల గాసె / కాత లేంది పండెట్లు పండె పండెట్లు పండె
పండు తినంది ఫలమెట్లు గలిగె ఫలమెట్లు గలిగె / జనకుడు లేకుండా జన్మెట్లు వచ్చెనె
జన్మెట్లు వచ్చెనె". **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ)**

ఈ కథా గేయానికి అనుకరణంగా ఇదే భావనతో కొద్ది మార్పులతో మరో గేయము కనిపిస్తుంది.

"తల్లీ ఎల్లమ్మ నేను ఆట కోయిన కాడ ఒక పాట నేర్చుకున్న, నీవు పాడుమంటే పాడుతా లేకుంటె ఊకుంటనని పరశురాముడు అనంగానే కొడుకు మీద ప్రేమతో ఎల్లవ్వ కొడుకు మనసులో ఉన్న విషయం తెలవక ఏం పాట నేర్చుకున్నావు కొడుకా పాడుమని అనంగానే పరశురాముడు పాడుతున్నప్పుడు..."

ఇత్తు లేనిది ఎల్లవ్వ తల్లి ఎల్లవ్వ చెట్టెట్టు పుట్టేనె ఎల్లవ్వ తల్లి ఎల్లవ్వ
చెట్టు లేంది ఎల్లవ్వ తల్లి ఎల్లవ్వ కాతెట్లు గాసెనె ఎల్లవ్వ తల్లి ఎల్లవ్వ
కాత గాయంది ఎల్లవ్వ తల్లి ఎల్లవ్వ పండెట్ల పండెనె ఎల్లవ్వ తల్లి ఎల్లవ్వ
పండు వండంది ఎల్లవ్వ తల్లి ఎల్లవ్వ ప్రజలెట్లు తిన్నరు ఎల్లవ్వ తల్లి ఎల్లవ్వ
మొగులు లేంది ఎల్లవ్వ తల్లి ఎల్లవ్వ వానెట్లు కొట్టెనె ఎల్లవ్వ తల్లి ఎల్లవ్వ
వాన లేంది ఎల్లవ్వ తల్లి ఎల్లవ్వ వరదెట్లు పారెనె ఎల్లవ్వ తల్లి ఎల్లవ్వ
వరద వారంది ఎల్లవ్వ తల్లి ఎల్లవ్వ చెరువెట్లు నిండెనె ఎల్లవ్వ తల్లి ఎల్లవ్వ
చెరువు నిండంది ఎల్లవ్వ తల్లి ఎల్లవ్వ అలుగెట్లు దుంకెనె ఎల్లవ్వ తల్లి ఎల్లవ్వ
ఎద్దు లేంది ఎల్లవ్వ తల్లి ఎల్లవ్వ ఆవెట్లు గట్టెనె ఎల్లవ్వ తల్లి ఎల్లవ్వ
ఆవు గట్టంది ఎల్లవ్వ తల్లి ఎల్లవ్వ ల్యాగెట్లు పుట్టేనె ఎల్లవ్వ తల్లి ఎల్లవ్వ అయ్యో
మాబాపు లేకుంటె ఎల్లవ్వ తల్లి ఎల్లవ్వ మేమెట్లు పుడితిమి ఎల్లవ్వ తల్లి ఎల్లవ్వ **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ)**

అని పరశురాముడు తల్లి ఎల్లవ్వను కూసుండవెట్టి జాడ తెలుసుకోవడానికి తీట పాట

పాడిందు. దేవతల బొంగురం సాధించిన పరశురాముడు బొంగరాలాటలో బలిజ రాజుల్ని ఓడించగా వారు పరశురామున్ని తండ్రి ఎవరో తెలియని వాడివి నీ తల్లి తప్పు చేసి కన్నదని నిందించగా వారి మాటలు విన్న పరశురాముడు ఆవేదన చెంది అక్కడి నుండి వస్తూ ఆ విషయం నిజమో అబద్ధమో నిర్ధారించుకోవడానికి దారిలో చాకలి వారితో, బలిజ ఈరమ్మతో, బ్రాహ్మణునితో కావలసి కయ్యం పెట్టుకుంటాడు. అందరూ కూడా పరశురామున్ని తండ్రి లేకుండా తల్లి ఎల్లమ్మ తప్పుచేసి కన్నదని తిడతారు.

అప్పుడు పరశురాముడు ఎలాగైనా తండ్రి ఎవరో తెలుసుకోవాలని నేరుగా తల్లి దగ్గరికి వెళ్లి తండ్రి ఎవరో చెప్పమని సూటిగా అడగకుండా ఆటకు పోయిన దగ్గర పాట నేర్చుకున్న ఆ పాటకు అర్థం చెప్పమని అని ఇలా పాట రూపంలో ప్రశ్నిస్తాడు. సృష్టిలో జరిగే కార్యాకారణాల మధ్య సంబంధాన్ని ప్రశ్నిస్తూ సాగే ఈ గేయంలోని అంతరార్థం తల్లి తండ్రి లేకుండా సంతానం ఎలా కలుగుతుంది. మాకు తల్లివి నీవు మరి తండ్రి ఎవరు? అనే ప్రశ్న అంతర్గతంగా కనిపిస్తుంది. కావున ఇది వ్యాజోక్తి అలంకారం. అడగవలసిన అసలు విషయాన్ని గోప్యంగా ఉంచి సాదృశ్యాలైన ఇతర విషయాలని వర్ణించి తద్వారా అడగాలన్న ప్రశ్నను ఉత్పన్నం చేయడం ఇక్కడ ప్రధాన ఉద్దేశ్యం. ఈ అలంకారంలో కూడా విత్తుకు చెట్టుకు, వానకు వరదకు, ఎద్దుకు ఆవుకు, గల సంబంధాన్ని వర్ణించడంలో హేతుగర్భ విశేషణాలతో కూడిన కథకుల ప్రాకృతిక విజ్ఞానం కనిపిస్తుంది. ఒగ్గు కథలలో తీట పాటగా / తిట్టు పాటగా గుర్తింపు పొందిన ఈ కథాగేయంలో అంతర్గతంగా సారలంకారం కనిపిస్తుంది.

రారాజు మల్లయ్య తనతో గర్వంగా మాట్లాడిన తన భార్య మేడలమ్మతో... "పురుగు ముట్టని పుష్పము, కప్ప ముట్టని గౌతము, సిరిలేని పత్రి తెచ్చి పాదపూజ చేయమని కోరతాడు". **(చుక్క సత్తయ్య గొల్ల కేతమ్మ ఒగ్గు కథ)** శివపార్వతులు చెలియాట మార్గంలో వెళ్తుండగా శివుడు పార్వతికి ఏం కావాలో కోరుకోమంటాడు. పార్వతి ఇన్నూట ఇద్దరు సంతానం కావాలని కోరుకుంటుంది. అంత సంతానం నీవు పెంచ లేవని శివుడంటే పెంచే శక్తి నాకుందని పార్వతి అన్నప్పుడు పురుగు ముట్టని పుష్పము, కప్ప ముట్టని గౌతము, సిరిలేని పత్రి తెచ్చి పాదపూజ చేస్తే ఇస్తానంటాడు.

ఈ రెండు సందర్భాలలో నాయకుడు (మల్లయ్య / శివుడు) తన భార్య మాటల్లో దాగిన గర్వాన్ని గుర్తించి ఆ గర్వాన్ని తొలగింప చేయడానికి నేరుగా నీవు నీ గర్వం తగ్గించుకొమ్మని చెప్పకుండా ఏ పనైనా నా శక్తితో సులువుగా చేయగలను. ఏ వస్తువునైనా అవలీలగా తీసుకురాగలనని అతి విశ్వాసంతో ఉన్న వారిలో అహం తొలగిపోయే విధంగా సృష్టిలో

లభించ లేని అసాధ్యమైన వస్తువులను తెమ్మని కోరడం గమనిస్తే అసలు కారణాన్ని గోపనం చేసి కారణాంతరమును చెప్పినందున ఇది వ్యాజోక్తి అలంకారం అవుతుంది. ఇక్కడ నాయకుడు తన భార్యను ఇలాంటి వస్తువులు అడగడంలోనే నీవు ఇలాంటివి తీసుకురాలేవు. నీకు అంతటి శక్తి లేదు. నీకన్నా అతీతమైన శక్తి ఈ సృష్టిలో ఉంది అనే భావన కనిపిస్తుంది. ఈ విధంగా ఆవశ్యకమైన కారణాన్ని గోప్యం చేస్తూ నిందాపూర్వకంగా చెప్పిన వర్ణన కావున ఇది వ్యాజోక్తి మరియు సూటిగా కాకుండా వక్రంగా చెప్పినందున ఇది ఒక వక్రోక్తి కూడా అవుతుంది.

**6. స్వభావోక్తి అలంకారం:** జాతి గుణ క్రియాదులలో ఉన్న విషయాన్ని ఉన్నది ఉన్నట్లుగా చెప్పడాన్ని స్వభావోక్తి అలంకారం అంటారు. అంటే చెప్పే విషయాన్ని అతిశయోక్తులు, విశేషణాలు లేకుండా వర్ణించడమే స్వభావోక్తి దీన్నే జాతి అని వ్యవహరించడం జరిగింది. ప్రధానంగా జాతి వచనాలను వర్ణించడం వలన దీనికి జాతి అని సూచించి ఉండవచ్చు. స్వభావోక్తి అంటే సహజ విషయ వర్ణనే అయినప్పటికీ సౌందర్యాత్మకంగా చెప్పినప్పుడే ఇది అలంకారంగా భాసిల్లుతుంది. అంతేకానీ సామాన్యమైన సంభాషణలు సాధారణ విషయ వాక్యాలు స్వభావోక్తి కావు.

"కరణాల పుట్ట, కంచల్ల మర్రి, ఊడలతోటి మర్రి ఊరెములున్నది. పంగల తోటి మర్రి పటవృమున్నది ఆ మర్రి దగ్గరకు జేరిన జమదగ్ని ఊడలను ఊట్లు గట్టి తండ్రి చేసిన పాపముపటువలను తల మీద నుండి తీసి ఆ ఊడల ఊటల్ల వెట్టిందు..." **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ)**

ఇక్కడ ఆ మర్రిచెట్టు ఆకార విశేషాల్ని చాలా వరకు సహజంగా ఉన్నదున్నట్లు వర్ణించడం జరిగింది. కంచల్ల మర్రి, కంచె / కంచ అంటే గ్రామంలో ఎవరికీ చెందని ప్రాంతం. సాధారణంగా పశువుల్ని మేపడానికి ఉమ్మడిగా వదిలిన ప్రాంతం. అడవికి ఊరికి మధ్య ప్రాంతం. మర్రిచెట్టటువంటి కంచెలో ఉంది. కావున కంచల్ల మర్రి, ఆ మర్రి ఊడలతో ఊరెలుము ఉన్నది (ఊరు + ఎలము) వెడల్పు పదానికి శబ్ధ పరిణామ రూపం ఎలుము. శతాబ్ధాల క్రితం వరకు ఊరు విస్తీర్ణం చిన్నగా ఉండడం అంతే స్థాయిలో ఇక్కడ వర్ణితమైన మర్రి వృక్షాలు ఉండడం వాస్తవమే. కాలక్రమేణా ఊరి విస్తీర్ణం పెరగడం నాగరిక పరిణామం.

పంగలతోట, మర్రివట వృక్షం ఉంది. పంగ చెట్టుకొమ్మ అనే అర్థం (ఒక కొమ్మ రెండుగా ప్రారంభం అయి పెరగడం) అలాంటి పెద్ద కొమ్మలలో మర్రిచెట్టు వట వృక్షమున్నది అని చెప్పారు. మర్రికి సంస్కృత నామం వట. ఇది అనుకరణలో పట అయ్యింది. (వ్యాకరణ

నియమం ప్రకారం పరుషాలైన కచటతపలు గసడదవలు గా గాని లేదా సరలాలుగా అంటే గజడదబలుగా గాని మారుతాయి) ఇక్కడ ప కరాం వ కారం మారడానికి విరుద్ధంగా వ కారం ప కారం గా మారివట పట అయింది. ఇలాంటి మార్పు జరిగిన వెంకటేశ్వరుడు వెంకటేస్పరుడు వంటి వ్యవహారికగా రూపాలు గ్రామీణ మాండలికంలో గమనించవచ్చు.

పంగలతోటి మర్రి వట వృక్షం అని ప కార ప్రాస కోసమే వట-పటగా మార్పు చెంది ఉండవచ్చు. మరియు మర్రి ఊడలకు ఉట్లు కట్టి పటువలు పెట్టండు అని వర్ణించడంలో సహజత్వం ఉంది. వ్యవసాయ జీవనంలో చీమల నుండి సద్దిని కాపాడడానికి మర్రి చెట్టు ఊడలను ఉట్లు గట్టి భద్రపరుస్తారు. ఈ విధంగా చెట్టు విశేషాల్ని దాన్ని ప్రయోజనాల్ని సహజంగా ఉన్నట్లుగా వర్ణించి నందున ఇది స్వభావోక్తి అలంకారం.

"దేవదేవుని మంద దేవునావుల మంద, ఏటమీద ఎడ్లమంద పాటిమీద బర్లమంద, చిన్న గుట్టల మీద చిన్న ల్యాగల మంద, పెద్దగుట్టల మీద పెయ్యలావుల మంద. కోటబొగుడల్ల కోడెల మంద, ల్యాత మామిడి తోట్ల, ల్యాగల మంద కోటి భాగ్యం ఉంది. ఇష్ట సంపద ఉంది. ఎండకున్నాళ్లను నీడకు పెడుతున్నదు ఒళ్లు చూసి వస్త్రాలు ఇస్తున్నాడు పాలుదాగి పిల్లలుంటే పాడే బర్లను దానం చేస్తున్నడు. దాన ధర్మం చేత్తా ఉన్నడు" **(చౌదరిపల్లి అంజయ్య బాలనాగమ్మ ఒగ్గు కథ)**

పూర్వకాలంలో కొన్ని రాజ్యాలలో పశువులనే సంపదగా భావించేవారు. మహాభారతంలో కూడా విరాటరాజుకున్న సంపదలలో ప్రధానమైంది. పశు సంపదేనని తెలుస్తుంది. బాలనాగమ్మ ఒగ్గు కథలో నవ భోజరాజు సందపను వర్ణిస్తూ ఎక్కి సూడ వెండి మేడ, దిగి సూడా బంగారు మేడ జూదమాడి జాజిమేడ, లాలి మేడలు లక్క మేడలు అంటూ అతిశయోక్తిగా వర్ణించి అనంతరం ఆయన పశుసంపదను ఏటి మీద ఎడ్ల మంద, పాటిమీద బర్ల మంద, కోట బోగుడలలో కోడెల మంద, ల్యాత మామిడి తోట్ల ల్యాగాల మంద అని పశుసంపదను స్వభావోక్తిలో వర్ణించాడు. పశువులు ఎక్కువగా ఉన్నప్పుడు ఎడ్లను, బర్లను, ఆవులను, చిన్న లేగలను విడివిడిగా మేతకు తొలగిపోవడం గ్రామాలలో గమనించవచ్చు. అలా నవభోజరాజు. పశుసంపదను వాటిని మేపుతున్న లేదా అవి విశ్రాంతి తీసుకుంటున్న ప్రదేశాలను సహజంగా వర్ణించారు.

పశుసంపద వర్ణన తరువాత నవ భోజరాజు దాతృత్వాన్ని తెలియజేసాడు. రాజు నిర్వర్తించే విధులలో దానం చేయడం ఒకటి అయితే అపాత్రదానం కాకూడదు. అందుకే ఎవరికి ఏది అవసరమో దాన్ని అందిస్తున్నాడు రాజు. పొట్ట చూసి భోజనాలు పెడుతున్నాడు. మనిషి తిన్నది లేనిది కనిపించేది పొట్ట / శరీరం ద్వారానే కదా ! అందుకే శరీర సౌష్టవం గమనించి వారికి

కావలిసిన ఆహారం అందిస్తున్నాడని, ఒళ్ళు చూసి వస్త్రాదానం చేస్తున్నాడు. తిండి ఉండి బట్టలు లేని వారికి వస్త్రందానం చేస్తున్నాడని మనిషి ప్రాథమిక అవసరాలైన అన్న వస్త్రాల్ని ఏవిధంగా దానం చేయాలో రాజు ఎలా దానం చేస్తున్నాడో ఉన్నది ఉన్నట్టుగా స్వభావోక్తిలో వర్ణించాడు. ఈ విధంగా బాలనాగమ్మ ఒగ్గు కథాగానంలో నవ భోజరాజు పశుసంపదను, దాన శీలతను వర్ణించడంలో చక్కని స్వభావోక్తి అలంకారం కనిపిస్తుంది. "కుడి మీసమొడివెట్టి గుడ్లెర్రజేసి/ఎడమమీసమొడివెట్టి వెన్నరగజూసి" **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ)**

పరశురాముని కోపాన్ని వర్ణిస్తూ చెప్పిన ఈ కథాగానంలో స్వభావోక్తి కనిపిస్తుంది. కోపం వచ్చిన మనిషి కనుగుడ్లు ఎర్రబడడం. ఎదుటి వ్యక్తి మీద ఆ కోపాన్ని ప్రదర్శించడానికి ముందు మీసం తిప్పి బెదిరించడం సహజ లక్షణాలు. తండ్రి జాడ చెప్పకుండా తలవంపులు తెస్తుందని భావించిన పరశురాముడు తల్లి ఎల్లమ్మ మీద తన కోపాన్ని ప్రదర్శించడానికి ముందు కుడి మీసం వడివెట్టి అంటే తిప్పి, కనుగుడ్లు ఎర్రగా చేసి ఎడమ మీసం తిప్పి వెన్ను ఒరగ చేసి నిటారుగా నిలబడి రౌద్రాకారంతో ఉన్న రూపాన్ని ఉన్నది కళ్ళకు కట్టినట్లుగా వర్ణించినందున ఇది స్వభావోక్తి అలంకారం. మల్లన్న కాపుల ఘట్టం ఒగ్గుకథ 1వ. భాగంలో ఆదిరెడ్డి వైభోవోపేతమైన రూపాన్ని వర్ణిస్తూ

"బంగారంచు శాలుగట్టి, నిలువుటంగీలు తొడిగి, కళావతి రూమాలు చుట్టి, పూల నాగబెత్తం చేతిల పట్టి, మోసపాపోసులు కాల్లకేసుకుని, ముత్యాల సింహాసనం మీద కూసోసి రాజ్యపాలన చేస్తున్న ఆదిరెడ్డి, నీలమ్మ లోగిళ్ళలోకి వచ్చినప్పుడు ఎదురుగా నీ వల్లి తెచ్చిన నీలమ్మ ఎడమరెట్ట వట్టి వేడుకలు చేసి కుడి రెట్ట వట్టి కుశాలు చేసి ఎంగావాలి" అని చెప్పిన వచనంలో ఆదిరెడ్డి వస్త్రాలంకరణలో ఆదిరెడ్డి, నీలమ్మల మధ్య అనురాగాలలో సహజత్వం కనిపిస్తుంది కావున ఇది స్వభావోక్తి అలంకారం.

"రాముడె రాముడు, కోదండ రాముడు, ఎల్లమ్మ కొడుకు ఎల పరశురాముడు, నల్లనివాడు నామాలు గలవాడు, శంఖ చక్రాలు, భుజ కిరీటాలు, బంగారు తిరుణం, మెరుగు మీసం, బైరి గడ్డం పక్కలపైడి మచ్చ, ప్రాణాలగుత్త, పరశురాముడురా..... ఆ.... బాల పరశు రామయ్య...." **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గు కథ)**

ఎల్లమ్మ ఒగ్గు కథలో పరశురామునికి 24 సంవత్సరాలు నిండిన తర్వాత ఎల్లమ్మ జమదగ్ని గురించి జమదగ్ని చంపిన కార్యవీర్యుని గురించి చెప్పగానే పరశురామునితో కోపం కట్టలు తెంచుకుని కార్తవీర్యుని మీద కోపగించిన సందర్భంలో ఈ వర్ణనను గమనిస్తే ఎల్లమ్మ కొడుకు ఎల పరశురాముడు, నల్లని వాడు నామాలు గలవాడు అనే అనుప్రాసతో పాటు పరశు

రాముడు గడ్డం, మీసం, శరీరం మీద మచ్చ ధరించిన ఆభరణాలు ఇత్యాది అంశాలన్నీ సహజంగా వర్ణించబడ్డాయి. విశేషించి పరశురాముని లక్షణాన్ని తెలుపుతూ ప్రాణాల గుత్త అని చెప్పాడు. శత్రువుల ప్రాణం తీయడానికి ఏ మాత్రం వెనుకాముందాడనివాడు, భయపడనివాడు అనే అర్థంలో ఈ జాతీయాన్ని వాడుతారు. ఈ విధంగా కనిపించే బాహ్య శరీరంతో పాటు అంతర్గత వ్యక్తిత్వాన్ని సైతం ఉన్నదున్నట్లుగా వర్ణించినందున ఇది స్వభావోక్తి అలంకారం.

బీరప్ప ఒగ్గుకథలో మంద కావలి చాలించి, పెళ్లి మీద ప్రేమ చెందిన బీరయ్య అక్క మాంకాళి దగ్గరికి వస్తాడు. అలా చాన్నాళ్ళ తరువాత తమ్మున్ని చూసిన అక్క మాంకాళి ప్రేమతో తమ్ముని ఎత్తుకుని వచ్చి పీఠ మీద కూర్చుండబెట్టి వాత్సల్యంతో పదహారేళ్ళ ప్రాయంలో ఉన్న బీరప్పను ఇంకా పిల్లవాడిగా భావించి తలకు నూనె రాసే సందర్భాన్ని

"ఉట్లల్ల నూనె మెట్లల్ల వంపి / మెట్లల్ల నూనె చిట్లల్ల వంపి / చిట్లల్ల నూనె శిరసాన పెట్టి సంపంగి కురులకు సమరు అంటినాది" అని వర్ణించడంలో స్వభావోక్తి అలంకారం కనిపిస్తుంది.

బీరువాలు, తనాబ్బీలు లేని పూర్వకాలంలో చీమల బారి నుండి, పిల్లుల బారి నుండి నూనె, నెయ్యి వంటి వాటిని ఉట్టిమీద భద్రపరిచేవారు. అలా ఉట్టిమీద పెద్ద పాత్రలో ఉన్న నూనెను కొన్ని రోజులకు సరిపడా ఉపయోగించడానికి అనుకూలంగా మధ్యరకంగా ఉన్న మెట్లల్లకు (మెట్టు అనేది ఒక పాత్ర) వంచి, ఆ మెట్లల్ల నుండి తక్షణావసరానికి వాడుకోవడానికి చిన్న పాత్ర (చిట్టి / చిట్టు – బాహువచనం చిట్లు) చిట్లల్లకు నుంచి వంచిన నూనెను అక్క మాంకాళి బీరయ్య శిరసున పెట్టిన విధానాన్ని ఉన్నది ఉన్నట్లుగా వర్ణించినందుకు ఇది స్వభావోక్తి అలంకారం. ఇందులో ఒక వాక్యం చివరి పాదంతో తరువాతి పదం ప్రారంభం కావడం కూడా గమనిస్తే ముక్తపదగ్రస్తం అనే శబ్దాలంకారం కూడా గోచరమవుతుంది. అలసిపోయి వచ్చిన బీరయ్యను స్నానం చేయించి, అలంకరించిన అక్క మాంకాళి తమ్మునికి కడుపారా తినిపించి తరువాత "కత్తిరించిన పోకలు కాసుసున్నం తమలపాకుల్ల తాలిమిజేసి దానిమ్మదవుడల్ల దాపురం జేసింది". అని తాంబూలాన్ని వర్ణించడంలో కూడా స్వభోవోక్తి అలంకారం కనిపిస్తుంది.

"మట్టేడు మావురంల రేణుకా ఎల్లమ్మ / బుడబుడలెల్లమ్మ భూలోకరంభ
జలముల పుట్టింది జలవీరసుందరి / శివునికి చిన్నబిడ్డ సిద్ధులకు చెల్లెలు
గోతముని కోడలు గంభీర వాణి / మాదుగుల ఆడిబిడ్డ మైరాస రేణుకా ఎల్లమ్మ
మట్టు మంగళవారం పుట్టు బుధారం / పూలచెత్రి వట్టి పుల్లగుర్రమెక్కి
వేల్పుల పంబాల వారిని వెంటబెట్టుకుని సత్యగంగ స్నానానికి బయలుదేరుతుంది....

దేవి.... దేవి" **(చుక్క సత్తయ్య బీరప్ప ఒగ్గు కథ)**

మావురం పట్టణాన్ని పరిపాలించే రేణుక ఎల్లమ్మ సత్యగంగ స్నానానికి బయలుదేరుతున్న సమయంలో రేణుకా ఎల్లమ్మ రూపంలో స్వభావోక్తి అలంకారం ఉంది.

రేణుకా ఎల్లమ్మ పంచ దేవతగా జలములో పుట్టింది కావున జల వీరసుందరి. శివునికి గారాలబిడ్డ శివ సంతానమైన సిద్ధులకు చెల్లెలు. గౌతమముని కోడలు, గంభీరమైన వాక్కు గలది. అది జాంభవుల ఆశ్రయం పొంది వారింటికి ఆడబిడ్డగా గౌరవింపబడుతుంది. మావురం పట్నాన్ని పాలించే ఎల్లమ్మ బుధవారం రోజున పూలతో అలంకరించబడి ఛత్రం పట్టుకుని, పుల్లగుర్రం అంటే ఎలాంటి మచ్చలేని తెల్లగుర్రం పైన **(తెల్లగా ఉండే జంతువుల్ని పుల్లావు, పుల్లెద్దు, పుల్లగుర్రం అని వ్యవహరిస్తారు)** పూజలు నిర్వహించే వేల్పుల వారు. వంబాల వారు వెంట నడిచివస్తుండగా స్నానమాచరించడానికి సత్యగంగకు బయలుదేరిందని ఉన్న విషయాన్ని ఉన్నదున్నట్లుగా అందంగా వర్ణించి చెప్పినందున ఈ వర్ణనలో స్వభావోక్తి అలంకారం కనిపిస్తుంది.

**7. అతిశయోక్తి:** లోకంలోని సహజత్వాన్ని అతిశయించి వర్ణించుట ద్వారా ప్రస్తుతాంశాన్ని వివరించడం అతిశయోక్తి. జాతి,గుణ, క్రియాదులలో ఉన్న విషయాన్ని ఉన్నదానికంటే చాలా ఎక్కువగా, ఆశ్చర్యం గొలిపే రీతిలో వర్ణించి చెప్పడాన్ని అతిశయోక్తి అంటారు. "అద్భుత, వీర రసములు అతిశయోక్తి మొదలగు అలంకారాలనిన జానపదులకు ఎంతో ఇష్టం" **(కె.రుక్నుద్దీన్-జానపదసాహిత్యంలో అలంకారవిధానం, పుట.122)** జానపదసాహిత్యంలో ఇతివృత్తం వాస్తవికతకు దగ్గరగా ఉన్నప్పటికీ వర్ణనలో అతిశయోక్తులు కనిపిస్తాయి. అయితే అతిశయోక్తుల్లో కనిపించే పోలికలు కూడా పల్లె ప్రకృతిగత విశేషాలయి ఉంటాయి. ఒగ్గుకథా గానంలో కనిపించే అతిశయోక్తులు వాస్తవదూరాలనిపించినప్పటికీ హృదయోల్లాసాన్ని కలిగిస్తాయి. "సముద్రమంత చల్ల ఎన్నీలంత ఎన్న" **(చుక్క సత్తయ్య . మల్లన్న కాపుల ఘట్టం)**

పల్లె సంస్కృతిలో పాడి పంటలు విడదీయరాని అంశాలు. మల్లన్న కాపులఘట్టం ఒగ్గుకథలో కొల్లాపురాన్ని పాలించే ఆదిరెడ్డి నీలమ్మల సంసార వైభవం గురించి తెలియజేస్తూ "నీలమ్మ సముద్రమంత చల్ల చేసి, ఎన్నీలంత వెన్న తీసిందని" అని చెప్పడంలో అతిశయోక్తి కనిపిస్తుంది. చల్ల, వెన్నెలు ఎంత పుష్కలంగా ఉన్నప్పటికీ కొలమానానికి అందని సముద్రము, వెన్నెలంతా ఎక్కువగా ఉండడం సాధ్యం కాదు. ఒక నాటి పల్లెల్లో సమృద్ధిగా పాడిని కలిగిఉ ండటం సంపదకు చిహ్నం. గొప్ప సంసారం అంటే కేవలం మిద్దెలు, మేడలు మాత్రమే కాకుండా ఇంటి నిండా, ఇంట్లోవారికి బయట వారికి కూడా ఇవ్వడానికి సరిపడా పాలు పెరుగు వంటి పాడి

సమృద్ధిగా కలిగి ఉండటమే సంపదగా భావించేవారు. అలాంటి సంపదను విశాలమైన విస్తృతమైన, అతులితమైన సముద్రంతో వెన్నెలతో పోల్చడం అతిశయోక్తి అలంకారం. ఇందులో కనిపించే సముద్రము, వెన్నెల వంటి ఉపమానాలు ఉపమానాలు జానపదులకు సుపరిచితాలు. ద్రవంగా ఉన్న చల్ల గురించి చెప్పాడానికి సముద్రాన్ని, తెల్లగా ఉన్న వెన్నన గురించి చెప్పడానికి వెన్నెలను పోలికలుగా గ్రహించడం ఔచిత్యవంతంగా కనిపిస్తుంది.

"కాలు దుమ్ము లేసెనా-కైలాసమందెనా / డెక్క దుమ్ము లేసెనా దేవలోకమందెనా" **(చుక్క సత్తయ్య మల్లన్న కాపులఘట్టం)**

పటేల్ మల్లయ్య ప్రధాని సంగన్న కళ్యాణ పట్టణం నుండి కొల్లాపురానికి బయలుదేరారు. వారు గుర్రాల మీద వస్తున్నారు. ఆ గుర్రాలు ఎంత వేగంగా వస్తున్నాయంటే వాటి వేగానికి గుర్రపు కాలు రాపిడి వలన భూమి మీదనుండి లేచిన దుమ్ము ఎగిరి కైలాసం మీద, దేవలోకం మీద పడేంత వేగంగా వస్తున్నారు. గుర్రాలు ఎంత వేగంగా ప్రయాణించినా వాటి కాళ్లతో రేగిన దుమ్ము ఎగిరి కైలాసానికి దేవలోకానికి చేరడం అసాధ్యం. ఇక్కడ గుర్రాల వేగాన్ని అతిశయోక్తిలో వర్ణించడం జరిగింది.

"శివుడు జంగమ వేషం కట్టుకొని రూపులు పటమారి రుద్రనేత్రుడై, జన్మలు పటమారి జంగమ వేషం కట్టి, జలజల లింగాలు, చంద్రకావి వస్త్రాలు, భూతకుడుకల పేరు, పుంగనూలు జంధ్యమేసి ఏనుగుమోరంత జెగ్గు, కాగంత గంట, ఏదుము పట్టేది వెండిజోలె, పందుము పట్టేది పగడాల జోలె, ముద్దుము పట్టేది ముత్యాలజోలె, తొగ్రిమొగ్రి గంటలు తొంబైయారు వేలు, నాదున్న గంటలు నాలుగువేలు, నాదు లేని గంటలు నాలుగువేలు గనుక, ఎడమచంకన యవజింకపిల్ల, కుడిచంకన కురుసనంది, యమదండ భేరీలు, గంటలు, శంఖులు గణగణ మ్రోగంగ, వంకన ఒడిగంట, పిక్కన పిడిగంట, నడుమున నాగపిడిగంట, చాతిలో ప్రాణలింగం, కంఠమందున సర్పం, నొసట ఛత్రకన్ను, చెంపన చంద్రరేఖ, ఎద్దుమోత రుద్రాక్షలు, కొండంత కొప్పు గనుక... ఆ.. బొడ్డు మునుగ గడ్డము, మూరెడు మీసమేనా... అటువంటి వేషం కట్టుకొని శివుడు కైలాసం నుండి బావిగడ్డ మీదకు ఎట్లా చేర వస్తున్నాడు." **(చుక్క సత్తయ్య మల్లన్న కాపుల ఘట్టం)** అడవిలో కష్టాలు పడుతున్న ఆదిరెడ్డి నీలమ్మలకు సంతానం ప్రసాదించడానికి శివుడు శ్రీశైలమల్లన్న అంశ తీసుకొని వచ్చే సందర్భంలోని వర్ణనలో అతిశయోక్తి తో పాటు స్వభావోక్తి సమ్మిళితంగా కనిపిస్తుంది. జంగమవేషధారి ధరించే లింగాలు, గంటలు, జోలలు, జడల గురించి స్వభావోక్తిలో తెలుపుతూనే ఎద్దుమోత రుద్రాక్షలు, కొండంతకొప్పు, వేలకొలదిగంటలు అంటూ అతిశయోక్తిగా తెలియజేశాడు.

కథాసూత్రం ఆధారంగా, ఆశువుగా, సెలయేటి ప్రవాహ సదృశంగా గానం చేయబడే కతాగానంలో ప్రయత్న పూర్వక మైన అలంకార పోషణ ఉండదు. అయినప్పటికీ ఈ సన్నివేశంలో చాల సహజంగా రెండు అలంకారాలు కలిపి ప్రయోగించడం విశేషం.

"అడుగు తీసి అడుగు పెడితే రామా కోదండ రామ/ అద్దగజం భూమి కుంగె రామా కోదండ రామ" **(చుక్క సత్తయ్య ఎల్లమ్మ ఒగ్గుకథ)** పరశురాముని వీరత్వాన్ని ఉత్సాహాన్ని వర్ణిస్తూ సాగే కథాగానంలో అతిశయోక్తి కనిపిస్తుంది. ఎంతటి వీరుడు, బలవంతుడైనా నడిచినప్పుడు భూమి మీద పాదముద్రలు పడతాయే తప్ప భూమి కృంగిపోవడం అసాధ్యం. ఇక్కడ నాయకుడు మిక్కిలి బలవంతుడని చెప్పడం కోసం నడకలోని ఉత్సాహాన్ని అతిశయంగా వర్ణించడం జరిగింది.

"ముక్కులెంటికలు ముగుదాళ్ళు / సంకలెంటికలు శాతాళ్ళు" **(చుక్కసత్తయ్య ఎల్లమ్మ ఒగ్గుకథ)** ముక్కుతాడు/ముగుదాడు అంటే పొగరుకోడెను అదుపులో ఉంచడానికి ముక్కు ద్వారా తీసి కొమ్మమీదా కట్టే శాతాడు అనేది బావిలో నుండి నీరు చేదడానికి ఉపయోగించే తాడు. ఇవి రెండూ వ్యవసాయప్రధాన వస్తువులు. అడవిలో తపస్సు చేసుకుంటున్న జమదగ్నిని వర్ణిస్తూ అతని ముక్కులో వెంట్రుకలు ముగుదాళ్ళలాగా సంకలో వెంట్రుకలు శాతాల్లలాగా ఉన్నాయని వర్ణించారు. ముక్కులో, చంకలో పెరిగే వెంట్రుకలు ఎంత పొడవుగా ఉన్నప్పటికీ అవి తాళ్ళంత పరిమాణంలో ఉండవు కదా! ఇక్కడ తపస్సులో మునిగిన వ్యక్తి శరీర సంస్కారం చేసుకోకుండా పూర్తిగా ధ్యానంలో ఉన్నాడు, గడ్డాలు మీసాలు పెరిగి గుర్తుపట్టలేనంతగా మారిపోయాడు అని చెప్పడానికి ఈ అతిశయోక్తి వర్ణన కనిపిస్తుంది. ఒగ్గుకథగానంలో ఇలాంటి విషయ ప్రస్తావన జానపదేతరులైన నాగరికులకు కొంత అశ్లీలంగా కనిపించవచ్చు. కానీ ఇక్కడ భావాన్ని ప్రధానంగా తీసుకోవాలి తప్ప భాషను కాదు.

"ఏటి మీద ఎర్రజొన్న కోసి కుప్పలేసినట్లు / మోకాలిమంటి రక్తమేన మొలలమంటి పీన్గులేన రక్తంలో మునిగినాడు, రక్తంలో తేలినాడు" (చుక్కసత్తయ్య ఎల్లమ్మ ఒగ్గుకథ) పరశు రాముడు నాగలోకంలో రాక్షసులను సంహరించిన సందర్భంగా వివరించే ఈ వర్ణనలో జుగుప్స తో కూడిన అతిశయోక్తి కనిపిస్తుంది. యుద్ధంలో మరణించిన వారి శరీరభాగాలతో, రక్తంతో యుద్ధరంగం బీభత్సంగా ఉంటుంది. అయితే ఇక్కడ పరశురాముడు శత్రువులను సంహరించినప్పుడు కారిన రక్తం మోకాలి వరకు, మరణించిన వారి శరీరాలు నడుముల వరకు ఉన్నాయని పరశురాముడు రక్తంలో మునిగితేలాడని అతిశయంగా వర్ణించడం.

"దేవబొంగరం తీసుకువస్తున్న పరశురామునికి దారిలో పందుము వద్ద గుమ్మిదొడ్డు

ఉక్కుస్తంభానికి కట్టిన దేగను అదుపులోకి తెచ్చుకోవడానికి యాభైయారు రాజ్యాల రాజులు ప్రయత్నం చేస్తున్నారు. ముందు వచ్చిన రాజులు వంట చేసుకుని తిన్నప్పుడు పారేసిన చింతగింజలు మొలిచి పెరిగి పెద్దవై, పూత పూసి, కాతకాసి, పండువండి తరువాత వచ్చిన రాజులకు వంటలకు ఆదేరువవుతున్నాయి, కానీ ఆ దేగ పట్టుపడతలేదు" **(చుక్కసత్తయ్య – ఎల్లమ్మ ఒగ్గుకథ)** దేగ ఆయు ప్రమాణం పది సంవత్సరాలకు మించి ఉండదు. దేగను పట్టడానికి వచ్చిన రాజులు తిని పారేసిన చింతగింజలు మొలిచి కాత కాయడానికి పదేళ్లకు పైగా పడుతుంది. అంతకాలం దేగ బ్రతికి ఉండే అవకాశమే లేదు. దేగను పట్టుకోవడానికి రాజులు చాలా కాలం నుండి ప్రయత్నిస్తున్నారని చెప్పడానికి ఈ సందర్భాన్ని అతిశయోక్తిగా వర్ణించారు. అటువంటి దేగను పట్టడానికి వచ్చిన పరశురాముణ్ణి రాజులు ఎదిరించగా అతడు వారిని సంహరించి రక్తాన్ని గంగపాలు చేసి, రాజుల శవాలను దేగకు ఆహారంగా వేస్తాడు. లక్షా యాభై వేల సంవత్సరాలుగా ఆకలితో ఉన్న దేగ అరగంటలో రాజుల శవాలు తిని, ఆకలి తీరక పరశురాముని అనుమతితో దైవరాజులు ఏనుగులను తిని ఆకలి తీర్చుకుంటుంది. ఇక్కడ దేగ బతికి ఉన్న కాలాన్ని, అది మనుషులతో పాటు ఏనుగులను కూడా తినడం గురించి అతిశయోక్తిగా వర్ణించారు. పరశురాముని వీరత్వాన్ని దేగ బల సంపత్తిని తెలపడానికి అతిశయోక్తి అలంకారం ఉపయోగించారు.

"రారాజు మల్లయ్య గోలుతుంటే కారిన కన్నీరు కాలువలై పారుతుంది. ఒలికిన కన్నీరు వరదలై పారుతుంది. కురిసిన కన్నీరు కుంభదార వర్షం కొలుకుల కన్నీరు కొనగోట చిమ్మితే చిల్లి పోయి శివనందుల కోట మీద పడుతుంది" **(చుక్క సత్తయ్య బంగారుగొర్రె ఒగ్గుకథ)** లింగాల కురుమడిలో వ్యవసాయం చేస్తున్న మల్లయ్య నాగలికి పార్వతమ్మ ముక్కుపుడక తట్టుకొని నాగలి భూమిలో చిక్కుకుపోతుంది. నాగలిని బయటకు తీయలేక మల్లన్న ఏడుస్తున్న విషయాన్ని వర్ణిస్తూ మల్లయ్య ఏడ్చినప్పుడు కారిన కన్నీరు కాలువలాగా, వరదలాగా, వర్షంలాగా ఉందని వర్ణించడం అతిశయోక్తి. ఎందుకంటే ఎంత ఏడ్చినప్పటికీ కంటి నుండి వచ్చిన నీరు వర్షమై వరదలై ప్రవహించదు. అలాంటి కన్నీరును కొనగోట చిమ్మితే అది కైలాసానికి చేరేంత దూరం పడదు. మల్లయ్య మిక్కిలిగా దుఃఖిస్తున్నాడని చెప్పడానికి కన్నీటిని ప్రవాహంగా చెప్పినందున ఇది అతిశయోక్తి.

మల్లన్న కాపులఘట్టం ఒగ్గుకథలో మల్లన్నకు తన బిడ్డ పద్మావతి ఇచ్చి పెళ్లి చేయడం ఇష్టం లేని గోనెవరి మాసమ్మ అసాధ్యమైన కోరికలను కోరుతుంది. ఆ కోరికల నిండా అతిశయోక్తులే కనిపిస్తాయి. ఉదాహరణకు "నా బిడ్డ కాలికి మన్నంటకుండా, సూర్యుడు చంద్రుడు

చూడకుండా, దేవగిరి నుండి కొల్లాపురం వరకు తోవ్వలు తీసి వెండి కరిగించి పోసి, అటు ఇటు వెండి గుంజలు నాటి, బంగారు బెలుగులు పెట్టి వాటి మీద బంగారు రేకుల పందిరేసి తోవకు ఎడమపక్కన వెండి తొట్టెలు, కుడిపక్క బంగారు తోట్టెలు కట్టమనండి" అంటుంది. పెళ్లి సాంప్రదాయంలో వెండి బంగారం ఎంత పెట్టినా తోవలకు, పందిరికి కూడా అలాంటి విలువైన లోహాలు ఉపయోగించడం అనేది అసాధ్యం. ఇందులోనే ఆరెకరాల అన్నసత్రం, పూటకు పుట్టేడు వంట, పన్నెండుపుట్ల పచ్చిముత్యాల, పందుము గోధుమపిండి కుండీ చేసి ఎద్దుమోత పత్తి ఒకటే వత్తి చేసి దీపం వెలిగించడం వంటి వర్ణనలలో అడుగడుగునా అతిశయోక్తులు కనిపిస్తాయి. కొన్నిసార్లు శిష్టసాహిత్య కవులకు ఏ మాత్రం తీసిపోని విధంగా ఊహాతీతమైన వస్తు విశేషాలతో ఒగ్గుకథలో అతిశయోక్తి అలంకారం కనిపిస్తుంది. ఒగ్గుకథాగానంలో అనుసంధానవచనంలో కనిపించే "వరాల ముత్యాల వర్షం కురవడం", "బొక్కెన అంత బొంగరం", ఆగొండరాక్షసి వెంట్రుకకు వెయ్యి పీనుగులను కట్టితేవడం", "రాక్షసి నెత్తిలో జీడిగింజలంత పేన్లు ఉండటం", "నూరు మంచాల నులక ఒక దగ్గర కట్టి దూకినా అందనంత లోతు ఉండడం" వంటి అతిశయోక్తులు ఆనందాశ్చర్యాలను కలిగిస్తాయి.

**8. వక్రోక్తి : "రెండు జీవునాల మనిషి" (చుక్క సత్తయ్య ఒగ్గు కథ)** బీమలాది ఒడ్డున చంద్రగిన్నె పట్టణానికి పోయిన పద్మశాలీలు నాగులకొండ పట్నం వచ్చి నర భూపతిని కలుసుకుని రాజా నీ చెల్లెలు సూరమాదేవి రెండు మనిషి, నీవు వెంటనే చీర్రైకలు పండ్లు ఫలారాలు తీసుకుని వెళ్ళు అని చెప్తారు. కడుపుతో ఉంది అనే విషయాన్ని పదిమందిలో లేదా సభలో నేరుగా చెప్పకుండా ఆ అర్థాన్ని సూచించే నెల తప్పింది. గర్భవతి వంటి సభ్యోక్తుల ద్వారా చెప్పడం పరిపాటి. ఇక్కడ ఒగ్గు కథలో చెప్పిన రెండు జీవునాల మనిషి అనే పదప్రయోగం సభ్యోక్తిగా కనిపిస్తూనే కొద్దిగా ఆలోచిస్తే తప్ప అర్థ గోచరం కాదు. అర్థమైన తరువాత అవును గర్భవతిగా ఉన్న స్త్రీ నిజంగానే రెండు జీవునాలు (ప్రాణాలు) కలిగి ఉంటుంది కదా అనిపిస్తుంది. అది ఇక్కడ వక్రతా విశేషం అని గుర్తించాలి.

> **"ఈడు తోటి పోయి జోడు తోటిరారా / పాతబట్టల్ల పోయి పసుపు బట్టల్లరార**
> **కయ్యంల నీ కత్తి కలవడి ఇయ్యంల నీ కత్తి విడివడి రావాలి తమ్ముడా....**
> **తమ్ముడా బీరయ్య". (చుక్క సత్తయ్య బీరప్ప ఒగ్గు కథ)**

పెళ్ళి మీద ప్రేమ కలిగిన బీరప్పను అక్క మాంకాళి ఇంటి నుండి సాగనంపుతూ చెప్పిన ఈ మాటలలో ఎక్కడా కూడా తమ్ముడా నీవు పెళ్లి చేసుకుని తిరిగి రమ్మని, నేరుగా

చెప్పకుండా అదే విషయాన్ని ధ్వన్యంగా చెప్తుంది. ఈడు అంటే వయసు విశేషించి యుక్తవయస్సు అని అర్థం. ఈడొచ్చిన పిల్ల ఈడు ముదిరినంక వియ్యమెందుకు వంటి జాతీయాలు, సామెతలు జన వ్యవహారంలో ఉన్నాయి. జోడు అంటే జంట అని అర్థం. వివాహానికి తగిన వయసుతో వెళ్తున్న నీవు ఎలాంటి కష్టాలు లేకుండా శుభంగా పెళ్లి చేసుకుని భార్యతో జంటగా రమ్మని అర్థం.

ఎంతటి సుసంపన్నమైన ఆర్థిక పరిస్థితి ఉన్న వారైనా ప్రతిరోజు కొత్తబట్టలు ధరించలేరు. ప్రతిరోజు ధరించేవి పాత బట్టలే. పెళ్లినాడు ఎంత పేదవాడైన ఉన్నంతలో కొత్తవి ధరిస్తాడు. పేద ధనిక భేదం లేకుండా పెళ్లిలో పసుపును వాడడం. ఆ పసుపు ధరించిన వస్త్రాలకు అంటి అవి పసుపు వర్ణం శోభను కలిగి ఉంటాయి. పెళ్లిలో పసుపు బట్టలు తెలుగు వారి సంప్రదాయం. పాత బట్టల్ల పోయి పసుపు బట్టలు రమ్మనడం అంటే సాధారణ వస్త్రాలలో వెళుతున్న నీవు పెళ్లి చేసుకుని పసుపు బట్టలతో శుభంగా తిరిగి రమ్మని అర్థం.

కయ్యంల నీ కత్తి కలవడి రాని– వియ్యంల నీ కత్తి విడివడి రాని అనే వాక్యంలో కయ్యం అంటే గొడవ / యుద్ధం తిక్కనాదులు ప్రయోగించిన ఈ అచ్చతెలుగు పదం ఇంకా తెలంగాణ గ్రామ వ్యవహారంలో నిలిచి ఉంది. కత్తి కలెవడడం యుద్ధంలో జరిగే క్రియ. పెళ్లి కోసం వెళ్తున్న నీవు అవసరమైతే అక్కడ యుద్ధానికి సిద్ధపడుమని చెప్తూనే వెంటనే వియ్యంలో నీ కత్తి విడివడిరమ్మని చెప్పడం ద్వారా యుద్ధం ద్వారా వారిని పెళ్ళికి ఒప్పించిన తరువాత యుద్ధం చాలించి వియ్యం పొంది వివాహం చేసుకొమ్మని చెప్పడం. ఈ విధంగా అక్క మాంకాళి తన తమ్ముడు బీరయ్యను పెళ్లి చేసుకుని రమ్మని ఆశీర్వదించి సాగనంపుతూ చెప్పిన ఈ మాటల్లో ఎక్కడా కూడా నేరుగా విషయాన్ని చెప్పకుండా అదే విషయార్థాన్ని ధ్వన్యంగా చెప్పినందుకు ఇందులో వక్రోక్తి కనిపిస్తుంది.

పొద్దేడు కయ్యాలు లేకపోతే పొట్టల భోజనం అరగది
మా పేడు కయ్యాలు లేకపోతే మారు భోజనం అరగది
ఎక్కడేమి లేనివాడు ఎనుగు మీద బట్టనాదని ఏడు దినాలు కయ్యం పెట్టుకుంటాడు.

(చుక్క సత్తయ్య బీరప్ప కథ)

కయ్యం అంటే యుద్ధం అనే అర్థంతో పాటు గొడవ, జగడం అనే అర్థాలు ఉన్నాయి. కొందరికి నిరంతరం ఎవరో ఒకరితో గొడవ పడడమే అలవాటుగా ఉంటుంది. అర్థంచేసుకోలేని తత్వమో నా పంతం నెగ్గాలనే ఆలోచన ఇత్యాది కారణాల వలన వారు నిరంతరం సమాజంలో ఎక్కడో ఒక చోట గొడవ పడుతూనే ఉంటారు. క్రమంగా వారికి అది అలవాటుగా మారి గొడవ పడకపోతే ఏమి తోచని స్థితి కూడా వస్తుంది. నాగుల కొండ నరభూపతి అలాంటివాడే.

ఎల్లప్పుడు ఇరుగుపొరుగుతో చిన్న చిన్న విషయాలకు కూడా గొడవపడే తత్వం గలవాడు. అటువంటి నరభూపతి కూతురును వివాహం చేసుకోవడానికి బీరప్ప అక్క మాంకాళి అనుమతి అడగుతాడు. అప్పుడు అక్క మాంకాళి నరభూపతి మనస్తత్వం, వ్యక్తిత్వం గురించి బీరప్పకు తెలియజేస్తూ ఈ మాటలు అంటుంది.

ఎంతటి కలహ ప్రియుడైన రోజు పొద్దుమాపు గొడవ పడడు. కానీ ఇక్కడ పొద్దుమాపు ఏడేడు గొడవలు పడితేగాని తిన్న తిండి అరగనివాడు. అని  కాస్త అతిశయోక్తిగా చెప్పినప్పటికీ చివర పాదంలో "ఏ కయ్యం లేనివాడు ఎనుగు మీద బట్ట నాదేనని ఏడు రోజులు కయ్యం పెట్టుకుంటాడని కావలసి గొడవపడే వ్యక్తిత్వం గల నరభూపతి మనస్తత్వాన్ని ధ్వన్యంగా చెప్పినందుకు ఇందులో వక్రోక్తి కనిపిస్తుంది.

**9. అర్థాంతరన్యాసాలంకారం:** లోకంలో సహజంగా జరిగే పరిణామాల ఆధారంగా సాధారణీకరించడిన అంశాలు సామెతల రూపంలో వ్యవహారంలో ఉంటాయి. అలాంటి సహజ సాధారణ పరిమాణానికి దగ్గరగా ఒక సంఘటన జరిగినప్పుడు ఆ ప్రత్యేక సందర్భంలో జరిగిన విశేష సంఘటనను సాధరణీకరించబడిన వాక్యంతో సమర్థించడం గాని, సాధారణ వాక్యమును విశేష సంఘటన ద్వారా సమర్థించి ఆ భావాన్ని బలపరచడం గాని చేయడాన్ని అర్థాంతరన్యాసాలంకారం అంటారు. సాధారణ వాక్యం విశేషణ వాక్యం పరస్పరం సమర్ధించడం అర్థాంతరన్యాసము. "మొలకై మొలిచినప్పుడే గోట చిమ్మితె పోతది. మానైతే గొడ్డలి గావాలి" **(చుక్క సత్తయ్య బీరప్ప ఒగ్గు కథ)**

నాగులకొండ నరభూపతి రాజు అడవిలో ఆగం చేసినప్పటికి తన చెల్లెలు జీవించి పట్నం నిర్మించుకుని గర్భవతిగా ఉంది అనే విషయాన్ని తెలుసుకుంటాడు. సూరమ్మ గర్భాన జన్మించే పుత్రుడు నరభూపతి నీ గండాన పుట్టి నిన్ను చంపి నీ రాజ్యాన్ని ఆక్రమిస్తాడని బ్రాహ్మణులు నరభూపతి తెలియజేస్తారు. అప్పుడు నరభూపతి, నా గండాన పుట్టబోయే ఈ పిల్లవాన్ని తల్లి కడుపునున్నప్పుడే అంతం చేయాలె, పుట్టి పెరిగి పెద్దవాడైతే వాన్ని చంపడం కష్టం. మొలకై మొలిచినపుడు గోట చిమ్మితే పోతది మానైతి గొడ్డలి కావాలి అనుకుంటాడు.

ప్రారంభంలో సులువుగా పరిష్కారమయ్యే ఏదైనా అంశం కాలం గడిచిన కొద్ది జటిలం అవుతుంది. మొలకగా ఉన్నప్పుడు దానికి బలం ఉండదు. కావున గోటితె చిమ్మినా కూడా అది విరిగిపోతుంది. కానీ అదే మొలక పెరిగి పెద్దదై వృక్షంగా మారిన తరువాత దాన్ని పడగొట్టడానికి గోరు సరిపోదు. ఈ భావాన్ని సులువుగా పరిష్కారమయ్యే విషయాన్ని సులువుగా

పరిష్కరించుకోవాలి కానీ జటిలం చేసుకోకూడదు అనే అర్థంలో మొలకై మొలిచినప్పుడే గోట చిమ్మాలె మానైతె గొడ్డలి కావలె అని సాధారణీకరించడం జరిగింది. బీరప్ప ఒగ్గు కథాగానంలో నరభూపతి తనకు సమస్యగా పరిణమించినబోయే శత్రువుగా జన్మించే చెల్లెలి కొడుకును పిండం రూపంలో ఉన్నప్పుడే చంపడం సులువు కాబట్టి ఇప్పుడే చంపాలి లేదంటే వాడు పుట్టి పెరిగి పెద్దవాడై శక్తిని పుంజుకున్న తరువాత చంపడం కష్టం అని నరభూపతి భావించడం ఇక్కడ విశేషవాక్యం. ఇలా విశేష వాక్యాన్ని లోకంలో వ్యవహారంలో ఉన్న సాధారణ వాక్యంతో సమర్థించినందుకు ఇది అర్థాంతరన్యాసాలంకారం.

**"తొర్రయిన మొర్రయిన తన కడుపు పండాలె / తర్రయిన బుర్రయిన తన పంట పండాలెఅక్క పిల్ల అక్కరకు రారు / చెల్లె పిల్ల చేతికి రారు / పరాయి పిల్లల మీద భ్రమలు చేటు (చుక్క సత్తయ్య బీరప్ప ఒగ్గు కథ)**

ద్విత్వరేవ ఆవృతంగా అనుప్రాసాలంకారంతో ఉన్న ఈ వాక్యాలలో అర్థాంతర న్యాసాలంకారం కనిపిస్తుంది. తొర్రి అంటే దంతాలు లేకపోవడం. మొర్రి అంటే పెదవి చీరుకుపోయినట్లుండే ఒక శారీరక లోపం. ఇలాంటి లోపాల వల్ల పిల్లలు నిరాదారణకు గురవుతారు. అది వారిని కన్న తల్లిదండ్రులకు కూడా బాధను కలిగిస్తుంది. అయినప్పటికి పెంపకానికి తెచ్చుకున్న పరాయి పిల్లలకటే లోపాలు ఉన్నప్పటికి కడుపున పుట్టిన సంతానం ఉండడమే శ్రేష్ఠమైన భావన ఇందులో వ్యక్తమవుతుంది. తర్ర, బుర్ర అంటే ధాన్యం కొంత లేదా పూర్తిగా పొల్లుపోవడం. పిల్లల్లో తొర్రి, మొర్రి లోపాల లాగా ధాన్యంలో తర్ర, బుర్ర లోపాలు ఉంటాయి. ఇతరులు భిక్షంగా పెట్టిన ధాన్యం కన్నా తన కష్టంతో పండించిన పంట అది తర్రయినప్పటికి, సారంలేని పొల్లు ధాన్యం అయినప్పటికి సంతృప్తి ఉంటుంది. ఇతరులిచ్చిన దానికన్నా తనకు కలిగి ఉండడమనే భావాన్ని బింబ ప్రతిబింబ భావనతో దృష్టాంతంగా చెప్పిన వాక్యం సాధారణ వాక్యం.

పన్నెండేండ్ల పసి బాలునిగా ఉన్న బీరయ్యను చేరదీసిన అక్క మాంకాళి తన సవలక్ష మందను, రాజ్యాన్ని వదిలిపెట్టి బీరయ్యను పెంచి పెద్ద చేయగా, బీరయ్య అక్క మాంకాళి లేకుండానే కామరతిని కళ్యాణం చేసుకున్నాడనే విషయం బోయడు భోగన్న ద్వారా విన్న అక్క మాంకాళి ఎంతో ఆవేదన చెందుతుంది. బీరయ్య పెంచిన సంతానం కాబట్టి నన్ను కాదని కళ్యాణం చేసుకున్నాడు. అదే నా కడుపున పుట్టిన కొడుకే అయితే నేను లేకుండా పెళ్లి చేసుకునేవాడా? అని ఆలోచిస్తుంది ఆ సందర్భంలో... "అక్క పిల్లలు అక్కరకు రారు, చెల్లె పిల్లలు చేతికి రారు, పరాయి పిల్లల మీద భ్రమలు చేటు అని భావిస్తుంది. అక్క మాంకాళి తన

చేతులు పెరిగిన బీరయ్య తనను పట్టించుకోకుండా పెళ్లి చేసుకున్నాడని వేదన చెంది పరాయి పిల్లల మీద ప్రేమలు వ్యర్థం. ఎన్ని లోపాలు ఉన్నప్పటికి సొంత పిల్లలు ఉండాలి అని భావించడం విశేష వాక్యం కాగా తొర్రయిన మొర్రయిన తన కడుపు పండాలె, తర్రయిన బుర్రయిన తన పంట పండాలె అనే దృష్టాంతం సాధారణ వాక్యం, బీరప్ప కథలోని ఈ విశేష సందర్భాన్ని సాధారణ వాక్యంతో సమర్థించినందున ఇది అర్థాంతరన్యాసాలంకారం.

ఈ విధంగా ఒగ్గుకథలో కన్పించే అలంకారాలోని పోలికలన్నీ సహజ సుందరాలై నిత్యగోచరాలై కనిపిస్తాయి. అందువలన కథాంశానికి సహకరించి ఈ అలంకారాలు ప్రేక్షకునికి సులభగ్రాహ్యమవుతాయి. ఒగ్గుకథాగానంలో అర్థస్ఫూర్తి శబ్దమాధుర్యం పెనవేసుకుని సాగుతుంది. అందుకే కథాగానంలో కనిపించే అర్థాలంకారాలలో కూడా సహజమైన యతిప్రాసలు తద్వారా నాదమాధుర్యంతో కూడిన అలంకారిక ప్రయోగం మనస్సును ఆహ్లాదపరుస్తుంది.

లోకంలో నవులు అంటే స్త్రీలు, పురుషులు తమ సౌందర్యాన్ని పెంపొందించుకోవడానికి వెండి,బంగారు నగలను అలంకరించు కోవడం చూస్తున్నాం. అందంగా వుండే వ్యక్తులు అలంకరించుకోవడం వల్ల ఆభరణాలకే వన్నె వస్తుందని విశ్వాసం.ఈ వన్నె ఎందుకు రావాలి అని ప్రశ్న వేసుకుంటే,చూపరులను ఆకర్షించడానికి అనే సమాధానం వస్తుంది.సరిగ్గా ఇదే పద్ధతిలో కవులు తమ కావ్యాల్లో అర్థాలంకారాలను,శబ్దాలంకారాలను ప్రయోగించి పాఠకులను ఆకర్షించి, వారికి కావ్యానందాన్ని సమకూర్చడానికి ప్రయత్నిస్తారు.అయితే అక్షర జ్ఞానం లేని,శాస్త్రీయ జ్ఞానం ఏ మాత్రం లేని జానపదులు కూడా తమ గేయాల్లో, కథా గానాల్లో అలంకారాలను ప్రయోగించడం విశేషం. ఇక అలంకారమంటే ఏమిటి? అని ప్రశ్న వేసుకుని ప్రఖ్యాత లక్షణ కారుడైన 'వామనుడు', తన 'కావ్యాలంకార సూత్రవృత్తి' లో "సౌందర్య మలంకార" అని నిర్వచనం చెప్పాడు.కావ్యానికి దేని వలన సౌందర్యం కలిగి దాని అందం అతిశయిస్తుందే అదే అలంకారమని అతని అభిప్రాయం.ఇదే విషయాన్ని 'దండి' అనే లాక్షణికుడు తన కావ్యా దర్శంలో "కావ్య శోభాకరన్ ధర్మా నలంకారాన్ ప్రచక్షతే" అని చెప్పాడు. కావ్యానికి శోభను కలిగించే ధర్మాలను అలంకారాలంటారు. అని ఇతని అభిప్రాయం.

### 4.7. అన్యదేశ్యాలు

తెలంగాణాలో ముస్లింలు ఎక్కువగా ఉండడం వల్ల వారి సాన్నిహిత్యంలో వుండేవారు అనేక ఉర్దూ పదాలు తమ భాషలో వాడుతారు. తెలంగాణాను నిజాం రాజులు పరిపాలించడం వల్ల కూడా వారి భాషా ప్రభావం ప్రజలపై తప్పకుండా పడినట్లు తోస్తుంది.

తెలుగు భాషలో ఉర్దూ పదాలు కలిసి పోయాయి.

డా॥ఆర్వీయస్. సుందరం గారు సజీవ భాష ఎప్పటికప్పుడు కొత్తమాటల్ని చేర్చుకుంటూనే ఉంటుంది అని అన్నారు. **అన్య**దేశ్యాలు మన భాషలో చేరడం వల్ల భాష పెరగటానికి కూడా అవకాశముంటుంది.

జానపదుల భాషలో సంస్కృత,ప్రాకృత భాషలతో పాటు ఇతర భాషా పదాలు కూడా అసంఖ్యాకంగా వచ్చి చేరాయి. మహమ్మదీయులు మన దేశాన్ని పరిపాలించినపుడు వారి భాషా ప్రభావం,ఆగ్లేయుల ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆంగ్ల భాషా ప్రభావం తెలుగు భాషపై చూపింది.ఆయా ప్రాంతాల భాషా పదాలు చేరడంతో ఒక్కొక్క ప్రాంతానికి భాషా బేధం ఉంటుంది.

ప్రాచీన కావ్యాల్లో, గ్రంథాల్లో కూడా కొన్ని అన్య దేశ్యాలు ఉండటం గమనించవచ్చు. మసీదు, దుకాణము, సెబాసు, హజారము, లూటి, సాబ్రాణి, పటాలము, గోదాము, తువ్వాలు మొదలైన పదాలెన్నో పూర్వకాలం నుండి వాడబడుతున్నాయి. అన్య దేశ్యాలు జానపదుల భాషలో కూడా అసంఖ్యాకంగా చోటు చేసుకున్నాయి.

**4.7.1. ఉర్దూ పదాలు**

| | | | | |
|---|---|---|---|---|
| కచ్చీరు | – | కచేరీ | – | కొలువు |
| సర్కారు | – | సర్కార్ | – | ప్రభుత్వం |
| ఫర్వాలేదు | – | ఫర్వా | – | లక్ష్యం లేదు |
| జంగల్ | – | జంగల్ | – | అడవి |
| జోరు | – | జోర్ | – | వేగం |
| గమ్మత్తు | – | గమ్మత్ | – | చమత్కారం |
| జరు | – | జర | – | కొద్దిగా |
| బీమారి | – | బీమార్ | – | వ్యాధి |
| తల్వారు | – | తల్వార్ | – | కత్తి |
| కమీజు | – | కమీజ్ | – | చొక్కా |
| జగుడం | – | జగడ్ | – | పొట్లాట |
| షరీక్ | – | షరీక్ | – | చేరడం |
| మాలు | – | మాల్ | – | సరుకు |
| బదునాం | – | బద్‌నాం | – | అపనింద |

| | | | | |
|---|---|---|---|---|
| నిషాని | – | నిషాన్ | – | గుర్తు |
| యాది | – | యాద్ | – | జ్ఞాపకం |
| ఖాళీ | – | ఖాలీ | – | ఉత్తది |
| దర్వాజ | – | దర్వాజ | – | ద్వారం |
| దస్త | – | దస్తి | – | చేతి గుడ్డ |
| పరారయి | – | పరార్ | – | పారిపోవడం |
| జాగ | – | జగా | – | స్థలం |
| మతులావు | – | మతలచ్ | – | సంగతి |
| గల్లీ | – | గల్లీ | – | చిన్న వీధి |
| బర్కత్ | – | బర్కత్ | – | లాభం |
| ఏక్ దమ్మున | – | ఏక్ దమ్ | – | హఠాత్తుగా |
| జమాన్లు | – | జవాన్ | – | భటులు |
| గోడా | – | గోడా | – | గుఱ్ఱం |
| ముదర | – | ముదరా | – | లాభం |
| రికాబు | – | రికాబ్ | – | పెద్దగిన్నె |
| బారాగంట | – | బారా | – | పన్నెండు |
| రోజు | – | రోజ్ | – | దినము |
| నదురు | – | నజర్ | – | |
| సందుక | – | సందూక్ | – | పెట్టె |
| సన్నాయి | – | షెహనాయి | – | |

నోము చివరి రోజున హిమాలంగిదేవి ఆ నోముపూర్తి అయితే షావుకారిని చేరుకోవాలని గ్రహించి అలా అయితే తనను అంగ భంగం కలుగుతుందని భయపడి తన భర్తకు తప్ప ఎవరు తెరవలేని డక్కన్ ఉన్న బంగారు సందుకలో కూర్చొని మూతవేసుకున్నది. ఇక్కడ డక్కన్ అనే ఉర్దూపదా ప్రయోగాన్ని మనం చూడవచ్చు.

### 4.7.2. ఆంగ్ల పదాలు

| | | | | |
|---|---|---|---|---|
| ఫోటువ | – | ఫోటో | | |
| సంటర్ల | – | సెంటర్ | – | మధ్యలో |
| టైము | – | టైమ్ | – | సమయము |

| | | | | |
|---|---|---|---|---|
| మిషిను | – | మిషన్ | – | యంత్రం |
| ఇస్కూల్ | – | స్కూల్ | – | పాఠశాల |
| సపోటు | – | సపోర్ట్ | – | ఆధారం |
| లైసెన్సు | – | లైసెన్స్ | – | పట్టా |
| రైఫిల్లు | – | రైఫిల్స్ | – | తుపాకులు |
| డబల్ | – | డబుల్ | – | రెండింతలు |
| పయింటు | – | ప్యాంటు | – | లాగు |

కథ ఘట్టంలో షావుకారి బిల్డింగులు క్వింటాల కొద్దీ బంగారం అనే పదప్రయోగాలలో బిల్డింగ్, క్వింటాల్ అని ఆంగ్లపదాలు కనిపిస్తున్నాయి. పైన చెప్పిన కారణంగానే కథాకారుడు అసంకల్పితంగా ఆంగ్ల పదాలను ప్రయోగించడాన్ని మనం గ్రహించవచ్చు.

## 4.8. వారాను వర్తనాలు

ఒగ్గు కథా సాహిత్యంలో ముఖ్యంగా గమనించాల్సిన అంశాల్లో వారాను వర్తనాలు ప్రధానమైనవి. ఒగ్గు కథలో ఇటువంటి వారాను వర్తనాలు చాలా వున్నాయి. “ఒకే విధమైన పదబంధాలు, అలంకారాలు,వర్ణనలు, పేర్లు పునరుక్తాలవడాన్నే ‘వారాను వర్తనాలు’ అంటారు”. ఈ వారాను వర్తనాలు కథా ప్రణాళికా రూపంలో,వర్ణనల రూపంలో, అలంకారాల రూపంలోను ఉంటాయి. వీటిలో చాలా వరకు మూలాంశాలే చోటు చేసుకుంటాయి.

మనుష్యుల పేర్లు –

| | |
|---|---|
| నీలమ్మ దేవి | ఆది రెడ్డి |
| మల్లన్న | వన్నమ్మ |
| మోటాల్ రెడ్డి | సంగన్న |
| డాబులన్న | బయ్యన్న |
| బవురాంబ | రత్నాంగి |
| మ్యాడల దేవి | కేతమ్మ |
| భట్టు కేతమరాజు | సూరమ్మ |
| నర భూపతి | మహంకాళి |

| | |
|---|---|
| రేణుకా ఎల్లమ్మ | కామరతి |
| జోగన్న | |

పట్టణాల పేర్లు –

| | |
|---|---|
| కొల్లాపూరి | నాగుల కొండ |
| దేవగిరి పట్టణం | కళ్యాన పట్టణం |
| దుందుమాల కోట | కంచుభేరి పట్టణం |
| రంగు దేవి పట్టణం | మాహూరు పట్టణం |

స్థలాల పేర్లు –

| | |
|---|---|
| కాసిం బావి తోట | అక్కమ్మ కొండలు |
| ఎర్రపోతు వాగు | నల్లపోతు వాగు |
| కార్నాల పుట్ట | |

జంతువుల పేర్లు –

| | |
|---|---|
| రెక్కలగుఱ్ఱం | కర్రావు |
| పల్లావు | పుల్ల గుఱ్ఱం |
| కర్రెల్యాగ | సవలచ్చ గొర్ల మంద |
| గంటల ఎలనంది | నిలుబోత గుఱ్ఱం |

అలంకారాలు –

చిలుక వంటి మొకం చిన్న బుచ్చుకున్నప్పుడు.

వన్నెల బంగారి బొమ్మ.

బారెడు గడ్డాలు మూరెడు మీసాలు.

అంస వంటి మొసం అల్లాడిపోయింది.

మిగుల పూసిన మల్లె పువ్వోలె.

ప్రయాణాలు –

ఆ మడిమ తన్ను దన్నె తోడ దెబ్బ కొట్టెనా...........

గిరిగింజగిరి మల్లెలో గిరిగింజమల్లెలో

సాధు జంగమయ్యబయలెల్లినాడే...........

అల్లో నేరేడల్లో అల్లో నేరేడల్లో

తల్లి నీలమ్మ బైలెల్లుతుండె...........

నాగ మల్లె దారిలో నాగమల్లె దారిలో అయ్యకూడ

జంగమయ్య బైలెల్లుతున్నడే..........

భూములు –

కుంకుమ రాగళ్లు

నంది కిట్ట రాళ్ళు

చంద్రపురి రాగళ్లు

బావులు –

కలికి చెంగోలె బావి

సోబనాల బావి

చెట్లు –

కాంచాల మట్టి

కోలల మట్టి

నవ్వులు –

పక పక నవ్వింది – పక్కన నవ్వింది

దుఃఖం –

కలకలకన్నీరు వలపోసి

కొట్టుకుంట మొత్తుకుంట

ముఖాన కొంగడ్డం పెట్టకుని

బండ్లు –

ఒంటి నాగ బండి

కర్రెడ్ల కచ్చురం

పందిరి –

పన్నెండు గుంజల పాల పందిరి. ఇవిగాక ఇంకా ఎన్నో వారాను వర్తనాలు ఒగ్గు కథ సాహిత్యంలో చోటు చేసుకుని ఉన్నాయి.

### 4.9. యతి ప్రాసల లయాత్మకత

జానపదగేయ సాహిత్యమంతా సహజ లయాత్మకతను కల్గి ఉంటుంది. ఆశువుగా ఆవిర్భవించి ఒకరి నోటి నుండి మరొకరికి, ఒకతరం నుండి తర్వాత తరానికి మౌఖికంగా అందించబడే జానపద సాహిత్యంలో ప్రధానంగా గేయ సాహిత్యం జానపద సమూహాలలో

మౌఖికంగానైనా స్థిరత్వం పొందడానికి కారణం సహజ లయాత్మకత, జానపద గేయసాహిత్యమంతా లాక్షణికుల కావ్య ఛందస్సులో కాకుండా మాత్రా ఛందస్సులో వివిద గతి భేదాలతో గానయోగ్యంగా ఉంటుంది. జానపద గేయ వినసొంపుగా ఉండానికి కారణం లయబద్ధమైన మాత్రాగతి ఛందస్సుతో పాటు సహజమైన యతి ప్రాసలు జానపదానికి చక్కని ఊనికను, తూగును అందిస్తాయి. ఈ రెండు లక్షణాలు కథాగేయాన్ని వీనులవిందుగా గానం చేయడానికి ఉపకరించడంతో పాటు శ్రోతల మనస్సులో చిరస్థానం పొంది జానపద గేయానికి మౌఖిక స్థిరత్వాన్ని కల్గించి, తద్వారా తర్వాతి తరానికి అందించడానికి ఉపయోగపడతాయి.

శిష్టసాహిత్యపు పద్య నియమాలను పరిశీలించినప్పుడు పద్యపాదంలోని మొదటి అక్షరాన్ని యతి అని, రెండవ అక్షరాన్ని ప్రాస అని అంటారు. పద్యంలోని అన్ని పాదాలలో రెండవ అక్షరం, ఒకే వర్ణం ఉన్నప్పుడు ప్రాస నియమం పాటించబడిందని అంటారు. ఇవి శిష్ట సాహిత్యం పద్య కవితా లక్షణాలు. ఈ లక్షణాల ఆధారంగా జానపద సాహిత్యాన్ని పూర్తిగా విశ్లేషించడం కష్టం కానీ ఇందులో చెప్పిన యతి ప్రాసలకు సమానమైన లక్షణాలు ఒగ్గు కథాగానంలో కనిపిస్తాయి. పద్య సాహిత్యానికి యతి ప్రాసలు లయాత్మకతను కల్పించినట్లు ఒగ్గు కథాగానంలో సహజ యతిప్రాసలు లయబద్ధంగా కథాగానం చేయడానికి ఉపకరిస్తాయి. "పాలివాన్ని తిట్టినా పాసంగం తప్పద్దు" అనేది ఒక సామెత 'పాసంగం' అంటే తక్కెడలో రెండు పళ్లాలు సమానంగా లేనప్పుడు వాటిని సమానం చేయడానికి ఒకవైపు కట్టే బరువును పాసంగం అంటారు. పదాలలో వాక్యాన్ని రెండు భాగాలుగా చేసినప్పుడు సమాన మాత్రలుగా విభజించబడి ఉండేందుకు యతిప్రాసలు దోహద పడుతాయి. అయితే శిష్ట సాహిత్య పద్య రచనలో ఈ యతిమైత్రి కూర్పు కొంత ప్రయత్నంతో ఏర్పడగా, ఒగ్గుకథాగానంలో ఈ యతిమైత్రి కూర్పు చాలా సహజంగా పాద విరుపులో గాని, పద విరుపులో గాని కనిపిస్తుంది. ఈ లక్షణం వల్లనే జానపద కళారూపమైన ఒగ్గుకథకు గానయోగ్యత ఏర్పడింది.

మాత్రాగతి ఛందస్సులో సాగే ఒగ్గుకథా గానంలో సహజమైన పదవిరుపులో యతిమైత్రి కలిగి ఉండి కథాగానం వీనుల విందుగా ఉంటుంది. సాహిత్యానికి నాదమాధుర్యాన్ని కల్గించే మరో అంశం ప్రాస. ఇది శబ్ద సంబంధమైనది. ఒక అక్షరం లేదా దాని మిత్రాక్షరం, పునరావృతమవుతూ పండిత పామరులను రంజింపచేసే శబ్దాలంకారాలైన అనుప్రాస, వృత్యానుప్రాస, ఒగ్గుకథాగానంలో విశేషంగా వినిపిస్తుంది. ఒగ్గు కథాగానంలో వివిధ దర్వులలో లయాత్మకంగా చేసే గేయమైనా కథను వ్యాఖ్యానిస్తూ సాగే అనుసంధాన వచనమైనా అది

పూర్తిగా ప్రాసాత్మకంగా సాగుతుంది. కథాగానంలో ఏ పాదాన్ని గమనించినా అనుప్రాసస, అంత్యప్రాస, ప్రాసయుత పద విభాగాలలో ఏదో ఒక లక్షణం కనబడుతుంది.

### 4.9.1.పదవిరుపులో యతిమైత్రి

జానపదగేయ సాహిత్యమంతా లయప్రధానమై ఉంటుంది. అందుకు ప్రధాన కారణం పలుకుమేరకు తగిన పదవిరుపు కలిగి ఉండడమే. మొదటి అక్షరానికి పదవిరుపు మిత్రాక్షరం ఉన్నప్పుడు అది మరింత గానయోగ్యంగా మారుతుంది. సహజమై మాండలిక భాషలో వివిధ తాళ గతులలో గానం చేయబడే ఒగ్గుకథలో ఇలాంటి పదవిరుపులో సహజ యతి ఉండడం వలన ఒగ్గుకథాగానం శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంటుంది.

"ఇచ్చినోడు కొంటవోంగ ఇడిపించే దాతలెవరు" మూడు మాత్రల పదవిరుపులలో త్రిస్రగతిలో ఉన్న ఈ పాదంలో ఇచ్చినోడులోని 'ఇ' విడిపించే పదంలోని పదాది హల్లు లోపించి మాండలిక వ్యవహారంలో ఇడిపించే అని శబ్ధ పరిణామం పొందిన పదంలోని 'ఇ' అనే అక్షరాల మధ్య యతి మైత్రి ఉంది. ఇందులో నాలుగు పదాలు ఉండగా కథాగానం చేసేటప్పుడు ఎక్కడైతే పదవిరుపు ఉందో అక్కడే యతిమైత్రి పాటించబడింది.

"ఉన్న దాని కంటె ఊడి పోతె మేలు" / "కుప్ప వాడు ఎవడు కూలి వాడు ఎవడు" / "నిప్పు లేని మంద నిలువ దోష ముంది" త్రిస్రగతిలో సాగే ఈ పాదాలన్నింటిలో పదవిరుపు స్థానంలో యతిమైత్రి కనిపిస్తుంది.

"డొక్కల కార్యం డొల్లాడవట్టె" చతురస్రగతిలో ఉన్న ఈ పాదంలో ఎనిమిది మాత్రల తరువాత పదవిరుపు స్థానంలో డొ డొల మధ్య యతిమైత్రితో పాటు వాటి పక్కనే రెండు చోట్ల ద్విత్వాక్షరాలను కలిగి ఉండటం వల్ల ఇది కథాగానానికి మరింత అనుకూలంగా ఉంటుంది. ఒగ్గుకథాగానంలో ఎక్కువగా కనిపించేది ఐదు మాత్రలతో సాగే ఖండగతి. ఇది గానయోగ్యమైన మాత్రా గతిభేదం.

"లేచిండు మల్లయ్య లేగటావూరీతి" / "నీసువాడల నీకునిద్రెట్ల వట్టింది"

"కూరాట్ల చెయ్యివెట్టి కుదురాడుబిడ్డ" / "నేలగీతలు గీస్తు నెమలోలె వడికింది"

"మక్కిమక్కని పండ్లు మాట సక్కదనం" పైన తెలిపిన పాదాలన్నీ ఖండగతి (ఐదు మాత్రలకు విరుగుతూ)లో గానం చేయబడే ఒగ్గుకథా దరువులు. వీటిలో ప్రతిపాదంలో పదవిరుపు స్థానంలో యతిమైత్రి పాటించబడింది. ఒగ్గుకథాగానంలో మిశ్రగతిలో సాగే పాదాలు తక్కువే అయినప్పటికీ కొంచెం తేడాతో మిశ్రగతికి దగ్గరగా ఉండే "ఆకలిగొన్న కడుపులు ఆరిపోయిన

మొకాలు" వంటి పాదాలలో సగభాగం మిశ్రగతిలో ఉండి మరో సగభాగం ఇతర మాత్రా ఛందంలో కనిపించినప్పటికీ ఇక్కడ కూడా పదవిరుపు స్థానంలోనే యతిమైత్రి పాటించబడింది.

ఒగ్గు కథాగానం చేసేటప్పుడు వివిధ మాత్రాగతుల్లో పదవిరుపుల్లో కనిపించే సహజ యతిమైత్రి కథాగానం మధ్యలో అనుసంధానంగా చెప్పే వచనంలో కూడా కనిపిస్తుంది. 'పొత్తుల తిని పోరాటం చేసినట్టు' / 'నలుగురు దూతలు నల్లరసం గుండ్లు' / 'వరాల మత్యాల వర్షం గురిసినట్లు' / 'పొదగుంటి తేనెలు పోత మామిడి పండ్లు' / 'పందికొక్కయి నేను పట్టుకుని వస్తాను' / 'మొగులు మీద మోపులుకట్టి' / 'సంగన్న మల్లన్న సరిదంటకాల్లు' / 'పటేల్ మల్లయ్య ప్రధాని సంగయ్య' వంటి కథాగత వచనంలో కూడా పదవిరుపు స్థానంలో సహజమైన యతి కనిపిస్తుంది.

ఈ విధంగా దేశీయ గతి భేదాలతో, మాండలికభాషలో కథాసూత్రం ఆధారంగా ఆశువుగా చెప్పే ఒగ్గు కథాగానంలో పదవిరుపు స్థానంలో వచ్చే సహజమైన యతిప్రాసలు శ్రోతలను ఆకట్టుకుని అలరించడంతో పాటు కథకుల మనసులో స్థిరపడిపోయి ఆశుకథాగానానికి ఆధారభూతంగా నిలుస్తాయి.

### 4.9.2. ప్రాసయతి

పాదం మొదటి అక్షరానికి మధ్యలో మైత్రి అక్షరం కలిగి ఉండడం యతి మైత్రి కాగా పాదంలో రెండవ అక్షరానికి యతిమైత్రి స్థానం తర్వాతి అక్షరానికి మైత్రి కలిగి ఉండటం ప్రాసయతి. జానపద సాహిత్యంలో ప్రాసయతి విరివిగా కనిపిస్తుంది. జానపద గీతాలకు దగ్గరగా ఉండే ఆటవెలది, తేటగీతి, సీసం, ద్విపద వంటి ఛందస్సులలో యీ ప్రాసయతి లక్షణం కనిపిస్తుంది. ఒగ్గు కథాగానంలో గణవిరుపులో కాకుండా ప్రాసయతి సైతం పదవిరుపులోని కనిపించి కథాగానానికి అనుకూలంగా ఉంటుంది.

"కోడి గూసె పీడ వాసె" / "పట్టుబట్ట చీర చుట్ట బట్ట జేసి" / "పత్రపేరు పరంజ్యోతి చిత్రపేరు శివాలగద్దె" / "దొండకాయ లోలె కండలెగురుతుంటె" / "అరటి గొడ్డురాలు పురిటిగొడ్డురాలు" / "కోపం తాపం పాపమెరుగదని" / "కయ్యాలు గోసేటి వయ్యారి గంగా"

"మొగోళ్ళు ర్యాగళ్ళ నాగళ్ళు దున్నంగ" / "బాటకు బత్యాలిచ్చి పూటకు సద్దులు గట్టి"

"ఎంగిలి చేత జంగమను గొట్టది" /ఎర్రంగ వండిన కొర్రసేనోలె" / "కసుగాయ కొరుకని పసిపిల్ల" / "సాలులోపల పోలు పోసినట్లు" / "కుమ్మరిగాయని కమ్మని మధురం" ఈ విధంగా వివిధ గతి భేదాలలోను అనుసంధాన వచనంలోను ఒగ్గు కథలో ఈ ప్రాసయతి

కనిపిస్తుంది. ప్రాసయతి వలన కథా గమనానికి లయాత్మకత కలగడంతో పాటు కథకుడు నిర్విరామంగా కథాగానం చేసినప్పటికి సహజమైన విశ్రాంతి లభించి అలసిపోకుండా ఉంటాడు. ప్రాస యతి వల్ల కలిగే పదలాలిత్యం మనసులో స్థిరపడి అనుకరణకు తద్వారా కథాగానానికి సహకరిస్తుంది.

### 4.9.3.అంత్యానుప్రాస

జానపద సాహిత్యానికి పునరుక్తి ఒక లక్షణం. ఇది పాదాంతంలో పునరావృతం అయినప్పుడు అంత్యానుప్రాసగా సాహిత్యాన్ని అలంకార శోభితం చేస్తుంది. వివిధ దరువులలో వీర శృంగార రస ప్రధానంగా గానం చేయబడే ఒగ్గుకథలో అనుప్రాస, అంత్యానుప్రాస, శబ్దాలంకారాలు ఎక్కువగా కనిపిస్తాయి. కథాగానం మొత్తంలో యతి మైత్రి రూపంలో అనుప్రాస కనిపించినప్పటికీ వివిధ దరువులలో గానం చేస్తున్నప్పుడు, అనుసంధాన వచనం చెప్తున్నప్పుడు అంత్యానుప్రాస అలంకారం కనిపిస్తుంది.

"పుంటికూర తిన్న పుట్టినిల్లు – తైదంబలి తాగిన తల్లి గారిల్లు" / "కడుపు కన్నము లేదు కంటికి నిద్ర లేదు" / "గట్లు కనవడుతయి గాని గతులు కనబడయి" / "తొట్టెలో పిల్ల – సంకలో పిల్ల" / "ఆర్నెల్ల పోరాయె – మూడ్నెల్ల కడుపాయె" / "పుట్టెడు పుణ్యం చేసి – పూల తోట్టెల్ల వేసి" / "వంచిన నడుములు ఎత్తర్లు – వొంటికి చేతులు పెట్టరు" / "చేతులు కలిస్తే చప్పట్లు – మాటలు కలిస్తే ముచ్చట్లు" / "పొద్దు చూడ పట్నము పొన్నలంగడున్నది – మాపు జూడ పట్నము మల్లెలంగడున్నది" / "వాని గుడి గుండం గాను కుడి బాదు గుళ్ళు గుర్రాలు దొక్క – ఎడమబాదు గుళ్ళు ఏనుగులు దొక్క" / ఇలా కథాగానంలో అనుసంధాన వచనంలో చివరికి తిట్టులో సైతం అంత్యప్రాస కనబడుతుంది.

### 4.9.4. పదాత్మక ప్రాస

కథాగానంలో కొన్ని చోట్ల పాదం మధ్యలో ఒకే విధమైన పదం పునరావృతం కావడం గమనించవచ్చు. ఇలా కథాగానంలో ఒకే పదం ప్రాసాత్మకంగా పునరావృతం అవుతూ అంత్యానుప్రాసను కలిగి ఉండడం వలన కథాగానం చేసేటప్పుడు కథాగతమైన భావం శ్రోతల మనస్సులో స్థిరీకరించడుతుంది.

"కాలు దుమ్ము లేసెనా కైలాసమందెనా దెక్క దుమ్ము లేసెనా దేవలోకమందెనా" పైన తెలిపిన రెండు పాదాల చివర 'అందెనా అనే పదం వచ్చి అంత్యప్రాసను కలిగి ఉండటంతో పాటు రెండు పాదాలలో 'దుమ్ములేసెనా' అనే ఒకే విధమైన పదాలు ప్రాసాత్మకంగా

ప్రయోగించబడ్డాయి.

"కోయిలలుకూసి కొమురెల్లి తెల్లారె / హంసలుకూసి ఐనవోలు తెల్లారె / పాయిరాలు కూసి పర్వతం తెల్లారె" / "కాదని పట్నం కట్టుకపోలె – లేదని పట్నం లేపుకపోలె" / "ఈగలు వద్ద గంజిదాగి ఇల్లావరిచ్చిండు – దోమలు వద్ద గంజిదాగి దొడ్డవరిచ్చిండు" / "సిగముడి ఇప్పి శివుని తలుసుకొని తలముడి ఇప్పి తల్లిని తలసుకొని" / "చెట్టుగాని పిట్టరీతి – చేరులేని ఉయ్యాల రీతి" / "చెట్టాకు దిని చెలిమె నీళ్లు తాగి – మానాకు దిని మడుగు నీళ్లు తాగి" ఇలా ఒగ్గుకథలో కొన్ని చోట్ల అంత్యానుప్రాసతో పాటు పాదం మధ్యలో పదగతమైన ప్రాస కనిపిస్తుంది. ఈ విధమైన ప్రాస వల్ల కథా గతమైన భావతీవ్రత ప్రేక్షకుని మనసుకు రూపుగడుతుంది.

ఒగ్గుకథా గానంలో అలంకార రస పోషణలో సహజంగా పాటించబడే యతి ప్రాసలు కథానుగుణంగా చెప్పబడే వస్తు విశేషాలలోను కనిపిస్తాయి.

"పన్నెండు బిగాల పరుపు బండ" బల్లపరుపుగా విశాలంగా ఉండే రాయిని పరుపు బండ అంటారు. ఇది మిక్కిలి విశాలంగా ఉందని చెప్పడానికి పన్నెండు బిగాల అనే విశేషణం

ఉపయోగించారు. బిగడు అనేది ఒక భూమి కొలత. బండ అనే వస్తువు గురించి చెప్పినప్పుడు ప–ప అనే అక్షరాల మధ్య యతి మైత్రి కనిపిస్తుంది. అలాగే

"కంచల్ల మర్రి కరుణాల పుట్ట" / "ఐదేళ్ళ బటువులు అంబరాన గొలుసులు" ఏ సూర్యుడు చంద్రుడు చూడని ఉత్కము" / "అంగిల్లాగులు బంగారుంగరాలు" / "ఉక్కు గొళ్లాలు చిక్కు తాళాలు" మొదలైన వస్తువులను తెలియజేసే పదబంధాలలో కూడా సహజమైన యతిప్రాస వలన కథాగానంలో లయాత్మకత కనిపిస్తుంది.

### 4.9.5. సుదీర్ఘ వచనాలు

కథాగానంలో అనుసంధాన వచనంలో వచ్చే చిన్న చిన్న పాదాలలో మాత్రమే కాకుండా కొన్ని చోట్ల సుదీర్ఘమైన వచనంలో కూడా శిష్ట సాహిత్య కవులకు ఏ మాత్రం తీసిపోకుండా సహజమైన ప్రాసలతో కూడిన వర్ణన కనిపిస్తుంది.

"పన్నెండెడ్లమోత పందిరి కట్నం – ఆరెడ్లమోత ఆకుపోకల ఖర్చు..../ ఊశిపోయిన పందిరి పట్నం – ఆరెడ్లమోత ఆకుపోకల ఖర్చు... / ఊశిపోయిన ఎంటికలకు ఊర్లు దాపాలె.../ టేకుటాకుల తెరలు తమలపాకుల దడులు / అడుగడుగున బుడిగెబావులు – వంపున వనాంతరాలు... / ఆరెకురాల అన్న సంత్రం కట్టి – పూటకు పుట్టెడు బియ్యం – వండి వార్చి వడ్డన చేయాలె... / పదివేలు పచ్చని పల్లాకీలు – అయిదువేల అద్దా మ్యానలు.../ బాజాలు భజంత్రీలు బలువైన సొన్నాయిలు. తురుములు కొమ్ములు దుల్లాన భేరీలు / కారుకొమ్ముల మోత

కడలు దద్దరిల్లు – బూరకొమ్ముల మోత భూములు దద్దరిల్ల... / పన్నెండు పుట్ల వచ్చి ముత్యాల పోలు..." ఇలా గుక్కతిప్పకుండా ఆశువుగా సాగే ఒగ్గుకథాగానంలో తరచి చూస్తే పదంపదంలో ప్రాసలు పల్లవించి నిర్విరామ కథాగానంలో కథకుడు అలసిపోకుండా ఉండేందుకు సహకరిస్తాయి.

ఒగ్గుకథాగానంలో ప్రయత్నపూర్వకంగానో అప్రయత్నంగానో ప్రాసపదాలు ప్రయోగించడమనికాకుండా ప్రాసలేకుండా పాదమే ఉండదని చెప్పవచ్చు. "సక్కనికళ్ళ సారంగధరుడు", ముక్కుపచ్చలారని మూగలాగె" అని విశేషణాలను తెలిపిన, "సల్లబువ్వలు పెట్టిసాదుకో – ఎన్నబువ్వలువెట్టి ఏలుకో" అని బాధ్యతలు అప్పగించిన "అద్దకిల బంగారంతింటె ఆకలి తీరది – వరిమెతుకులుతింటేనే ఆకలి పోతది, మిన్నుకురువాలి, మన్ను తడువాలి, మంట్లెమానెడు పోస్తే – ఇంట్ల పుట్టెడు నిండాలి" అని జీవితానుభవాలను చెప్పినా "కరకర పొద్దుపొడవంగా కక్రావులెంకలేయంగ"అని భావచిత్రాల్ని వర్ణించిన ప్రతి పలుకులో వివిధ రకాల ప్రాసలు కనిపిస్తాయి. జానపద సాహిత్యానికి సాంప్రదాయ లక్షణగ్రంథ నియమాలు కొలమానాలు కాలేవు. అయినా శిష్ట సాహిత్యానికంటే ముందునుండే జానపదం ప్రచారంలో ఉన్నదనే విషయం కాదనలేని వాస్తవం. అనాదికాలంగా ప్రజాక్షేత్రంలో ప్రచారంలో ఉండి కాలానుగుణమైన మార్పులకు తగ్గట్టుగా భాషా విశేషాలను అందిపుచ్చుకుంటూ విశేష జనాధరణ పొందుతున్న కళారూపం ఒగ్గుకథ. ఇందలి సహజమైన యతి ప్రాసాగతమైన లయాత్మకత ప్రాసభేదాలు లక్షణ గ్రంథాల నియమాలకు లక్ష్యాలుగా అనేక విశేషాంశాలు ఒగ్గు కథా సాహిత్యంలో కనిస్తాయి. ప్రాంతీయ సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీకలుగా నిలిచిన ఇలాంటి భాషా ప్రయోగాలు ఒగ్గుకథకు సజీవ చైతన్యాన్ని కలిగిస్తున్నాయని చెప్పవచ్చు.

4వ. అధ్యాయం

# పాద సూచికలు

1. భద్రిరాజు కృష్ణమూర్తి, తెలుగుభాషా చరిత్ర, పుట. 187
2. భద్రిరాజు కృష్ణమూర్తి, తెలుగుభాషా చరిత్ర, పుట. 221
3. చుక్కా సత్తయ్య, ఒగ్గుకథల్లో సామెతలు–పొడుపు కథలను పరిశోధకురాలుకు వివరించిన విశేషాలు.
4. తెలుగులో సామెతలు– జనజీవనం, తెలుగు అకాడమీ, పుట. 211
5. డా॥ చిలుకూరి నారాయణరావు, తెలుగు సామెతలు, పుట. 147
6. నేదునూరి గంగాధరం, తెలుగులో పొడుపు కథలు, పుట. 118
7. డాక్టర్ ఎన్.కె.మద్దిలేటి, తెలుగుసాహిత్యం, పుట. 192
8. డాక్టర్ కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, తెలుగులో సామెతలు– పొడుపుకథలు, పుట. 97
9. ఋగ్వేదం, 7.29.3
10. కె.రుక్నుద్దీన్, కిన్నెరమెట్లు పుట. 24
11. కె. రుక్నుద్దీన్ జానపద సాహిత్యంలో అలంకార విధానం, పుట. 106
12. కె.రుక్నుద్దీన్ జానపద సాహిత్యంలో అలంకార విధానం పుట. 134

# 5

# ఐదవ అధ్యాయం

## ఒగ్గు కథ - సామాజిక సాంస్కృతిక అంశాలు
## నేడు తగ్గుతున్న ఆదరణ- పరిరక్షణ మార్గాలు

# అధ్యాయం-5

## ఒగ్గు కథ - సామాజిక సాంస్కృతిక అంశాలు నేడు తగ్గుతున్న ఆదరణ - పరిరక్షణ మార్గాలు

### 5.1. పరిచయం

నేడు ప్రసిద్ధ జానపద కళారూపం అయిన ఒగ్గు కథల ద్వారా వివిధ పథకాల ప్రచారం జోరుగా సాగుతుంది. వీటిలో అవినీతి నిర్మూలన, ఓటర్లకు జాగరణ, ప్రకృతిమాత, స్వతంత్ర ఉద్యమం, పరిసరాలు, పరిశుభ్రత, కుటుంబ నియంత్రణ మొదలైన పథకాలను ప్రసిద్ధ ఒగ్గు కళాకారుడు చుక్కా సత్తయ్య ఒగ్గుకథాగాన ద్వారా ప్రచారం చేసిన ఈ క్రింది అంశాలను ఈ పరిశోధనలో విశ్లేషించాను.

### 5.2. సామాజికాంశాలు

ఒగ్గుకథ కళారూపానికి అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు రావడానికి ప్రధాన కారకులు చుక్క సత్తయ్య, కురుమ కులంలో జన్మించి కులసంబంధంగా కథాగానం నేర్చుకొని యక్షగాన ధోరణిలో కథాగాన ప్రదర్శనలో వివిధ మార్పులు చేశారు. తద్వారా ఒగ్గుకథకు ప్రజల నుండి విశేషమైన ఆదరణ లభించింది. అనంతరం అనేక ప్రభుత్వ పథకాలను ఒగ్గుకథ బాణీలలో విరివిగా ప్రచారం చేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆచార్యుడిగా ఎంతో మంది విద్యార్థులకు ఒగ్గు కథ గానంలో శిక్షణ ఇచ్చారు. సుమారు యాభైకి పైగా వివిధ కథాంశాలను ఆశువుగా పాత్రోచిత స్వరంతో, ధీరగంభీరంగా, లలితలాలిత్యంగా ఒగ్గు కథలను గానం చేయడంలో నిష్ణాతులైన చుక్క సత్తయ్య అంశం ఏదైనప్పటికీ దాన్ని ఆశువుగా ఒగ్గు కథగా మార్చి గానం చేయగలరు. ఎంతటి క్లిష్టమైన విషయమైనా సాధారణ జనానికి అర్థమయ్యే భాషలో గేయత్మకంగా, కథా కథనాత్మక వ్యాఖ్యానంతో ఒగ్గుకథాగానంగా చెప్పే వారి నైపుణ్యం ప్రేక్షకులను అబ్బుర పరుస్తుంది. పలుకు పలుకులో, ప్రతీ పాదంలో సహజమైన ప్రాస వెల్లివిరుస్తుంది. సహజలయాత్మకంగా సాగే వారి గానం ప్రేక్షకుల మనసును కథావిషయం పట్ల కేంద్రీకరింపజేస్తుంది. అందువలన చుక్క సత్తయ్య ఒగ్గుకథాగానంలో పద్ధతులు ప్రచారం చేసిన ప్రతి అంశం ప్రజలకు మిక్కిలి చేరువైంది.

చుక్క సత్తయ్య ఇరువై గంటల ఎల్లమ్మ ఒగ్గు కథను, ఇరువై నిమిషాల వరకట్న దురాచారానికి సంబంధించిన ఒగ్గుకథను ఒకే విధంగా రక్తి కట్టించగల ప్రదర్శనా నైపుణ్యం

కలవారు. వారు ప్రదర్శించిన వివిధ ప్రభుత్వ ప్రచార పథకాలలో "ఇందిరమ్మ ఇరువై సూత్రాల పథకం ఒగ్గు కథ" విశేష జనాదరణ పొందింది. తెలంగాణా ప్రాంతం నుండి ప్రజాప్రతినిధులుగా ఎన్నికై భారత ప్రధాని పదవి చేపట్టిన ఇందిరాగాంధీ పట్ల ఇక్కడి ప్రజలలో విశేషమైన ఆదరాభిమానాలు ఉండేవి. ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన అనేక పథకాలలో ఇరవై సూత్రాల పథకం కూడా ఒకటి. భారతదేశంలో పేదరిక నిర్మూలన కోసం వివిధ ప్రభుత్వ యంత్రాంగాలను సమన్వయపరచి రూపొందించిన ఈ పథకాన్ని ప్రజల్లోకి తీసుకు పోవడానికి చుక్క సత్తయ్య ఒగ్గుకథ ఎంతో ఉపయోగపడింది. ఇందిరమ్మ ఇరవై సూత్రాల పథకం ఒగ్గు కథను చుక్క సత్తయ్య సుమారు ఆరువేల ప్రదర్శనలుగా గానం చేసానని పేర్కొన్నారు. ఇది వారి కథాగానికి ఉన్న విశేష ప్రజాదరణను తెలుపుతుంది.

'అమ్మమ్మ జగదంబ అంబ జగదంబ – కరుణించు మా తల్లి కనకదుర్గమ్మ
ఏడుపాయలలోన వెలసినవమ్మ – ఎంట ముప్పైమూడు శక్తులో యమ్మ
ఏ పాయ చూసినా నీ పాయ కలదమ్మా– ఎంట ముప్పైమూడు శక్తులో యమ్మ
రాజకీయ రంగముల పుట్టి పెరిగిందిరా – భారత ప్రధాని ఇందిరమ్మ తల్లి రా
బలహీన వర్గాల చూసింది ఇందిరమ్మ – బ్యాంకులు జాతీయం చేసింది
పాడి పంటల కొరకు నీటి కాల్వలు తెచ్చి– ప్రాజెక్టులెన్నెన్నొ కట్టించినాదన్న
చేనేత పరిశ్రమ పట్టు, పాలిస్టరు – ఉత్పత్తులెన్నెన్నొ పెంచినాదన్నా
ఇరువది సూత్రాలు చేపట్టి ఇందిరమ్మ – ఎన్నెన్నో పథకాలు నెలకొల్పి ఇందిరమ్మ
దున్నె వారికి భూమిలిచ్చింది ఇందిరమ్మ – మిగులు భూములు పంచిపెట్టింది ఇందిరమ్మ
నీడ లేనటువంటి నిరుపేదలను చూసి – వెన్నుతట్టి ప్రజల రక్షించినాదంట' (చుక్క సత్తయ్య ఇందిరమ్మ ఇరవై సూత్రాల పథకం ఒగ్గు కథ)

సాధారణ ఒగ్గుకథ వలె దైవ ప్రార్థనతో ప్రారంభమైన ఈ ఒగ్గుకథగానం ఇందిరాగాంధీ ప్రవేశ పెట్టిన ఇరువై సూత్రాల పథకంతో పాటు ఇందిరాగాంధీ వ్యక్తిత్వాన్ని, అభివృద్ధిని అవిష్కరించడం జరిగింది. దైవ ప్రార్థనలలో భాగంగా ఇందిరా గాంధీ ప్రాతినిధ్యం వహించిన మెదక్– ప్రాంతంలోని ఏడుపాయల దుర్గభవానిని ప్రార్థించడంలో ఔచిత్యం కనిపిస్తుంది. భూసంస్కరణలతో పాటు కుటీర పరిశ్రమలకు చేయూత, బ్యాంకుల జాతీయకరణ ఇలా అంశం ఏదైనప్పటికీ దానిని ఒగ్గుకథబాణీలో గానం చేయడం విశేషం. ఇదే అంశాన్ని ఉపన్యాసరూపంలో చెప్పిన దానికన్నా ఒగ్గు కథగానంగా చెప్పడం వలన ప్రజలలో విశేషంగా ప్రాచుర్యం పొందే అవకాశం కలిగింది. అందుకే ఒగ్గు కథలను వివిధ

ప్రచారాల కోసం ఎంచుకోవడం జరిగింది. సామాజిక మాధ్యమాలు అందుబాటులోకి రావడానికి ముందు ఇలాంటి ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడానికి ఒగ్గుకథను మాధ్యమంగా చేసుకున్నట్లుగా నేడు అనేక రాజకీయ సామాజిక ప్రచారాల కోసం ఒగ్గుడోలు నృత్యాన్ని ఉపయోగించడం విశేషం. చుక్క సత్తయ్య ఇందిరమ్మ ఇరవై సూత్రాల పథకంతో పాటు వరకట్ననిషేధం, మద్యపాన నిషేధం, కుటుంబనియంత్రణ, పచ్చదనం పరిశుభ్రత, అక్షరదీపం వంటి అనేక ప్రభుత్వ పథకాలను ఒగ్గుకథగా ప్రదర్శించి గానం చేస్తూ ఆయా అంశాలపట్ల ప్రజలకు విస్తృతమైన అవగాహన కలిగించారు.

ప్రభుత్వ పథకాల ప్రచారాన్ని ఒగ్గుకథకళా మాధ్యమంగా విశేష ప్రాచుర్యం కలిగించిన ఒగ్గు కథకులు మిద్దె రాములు ఒగ్గుకథా గానం చేసే కురుమ యాదవుల కుటుంబానికి చెందకపోయినా, స్వశక్తితో ఒగ్గుకథగానం మీద అభిమానంతో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి జీవితాన్ని ఒగ్గు కథాగానానికి అంకితం చేసిన కళాతపస్వి మిద్దె రాములు, నెహ్రూ యువ కేంద్రం చేపట్టిన అక్షరాస్యత, మూఢనమ్మకాల వ్యతిరేకత, వ్యక్తిత్వ వికాసం కార్యక్రమాలను ఒగ్గుకథ ద్వారా మిద్దె రాములు ప్రచారం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మద్యపాన నిషేధం వంటి పథకాలను ఒగ్గుకథగా మార్చి ప్రచారంచేసి ప్రజలను చైతన్య పరిచారు. ఇలాంటి ప్రభుత్వం పథకాల ప్రచారానికి సంబంధించిన ఒగ్గుకథగానం విని చాలా మంది యువత మిద్దెరాములు శిష్యులుగా మారి ఒగ్గుకథగానం నేర్చుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన అక్షరఉజ్వల కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లాలో ప్రచారం చేయడానికి మిద్దె రాములు విశేషంగా కృషి చేశారు.నాటి కలెక్టర్ బన్వర్లాల్ గారి ప్రోత్సాహంతో సంవత్సరం పాటు కరీంనగర్ జిల్లాలోని గ్రామాలలో అక్షర ఉజ్వల ఒగ్గు కథలను ప్రదర్శించి అక్షరాస్యత ఆవశ్యకత పట్ల ప్రజలను చైతన్య పరిచారు. ఇలాంటి ప్రభుత్వ, రాజకీయ, సామాజిక పథకాల ప్రచారం కోసం ఒగ్గుకథను మాధ్యమంగా ఉపయోగించుకున్నారు. చుక్క సత్తయ్య, మిద్దె రాములు వంటి ఒగ్గు కళాకారులు ఒగ్గుకథ మౌలికరూపానికి ఏ మాత్రం భంగం కలిగించకుండా అంశాన్ని ఆశువుగా ప్రాసాత్మకమైన గేయంగా గానం చేస్తూ ప్రదర్శించేవారు. కథనాత్మక అనుసంధాన వచనంతో పాటు ఇలాంటి ఒగ్గు కథలలో హాస్యరస సంభాషణలను, అడ్డుకథలను ఎక్కువగా ప్రదర్శించడం ద్వారా ప్రజలను ఒగ్గుకథ గానం విశేషంగా ఆకర్షించింది. ఒగ్గుకథగానాన్ని వివిధ ప్రచార పథకాలకు వాడుకోవడం చుక్క సత్తయ్య మిద్దె రాములు గార్లతో ప్రారంభమైనప్పటికీ అనంతరం వారి శిష్యులు, ఇతర ఒగ్గు కళాకారులు కూడా ఎన్నో ప్రచార కార్యక్రమాలకు ఒగ్గు కథను మాధ్యమంగా

వాడుకున్నారు. ఎంతో సాంకేతిక వ్యవస్థ, వివిధ వినోదాత్మక సాధనాలు అందుబాటులోకి వచ్చిన నేటి తరుణంలో కూడా వివిధ రాజకీయ నాయకుల ప్రచార సభలో ప్రజాకర్షణ కోసం ఒగ్గుకథను ఉపయోగించడం ఒగ్గుకథ గాన కళారూపం యొక్క ప్రాధాన్యాన్ని తెలియజేస్తుంది.

### 5.2.1. అవినీతి నిర్మూలన

జానపద ఒగ్గు కళాకారులు సమాజంలో జరుగుతున్న అన్ని రంగాల్లో అవినీతిని గురించి దానిని నిర్మూలించాలనే ఉద్దేశ్యంతో కురుమ యాదవ కుటుంబానికి చెందిన అనేకమంది ఒగ్గు కళాకారులు గంగమ్మ తల్లిని వేడుకుంటూ అవినీతిని నిర్మూలించమని, రాజకీయ, సామాజిక పథకాల ప్రచారం కోసం ఈ పథకాన్ని ఒగ్గు కథకులు ఎలక్షన్ టైంలో ప్రచారం చేశారు.

వచనం: గంగల ఓ గంగా ! మా తల్లివమ్మ గంగమ్మ ! వివరాలు మరియెట్టులున్నవీ గంగమ్మను తులసి గద్దేసి మ్రొక్కి శారదాంబను తులసి చెయ్యెత్తి మ్రొక్కి విగ్గనేశుని తలచి యీచోట నిలిపే విగ్గనేశుని వివరాలు మరియెట్టులున్నవీ.

యెత్తు: విగ్గనేశుని కొప్పు వీపల్ల జడలు పార్వతీ వరకుమార పదివేల శెరనార్థీ...

ద: శరణు శరణు మాయంబరాణి
శాంభవీరాణి శాంభవీరాణి
కరుణజూడు మముకన్నా తల్లి
ఘణికల్పవల్లీ శారద మమ్మేలు తల్లి

ద: శరణు... శరణు... శారద మమ్మేలు తల్లి ॥శ॥

ద: మమ్ముగన్న మాణిక్యలగడ్డ మన భారతగడ్డ –మన పుణ్యగడ్డ
జీవనదులు ఖనిజ సంపద కలకల్పవల్లి శారద కల్గిన తల్లి ॥శ॥

ద: తరతరాలుగా ఈ గడ్డపైన తరములు ఒరిగే... తరములు మారే..
ఏకచక్రముగా పరిపాలించిరి... ఎందరో రాజులు... ఎందరో నవాబులు...

ద: ప్రజాపోరాటం వల్ల ప్రజారాజ్యమొచ్చే ప్రజలెలబట్టే
నిరంకుశత్వానికి నేడునీడ లేదాయే గొడు లేదాయే ॥శ॥

ద: కులమత బేధం మనకెందుకు
కూడి బ్రతుకుదాం మనం కల్సి బ్రతుకుదాం
మనలో మనకు చీలికలెందుకు

మంచి కాదయ్యా ముందుకు నష్టపోతామన్న ॥శ॥
దేశద్రోహులను కట్టిపెట్టుటకు నడుము కట్టుమన్న ముందు కదము త్రొక్కుమన్న
యెన్నాళ్లు నిద్రపోతావూ మేలుకొని చూడూ దేశము మేలు కోరనీవూ...

యెత్తు: ఓ మల్లన్న యిప్పుడు నీవు చెప్పింది బాగానే ఉంది కాని కాస్త
అందరికి అర్థమయ్యేటట్లు గట్టిగా చెప్పవయ్యా
చూడు తమ్ముడు ఈనాడు మన దేశములో కులాల పేరుతో
మతాల పేరుతో కొన్ని దుష్టశక్తులు తయారై ఈ దేశాన్ని
ముక్కలు ముక్కలుగా చీల్చి ఈ దేశ సంపదనంత బీదసాదల కండ్లు కట్టి
కొల్లకట్టి...

ద: కూడు గుడ్డ లేనివాడ మధ్యరకం బీదవాడ
లోకములో నీ బ్రతుకు చీకటాయే కూలన్న

యెత్తు: కళ్లు తెరచి ముందుకొస్తే కష్టములు తీరునంటరో మల్లన్న నడుము కట్టి ముందర
నడవరో మల్లన్న

ద: మొక్కజొన్న చేను పెడితే నక్కలన్ని మేచిపోయే
కొప్ప గుడి చేకూలిపాయే ఎక్కడేమి లేకపాయే

యెత్తు: ఆరు నెలల కష్టమంత అడివిలోన కలిసిపోయేరో లింగన్న దేశమంత మోసప్పుచ్చిరో
లింగన్న...

ద: మందబుద్ధి మానుకోర నిద్రనుండి మేలుకోరా
కష్టమనక ముందుకొచ్చి గట్టి గవక పట్టు పడితే

యెత్తు: దొంగ నక్కలన్నింటి దొరకపట్టవచ్చునంటరో మల్లన్న నడుము కట్టి ముందు
నడవరో మల్లన్న

ద: పల్లికాయ సెను వెడితే పగటి కుక్క లెగపడే
డొక్క నిండ తిండి లేక కొట్ట లేక పోతి నేను

యెత్తు: పెచ్చులకు తెచ్చి పెడితే పేరుకు లేకుండా పోయెరో లింగన్న... పగటి
దొంగలెక్కువయ్యారో లింగన్న...

ద: యెండా వానల్ల తిరిగి కండలు కరగించినోడ
బండికొట్టి బ్రతికినోడ గుండె ధైర్యముంటే...

యెత్తు: దొంగ నక్కలన్నింటా దొరక పట్టవచ్చునంటరో మల్లన్న నడుము కట్టి ముందు

నడవరో మల్లన్న

ద: జొన్న కంకి కోసుకొచ్చి బండ మీద రాసి పోని

కష్టపడి కంప తెచ్చి చుట్టు ముట్ట దొడ్డి పెడితే

ద: అప్పుతెచ్చి ఇల్లు కట్టి మిత్తి క్రింద కమ్ముకుంటి

చెప్పుకుంటే సిగ్గుపోయే చెట్టు క్రింద బ్రతుకుడాయే...

యెత్తు: లంచగొండు దొంగలంతా దోచుకొని పాల్లు పంచిరో లింగన్న... ప్రజల సొమ్ము పాడుచేసిరో లింగన్న...

ద: నాగలి కట్టి భూమి దున్ని పంటలు పండించినోడా

ప్రతిపక్షాలొక్కటైతే దోపిడీల పట్టువచ్చు

యెత్తు: రాత్రి పూట పందులొచ్చి రాసంత మేసిపోయేరో లింగన్న కుల్లకట్టి కొల్లకొట్టురో లింగన్న...

ద: పోడుకొటి రోడుచేసి మోటర్ నడిపించినోడ

కష్టజీవులందరమూ ముందుకొచ్చి వక్కటైతే

యెత్తు: దొంగ పందులన్నింటి గుంజి కొట్టవచ్చునంటరో మల్లన్న దొపిడీల పట్టవచ్చురో మల్లన్న

ద: వ్యవసాయమంట చేస్తే పెట్టుబడికి యెల్లరాయే

యిచ్చినోడు గుంజుడాయే మన పంట అమ్మపోతే మారుకట్టు

వంశమాయేరో లింగన్న మనము కొంటే సిర మాయేరో లింగన్న

దొపిడీ మూటలు చీకటి బాటలు కోతలు కోసి కోసి మేతలు మేసిన

దొంగ లంచగొండులకు అడ్డము తిరిగి మొద్దు కట్టరా భారతీయుడా...

మీద మెరుగులు లోపట పురుగులు పచ్చి దొంగలై పదవుల నేలిరి

కల్లు కట్టి మన ఇండ్లు దోచేటి పందికొక్కులకు మందుపెట్టారా

అందుక మ్రింగేటి పోతే దొరుకదని కాచుక తిరిగేటిమోసగాళ్లను చూసి నడవరి

అందరు వకటై ఎదురు తిరిగితే అయ్యగార్ల పని ఆగిపోవురా...

ద: లేవరా! లేవరా! భారతవీరుడా!!

నిద్ర మేలుకొని చూడర దేశము!!

యెత్తు: యెక్కడచూచిన కుంభకోణములు, లంచాలను దొరుకపట్టుకొని బైటపెట్టరా...

### 5.2.2. ఓటర్లకు జాగరణ

ఒగ్గు కళాకారులు వివిధ పథకాల ప్రచారంలో భారతదేశంలో జరుగుతున్న వివిధ కార్యక్రమాలను ప్రేక్షకులను రంజింపజేస్తూ తన గాన విద్యతో లయాత్మకంగా ఒగ్గుకథ గానంతో ఈ కార్యక్రమాన్ని ప్రచారం చేస్తున్నారు. ఎలక్షన్ సమయంలో వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు ఓటర్లను ఆకర్షించడానికి అనేక పథకాలను అవలంభిస్తున్నారని వాటిలో డబ్బును మద్యన్ని ఆశచూపి ఓట్లు వేయించుకుంటున్న వైనాన్ని ఒగ్గు కళాకారులు ఈ ప్రదర్శన ద్వారా ప్రజలను డబ్బుకు లొంగిపోవద్దని, మద్యానికి బానిసకారాదని వేడుకుంటూ భారతమాత ముద్దుబిడ్డలైన భారతీయులకు ఓటర్ల జాగరణ ఒగ్గు ప్రదర్శన ద్వారా ఈ క్రింది విధంగా వివరించారు.

ద: భారతదేశము మనదీ సోదరుడా...
మాయనల్లరా నడుము కట్టుకొని ముందు నడువరన్న
భరత భూమిలో పుట్టినాముర భరత గడ్డపై పెరిగినాముర
యెత్తు: భరతమాతకు ముద్దు బిడ్డలము అబద్ధమాడక ముందు నడవరా ॥భారతదేశము॥
ద: రణము రణము యని భేరి మ్రోగగా నిద్ర లేవరా వీర సోదరుడా...
యెత్తు: యెక్కడ చూచిన కుంభకోణములు నిండు చెర్వుకు గండిపెట్టిరీ..॥భారతదేశము॥.
ద: పేదల నెత్తులు కొట్టేవారలూ
కోటలు పేటలు కట్టేవారలూ
యెత్తు: పార్టీ పేరుతో మందిని ముంచేటీ పగటి దొంగల నమ్మిపోకురా ॥భారతదేశము॥
ద: హెచ్చుగ ఖద్దర్ బట్టలు కట్టుచూ
పచ్చి దొంగలై పంచుకతింటరూ...
యెత్తు: అన్ని తీర్ల మిమ్మాదుకుంటామని ఆశ చూపెదరు మోసపోకురా ॥భారతదేశము॥
ద: పదవిలో ఉన్న పాత నాయకులు (దొంగలు)
లంచమిస్తెనే ముంచిదంటరు
యెత్తు: రేపటి రోజున ఆశలు చూపి పచ్చి దొంగలై పంచుక తింటరు ॥భారతదేశము॥
ద: స్టేజీలపైన మోజులు చూపి
ఉపన్యాసములు ఊపికొట్టేదరు
యెత్తు: ఖద్దరు బట్టలు పార్టీంటారు లంచాలిస్తే తింటమంటరూ ॥భారతదేశము॥
ద: దోపిడీ మూటలు చీకటి బాటలు

కోతలు కోచి మేతలు మేతురు

యెత్తు: లంచగొండులకు అడ్డము తిరిగి బుద్ధి చెప్పురా భారతీయుడా..॥భారతదేశము॥

ద: మీద మెరుగులు లోపట పురుగులు

గుసగుస బాసలు బ్రరండి సీసలు

యెత్తు: కండ్ల కట్టి మన యిండ్లు దోచేటి పందికొక్కులకు మందు పెట్టరా ॥భారతదేశము॥

ద: పోతే దొరకదని అందుక మ్రింగేటి

దొంగ పందులను గుంజి కట్టుటకు

యె: అందరు వకటై ముందుకు తిరిగితే అయ్యగార్ల పని ఆగిపోవునూరా ॥భారతదేశము॥

ద: లేవరా! లేవరా! భారత వీరుడా!!

నిద్ర మేలుకొని చూడరా దేశము!!

యెత్తు: యెక్కడ చూచిన కుంభకోణములు దొరకపట్టుకొని బైటపెట్టరా ॥భారతదేశము॥

ద: పేదలసాదల బడుగు వర్గముల

బాగు చేస్తమని చెప్పక తిరిగేదీ

యెత్తు: అడుగకపోతే లంచాలు పెరిగేరా బ్రతుకులేని మన బాధలు చూడరా ॥భారతదేశము॥

ద: యెన్నిక సమయము వచ్చినప్పుడు

యేతులు చెప్పి బాసలు చేతురు

యెత్తు: గెలిచిన వెంటనే మల్లరారు మన గొడు వినరు ॥భారతదేశము॥

ద: పేద, మధ్య, బడా సామాజిక వర్గాలు ఏకమై

గట్టిగా చూచి పట్టు పట్టరా

యెత్తు: దోపిడీ దొంగల బైటపెట్టరా అవినీతి పాలనలను గద్దె దించరా ॥భారతదేశము॥

### 5.2.3. ప్రకృతిమాత

ప్రకృతిమాత అనే పేరుతో సమాజంలో జరుగుతున్న దుర అలవాట్లను ఒగ్గు కళాకారులు ఒగ్గుకథలు ద్వారా ప్రజలకు వివరించారు. ముఖ్యంగా ఒగ్గుకథకు చెందిన కురుమ యాదవ కుటుంబాలకు చెందిన వారిని దృష్టిలో పెట్టుకొని సమాజానికి సందేశమిస్తూ ఈ కార్యక్రమంలో ప్రకృతిమాతను వేడుకుంటారు. దానిని ఈ క్రింది ప్రదర్శన ద్వారా ప్రజలకు కళ్ళకు కట్టించారు.

దరువు: శరణు శరణు మాయంభా రావే

శాంభవీ రాని ప్రకృతి శాంభవీ రాని
కరుణ చూపు మా కన్నతల్లీ
గంగా భవానీ ప్రకృతి ఘనకల్పవల్లీ

ద: ముందు మా భారతీయులకు
మూలాదేవతా ప్రకృతి ఆరోగ్యమాతా
అండ పిండ బ్రహ్మాండ మంతటా
నిండి వున్నావమ్మా ప్రకృతి నిండి వున్నావమ్మా

ద: ఆదికి మొదలు ఓంకారంబున
ఆకాశం పుట్టే ప్రకృతి ఆకాశం పుట్టే
దానికి తోడై వాయు భూతము
అవతరించినది ప్రకృతి అవతరించినది

ద: వాయువు తోడై అగ్నిభూతము
ఉద్భవించినది ప్రకృతి ఉద్భవించినది
యీ మూడు వక్కటై జల భూతంబు
జననమైనది ప్రకృతి జననమైనది

ద: జల గర్భంబున భూమాతా
ఉద్భవించినది ప్రకృతి ఉద్భవించినది
యీ పంచ భూతములు యేకంబై
ప్రాపంచ ఏర్పడెను ప్రాపంచ ఏర్పడెను...

ద: ప్రపంచమంతట ప్రకృతి మాతా
ప్రజ్వరిల్లినది ప్రకృతి ప్రజ్వరిల్లినది
ఈ సృష్టికి మూలము ముగ్గురు మూర్తులు
పుట్టించిన ప్రకృతి పుట్టించినది

ద: ఆ ముగ్గురి చేత జగమంతటనూ
నాటక మాడించే ప్రకృతి నాటక మాడించే...
యెనుబది నాలుగు లక్షల జీవుల ఏర్పాటుచేసే ప్రకృతి ఏర్పాటుచేసే....

ద: గిరులు తరులు కొండలు కోనలు
వృక్షజాతులెన్నో పక్షి మృగజాతులెన్నో

కీటక మొదలగు సూక్ష్మ ప్రాణులు
జంతుజాలమెంతో ప్రకృతికి అంతు లేదు సుమా

ద: గంగా యమునా శారదా నర్మదా
సింధూ కావేరి కృష్ణా బ్రాక్రనంగల్లు
తుంగభద్ర గోదావరి నదులు పొంగ్గి
పొరలు చేసే సస్యశ్యామలం మొనరించే...

ద: అన్నిటికన్న మానవ జన్మము
మహా మంచిదన్న పోతే మళ్ల రాదు సుమీ
జాగరూకులై ముక్తికి దారి ముందు చూచుకొనుడు
దేవుని జాడ తెలుసుకొనుడు...

ద: ప్రకృతి మాతను ప్రార్థన జేసితే ఫలితమున్నదన్నా మనకు ఫలితమున్నదన్నా...
యోగ సాధన ఆసనాలతో ఆరోగ్యము గలుగు మనకు ఆనందము గలుగు

ద: దురాచారము దురఅలవాట్లను దూరము చేయన్నా...
మనకు మంచిదన్నా...
అందరి తోటి మన్నన పొంది మంచిగుండు మన్నా...
మనకు మేలు గలుగునన్నా...

వచనం:అయ్యా దురాచారము దురఅలవాట్లు అంటున్నావు యెవరైన అలాంటి అలవాట్ల వల్ల చెడు పనులు చేసి చెడిపోయినవారున్నారు... చెప్పమయ్యా...

ద: రామ రాఘవ రాజీవలోచన రామ రామ గోవిందా
చెప్పుతా వినరా చెవున పెట్టరా
జరిగిన కథ ఒకటున్నదిరా...

ద: ఈడికి దగ్గెర రంగంపేటనే గ్రామమొక్కటుండెనురా
ఆ గ్రామము లోపల వెంకయ్యనే కాపురస్తుడుండెనురా...
వెంకయ్య భార్య రామలక్ష్మి ఇంటికైన ఇల్లాలు
ఆమె కడుపున ముగ్గురు కొడుకులు అవతరించినారేమి
పెద్ద కొడుకు రంగయ్య మంచి బుద్ధిమంతుడనుకున్నారు
కల్లు, సార, బీరు, బ్రాండి, త్రాగనేర్చే రంగయ్య త్రాగనేర్చే
గుండె జబ్బుతో క్యాన్సర్ వచ్చి ఒక్కడు రక్తము కక్కేనురా

చుట్ట బీడితో దగ్గు దమ్ములు టి.బి. రోగమొచ్చె... ఉబ్బసము వచ్చేనురా...

నడిపి కొడుకు రాజయ్య మంచి తెలివికల్లా వాడనుకుంటే(బీర్, బిరియాని,చుట్ట బీడి)

తినుడు త్రాగుడు బీరు బిర్యాని హద్దు మీరి తింటున్నాడు

అజీర్ణ వ్యాధి కడుపున నొప్పి పేగులోనా పుండ్లాయెనురా...

చిన్న కొడుకు రమేష్ మంచి ప్రేమగల్ల కొడుకేమి

వేశ్యల తోటి వ్యభిచారాలు నడుపుచున్నాడు

యేడ్సు వ్యాధి అంటు రోగము మంటలాయెనురా

ముగ్గురి కొడుకులు దవాఖానాలు దేశమంతా త్రిప్పిరీ

సూదులు మందులు అపరేషన్లు యెన్ని చేసిన గానీ...

వచ్చిన రోగము తక్కువగాకా విడిసిపాయే డబ్బంతాను

ఆస్తులు పాస్తులు అన్నిపాయేను అప్పుల పాలైపోయిరీ

వ: యీ ప్రకారంగా వాళ్లను కన్న తల్లిదండ్రులు వెంకయ్య, లక్ష్మమ్మ కొడుకుల రోగాలు చూచుకుంటూ బాధపడుతున్నారు.

తల్లిదండ్రులు:

ద: కొడుకు లాల మేమి సేతు రామ రామ

మిమ్ముల నేను కంటిగాని కొడుకు లాలా

మీ గతి గానలేదు కొడుకు లాలా

వుండటానికిల్లు కూడ లేకపాయే

తినటానికి తిండి కూడా లేదాయేరా...

కట్టడానికి బట్ట కూడా లేక పాయేనురా...

మీరు కన్నపిల్లలురా కొడుకుల్లారా

ఆగమ్మ పక్షులైరీ మీ పిల్లలూ...

దిక్కులేని పక్షులైరీ మీ పిల్లలూ...

మీరూ యెట్లా బాగుపడతారు కొడుకులారా...

వ: యీ ప్రకారంగా వెంకయ్య లక్ష్మమ్మ కొడుకుల ముందు పెట్టుకొని దుఃఖించుచుండగా...అక్కడికి ఒక ప్రకృతి వైద్యుడు వచ్చి యేమి చెప్పుచుండెను

వైద్యుడు:

ద: లక్ష్మమ్మ నీవు యేడువకమ్మ యేడువకమ్మ యేమి పర్వలేదు వీళ్లను బ్రతికిస్థానమ్మా...

మందులు లేకుండా జబ్బులు నేను బాగు చేస్తానమ్మ వీళ్లను బాగు చేస్తానమ్మా...

ద: ప్రకృతి హాస్పిటలున్నది మాది పర్వలేదు వినుమా వీళ్లను తీసుకరావమ్మ
సూదులు మందులు ఆపరేషన్ లేకుండా బాగు చేస్తానమ్మా వీళ్లను బ్రతికిస్తానమ్మా...

ద: కల్లు సార బీరు బ్రాందీ త్రాగవద్దురన్నా... మనకు డబ్బు నష్టమన్నా...
మొండి వ్యాధులు గుండె జబ్బులు రక్తపోటు వచ్చి మనషి చచ్చిపోతాడన్నా

ద: త్రాగుడు తినుడు తప్పుడు నడకలు మంచివికాదన్నా...మనకు మించిన బరువన్నా...
వరి కూడు వరుసలు తప్పి వ్యాధీగ్రస్థులైరీ కొందరు పరలోకం పోయిరీ...

ద: చుట్ట బీడి సిగరెట్ త్రాగితే దగ్గు దమ్ము రొమ్ము క్యాన్సర్ టి.బి. రోగము వచ్చునేమో
వీడి అజ్ఞానము చేతలు బాధలు పడనేలా ప్రకృతి మాతను గనుగొనుము...

ద: అన్నిటికన్నా మించిన దేది ఆలోచించన్నా నీవే మదిలో గనుమన్నా
ఆరోగ్యమే మహా భాగ్యము అన్నది వినుమన్న నీవే మన్నన పొందన్నా...

ద: మధురమైన ఫలజాతుల నెప్ప మరువక తినుమన్నా వాటిలో ప్రాణశక్తి మిన్న
మన్ను నీరు గాలే మనకు ఆధారము సుమా వాటిలో ప్రాణమున్నదన్న...

ద: ప్రకృతి మాతను ప్రార్ధన చేసితే ఫలితమున్నదన్న మనకు ముక్తి కలుగునమ్మ
రోగము నొప్పులు మొండి వ్యాధులు దరికి రావు సుమా మనకు సుఖము
గలుగునన్నా...

వ: యీ ప్రకారంగా జాతిపిత గాంధీ మహాత్ముడు ఎల్లవేళల ప్రకృతిమాతను ఆరాధించేవారు ప్రకృతి వైద్యమే మానవులకు వరము ఔషదమని బోధించేవారు. ఆరోగ్యమే మహా భాగ్యము కాబట్టి మానవులు సుఖసంతోషాలతో జీవించాలంటే ప్రకృతి వైద్యమే ముఖ్యమన్నా....

వంతకుడు: అయ్యా నీవు చెప్పే ప్రకృతి వైద్యము యెవరు కనుగొన్నారో కొంచెము వివరంగా చెప్పవయ్యా.

కథకుడు:

ద: రెండు వందల యేండ్ల క్రిందా ॥రామ రామ॥
జర్మనీ దేశంబులోను అయ్యలా ప్రిన్నిడ్జ్ అను పేరు గలవారూ
మహా మేధావి ఉండే జర్మనీలో వారే కనుగొన్నరయ్య యీ వైద్యమూ
వారికెంతో మంది శిష్యులుండిరయ్య జగమంతా వ్యాపింప చేసినారూ...

వ: యీ ప్రకారము ఆ ప్రకృతి మాత దేవ దానవ మానవ యోధానుయోధులకే కాక

సమస్త చరచరా ప్రాణి కోటికి జీవనాధారంగా ఉండే బోగభాగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని ఆరోగ్య సూత్రాలను ప్రసాదించింది.

ఓ పెద్దన్న ఆరోగ్య సూత్రాలంటే యేమిటో కాస్తా వివరంగా గట్టిగా చెప్పవయ్య.

ద: రామ రామ రామన్న రామ
రాఘవా రామన్నారు ॥రామ రామ॥
వింటవయ్యా నా విన్నపంబు ఉందని వినర మల్లా వినిపించెదనూ ॥వింట॥
రోజుకు రెండు పూటలా భోజనంబు చేయవలయును ॥రోజు॥
స్వచ్ఛమైన ఆకుకూరలో ఉప్పు కారము తక్కువ ఉండవలేను ॥స్వచ్ఛ॥
స్వల్పమైన భోజనంబు చేసితే సౌఖ్యముండను దేహము ॥స్వల్ప॥
రోజుకూ రెండు సేర్ల మంచి నీళ్లు సేవించవలెను ॥రోజు॥
అధికారమైన వేడి తగ్గను ఆరోగ్యము మంచిగుండునయ్య ॥అది॥

ద: ఉదయమున సాయంత్రమున చన్నీళ్ల స్నానంబు చేసితే ॥ఉదయమున॥
చర్మవ్యాధులు తగ్గిపోవునయ్య దేహమంతా సూదిగుండునయ్య ॥చర్మ॥

ద: ఆసనాలు యోగములు అభ్యసించితే చాలా మంచిదయ్య ॥ఆసనాలు॥
నరములు, యెముకలు కండరముల పుష్టి కలిగి గట్టి గుందురయ్యా ॥నరములు॥

వంత: అయ్యా వైద్యములో పచ్చి కూరగాయలు తినపెడుతరట యిదిక్కడ న్యాయం.

కథకుడు: అవును నీవన్నది నిజమే. పూర్వకాలములో శ్రీరామచంద్రుడు పదునాల్గు సంవత్సరాలు పంచ పాండవులు పన్నెండు సంవత్సరములు ఆకులు అలములు కాయలు కసురులు కందమూలాదులు భక్షించి మహాబలవంతులై జీవించలేదా...

వంత: అయ్యా మేము యీ కాలంలో యెన్ని మందులు తిన్న కాని తక్కువ కాదు. పత్యము లేదు, మీరు చెప్పిన వైద్యముతో మందు లేకుండా జబ్బును తక్కువ చేస్తారట. యెట్లనో చెప్పయా !

ద: రామ రామ ఓయీ రామ రామ రామ ఓయీ
వ్యాధిని పట్టి చికిత్స చేతురు ప్రకృతి వైద్యములో.
బొడ్డు కింద మట్టితోటి పట్టిలేత్తురూ
యింపుగాను హీనును లిత్తురూ గర్భ శుద్ధి కొరకు

ద: మట్టి స్నానము తొట్టి స్నానము ఆవిరి స్నానము
సూర్యరశ్మితో ఆపత స్నానము ముఖ్యమందురయ్య

వారము రోజులకొక్కసారి వుపవాసముందురయ్యా
నిమ్మ సంత్ర బతాయి రసములు సేవించుదురయ్యా
అందుకే...

ఆరోగ్యమే మహా భాగ్యము కాబట్టి మానవులు, ఇతర జీవజాతులు సుఖసంతోషాలతో యీ కాలములో జీవించాలంటే ప్రకృతి, ప్రకృతి వైద్యమే మనకు దొరికిన, ఉన్న వరము అని మన పూర్వీకులు పెద్దలు బోధించెను.

### 5.2.4. స్వతంత్ర ఉద్యమం

సమాజంలో నెలకొని ఉన్న సామాన్య విషయాన్ని ఒగ్గుకథను మాధ్యమంగా చేసుకొని నేడు అనేక రాజకీయ సామాజిక ప్రచారాలకోసం ఒగ్గుకథలను చెప్పించుకుంటున్నారు. వీటిలో ఇందిరమ్మ 20 సూత్రాల పథకం, వరకట్న నిషేధం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు కూడా ఈ ఒగ్గు కళాకారులే నడం బిగించడం వల్ల కొత్తరాష్ట్రం ఏర్పడడంలో వీరి ముఖ్య తోడ్పాటు ఉందని భావిస్తారు. ఈ భాగంలో స్వతంత్ర ఉద్యమం అనే పేరుతో కళా తపస్వి చుక్కా సత్తయ్య, మిద్దె రాములు మొదలైన ఒగ్గు కళాకారులు ఒగ్గు కథాగానానికి అంకితమై ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చారు. అయితే చుక్కా సత్తయ్య ఎటువంటి సమాజిక అంశానైన ఒగ్గుకథ మౌళిక రూపానికి భంగం కలగకుండా అంశాన్ని అసువుగా, లయాత్మకంగా గానం చేస్తూ ప్రదర్శించేవారు.

దరువు: శరను శరను మాయంబరాణి
శాంబవీరాణీ తల్లి శాంభవిరాణి
కరుణచూడు మముకన్న తల్లీ
ఘణికల్పావల్లీ శారద మమ్మేలు తల్లీ

ద: మమ్ముకన్న మానిక్యల గడ్డా ఓహెూ...
మన భాగ్య (భరత) గడ్డ మన పున్యగడ్డా
వనదులు ఖనిజ సంపదగల కల్పవల్లీ ఓహెూ కలిగిన తల్లీ

ద: తరతరాలు యీ గడ్డపైన తరములు ఓరిగె ఓహెూ
తరములు మారే యేకచత్రముగ పరిపాలించిరీ...
యెందరో రాజులు ఓహెూ యెందరో నవాబులు

ద: తెల్లవారు మన భారతీయుల కల్లకట్టినాడు దేశము కొల్లకొట్టినాడు సర్వసంపదలు
ఆక్రమించుకొని ఆటలాడినాడూ... అడిగితె రూపుమాపినాడు

ద:	తెల్లవాడు మన జాగీర్దారుల చేతపట్టి నాడు గటిగ కట్ల పెట్టినాడు పాపమనక
భారతీయులకు పన్నులేచినాడు భూమికి విత్తులేచినాడు.

ద:	పన్నులు కట్టని ప్రజలను పట్టీ బండలెత్తినాడు మరియు తొండలిడనినాడూ
బత్తమివ్వక యెట్టి చాకీరు చెయ్యపెట్టినారు ఓహో చెయ్యపెట్టినారు.

ద:	చెయ్యకుంటె మరి చెట్లకు కట్టి హింస పెట్టినారు  కారము చల్లి కొట్టినారూ...
సీకులు కాల్చి వీపుల పైన వాత గుంజినారుఅడిగితే రూపుమాపినారూ...

ద:	భారతీయులేమనక బాన్మలని విక్రవీగినారు దొరలు పొంగి పొరలినారు
సీలముగల మన వీర వనితలను కొంగు పట్టినారు దుష్టులు భంగపరచినారు

ద:	మంటలేచి మన భారతీయులు యెంటపడ్డారయ్యా వారికి యెదురు తిరిగిరయ్యా...
యెదురు తిరిగితె తుపాకిగుండ్లతో చదరకొట్టిరయ్య వారిని ఉరులు గుంజిరయ్యా...

వచనం: ఆనాడు మన భారతదేశములో ఉండబడిన సర్వసంపదలను చూచి ఓర్వలేక మనలో మనకు కక్షలు పెంచి కలహాలు సృష్టించి యుద్దాలు ప్రారంభించి పట్టపగలు యీ దేశాన్ని కొల్లగొట్టి భారతీయులను యెట్టిగొట్టానికి బానిసలుగాచేసి అనేక చిత్రహింసలు పెట్టినారు. మనవారికి పెట్టే చిత్రహింసలు చూచి భరించలేక మన మహామహులు భారత యోధులు బ్రిటీష్ వారి మీదికి యెవరు యెవరు తిరగపడ్డరు యంటే

దరువు చెల్తి:  రామ రాఘవ రాజీవలోచన రామ రామ గోవిందా
బ్రిటీష్ వారు పెట్టు బాధలకు ఓర్వలేక మానవారూ
యెందరో యోధులు విప్లవ వీరులు తిరుగపడ్డరానాడూ...
కత్తి కటారు వీపున డాలు పిడుగులాంటి యాగు గుఱ్ఱమురా...
శత్రుసేనలు త్రిప్పికొట్టిన వీరనారీ మన జాన్సీరాణీ...
దేశముకొరకు ప్రాణాలోడ్డిన త్యాగమూర్తి మన తల్లీరా...
అగ్ర పెద్దపులి వీరపాండ్య కట్ట బ్రహ్మన యోధుడురా...
ఘనబల సైన్యఘాత మోతతో త్రిప్పికొట్టె తెల్లోలనురా
భీతి లేక మన దేశరక్షణకు ప్రాణమొడ్డీన వీరుడురా
విప్లవ వీరుడు ప్రపంచ వీరుడు సీతరామరాజురా
మన్నెము సీమల దంట పెట్టుకొని యెంటపడి తెల్లోలనురా
బ్రిటీష్ కుక్కల చిత్తుచిత్తుగా తరిమి కొట్టిన వీరుడురా.
అల్లూరి దాటికి నిలువలేక మరి దొంగ దెబ్బకొట్టిరీ

దేశము కొరకు ప్రాణాలిచ్చి దేవుడై వెలసేనూ...
కోరలు (తిప్పిన వీరసింహము చంద) శెకరాజాతిమి
వెండి దంధములు పిండి కొరతు యెంటపడి తెల్లోల్లనురా
దేశము కొరకు ప్రాణలిచ్చి ప్రపంచమంతటట వెలిసిందూ
బ్రిటీష్ గుండెలు గండడించి భగత్ సింగ్ మన బలాది బందు
చిత్తు చిత్తుగా బ్రిటీష్ యోధుల డొక్కల చింపి చంపిందూ
దేశము కొరకు పొరుకు నిలిచి అమరజీవుడై వెలసిందు
చత్రసేనల త్రిప్పికొట్టిన సుభాష్ చంద్రబోసు మీ
ప్రపంప వీరుడు దేశమంతటట పేరు గాంచినిలిచాడురా
యిలాంటి యోధులు యెందరో వీరులు త్యామూర్తులై పోయిరీ

వచనం: ఆనాడూ యీ ప్రకారంగా బ్రిటీష్ వారితో పోరాటము చేసి అమర జీవులై పోయినారు. తరువాత యిగ మిగిలిన వారు యెవరయ్యాంటే...

ద: నీతిని నిల్పి ప్రఖ్యాతి గాంచిన జాతిపిత మన గాంధీజీ...
రాజ్యాంగ చట్టము రచించి పెట్టిన అంబేద్కర్ ఆప్తుడురా...
గుండల శంఖము గుబులు కొల్పిన సర్దార్ పటేలురా...
నడుము కట్టి మరి ముందు కొచ్చిన భోగరాజు పట్టాభిరా...
ధర్మదాత మన ప్రకాశం పంతులు దేశము జాన్సీబాయి
సత్యాగ్రాహోలు సమావేశములు చాలచాల చల్పిరీ
దేశము కొరకు నిరాహర దీక్షలు యిడువకుండ పట్టీరీ
సమావేశములు తుపాకీ గుండ్లతో చదరకొట్టిన ప్పొడు
చెట్టు కొక్కురుగుకకొక్కరు పక్షులైతిరి గీరీ తెల్లవాడు
మన యోధుల పట్టి జైల్లో పెట్టినప్పుడు కారాగారమున అన్నము
లేక కష్టపడి చచ్చిరీ

### 5.2.5. పరిసరాలు, పరిశుభ్రత

తెలంగాణలో ప్రజలకు ఒగ్గుకథ మీద ఉన్న మక్కువ జానపద కళారూపాల్లో దేనికీ లేదు. అతి తక్కువకాలంలో ఒగ్గుకథ ప్రజలను ఆకర్షించి ఉద్యమ ప్రచారానికి ఒగ్గు కళారూపాన్ని వాడుకుంటున్నారు. ఈ భాగంలో పరిసరాల పరిశుభ్రదత అనే కార్యక్రమానికి మరియు ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడానికి ప్రజలను చైతన్యం చేయడానికి

ఒగ్గుకథలు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ జిల్లతో పాటు అనేక జిల్లాల్లో ఇటువంటి సామాజిక అంశాల ద్వారా ప్రచారం చేయిస్తున్నారు.

ద: భారతదేశము వీర సోదరుడు
 వినుమన్నా నీవే మదిలో గనుమన్నా నీవే
 మంచి తరుణము మించిన దొరుకదు
 చెట్లు నాటుమన్నా చుట్టు కంచ పెంచుమన్న...

ద: పరిసరాల పరిరక్షణ కొరకు ముందుకు నడువుమన్న నీవే మందికి తెలుపన్న...
 ఇంటి ముందట పెంటకరువు ఉంచరాదురన్న ఉంచితే మంచిది కాదన్న...

ద: ఇంటి చుట్టు మరి చెత్త చెదారము ఉంచకూడదన్న ఉంచితే మంచిది కాదన్న
 పాములు తేళ్లు విషపు జంతువులు మెట్ట పెట్టువన్న మనుషుల కష్టపెట్టునన్న

ద: మురికి కాలువలు దుర్గంధాలు దూరముంచుమన్న చెడును పారతోయమన్న
 దగ్గు దమ్ములు గుండె జబ్బులు అంటు వ్యాధులన్న మనుషులను చంపిపోవునన్న...

ద: ఇంటి చుట్టూ మరి యిగలు దోమలు ఉంచరాదు సుమా వాటిని నిర్మూలించమన్న
 కక్కుడు కాలువకు కలరా వ్యాధులు మించిపోవునన్న మనుషులను చంపిపోవునన్న...

ద: వంట ఇంటిలో జిర్ర పురుగులు గోడ బల్లులున్న యెలుకలు బల్లి పాతరున్న
 ముందు చూచుకొని శుభ్రపరచుము మంచిగుంటదన్న మనకు మంచిగుంటదన్న...

ద: దేశమంతటా కంపెనీలాయెను విషము గాలి వచ్చే మనుషుల అంధుల గావించే
 ఊరుకు దూరము కంపిండుంచుట మించిది మనకన్న యెంతో మంచిది మనకన్న

ద: వాతావరణం కలుషితముంటే మంచిదికాదన్న
 అందుకే....
 చెట్లు పెంచుమన్న చెట్లు పెంచితే మందిది మనకూ
 ఆరోగ్యము గలుగు దేశము మంచిగుండునన్న

### 5.2.6. కుటుంబ నియంత్రణ

సమాజాన్ని చైతన్యం చేయడంలో జానపద కళారూపాల్లో ఒగ్గుకథకు ప్రసిద్ధస్థానం ఉంది. పల్లెల్లో ఉన్న మారుమూల ప్రాంతాలకు చెందిన ప్రజలు నిరక్షరాస్యులు అవ్వడం వల్ల కుటుంబ నియంత్రణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వరంగల్ జిల్లలో వివిధ మండలాల్లో కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని ప్రచారం చేయడానికి ప్రజల్లో అక్షర ఉజ్వల ఒగ్గుకథలను గానం చేయిస్తున్నారు. వీరిలో చుక్కా సత్తయ్య బృందానికి చెందిన

శిష్యవర్గం ఈ కార్యక్రమంలో విశేషంగా ఒగ్గుకథలను ప్రదర్శించి ప్రజలను చైతన్య పరుస్తున్నారు.

ద: వచ్చినది వరద పాటల తెప్ప చెదరింది... తెప్ప చెదరింది ॥అ॥
నల్లచీమల రీతి పిల్లలు పుట్టుచున్నారు... పెరుగుచున్నారు ॥అ॥

ద: కాల మహిమ తెలియదు మనకూ కానలేమయ్య గతులు చూడమయ్య
పుట్టల పురుగుల రీతి జనులు పుట్టుచున్నారు పృథివి నిండుచున్నారు

ద: ముందు పిల్లకు యెనుక పిల్లకూ యేడాది లేదాయే తల్లికి రెప్ప లేదాయే
పాలు చాలక రక్త మాంసమూ పీల్చుచున్నారు తల్లిని చంపుచున్నారు

ద: యెక్కువ పిల్లలను కంటె ముప్పు తప్పదోయన్నా ముందు నష్టమేయన్నా నష్టపడితే
చుట్టాలున్నా తెట్టిపెట్టరూ మనకూ అప్పులోయన్నా...

ద: అంతు లేక గంపెడు పిల్లలు కనుట యెందుకూ... కనుట యెందుకూ... ॥అ॥
ఆస్తికి మించిన పిల్లల కంటె అండి పొద్దామా ముందూ గంజి దొరకకా

ద: పాలు చాలక పుట్టిన పిల్లలూ బక్కచిక్కిరి... బొక్కలెల్లంగా ॥అ॥
చియ్యకళ్ళు చీమిడి ముక్కులూ నట్ట కడుపులూ పిల్లలూ బ్రతుకరోయన్నా...

ద: పుట్టిన వారికి వృత్తులు లేక బ్రతుకలేరయ్య గతులు కానలేరయ్య
తిండికి లేక దేశాలన్నీ తిరుగుతారయ్య బాధలు పడుతారయ్య

ద: గవర్నమెంట్ గ్రామాలు తిరిగి చెప్పుచున్నారు పిల్లలు యెక్కువ వద్దని
చెప్పిన మాట చేన పిట్టకా కంట ఉన్నారూ తిండికి చంపుచున్నారు...

వంత: అయ్యా... నీవు చెప్పినట్టుగా యెక్కువ సంతానము కని బాధపడ్డవారు యెవరైనా ఉన్నరా చెప్పవయ్య.

వ: రాళ్లపెల్లి అనే ఒక గ్రామముండెను ఆ గ్రామములో లింగయ్య అనే ఒక కాపురస్తుడుండే ఆ లింగయ్య భార్య లక్ష్మమ్మ సంతానము లేక యెదువింగ బాధపడ్డది.

ద: కొత్తకొండ, కొరవి తిరిగినది కొంత డబ్బు ఖర్చు పెట్టినది వేములవాడ
కొమురవెల్లిలోన కొండ భోనాలు గండదీపములు నిండు ప్రజలుతా చేసినది.

ద: డాక్టర్లను సంప్రదించినది మందులెన్నో వాడినది

ద: అంతలోగా లక్ష్మమ్మకూ అందినది గా కాన్పెమో అంతలోనే

ద: కన్నదమ్మ ఒక ఆడపిల్లను అందమైన బిడ్డనమ్మ కన్నదమ్మ ఒక్క
నాలుగేండ్లు అయిదేండ్లలో యిద్దరు ఆడపిల్లలను కన్నదమ్మ నాలుగేండ్లు

అయిదేండ్లు...

వ: యీ విధంగా యిద్దరు ఆడ పిల్లలు పుట్టిన వెంటనే లక్ష్మమ్మ హాస్పిటల్ కు వెళ్లిపోయి ఆపరేషన్ చేయించు కుంటున్నది అప్పుడు లింగయ్య కోపానికి వచ్చి నా వంశానికి ఒక మొగ పిలగాడు పుట్టేదనుక ఆపరేషన్ వద్దని భార్యని దెబ్బలు కొట్టి గుంజుకవచ్చాడు... లక్ష్మమ్మ వెంటనే తల్లిగారి ఇంటికిపోయి ఆపరేషన్ చేయించుకున్నది.

ద: ఒకనాడు లింగయ్యకు దుష్ట బుద్ధి కలిగింది...
పక్క వూర్కి వెళ్లిందు ఒక పిల్లను చూచిందు
తనకున్న ఆస్థంతా పిల్లపేర చేచిందూ
దొంగచాటుగా లింగయ్య పెండ్లి చేచుకున్నాడు
ఆ పిల్ల రాధమ్మ కాపురానికి వచ్చింది
వచ్చిన పిల్లను చూచింది పెద్ద భార్య లక్ష్మమ్మ
అయ్యో అయ్యో నా కర్మనీ ఆందోళన పడ్డది
కలిసిమెలిసి ఉండంగా కాన్పు అయింది రాధమ్మకూ
తొమ్మిది మాసాలు నిండి కన్నది వక పిల్లనూ...
యిది యేమి కర్మంటూ విలపించే రాధమ్మా

వ: కొంత కాలమునకు చిన్న భార్య చూచుకొని లింగయ్య పెద్ద భార్య లక్ష్మిని బాగా దెబ్బలు కొట్టి వెల్లకొట్టగా ఆ లక్ష్మి ఇద్దరు ఆడ పిల్లలను తీసుకొని ఒక పట్టణమునకు వెళ్లిపోయి ఒక యింట్లో బాసండ్ల పని చేసుకుంటూ ఇద్దరు పిల్లలను హాస్టలులో చేర్చింది.

ద: రాధమ్మకు రెండో కాన్పు అందవచ్చె ఓయమ్మ కర్మకాలి రాధమ్మ కన్నది ఒక పిల్లవాణ్ని పుడతానే ఆ పిల్లవానికి పోలియో వ్యాధీ వచ్చింది యిది యేమీ కర్మని విలపించే లింగయ్య

వ: యీ విధంగా యెంతో మంది ఆపరేషన్ చేయించుకోమని లింగయ్యకు రాధమ్మకు చెప్పిన వినక నాలుగో కాన్పుకు సరియైన ఆహారము లేక రాధమ్మకు నరాల వీక్ నెస్ వచ్చింది.

ద: కనలేక రాధమ్మ కన్ను మూసే ఓయమ్మ...

ద: తల్లిలేని పిల్లలను చేసిపోయే రాధమ్మకలకల కన్నీరూ వలపోయ వట్టెరే

రాధమ్మ కర్మలు దహనక్రియలు చేసిరీ

వ: లింగయ్య రాధమ్మ కలిసి కాపురము చేయంగా

ద: నలుగురు పిల్లలు కన్నది రాధమ్మ ఆ పిల్లల బాధలు లెట్టులున్నదీ నొప్పులు రోగాలు పోలియో వ్యాధులు గుండె జబ్బులు టి.బి. రోగాలు
ఆ పిల్లల బాధకేగలేక తండ్రి లింగయ్య ఆస్థిపాస్తులమ్మవట్టెను మందుల కొరకు

ద: పెద్ద భార్యకు ఇద్దరు చిన్న భార్యకు నలుగురు
ఆరుగురు పిల్లలు లక్ష్మి మెడకు పడిరీ ఆరుగురి పిల్లలతోటి లక్ష్మి పలు బాధలు పడుతున్నది అంది పొందక గంజి దొరకక ఆ పిల్లలకూ అనేక రోగాలు వస్తా ఉన్నవి తిన తిండి కట్ట బట్టలు లేకుంటపాయే పిల్లల తల్లి లక్షమమ్మకు టి.బి. వచ్చేనూ

వ: బాధలు భరింపలేక లక్ష్మమ్మకు టి.బి. వచ్చి హాస్పిటల్లో జైన్ చేశారు...
అన్నము లేక పిల్లలు బాధ పడుచుంటే లింగయ్య ఓక ధనవంతునివద్దకు వచ్చి అయ్య నా భార్య బాగలేదు 500/- అప్పు యివ్వమని అడిగాడు -షావుకారు వూరు నిండా అప్పులు యింటి నిండ పిల్లలు నా వద్ద డబ్బు లేదని వెళ్లిపోమ్మన్నాడు.
అధిక సంతానము అనర్ధానికి యెట్లా దారి తిస్తున్నదీ పిల్లలు బాధ పడలేక
ఆ రోజు రాత్రి

ద: తప్ప త్రాగి లింగయ్య తరలి బాట పట్టిండూ అర్ధరాత్రి లింగయ్య షావుకారి యింటికి దరువాద లేపిండూ ఇంట్ల పడి జొర్రిండూ ఇల్లంత సదురంగా నప్పుడామే వంటింట్లో సప్పుడికి లింగయ్యను దొరకపట్టిరి ఆ ఇంట్లో మెత్తగా కట్టేసి దెబ్బలు కొట్టిరి

వ: మెత్తగా దెబ్బలు కొట్టి పోలీస్ కు అప్పచెప్పిరి యేడేండ్ల శిక్ష పడ్డదిలింగయ్యకు యీసంగతి హాస్పిటల్లో రోగముతో బాధపడుచున్న రాధమ్మకు తెలిసి

ద: గప్పున గుండె పగిలింది కన్నుమూసే లక్ష్మమ్మ... అందుకే గవర్నమెంట్ ఒకరు ముద్దు ఇద్దరు హద్దు, ముగ్గురు వద్దు అని ప్రొత్సహిస్తుంది అని తెల్సుకొండి మా యన్నలారా... మా అమ్మలారా..." [1]

## 5.3. ప్రజా ఉద్యమాలు- ఒగ్గు కథాంశం

ప్రజా ఉద్యమకారులలో విలక్షణమైన వాగ్గేయకారునిగా పేరుగాంచిన గద్దర్ ఒగ్గు కళారూపాన్ని తనదైన బాణీలో వినూత్నంగా ప్రదర్శించారు. ప్రజలకు చేరువయ్యే భాషతో,

భావనలతో, గేయం, వ్యాఖ్యానాత్మక వచనం కలిపి పాడే గద్దర్ పాటలు ప్రజలందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. వారి పాట రూపంపై జానపద గేయాలతో పాటు ఒగ్గు కథ ప్రభావం కూడా ఉన్నట్లు తెలుస్తుంది. “తెలంగాణ ప్రజలకు ఒగ్గు కథ మీద ఉన్న మక్కువను గ్రహించి ఒగ్గు కథ బాణీలలో “రైతుకూలీ విజయం ఒగ్గుకథ” “నక్సల్బరి బిడ్డలు ఒగ్గుకథ” “రగల్ జెండా ఒగ్గుకథ” “కొమరం భీం ఒగ్గు కథ” “రైతుకూలీ పోరాటం ఒగ్గు కథ” మొదలైన వాటిని రాసి బాగా ప్రచారం చేశారు మున్నెబోయిన జయదేవ్, యాదవుల గద్దర్ తెలంగాణ ప్రజా వాగ్గేయకారుడు, ఉద్యమకారుడు, తన పాటతో ప్రజలను ఉత్తేజపరిచి ఉద్యమం వైపు నడిపించగల శక్తి ఉన్నవాడు. ఆయన తెలంగాణ మట్టి కళారూపమైన ఒగ్గుకథ ప్రజలను ఆకర్షించడాన్ని గమనించి ఉద్యమ ప్రచారానికి ఒగ్గుకథ కళారూపాన్ని వాడుకున్నాడు. ఉద్యమ అంశాలను ఇతివృత్తంగా తీసుకుని ఒగ్గుకథ గానంగా ప్రదర్శన చేసాడు. ఇలా గానం చేయడానికి ముందు నుండే గద్దర్ పాటలను గానం చేయడంలో ఒగ్గు కథలకు సంబంధించిన సంవిధాన నైపుణ్యాలు కనిపిస్తాయి. ఇతర గాయకుల –వలె పాట మొత్తం ఏకబిగిన పాడకుండా గద్దర్ పాట ఆగి, ఆగి సాగుతుంది. మధ్యలో అనుసంధాన వచనం,వ్యాఖ్యానం ఉంటుంది. చేతిలోని ఎర్రజెండాను పసిబిడ్డగా, నేలకొరిగిన విప్లవవీరునిగా భావించి హావభావ ప్రదర్శనతో పాటను గానం చేయడం గమనించవచ్చు. గానం మధ్యలో వాఖ్యానాత్మక వచనం, వస్త్రాన్ని ప్రదర్శనలో వ్యక్తిగా భావించడం వంటి అంశాలు ఒగ్గుకథ గాన ప్రదర్శనలో కనిపిస్తాయి.

ఎంతటి క్లిష్టమైన అంశాన్నైనా సాధారణీకరించి చెప్పగల సౌలభ్యం ఒగ్గుకథలో కనిపిస్తుంది. భాషాపరంగా వ్యవహారిక భాష ఉపయోగించడం వల్ల, అంశానికి తగ్గట్టుగా కథాగానాన్ని మార్చుకునే అవకాశం ఉండటం వలన ఒగ్గుకథ ప్రజలకు దగ్గర కావడానికి అవకాశం ఏర్పడింది. అందుకే గద్దర్ వంటి ఉద్యమకారులు ఒగ్గుకథ కళా రూపంలో ఉద్యమ ఇతివృత్తాన్ని అనువర్తనం చేసి ప్రదర్శించారు.

గద్దర్ “నక్సల్బరీ బిడ్డల ఒగ్గుకథ” కలేకూరి ప్రసాద్ “కారంచేడు ఒగ్గుకథ”, కామ్రేడ్ పద్మ “స్వర్ణక్క ఒగ్గు కథ” జననాట్యమండలి ద్వారా ప్రదర్శింపబడి విశేష ఆదరణ పొందాయి. ఈ కథ ప్రదర్శన అంతా ఒగ్గుకథ లాగా గేయ వచన మిశ్రమంగా వివిధ దరువులలో సాగింది. కథాగానం లో “రామ రామ” అనే దానికి బదులుగా ఉద్యమానికి సంబంధించిన “లాల్ ఘడీ”, “చదివే విద్యార్థి”, “రాడికల్”, “సై” వంటి పదాలను ఉపయోగించుకున్నారు. కళారూపం ఒగ్గుకథ అయినప్పటికీ ప్రారంభం, ఎత్తుగడ నుండి ముగింపు వరకు అవసరం

మేరకు వివిధ మార్పులు చేసి ప్రదర్శించారు.

"నలుగురు వీరుల కథనువు వింటావా లాల్ ఘడీ, నక్సల్బరీ బిడ్డల కథ లాల్ ఘడీ
చదువుకున్న వీరులంట చదివే విద్యార్థి, చాకులాంటి వీరులంట చదివే విద్యార్థి
సూర్యుడు సుధాకరుడు చదివే విద్యార్థి, వీరుడు మురళీమోహన్ భళి భళి విద్యార్థి
వీరుడు ఆనందరావు భళి భళి విద్యార్థి నలుగురికి నాయకుడు భళి భళి విద్యార్థి
సూరపనేని జనార్ధన్ భళి భళి విద్యార్థి మామూలు రైతుబిడ్డ భళి భళి విద్యార్థి
పోరాటం మహాబిడ్డ భళి భళి విద్యార్థి చదువుసంధ్యలు వదిలి భళి భళి విద్యార్థి
చక్కని బతుకుల వదిలి భళి భళి విద్యార్థి చేతిలో చెయ్యేసుకుని భళి భళి విద్యార్థి
కొన ఊపిరిపోయేదాకా భళి భళి విద్యార్థి పోరాటం చేస్తామంద్రు భళి భళి విద్యార్థి

పట్టణాలు వదిలిపెట్టి పల్లెకెళ్ళి నారమ్మ... ఓ...ఓ... పోరుజేయరన్నా, పోరాడుదామన్నా....**(గద్దర్, నక్సల్బరీ బిడ్డలు ఒగ్గుకథ)** అనే ఎత్తుగడలో ఎక్కడా ఇతర ఒగ్గుకథల వలె దేవతల ప్రస్తావన కన్పించదు. ఉద్యమవీరులపై ఉద్యమసాహిత్యంపై ప్రభుత్వంనిషేధం ఉన్న కాలంలో ప్రదర్శించడం వలన వీటి నిడివి కూడా తక్కువగా ఉండేది. ఈ విధంగా ఎత్తుగడలో ఉద్యమాలకు సంబంధించిన వీరుని ప్రస్తావన చేయడం కనిపిస్తుంది. ఉద్యమ కథాంశం అయినప్పటికీ ప్రతి పదంలో సహజమైన ప్రాస కనిపిస్తుంది. "చల్లంగ చదువును చాలిచ్చుకుందో రాడికల్ జనార్ధనన్నా అన్నా / మెల్లంగ ఊరిలో అడుగుపెట్టిండో రాడికల్ జనార్ధనన్నా అన్నా / ముగ్గురు తమ్ముళ్ళ వెంటేసుకుందో రాడికల్ జనార్ధనన్నా అన్నా" మెదక్ జిల్లాలోన అడుగు పెట్టిండో రాడికల్ జనార్ధనన్నా అన్నా" అంటూ జనార్ధన్ ఉద్యమ ప్రవేశాన్ని తెలియజేశాడు. "మెదక్ జిల్లాలోని ఓరి నాయనో మెతుకు లేని పల్లె ఉందిరో ఓరి నాయనో బతుకు లేని జనం ఉందిరో ఓరినాయనో నవాబుల కాళ్ల కింద నలిగిన పల్లెసీమ / భూస్వామి కాళ్ళకింద బూడిదైన బుజ్జి పల్లె రజాకార్ల భూస్వాముల రణము చేసి, ప్రాణమొడ్డి / రైతు బిడ్డల గన్న రతనాల పల్లెసీమ పల్లెపొంటి ఆమెడపొడవు పసుపేరు వారుతుంది / ఏటికి ఎడమపక్క కూలిపోయినమోట బాయి ఏటికి కుడిపక్కన కోటీశ్వరులూట బాయి / పెద్ద చెరువు కొమ్ము కింద పెద్ద పెద్ద దొర భూములు వరి పండే తరి పొలాలు పల్లె నేల దొరవారివి /చౌడు పొలం చాకలిది, మిర్ర పొలం మంగలిది ఒర్రె పొలం వడ్డెరది, తర్ర పొలం తలారిది / మాలోల్లకు మాదిగలకు ఇనామములు ఇసుక భూములు బురదనొక్కి బురద బుక్కి భూస్వామికి సేవ చేస్తే తర్రలన్ని పోవంగా తలకు తూమెడైనా రావు" (గద్దర్ నక్సల్బరీ బిడ్డలు ఒగ్గుకథ ఈ కథాగానం లో

కనిపించే పల్లె సీమ వర్ణన ఉద్యమ కాలం నాటి సామాజిక విశేషాలని తెలుపుతుంది. గ్రామంలో మంచి భూములన్నీ భూస్వాముల పెత్తందారుల చేతిలో ఉండగా, పనికిరాని భూములు ప్రజల చేతుల్లో ఉన్నాయని వర్ణిస్తూ పరోక్షంగా భూస్వాముల అన్యాయాన్ని ఆవిష్కరిస్తారు. బురద దొక్కి బురద బుక్కి వంటి ప్రయోగాలు వ్యవసాయ శ్రమ జీవన సంస్కృతిని వెల్లడిస్తాయి. నక్సల్బరీ బిడ్డలు ఒగ్గు కథలో వర్ణించిన దొర గడీల వర్ణన తెలంగాణ ప్రాంతంలో దొరల దౌర్జన్యాలను, శ్రమ దోపిడీని కళ్ళకు కట్టిస్తుంది. "ఊరికి నట్టనడుమ సయిపాల జంగడి – దొరవారి గడి ఉంది నయిపాల జంగడి, గడి చుట్టూ ప్రారి గోడ నయిపాల అంగడి – మెడలు నరికి మొద్దుంది, ఉరి తీసే కంబముంది– కుత్తుకలను తెంపేది కత్తుల బాయిఉందిరన్న... రీము టోపీ దీసేసి గాంధీ టోపీ పెట్టినాడు – స్వతంత్రం రాగానే సర్కార్ వానిదాయే" (గద్దర్ నక్సల్బరీ బిడ్డలు ఒగ్గుకథ) తెలంగాణ భూస్వాములను ఎదిరించిన వారిని దొర గడీలోని శిక్షించిన సందర్భాలు ఉన్నాయి. అటువంటి శిక్షల గురించి, శిక్షించే వస్తువులైన తలనరికే మొద్దు, కత్తుల బాయి, ఉరికొయ్య వంటి వాటిని వర్ణించారు. ఊరికి మధ్యలో ఉన్న గడీ ఊరంతటినీ తన అధీనంలో ఉంచుకున్నదనే విషయాన్ని, చుట్టూ ప్రహరీ గోడ ఉందనడం గడీలో జరిగే ఏ సంగతైన బయటి ప్రపంచానికి తెలియదని చెప్పడం వంటి అర్థాలను అభివ్యక్తం చేస్తున్నాయి. కాలం మారిన కొద్ది కాలానుగుణంగా మారిన ఊరి దొర, నిజాం రూమీ టోపీ తీసేసి గాంధీ టోపీ పెట్టడాని చెప్పి దొర అవకాశవాదాన్ని వెల్లడించారు. స్వతంత్రం రాగానే సర్కారే వానిదాయే అనే పాదం ఎంతో బలమైన ధ్వన్యాత్మకమైన భావాన్ని తెలుపుతుంది, స్వాతంత్ర్యంకోసం పోరాడి ప్రాణాలు కోల్పోయిన వారి ఆశయాలు మంటగలిపి, వచ్చిన స్వాతంత్ర్యాన్ని భూస్వాములు దొరలు అనుభవిస్తూ సాధారణ ప్రజలను బానిసలుగా చేసుకున్నారనే ధ్వని ఇందులో వెల్లడైంది.

"పల్లెకు కింది దిక్కు రామన్న ఓ లచ్చుమన్న
పీతిరి కుంటోకటుంది రామన్న ఓ లచ్చుమన్న
కుంటకు అటు ఇటు పక్కన రామన్న ఓ లచ్చుమన్న
మాల మాదిగ గుడిసెలు రామన్న ఓ లచ్చుమన్న
తలుపుంటే తాళముందదు రామన్న ఓ లచ్చుమన్న
గోశికుంటే తలకుండదు రామన్న ఓ లచ్చుమన్న
వజ్రపోయిన పాత చిప్పలు రామన్న ఓ లచ్చుమన్న(**గద్దర్ నక్సల్బరీ బిడ్డలు ఒగ్గుకథ)**

చినిగిపోయిన గోసి సింపులు రామన్న ఓ లచ్చుమన్న" తెలంగాణ పల్లెలలో దళిత వాడలను వర్ణించిన ఈ కథాగానంలో అంటరానితనం పేరుతో ఊరి చివరి దళిత వాడలో బ్రతికే ప్రజల పేదరికం కళ్లకు కట్టినట్లు వర్ణించబడింది. "రెక్కలే వాళ్ళ ఆస్తిపాస్తులు" అనడంలో దళితులకు ప్రభుత్వాలు ఏమీ చేయలేదని వారికి ఎలాంటి అస్తిపాస్తులు లేవు అనే విషయాన్ని వెళ్ళడిస్తుంది. కళ్లకు కట్టినట్లు వర్ణించబడిన దళితవాడల వర్ణన సమాజంలో వారి అణచివేతను వ్యక్తం చేస్తుంది.

"వారము కూలడిగితే మళ్ళీ వారం అంటాడు –మళ్లీ వారం అడిగితే బిల్లు రాలేదు అంటారు బిల బిల బిల బిల మాడిన బీడికి పైసియ్యడు–గుడికి వచ్చిన డబ్బులను గుటుక్కున మింగేస్తాడు. ఊరి చెరువు కొమ్ము కింద ఉన్నది నాటిస్తాడు – పొలం నిండి పొరలిన బొట్టు కిందికియునదు కాలువ దెంప పోతే ఖతం చేస్తానంటాడు – వాని ఏటికి ఎదురే లేదు మాటకి తిరుగేలేదు" **(గద్దర్ నక్సల్బరీ బిడ్డలు ఒగ్గుకథ)** ఈ వర్ణన గ్రామాల్లో పెత్తందార్ల మోసాలను దౌర్జన్యాలను, ఎదురు ప్రశ్నించిన వారిని చంపడాన్ని తెలుపుతుంది. ఒకనాటి తెలంగాణాలో ఎదురు లేకుండా సాగిన భూస్వామి దౌర్జన్యాలను తెలియజేస్తుంది. ఉద్యమ జీవితం వైపు ఆకర్షితులై చదువులు చాలించి ఉద్యమంలో చేరిన జనార్ధన్ అతని మిత్రులు గ్రామాల్లో పెత్తందారులకు బంజరు భూములను ఆక్రమించి పేద వారికి పంచి పెట్టారు. భరించలేని భూస్వాములు పోలీసుల సహాయంతో వారిని బంధించి ఎన్కౌంటర్ చేసి చంపారు.

"నలుగురు వీరూల చేతులు కట్టింగ్రో – అడవికి తెచ్చి వాళ్ల చెట్టుకు కట్టింగ్రో
చెట్టుకు కట్టివేసి హింసిస్తున్న సమయంలో – సూరపనేని జనార్ధన్ తన ఉద్యమకారులతో
ప్రాణం పోయినా పట్టు వదలవద్దురా – రెండుగ నరికిన గుండె బలం వీడకు
సూర్యుడు ఉండేదాక మనము ఉంటము – చుక్కలు ఉండేదాక మనము ఉంటము.
అని చెప్తుండగా కోపగించిన పోలీసులు...నేలకు తమ్ముడా నేలకొరిగి పోయారా
పచ్చని చెట్లన్ని ఎర్ర వారి పోయెరా –పావురాలు తమ్ముదా పరుగులు తీశాయిరా
**(గడ్డర్ నక్సల్బరీ బిడ్డలు ఒగ్గుకథ)**.

ఒగ్గుకథాగాన పద్దతిలో వివిధ పాత్రలుగా అభినయిస్తూ, అనుసంధాన వచనంతో గేయాన్ని వివిధ దరువులలోకి మారుస్తూ చేసిన ఈ కథాగాన వర్ణన ఉద్యమవీరుల స్థైర్యాన్ని, బూటకపు ఎన్కౌంటర్లను కళ్ళకు కట్టిస్తుంది. "పచ్చని చెట్లు ఎర్రబారి పావురాలు పరుగు తీశాయని చెప్పడం ద్వారా నక్సలైట్ల శాంతి చర్చల పేరుతో జరిగిన ఎన్కౌంటర్లను

అభివ్యక్తీకరించడం జరిగింది.

ఈ విధంగా సూరపనేని జనార్ధన్ అనే ఉద్యమ కారుని జీవితాన్ని కథాసూత్రంగా తీసుకొని భూస్వాముల కబంధ హస్తాలలో చిక్కి విలవిలలాడిన పల్లె సీమలను, దళితులపై పెత్తందార్ల దౌర్జన్యాలను, భూస్వాములు పోలీసులతో కలిసి ఉద్యమకారులను చంపిన విషయాన్ని గద్దర్ నక్సల్బరి బిడ్డలు అనే ఒగ్గుకథను సృష్టించి గానం చేశారు. దైవ సంబంధ కళారూపంగా ప్రారంభమైన ఒగ్గుకథ కళారూపం వినోదాత్మక కళారూపంగా మారడంతో పాటు ఈ విధంగా ఉద్యమ ప్రచార కళారూపంగా కూడా విశేష జనాదరణ పొందింది. సూరపనేని జనార్ధన్ జీవితాన్ని గద్దర్ ఒగ్గుకథగా గానం చేసినట్లుగానే స్వర్ణక్క అనే ఉద్యమకారిణి జీవితాన్ని కామ్రేడ్ పద్మ ఒగ్గు కథగా మలచి ప్రదర్శించారు. నల్గొండ జిల్లా దుప్పల్లి కి చెందిన మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చిన స్వర్ణ చదవడానికి నల్గొండ చేరి ఉద్యమ సంఘాల వైపు ఆకర్షితురాలై ఉద్యమంలో చేరి దండకారణ్యంలో గిరిజనులకు బాసటగా నిలిచి పోలీసులు ఎన్ కౌంటర్లో మరణించిన విషయాన్ని ఒగ్గు కథ గానంగా ప్రదర్శించారు.

"అలనాడు మన, పోరాటానికి అంకితమై పోరునడిపిన సుందరయ్య రాజేశ్వరరావు సాయుధ పోరు ముందుకు నడిపే నీతి నిజాయితీలమ్ముకున్నరు నీతి నిజాయితిలమ్ముకున్నరు. ఆయుధాలను కిందపడేసి సాయుధ పోరుకు సెలవు దీసుకొని నెహ్రూ కాళ్ళకు దండం బెట్టించ్రరో స్వర్ణమ్మ – ఎర్రజెండను ఎట్లా ముంచినారే స్వర్ణమ్మ"**(కామ్రేడ్ పద్మ స్వర్ణక్క ఒగ్గుకథ)**

ఈ విషయం భారత్లో తెలంగాణ విలీన కాలం నాటి విశేషాలని తెలుపుతుంది. ఒగ్గుకథలో స్వర్ణ తల్లి పాత్ర ద్వారా ఈ విషయం చెప్పడం లో ఔచిత్యం కనిపిస్తుంది. తాము ప్రాణాలకు తెగించి చేసిన కమ్యూనిస్టు పోరాటాన్ని నాటి కమ్యూనిస్టు నాయకులు కాంగ్రెసు వారు అమ్ముకుని దండకారణ్యంలో చేరిన స్వర్ణక్క గురించి తెలిపే సమయంలో దండకారణ్యంని వర్ణించిన తీరు హృద్యంగా సాగుతుంది.

"టీకుటాకున సోకున వెరిగె టేకు వనము జూడరోరన్నా
ఉద్యమాన్ని ఆగం చేశారని ఆవేదన కనిపిస్తుంది.
ఆకాశాన్ని ముద్దెదుతున్న మద్ది చెట్లను జూడరోరన్నా
ఆకును గాను నోటును అంటది, తునికి వనము జూడరోరన్న
దోపిడీ గుండెకు సూటి వెట్టిన కూలి రాళ్ళను చూడరోరన్న" **(కామ్రేడ్ పద్మ స్వర్ణక్క ఒగ్గుకథ)**

గిన్నె, గిలాను నేనే అంటది అడ్డాకును జూడరోరన్న స్వర్ణక్క ఒగ్గు కథలో కనిపించే ఈ అడవి వర్ణన దండకారణ్యంలో ఏపుగా పెరిగిన వివిధ వృక్షాలను గిరిజనుల అవసరాలు తీర్చే అడవిని వర్ణించి చివరి పాదంలో దోపిడి గుండెకు సూటి వెట్టిన కూలీల గురించి చెప్పడం అంతటి అందమై అడవిలో కూడా దోపిడీదారులు ఉన్నారని వారిని ఎదుర్కొనే ఉద్యమకారులు ఉన్నారని అభివ్యక్తీకరించడం జరిగింది. ఉద్యమం చివరిదాకా నమ్మిన సిద్ధాంతం కొరకు పోరాడిన స్వర్ణక్క జీవితాన్ని ఒగ్గు కథ ఒగ్గు కళారూపం వివరించడం జరిగింది. సాధారణంగా పురుషులు చేసే ఒగ్గు కథ గానాన్ని ఇక్కడ ఒక స్త్రీ కథా గానం చేయడం విశేషం. ఈ విధంగా వస్తువులో, ప్రదర్శనలో చివరికి గానం చేయబడే వ్యక్తిలో కూడా ఒగ్గుకథ అనువర్తనం చేయబడింది.

ఉద్యమ వీరుల ఇతివృత్తంతో పాటు దళితుల తిరుగుబాటును ఆవిష్కరించిన ఒగ్గు కళారూపం కలేకురి ప్రసాద్ గారి కారంచేడు ఒగ్గు కథ. నెల్లూరు జిల్లాలోని కారంచేడు కమ్మ. వర్గీయులకు మాదిగ పల్లె లోని ప్రజలకు మధ్య జరిగిన గొడవలను ఇందులో కథాంశంగా మార్చారు. ఈ ఒగ్గు కథలో వర్తమానంలోను, గతంలోనూ దళిత సమాజంపై పెత్తందారీ సమాజం యొక్క అణచివేత ధోరణిని తెలియజేస్తూ...

"ఏమని చెప్పుదునురా – సై, ఎంత అని చెప్పుదునురా – సై
కండకావరం దొరలురా సై, బాకులు బరిసెలు తెచ్చిరా సై
పల్లెలోని ఇళ్ల కూల్చే రా సై, వల్లకాదుగా చేసిరా సై
పంట కాలువల్లోనేర సై, నెత్తురు వారించారురా సై,
మదమెక్కిన దున్నలల్లెర సై, ఒకసారి మీద పద్ద రా సై
కాళ్లు పట్టుకున్న కానీ రా సై, కనికరించనే లేదురా సై
చూడలేని సూరీడు రా మబ్బు చాటు చేసుకున్నాడా" **(కలేకూరి ప్రసాద్ కారంచేడు ఒగ్గుకథ)**

ఈ కథాగానం లో కనిపించే వర్ణనలో గుండె తడి చేసే కరుణ రసం కనిపిస్తుంది. "చూడలేని సూరీడు మబ్బు చాటుకి వెళ్లడం" అనే విషయాన్ని కరుణ రసాత్మక వ్యక్తీకరణకు ఉపయోగించడం విశేషం కొడుకు మరణంలో తల్లి ఏడుపును వర్ణిస్తూ చివరికి పగతో నేను బతికి ఉంటే "నెత్తురప్పు" తీర్చుకుంటానని చెప్పిన మాటలు మాటలు ఆస్తిపాస్తులు లేకున్నా దళితుల ఆత్మస్థైర్యాన్ని, ధైర్యాన్ని తెలుపుతుంది. నెత్తురప్పు అనే విలక్షణమైన తెలుగు పద ప్రయోగం ప్రతీకార భావాలను వ్యక్తపరుస్తుంది. "ఒంటిగా ఉంటే గడ్డిపోచ మరి గాలికి

ఎగురుతుందోరన్న ఎంటి చుడితే ఏనుగునైనా కట్ట వేయురన్నా" అనే ప్రాసాత్మక సాధారణీకరణలు శ్రమజీవుల కష్టాలను, కలిసి ఉద్యమించాలని ఆకాంక్షను బలంగా వ్యక్తీకరించారు. దళితులకు జరిగిన అన్యాయానికి అధికారులు కోర్టుల ద్వారా న్యాయం జరగలేదనే విషయాన్ని గురించి తెలిపిన తీరు విలక్షణంగా ఉంది.

"తోడేళ్ళు మేకలకు తోడు రావు కూలన్న, జిల్లేదు పొదలకేమో మల్లెలుపూయవన్నా" అనే మాటలు వ్యవస్థపై ప్రజల అపనమ్మకాన్ని వ్యక్తం చేస్తుంది. డబ్బు అధికారం ప్రభావంతో. నిందితుల వైపు ఉన్న న్యాయవ్యవస్థలో పేదరికానికి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తమవుతుంది. ఈ విధంగా కలేకూరి ప్రసాద్ గారి కారంచేదు ఒగ్గు కథ ఇతివృత్తం దళితులపై దాడి ఉద్యమాల వంటి అంశాలు అయినప్పటికీ ప్రదర్శన, ప్రాసాత్మకమైన పదజాలం, అలంకారాలు సంవిధాన నైపుణ్యాలు అన్ని ఒగ్గుకథ ధోరణిలో కనిపిస్తాయి.

నక్సలైటు ఉద్యమాన్ని ప్రజాక్షేత్రంలోకి తీసుకుపోయిన కళారూపం ఒగ్గుకథ అనంతరకాలంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో కూడా ప్రధాన పాత్ర వహించింది. తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వాన్ని సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పడానికి అన్ని రకాల కళారూపాలు ధూంధాంగా ప్రదర్శించబడ్డాయి. కేవలం పండుగ సమయంలో ఎల్లమ్మ ఒగ్గు కథ గానంలో కనిపించే మిద్దెరాములు బోనం ప్రదర్శన మొదటిసారి తెలంగాణ ఉద్యమం కోసం లలితకళాతోరణం వేదికమీద ప్రదర్శించబడింది. నిజాం కళాశాల మైదానంలో నిర్వహించిన తెలంగాణ సంబరాలు కార్యక్రమంలో మిద్దె రాములు చుక్క సత్తయ్య ఒకే వేదిక మీద ఒగ్గు కథా గానం చేసి తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పింది. అప్పటివరకు వివిధ ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసిన ఒగ్గు కథకులు తెలంగాణ ఉద్యమం ప్రారంభం అయిన తరువాత వాటన్నింటినీ వదిలేసి ఉద్యమం కోసం కథాగానం చేస్తూ ప్రజలను చైతన్యపరచడంలో ప్రముఖ పాత్ర వహించారు ఊరి నుండి ఉస్మానియా విశ్వవిద్యాలయం వరకు ఉద్యమంలో ప్రతి సందర్భంలో ఒగ్గు కథ కళా రూపం ప్రదర్శించబడింది.

ఈ విధంగా పూర్తిగా దైవ సంబంధమైన కార్యక్రమాల కోసం ఆవిర్భవించిన ఒగ్గు కథ గానం వినోదాత్మకంగా సామాజిక వేదికల మీదకు చేరి అనంతరం ఉద్యమాలను వస్తువుగా స్వీకరించి ఒగ్గు కథ గానం ద్వారా ప్రజలను చైతన్యపరచడంలో కీలక పాత్ర పోషించింది.

### 6.4. తగ్గుతున్న ఆదరణ– కారణాలు

మారుతున్న మానవ జీవనం విధానం వంటి వివిధ పరిణామాల నేపథ్యంలో ఒకప్పుడు ప్రజావినోద సాధనాలుగా ఉన్న విశిష్ట జానపద కళారూపాల్లో ఒకటైన ఒగ్గుకథ క్రమంగా తెరమరుగై కనుమరుగైపోతున్నాయి. దీనికి అనేక కారణాలు కన్పిస్తున్నాయి. వాటిలో ప్రపంచీకరణ ప్రభావం, సాంకేతిక విప్లవంతో వివిధ రకాల సామాజిక వినోదాంశలు అందరికి అందుబాటులోకి రావడం వల్లన వర్తమాన కాలంలో ఒగ్గుకథ నానాటికీ బలపడుతుంది.

### 5.4.1. ప్రపంచీకరణ వల్ల నష్టాలు

ప్రపంచీకరణ ప్రభావంతో వర్తమాన సమాజంలో అనేక మార్పులు సంభవించాయి. సమాజంలోని అన్ని రంగాలపైనా ప్రభావం చూపిన ప్రపంచీకరణ వలన జానపద సాహిత్యానికి కొంత మేలు మరికొంత కీడు కలిగింది. ఒక దేశంలో పుట్టిన ఒక సాంకేతిక ఆవిష్కరణ మరో దేశానికి ప్రయాణించడం, దాని వలన జరిగే ఫలితాలు జాతి భేదం లేకుండా అందరికీ అందుబాటులోకి రావడమనేది ప్రపంచీకరణలో ఒక భాగం. 1990 తరువాత చెప్పబడుతున్న. ప్రపంచీకరణ ప్రధానంగా ఆర్థిక రంగానికి సంబంధించినదే అయినప్పటికీ సామాజిక కోణంలో ఆలోచిస్తే ప్రపంచీకరణ అనేది చాలా విస్తృతమైంది. "ఒక దేశం లో పుట్టిన జానపదకళ గాని, జానపదకళా రీతిగానీ మరో దేశానికి ప్రయాణించడం, అక్కడ స్థిరపడటం కూడా ప్రపంచీకరణమే అవుతుంది."[2]

ఈ అభిప్రాయాన్ని పరిశీలించినపుడు ఒక దేశంలోని కళారూపం మరో దేశంలో స్థిరపడటంతో పాటు ఒక ప్రాంతానికి, సమాజంలో ఒక ప్రత్యేక వర్గానికి మాత్రమే పరిమితమైన కళారూపం మరో ప్రాంతానికి, సమాజంలోని ఇతర వర్గాల వారికి అందుబాటులోకి రావడం. కూడా ప్రపంచీకరణ అవుతుంది. తెలంగాణ ప్రాంతంలో కురుమ యాదవుల కుల హద్దులలో ప్రారంభమైన ఒగ్గుకథ ప్రదర్శన కళారూపం కుల హద్దులు దాటి సామాజిక వేదికల మీద ప్రదర్శింపబడి అన్ని వర్గాల వారికి వినోదాన్ని కలిగిస్తూ, క్రమంగా ఇతర ప్రాంతాలలో, దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ ఇతర దేశాల్లోనూ ప్రదర్శింపబడి విశిష్టమైన గుర్తింపును పొందగలిగింది. ప్రపంచీకరణ ప్రభావంతో అందరికీ అందుబాటులోకి వచ్చి ఎన్నో జానపద కళారూపాల అంతర్ధానానికి పరోక్ష కారణమైన టెలివిజన్ 1996 నాటికి వివిధ ప్రైవేటు సాటిలైట్ ఛానల్లు ప్రారంభమై గ్రామీణుల తీరిక సమయాన్ని కబళించి వేసింది. టెలివిజన్ అందుబాటులోకి రావడం అందులో నిత్యం

సినిమాలు, సీరియల్ల వంటి అంశాలు గ్రామీణ సామాజిక జీవితం మీద, జానపద ప్రక్రియల మీద తీవ్రమైన ప్రభావాన్ని చూపాయి. గతంలో శ్రమ జీవనంలో అలసిపోయిన జానపదులకు వివిధ జానపద కళారూపాలు వినోదాన్ని అందించి సేద తీర్చేవి. వృత్తి కళారూపాలతో పాటు సామూహికంగా వివిధ రకాల జానపథ ఆటపాటలతో గ్రామీణులు తమ తీరిక సమయం గడిపేవారు. టెలివిజన్ రాకతో ఈ తీరిక సమయమంతా జానపద కళారూపాల నుండి టెలివిజన్ వైపు మళ్ళించడం జరిగింది. ఈ పరిణామం సాంకేతిక విప్లవం ఫలితంగా ఏర్పడిన సెల్ఫోన్ రాకతో, స్మార్ట్ ఫోన్ల రాకతో మరింతగా పెరిగింది. జానపదుల తీరిక సమయాన్ని పూర్తిగా కబళించిన ఇలాంటి సాంకేతిక ఆవిష్కరణల వలన కీడుతో పాటు కొంతవరకు మేలు కూడా కలిగింది. ఒక ప్రాంతానికి చెందిన కళారూపాలు గురించి ఇతర ప్రాంతీయులు తెలుసుకోవడానికి అవకాశం ఏర్పడింది.వీటివలన సినిమా మాధ్యమం సామాన్యులకు అందుబాటులోనికి రావడంతో అనేక జానపద కళారూపాల ప్రదర్శనలో సినిమా ప్రభావం చోటుచేసుకుంది. ముఖ్యంగా వేషధారణ, భాషా ప్రయోగం ప్రదర్శనలలో ఈ ప్రభావం ఎక్కువై ఆయా కళారూపాల మౌలిక లక్షణాన్ని సైతం దెబ్బతినే ప్రమాదం కలిగించాయి.

ఇలాంటి ప్రపంచీకరణ ప్రభావం వలన ఏర్పడిన విషమపరిస్థితులను తట్టుకొని నిలబడిన జానపద ప్రదర్శన కళారూపం ఒగ్గుకథ ప్రదర్శన. ఒకవైపు మౌలికమైన ప్రదర్శన నియమాలను, సంవిధాన నైపుణ్యాలను కాపాడుకుంటూ భాషలో ఇతివృత్తంలో, ప్రదర్శనలో సమాజానికి అనుగుణమైన మార్పులను సంతరించుకున్నది. అందువలన ప్రపంచీకరణ. ప్రభావంపలన ఎన్నో కళారూపాలు కాలగర్భంలో కలిసిపోయి కనుమరుగైనప్పటికీ, ఒగ్గుకథ ప్రదర్శన మాత్రం నేటికీ అన్ని తరాల వారిని, అన్ని వర్గాల వారిని అలరిస్తూ, సామాజిక వినోదాన్ని కలిగించే కళారూపంగా ప్రత్యేకతను చూపుతుంది.

### 5.5. పరిరక్షణ మార్గలు– తీసుకోవాల్సిన చర్యలు

ప్రపంచీకరణ ప్రభావమనేది అన్ని సాంప్రదాయక కళల మీద పడటం చూస్తున్నాం. మరి ప్రధానంగా సోషల్ మీడియా ఇప్పుడు దుమ్ముదులుపుతుండటంతో కళను ఆదరించేవారి సంఖ్య బహిరంగంగా తగ్గింది. కళలను కాపాడుకోవడం అనేది మీడియా ప్రకటనల వరకూ మాత్రమే పరిమితమైంది.

మానవ జీవనాన్ని ప్రతిబింబించేది కళ. ఎందుకంటే తన హావభావాలను వ్యక్తం చేసేయడానికి తనతోటివారికి ఆనందాన్నివ్వడానికి సృష్టించుకోబడినది కళ. కాబట్టి దీనికి

చావు అంటూ ఉండదు. ఒకతరం నుండి మరొకతరానికి వ్యక్తి కరణలు మారుతున్నప్పుడు కొన్నింటి అవసరం లేదను గుంటాం. అసలు కళయొక్క ప్రాధాన్యతను వివరించడంలో మన పరిశోధకులు, పూర్వీకులు కొన్ని విషయాలు మరిచి పోతున్నారు. కళ మానసిక వికాసం కలుగజేస్తుంది. బాధల్ని పోగొడుతుంది. శారీరక వ్యాయామం దీనిద్వారా సాధ్యం. అలాగే ఒకతరంలోని విషయాలను, సంస్కృతిని, సాంప్రదాయాన్ని ప్రవహింపచేస్తుంది. ఇది ప్రసరిస్తుంది. కాబట్టి కాపాడాల్సిన అవసరం ఉంది. జర్మనిలో జనం మన సాంప్రదాయ సిద్ధాంతాల్ని పాటిస్తూ నేటికీ సంపూర్ణ ఆయుర్దాయం కలిగియున్నారంటే వారు దేన్ని కాపాడుతున్నారో తెలుసుకోవాలి.

**తీసుకోవాల్సిన చర్యలు :**

1. జానపద కళలు, క్రీడలు పాఠ్యాంశాల్లోనే కాకుండా ప్రదర్శనలకు తావిచ్చే ప్రయోగ విధానాలు రూపకల్పన చేయాలి.
2. ఉదయం, సాయంత్రం ఆయా కాలాలననుసరించి జానపదుల జీవనవిధానాలు సృష్టిపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలి.
3. సాంప్రదాయ స్థితుల ప్రయోజనాలు, సంస్కృతి ప్రసరణ
4. మారుతున్న సాంకేతిక విధానాల వల్ల కళలకు కలిగే నష్టం, మరియు ప్రయోజనం తెలియజేయాలి.
5. ప్రభుత్వం జానపదవిజ్ఞానం, కళలుకు సంబంధించిన మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి.
6. ఏదైనా మాధ్యమం ప్రవేశించినప్పుడు దాని వల్ల కలిగే నష్టాలను ముందుగానే అంచనావేసి, సాధకబాధకాలను వివరించే ఏర్పాటు చేయాలి.
7. ప్రపంచీకరణ అనగనే కేవలం వ్యాపార దృక్పథం అని తెలిసినప్పుడు, భోగి పిడకల్ని ఆన్ లైన్ లో అమ్మి వ్యాపారం చేస్తున్నప్పుడు, వినోదాత్మక అంశాలు, వస్తువులు, ప్రదర్శనలు విషయంలో ప్రభుత్వాలు నిర్మాణాత్మక నిర్ణయాత్మక చర్యలు చేపట్టాలి.
8. టిక్ టాక్,ఇన్ స్టా గ్రామ్ వంటి దృశ్యమాధ్యమాలలో పాతపాటలకి అభినయం చేస్తున్న ప్రజలు త్వరిత గతిన సాంప్రదాయాల వైపు వస్తారనే నమ్మకాన్ని ఏర్పాటు చేస్తున్నాయి.
9. ప్రపంచీకరణ ప్రభావం గత రెండు దశాబ్దాల పాటు కొనసాగుతున్న మాట వాస్తవమే అయినా దీనివల్ల జీవన విధానాల్లో ఎడతెగని అవరోధాలు, ఆటంకాలు కలుగు తున్నాయని భారత ప్రభుత్వం ఇప్పటికైనా గమనించాలి. కరోనా వంటి వైరస్‌ల త్వరితగతిన

ప్రబలినప్పుడు. సాంకేతికత ఎంతవరకూ రక్షించింది. ఏ దేశమూ వ్యాపార లావాదేవీలనూ కొనసాగించనివ్వలేదు. అదే సాంప్రదాయ జీవనవిధానంలో భారతదేశం దానికి విరుగుడును కనిపెట్టే పనిని చేపట్టింది. కాబట్టి జానపద విజ్ఞానమనేది మనకున్న నిండైన సంపదగా భావించాలి.

10. జానపదులు జీవన పథాల్ని మనకు అందించిన దైవాలుగా భావించాలి. అప్పుడే మనం వీటిని తర్వాతి తరాలకు అందించగలం.

5వ అధ్యాయం

# పాద సూచికలు

1. చుక్కా సత్తయ్య, ఒగ్గుకథలో నేటి సామాజిక అంశాలను పరిశోధకురాలికి చెప్పిన విశేషాలు.
2. జయధీర్ తిరుమలరావు, జానపద విజ్ఞానం, పుట. 28

# ఉపసంహారం

కళారూపాల ఆవిర్భావానికి, నృత్యగాన పుట్టుకకు, కావ్యసృష్టికి, మానవ నాగరికతకు మూలం జానపదమే. అందుకే జానపదమే జ్ఞానపథమన్నారు విజ్ఞులు. జానపద కళలు మహోన్నతమైన మన దేశ సంస్కృతికి పట్టు కొమ్మలు. మానవ నాగరికతా వికాసంలో వీటి పాత్ర అనన్య సామాన్యం. పురాణ గాథల ఆధారంగానే ఈ కళారూపాలు విస్తృతమై వైవిధ్యభరితంగా తయారైనాయి. అలాంటి కళారూపాల్లో వృత్తి కళాకారులు చెప్పే ఒగ్గు కథ ఒకటి. తెలంగాణకే సొంతమైనది ఈ ఒగ్గు కళారూపం. జానపద కళల్లో వృత్తి కళాకారులు సేవ మరువలేనిది. వందల సంవత్సరాలుగా ఈ కళారూపం సజీవంగా ఉంటూ వస్తున్నదంటే వారిని ప్రశంసింపవలసిందే. ప్రాచీన కళారూపాలను వృత్తి కళాకారులు ఆధునీకరిస్తూ దేశీ కళనే ఎంతగానో సుసంపన్నం చేస్తూ వస్తున్నారు. అందుకు యావత్ తెలుగు ప్రజలు వారికి రుణపడి ఉంటారనేది విస్మరించొద్దు.

జానపద కళలకు నామకరణం కళాకారులు. ఉపయోగించే వాద్యాలవల్లే చేసినట్టుగా కనిపిస్తోంది. ఒగ్గు కళా ప్రదర్శనకు ఉపయోగపడే 'ఒగ్గు' వాయిద్యం కారణంగా ఈ కళకు 'ఒగ్గు' అనే పేరొచ్చింది. వైవిధ్యమైన ఒగ్గు కళ తెలంగాణ ప్రాంతంలో మాత్రమే సజీవంగా ఉంది. జముకుల కథ, బోనెల కథకు సాటివచ్చే వైవిధ్య కళ ఒగ్గు కథకుండడం విశేషం. కురుమ జాతికి పూజారులగా ఉన్న ఒగ్గులు ఈ కథా ప్రదర్శనని అద్భుతంగా ప్రదర్శిస్తారు. ఒక్క తెలంగాణలోనే దాదాపు 500 పైగా ఒగ్గు కళా బృందాలు తమ కథా ప్రదర్శనల ద్వారా ప్రజలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం తమ పథకాల ప్రచారం కోసం నియమించిన కళారూపాల్లో ఓ ఒగ్గు కథకే పెద్ద పీట వేసింది.

ఒగ్గులు చెప్పే కథల్లో ఇతిహాసాలే ఎక్కువ. వాటిలో మల్లన్న, బీరన్న కథలు ఆ జాతి చరిత్ర, సంస్కృతులను ప్రతిబింబిస్తున్నాయి. ఉత్పత్తి కులాలకు చెందిన వృత్తి గాథలో మల్లన్న కథకు అధిక ప్రాధాన్యమే ఉంది. ఇది జానపద పురాణమే అయినప్పటికీ శిష్ట పురాణాలంత పవిత్రతని, ప్రాధాన్యాన్ని సంతరించుకొంది. గోగులూరి కొల్లాపురాన్ని పాలించే ఆదిరెడ్డి నీలమ్మల కొడుకు మల్లిఖార్జునుడు. సంతానం కలిగిన తర్వాత ఆదిరెడ్డి దంపతులు శివనామస్మరణ మరుస్తారు. అప్పుడు శివుడు తన బిడ్డ అయిన ఎల్లమ్మతో కొల్లాపురాన్ని పాడు చేయిస్తాడు. సంపద కోల్పోయిన వారు బతకడానికి పొరుగు దేశానికి పోతే శివభక్తిలేని వారిని కూలికి కూడా పిలవలేదు. ఉండడానికి ఇల్లు కూడా దొరక్క అడవుల పాలవుతారు. ఇదంతా శివుని కోపంవల్లే జరిగిందని ఆయన్ని వేడుకొన్నంతనే పూర్వవైశబ్దం సమకూరింది.

అప్పుడప్పుడే ఎదుగుతూ వచ్చిన మల్లన్న దానం చేసేం దుకు పూనుకున్నాడు. దానధర్మాలు పెళ్లైన వారు చేస్తేనే పుణ్యముంటుందని మాయా శివుడు చెప్పగానే పెళ్ళి వైపు మనసు మళ్లింది. అంతే ఆయన వరసగా భ్రమరాంబను, రత్నాంగిని, మ్యాడల దేవిని, గొల్ల కేతమ్మలను పెండ్లాడాడు. ఇక్కడ నలుగురు వధువులు నాలుగు వర్ణాలకు ప్రతీకలు. మల్లన్న మక్కా దేశానికి వెళ్లి పసుపు (భండారి) సాధించుకు రావడం ఒగ్గు కథల్లో వీరోచిత ఘట్టంగా వర్ణితమైంది. సాక్షత్తు శివుడే మల్లిఖార్జుననిగా అవతరించాడని కురుమ జాతి విశ్వాసం.

ఒగ్గు కథలో రెండో వీరోచిత గాథ బీరన్నది. శివ పురాణంలోకి వీరభద్ర విజయం కథలో ఈ బీరన్న వీర భద్రుని అవతారమని పేర్కొంది. ఈయన చేతిలోని ఖడ్గం జాంబవతుని నుండి లభించిందంటారు. దైవాంశ సంభూతుడైన బీరన్న నాగులకొండ (కాశీ) రాజు గర్వమణచడానికే పుట్టడమే గాదు ఆయన కూతురైన కామారతిని పెండ్లి చేసుకొంటారు. వీరభద్రుడే బీరన్నగా అవతరించడాని కురుమజాతి విశ్వసిస్తోంది.

ఒగ్గు కథా గాన ప్రదర్శనంతా దాని సాహిత్యం ద్వారానే ఆదరణ పొందుతోంది. ఒగ్గు కథలు వీర రసాత్మకమైనవి. డోలు, పిల్లనగ్రోవి, పెద్ద తాళాలు, వీరణం లయాత్మకంగా మోగుతుంటే వేదిక దగ్గర ఉద్రిక్త వాతావరణం వెల్లి. విరుస్తోంది. ఒగ్గు కథలో జాతీయాల్లాంటి వచనాలు, దర్పుల్లో పోటీలు, చల్తీలో గానప్రవాహం ఉరుకులు పెడుతుంది. కథకుని ప్రతిభంతా కథనాన్ని శృంగార, హాస్యలు పండించడంలోనే రాణించింది. అన్ని వర్గాల శ్రోతలను మైమరిపించే సాహిత్యమైనందువల్ల ఒగ్గు కథా సాహిత్యమంతా ప్రజా సాహిత్యంగానే గుర్తించారు. ఆ ఒగ్గు కథ సాహిత్యం మేలైన సాహిత్యంగానే పరిగణించడానికి కారణాలను పరిశీలిద్దాం. ఒగ్గు కథా గానమంతా ఏలల్లో లయ ప్రధానంగా సాగిపోతుంటుంది. దోచేస్తుంది. అంతేకాదు వారలను వర్తనాలైతేనేమి, వర్ణ వ్యత్యయాలు, నూతన పద గుంఫనాణాలెన్నో వృత్తి సంస్కృతిలోంచి పుట్టాయి. మరీ ముఖ్యంగా దీహెనా గేయాలు, సుడి సుద్దులు సామాన్య హృదయాలను సైతం రసరమ్యం చేస్తాయి.

జానపద వర్గీకరణకు ఉన్నటువంటి మోఖిక సాహిత్యం, వాస్తు సంస్కృతి, జానపద సాంఘిక ఆచారాలు, జానపద ప్రదర్శన కళలు, జానపద భాష, ఈ జానపద ప్రదర్శన కళలో ఉన్నటువంటి కళారూపాలు తోలు బొమ్మలాట, యక్షగానం, బుర్ర కథ, గొరగ నృత్యం, కోలాటం, కురవంజి, తప్పెటగుళ్ళు, గుర్రపు నృత్యం, కురవ నృత్యం, కప్పల కావడి, జట్టిజాము మొదలైనవి. కళారూపాలు, వీటిలో ఉన్నటువంటి “ఒగ్గు” జానపద

కళాకారులు ముఖ్యులుగా చెప్పుకోవచ్చు. వీరు యాదవ భిక్షు గాయకుల్లో ప్రసిద్ధులు. వీరిని బీరప్పలు అని కూడా అంటారు. వీరు తెలంగాణలో అధికం. "ఒగ్గు" కళాప్రదర్శనలో మిద్దె రాములు, చుక్క సత్తయ్య ప్రసిద్ధులు.

పల్లె ప్రజల యొక్క జీవితగాథల్ని కష్టసుఖాల్ని నిజ జీవితంలో జరిగినటువంటి చరిత్రను ఒక కళారూపంలో నటన రూపంలో వేషధారణ పాత్రలతో మన కళ్ళకు కట్టినట్టుగా రాగా తాళాల శబ్దాలతో చూపిస్తు తరతరాల పురాణాలుగా అందించే అద్భుతమైన కథ "ఒగ్గు కథ" ఈ ఒగ్గు కథలు జానపద కళారూపాల్లో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నాయని చెప్పవచ్చు.

జానపద ప్రదర్శన కళారూపాల్లో ఒగ్గు కథకు ఒక ప్రత్యేకత వుంది. పల్లే ప్రజలకు వినోదాన్ని, ఆనందాన్ని పంచేవిదంగా ఒగ్గు కథలుండేవి. ఒగ్గు కళారూపాల్ని ప్రదర్శించే వారు ముఖ్యంగా "ఒగ్గు" అనే వాద్యాన్ని ఉపయోగిస్తారు. "ఒగ్గు" అనే పదానికి అర్థం "బందించడం" చర్మ విశేషమైనవని చెప్పవచ్చు. ఒగ్గు అనేది శివుని యొక్క "డమరుకాన్ని" "ఒగ్గు" అని, ఒగ్గు కథలు "ఒగ్గు" కళాప్రదర్శనలు అని పిలువడం జరుగుతుంది. వీరు ఒగ్గును ఉపయోగించి కథను చెప్పడం వలన దీనికి "ఒగ్గు కథ" అనే పేరు వచ్చింది. "ఒగ్గు" కథను చెప్పే వాళ్ళను ఒగ్గు వాళ్లు అని, బీరప్పలు అని అంటారు. వీళ్ళు చెప్పెటటువంటి కథలు ప్రధానంగా వీరశైవానికి సంబంధించినవిగా ఉంటాయి. వీటిలో బీరప్ప కథలు, మల్లన్న కథలు, ఎల్లమ్మ కథలు మొదలైనవి చెపు తుంటారు. ఒగ్గు కథలు చెప్పేవారు తప్పకుండా "ఒగ్గు దీక్ష" తీసుకోవాలి. ఇది వారి యొక్క ఆచారం. ఈ దీక్షను శ్రీశైలం, వేములవాడ క్షేత్రాల్లో ఇవ్వడం జరుగుతుంది. దీక్ష 40 రోజుల పాటు ఉంటుంది. ఒగ్గు ప్రధాన నాయకుడి చేతులో ఉంటుంది.

ఒగ్గు అంటే డమరుకం అని అర్థం. మహేశ్వరుని డమరుకం నుండి పుట్టిన నాలుగు అక్షరాలు నుండి ఒగ్గు పుట్టిందని. ఇదే సమస్త కళలకు మూలమని ఒగ్గు కళాకారుల అభిప్రాయం ఒగ్గు కథలు మొదటగా " రామ " అనే పదంతో మొదలు పెడతారు. ఈ యొక్క ఒగ్గును జాతర సమయంలో దేవాలయాల్లో దేవున్ని మేల్కొపుటకు "ఒగ్గును" ఉపయోగిస్తారు. రెండు వందల సంవత్సరాల క్రితం వీరభద్రుడు, మల్లిఖార్జునుడు వీరి చేతుల్లో ఉండే వాద్యం డమరుకం (ఒగ్గు) ధరించి గొట్టెలను కాచుకుంటూ ఈ ఒగ్గుతోనే అడవుల్లో చెట్ల కింద కథలు చెప్పేవారు " రాను రాను" ఈ ఒగ్గుతో ఉపయోగించి కథను

చెప్పడం వలన "ఒగ్గు" కథగా ప్రసిద్ది చెందింది. చుక్క సత్తయ్య గారి మాటల్లో ఒగ్గు అంటే డమరకుం "ఓంకారం" లో పుట్టిందని, భారతంలో శ్రీ కృష్ణుడు కుంతీ దేవికి చెప్పాడని, ఒగ్గు ఎవరి ఇంట్లో ఉంటే వాళ్ళింట్లో శివుడున్నట్టే అని ఒగ్గు శబ్దంలో ఓంకారం ఉంటుందని సనాతనమైన అర్థనారీశ్వరునితో పుంటిందని సత్తయ్య గారి అభిప్రాయం.

ప్రముఖ ఒగ్గు కళాకారుడు చిట్టి కొమురయ్య ప్రకారం ఒక కురుమ పిల్లవాడు ఆనాటి కాలంలో జరిగిన ఎటువంటి ప్రదర్శనలు చూడలేదని బాదపడుతుంటే శంకరుడు చూసి అతనికి జంగమయ్య రూపంలో దర్శనమిచ్చి ఆ పిల్లవాన్ని ప్రశ్నిస్తాడు. అతుడు చెప్పిన మాటలు విని అతనికి ఒక వరం ఇస్తాడు నీ నాలుక ఒక కాగితం, నీ కొండ నాలుక ఒక కలం, నీ స్వరమే ఒక రాగం నీకిది శృతిలేని కథ అవుతుంది అని రామాయణం కన్నా హెచ్చుగా పోలేవు. భారతం కంటే బహు బాగా పోతావు అని వరమిస్తాడు. అలా చెపుతున్న సమయంలో గొర్లు పోతుంటే కురుమ పిల్లడు జప్ప జప్ప చెప్పు స్వామి అని అంటాడు అప్పుడు శివుడు అడవిలో తన మహిమతో ఒక దిక్కున రాగి చెట్టు మరో దిక్కు మర్రి చెట్టు సృష్టించి వాటి పేర్లను చెప్పించి వాటిలోని మొదటి అక్షరాలను కలిపి చెప్పమనగానే "రామ" అని పలుకుతాడు. వాటిని వెంట వెంటనే పలుకమనగానే రామ రామ రామ రామ అని పలుకుతున్న సమయంలో బాలుని నాలుకను బయటకు లాగి నాలుకపై నాలుగు అక్షరాలు రాస్తాడు. ఇదే నీకు శాస్త్రమని దీని ద్వారా ఏ కథ అయినా వస్తుందని చెప్పి శివుడు వెళ్లిపోతాడు. ఈ విధంగా శంకరుని వల్ల ఒగ్గు కథ పుట్టింది అని అతని అభిప్రాయం. అందుకు. "ఒగ్గు" కళాకారులు మొదటి "రామ శబ్దం" తో కథను మొదలు పెడుతారు.

ఒగ్గు కథ నేపథ్యం పరిశీలించినట్లయితే ఒగ్గు కథలు శ్రీరామ ........ వివిధ రకాలుగా ఉంటాయి. ఇందులో జానపద పౌరాణిక, కథలు, చారిత్రక కథలు కల్పితాలు, ప్రార్ధనతో దేవతలను తలుచుకొని మొదలైనవి ఉంటాయి.

# ఉపయుక్త గ్రంథసూచి


1. ఆదిశేషువు, హరి. 1954. జానపద గేయ వాఙ్మయ పరిచయం. మహోదయ ప్రెస్, శ్రీకాకుళం.
2. కృష్ణ కుమారి, నాయని. 1977. తెలుగు జానపద గేయ గాథలు. ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాద్.
3. కృష్ణారావు, నాళము. 1940. (సం.) తెలుగు జాతీయములు. లక్ష్మీ గ్రంథ మండలి,తెనాలి.
4. గంగాధరం, నేదునూరి. 1960. (సంకలనం) పసిడి పలుకులు. జాతీయ జ్ఞానమందిరం, మద్రాసు.
5. గంగాధరం, నేదునూరి. 1961. జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి .
6. గౌరీశంకర్, జూలూరు. 2016. తెలంగాణ కళలు, సంస్కృతి. అడుగుజాడలు ప్రచురణలు, హైదరాబాద్.
7. లక్ష్మీనారాయణ,గంగిశెట్టి. 1977. పండుగలు-పబ్బాలు, అంతర్జాతీయ తెలుగు సంస్థ, హైదరాబాద్.
8. యాదయ్య,చింతల. 1995. నల్లగొండ జిల్లా జాతరలు-పరిశీలన. పద్మావతి ఆర్ట్ ప్రింటర్స్, 1-1-517/బి/1, న్యూబాకారం, గాంధీనగర్, హైదరాబాద్.
9. గౌరీశంకర్, జూలూరు. పెన్నా శివరామకృష్ణ. తెలంగాణ సంస్కృతి-కళలు. శ్రీబాలాజీ గ్రాఫిక్స్, గోల్నాక, హైదరాబాద్.
10. తెలుగు సామెతలు - జనజీవనం. 2009. తెలుగు అకాడమీ, హైదరాబాద్.
11. డా॥సి.వసుంధరా రెడ్డి. తెలుగు జానపద సాహిత్యము - స్త్రీల గేయములలో సంప్రదాయము (ఆంధ్రసారస్వత పరిషత్తు) హైదరాబాద్.
12. తెలుగు జానపద విజ్ఞానం సమాజం సంస్కృతి - సాహిత్యం. 2000. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
13. దక్షిణామూర్తి, పోరంకి. 1988. తెలుగు కథానికి స్వరూప స్వభావములు సిద్ధాంత వ్యాసము, హైదరాబాద్.
14. నళిని, ఎస్.ఎస్. (2009). సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ. నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్.

15. నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు, 2012, ప్రత్యేక సంచిక – పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్
16. నిబ్బరాజు తాడాల, జానపద గీతాలు–సంకలనం. రోహిణి పబ్లికేషన్స్, విజయవాడ
17. ప్రేమలత, రావి. 2011– తెలుగు జానపద సాహిత్యం పురాగాథలు, ప్రథమ ముద్రణ. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
18. భక్తవత్సల రెడ్డి ఎన్. 2012. తెలుగు జానపద విజ్ఞానం. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయము, హైదరాబాద్.
19. మోహన్, జి.ఎస్. 2010. జానపద విజ్ఞానాధ్యయనం. ద్రావిడ విశ్వవిద్యాలయం.
20. రాధాకృష్ణ, మిక్కిలినేని. 2011. తెలుగువారి జానపద కళారూపాలు. ప్రొ.శ్రీ.తె. విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
21. రామరాజు,బి. 1958. తెలుగు జానపద గేయ సాహిత్యం – జానపద విజ్ఞాన ప్రచురణలు, హైదరాబాద్.
22. లక్ష్మీభూమయ్య, వంగరి. 2008. మన జాతరలు–విధానాలు. హన్మకొండ .
23. వాఙ్మయి–త్రైమాసిక తెలుగు సాహిత్య పత్రిక. 2003 (అక్టోబర్–డిసెంబర్). పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ .
24. వెంకటసుబ్బారావు, తంగిరాల. 2000.తెలుగు వీరగాథా కవిత్వము. మొదటి సంపుటము, శ్రీ దేవరాయ రసజ్ఞ సమాఖ్య, బెంగుళూరు.
25. రాధాకృష్ణ, బూదరాజు. 2009. తెలుగు జాతీయాలు. ప్రగతి పబ్లిషర్స్, హైదరాబాద్.
26. రామరాజు, బిరుదరాజు. 1990.తెలుగు జానపద గేయ సాహిత్యం, జానపద విజ్ఞాన ప్రచురణలు, తృతీయ ముద్రణ హైదరాబాదు.
27. లింగారెడ్డి, గోపు. 1982.తెలంగాణ శ్రామికగేయాలు, పరిశోధన వ్యాసం. సుష్మా పబ్లికేషన్, కరీంనగర్.
28. శ్రీదేవి, వేదాంతం. జానపద నృత్య గీతాలు, సాహిత్యానుశీలనం. శ్రీ పబ్లికేషన్స్.
29. సురవరం,ప్రతాపరెడ్డి. 1984. ఆంధ్రుల సాంఘిక చరిత్ర. ఆంధ్రసారస్వత పరిషత్తు
30. సుబ్బారావు,టి.వి. 1978.కాటమరాజు కథలు. నాగలక్ష్మి ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాదు.
31. లక్ష్మీనారాయణ, సుతారి. బోనాల ప్రదర్శన కళారూపాలు. ప్రసన్న ఆర్ట్ ప్రింటర్స్, ఇసిఐఎల్, హైదరాబాద్.

32. సుందరం, ఆర్వీయస్. 1992. ఆంధ్రుల జానపద విజ్ఞానం. తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
33. సుందరం, ఆర్వీయస్. 1998. జానపద సాహిత్య స్వరూపం, హైదరాబాద్.
34. సుందరం, ఆర్వీయస్. 2017. సుందరజానపదం, సౌశీల్య ప్రచురణలు.
35. సుందరం, ఆర్.వి.ఎస్. 1988. జానపద సాహిత్యం.యువ భారతి సాహితి సాంస్కృతిక సంస్థ, సికింద్రాబాద్.
36. Elwin, Verrier (1949). Myths of Middle India. madras: Oxford University (Indian Branch)
37. Jung (1972). Archetypes of the Collective unconscious. in David lodge (Ed). 20th century criticis, london : Longman group Ltd.
38. Campbell, J. (1956) The Hero with a Thousand faces. New jersey: Princeton univercity press.
39. The world Book of encyclopedia (1960) Vol:21

## తెలుగు పత్రికలు

40. ఆంధ్రజ్యోతి (వారపత్రిక)
41. ఆంధ్రభూమి వారపత్రిక
42. ఆంధ్ర ప్రభ వారపత్రిక
43. జానపదం త్రైమాసిక పత్రిక
44. ఈనాడు దినపత్రిక
45. నమస్తే తెలంగాణ దినపత్రిక
46. ఉదయం దినపత్రిక
47. విశాలాంధ్ర దినపత్రిక
48. మిసిమి మాస పత్రిక
49. భావవీణ మాస పత్రిక

# అనుబంధం-1

## ప్రసిద్ధ ఒగ్గు కళాకారుడు చుక్కా సత్తయ్య గారితో పరిశోధకురాలు ధరంసోత్ సరిత ముఖాముఖీ (ఇంటర్వ్యూ)

## తేది : 13. 06. 2017



**1. మీ పేరు , మీ వృత్తి ,ప్రవృత్తి గురించి చెప్పండి ?**

నా పేరు చౌదరిపల్లి సత్తయ్య, నా నుదుటి మిద రెండు పాదాల లాగా చుక్క ఉండటం మూలాన నన్ను చుక్క సత్తయ్య అని కూడా పిలుస్తారు. నా వృత్తి వ్యయసాయమే కానీ అప్పుడు అప్పుడు ఒగ్గు కథల ప్రదర్శనా ఇస్తూ ఉంటాను అందుకని ఒగ్గు చుక్క సత్తయ్య అని అంటారు.

**2.మీకు ఒగ్గు కథ మీద ఎలా ప్రేరణ కలిగింది మరియు మీ బాల్యం ఎలా కొనసాగింది ?**

మా తండ్రి నుంచి వారసత్వంగా పొందిన ఒగ్గుకథలో చిన్ననాటినుండే ప్రావీణ్యత సంపాదించాను. 13 ఏళ్ల అప్పుడే చిరుతల రామాయణంలోని హనుమంతుడి పాత్రను ధరించాను. నా అంతటా నేను తెలుగు చదవడం, వ్రాయడం నేర్చుకుని కళపై పట్టుతెచ్చుకున్నాను. 16 ఏళ్ల అప్పుడు కాళీమహంకళీ కథ రాస్తున్నప్పుడు నాకు దైవ

అనుగ్రహం లభించింది ఆ అనుగ్రహం అందరికి దొరకదు. ఆ మాత పాలు తాగిపిచ్చింది,రాజా పూజితుడు అయితావు అని చెప్పింది అలాగే ఎల్లమ్మ పాట రాస్తున్నప్పుడు ఎల్లమ్మ మాతా కూడా దర్శనం ఇచ్చింది.

**3.మీ కుటుంబంలో ఎన్ని తరాల నుండి ఒగ్గుకతను ప్రదర్శిస్తున్నారు మరియు ఒగ్గు కథ ప్రస్థానం ఎలా జరిగింది మీ ఇంట్లో ?**

మా తండ్రికి ఇద్దరు కొడుకులం పుట్టినాము. మా తండ్రి ఒగ్గు కథలు చెప్పెటోడు అట , కానీ అయన నా చిన్నతనం లోనే చనిపోయారు.మేము పెద్ద కురుమా వాళ్ళం కాబట్టి ఒగ్గుల్లు(ఒగ్గు పట్టుకున్నోల్లు) గాని బీర్లోల్లు(డోలు పట్టుకున్నోల్లు) గాని దేవుని మా ఇంటి ముంగట పెట్టి కథలు చెప్పెటోల్లు అలా వాళ్ళు చెప్పంగా మేము వినేది. అలా విన్నది పొలం పనులు చేసుకుంటూ, వర్లుకుంటూ సాదన చేసే వాడిని అల ప్రావీణ్యత సంపాదించాను.

**4.ఇప్పటి వరుకు మీరు ఒగ్గు కథల్ని ఎన్నిసార్లు ప్రదర్శించారు,ఎక్కడెక్కడ ప్రదర్శించారు.?**

నా 40 సంవత్సరాల ఒగ్గు కళా జీవితంలో దేశవిదేశాల్లో దాదాపు 12వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చాను.అందులో కొన్ని కథలు పేర్లు చెప్తాను అవి మల్లన్నకథ, బీరప్ప కథ, ఎల్లమ్మకథ, మాందాలు కథ, నల్ల పోషమ్మ కథ,దుర్గమ్మ కథ,సౌడలమ్మ కథ,ఉప్పలమ్మ కథ,మైసమ్మ కథ,కీలుగుర్రం కథ, లక్ష్యాగృహం కథ, పెద్దిరాజు పెద్దమ్మ కథ, ఎర్రగొల్ల అక్కమ్మకథ, కనకతార కథ, కాంభోజరాజు కథ, అల్లిరాణి కథ, గయోపాఖ్యానం, రంభ రంపాలా, అయిదు మల్లెపూల కథ, గౌడ పురాణం, సమ్మక్క కథ, మండోదరి కథ, ఇప్పరాపురిపట్నంకథ, సూర్యచంద్రాదుల కథ, బాలనాగమ్మ కథ, సత్యహరిశ్చంద్ర మహారాజు కథ, సత్యవతి కథ, సిరికొండ మహారాజు కథ,అపురూపవతి కథ,మైనవతి కథ,సారంగధర కథ,అమరశీల మహరాజు కథ,పూరుర్వ చక్రవర్తి కథ,మౌనధరి కథ,బాబాషబాబాషాదుల్ల కథ,శివకొమార కథ,సుగుణవతి కథ,సారంగధరమెటసారంగధర కథ,అట్కరొల్ల కథ,వీరభగవంతి కథ,వానదేవుని కథ,సిరిదేవి కథ, రామాయణం, మయసభ, కంసవధ, భస్మాసుర వధ, భక్త ప్రహ్లాద కథలు.

5. మీరు మొట్టమొదటి సారిగా చెప్పిన ఒగ్గుకథ ఏమి ?

మొదలు నేను మా ఊర్లోనే ఒగ్గు కథ చెప్పాను అప్పుడు ఏమి ఇవ్వకపోయేది. దీపాలు పెట్టి ఒగ్గుకథ చెప్పెటోల్లం అలాగే నేను మొట్టమొదటి సారిగా చెప్పిన ఒగ్గు కథ కీలుగుఱ్ఱం ఒగ్గు కథ.

6. ఒగ్గు కథ ఎప్పుడు మొదలైంది ఎన్ని రకాలు ఉంటాయి ఇందులో ?

శ్రీశైలం మల్లన్న ఎప్పటి నుండి అయితే ఉన్నాడో అప్పటి త్రేతాయుగం నుండి ఒగ్గు ఉన్నది. శ్రీశైలం మల్లన్న చేతులో డమరుకం ఉన్నది కావున అప్పటి నుండి ఇప్పటి వరుకు తరతరాలుగా చెప్పుకుంటా వస్తూనే ఉన్నారు. మా మెదస్సే వేదము, మా పుక్కేటి పురాణం,మా నాలుక గ్రంధం అలా ఇది మా పెద్దల నుంచి దిగి వస్తుంది. అసలు మా ఒగ్గు కథలు ముఖ్యంగా మూడు రకాలే ఉంటాయి అవి 1. బీరప్ప 2. మల్లన్న 3.ఎల్లమ్మ.

7.ఒగ్గు కథను మీరు ఎలా మొదలుపెడతారు ?

ఏ కథని అయిన చెప్పేముందు మొదలు గంగమ్మ ప్రార్ధనా,అలాగే పంచ భూతాల ప్రార్ధనా చేయ్యవలిసిందే,గ్రామా దేవతలా ప్రార్ధనా చేయ్యవలిసిందే. అందుకని తాగేది గంగా,తలకు పోసుకునేది గంగా,కుండలో పోసుకునేది గంగా,త్రోక్కేది గంగా,మొక్కేది గంగా సకలా చాండాల సక్కనీరు గంగా. గంగా లేకుంటే ఈ జగం ఘడి ఆగదు నీరు లేకుంటే ఈ జగం నిమిషం ఉండదు.

8. కుల దేవతలా కథలే కాకుండా ఇంకా ఏమైనా సామజిక కథలు ఉన్నాయా ?

అవును ఉన్నాయి. ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ సమయంలో ఎవ్వరు వాళ్ళకి దొరకలేదు నేను ప్రచారం చేసే సమయంలో నన్ను పట్టుకున్నారు. పట్టుకున్నాక నా ఒగ్గు కథలో ఇందిరా గాంధీ ఇరవై సూత్రాలు కావాలి అని అవి ఏ కళకారులా దగ్గర పొయిన అ సూత్రాలు రాదని చెప్పేసారు అట. అప్పుడు అలా మొదలు పెట్టిన ఇందిరా గాంధీ సూత్రాల మీద ఆరువేల ప్రదర్శనలు చేశాను.ఇదే కాకుండా స్వతంత్ర ఉద్యమా కథ,ఓటర్ల జాగరణ,ప్రకృతి మాతా కథ,పరిసరాలు పరిశుభ్రత, అవీనితి నిర్మూలన,కుటుంబ నియంత్రణ కథలు ఉన్నాయి.

9. ఒగ్గు కథలు చెప్పేటప్పుడు ఏమి ఏమి పరికరాలను ఉపయోగిస్తారు?

డమరుకం,డోలు,తాళాలు,అందెలు,కాళ్ళ గజ్జెలు ఉంటాయి. ఆడవేషం, మగవేషం ఉంటది, తలకట్టు ఉంటది, తల కట్టు విప్పితే మగోడు, శిఖా ముడి ఉంటె ఆడది ఇలా

రెండు వాదాలు ఒక్కడే చెయ్యాలి ఇలా చేస్తేనే కళ కారుడు అంటారు.

**10. ఒగ్గు కథలు భావి తరాలు వాళ్ళు రావాలంటే వాళ్ళు ఏం చెయ్యాలి ?**

మొదలు వారికీ శిక్షణ కావాలి దానికి ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలి. అందుకే ప్రభుత్వాన్ని ప్రతి ఊరు?కి ఒక హాలుని కట్టియ్యాలి అని అడుగుతున్నాను.

**11. ఒగ్గు కథలు నేర్చుకోవటాని ఇప్పటి తరం వాళ్ళు ఆసక్తి చూపిస్తున్నారు అంటారా ?**

ఒగ్గు కథలు అందరు చెప్పుకోవచ్చు, కానీ ఒగ్గు కథలు నేర్చుకోవాలంటే లింగం కట్టుకోవాలి ఆ లింగంను ఒక గురువు గారు కడతాడు. ఆ లింగం కట్టుకున్నోడే ఒగ్గు(డమరుకం) పట్టుకోవాలి,దేవుని లగ్గం చెయ్యాలి వారినే ఒగ్గు పూజారులు అంటారు. అలాగే ఇప్పటి వరకు నాకు నలుగు వేల మంది శిష్యులు వున్నారు.

**12. ఇప్పటి వరుకు మీకు వరించిన పురస్కారాలు మరియు గౌరవలు ?**

- కేంద్ర సంగీత నాటక అకాడమీ (అబ్దుల్ కలాం చేతులమీదుగా 2004)
- డాక్టరేట్ (కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, 2005 ఏప్రిల్ 15)
- ప్రతిభా పురస్కారం (తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్)
- ఒగ్గు కళా సామ్రాట్ (వెంకటేశ్వర క్యాసెట్ సెంటర్)
- జానపద కళామూర్తి (యాత్రి కృష్ణారావు, ఆంధ్ర విశ్వవిద్యాలయం డైరెక్టర్, విశాఖపట్టణం)
- మకుటంలేని మహారాజు (డిస్కో రికార్డంగ్ కంపెనీ, సికింద్రాబాద్)
- రాజీవ్ జీవన సాఫల్య పురస్కారం
- కళాసాగర్ (విశిష్ట పురస్కారం)
- తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ 'ఒగ్గు చుక్క' పేరుతో సత్తయ్యపై డాక్యుమెంటరీని రూపొందించింది.
- తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ పురస్కారాలు –2015 అవార్డు – హైదరాబాద్, తెలంగాణ ప్రభుత్వం, 2015 జూన్ 2

# అనుబంధం-2

## వరంగల్ జిల్లా ఒగ్గు కళాకారుల దృశ్యమాలిక



ఒగ్గుకథలు సేకరణలో భాగంగా మామిడి హరికృష్ణగారితో పరిశోధకురాలు



చెదరిపల్లి అంజయ్య గారితో పరిశోధకురాలు చాదర్ ఘాట్ లో



జనగాంలో బడిగే శ్రీను బృందం ఒగ్గుకథను ప్రదర్శిస్తున్న దృశ్యం



కథ సేకరణలో బాగంగా అంజయ్య గారితో పరిశోధకురాలు కథను రికార్డింగ్ చేస్తు





చుక్క సత్తయ్యగారు తన సొంత బాణిలో వ్రాసి పాడినపాట.



పరిశోధకురాలికి వారి కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో పరిశోధనలో భాగంగా యివ్వడం జరిగింది.



జనగామంలో చౌదరిపల్లీ అంజయ్య బృందం ఒగ్గుకథను ప్రదర్శిస్తున్న దృశ్యం



పరిశోధనలో భాగంగా ఒగ్గుకథను సేకరిస్తున్న పరిశోధకురాలి భర్త



వేదిక మీద ఒగ్గుకథను ప్రదర్శిస్తున్న బృందంతో పరిశోధకురాలు



శిల్పార్‌లో  నర్ర సతీష్ బృందం ఒగ్గుకథను ప్రదర్శిస్తున్న దృశ్యం



చుక్కా సత్తయ్య వేషధారణతో ఒగ్గు కథను ప్రదర్శిస్తున్న చాయచిత్రం





# సాహిత్య వ్యాసాలు



వీరశైవ సాహిత్యం - పాల్కురికి సోమనాథుని కృషి
తెలుగువారి 'ఉగాది' వైశిష్ట్యం
నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్‌తో మూసీ ముచ్చట
ఆధునిక తెలుగుపాట - పర్యావరణ స్పృహ
'ఒగ్గు' జానపద కళారూపం - విశిష్టత
నల్లగొండ 'లక్ష్మీనరసింహ స్వామి' జాతర
తెలుగులో స్త్రీల ఆత్మకథలు
కె.వి.నరేందర్ కథల్లో స్త్రీ సామాజిక చిత్రణ
మూసీ
MUSI
Samputi : 26 • Sanchika : 05 • Pages : 64 • Rs. 20
March 2023
UGC Care List
Approved Journal
శోభకృత్ నామ సంవత్సర
ఉగాది
శుభాకాంక్షలు

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 5 (3)
UGC Care List Approved Journal
హైదరాబాద్ మార్చి : 2023





# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎస్.శాస్త్రి
సంపుటి : 26 సంచిక : 5
మార్చి - 2023
'శుభకృత్' ఫాల్గుణ మాసం
సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA
సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM
Printed and Published by
B. Anantha Laxmi
*Type Setting at :*
Kavyasree Graphics
Ph: 934 797 1177
Printed at : Sri Sai Process
Ph. 27563075
విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)
చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.
వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్‌ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com
INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796
UGC APPROVED JOURNAL

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

వీరశైవ సాహిత్యం - పాల్కురికి సోమనాథుని కృషి ... ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు 7
పద్య మనోహరం - 40 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 12
బాకీ (బందారం కథలు -16) ... డా. నందిని సిధారెడ్డి 13
తెలుగువారి 'ఉగాది' వైశిష్ట్యం ... డా. కాకునూరి సూర్యనారాయణ మూర్తి 17
భారతీయీకరణ10 : ఆంగ్లమూలం : బలరాజ్ మధోక్, తెలుగు : కోవెల సంపత్కుమార21
మునగాల పరగణా కథలు : గాథలు (గ్రంథాంతరంగం-22) ... ఘట్టమరాజు 25
నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్‌తో మూసీ ముచ్చట ... అట్టెం దత్తయ్య 29
ఆధునిక తెలుగుపాట - పర్యావరణ స్పృహ ... వర్ధ వేణు 33
'ఒగ్గు' జానపద కళారూపం - విశిష్టత ... ధరంసోత్ సరిత 39
నల్లగొండ 'లక్ష్మీనరసింహ స్వామి' జాతర ... ప్రవీణ్ కుమార్ బోళ్ళ 41
తెలుగులో స్త్రీల ఆత్మకథలు ... డా. వెంకటరామయ్య గంపా 43
కె.వి. నరేందర్ కథల్లో స్త్రీ సామాజిక చిత్రణ - సాధికారత, సమస్యలు ... తాడూరి రవీందర్49
స్వర్ణకమలం (కె.విశ్వనాథ్ చిత్రాలు-సామాజిక అవలోకనం:30).. టి. లక్ష్మీనారాయణ53

### కవితలు

మకర హృదయం... ఆచార్య అనుమాండ్ల భూమయ్య - 5; గతం చదివితేనే ... కొమురవెల్లి అంజయ్య -6; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ -6; తీగ ... అమ్మంగి వేణుగోపాల్ - 20; రాలుతున్న మొగ్గలు ... బాటసారి - 38; మా చిరునామాలు ... ముత్యంపేట గంగాధర్ - 38; వెతుకుదాం రండి ... అరుణ ధూళిపాళ - 48; మధ్యతరగతి మకరందం ... ఎజ్జు మల్లయ్య - 48; జీవితపాఠం ... కె. నిఖిత - 52; చైత్ర ఉగాది - సంస్కృతి ప్రోది ... సోమయాజులు వి.ఆర్.ఎస్. - 56; బాకీ ... ఎస్.గోపి - 62.

### సమీక్షలు

తెలుగు స్వీయ చరిత్రలో కొత్త ఒరవడి - బాపట్ల వ్యవసాయ కళాశాల చరిత్ర ... డా. మల్లెగోడ గంగాప్రసాద్ 57
తెలంగాణ తొలి ద్విభాషా స్మృతి కావ్యం 'శ్రీవత్సాంకం' ... డా. అమ్మిన శ్రీనివాసరాజు 59
స్వీకృతి ... 61

ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.

*Printed, Published and Owned by* : B. Anantha Laxmi, 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office* : 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor* : Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 5

UGC Care List Approved Journal
హైదరాబాద్ మార్చి : 2023

# 'ఒగ్గు' జానపద కళారూపం – విశిష్టత

**ధరంసోత్ సరిత**, తెలుగు పరిశోధక విద్యార్థిని, హైదరాబాదు విశ్వవిద్యాలయం. ఫోన్ : 6300 428 155

ఒగ్గు అంటే శివుని చేతిలో ఉండే దమరుకం. ఇది అచ్చమైన దేశీయ పదం. ఒగ్గునే జెగ్గు,జగ్గు అని కూడా పిలుస్తారు. వివిధ తెలుగు భాష ప్రాంతాల్లో ఈ కళారూపం ఉన్నప్పటికి తెలంగాణా ప్రాంతంలో ఎక్కువగా కనిపిస్తుంది. మన ప్రాచీన లాక్షణికులు, వైయ్యాకరణులు ధమరుకం నుంచి అక్షరాలు ఉద్భవించాయని చెప్పారు. అలా మొత్తం అక్షరాల పుట్టుకకి కారణమైన ధమరుకాన్ని ఒక కళారూపానికి పేరుగా పెట్టి దానికి పూజార్హతని కల్పించిన కళారూపం ఒగ్గు కథాగానం మాత్రమే.

ఒగ్గుని వాద్యంగా వాడి కథను చెప్తారు. కాబట్టి ఒగ్గు కథ అని పేరు వచ్చింది. ఈ కథలు శైవ మతానికి సంబంధించినవనీ మల్లన్న, బీరప్ప కథలు ప్రారంభంలో చెపుతూ వుండేవారనీ, అదే కాక గొల్ల కురుమ కులంవారే ఈ కథలు చెప్పేవారనీ, బీరప్ప, మల్లన్నలు వీరి కులదేవతలనీ, అందుకనే వీళ్ళను ఒగ్గు గొల్లలు అని కూడా అంటారు (డా. బిట్టు వెంకటేశ్వర్లు, కరీంనగర్ రాష్ట్రీయ జానపద కళోత్సవాలు).

తెలంగాణాలో ఒగ్గుకథ చెప్పే బృందాలు కరీంనగర్, వరంగల్, నల్లగొండ, హైదరాబాదు జిల్లాలో వందకు పైగా ఉన్నా కొన్ని దళాలు మాత్రమే బహుళ ప్రచారంలో ఉన్నాయి. వాటిలో ప్రధాన కథకులు కీ.శే. చుక్క సత్తయ్య (ఒగ్గుకళ సమ్రాట్), నేర రామస్వామి తెలంగాణ లోని కరీంనగర్ జిల్లాలో వేములవాడ ప్రాంతంలో అత్యధిక ఒగ్గుకథ కళా బృందాలు ఉన్నాయి. అందులో ముఖ్యంగా తీగల రాజేశం – నూకలమర్రి (కీ. శే. శ్రీ మిద్దె రాములు గారి ప్రియ శిష్యుడు), మారుపాక శంకర్ (కనగర్తి), గాదర్ల బుగ్గయ్య – అచ్చనపల్లి, బర్మ బీరయ్య, బర్మ తిరుపతి – నిజామాబాద్ బృందాలు పేరుగాంచినవి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం లోని జమ్మ మల్లారి కురుమ తొలి ఒగ్గు కళాకారిణి. ఈమె గత 70 సంవత్సరాలుగా కథ చెప్తూ ఉంది ఉత్తమ మహిళ అవార్డు కూడా అందుకుంది.

ఒగ్గు కళారూపం శైవమత వ్యాప్తిలో ప్రచార మాధ్యమంగా ఉద్భవించి ఉంటుంది. ఎందుకంటే పాల్కురికి సోమనాథుడు తెలంగాణ ప్రాంతంలో పుట్టి, శైవమత వ్యాప్తికి విశేషమైన కృషి చేసారు. అటువంటి గొప్పవ్యక్తి ప్రభావం ఈ ప్రాంతంలో కళలపై ఉందన డానికి నిదర్శనం ఒగ్గు కథ. ఈ కథల ఇతివృత్తాల్లో శివుడు కథానాయకుడిగా ఉంటాడు లేదా శివుని అంశతో జన్మించిన వారు నాయకులుగా ఉంటారు. ఉదాహరణకు శివుని తొలి చెమట నుండి బీరప్ప, మలి చెమట నుంచి మల్లన్న పుట్టారని, ఎల్లమ్మ శివుని కూతురని ఆయా కథల్లో వివరిస్తుంటారు. ఒగ్గుకథల్ని తెలంగాణ ప్రాంతంలోని గొల్ల, కురుమలు తమ కుల పురాణంగా భావిస్తారు.



కురుమలు ఈ కథల్ని ఎక్కువ ప్రచారం చేసారు. తరువాతి కాలంలో ఇతర కులాలవాళ్ళు కూడా ఈ కళారూపాన్ని నేర్చుకొని ప్రచారం చేస్తున్నారు.

ఒక నిర్దిష్ట సంప్రదాయంలో బోధన, అభ్యాసం అనేవి సజీవ సంప్రదాయాలు. అవి సాధారణంగా ఒక గురు పరంపరంలో ఆలోచనలు అభివృద్ధి చేయబడతాయి, ప్రసారం చేయబడతాయి. తరతరాలుగా వ్యాప్తి చేయబడతాయి. అలాగే శైవమత ప్రాప్తికై వచ్చిన ఈ కళారూపం తర్వాత జానపద కళారూపంగా, ఆపై సామాజిక స్పృహ నిచ్చే కళగా ఎదిగింది. ఈ కళాప్రదర్శనకు సమయపాలన అంటూ ప్రత్యేకంగా ఏమీ లేదు కానీ నిశితంగా పరిశీలించినట్లయితే తెల్లవార్లు కొనసాగుతాయి అని గమనించవచ్చు. ఒక్కో ఒగ్గు కథ సుమారుగా ఒక గంట వ్యవధి పైనే ప్రదర్శింపబడుతుంది. రాత్రంతా అనేక ప్రదర్శనలు కొనసాగుతాయి. ఒగ్గు కథను నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు ప్రదర్శిస్తారు. ఒక వ్యక్తి పాడుతూ ఉంటే మిగతా వారు వంత పాడుతూ ఉంటారు.

ఒగ్గు ప్రదర్శన ఎంతో ఆసక్తికరంగా సాగుతుంది. వాళ్ల వాళ్ల సంప్రదాయం ప్రకారం గంగమ్మ పూజతో మొదలుపెట్టి అనేక దేవతలకు సంబంధించిన కథలను వాళ్ల కథకు అనుగుణంగా ప్రదర్శిస్తూ ఉంటారు. అందులో ఎంతో ఆసక్తికరంగా సాగే విషయం కథ ప్రదర్శిస్తున్నప్పుడు స్త్రీపాత్రని ఒక మగవాడే వేషం వేసుకొని ప్రదర్శించడం. అలాగే కథను ప్రదర్శిస్తున్నప్పుడు వాళ్లు ఆ కథను ఊహించుకొని నటిస్తూ ప్రదర్శినస్తూ ఉంటారు గనుక ఎంతో ఆసక్తికరంగా, రసవత్తరంగా కళ్ళను కట్టిపడేసే ప్రదర్శనగా ఉంటుంది.

జానపద కళలకు మారుపేరు అయిన తెలంగాణలో వివిధ ప్రాంతాలలో నివసించే ప్రజలు ముఖ్యంగా, గొల్ల, కురుమలు తమ సంప్రదాయం ప్రకారం గ్రామ పండుగల, సంప్రదాయ పండుగల, వివిధ వేడుకల్లో ఈ ఒగ్గు కథను ప్రదర్శిస్తారు.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 5 (40) హైదరాబాద్ మార్చి : 2023





## ఒగ్గు నృత్యం

ఒగ్గుడోలు నృత్యం బృందనృత్యంగా పరిగణించబడుతుంది. కళాకారులు వీరభద్రుని వలె వేషధారణ చేసుకుంటారు. నృత్యంలో పాల్గొనే కళాకారులు ఇద్దరు జంటగా నృత్యం చేస్తుంటారు. గుండ్రంగా తిరుగుతూ ఒకరికొకరు ఎదురుకోలాటం చేస్తుంటారు. ఈ విధంగా ఒగ్గు డోళ్లను వాయిస్తూ, చుట్టూ తిరుగుతూ కోలాటం వేస్తూ, ముఖ్యంగా మల్లికార్జునపై, బీరప్పపై, ఎల్లమ్మదేవిపై పాటలు పాడుతుంటారు. ఈ పాటలను ఒక ప్రధాన గాయకుడు పాడుతుండగా మిగతా వారంతా వంత పాడుతుంటారు. ముఖ్యంగా నాలుగు కూడళ్ళు కలిసే చోట గాని, ఊరు మధ్యలో ఉన్న విశాలమైన ప్రదేశంలో గానీ ఈ కళను ప్రదర్శిస్తారు. నేటి ఆధునిక కాలంలో స్టేజీలపై కూడా ప్రదర్శిస్తున్నారు. శైవభక్తుల లక్షణాలైన కేకలు, గంతులు మొదలైనవి ఒగ్గులో కనిపిస్తాయి

## నృత్య ప్రదర్శన సందర్భాలు

ఎక్కువగా మల్లన్న, బీరప్ప జాతర్లలో, కురుమలు తమ ఇండ్లలో జరుపుకునే వివాహ సమయాల్లో, మల్లికార్జున పండగ, బీరప్ప పండగ, ఎల్లమ్మ పండగ సమయాల్లో, వివాహమైన కొత్త జంటను ఊరేగింపు సమయంలో, గ్రామ దేవతలను కొలిచే సందర్భంలో, బోనాలు



తీసుకొనిపోయే సందర్భంలో, పుట్టమన్ను తెచ్చి సమయంలో, ఇంకా కురుమ, గొల్లల శుభ, అశుభ సందర్భాల్లో ఈ కళను ప్రదర్శిస్తుంటారు. చివరికి కురుమ గొల్లలు ఎవరైనా చనిపోతే వారి శవయాత్రలో సైతం ప్రదర్శిస్తుంటారు.

కురుమ గొల్లలు తమ కుల సంప్రదాయంలో భాగంగానే కాకుండా తమకు కలిగే ఉత్సాహ సమయాల్లో, ఊర్లోని మిత్రుల వివాహ సమయాల్లో, ఇతర ఊరేగింపు సమయాలలో కూడా ఒగ్గు డోలు నృత్యాన్ని ప్రదర్శిస్తుంటారు. అంతేగాక తమకి ఇష్టమైన రాజకీయ పార్టీల ప్రచారాలలో సైతం ఈ కళను ప్రదర్శిస్తూ ప్రజలను ఆకట్టుకుంటుంటారు. తమ వ్యవసాయపు పంటలు అనుకున్న విధంగా పండినప్పుడు, తమ ఇండ్లలో శుభకార్యలు జరిగినప్పుడు ఒగ్గు డోలు నృత్యాన్ని చేస్తుంటారు. కళాకారులు తమ ఆటవిడుపు సమయంలో, తీరిక సమయంలో, ఆనందంగా, ఉత్సాహంగా ఉన్నప్పుడు కూడా ఒగ్గు డోలు నృత్యం చేస్తుంటారు.

## ముగింపు

ఒగ్గుని ఒక జానపద కళారూపంగా గుర్తించి, దానిపై తగు స్థాయిలో పరిశోధన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తెలంగాణ ప్రాంతంలో వివిధ జిల్లాల్లో ప్రత్యేకంగా కనిపించే ఒగ్గు కథ అనే జానపద కళా సంస్కృతి విశిష్టతను గుర్తించి భావితరాలకు పరిచయం చేయడం, అందజేయడం మన విధి.

## ఉపయుక్త గ్రంథసూచి

1. డా. బిట్టు వెంకటేశ్వర్లుగారు కరీంనగర్ రాష్ట్రీయ జానపద కళోత్సవాలు.

2 తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు వారు 1992 సంవత్సరంలో ముద్రించిన డా. మిక్కిలినేని రాధాకృష్ణ మూర్తి గారు రచించిన 'తెలుగువారి జానపద కళారూపాలు' అనే గ్రంథం.

3. వికీపీడియా.కం

# మిసిమి

2567వ బుద్ధ జయంతి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక, మే, 2023 ₹50/-

ISSN 2454–4329

# మిసిమి

మాసపత్రిక

సంపుటి 34 సంచిక 5

మే - 2023

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : వల్లభనేని అశ్వినీకుమార్

సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం

KALA JYOTHI — Since 1946 —

Printed & Published by
**BAPANNA ALAPATI**
at Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,
**Hyderabad - 500 020.**
Ph: 040 - 27612436, 27645538.

Editor: **Ph: 994 951 6567**
(10.00 am to 5.00 pm)

**చందా వివరాలు:**
₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),
కార్యదర్శి : వి. ఆశారాణి
**040-27645536**

Scan QR to Pay
**Misimi Publication**

LIBRARY OF CONGRESS
LCCN 91-903060

UGC Care

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE
ISSN 2454-4329

misimi90monthly@gmail.com
www.misimimonthly.com
e-magazine : www.kinige.com/misimi
facebook.com/misimimaasapathrika
YouTube : Silver jubilee celebrations of MISIMI Telugu Monthly

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## మే నెల సూచికలు...


అనర్ఘరత్నాలు : ఆచార్య పప్పు వేణుగోపాల్ రావు... 5
బుద్ధుడు చారిత్రక పురుషుడు : డా. దేవరాజు మహారాజు... 6
స్వామి వివేకానంద దృష్టిలో గౌతమ బుద్ధుడు : పురాణపండ రాఘవరావు... 9
మనమే బాధ్యులం : అశ్వినీ కుమార్... 10
మనోధర్మ సంగీతం : అమినేని సిద్ధయ్యనాయుడు... 16
జ్ఞానతంత్రులను మీటే ఆక్స్‌ఫర్డ్ : డా. నిమ్మగడ్డ శేషగిరి రావు... 19
గువ్వల చెన్నా! : కె. దినకర్... 25
రసాయన శాస్త్రవేత్త - కోలాచల సీతారామయ్య : డా. నాగునూరి వేణుగోపాల్... 31
శారదా శ్రీనివాసన్ తో మాటా-మంతీ : మిసిమి... 33
అందమా.. అందవా..? : ఎడిటర్స్ డైరీ... 42
కథాకథన చక్రవర్తి శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి : భమిడిపాటి గౌరీశంకర్... 43
శృంగార నైషధంలో హంస : డా. టి.ఎన్. రసూల్... 45
వెలుదండవారి అక్షరమాల : డా. దత్తయ్య అట్టెం... 49
డాక్టర్ జివాగో నవలా నేపథ్యం : డా. వేలూరి కృష్ణమూర్తి... 52
తెలంగాణ: జానపద కళానిలయం : ధరంసోత్ సరిత... 55
ఇచ్ఛామతి తీరాన : డా. నల్లపనేని విజయలక్ష్మి... 57
జార్జియా ఓ కీఫ్ : టి.వి. ప్రసాద్... 61
తమిళ సాహిత్యసేవ: కె.ఏ. వెంకట రామయ్య : డా. పి.ఎస్. గోపాల కృష్ణ... 63
చిత్రగీతాలు జావళీలు : డా. ఎమ్. పురుషోత్తమాచార్య... 65
ఆత్మ సౌందర్య సాక్షాత్కారం : ఆచార్య వై. పార్థసారధి... 69
కొప్పర్తి కవితా శిల్పం : పోతుల శివాజీ... 73
వడ్డెర చండీదాస్ - హిమజ్వాల : వి. రాజారామ్మోహన్ రావు... 75
వేమన పద్యాల్లో 'అమ్మ..' 'ఆలీ..' : జె. మధుబాబు... 78
చదవండి... : మిసిమి... 80



బుద్ధ


ఆక్స్‌ఫర్డ్

### అట్టమీది బొమ్మలు


గౌతమ బుద్ధ


తండ్రి
ఖైమూర్ చిత్రకళ


తనయుడు
ఖైమూర్ చిత్రకళ


అవలోకితేశ్వరి

# తెలంగాణం జానపద కళానిలయం

– ధరంసోత్ సరిత

తెలుగు సంస్కృతుల్లో తెలంగాణ సంస్కృతి చాలా గొప్పది. కాలగమనంలో ఆంధ్ర సంస్కృతి దీన్ని నష్టపరిచినప్పటికీ, ఇవాల్టి సందర్భంలో తెలంగాణ సంస్కృతి పునరుజ్జీవనం పొందుతోంది. భౌగోళికంగా బాగా సుసంపన్నమైన తెలంగాణకు తూర్పున కందికల్ గుట్టల వరుస, పడమట బాలాఘాట్ పర్వతశ్రేణులు, ఉత్తరాన గోదావరి, దక్షిణాన కృష్ణానదులు ఉన్నాయి. ఇలా ఎన్నో వనరులు ఉన్న ప్రదేశం కావడం వల్ల స్థానికంగా చరిత్ర, నాగరికత, సంస్కృతి ఇక్కడ వికసించినాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మిగతా సంస్కృతులకు ఇంత విస్తృతి లేదు. తెలంగాణా ఘనవారసత్వానికి ప్రతీకలైన కళారూపాలకు, కళాకృతులకు ఆలవాలం వరంగల్ జిల్లా.

తెలంగాణ జానపదకళలు తెలంగాణా సంస్కృతి నిలయాలు. ఈ కళలు మట్టిలో మాణిక్యాలు, కులాశ్రయాలు, వారసత్వ కళానిధులు. జానపదులకు ఇవే వినోద సాధనాలు, విజ్ఞాన ప్రదాతలు. పల్లెపల్లెనా వీధివీధినా ప్రదర్శించబడి, ఇంటింటా సంభావనలు పుచ్చుకున్న ఈ కళలు ఒకనాడు పల్లీయుల ఆదరణలో కళకళలాడినా, నేటి ఆధునిక సామాజిక పరిస్థితుల్లో సంక్షోభంలో పడ్డాయి. వెలవెలపోతున్నాయి. పొట్టకూటి కోసం అలమటిస్తున్నారు. సంస్కృతీ సంప్రదాయాలకు నిలయమైన ఈ ప్రాంతంలో జానపద కళారూపాలు వందకు పైగా ఉన్నాయి. ఇవి ఇక్కడి విశిష్ట సంస్కృతికి అద్దం పడుతున్నాయి. ఒక కులం సంస్కృతీ సంప్రదాయాలను, ఆ కుల పుట్టు పూర్వోత్తరాలను ఈ కళారూపాలు వివరిస్తాయి. ఈ కళారూపాలు ప్రదర్శించే వారిని ఉపకులాలకు చెందిన వారిగా, హక్కుదార్లుగా పిలుస్తూ, వారి కళారూపాలను ఆశ్రిత కళారూపాలుగా పిలుస్తున్నారు.

ఈ కళారూపాల ప్రదర్శన విధానాన్ని బట్టి తొమ్మిది రకాలుగా వర్గీకరించవచ్చు. అందులో బొమ్మలాటలు, అనుష్టాన కళా రూపాలు, వాద్య కళారూపాలు, పటం కథలు, ఇంద్రజాల ప్రదర్శనలు, నృత్యాలు, కథాగాన కళారూపాలు వేషాలతో కూడిన కళారూపాలు, భజన సంప్రదాయ కళా రూపాలు తదితరాలు ఉంటాయి.

బొమ్మలాటలలో తోలుబొమ్మలాట, చెక్క బొమ్మలాట, మందెచ్చు బొమ్మలు, అనుష్టాన కళారూపాల్లో బతుకమ్మ, బోనాలు, దుబ్బుల కొలుపులు, పంబా, ఎల్లమ్మవేషం, వీరముష్ఠి వాద్య కళారూపాల్లో డప్పు, ఒగ్గుడొల్లు, బుడగ, రుంజలు, పటం కళారూపాల్లో పద్మశాలీ వారి మార్కండేయ పురాణం, మాదిగవారికి జాంబపురాణం, మాలవారికి భేతాళపురాణం, చాకలివారికి మడెలుపురాణం, గౌడవారికి గౌడపురాణం, కుమ్మరి వారి బ్రహ్మపురాణం, యాదవుల మల్లన్న కథ, ముదిరాజుల పాండవుల కథలు ప్రసిద్ధాలు. ఇక జానపద నృత్యాల విషయానికి వస్తే బంజారాల సుగాలి నృత్యం, గోండు గుస్సాడి నృత్యం, కోయకొమ్ము నృత్యాలు, ధింసా, రేలా, దండారి లాంటి నృత్యాలు కనబడుతాయి. వీటితో పాటు పండుగలకు సంబంధించిన నృత్యాలు ఆయా సందర్భాల్లో ప్రదర్శిస్తారు.

కథాగాన కళారూపాల్లో రామాయణ, భారత, భాగవత కథలను పురాణాలుగా చెప్పేవారిలో చిందుయక్షగానం, గొందేళి వీధి భాగోతం, దాసరి భాగోతం, వీధి భాగోతాలు వీధి నాటకాలు ఈ కోవలోకి వస్తాయి. ఆ కథలకు సంబంధించి పాత్రలు వేషధారణతో కథలను రక్తి కట్టిస్తారు. వీటిలో హాస్యగాడి పాత్ర అందరిని ఆకర్షిస్తుంది. వేషాలతో కూడిన కళారూపాల్లో పగటి వేష కళాకారులు ముప్పైకి పైగా వేషాలు వేసి ప్రదర్శన ఇస్తారు. ఇందులో అర్థనారీశ్వర, అదేవిధంగా, పులివేషాలు లాంటివి ఉంటాయి. అదేవిధంగా, పులివేషాలు, కాళిక వేషం వంటివి ఇందులోకి వస్తాయి. పగటి వేషకళాకారులు రోజుకొక వేషం వేస్తూ ఊళ్ళో ప్రదర్శన ఇస్తారు. ఇందులో తుపాకి రాముడి వేషం తెలంగాణాలో ప్రత్యేకం.

కొన్ని కళారూపాలు ఆనూచానంగా, తరతరాలుగా ప్రదర్శన కళలుగా ప్రచారంలో ఉన్నాయి. ప్రతి సామాజిక వర్గంలోనూ కొన్ని కుటుంబాలు ఈ కళారూపాల ప్రదర్శనే వృత్తిగా జీవనం సాగిస్తున్నాయి. రెడ్డి తదితర కులాల వారిని యాచించి బతుకు వెళ్ళదీసే వీరముష్టులు, జంగాలు పాడుకునే శారద కథ పాట. గొల్లకురమల గొల్లసుద్దులు, ఒగ్గుకథలు, పిచ్చుక గుంట్లు, జంగాలు అనాదిగా పాడుకుంటున్న తందానా కథ, ఒకనాడు జానపదమై ప్రస్తుతం సంప్రదాయం నృత్యంగా మారుతున్న పేరిణి శివతాండం, అతిప్రాచీనమైన యక్షగానం, భాగవతాలు, వీధినాటకాలు, చిరుతల రామాయణం, చిరుతల భాగవతం వంటివి అనేక వందల సంవత్సరాలుగా జానపద ప్రజామనో రంజన సాధనాలుగా నిలిచాయి.

ఈ కళారూపాలే కాక విప్రవినోదులు, కాటికాపలవారు, సాధనాశూరులు అనేవారు ఇంద్రజాల, మహేంద్రజాల విద్యలు

తెలిసిన కళాకారులుగా తెలంగాణలోనే కనిపిస్తారు. ఇంకా చిందు మాదిగలు వీధినాటకాలను ప్రదర్శిస్తారు. ఒగ్గు గొల్లలు, బవనీలు అనే తెగలవారు ఎల్లమ్మ దేవత కథను ప్రదర్శిస్తారు. జోగువారికి నృత్యమాడడమే వృత్తి. వీటిని ఆశ్రితకులాల కళారూపాలు అని చెప్పవచ్చు. ఆశ్రితేతర కళారూపాల కళాకారులు కేవలం ఒక కులానికిమాత్రమే పరిమితం కాకుండా అన్ని కులాలను ఆశ్రయించి ప్రదర్శనలిస్తూ జీవిస్తాయి. ఇందుకు ఉదాహరణగా చెక్కబొమ్మలాట, తోలు బొమ్మలాట, కాటిపాపలు, చిరతల రామాయణం, పగటి వేషాలు మొదలైనవి. ఆశ్రిత జానపద కళారూపాలను ప్రదర్శించే కళాకారులు ఒక నియమిత కులానికి చెంది సంప్రదాయమైన కట్టడి కలిగి ఉంటారు. వీరికే భిక్షుక గాయకులు, వృత్తి గాయకులు, అర్థి బిడ్డలు, ఆశ్రిత గాయకులు, హక్కుదార్లు, ఉపకులాలు, కులం బిడ్డలు ఇట్లా రకరకాల పేర్లున్నాయి. వీరు ఏ కులాన్ని అయితే ఆశ్రయిస్తారో ఆ కులాన్ని పోషక కులమని, ధాతృ కులమని, ప్రధాన కులమని వ్యవహరిస్తారు.

ముదిరాజ్‌లను ఆశ్రయించే కాకి పడిగెలవారు, నాయీ బ్రాహ్మణులను ఆశ్రయించే అద్దపువారు, మాలలను ఆశ్రయించే గుర్రపువారు, గౌడ కులాన్ని ఆశ్రయించే గౌడజెట్టీ, ఏనూటి వారు, రజకులను ఆశ్రయించే మాసయ్యల వారు, పద్మశాలి కులాన్ని ఆశ్రయించే సాధనాశూరులు వంటి ఆశ్రితకులాలు పోషక కులాల ఉత్పత్తి, వికాసాలను, చరిత్రను వర్ణిస్తూ కథాగానాలు చేస్తున్నాయి. ప్రదర్శనలో ఆయా ఆశ్రిత కళారూపాలు మౌఖికంగా వారికి సంక్రమించిన సాహిత్యాన్నే ఆసరాగా చేసుకొని ఆ సంప్రదాయాన్నే కొనసాగిస్తూ నేటికీ వస్తున్నారు.

జానపదులకు ఆశ్రిత జానపద కళారూపాలున్నట్టుగానే, గిరిజన తెగలకు కూడా ఆశ్రిత కళారూపాలు పట్టెడ, డోలి, తోటి, పర్‌ధాన్, కొర్రాజులు, పూజారి, భాట్, ఢాడి వంటి కళారూపాలు విభిన్నమైన ప్రక్రియలతో ప్రధాన తెగలను ఆశ్రయిస్తూ జీవిస్తున్నాయి. ఈ కళారూపాలు కూడా ప్రధానతెగకు కట్టడి కలిగి ఉన్నాయి.

జానపద కళారూపాల ప్రదర్శనలో సామెతలు, పొడుపు కథలు సందర్భోచితంగా ప్రయోగిస్తూ తాము చెప్పే కథాంశాన్ని ప్రేక్షకునికి నిరాసక్తి లేకుండా, హాస్యాన్ని జోడించి అందిస్తారు. కళాకారులు తమ ప్రదర్శనతో విభిన్న సంస్కృతులను భిన్న సమూహాలను ఏకం చేయడానికి వీరి సాహిత్యమే దోహదం చేస్తున్నది. అంతేగాక తెలంగాణా యాసకు చెందిన అనేక పదాల భాండాగారం ఆశ్రిత జానపద కళారూపాల సాహిత్యమే.

నాటకాలు లేదా యక్షగాన రూపంలో ప్రదర్శించే ఆశ్రిత కళారూపాలు భాగవతం, రామాయణ, భారతకథలను ఆయా పోషక కులాల దగ్గర ప్రదర్శిస్తూ అందులోని నీతిని నియమాల్ని, రాజనీతిని, భక్తిని, విశ్వాసాలను తమ తమ నైపుణ్యంతో ప్రేక్షకులకు అందిస్తూ, ఇతిహాసాల గొప్పతనాన్ని ప్రసరింపజేస్తూ మనుగడ సాగిస్తున్నాయి. వీరి సాహిత్యంతో సమాజంలో మానవీయ విలువల్ని పెంచే దిశగా తరతరాలుగా కృషి చేస్తున్నారు.

జానపద కళారూపాల్లో కొన్ని తమ ప్రదర్శనలో ప్రేక్షకులకు అర్థంకాకుండా ఉండేందుకు, ప్రదర్శనలో ఏదైనా తప్పు దొర్లినా, సమయానికి తోటి కళాకారున్ని అప్రమత్తం చేయడానికి కళాకారులు మరుగు భాష మాట్లాడుకుంటారు. వీరు ఉపయోగించే భాషాపదాల్లో చిత్రవిచిత్రమైన పదాలతో పాటు, కొన్ని సంస్కృత పదాలే ఉన్నప్పటికి వీరు ఉచ్చరించేటప్పుడు ఆ పదాల మూలాన్ని కాకుండా ఒక కొత్త రూపంలో పలుకుతారు. ఇది ఎవరికి అర్థం కాకుండానే ఉంటుంది.

తెలంగాణా సంస్కృతికే మకుటంగా నిలిచే జానపద ఆశ్రిత కళారూపాల సాహిత్యం ఎంతో ప్రాచీనమైనదిగా తెలుస్తున్నది. అంతేగాక విభిన్నమైన ప్రక్రియలతో, భిన్నమైన కథావస్తువుతో పోషక కులాలను ఆశ్రయిస్తూ మనుగడ సాగిస్తున్న కళారూపాలు వరంగల్ ప్రాంతంలోనే ఎక్కువగా ఉండటం ఈ ప్రాంత సంస్కృతీ ప్రాచీనత గొప్పతనమే. వీటి సాహిత్యంలో ఒక సమాజం లేదా ఒక కులం మనుగడకు కావల్సిన, ఆత్మస్థైర్యాన్ని, ఆత్మనూన్యతా భావాన్ని తొలగించేందుకు కావల్సిన పలు అంశాలు ఉన్నవి. అంతేగాక కులాల ఐక్యతకు దోహదం చేసేదిగా ఉంది. అలాగే వృత్తులకు కులాలకు గౌరవాన్ని కలిగించే విధంగా వీరి సాహిత్యం నిర్మింపబడింది. ఇటువంటి సాహిత్య విలువలు కలిగిన వీరి సాహిత్యాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత ఎంతైన ఉన్నది. భవిష్యత్తు తరాలకు వీరి గొప్పదనాన్ని, వీరి సాహిత్యాన్ని భద్రపరచాల్సిన అవసరం ఉన్నది. ఇప్పటికే కొన్ని ఆశ్రిత కళారూపాలు కనుమరుగయ్యాయి. కొన్ని కనుమరుగయ్యే స్థితిలో ఉన్నవి.

నేటి ఆధునిక నాగరికత వ్యామోహంలో, ప్రపంచీకరణ నేపథ్యంలో, ప్రసార మాధ్యమాల ధాటిలో జానపద కళల తీవి కొడిగట్టింది. ఫలితంగా ఈ జానపదకళలు గాలికి కొట్టుకు పోతున్నాయి. సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఈ జానపద కళల సంరక్షణ సంస్కృతి పరిరక్షణలో విస్మరించ రాని ఒక భాగం. ఈ బాధ్యతను విస్మరిస్తే ఒకనాటి సంస్కృతి ఆనవాళ్లు కాలగర్భంలో కలిసిపోతాయి. మనం వెనక్కితిరిగి చూసుకుంటే మనదైన సాంస్కృతిక వారసత్వంలో ఒక వెలితి కనిపిస్తుంది. ఈ కళల పరిరక్షణ ప్రజల, సమాజపు, ప్రభుత్వాల బాధ్యత.

---

ధరంసోత్ సరిత, హైదరాబాద్. ఫోన్: 630 042 8155.

# జాతీయ సదస్సులో సమర్పించిన పత్రాలు



# UNIVERSITY OF HYDERABAD
# DEPARTMENT OF TELUGU

## CERTIFICATE OF APPRECIATION

This is to Certify that **Dharamsoth Saritha,Research Scholar,Dept of Telugu** of **University of Hyderabad** has presented a paper entitled **"Warangal Zilla Janapada Kalalu-Pariseelana"**in the National Webinar on " ***JANAPADA SAHITYA ADHYAYANAM – NADU NEDU'*** Organized by the Department of Telugu, University of Hyderabad, Telangana on 24th & 25 th February 2022

Prof Darla Venkateswararao
Seminar Director

**HCU NW C 0028**

Dr Dasari Vijayakumari
Seminar Coordinator

AS PER THE UNIVERSITY POLICY, ANTI-PLAGIARISM SCREENING IS NOT REQUIRED FOR THE REGIONAL LANGUAGES

Librarian
Indira Gandhi Memorial Library
UNIVERSITY OF HYDERABAD
Central University P.O.
HYDERABAD-500 046.